# జర్నలిజం - జర్నలిస్టులు

## (పరిశోధనాత్మక కథనాలు)



కలం యోధులు లిఖించే అక్షరాలు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయుధాలు



రెండు తెలుగు రాష్ట్రాలలో భారతదేశ ఉప-రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు చేతులమీదుగా "పద్మశ్రీ" డా॥ ఐ.వి. సుబ్బారావు రైతునేస్తం పురస్కారం" అందుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం (03-10-2017).



దక్షిణ భారత హిందీ ప్రచారసభ మాద్రాసు మాజీ కౌన్సిల్‌మెంబర్ ఎస్.సి.ఎం. సుభాని ఆధ్వర్యంలో సి.బి.ఐ. మాజీ జెడి.వి.వి. లక్ష్మీనారాయణతో సత్కారం అందుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం (2023లో).



జర్నలిజంలో "సామాజిక అంశాల కథనాల" విభాగంలో అంతర్జాతీయ సంస్థ "సలేషియన్స్ ఆఫ్ డాన్‌బోస్కో" వారి "డాన్‌బోస్కో సేవా అవార్డ్" అందుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం (22-05-2022)

# జర్నలిజం – జర్నలిస్టులు

## (పరిశోధనాత్మక కథనాలు)




రచయిత

**ఈపూరి రాజారత్నం**

సహ రచయిత

**డా॥ ఈపూరి శేషగిరి**




by

EPURI RAJA RATNAM

M.A., (Ph.D.) in Journalism

Cover Page Design & Edited by : MALLAVARAPU VENKAT
M.A., B.F.A.

© SRI EPURI RAJA RATNAM

Year of Publication : 2023

by ***EPURIS TV18 PUBLICATIONS***

No of Copies : 200

Price : Rs. 325/-

Publishers:

***EPURIS TV18 PUBLICATIONS***

Dr. Epuri Seshagiri
M.A., M.A., M.A., B.Ed., M.Phil., Ph.D.

Dr. No : 3-580, Ratna Bhavan, Makkevaripet,

Nowluru, Mangalagiri (Md), Amaravathi, Guntur (Dt),

Pin - 522 503, Andhra Pradesh, India.

Email : epuriseshagiri42@gmail.com

Copies, available at :

***EPURIS TV18 PUBLICATIONS***

Printing & Binding : **SRI SAI GANESH PRINTERS, Gnt**

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

# ఈ పుస్తకంలో ఏముంది, చదవాల్సిన అవసరం ఏమిటి...?

జర్నలిజం-జర్నలిస్టులు అనే ఈ పుస్తకంలో రాయబడిన పరిశోధనాత్మక కధనాలు కేవలం జర్నలిస్టుల కోసం రాయబడినదిగా భావించవద్దు. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి జర్నలిజం – జర్నలిస్టులను నాల్గవ స్ధంభంగా ఓ గౌరవ స్థానం కల్పించాయి మన ప్రభుత్వాలు. అయితే చెప్పుకోవడానికి సిగ్గుపడాల్సిన అంశంగా ఈ రోజు మీడియారంగం అతిపెద్ద అవినీతి కూపంలా మారిందనే విషయం అందరికి తెలిసిందే. విలువలతో పనిచేసే జర్నలిస్టుల సంక్షేమం విషయంలో మన ప్రభుత్వాలు, మీడియా సంస్థలు జర్నలిస్టులపై చూపిస్తున్న సవితి తల్లి ప్రేమ మీడియా సంస్థల ద్వందనీతి మరియు మన జర్నలిస్టుల సామాజిక స్పృహ, భాద్యత, భద్రతపట్ల అంకితభావం, జర్నలిస్టులు తమవిధుల్లో ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, ప్రాణాలను తెగించి మనకు సమాచారం అందిస్తున్న తీరు అన్నీ మీతో మాట్లాడతాయి. కొద్దిగా మనసు పెడితే అన్నీ కంటి ముందు కదిలే చిత్రాలుగా కూడా కనిపిస్తాయి. అలా నీతికి–నిజాయితీకి ఒకప్పుడు నిఖార్సయిన జర్నలిజం ఇప్పుడు దొంగలకు, దోపిడీ దారులకు, అవినీతి సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్న ప్రతివాడికి షెల్టర్‌జోన్‌గా మారిన తీరు ఎలా ఉంది అంటే.... చెప్పుకోలేని స్థాయికి వెళ్ళింది. అందరిని అనలేము గానీ అమ్మతో వ్యభిచారం చేయించే నీచ–నికృష్టమైన శక్తులు కొన్ని జర్నలిజంలోకి వచ్చి చేరాయి. వాటిని ఎండగడుతూ ఈ పుస్తకంలోని 20 పరిశోధనాత్మక కధనాలలో కొన్ని కధనాలు, అక్షరాలై తుపాకీ తూటాల్లా పేలాయి. అలాగే చివరిగా జీవితం ఉన్నంత వరకు జర్నలిజంని నమ్మి, పడిలేచిన కెరటాలుగా, అక్షర సైనికులుగా అంకితభావంతో పనిచేసి తమకంటూ ఏమీ మిగుల్చుకోని జర్నలిస్టుల 'కట్టె' మిగిల్చిన కన్నీటి గాధలు, ఆ నిజ జీవిత భాధలు చదువు తుంటే కంటి నుండి జారిపడే కన్నీటి చుక్కల్లోని బరువైన బాధలు కొద్దిగా మనసు పెడితే మీ ముందు కంటనీరై అక్షర రూపంలో అంతులేని ఆవేదనతో మౌనంగా రోదిస్తాయి.

ఈ జర్నలిజం అనే చట్రంలో చిక్కుకుని ఒక గమ్యం– గమనం లేని ప్రయాణం చేస్తున్న ప్రతి జర్నలిస్ట్ తప్ప నిసరిగా చదవాల్సిన పుస్తకం. మొత్తంగా ఇక్కడ ప్రస్తుతం విలువలు కోల్పోయిన జర్నలిజం – జర్నలిస్టులు గురించి తన విలువలు కాపాడమని ప్రతి కథనంలో అక్షరాలు ఎరుపెక్కి కణకణ మని రగిలే నిప్పుకణాల్లా కనిపిస్తాయి. జర్నలిజం అంటే దోచుకోవడం కాదు సమాజం పట్ల భాద్యతవహించడం అనే కొందరు జర్నలిస్టుల మానవతా సేవలు తెలియజేసే అక్షరాలు జర్నలిస్టుల గౌరవాన్ని పెంచే కథనాలుగా మీ చేతిలో ఉన్నాయి. అలాగే ప్రస్తుత పరిస్థితుల్లో కొందరి జర్నలిజం–జర్నలిస్టుల తీరు చూసి అక్షరాలు సిగ్గుపడ్డాయి, తీవ్ర ఆవేదనకు గురయ్యాయి. జర్నలిజం –జర్నలిస్టులు ఎందుకు ఇలా మారడం జరిగిందని అక్షరాలు "దరువు" వేసి, డప్పుకొట్టి మరీ తిరుగుబాటు చేశాయి. అంకిత భావంతో పనిచేసి జర్నలిజంలో జర్నలిస్టులు కుటుంబాలను, జీవితాలను సర్వం త్యాగం చేసి దిక్కులేని జీవితాలుగా మారిన వేళ "జర్నలిస్టుల 'కట్టె' మిగిల్చిన కన్నీటి గాధలు" ఆలకించేది ఎవరని మండుతున్న మన జర్నలిస్టుల హృదయాల బాధలను తెలియజేస్తాయి. అలా అని ఎవరి జాలి–దయను కోరుకోవు అనేది తెలియజేస్తూ విలువలు కలిగిన జర్నలిజం–జర్నలిస్టులను కాపాడుకోవడానికి ఈ పుస్తకం ప్రజాక్షేత్రంలోకి తీసుకురావడం జరిగింది.

**ఈపూరి రాజారత్నం**
**M.A., (Ph.D) Journalism**
సీనియర్ జర్నలిస్ట్
9390062078

# ఈ పుస్తక రచనకు ప్రేరణ

ఈ పుస్తక రచయితగా ఒకనాటి కవి, రచయిత, 2వ ప్రపంచ యుద్ధ యోధుడు, నాటి బ్రిటీష్ ఇండియన్ ఆర్మీమేజర్ కీ.శే. ఈ.యల్. రాజారత్నం గారైన మా తాత చేసిన రచయినలు నా చిన్నతనంలో నన్ను బాగా ఆకట్టుకునేవి. మా తాతగారు రెండు ఆయుధాలు చేతబట్టి సమాజరక్షణకు పాటుబడ్డారు. కలం వీరుడుగా 1950 అనంతరం నేటి కరువు పాట, ఆంధ్ర ఓటరుల పాట వంటి విప్లవ గీతాలను రచించారు. సమాజాన్ని చైతన్యపరిచారు. అలాగే బ్రిటీషు ఇండియన్ ఆర్మీలో రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో గన్ చేతబట్టి ఆర్మి మేజర్‌గా దేశరక్షణకు యుద్ధభూమిలో తన క్రింద సైన్యంతో మేజర్ హోదాలు కదం తొక్కి పలు మెడల్స్ సాధించారు. మా తాతగారిని ఆదర్శంగా తీసుకుని నేను జర్నలిజం వైపు అడుగులు వేయటం జరిగింది. అలా జర్నలిజంలో విలువలతో పనిచేసిన వారిని చూసిన దానికంటే జర్నలిజం విలువలు పూర్తిగా పడిపోతున్నాయి అనేది నేను ఓ జర్నలిస్టుగా బాగా అర్థం చేసుకోవడానికి నాకు నా 20 ఏళ్ళ జర్నలిజం కెరీర్‌లో ఎన్నో పరిశీలించాను, పరిశోధించాను. నాకు తెలిసినంత వరకు నేనైతే ఒక జర్నలిస్ట్‌గా చాలా కోల్పోయాను. చివరికి ప్రాణాలతో పోరాడాను. జర్నలిజం చేయాలనే పట్టుదల, ఆశయంతో 20 ఏళ్ళు క్రిందిస్థాయి జర్నలిస్టుగా పనిచేసి వెనుదిరిగి చూసుకుంటే నాకు మిగిలింది ఏమీలేదు. అందుకే నాకు ఉన్న అనుభవాలతో నా గురించి కాకుండా మొత్తం జర్నలిజం–జర్నలిస్టులుపై రాసిన ఈ పుస్తకం ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్ళాలి అనే పట్టుదల నాచే ఈ పుస్తక రచనకు ప్రేరణ అని తెలియజేస్తున్నాను.

**ఈపూరి రాజారత్నం**

**M.A., (Ph.D.) Journalism**

# PRESS CLUB MANGALAGIRI
## IBN BHAVAN
(Regd. No: 50/2020)

| President | General Secretary | Treasurer |
|---|---|---|
| I.Venkateswara Reddy | B.Dayakar Babu | N.Nagaraju |
| Cell: 9550836519 | Cell: 9299100717 | Cell: 9032258913 |



ది. 08-11-2023

ఈ రోజున జర్నలిజం- జర్నలిస్టులు అంటే సమాజంలో చాలా వరకు వాటి విలువలు కాలరాయబడుచున్నవి అనే భావనలో ప్రజలు ఉన్నారనేది కాదనలేని మాట. అయితే ఈ పవిత్రమైన రంగం ఎందుకు అప్రతిష్ట పాలవుతుంది, జర్నలిజం విలువలు ఎందుకు కాలరాయబడినవి అనే విషయాలు సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం ఈ "జర్నలిజం-జర్నలిస్టులు"అనే ప్రత్యేకపుస్తకంలో తన పరిశోధనాత్మక కథనాల ద్వారా బాగా వివరించారు. ఈ పుస్తకం ప్రతి ఒక్కరు చదవాల్సిన అవసరం ఉంది. మరి ముఖ్యంగా జర్నలిజంలోకి ప్రవేశించాలి అనుకునేవారు, జర్నలిజం-జర్నలిస్టులపై సదాభిప్రాయం లేనివారు, ఇప్పటికే జర్నలిజంలో కొనసాగుతూ పలురకాల ఇబ్బందులు పడేవారు ప్రతి ఒక్కరు ఈ పుస్తకం చదివి తమ ఇంట భద్రపరుచుకోవాలి.

మా ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులైన సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నంతో కలసి మేము జర్నలిస్టులుగా పనిచేసాం. రాజారత్నం అనే ఒక స్ట్రింగర్ స్థాయి వ్యక్తి జర్నలిజం-జర్నలిస్టులలో సింపుల్ గా చెప్పాలి అంటే పడిలేచిన కెరటం. అయినా అలుపెరుగని కెరటాలుగా ఒకప్పుడు జర్నలిజంలో తన ప్రత్యేకతను తాను చాటుకుని భారతదేశ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతులమీదుగా రెండుసార్లు అవార్డులు, మరికొన్ని అవార్డులు, ప్రత్యేక సన్మానాలు అందుకున్న వ్యక్తిగా చూసాం. ప్రస్తుతం ఈ సీనియర్ జర్నలిస్టుని మరోకోణంలో ఈ పుస్తక రచన ద్వారా చూస్తున్నాం. విలువలు కలిగిన జర్నలిజం-జర్నలిస్టుల కోసం ఈ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ చేస్తున్న ప్రయత్నం తప్పక అందరూ అభినందించదగిన విషయం.

జర్నలిజం-జర్నలిస్టుల విషయంలో ఈ పుస్తకం చాలా ప్రత్యేకమైనది. జర్నలిస్టులుగా పనిచేసిన/చేస్తున్న ప్రతి వారికి ఇందులో రాయబడిన అంశాలు ఎవరిని వారినే ఇది నా గురించే రాయబడిన అంశంగా ప్రతి జర్నలిస్ట్ మనసును తాకుతుంది. మొత్తానికి ఇంతటి ప్రత్యేకమైన ఈ పుస్తకం మా ఐబీఎన్ ప్రెస్ క్లబ్ సభ్యులైన రాజారత్నం ప్రజాక్షేత్రంలోకి తీసుకురావడం మా ప్రెస్ క్లబ్ బాధ్యతగా భావిస్తున్నాం. జర్నలిజం-జర్నలిస్టుల విలువలు రక్షణకు రాజారత్నం మొదలు బెట్టిన ఈ అక్షర సమరం తప్పక లక్ష్యం దిశగా విజయం సాధించాలని కోరుకుంటున్నాం.

ఇట్లు

ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్

అధ్యక్షులు
ఐ.వెంకటేశ్వర రెడ్డి,

PRESS CLUB MANGALAGIRI Regd. No. 50/2020

ప్రధాన కార్యదర్శి
బి.దయాకర్

# ముందు మాట

ప్రపంచానికి ప్రతి సరికొత్త విషయాన్ని పరిచయం చేసి మూడో నేత్రంలా పనిచేసే విలేకరి జీవితం మాత్రం నిరంతర నిర్వేదంలా మారిపోతుంది. వార్తల వెంట పరుగెడుతూ కొత్త విషయాన్ని ప్రజలకు అందిచాలన్న తాపత్రయం తప్ప వేరే జీవితం లేదన్నట్టు బ్రతికే వేలాది విలేకరులకు వ్యక్తిగత జీవితంలో అసంతృప్తి తప్ప వారి జీవితంలో ఎలాంటి ఎదుగుదల ఉండడం లేదు. గతంలో వృత్తిలో స్వేచ్ఛ ఉండేది. దానితో ఏదో సాధించాం అన్న తృప్తి ఉండేది. అలా సమాజంలో జర్నలిస్ట్ అనే వ్యక్తికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేవి. వ్యక్తిగత జీవితంలో కనీసం సాధారణ అవసరాలు అయినా తీరేవి. కానీ నేటి పరిస్థితి దానికి పూర్తిగా భిన్నం అనేది బహిరంగ విమర్శే దీనిని ఎవరు కాదనలేరు. ఏవి ఆనాటి హిమ శిఖరాలు అన్నట్టు ఎటుచూసినా  ఇప్పుడు నిరాశే కదా...!?

ఎన్నో ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపి, ఎందరికో వెలుగులు పంచిన జర్నలిస్టుల జీవితాల్లో నేడు నిరాశ మేఘాలు ముసిరాయి అనేది కూడా అక్షర సత్యం. మారుతున్న పత్రిక యాజమాన్యాల వైఖరి, సరికొత్త బిజినెస్ మోడల్స్, శరవేగంగా విస్తరిస్తున్న సోషల్ మీడియా జర్నలిస్టుల జీతాలకు- జీవితాలకు కొరత పెడుతున్నాయి. అనారోగ్యకరమైన కాంపిటీషన్ వల్ల పత్రికల్లో పెడదోరణులు పెరుగుతుంటే ప్రజల్లో జర్నలిజం-జర్నలిస్టులు చాలా పలుచన అవడం విలువలు మరిచిన జర్నలిజాన్ని తెలియజేస్తుంది. ఒకప్పుడు జర్నలిజం-జర్నలిస్టులు అనేది గౌరవప్రదమైన స్థాయి నుండి ఇప్పుడు విలువలు దిగజారిపోయి ఈ వృత్తి నవ్వులాటగా మారింది. ఒకప్పుడు పత్రికకు, పత్రికలో పనిచేసే వారికి సమాజంలో మంచి మర్యాద ఉండేది. కానీ నేడు విలేకరి అంటేనే ఈ సమాజం చాలా అవమానకరంగా చూస్తుంది. తమకు భజన చేస్తే మన వాడు, చేయకపోతే పరాయి వాడు. ఇలా ఉంది ఇప్పుడు మీడియా పరిస్థితి.

జాతీయ, అంతర్జాతీయ, స్థానిక పత్రిక ఏదైనా సరే ఇదే పరిస్థితి ఉంది. కారణం ఏదైనా సగటు పాత్రికేయుని ఆవేదన అరణ్యరోధనగా మారింది. ఈ పరిస్థితి మారేదెలా...? ప్రస్తుతం కొన్ని మీడియా యాజమాన్యాలు జర్నలిజాన్ని డబ్బు సంపాదనే మార్గంగా

ఎంచుకున్నాయి. ఇలాకాకుండా జర్నలిజాన్ని సేవాభావంతో నడిపిస్తేనే పరిస్థితి చక్క బడుతుంది. రియల్ ఎస్టేట్ సంస్థలు, బిజినెస్ గ్రూప్లు కలిసి రాజ్యమేలుతున్న ఈతరుణంలో ఇది సాధ్యమేనా...?? అనే అనుమానం మనకు రావచ్చు కానీ ఆశ పడడంలో తప్పులేదు.

దానికి కావలసిందల్లా సంకల్పబలం. ఎక్కడో ఒకటి, ఎవరో ఒకరు నడుంబిగిస్తే మీడియా యాజమాన్యాలకు, విలేకరులకు మంచిరోజులు వస్తాయి. నిర్భయంగా నిజాయితీగా పనిచేసే యాజమాన్యాలను, విలేకరులను ఆదరించాలన్న తపన ప్రభుత్వాల్లో ప్రజల్లో వస్తేనే ఇది సాధ్యం. అప్పటి దాకా ఎదురు చూద్దామా...? మనమే ముందడుగు వేద్దామా...? దీనికోసం జర్నలిస్టులు ఆలోచన చేయాలనే తపనే ఈ జర్నలిజం-జర్నలిస్టులు అనే పుస్తకం. ఆలోచించండి మిత్రులారా నిజాయితీగా వార్తలు రాసిచూపే... పత్రికలు, టీవీలను చదవడం/ చూడడం... మిగిలిన వాటిని పట్టించుకోకపోతే జర్నలిజం-జర్నలిస్టుల పరిస్థితులు చక్కబడుతా యోమో...!! అటువంటి రోజు కోసం మనం ఎదురుచూస్తూ మనవంతుగా జర్నలిజం- జర్నలిస్టులు విలువలు కాపాడుకునే దిశగా మనం కూడా ప్రయత్నం చేద్దాం. సగటు విలేకరికి సరికొత్త ఆశను కల్పిద్దాం.

ఇట్లు
**డా॥ జి. అనిత.** HOD,
డిపార్టుమెంట్ ఆఫ్ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్,
డాన్స్, మ్యూజిక్, ఫెర్ఫార్మింగ్.
ఆర్ట్స్ మరియు డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్.
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు.



# ముందు మాట

ప్రజాస్వామ్యం అనే నాలుగు అక్షరాల పదంలో నాల్గవ స్థంభమైన జర్నలిజం ఎంతో విస్తృతమైనది. విలువైనది కూడా, అలాంటి జర్నలిజం–జర్నలిస్టుల గురించి నాలుగు మాటల్లోనో నాలుగు నిమిషాల్లోనో తేల్చిచెప్పడం సాధ్యం కాని పని. ఇది చాలా లోతైన విషయం. అనేక అంశాలతో ముడిపడి ఉంటాయి.. మిగిలిన మూడు స్థంబాలు ప్రభుత్వంలో భాగమై జీత– భత్యాలు తీసుకుని ప్రజల కోసం పనిచేస్తుంటాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి మరో మూలస్థంభమైన జర్నలిస్టు అనేవాడు తనకోసం తాను జీవించడం కాకుండా ప్రజా హితం కోరి సమాజం కోసం తపించి జీవితాలను త్యాగం చేసేవాడు నిజమైన జర్నలిస్టు.. మారుతున్న కాలానుగుణంగా అన్ని రంగాల్లో మార్పులు వచ్చినట్లు జర్నలిజంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి...మేడిపండు చూడు మేలిమై ఉండు అన్నచందంగా జర్నలిజం అన్నా, జర్నలిస్టు అన్నా వినడానికి వినసొంపుగా ఉన్నా వాస్తవ లోతుల్లోకి వెళితే ఎన్నెన్నో విషయాలు వెలుగు చూస్తాయి.. జర్నలిజంపై ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులు ఎన్నో పుస్తకాలు రాశారు.. అలాగే ఏపీ రాజధానిగా చెప్పబడుతున్న అమరావతిలో ప్రధాన నగరం మంగళగిరికి చెందిన ఈపూరి రాజారత్నంకు జర్నలిజం అంటే ఎనలేని ప్రేమ.. సమాజానికి తనవంతు సేవలందించాలనే సంకల్పంతో పవిత్రమైన జర్నలిజాన్ని వృత్తిగా స్వీకరించి పద్దెనిమిదేళ్ల పాటు అదరక, బెదరక కష్టనష్టాలకు ఓర్చి పనిచేసారు.. జర్నలిజం అంటే బాహ్య ప్రపంచానికి కన్పించేది, విన్పించేది వేరు.., కానీ వాస్తవాలు వేరనేది రాజారత్నం పదునైన కలానికి అంతుచిక్కింది. కాలం కరిగి పోయింది తలుచుకుంటే తిరిగిరాదు.. నియమాలు నిభందనలు చెప్పడానికి చాలా బాగా ఉంటాయి.. కానీ ఆచరణలో సాధ్యం కావు.. అందుకే తనకు ఇష్టమైన జర్నలిజం– జర్నలిస్టులపై పరిశోధనాత్మక కథనాల పేరుతో అంశాల వారిగా రచనలు చేసారు. 20 అధ్యాయాలతో రూపొందించిన ఈ పుస్తకం ప్రస్తుత తరానికి, రాబోవు తరానికి ఉపయోగకరం. ఇది దిక్సూచిలాగా పనిచేస్తుంది. సామాజిక భాధ్యతతో ఉండాల్సిన ఈ రంగం ఎలా దారితప్పుతోంది.., యాజమాన్యాల పాత్ర, ఫీల్డ్

రిపోర్టర్ల కష్టాలు, పనిఒత్తిడి..., కష్టం ఒకరిదైతే పేరు మరొకరు పొందడం..., నిజాయితీగా ఉండే జర్నలిస్టుల కష్టాలు.., తాయిలాల కోసం తాపత్రయం, బెదిరింపులు, టివి రేటింగ్‌ల మాయాజాలం,కరువైన ఉద్యోగ భద్రత, మాఫియా గామారిన మీడియా, షెల్టర్ జోన్‌గా జర్నలిజం, ప్రభుత్వాలకు పట్టని సంక్షేమం, ఆకలి, అనారోగ్య అవస్థలు, కనుమరుగవుతున్న విలువలు ఇలా అనేక అంశాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. గౌరవ ప్రదమైన జర్నలిజంలోకి పెట్టుబడుదారులు పారిశ్రామిక వేత్తలు ప్రవేశించడంతో దానిరూపు మారిపోయింది... 19వ దశాబ్దంలో పత్రికలతో ప్రారంభమైన మీడియా నేడు ఎలక్ట్రానిక్ , ప్రింట్, సోషల్ మీడియా, డిజిటల్ మీడియాలుగా రాణిస్తోంది.. దీంతో అవకాశాలు మెరుగుపడ్డాయి.. అదే క్రమంలో జర్నలిజం ముసుగులో మాఫియాలు రంగ ప్రవేశం చేసాయి.. పవిత్రమైన జర్నలిజాన్ని సామాజిక భాధ్యత కలిగిన జర్నలిస్టులు పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మేధావుల మౌనం దేశానికి ప్రమాదకరం అన్నట్లు, సిరా చుక్క మౌనం వీడాలి. ఇప్పటికే జర్నలిజం విలువలు చాలా వరకు కాలరాయపడ్డాయి. అత్యంత ప్రమాదకరమైన టెర్రరిస్టుల చర్యల వలన ఎక్కడైనా కొంత మేరకే నష్టం ఉంటుంది. జర్నలిజం అనేది దారితప్పితే సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుంది. అందుకే నేనంటాను జర్నలిజం విలువలు కోల్పోతే దాని ప్రభావం సమాజం మొత్తాన్ని నాశనం చేసేంతటి టెర్రరిజంలా విస్తరిస్తుంది. ఆ పదం సార్ధకం కాకూడదని ఆశిస్తున్నాను... తన ఆరోగ్యం బాగాలేకున్నా ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నా. తాను ఇష్టపడి కష్టాలు పడుతున్నా సరే జర్నలిజం–జర్నలిస్టులు పై అధ్యయనం చేసి కథనాలు రాసిన రాజారత్నంకు హృదయపూర్వక అభినందనలు...ఆలస్యం కావచ్చు కానీ మీరు ఆశించిన గౌరవం జర్నలిజంకు దక్కుతుందని వేచిచూద్దాం.

ఇట్లు

మీ **ముక్కంటి**

జర్నలిస్టు

# కృతజ్ఞతలు

జర్నలిజం – జర్నలిస్టులు (పరిశోధనాత్మక కథనాలు) పుస్తక రచయితగా నేను ప్రధానంగా కొందరికి రుణపడి ఉన్నాను. నేను ఎం.ఏ, జర్నలిజం మరియు జర్నలిజంలోనే ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో పరిశోధకుడిగా చేరడం వెనుక నా తోడబుట్టిన తమ్ముడు డాక్టర్ ఈపూరి శేషగిరి ప్రోత్సాహం ఎంతో ఉంది. 2003–2005 విద్యా సంవత్సరంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కొత్తగా జర్నలిజం కోర్సు ప్రవేశ పెట్టడం తెలుసుకున్న నా సోదరుడు నాకు జర్నలిజంపై ఉన్న ఆశక్తి గమనించి అప్లికేషన్ తీసుకొచ్చి ఇవ్వడం జరిగింది. అప్పట్లో నా ఆర్థిక పరిస్థితి బాగోలేక కూలీ పనికి వెళ్ళే క్రమం నుండి నేను పి.జి, ప్రవేశ పరీక్ష రాసి కౌన్సిలింగ్‌లో సీట్ సాధించిన అనంతరం అడ్మిషన్ ఫీజు కూడా చెల్లించి నా తమ్ముడు నన్ను జర్నలిజం విద్యవైపు ప్రోత్సహించడం జరిగింది. ఇక ఈ పుస్తకం ప్రచురణ విషయంలో డిటిపి వర్క్ చేసి నేనున్నాను అని ధైర్యం కల్పించాడు. ఈ పుస్తక ప్రచురణకు వెనుక తమ్ముడు సహకారం చాలా ఉంది. అలాగే మరోవ్యక్తి మిత్రుడు (పొలిటికల్ & సినిమా) సీనియర్ జర్నలిస్ట్ గోలి మాధవరావు ప్రోత్సాహం కూడా ఈ పుస్తకం రాయడం వెనుక చాలా ఉంది. ఇక ఈ పుస్తకం ప్రచురణ కాబడి మీ చేతుల్లో ఉంది అంటే నా తమ్ముడు డాక్టర్ శేషగిరి సహకారం ప్రథమం అని మీకు తెలియజేస్తున్నాను. కావున ఈ పుస్తక రచయితగా వారికి నా నుండి చాలా ప్రత్యేకమైన కృతజ్ఞతలు. అలాగే నాతోపాటు కలసి పనిచేసిన గుంటూరు, విజయవాడ, అమరావతి, తాడికొండ మరియు ప్రత్యేకంగా మంగళగిరి జర్నలిస్టులందరికి పేరు పేరున కృతజ్ఞతలు.

ఇక ఈ పుస్తకం రాయమని ప్రోత్సహించిన వారిలో నేను ఎంతగానో అభిమానించే సీనియర్ జర్నలిస్ట్ కంభాల ముక్కంటిగారు, మంగళగిరికి చెందిన నా తోటి సీనియర్ జర్నలిస్టులు బందెల దయాకర్, నాయుడు నాగరాజు, బత్తుల సాంబశివరావు మరియు తాడికొండ ప్రాంతానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గిడుతూరి జయమోహన్, ఏలూరుకు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ధనియాల ప్రభుదాస్, సోదరుడు వినుకొండ నజరేత్‌బాబు, రావినూతల దేవదాసు వీరందరికి నా కృతజ్ఞతలు. నేను తీవ్ర అనారోగ్యంతో ఉన్న పరిస్థితిల్లో ఈ పుస్తకం రాసిన వేళల్లో నన్ను గాజుబొమ్మలా చూసుకుంటూ ప్రతిక్షణం నన్ను నా భార్య

అనూరాధ, కుమారులు రత్నశేఖర్, రాజశేఖర్, నా తమ్ముడు భార్య అమృతవాణి, పిల్లలు రాజవర్ధన్, రత్నాంజలి అండగా ఉండబట్టే నేను ఈ పుస్తకం మీ ముందుకు తేవడం జరిగింది. అలాగే బాబాయ్ ఈపూరి సుధాకర్, నా సోదరుడు ఈపూరి రత్నాకర్‌బాబు, అక్క మున్నంగి రత్నావళి, చెల్లి చిలువూరి కీర్తన వీరందరి కుటుంబాలకు నా కృతజ్ఞతలు.

జర్నలిజం ఫీల్డ్‌లో నాకు ప్రధాన గురువులుగా గుంటూరుకు చెందిన వెటరన్ జర్నలిస్ట్ షేక్ మహమ్మద్ రఫీ గారు, మంగళగిరికి చెందిన ఇద్దరు సీనియర్ జర్నలిస్ట్‌లలో ఒకరైన బాపనపల్లి శ్రీనివాస్ గారు, మరో మంచి వ్యక్తితో పాటు నాతోటి జర్నలిస్ట్ మిత్రులు రాయపూడి చినబాబు, పెరికల రమేష్, చెక్కా కళ్యాణ్ అలాగే అమరావతి ప్రెస్ క్లబ్ (మంగళగిరి) అధ్యక్షుడు మట్టుకొయ్య కృష్ణ గారు మరియు ఆత్మీయులు హైదరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టులు అన్నావఝుల రవికుమార్ గారు, స్నేహితులు డి. విజయ్, బి.రాము, తిరుపతి జిల్లా గూడూరు మిత్రులు  షేక్ రఫీ, కవర్ పేజీ డిజైన్ చేసిన సోదరుడు మల్లవరపు వెంకట్ M.A., B.F.A., ఇక ఈ పుస్తకంలోని ప్రతి టైటిల్‌కి, క్యాప్షన్‌కి తగిన విధంగా కార్టూన్ చిత్రాలను గీచిన చిత్రకారుడు, సోదరుడు ఆచార్య నాగార్జున యూనివర్సిటి విద్యార్థి గర్నేపూడి కళ్యాణ్ కుమార్ B.F.A., తో పాటు, నేను చదువుకున్న మంగళగిరి డాన్‌బోస్కో పాఠశాల, పాఠశాల వ్యవస్థాపకలు కీ॥శే॥ థామస్ చిన్నప్ప, సలేషియన్ ఫాదర్స్, బ్రదర్స్, సిస్టర్స్, ఉపాధ్యాయులందరికి తీర్చుకోలేని రుణం నాది. ఈ పుస్తకం ప్రచురణలో నాకు సహకరించిన నా సహోదరులు జి. వరప్రసాద్, కోన శ్రీను మరియు శ్రీ సాయిగణేష్ ప్రింటర్స్, ఎ. సాంబశివరావు అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

**ఈపూరి రాజారత్నం**
**M.A., (Ph.D.) Journalism**
సీనియర్ జర్నలిస్ట్
9390062078

RAJARATNAM TRUST HOPE FOR ALL

# విషయ సూచిక

**1. సంచలనాత్మక పత్రికలు - వాటి మనుగడ 1-10**

- ☞ జర్నలిజం ఆరంభదశ
- ☞ తెలుగు పత్రికల కృషిని మరవలేం
- ☞ జర్నలిజంలోచాలా ప్రత్యేక గుర్తింపు పొందిన పత్రికలు వాటిమనుగడ
- ☞ తెహల్కా డాట్ కామ్
- ☞ "నక్కీరన్" తమిళనాట చాలా చిన్న పత్రిక
- ☞ 'ఎన్ కౌంటర్" పత్రిక
- ☞ "విజయ విహారం" దమ్మున్న యువతరం మాస పత్రిక

**2. మాఫియాగా మారిన మీడియా - దోపిడీ వైనం 11-20**

- ☞ ఏకంగా దేవుడు కళ్యాణం పేరిట దోపిడీ
- ☞ యాడ్స్ సేకరణలో చెకోర పక్షుల్లా జర్నలిస్ట్‌లు
- ☞ కొన్ని మీడియా సంస్థల్లో జర్నలిస్ట్‌లుగా పని చేయటానికి పైరవీలు
- ☞ మానసిక ఒత్తిడి, చీదరింపులు, ఛీత్కారాలతో జర్నలిస్ట్‌లు సహవాసం
- ☞ జర్నలిస్టుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలి
- ☞ తెలుగు మీడియా రంగంలో మార్పులు రావాలి
- ☞ పత్రికలు, ఛానల్స్ ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఉండాలి
- ☞ జర్నలిస్ట్‌లకు జీతాలు అందించని కొన్ని మీడియా సంస్థలు
- ☞ జర్నలిస్ట్‌ల ఈ.ఎస్, ఐ, పీ.ఎఫ్‌ల మాటేమిటి...?
- ☞ జర్నలిస్ట్‌లకు చివరికి మిగిలేది...!

**3. జర్నలిస్టుల సంక్షేమం 'ఎండమావులే' - (1) 21-32**

- ☞ ప్రభుత్వం, మీడియా సంస్థలు జర్నలిస్ట్‌లకు అందిస్తున్న, అందించాల్సిన సంక్షేమ పథకాలు వాటి తీరు
- ☞ అక్రిడేషన్స్ విధి,విధానాలు

- ☞ జర్నలిస్టులకు అక్రిడేషన్లు కొలమానం కాదు
- ☞ జర్నలిస్టులను కేటగిరీలుగా విభజన చేయాలి...?
- ☞ గ్రీన్ కలర్ అక్రిడేషన్
- ☞ ఎల్లో కలర్ అక్రిడేషన్
- ☞ వైట్ కలర్ అక్రిడేషన్
- ☞ రెడ్ కలర్ అక్రిడేషన్..
- ☞ జర్నలిస్ట్‌లకు ఇళ్ళ స్థలాలు,ఇంటి నిర్మాణం
- ☞ జర్నలిస్ట్‌ల ఇళ్ళు, ఇంటి స్థలం కోసం అమరావతి హౌసింగ్ సొసైటీ ప్రయత్నం...?
- ☞ జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల కోసం వైసీపీ ప్రభుత్వం
- ☞ జర్నలిస్ట్ హెల్త్ కార్డ్స్ ఉపయోగం
- ☞ జర్నలిస్ట్‌లకు ప్రమాదభీమా సౌకర్యం
- ☞ జర్నలిస్ట్ పిల్లలకు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ

**4. జర్నలిస్టుల సంక్షేమం 'ఎండమావులే' - (2) 33-42**

- ☞ ప్రయాణ సౌకర్యం (బసు పాసులు)
- ☞ పెట్రోల్ అలవెన్స్, ఇతర ఖర్చులు
- ☞ జర్నలిస్ట్‌ల పీ ఎఫ్ చెల్లింపు పై ప్రభుత్వ నిఘా
- ☞ జర్నలిస్ట్ ల అంత్య క్రియలకు మీడియా సంస్థలు ఆర్థిక సాయం చేయాలి
- ☞ జర్నలిస్ట్ వాహన కొనుగోలుకు ఫైనాన్స్ సహకారం ఉండాలి
- ☞ ఫిల్మ్ జర్నలిస్టుల భద్రత కోసం
- ☞ బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజం

**5. అమరావతిలో - జర్నలిస్టులు ఎదుర్కొన్న కవరేజ్ సమస్యలు.- (1) 43-56**

- ☞ కొన్ని ముఖ్యమైన వార్తా సంఘటనలు, జర్నలిస్ట్ లు ఎదుర్కొన్న సమస్యలు
- ☞ మంగళగిరిలో యువగర్జన
- ☞ యువగర్జన విశేషాలు

☞ గుంటూరు మిర్చియార్డు ధగ్ధం

☞ కృష్ణానది వరదలు ఓలేరు ఘటన

☞ ఏపీ సీఎం గా చంద్ర బాబు ప్రమాణస్వీకారం

☞ విజయవాడ నాగ వైష్ణవి కిడ్నాప్, మర్డర్

**6. అమరావతిలో - జర్నలిస్టులు ఎదుర్కొన్న కవరేజ్ సమస్యలు.-(2) 57-72**

☞ రాష్ట్రంలో సైకో సాంబ టెర్రర్

☞ మంగళగిరిలో సైకో సాంబ ఫీవర్ లో ప్రజలు

☞ పెద్ద వడ్లపూడి లో సైకో సాంబ...? అసలు విషయం

☞ ఎట్టకేలకు మంగళగిరి పోలీసులకు చిక్కిన సైకో సాంబ

☞ పోలీసులకు చిక్కిన సైకో సాంబ ఏమయ్యాడు?

☞ గొడవర్రు ఇసుక రీచ్‌లో ఇసుక అక్రమ రవాణా

☞ ఇసుక రీచ్‌లపై మంగళగిరి మీడియా దాడులు

☞ ఎర్రబాలెం కొండపై క్షుద్ర పూజలు, బాలుడు అదృశ్యం

☞ తాడేపల్లి పాత సిమెంట్ ఫ్యాక్టరీలో క్షుద్రపూజలు

**7. అమరావతిలో - జర్నలిస్టులు ఎదుర్కొన్న కవరేజ్ సమస్యలు.-(3) 73-84**

☞ క్రైస్తవ భక్తురాలికి సిలువ

☞ సమైక్యాంధ్ర ఉద్యమం

☞ సమైక్యాంధ్ర ఉద్యమంలో సీనియర్ జర్నలిస్ట్ దీక్ష

☞ మంగళగిరి బై పాస్ లో గ్యాస్ ట్యాంకర్ బోల్తా

☞ ఖాజ టోల్ గేట్ వద్ద సల్ఫర్ గ్యాస్ ట్యాంకర్ బోల్తా

**8. అమరావతిలో - జర్నలిస్టులు ఎదుర్కొన్న కవరేజ్ సమస్యలు.-(4) 85-94**

☞ కులాల రొచ్చులో విద్యార్థులు

☞ రిషితేశ్వరి ఆత్మహత్య

☞ ఇంజనీరింగ్ విద్యార్థినికి లైంగిక వేధింపులు

☞ ఎఫ్.ఐ.ఆర్, కోర్టు కెళ్ళిన కేసు

9. అమరావతిలో - జర్నలిస్టులు ఎదుర్కొన్న కవరేజ్ సమస్యలు.-(5) 95-108
☞ కృష్ణా పుష్కరాలు
☞ కృష్ణా పుష్కరాలలో నలుగురు యువకులు మృతి
☞ వెంకటపాలెం పోలయ్య స్వామి
☞ అమరావతిలో అరటి తోటలు ధగ్ధం
☞ అరటి తోటలు ధగ్ధం చేసిన వ్యక్తుల కోసం గాలింపు
10. అమరావతిలో-జర్నలిస్టులు ఎదుర్కొన్న కవరేజ్ సమస్యలు.-(6) 109-118
☞ మీడియా పై అమరావతి రైతులు దాడి
☞ జగన్ ఓదార్పు యాత్ర
☞ గుంటూరులో వైయస్ జగన్ ఓదార్పు యాత్ర
☞ చంద్రబాబు “వస్తున్నా మీ కోసం”
☞ గుంటూరు జిల్లాలో “చంద్రబాబు వస్తున్నా మీ కోసం” పాదయాత్ర
వస్తున్నా మీ కోసంకి ఎమ్మార్పీఎస్ సెగ
11. అమరావతిలో-జర్నలిస్టులు ఎదుర్కొన్న కవరేజ్ సమస్యలు.-(7) 119-130
☞ వై.యస్.షర్మిల పాదయాత్ర
☞ మాదిగల కురుక్షేత్ర మహాసభ
☞ కరోనా విలయ తాండవం
☞ సంక్షోభంలో ప్రింట్ మీడియా
☞ కరోనా కారణంగా జర్నలిస్ట్‌లకు కష్టకాలం
☞ ఎలక్ట్రానిక్ మీడియా
☞ కరోనా కవరేజీ – జర్నలిస్ట్‌ల ఇబ్బందులు
☞ కరోనాతో మరణించిన జర్నలిస్ట్‌ల ఆర్థిక సాయం మాటేమిటి...?
12. సమాజం పట్ల సామాజిక భాధ్యత భద్రత దిశగా జర్నలిస్టులు - (1) 131-140
☞ జర్నలిజంలో సామాజిక స్పృహ
☞ మత్తులో జోగుతున్న వీధి బాలలు

☞ ఇటుక బట్టీలలో బాల కార్మికులు
☞ మంగళగిరి బైపాస్‌లో నలుగురు వలస కార్మికులు మృతి
☞ ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వ్యక్తి భార్యకు అండగా...
☞ గుంటూరులో 72 మంది జర్నలిస్ట్‌లకు ఇళ్ళ స్థలాల సాధన
☞ పసి బిడ్డల పాల పోషణకు ఓ పేదతల్లి వేడుకోలు
☞ రెండు కిడ్నీలు పాడై 5 ఏళ్లుగా మంచానికి పరిమితమైన మహిళ

**13. సమాజం పట్ల సామాజిక భాధ్యత- భద్రత దిశగా జర్నలిస్టులు - (2) 141-148**

☞ తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు అండగా
☞ కరోనా కాలంలో గుప్పెడు బియ్యం
☞ మీడియా సాయం కోరిన పోలీసులకు విముక్తి
☞ కిడ్నీలు చెడిపోయి- లివర్ పాడైన సచివాలయ ఉద్యోగి
☞ నులకపేట అటవీ ప్రాంతం వాసులకు రక్షణ

**14. సమాజం పట్ల సామాజిక భాధ్యత- భద్రత దిశగా జర్నలిస్టులు - (3) 149-154**

☞ చేయి విరిగిన 8 నెలల చిన్నారికి చేయి ఆపరేషన్
☞ "మన పేట-మన గ్రామం" గ్రామ సమస్యల పరిష్కార వేదిక
☞ ఎర్రబాలెం పారిశ్రామికవాడ అగ్ని ప్రమాదం
☞ ఆఖరి మజిలీల అభివృద్ధి కమీటీ
☞ ఆఖరి మజిలీల కమిటీ నిర్వహణలో చలివేంద్రం
☞ కరోనా వేళ మంగళగిరి ఐ.బి.యన్. ప్రెస్ క్లబ్ సేవలు

**15. సమాజసేవలో మానవతా విలువలు చాటిన ఓ...సీనియర్ జర్నలిస్ట్ 155-164**

☞ ఒక సీనియర్ జర్నలిస్ట్ ప్రాణానికి భరోసా
☞ రోడ్డున పడ్డ కెమెరా మెన్ కుటుంబానికి అండగా
☞ ఓ ఆంగ్ల పత్రిక జర్నలిస్ట్ భార్య అనారోగ్య పరిస్థితి అర్థం చేసుకుని
☞ వెన్ను విరిగిన భర్తను వీపు పై మోస్తున్న మహిళకు అండగా
☞ తల్లిపాల కోసం బిడ్డల ఆక్రందన
☞ గూడు లేని గువ్వలు,ఫ్లాట్ ఫామ్ పై నివాసం

16. టీ.ఆర్.పి రేటింగ్స్ కోసం మీడియా వెర్రితలలు - బార్క్ మాయాజాలం 165-182

☞ టీ.ఆర్.పి అంటే ఏమిటి.?

☞ టీ.ఆర్.పి కోసం మీడియా వెర్రితలలు

☞ తెలంగాణా ఉద్యమ నేపథ్యంలో

☞ తెలంగాణాలో 610 జీ.ఓ,రగడ–నేతల నోటికి పేడతో కేకు

☞ నుదుటి పై ముద్దు వారిద్దరి ఫోటోలకు పెళ్ళి

☞ కేసీఆర్ మెడలో, చేతిలో మద్యం బాటిల్స్

☞ ప్రజాదరణ కలిగిన నాయకులకు శవ యాత్రలు, పిండప్రధానాలు

☞ ఆంధ్రాని బొచ్చు కుక్క పిల్లతో పోలిక

☞ కలెక్టరేట్‌లో పురుగు మందు సేవించిన రైతు విజువల్స్ కోసం

☞ బార్క్ మాయాజాలం

☞ ప్రస్తుత పరిస్థితుల్లో మీడియాలో మార్పు ఎంతో అవసరం

17. మీడియా రంగంలో అసలుసిసలైన హీరోలు “కెమెరామెన్స్” 183-198

☞ ఫోటో జర్నలిజం ప్రాముఖ్యత

☞ స్ట్రింగర్స్ కూడా వీడియో జర్నలిస్టులే

☞ ఫోటో/వీడియో జర్నలిస్టులకు కంటి చూపుతో ఫిట్నెస్ టెస్టులు

☞ 24 అవర్స్ 365 డేస్ ఆన్ డ్యూటీ లో కెమెరామెన్స్

☞ పర్సనల్ లైఫ్ కోల్పోతున్న కెమెరామెన్స్

☞ వృత్తి కెమెరామెన్ కానీ అదనపు బాధ్యతలు

☞ ఎవరికి చెప్పుకోలేని మానసిక సంఘర్షణ

☞ ఈ ఆర్డర్లీ వ్యవస్థను అడ్డుకోక పోతే....

☞ ఆత్మీయ బంధాలకు దూరంగా ....

☞ ఉత్తమ ఫోటో జర్నలిస్ట్ లుగా కెమెరామెన్స్

☞ జీవిత చరమాంకంలో బ్రతుకు దెరువుకు భరోసాలేని కెమెరా మెన్స్ జీవితాలు

**18. జర్నలిజంలో దొంగలు పడ్డారు** **199-210**

- ☞ పెట్టుబడిదారీ వ్యవస్థ గుప్పిట్లో జర్నలిజం
- ☞ జర్నలిస్ట్ లలో దొంగలు ఉన్నారు అనే కొందరి భావన వాస్తవమే...!
- ☞ ఇప్పటికే జర్నలిజంలో
- ☞ క్రింది స్థాయి జర్నలిస్ట్ లను దొంగలు గా భావించరాదు

**19. జర్నలిస్టుల "కట్టె" మిగిల్చిన కన్నీటి గాధలు** **211-234**

- ☞ గుడ్డి రాతలు కాదు... అక్షర కురుక్షేత్రం మా జర్నలిస్ట్లది
- ☞ జర్నలిస్ట్ లు ఏమి కోల్పోతున్నారు... మా ఆస్తి పాస్తులు ఏమిటో మీకు తెలుసా.....?
- ☞ జర్నలిజంలో ప్రత్యేక హోదాల కోసం
- ☞ వార్తా సేకరణకు పడిగాపులు
- ☞ అంతుపట్టని వ్యాధులు- అల్లకల్లోలంగా జీవితాలు
- ☞ జర్నలిజంలో జర్నలిస్ట్ల తపస్సు...
- ☞ జర్నలిజం...జర్నలిస్ట్ కి ఓ..సంకల్పం
- ☞ ఇవి కాదా...జర్నలిస్ట్ ల 'కట్టె' మిగిల్చిన కన్నీటి గాధలు
- ☞ పింగళి దశరథ్ రామ్ (డేరింగ్ & డాషింగ్ జర్నలిస్ట్)
- ☞ కలేకూరి ప్రసాద్. (బహుముఖ ప్రజ్ఞాశాలి)
- ☞ చిమ్మన నాగభూషణం
- ☞ చిమ్మన శేషజీవితం కన్నీటిమయం
- ☞ చెన్నా అజయ్ కుమార్
- ☞ వేజెండ్ల రాధ (సీనియర్ కెమెరామెన్)
- ☞ అనుముల శ్రీకాంత్

**20. సమాజాన్ని సంస్కరించడమే 'జర్నలిజం - జర్నలిస్టుల' భాధ్యత** **235-238**

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

# 1. సంచలనాత్మక పత్రికలు - వాటి మనుగడ

RAJA RATNAM TRUST
HOPE FOR ALL




**"నిజాలు నిర్భయంగా రాస్తున్న పత్రికలు ఎందుకు కనుమరుగైపోతున్నాయి. వాటిని నడిపిన వ్యక్తుల వ్యక్తిగత జీవితాలు ప్రక్కనబెడితే అక్షరాలతో సమరం చేస్తున్న జర్నలిస్టుల మనుగడ ఎందుకు ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది...?"**

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

దేశంలో జర్నలిజంకు ప్రత్యేకస్థానం ఉంది. అందుకే మనదేశంలో జర్నలిజం ఫోర్త్ఎస్టేట్గా పిలువబడుతుంది. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా, ప్రజా సమస్యలు పరిష్కరించాలని సమాజంలో తప్పు ఒప్పులపై విశ్లేణాత్మకమైన కథనాలు, పరిశోధనాత్మకమైన వార్తా కథనాలు, స్టింగ్ ఆపరేషన్స్, సెన్సేషనల్ రాజకీయాలుపై రచనలు చేసి ప్రభుత్వాలను, ప్రజలను మేలుకొల్పుతూ సమాజాభివృద్ధికి తోడ్పడుతున్న మా జర్నలిస్ట్ సోదరి, సోదరులది గొప్ప సంకల్పం. వారి గురించి ఎంత చెప్పినా తక్కువే. మరి అటువంటి జర్నలిజం, జర్నలిస్ట్లు గత కొంతకాలంగా ప్రమాదపు అంచుల్లోకి చేరుతున్నారు. చిన్న పత్రికైనా, పెద్ద పత్రికైనా ఏదైనా పత్రిక పత్రికే. పలు విధాలుగా వార్తలు, వార్తా కథనాలు రాసే ప్రతి ఒక్కరు ఆయా పత్రికల జర్నలిస్ట్లే. నిజాలు నిర్భయంగా రాసే పత్రికల మనుగడ కొంత కాలంగా ప్రశ్నార్థకంగా మారింది. అవినీతి, అక్రమాలపై కథనాలు రాసే జర్నలిస్ట్లకు జీవితాలపై గ్యారెంటీ లేదు. మరి ముఖ్యంగా చెప్పాలి అంటే జర్నలిజం అనే వృత్తికి భద్రత లేదు. పొద్దు, పొద్దునే నిద్రలేచి కుటుంబాన్ని వదిలి ఎండనక, వాననక, చలి తెలియక రాత్రి పొద్దుపోయే దాకా ఆవార్త, ఈవార్తా అని వాటిని కంపోజ్ చేసి, వార్తకు అనుగుణంగా ఫోటోల కోసం అన్వేషణ, వీడియోలు అయితే ఎడిటింగ్ చేయడం, వార్తకు స్క్రిప్టు రాయడం ఇలా డెస్క్కు పంపించే వరకు టెన్షన్తో మంచినీళ్లు కూడా ముట్టే సమయం లేక, ఈ విధానంలో సాయం–సంధ్యవేళ కన్న బిడ్డలకు దూరం అయ్యి ఏ అర్ధరాత్రికో, అపరాత్రికో ఇంటికి చేరి పడుకున్న బిడ్డలను, భార్యను చూసి ఊపిరి పీల్చుకుని, పడుకంటూ కూడా రేపు వార్తల షెడ్యూల్ ఏమిటి వాటిని ఎలా కవర్ చేయాలి, ఎవరెవరిని కలవాలి అలాగే రేపు రాయబోయే వార్తల గురించి తమ పత్రిక, టీవీ ఎడిటర్స్ ఏమి చెబుతారో అని కలత. నిద్రపోతూ సూర్యుడి కంటేముందు నిద్రలేచి తిని, తినకుండా వార్తల అన్వేషణకు బయలుదేరే ఓర్పు, శాంతం కలిగినవారు మా జర్నలిస్ట్లు.

## "జర్నలిజం ఆరంభదశ" [1]

పూర్వం కొన్ని పత్రికలే ఉండేవి, రాను రాను జర్నలిజం అభివృద్ధి చెందుతూ 19వ శతాబ్దంలో ప్రజల పాఠకశక్తి చూరగొంటూ, 20వ శతాబ్దంలోకి అడుగు పెట్టేనాటికి ఎలక్ట్రానిక్ మీడియా, అనంతరం సోషల్ మీడియా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే భవిష్యత్లో సోషల్ మీడియాదే ప్రధమస్థానం కానుంది అనేది వాస్తవం.

ప్రజా సేవలో పత్రికలు 240 సంవత్సరాల కిందట అంటే 1780లోనే మనదేశంలో వార్తాపత్రికల ప్రచురణ ప్రారంభమైంది. బ్రిటీష్ వారి ఆధ్వర్యంలో మొదటిసారిగా 1780 జనవరిలో హకీస్ బెంగాల్ గెజిట్ అనే పత్రిక విడుదలైంది. అయితే భారతీయులు



*Source Internet : 1. 'జర్నలిజం ఆరంభదశ'*[1]

పత్రికారంగంలోకి అడుగుపెట్టింది మాత్రం 1833-1851 సంవత్సరంలోనే. దాదాభాయ్ నౌరోజీ రాజకీయ భావాలను ప్రచారం చేసేందుకు 'ది ఇండియన్ ఎకనమిస్ట్' అనే పత్రికను నడిపారు. భారతదేశం నుంచి బ్రిటిష్ వారు ఎలా సంపదను దోచుకుంటున్నారో దాదాభాయ్ పత్రిక ద్వారా విరుచుకుపడ్డారు. దీంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది. బ్రిటిష్ వారిపై తిరుగుబాటు మొదలైంది. దీంతో 1878 లో బ్రిటిష్ వారు సెన్సార్ చట్టాన్ని తెచ్చారు. పత్రికల్లో ప్రచురించే వార్తలను సెన్సార్ చేసేవారు. ఇక 1882లో ఎఫ్.సి. మెహతా కైసర్ ఎ హింద్ పత్రిక ప్రారంభించారు. సంఘ సంస్కర్త రాజారామ్ మోహన రాయ్ తత్వబోధిని అనే పత్రిక ప్రారంభించి మూడాచారాలపై సమరం చేశారు.

సతీసహగమన దురాచారాన్ని రూపు మాపేందుకు ఆయన పత్రిక ద్వారా చేసిన సేవలు మరువలేనివి. స్వాతంత్ర్యం వచ్చే నాటికే మన దేశంలో 12 జాతీయ ఆంగ్ల దినపత్రికలు నడిచాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా, పయనీర్, స్టేట్స్ మన్ పత్రికలను బ్రిటిష్ వారే నడిపారు. చెన్నైలో ది హిందూ, బొంబాయిలో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఢిల్లీలో హిందూస్తాన్ టైమ్స్, కలకత్తాలో అమృత్ బజార్ పత్రికలు విజయవంతంగా నడిచాయి.

## "తెలుగు పత్రికల కృషిని మరవలేం"[2]

తెలుగులో ఆంధ్రపత్రిక, కృష్ణా పత్రిక ప్రజలకు విశేషంగా ప్రభావితం చేశాయి. మచిలీపట్నం కేంద్రంగా ఎం.కృష్ణారావు నేతృత్వంలో నడిచిన కృష్ణా పత్రిక స్వాతంత్ర్య ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచింది. ఇక ఎనిమిది దశాబ్దాల కిందట నెల్లూరు కేంద్రంగా స్థాపించిన "జమీన్ రైతు" నేటికీ వెలువడుతూ పాఠకుల ఆదరణ చూరగొంటోంది. ఇక తెలుగులో ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఉదయం, వార్త, సాక్షి, ప్రజాశక్తి, విశాలాంధ్ర పత్రికలు ప్రజలను చైతన్యం చేయడంలో విశేషంగా కృషి చేశాయి. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొన్ని పత్రికలు కొన్ని పార్టీలకు కరపత్రాలుగా మారాయనే అపవాదును కూడా మూట గట్టుకున్నాయి.

## "జర్నలిజంలో చాలా ప్రత్యేక గుర్తింపు పొందిన పత్రికలు వాటిమనుగడ"[3]

జర్నలిజం అంటే ఏమిటి...?పత్రికలు ఎలా ఉండాలి...? నిబద్ధతతో పనిచేసే జర్నలిస్టులు ఎలాంటి వార్తలు రాయాలి, ఎలాంటి వార్తలు రాయకూడదు, పత్రికలు చదివే పౌరుల పాఠక ఆలోచనావిధానానికి అనుగుణంగా వార్తలు డ్రాఫ్టింగ్ ఉండాలి అనే విషయాలు నేర్పిన కొన్ని పత్రికల చరిత్ర ఇలా ఉంది.



*Source Internet : 2. 'తెలుగు పత్రికల కృషిని మరవలేం'[2], 3. జర్నలిజంలో చాలా ప్రత్యేక గుర్తింపు పొందిన పత్రికలు వాటిమనుగడ[3]*

## "తెహల్కా డాట్ కామ్"[4]

ఢిల్లీ కేంద్రంగా అవినీతి, అక్రమాలపై పరిశోధనాత్మకమైన కథనాలు, స్టింగ్ ఆపరేషన్స్ చేసి పలు కథనాలు, వీడియోలు ఆధారంగా దేశంలో సంచలనం కలిగించిన పత్రిక "తెహల్కా డాట్ కామ్" ఈ పత్రికను తరుణ్ తేజ్‌పాల్ అనేవ్యక్తి మరోవ్యక్తితో కలిసి నడిపాడు.

2000లో క్రికెట్ మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణంపై తెహెల్కా యొక్క మొదటి స్టింగ్ ఆపరేషన్ జరిగింది. 2001లో, దాని స్టింగ్ "ఆపరేషన్ వెస్ట్ ఎండ్"కి జాతీయఖ్యాతి మరియు ప్రజల మద్దతు లభించింది. "ఈ 2001 రహస్య ఆపరేషన్ నకిలీ ఆయుధాల ఒప్పందంలో ప్రభుత్వ అధికారులు వేశ్యలు మరియు లంచాలు స్వీకరిస్తున్న దృశ్యాలను రికార్డ్ చేసి విడుదల చేసింది. దీంతో అప్పటి రక్షణ మంత్రి, ఇద్దరు అధికార పార్టీ అధ్యక్షులు సహా పలువురు అధికారులు రాజీనామాలు చేశారు. 2007లో, తెహెల్కా బజరంగ్ దళ్ సభ్యులకు వ్యతిరేకంగా మరియు నరోదాపాటియా హత్యాకాండలో వారి పాత్రకు వ్యతిరేకంగా ఒక నివేదికను ప్రచురించింది". "2002 గుజరాత్ హింస. " ది ట్రూత్: గుజరాత్ 2002" అని పిలవబడే నివేదిక, హింసలో సభ్యులు తమ పాత్రను అంగీకరించిన వీడియో ఫుటేజ్‌తో పాటు ఆరు నెలల స్టింగ్ ఆపరేషన్ ఆధారంగా రూపొందించబడింది, దానితో పాటు "ప్రగల్భాలు పలికే అబద్ధాలు" అని నిరూపించబడింది. ఇది 2010 మరియు 2011లో జర్నలిజంలో అత్యుత్తమ ప్రదర్శన కోసం ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్ ఇండియా అవార్డును గెలుచుకుంది. అనంతరం సహోద్యోగి లైంగిక వేధింపులు కేసులో అరెస్ట్ అయిన తరుణ్ తేజ్‌పాల్ కాలక్రమంలో తెహల్కా డాట్ కామ్‌ని వీడిపోయారు.

## "నక్కీరన్" తమిళనాట చాలా చిన్న పత్రిక[5]



పత్రికా రంగంలో చిన్న, పెద్ద పత్రికలు అని తేడా చూపిస్తున్న ఎంతో మందికి చిన్న పెద్దా పత్రిక తేడాలు తగదు అంటూ తన పరిశోధనాత్మక కథనం తో దక్షిణ భారతదేశంలో వీరప్పన్ పై సంచలనాత్మక కథనాలు రాసి జర్నలిజం చరిత్రలో ప్రత్యేకస్థానం పొందింది. ఈ పత్రికను తమిళనాడులో గోపాలన్ అనే వ్యక్తి నడిపాడు. దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలను గడ గడలాడించి ఆయా ప్రభుత్వాలను తారెత్తించి బయట ప్రపంచానికి తానెవరో తెలియని వీరప్పన్‌ని బాహ్య ప్రపంచానికి పరిచయం చేస్తూ వీరప్పన్‌తో గోపాలన్ ప్రత్యేక ఇంటర్వ్యూ జరిపారు. ఓ టీవీ ఛానల్తో టై అప్ అయ్యి నక్కీరన్ సౌజన్యంగా దేశ ప్రజలకు అప్పటి వరకు వీరప్పన్ పేరు మాత్రమే తెలుసుకొని అతని రూపు తెలియని దేశ ప్రజలకు వీరప్పన్ అంటే ఇతను ఇలా ఉంటాడు అని చూపించిన వ్యక్తి ఎడిటర్ గోపాలన్.



*Source Internet : 4. 'తెహల్కా డాట్ కామ్'[4], 5. "నక్కీరన్" తమిళనాట చాలా చిన్న పత్రిక'[5]*

ఇక వీరప్పన్ విషయానికి వస్తే అతని ప్రైవేటు సైన్యం (ఒక సమయంలో వందల సంఖ్యకు విస్తరించింది. వీరప్పన్ తన సైన్యంతో కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు, భారత సరిహద్దు భద్రతా దళంలోని పారామిలటరీ ఫోర్సులను ముప్పు తిప్పలు పెట్టారు. 184 మంది, అందులో దాదాపు సగంమంది పోలీస్ అధికారులు (ఫారెస్ట్ అధికారులు, ఉన్నతాధి కారులు కలిపి) చంపిన కేసుల్లో వీరప్పన్ వాంటెడ్‌గా ఉండేవారు. 200 ఏనుగులను అక్రమంగా చంపి, యుఎస్ డాలర్లు 2.6 మిలియన్ల రూపాయల విలువైన ఏనుగు దంతాలు, దాదాపు యూఎస్ డాలర్లు 22మిలియన్ల విలువైన 10వేల టన్నుల చందనం చెక్కను అక్రమరవాణా చేసినందుకూ అతను మోస్ట్ వాంటెడ్‌గా నిలిచారు. 1991లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ప్రత్యేక టాస్క్ ఫోర్స్ నెలకొల్పి వీరప్పన్ ను పట్టుకునేందుకు చేపట్టిన ప్రయత్నం సంవత్సరాలు గడిచేకొద్దీ దాదాపు రూ.100 కోట్ల ఖర్చుతో భారతదేశ చరిత్రలోకెల్లా అత్యంత ఖర్చు అయిన ఆపరేషన్‌గా నిలిచింది.

ఇంకా తాను దోచుకున్న అటవీ సంపద వేల కోట్లలో ఉంటుంది అని పలు కథనాలు అక్కడి దినపత్రికలు పెద్ద పెద్ద హెడ్‌లైన్స్ వేసి ప్రతీ కథనానికి వీరప్పన్ యుక్తవయసులో ఉన్న ఒకటే ఫొటో అక్కడి పత్రికలు ప్రచురించి ఎల్లో జర్నలిజం దిశగా అడుగులు వేశాయి. ఆ ఫొటో ఒక్కటే ప్రతి పేపర్ కథనానికి ప్రతి సారీ రావడం పై అనుమానం కలిగిన గోపాలన్ ఏంతో పట్టుదల, ధైర్యంతో సాహసోపేత నిర్ణయం తీసుకుని అత్యంత ప్రమాదకారి అని, మనిషి ప్రాణాలు తీయడంలో ఏ మాత్రం దయా, దాక్షిణ్యాలు లేని వ్యక్తి వీరప్పన్ అని తెలిసినా వందల కిలోమీటర్లు అడవిలో ప్రయాణం చేసి పట్టుదలతో వీరప్పన్ జాడ కనిపెట్టి తానొక జర్నలిస్ట్‌నని పరిచయం చేసుకుని మీ పై పత్రికలలో ఇలా వరుస కథనాలు వస్తున్నాయని అది ఎంత వరకు నిజం అని తెలుసుకోవడానికి వచ్చానని గోపాలన్ వీరప్పన్ దళానికి సమాచారం అందించాడు. అంతకు ముందే అడవిలో తన స్థావరం వైపు ఎవరో వస్తున్నారని పక్షుల కదలికలు ద్వారా వాటి అరుపులు ద్వారా కనిపెట్టిన వీరప్పన్ గోపాలన్ విషయం తన దళ సభ్యులు తెలిపినా గోపాలన్‌ని కలిసేందుకు వీరప్పన్ ఇష్టపడలేదు. అయినప్పటికీ అక్కడే పట్టువదలని విక్రమార్కుడులా కూర్చున్న గోపాలన్‌ని అన్ని విధాలా చెక్ చేసి అతని వద్ద ఏ విధమైన ఆయుధాలు లేవని కేవలం అతని వద్ద ఉన్న వీడియో కెమెరా, బ్యాటరీలు, అతని వెంట వచ్చిన కెమెరామెన్‌ని పరిశీలించి అన్నీ నిర్ధారణ చేసుకుని వీరప్పన్ అప్పుడు అతనిని కలిసి ఇంటర్వ్యూ ఇచ్చేందుకు కెమెరా ముందుకు వచ్చాడు. అలా ధైర్యంగా వ్యవహరించి గోపాలన్ వీరప్పన్ ఇంటర్వ్యూ తీసుకుని తమిళనాడులో టీవీల ద్వారా ప్రసారం చేశాడు. ఆ ఇంటర్వ్యూలో వీరప్పన్ అడవి తల్లి ఒడిలో ఉన్న నేను అటవీ సంపదను ఎందుకు దోచుకుంటాను. ఏదో కొద్దిగా నా తల్లి సంపదను వాడుకున్న మాట వాస్తవం

ప్రభుత్వం, పత్రికలు చెప్పినట్లు నేను కాదు. నా పేరున స్థానిక పాలకులు, అటవీశాఖ అధికారి శ్రీనివాసన్ అనే వ్యక్తి అటవీ సంపదను పెద్ద ఎత్తున దోచుకుని నా మీద నిందలు మోపారు అని, ఇదే శ్రీనివాసన్ అనే వ్యక్తి తన చెల్లిని ప్రేమించి మోసం చేసినట్టు వీరప్పన్ ఆ ఇంటర్వ్యూలో పాలకులు, అటవీశాఖ అధికారుల తీరును ఎండగట్టాడు. గోపాలన్ నక్కీరన్ సౌజన్యంతో ఓ టీవీలో ప్రసారం చేసిన వీరప్పన్ ఇంటర్వ్యూ తమిళనాడు ప్రజల మన్ననలు పొంది ప్రజలకు వీరప్పన్‌పై సానుభూతి లభించగా గోపాలన్ పత్రికకు విశేషమైన ఆదరణ లభించింది. దీనితో గోపాలన్‌కి వీరప్పన్‌కి మధ్య మంచి సహకారం కుదిరింది. ఈ సాకుతో అక్కడ ప్రభుత్వం గోపాలన్‌పై పోటాయాక్ట్ అమలు చేసి గోపాలన్‌ని అరెస్ట్ చేసి జైలుకి పంపింది. అప్పటి నుండి గోపాలన్ నక్కీరన్ పత్రిక ప్రశ్నార్థకం అయ్యింది. ఇకపోతే చిన్న పత్రికలపై ఉండే స్వభావం తమిళనాడు ప్రజల్లో తొలగిపోయి పత్రిక పేరే ఇంటి పేరుగా మారి గోపాలన్ కాస్తా “నక్కీరన్ గోపాలన్”గా అప్పట్లో సంచలనాలకు మారుపేరుగా మారింది.

## “ఎన్ కౌంటర్” పత్రిక[6]



ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పాలకులు, అధికారులు, కొంతమంది రాజకీయ నాయకుల తీరు, మార్పు కోరుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఫరీడవిల్లాలి అంటే ఎల్లోజర్నలిజం అవసరం తప్పదు అని భావించి ఎల్లో జర్నలిజంతో సంభంధం లేని భగత్‌సింగ్ సిద్ధాంతాలను వేరుగా నమ్మిన పింగళి దశరథ్‌రామ్ 1980వ దశకంలో ఎన్‌కౌంటర్ పత్రికను స్థాపించారు. దశరథ్‌రామ్ భారతదేశ జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య వారసుడు. పింగళి దశరథరామ్, పత్రికా సంపాదకుడు. దశరథరామ్ తన స్వీయ సంపాదకత్వంలో విజయవాడ సత్యనారాయణపురం నుండి ఎన్‌కౌంటర్ అనే పత్రిక నడిపేవాడు. ఈ పత్రిక 1980లో వందలోపు కాపీలతో మొదలు పెట్టబడింది. ఈ పత్రికలో పింగళి దశరథరామ్ ఎన్నో సంచలనాత్మకమైన విషయాలను, ముఖ్యంగా మంత్రుల వ్యక్తిగత విషయాలు, వారికుటుంబ విషయాలు ప్రచురించి పేరు తెచ్చుకున్నాడు. భయమంటే ఎరుగని వ్యక్తి. ఆవతలి వ్యక్తి ఎంత పై స్థాయిలో ఉన్నప్పటికి తాను రాయదలుచుకున్నది రాసి తీరేవాడు. అతని భాషాశైలి దాదాపుగా మాట్లాడుకునే భాషగా ఉండేది. భాషలో సభ్యతాలోపం గురించి చాలా మంది ఫిర్యాదు చేసేవారు. ఇతని సంచలాత్మకమైన సంపాదకశైలి అనేక ఇతర పత్రికలకు స్ఫూర్తినిచ్చిందని చెప్పుకుంటారు. ఎన్‌కౌంటర్ పత్రిక అప్పట్లో అందులో వ్రాయబడే సంచలనాత్మక విషయాల వల్లనగాని, వ్రాసే విధానం వల్లన గాని రాష్ట్రంలో మూల మూలలకు పాకిపోయిందట. దాదాపు 5లక్షల



*Source Internet : 6. ‘ఎన్ కౌంటర్” పత్రిక[6]*

కాపీలవరకు అమ్ముడు పోయేదని చెప్పుకుంటారు. దశరథరామ్ యెల్లో జర్నలిజానికి తెలుగునాట బీజాలు వేశాడు. తెలుగులో 'కాగడా' వంటి పత్రికలు యెల్లో జర్నలిజాన్ని అంతకు ముందే అనుసరించినా, అవి సినిమా వార్తలకు మాత్రమే పరిమితమైనవి. ఎన్‌కౌంటర్‌లో దశరథరామ్ రాజకీయ విషయాలు, రాజకీయ నాయకుల గురించి ఆ పద్ధతిలో వ్రాయటం మొదలుపెట్టి, తెలుగులో రాజకీయ యెల్లో జర్నలిజంకు తెరతీశాడు. వ్రాసే భాష చాలా మొరటుగా ఉండి, 'మర్యాద' 'గౌరవప్రద' వ్రాత పద్ధతులకు ఆమడ దూరాన ఉండటం వల్ల, వ్రాశే విషయాలు నిజమై ఉండటానికి అవకాశ మున్నప్పటికీ, అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందలేదు. పలుకుబడిగల పెద్ద పెద్ద రాజకీయనాయకుల వ్యక్తిగత విషయాలు దాదాపు చీదరపుట్టేట్టు వ్రాసేవాడు. అలా వ్రాసి వ్రాసి ప్రాణంమీదకు తెచ్చుకున్నాడని అంటారు.

దశరథరామ్ అనుమానాస్పద పరిస్థితులలో 1985వ సంవత్సరం అక్టోబరు 21వ తేదీన కొన్ని వార్తలు రాసేందుకు రిఫరెన్సు కోసం విజయవాడలో విశాలాంధ్ర బుక్ హౌస్‌కి వచ్చి కొన్ని పుస్తకాలు కొనుగోలు చేసి రిక్షాలో సత్యనారాయణపురం తిరిగి వెళుతున్న క్రమంలో అప్పటికే అతనిపై రెక్కీ నిర్వహించిన రాజకీయ గూండాలు దశరద్‌రామ్ సత్యనారాయణపురం రైల్వేగేటు వద్దకు చేరుకోగానే రిక్షాలో నుండి బయటకులాగి కత్తులతో పొడిచి పొడిచి చంపారు. ఈ హత్య అప్పట్లో చాలా సంచలనం సృష్టించింది. దశరథ్ రామ్ హత్య కాలంలో ఎన్టీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అయితే ఇది అప్పట్లో ఓ రాజకీయ హత్యగా నిలిచింది.

దశరథ్‌రామ్ చంపబడేప్పటికి అతని వయస్సు ఇరవై తొమ్మిది సంవత్సరాలు మాత్రమే. ఇతని అభిమానులు, సత్యనారాయణపురం (విజయవాడ)లో ఆయన మరణానంతరం అతని విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రతిష్ఠించబడిన కొద్దిరోజులకే గుర్తు తెలియని దుండగులు ఆ విగ్రహాన్ని తవ్వి ధ్వంసం చేశారు. ఇప్పటికీ ఆ ప్రాంతాన్ని దశరథరామ్ చౌక్‌గా పిలుస్తారు. పింగళి హేరంబ చలపతిరావు (భారత జండా రూపకర్త పింగళి వెంకయ్య చిన్న కుమారుడు) దశరథరాం తండ్రి. వీరు సైన్యంలో పనిచేశారు. దశరథరామ్ కు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ఈయన భార్య దశరథరామ్ మరణించిన తర్వాత ఎన్‌కౌంటర్ పత్రికను కొంతకాలం నడిపారు గానీ అందుకు తగిన వనరులూ, వ్యక్తులూ లేక పత్రిక ఆగిపోయింది. ఈయన కుమార్తె పింగళి చైతన్య రచయిత్రిగా పేరు సంపాదించింది. ఈమె వ్రాసిన చిట్టగాంగ్ విప్లవ వనితలు అనే పుస్తకం కేంద్ర సాహిత్య అకాడమీ నుండి 2016లో యువ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది. ఈ విధంగా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మార్పుకోసం జర్నలిజంలో సాహసోపేతమైన ఎల్లోజర్నలిజంను నమ్ముకొని కథనాలు రాసిన దశరథ్‌రామ్ చిన్న వయసులోనే జర్నలిజం కోసం ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అలా ఎన్‌కౌంటర్ ప్రస్థానం ముగిసింది. అయితే ఆయన కూతురు పింగళి చైతన్య తండ్రి లక్షణాలను పుణికి

పుచ్చుకోవడం విశేషం. ఆయన కుమార్తె ఎంతో ధైర్య సాహసాలతో అటువంటి ఓ పత్రికలో కొన్నాళ్ళు పని చేసింది.

## "విజయ విహారం" దమ్మున్న యువతరం మాస పత్రిక

హైదరాబాద్ కేంద్రంగా ఎన్ కౌంటర్ పత్రికలా కాకపోయినా దాదాపు అదే మూలాలతో కొన్నేళ్ల పాటు పాఠకుల మనసులు చూరగొన్న పత్రిక "విజయ విహారం" ఈ పత్రిక సంపాదకులు రమణమూర్తి. ఈ పత్రిక కూడా ఎన్నో సంచలనాత్మక కథనాలను రాసింది. ఈ పత్రికలోనే పింగళి చైతన్య కొన్నాళ్ళు పాటు పని చేసింది. ఈ విజయ విహారం తన పరిశోధనాత్మక కథనాలలో ఏ విధమైన విద్యార్హత లేని సత్య సాయిబాబా చరిత్ర, అతని విధి విధానాలు తెలుపుతూ దొంగ బాబా అని, అలాగే కోడెల రాజీనామా చెయ్, నక్సలిజం ఆవిర్భావం, నక్సలిజం ఎలా అభివృద్ధి చెందింది వంటి కథనాలతో పాటు ప్రస్తుతం నడుస్తున్న ఓ పత్రికా వ్యవస్థాపకుడి ప్రస్థానం పత్రిక స్థాపనపై లెక్కలేని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి అంటూ ఆ పత్రికా వ్యవస్థాపకుడు చెప్పలేని ఎన్నో ప్రశ్నలు ప్రచురిస్తూ కథనం ప్రచురించారు. విజయ విహారం రాసిన ఆ ప్రశ్నల కథనానికి నేటికీ సమాధానం లేదు. అయితే ఆ పత్రిక నేటికి నడుస్తూనే ఉంది.

ఇంకా రాజకీయ నాయకులపై వారి అవినీతిపాలన ఎండగడుతూ కథనాలు రాయడంతోపాటు అప్పటిలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రవేశపెట్టాల్సిన వందల జీవోలు తొక్కి పెట్టింది అనే కథనాలు వేసింది. దాదాపు ఎన్‌కౌంటర్ పత్రికలా నడిచిన విజయ విహారం పాఠకులకు ఎన్ కౌంటర్ పత్రిక లేని లోటు తీర్చింది. ఎన్ కౌంటర్ తరువాత విజయ విహారం కోసం పాఠకులు వేయి కళ్ళతో ఎదురు చూసేవారు. పత్రిక మార్కెట్లోకి రావడం ఆలస్యం విజయ విహారం పత్రికను దొంగ చాటుగా, రహస్యంగా యువత కొనుగోలు చేసేవారు. మార్కెట్‌లోకి ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసి వచ్చిన కొన్ని గంటల్లోనే కాపీలు అన్నీ అమ్ముడుపోయేవి. ఈ పత్రిక కోసం కొంతమంది పాఠకులు మార్కెట్‌లో పలు పుస్తకాల దుకాణాల్లో అన్వేషణ చేసేవారు.


కొంతకాలం పాఠకులను ఆకట్టుకున్న విజయ విహారం ఓ హత్య కేసు కారణంగా మనుగడలో లేకుండాపోయింది. కారణం ఏమిటంటే విజయ విహారం పత్రికా సంపాదకునికి జనహర్ష గ్రూప్ ఆఫ్ కపెనీస్ క్రింద రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ వ్యాపార లావాదేవీల్లో సమస్యలు రావడంతో ఓ వ్యక్తిని హత్యచేసి జనహర్ష సంస్థ భూముల్లో పాతిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కారణంచే విజయ విహారం సంపాదకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కారణం ఏదైనప్పటికి ఈ ఘటన తరువాత విజయ విహారం జాడ పాఠకులకు లభించలేదు.

ఇలా పైన తెలిపిన వ్యక్తులు వారి వ్యక్తిగత విషయాలు పక్కనబెడితే వారు నడిపిన పత్రికలు విలువలు కలిగిన జర్నలిజంకు కట్టుబడి ఉన్నారు. వీరందరి గురించి ప్రస్తుత జర్నలిస్ట్‌లు, మరిముఖ్యంగా రాబోవు భవిష్యత్ తరాల జర్నలిస్ట్‌లు తెలుసుకోవాలి. ఎందుకంటె ఇక పై మీడియా రంగంలో ప్రవేశం కానున్న పత్రికలు, చానల్స్ జర్నలిజం విలువలకు తిలోదకాలు ఇచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటికే మీడియా రంగాన్ని మంచి వ్యాపారంగా గుర్తించిన కొన్ని సంస్థలు, వ్యక్తులు ఈ రంగంలోకి ప్రవేశించారు. భవిష్యత్ తరాల్లో జర్నలిజంలో అవకాశం పొందేందుకు వీలుపడుతుంది అని జర్నలిజంపై ఆశక్తి ఉన్న యువత ఆశగా రాబోవు పత్రికలు, ఛానల్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇలా ఎదురు చూసేవారు ఇకపై మీడియారంగం భవిష్యత్ ఎలాఉంటుంది, జర్నలిస్ట్‌ల పరిస్థితి ఏమిటి అనే విషయాలపై చాలా అవగాహన పెంచుకోవలసి ఉంది.

ఇక ఉన్నవారి పరిస్థితి అనుమానంగా ఉంటే సరి కొత్తగా ఆంధ్రాలో పెద్ద సంఖ్యలో దినపత్రికలు, టివి ఛానల్స్ గత కొన్నేళ్ళుగా రిజిస్ట్రేషన్ కోసం ఢిల్లీలో పైరవీలు జరుపుతున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. 2024 ఎలక్షన్స్ నాటికి ఇవి పురుడుపోసుకుంటే జర్నలిజంలో రానున్న మార్పులపై యువ జర్నలిస్ట్‌లు అవగాహన కలిగి ఉండటం ఎంతో మేలు. భవిష్యత్ ఊహించిన ఎంతోమంది సీనియర్ జర్నలిస్ట్‌లు సోషల్ మీడియా వైపు చూస్తుంటే, మరి కొందరు సీనియర్ జర్నలిస్ట్‌లు సోషల్ మీడియా ప్రతినిధులుగా ఇప్పటికే చేరిపోయి ఇప్పుడున్న పత్రికలు, ఛానల్స్‌లో పొందలేని రెమ్యూనరేషన్ మరి కొంతమంది నెలవారీ జీతాలు పొందుతున్నారు. ఇంకొంతమంది వేరే రంగాల వైపు వెళుతున్నారు. ఎటువంటి వత్తిడి లేకుండా యాడ్ టార్గెట్స్, సంవత్సర చందాలు చెల్లించే పనిలేక జర్నలిస్ట్‌లుగా కొనసాగుతున్నారు. అయితే, రెగ్యులర్ న్యూస్ పేపర్స్, టీవీలలో పనిచేసిన తృప్తి సోషల్ మీడియాలో రాలేదనేది సరికాదు.

ఇప్పుడు సోషల్‌మీడియా బాగా ఎదిగింది. ఎదుగుతున్న సోషల్‌మీడియాపై ప్రధాన మీడియా అసూయ వెళ్ళగక్కుతుంది. ఈ తీరు మారాలి. మార్పుకోసం జర్నలిస్టులే ముందడుగు వేయాలి. లేదంటే జర్నలిజం కొంతమంది దోపిడీదారుల కబంధహస్తాల్లోకి వెళుతుంది. దాదాపు వెళ్ళినట్లే.

# 2. మాఫియాగా మారిన మీడియా-దోపిడీ వైనం




RAJA RATNAM TRUST
HOPE FOR ALL

"ఒకప్పుడు సమాజంపట్ల బాధ్యత వహించిన మీడియా ప్రస్తుతం దోపిడీ మార్గాలలో అడ్డూ-అదుపూ లేకుండా బహిరంగంగా లైసెన్సెడ్ దోపిడీకి తెర తీసింది. ఇప్పుడు మీడియా కాస్త మాఫియాగా మారింది"

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

అన్ని రంగాల్లో మాఫియా, సిండికేట్ వ్యవస్థ ఉన్నట్టు ప్రస్తుతం మీడియా రంగంలో కూడా ఒక రకమైన మాఫియా చేరింది. ఏదో ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించడానికి వచ్చాము అని పొద్దున లేచింది మొదలు పొద్దుపోయే వరకు ఆ కథనాలు, ఈ కథనాలు అంటూ ప్రసారాలతో ఊదర గొట్టే పత్రికలు, ఛానల్స్ అసలు రంగు బయటకు తెలియదు అనుకుంటూ ఉపన్యాసాలు చెప్పే ప్రస్తుత మీడియా చేస్తుంది ఏమిటి...? ప్రజాస్వామ్య ప్రభుత్వంలో కొన్ని పత్రికలు, ఛానల్స్ మీడియా రంగానికి చెదలులా పట్టాయి. పత్రికలు లేని సమాజాన్ని ఊహించలేమని ఒకరు, కత్తి కంటే కలం గొప్పదని ఒకరు మహానుభావులు అన్నారు. వీటిని ఆసరాగా చేసుకుని కొన్ని పత్రికలు, ఛానల్స్ వ్యవహరిస్తున్న తీరు పత్రికా రంగానికి మాయని మచ్చ. మరి ముఖ్యంగా తెలుగు మీడియా రంగంలో జర్నలిస్ట్‌లకు జీతాలు ఇవ్వకుండా కార్మిక చట్టాలను అమలు చేయకుండా, జర్నలిస్ట్‌లను శ్రమదోపిడీ చేస్తూ, మానసిక ప్రశాంతత లేకుండా ఏదో వారి పత్రికకు, ఛానల్స్‌కి గతించిన వంశీయుల వారసులు తర తరాలుగా తీరని బాకీలు ఉన్నట్లు తమ వద్ద పనిచేసే జర్నలిస్ట్‌లను పలు విధాలుగా వాడుకోవడం ఇప్పుడు మన మీడియా రంగానికి మామూలు అయిపోయింది. అలా అని తమ వద్ద పనిచేసే జర్నలిస్ట్‌కు కనీసం ఒక ఐడీ కార్డు ఇవ్వాలి అనే విచక్షణ కూడా లేదు. యాడ్ టార్గెట్స్, సంవత్సర చందాలు, క్యాలెండర్ యాడ్స్ అంటూ జర్నలిస్ట్‌లను ఏజెంట్‌లుగా పెట్టి వాటి ద్వారా వచ్చే ఆదాయంలో కమీషన్ కూడా ఇవ్వకుండా కొన్ని మీడియా సంస్థలు భారీగా సంపాదనకు తెర లేపాయి. వాస్తవానికి పత్రికలు, ఛానల్స్ నడవాలి అంటే ప్రకటనలు అవసరం ఉంది. ఆయితే ఇది ఒక స్థాయి వరకే బాగుంటుంది. కానీ కేవలం ప్రకటనలే ప్రామాణికంలా మన తెలుగు మీడియా రంగం వ్యవహరిస్తోంది. ప్రకటనలు ఇచ్చేవారు ఉంటే తీసుకోవడం తప్పు కాదు. వ్యక్తులను, సంస్థలను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి ప్రకటనల ముసుగులో కొన్ని పత్రికలు, ఛానల్స్ మనుగడసాగిస్తున్నాయి. కొసమెరుపు ఏమిటంటే ఎక్కువ పత్రికలు, ఎక్కువ ఛానల్స్ ఈ దిశగా మారిపోతే ఒకటి, రెండు పత్రికలు, మరో ఒకటి రెండు ఛానల్స్ చాలా వరకు ప్రకటనల కోసం మరీ దిగజారి పోకుండా, ప్రకటనల కోసం జర్నలిస్ట్‌లకు టార్గెట్స్ లేకుండా ప్రత్యేకంగా యాడ్స్ సేకరించేందుకు జీతాలు ఇచ్చి యాడ్ రిప్రజెంట్స్‌ని నియమించుకుంటున్నాయి. ఈ పద్ధతి మన తెలుగు మీడియా రంగానికి ఎంతో ఆరోగ్యకరం.

## "ఏకంగా దేవుడు కళ్యాణం పేరిట దోపిడీ"[1]

రాష్ట్రంలో ఆ మధ్య ఓ టీవీ చానల్ లోకకళ్యాణం, సమాజాభివృద్ధి పేరిట శివపార్వతుల కళ్యాణం అంటూ పలు ప్రముఖ దేవాలయాల్లో ఆ శాఖ మంత్రుల సిఫారసు లేఖలతో కొంతమంది పెద్ద పెద్ద వ్యాపారస్తుల వద్ద తమ ఛానల్లో పనిచేసే జర్నలిస్ట్‌లను



*Source Internet : 1. 'ఏకంగా దేవుడు కళ్యాణం పేరిట దోపిడీ'[1]*

పెట్టి భారీ స్థాయిలో చందాలు వసూళ్ళు చేసింది. అయితే ఆ ఛానల్ నిర్వాహకులు జర్నలిస్ట్‌లకు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకుండా, శివపార్వతుల కళ్యాణం జరిపించకపోవడంతో విసుగు చెందిన ఆ ఛానల్ (ఇప్పుడున్న ఏ ప్రధాన ఛానల్స్ మాత్రం కాదు) జర్నలిస్ట్‌లు నిర్వాహకుల పై కేసు పెట్టడం పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది. మీడియారంగంలో ఇదో రకమైన దోపిడీ.

## యాడ్స్ సేకరణలో చెకోర పక్షుల్లా జర్నలిస్ట్‌లు

తెలుగు మీడియారంగంలో ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఒకటి, రెండు పత్రికలు, ఛానల్స్ మినహా దాదాపు అన్ని పత్రికలు, అన్ని ఛానల్స్ తమ పత్రిక, ఛానల్ వార్షికోత్సవం, నూతన సంవత్సరం, ఉగాది, ఉగాది పంచాంగం, ప్రముఖుల పుట్టినరోజు అంటూ ఆఫీసుల్లో జర్నలిస్ట్‌లకు మీటింగ్ పెట్టి ఒక్కో జర్నలిస్ట్‌కి నువ్వెంత ఇస్తావు, నువ్వెంత ఇస్తావు అంటూ వేల రూపాయల నుండి లక్షల్లో యాడ్ టార్గెట్స్ ఇస్తున్నారు. ఇవ్వలేని జర్నలిస్ట్‌లు ఎలక్ట్రానిక్ మీడియా అయితే లోగో ఇచ్చేయ్యాలి అని, ప్రింట్ మీడియా అయితే నీ సేవలు మాకు అవసరం లేదు టార్గెట్ చేస్తామని చాలామంది ఉన్నారు నీవు అవసరం లేదు అని బయటకు సాగనంపుతున్నారు.

ఇక ఆయా దినాలను పురస్కరించుకుని జర్నలిస్ట్‌లు తమ ప్రాంతంలో ప్రముఖ వ్యక్తులను, వ్యాపారస్తులను, దేవాలయాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు,అక్రమ వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక విభాగాలు ఇలా ఏ వ్యక్తిని, వ్యవస్థను, సంస్థలను వదిలిపెట్టకుండా టార్గెట్ రీచ్ అవ్వకపోతే ఉద్యోగం పోతుంది అని ఆయా పత్రికల, ఛానల్స్ జర్నలిస్ట్‌లు ఊరు మీద పడి ఎండనక, వాన, చలి తెలియక చెకోర పక్షుల్లా తిరగక తప్పడం లేదు. రూపాయి ఆదాయం లేకపోయినా జర్నలిజం వృత్తిపై ఆశక్తి ఉండటంతో శ్రమ దోపిడీకి గురవుతున్నారు.

## కొన్ని మీడియా సంస్థల్లో జర్నలిస్ట్‌లుగా పని చేయటానికి పైరవీలు

అదేమిటో గానీ చాలా కొద్ది మీడియా సంస్థల్లో జర్నలిస్ట్‌గా పని చేయాలి అంటే జర్నలిజం మీద ఆశక్తి ఉన్న యువకులు కొందరు ఆయా పత్రికలు, ఛానల్స్‌కి చెందిన కొందరి వ్యక్తులకు కొంత మొత్తంలో నగదు చెల్లించి లోగోలు కొనుక్కోవాలి. పత్రికల్లో అయితే సంవత్సర చందాలు చెల్లించాలి. అప్పుడు వారు ఆ పత్రికలకు, ఛానల్స్ కి జర్నలిస్ట్‌లుగా కొనసాగే అవకాశం ఉంటుంది. ఇది చాలదు అన్నట్లు యాడ్స్ సేకరించాలి అనే నిభందనతో జర్నలిస్ట్ వృత్తిలోకి వస్తున్నారు. ఇటువంటి నిర్ణయం అన్ని పత్రికలు, ఛానల్స్‌లో లేకపోయినా కొన్ని పత్రికలు, ఛానల్స్‌లో మాత్రం ఇది అమలు అవుతున్న మాట అక్షర సత్యం. ఎవరు

ఎక్కువ డబ్బులు, ఎక్కువ యాడ్స్ సేకరిస్తామని ఒప్పందం కుదుర్చుకుంటారో వారిని జర్నలిస్ట్‌లుగా నియమించుకుంటున్నారు. ఇది నిఖార్సైన జర్నలిజానికి ప్రమాదం కాదా....? ఈ విధానం మీడియా రంగంలో వ్యాపారం కాదా..? ఈ విధానాలను అరికట్టేదెవరు..? ఇలా వదిలేస్తే జర్నలిజం భవిష్యత్ ఏమిటి...? అందుకే జర్నలిజంలోకి ప్రవేశించే వారికి కనీస విద్యార్హతగా డిగ్రీలో జర్నలిజం ఉండాలి అనే నిబంధన ప్రవేశపెట్టాలి. ఇటువంటి వారి వల్ల జర్నలిజం లో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉన్న యువత జర్నలిజంలోకి రాలేక వేరే వృత్తులకు వెళ్ళిపోతున్నారు. ఇలా అర్హత కలిగిన వారు వేరే వృత్తుల్లో కొనసాగుతుంటే జర్నలిజంలో ఏ అర్హత లేని వారు సమాజంలో జర్నలిస్ట్‌లుగా చెలామణీ అవుతున్నారు. మరి ముఖ్యంగా ఇలా డబ్బు చెల్లించి జర్నలిస్ట్‌లుగా వచ్చిన కొందరు వ్యక్తుల వల్లే నిజమైన జర్నలిస్ట్‌లకు చెడ్డ పేరు వస్తుంది. విద్యార్హత ప్రామాణికం కాకపోయినా సామాజిక స్పృహ, భాషపై పట్టు, సమస్యలపై అవగాహన, వార్తను చక్కగా డ్రాఫ్టింగ్ చేసే విదానం ఉన్న ఎవరైనా జర్నలిస్ట్‌లుగా కొనసాగే అవకాశం ఉంది. గతంలో ఎంతోమంది ఈ విధానాలతో జర్నలిజంని చాలెంజింగ్‌గా నిర్వహించారు. జర్నలిజానికి విద్యార్హత అవసరం అని ఎందుకు చెపుతున్నాను అంటే ప్రజాస్వామ్య ప్రభుత్వంలో జర్నలిజంకు ఉన్న డిగ్నిటీ తగ్గిపోకూడదు అని నా అభిప్రాయం.

## జర్నలిస్టుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలి

ఎన్నో ఆశలతో జర్నలిజంలోకి ఏ విధంగా ప్రవేశించిన జర్నలిస్ట్‌లు వార్తలు సేకరించే విధానంలో గానీ వాటిని తమ పత్రికలకు, ఛానల్స్‌కి చేరవేసే క్రమంలో ఎన్నో ఒత్తిళ్లకు గురవుతున్నారు. పత్రికలు, ఛానల్స్ మధ్య ఈ రోజు తీవ్ర పోటీ ఎదురయ్యింది. ఈ క్రమంలో ఎక్స్‌క్లూజివ్, ఫస్ట్ ఆన్, అంటూ జర్నలిస్ట్ సోదరులకు మధ్య తీవ్రమైన పోటీ ఎదురయ్యింది. ఈ విధానంలో మన సోదరులు టెన్షన్‌కి, మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఎక్స్‌క్లూజివ్ పేరిట ఒక్కడిగా వార్త కోసం పరుగులు పెట్టి మిగతా జర్నలిస్ట్‌లకు వార్త తెలియకుండా, రహస్యంగా సేకరించి పత్రికలో, ఛానల్స్‌లో ఆవార్త ప్రసారం, ప్రచురణ అయ్యాక సాటి జర్నలిస్ట్‌ల సహకారం కోల్పోయి, తోటి జర్నలిస్ట్ మిత్రుల స్నేహం కోల్పోయి ఒంటరిగా మిగిలిపోతున్నారు. దీనికి కారణం పత్రికలు, ఛానల్స్ మధ్య తీవ్రమైన పోటీ ఉండటమే. ఈ క్రమంలో జర్నలిస్ట్‌లు అందరికంటే ముందుండాలి అనే ప్రయత్నంలో ఆయా పత్రికలు, ఛానల్స్‌లో ప్రారంభం అయిన వీరి పరుగు స్మశానాల్లో అంతం అవుతుంది. దానితో కుటుంబాలను అన్యాయం చేసి బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకుని రేపటి రోజున తమ పిల్లలకు భవిష్యత్ లేకుండా అర్థం పర్థం లేని జీవితాలను జర్నలిస్ట్‌లు కొనసాగిస్తున్నారు. ఈ విషయం చెప్పటానికి, రాయటానికి నాకు చాలా బాధగా ఉంది.

ఇవి చాలవు అన్నట్లు జర్నలిస్ట్‌గా కొనసాగినన్నాళ్లు వార్తలు సేకరణ, ప్రజెంట్ చేసే విధానంలో ఆయా పత్రికల డెస్క్ ఇన్‌ఛార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్స్, ఎడిషన్ ఇన్‌ఛార్జ్, ఆర్సీలు నుండి ఒత్తిళ్లు అలాగే ఎలక్ట్రానిక్ మీడియాలో అయితే వార్త విషయంలో ఏ మాత్రం లేట్ అయినా ఇన్పుట్, అవుట్పుట్ ఎడిటర్ల నుండి కో– ఆర్డినేటర్స్, స్టాఫ్ రిపోర్టర్స్ అందరూ క్రిందిస్థాయి స్ట్రింగర్స్‌పై పెత్తనం. ఆ వార్త అలా, ఈ వార్త ఇలా, తొందరగా పంపించు అంటూ స్ట్రింగర్స్‌పై బూతు పురాణానికి దిగే వ్యక్తులు ఉన్నారు. ఎవరు పనిచేసినా తమ పత్రికకు, ఛానల్స్‌కె అనే విజ్ఞత లేకుండా సాటి జర్నలిస్ట్ అనే భావన కూడా లేకుండా వ్యవహరిస్తున్నారు.

## మానసిక ఒత్తిడి, చీదరింపులు, ఛీత్కారాలతో జర్నలిస్ట్‌లు సహవాసం.

వార్తల సేకరణ కోసం ఉదయం లేచింది మొదలు సాయంత్రం పొద్దుపోయే వరకు వృత్తిరీత్యా నిండా మునిగిపోయిన కొందరు జర్నలిస్ట్‌లు తమ కుటుంబాలకు దూరమవుతున్నారు. చూడండి వేరే వృత్తులు చేసుకునే వ్యక్తులు సాయం సంధ్య వేళల్లో తమ భార్య, తల్లిదండ్రులు, పిల్లలతో సరదాగా గడుపుతున్నారు. మరి మనం ఆ సంధ్యా సమయంలో కుటుంబాలకు దూరంగా కన్న బిడ్డలకు ప్రేమ పంచలేక ఉంటున్నాం. కారణం మనం ఎంచుకున్న వృత్తి అలాంటిది. మనకు ఆ వృత్తి పై అంత ప్రేమ మరి మన కుటుంబాన్ని పిల్లల ఆనందాన్ని తండ్రులుగా మనం తీర్చలేకపోతున్నాం. ఏదైనా వీలు చూసుకొని కుటుంబంతో ఒకరోజు సరదాగా గడుపుదాము అని సెలవు ఆడిగితే పై వారి నుంచి సవాలక్ష ప్రశ్నలు ఎదురుకాగా కోరుకున్న సెలవు దొరకదు. ఈ క్రమంలో మనం మన పిల్లల ఎదుగుదల చూడలేకపోతున్నాం. పండుగలు, పబ్బాలు, శుభ కార్యాలకు హాజరు కాలేక అయిన వాళ్లకు కాని వాళ్లకు అందరికీ దూరం అవుతున్నాం. ఇంత చేస్తున్నా మనం పని చేసే మీడియా సంస్థల నుండి మనకు ఏ విధమైన గుర్తింపు రాకపోగా పై వారి నుండి చీదరింపులు, ఛీత్కాతాలు, అవమానం, వ్యక్తిత్వాన్ని చంపుకోవడం అయినా సరే అవే మహా ప్రసాదాలుగా మనం జర్నలిజంకు కట్టుబడి ఉన్నాం. ఈ విధానాల్లో మార్పు రావాలి. జర్నలిస్ట్‌లు కూడా స్వేచ్ఛా జీవితం అనుభవించాలి. పై స్థాయిలో ఉన్నవారు గ్రామీణ విలేకరులను, స్ట్రింగర్స్‌ని గౌరవించి దూషణలు, వత్తిడులకు గురి చేయకుండా చక్కగా వివరించి ఓర్పు, నేర్పుతో పని చేయించుకునే రోజు రావాలి అని కోరుకుందాం.

## తెలుగు మీడియా రంగంలో మార్పులు రావాలి

ఇప్పటికే మన తెలుగు మీడియా రంగం హద్దులు దాటిపోయింది. రోజుకో పత్రిక, రోజుకో ఛానల్ పుట్టుకొస్తున్నాయి. ఉన్న వాటికే చాలా వరకు ఆదరణ లేకపోగా ఏదో

రకంగా మనుగడ సాగిస్తున్నాయి. ఈ క్రమంలో కొత్తగా ఒక పేపరు కానీ, చానెల్ కాని పెట్టాలంటే పెట్టుబడే కాకుండా, సదరు వ్యక్తీ లేక వ్యక్తులు కనీసం ఒక పది సంవత్సరాలు విలేఖరులు గానో, సంపాదకులుగానో పనిచేసి ఉండితీరాలన్న నియమం పెడితే కొద్దో గొప్పో తాము చేస్తున్న పని గురించి తెలిసిన వాళ్ళు యజమానులుగా ఉండే ఆవకాశం ఉంటుందని నా అభిప్రాయం. ఊరికే చేతులో డబ్బులు పట్టుకుని బడ్డికొట్టు పెట్టినట్టు పేపర్లు చానెళ్ళు పుట్టగొడుగుల్లా పుట్టకుండా ఉంటాయి. ఎవరికీ బడితే వారికి పత్రిక, ఛానల్స్ నిర్వహించేందుకు లైసెన్స్‌లు ఇవ్వరాదు. ఈ విధానంలో ఆర్ ఎన్ ఐ కఠిన నియమాలు పాటించాలి.

## పత్రికలు, ఛానల్స్ ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఉండాలి

గతంలో ఇందిరాగాంధి పరిపాలనలో అప్పటి పరిస్థితుల పై ఆమెను ఉద్దేశించి “ఓ స్త్రీ రాక్షసి” అనే కథనం రాశారు. కవి, రచయిత, మోస్ట్ సీనియర్ జర్నలిస్ట్ నార్ల వారు అప్పుడు ఆయనకు ఎదురైన ఓ సంఘటనలో మాట్లాడుతూ పత్రికారంగంపై ఎంతో అనుభవంతో ఒకమాట అన్నారు. పత్రికా వ్యవస్థాపకుడు, పత్రికా సంపాదకులు ఒక్కరే అయితే ఆ పత్రిక నిర్భయంగా నిజాలు రాస్తుంది అని, అదే వ్యవస్థాపకుడు, సంపాదకులు వేరు వేరు అయితే ఆ పత్రిక నిజాలు వెల్లడించలేదు అన్నారు. అయితే స్వాతంత్ర్యం ముందు ఒక క్రమపద్ధతిలో పత్రికలు నడిచేవి. ఇక ప్రస్తుత పత్రికలు ధోరణి వేరుగా ఉంది అని మనం గ్రహించాలి. ఓ ప్రధాన పత్రిక రాష్ట్ర ప్రజలకు సామాజిక భద్రత కల్పిస్తామని చెప్పి అనంతరం కొంత కమర్షి యల్ యాంగిల్‌తో యాడ్స్‌ను ప్రమోట్ చేసింది. అలాగే ఓ రెండు అక్షరాల పేరుగల వారు రంగ ప్రవేశంతో సదరు పత్రికకు జర్నలిస్ట్‌లు యాడ్స్ తెచ్చి జీతాలు తీసుకోండి అనే విధానానికి తెర లేపింది. అలా పత్రికలు, ఛానల్స్ కమర్షియల్ దొరణిలోకి వెళ్ళి నేటి తెలుగు మీడియారంగం మొత్తం దాదాపు వ్యాపార ధోరణికి అలవాటు పడ్డాయి. ప్రస్తుతం మనం చూస్తున్న మీడియా అంతా ఇదే ధోరణిలో ఉంది. రాబోవు ఛానల్స్, పత్రికలు ఈ ఆలోచనతోనే పురుడుపోసుకునేందుకు రిజిస్ట్రేషన్ కోసం ఢిల్లీలో పైరవీలు చేస్తున్నాయి. మీడియారంగం ఇలా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యానికి ఎదురుదెబ్బ.

## జర్నలిస్ట్‌లకు జీతాలు అందించని కొన్ని మీడియా సంస్థలు

ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించేందుకు వస్తున్నామని చెప్పి వచ్చాక కొన్ని మీడియా సంస్థలు ప్రస్తుతం అవలంభిస్తున్న తీరు జర్నలిస్ట్‌లకు శాపంగా మారుతుంది. ఎన్నో ఆశలుతో మీడియాపై ఆశక్తి కలిగి పలు పత్రికలు, ఛానల్స్‌లో పని చేస్తున్న మన జర్నలిస్ట్‌ల బతుకులు ప్రశ్నర్థకంగా మారాయి. ఇంతకు ముందు చెప్పినట్టు జర్నలిస్ట్‌లకు జీతాలు ఇవ్వాలి అంటే పత్రికకు యాడ్స్ తెచ్చిపెట్టి కమీషన్ రూపంలో జీతాలు తీసుకోండి అనే ధోరణిలోనే పలు

పత్రికలు ఉంటే, కొన్ని మీడియా ఛానల్స్ సుదీర్ఘకాలంగా తమ వద్ద పనిచేసే జర్నలిస్ట్‌లకు నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో విసుగుచెందిన జర్నలిస్ట్‌లు యాజమాన్యాల తీరుకు నిరసనగా ఆయా మీడియా ఆఫీసుల ముందు నిరసనలు వ్యక్తం చేసిన సంఘటనలు కో కొల్లలు. చివరికి జీతాలు రాక మీడియారంగం మానేసి వేరే రంగాల వైపు వెళ్లిన జర్నలిస్ట్‌లు ఎందరో ఉన్నారు. మరికొందరు మీడియాపై ఆశక్తి తగ్గక ఏదో గుడ్డిలో మెల్లలా మళ్లీ అదే తప్పు చేస్తూ వేరే ఛానల్స్, పత్రికలకు వెళుతున్నారు. ఈ వరుసలో కొన్ని ఛానల్స్ ఉంటే నేను అనే ఇంగ్లీషు అక్షరం కలిగిన ఓ ఛానల్ ఉద్యోగులు తాము పని చేస్తున్న న్యూస్ ఛానల్ జీతాలు చెల్లించడంలేదని మానవ హక్కుల కమీషన్‌కి ఫిర్యాదు చేయటం జరిగింది.


## జర్నలిస్ట్‌ల ఈ.ఎస్, ఐ, పీ.ఎఫ్ ల మాటేమిటి...?

అన్ని పత్రికలు, అన్ని ఛానల్స్ కాదు గానీ కొన్ని పత్రికలు, ఛానల్స్ అవలంభిస్తున్న తీరు మరీ దారుణం. ఆయా ఛానల్స్, పత్రికల్లో గుర్తింపు కలిగిన జర్నలిస్ట్ ప్రతినిధులకు చెల్లిస్తున్న జీతాల్లో పీ.ఎఫ్ కటింగ్, ఈ.ఎస్.ఐ కల్పిస్తామని చెపుతు ఆ విధానాలను అవలంభించని కొన్ని మీడియా సంస్థల తీరును జర్నలిస్ట్‌లు తెలుసుకోవాల్సి ఉంది. జర్నలిస్ట్‌గా వృత్తి మానేసినా, పీ.ఎఫ్ అవసరం అయ్యి విత్ డ్రా చేసుకోవాలని ప్రయత్నం చేసిన జర్నలిస్ట్‌లకు షాకింగ్ న్యూస్. పీ.ఎఫ్ విత్ డ్రాకి వెళ్ళినప్పుడు సంభంధిత జర్నలిస్ట్ ఖాతాలో ఏ విధమైన నగదు లేక పోవడం, లేదా సంబంధిత జర్నలిస్ట్ ఆధార్ గానీ, ఫోన్ నంబర్ గానీ లింక్ చేయకపోవడం వంటి సమస్యలు జర్నలిస్ట్‌కి తలెత్తుతాయి. అసలు విషయం ఏమిటంటే కొన్ని టెక్నీకల్ సమస్యలు, లేదా ఆయా సంస్థ అసలు పీ.ఎఫ్ జమ చేయకపోవడం జరిగి ఉండవచ్చు అనే అనుమానాలు కొద్దిమంది సీనియర్లకు కలుగగా, మరికొంత మంది జర్నలిస్ట్‌లకు ఇప్పటికే అనుభవం కలిగి ఉంటుంది. కాబట్టి ఇప్పుడు మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్ట్‌లు దీనిపై ఒక క్లారిటీ తీసుకోండి. ఆ ఇంగ్లీషు అక్షరం పేరుగల ఛానల్, నేను న్యూస్ జర్నలిస్ట్‌ల పీ.ఎఫ్ నగదు ఆయా సంస్థ బొక్కేసినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. విషయం గ్రహించిన జర్నలిస్ట్‌లు ఆయా సంస్థలు తమ సంస్థలపై కోర్టులు, కేసులకు వెళ్లకుండా ఇవి బయటకురాకుండా ఉండేందుకు జర్నలిస్ట్ ఆయా సంస్థలో మానివేసే సమయంలో ముందు జాగ్రత్తగా అతని వద్ద ఉన్న ఐడీ కార్డు, సంస్థ ఇచ్చిన సిమ్ కార్డు, బస్‌పాస్ అన్నీ సరెండర్ చేయాలని వాటిని స్వాధీనం చేసుకుంటారు. అనంతరం తనకు జరిగిన అన్యాయం, మోసంపై కోర్టు, కేసులకు వెళ్ళకుండా జర్నలిస్ట్‌ల వద్ద ఏ విధమైన ఆధారాలు లేకుండా లాగేసుకుంటారు.

మా జర్నలిస్ట్ మిత్రులు జర్నలిజానికి ప్రేమించి, ప్రేమించి ఆయా సంస్థల ద్వారా ఎన్ని ఒత్తిడీలు ఉన్నా ప్రాణం పోయేవరకు జర్నలిజం వృత్తికి కట్టుబడే ఉన్నారు. మా కళ్లెదుటే మా నియోజకవర్గంలో నాకు పరిచయం, అత్యంత సన్నిహిత జర్నలిస్ట్ మిత్రులు జర్నలిజానికి అంకితమై ప్రాణాలు విడిచారు. మంగళగిరిలో సీనియర్ జర్నలిస్ట్ (1) చెన్నా అజయ్ కుమార్. (2) వేజెండ్ల రాధా, తుళ్ళూరులో (3) రమేష్, (4) కాటా శేషు చౌదరీ తాడేపల్లిలో (5) సురేష్ ఇలా నలుగురు ఆరోగ్యం క్షీణించి మరణిస్తే, ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. మరణించిన ఐదుగురు ఆర్థికంగా స్థితిమంతులు కాదు. కానీ జర్నలిజంలో చాలా ఉత్సాహవంతులు. జర్నలిజానికి కట్టుబడి తీవ్ర అనారోగ్యానికి గురై సమయానికి చేతిలో డబ్బులేక ప్రాణాలు విడిచారు. జర్నలిస్ట్ హెల్త్ కార్డులు ఉండి కూడా అవి ఉపయోగపడక, సుదీర్ఘకాలంగా తాము ఎంచుకున్న మీడియా సంస్థలు వారికి చివరిలో ఏ విధంగా ఉపయోగపడలేదు. జర్నలిజానికి అంకితమై వీరు పని చేసిన మీడియా సంస్థలకు వెట్టిచాకిరి చేసి ప్రాణాలు పోయే దాకా జర్నలిజంలో ఉన్నందుకు దక్కిన ఫలితం ఏమీలేదు. ఇందులో మృతుడు అజయ్ కుమార్ ఫ్యామిలీకి మా ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణా రెడ్డి ఆర్థిక భరోసా, కుటుంబానికి ఇంటి స్థలం, పిల్లల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకున్నారు. అలాగే మిత్రడు సిటీ కేబుల్ రాధాకి ఆయన యాజమాన్యం దహన సంస్కారాలకు కొంత నగదు చెల్లించారు. ఇక మా జర్నలిస్ట్ మిత్రులకు ఆరోగ్యం క్షీణించిన, ఇబ్బందుల్లో ఉన్న మాకు మేముగా అలాంటి పరిస్థితుల్లో ఉన్న జర్నలిస్ట్ మిత్రులకు మంగళగిరి జర్నలిస్ట్ అసోసియేషన్, తాడేపల్లి జర్నలిస్టుల, కొద్దోగొప్పో దుగ్గిరాల మీడియా మిత్రుల సహకారం ఉంటుంది. ఇలా మా ప్రస్థానంలో ఆరోగ్యం క్షీణించి ఆర్థిక ఇబ్బందిలో ఉన్న చివరి దశలో నియోజకవర్గ మీడియా మిత్రుల సహకారం లభిస్తుంది. మా జర్నలిస్టుల సహకారం, ఐక్యత, అభిమానం చూస్తే నాకు చాలా గర్వ కారణంగా ఉంది.

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

# 3. జర్నలిస్ట్‌ల సంక్షేమం 'ఎండమావులే' - (1)




HOPE FOR ALL

**"జర్నలిస్టులను ఏ ప్రభుత్వాలైనా సరే ఉపయోగించుకోవాల్సిన విధంగా ఉపయోగించుకుంటున్నాయి. పైగా సత్తుపైసాకి పనికిరాని సంక్షేమాన్ని చూపి జర్నలిస్టులకు ఎన్నో చేసాం అని చెప్పుకునే మన ప్రభుత్వాలు గుండె మీద చెయ్యేసుకుని బహిరంగ చర్చకు రావాలి"**

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

రాష్ట్రంలో జర్నలిస్ట్‌ల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాలు అన్నీ ఎండమావులుగా ఉన్నాయి. జర్నలిస్టుల సంక్షేమం కోరుతూ ప్రవేశ పెట్టిన పథకాలు అన్నీ జర్నలిస్ట్‌లకు పూర్తి స్థాయిలో అందటంలేదు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో మన సంక్షేమ పథకాలు అందుకోవటంలో జర్నలిస్ట్‌లు చాలా వెనుకబడి ఉన్నాం. జీతాలు లేక, ఉద్యోగ భద్రత లేక మీడియా యాజమాన్యసంస్థలు నుండి ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలతో జర్నలిస్ట్ సంక్షేమ పథకాలు మనకు అందని ద్రాక్షల్లా మిగిలిపోయాయి. వీటిని అందుకోవడం కోసం మన జర్నలిస్ట్ సంఘాలు ఎంతో కృషి చేస్తున్న వాటికి మన జర్నలిస్ట్‌లు దూరమయిపోతున్నాం. మన సంక్షేమంపై దృష్టి సారించని మనం మన మీడియా సంస్థలకు మాత్రం యాడ్స్ రూపంలో లక్షలు, లక్షలు కూడబెడుతున్నాం. ఎక్కడన్నా ఒక 500/-, 1000/- రూపాయలు తీసుకుంటే మాత్రం అవినీతి పరులుగా మిగిలిపోతున్నాం. ఇప్పటికీ ఎవరైనా ప్రెస్‌మీట్ అనంతరం కవర్ అందిస్తే ఆ కవర్ అందుకోవటానికి భయపడే జర్నలిస్ట్‌లు కొందరు ఉన్నారు. కనీస సంక్షేమ పథకాలు అందుకోలేక నిత్యం ఆర్థిక బాధలు తట్టుకోలేక అసలు ఈ వృత్తిలో ఎందుకు కొనసాగుతున్నామో మనకే తెలియని మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. సభ్య సమాజంలో పౌరులకు మనం ఎంతో ఆర్థిక స్థితి మంతులమని, గౌరవ మర్యాదలు అందుకునే వ్యక్తులమనే అభిప్రాయం ఎంతోమందికి ఉంది. వారు అనుకున్నట్లు మనం ఆర్థికస్థితి మంతులం కాదని, గౌరవ మర్యాదలు ఒకప్పుడు ఉండేవిగానీ ఈ రోజు ఆ గౌరవ మర్యాదలు జర్నలిస్ట్‌లకు లేవు అని అందరూ తెలుసుకోవాలి. దీనికి కారణం మన మీడియా సంస్థలు వ్యవహరిస్తున్న తీరు.ఎక్కడో ఒకరు, ఇద్దరు మీడియాను అడ్డంపెట్టుకుని అపారమైన ఆస్తులు సంపాదిస్తే అందరూ అలానే ఉన్నారు అనుకోవడం పొరపాటు. మీడియా సంస్థలుగానీ, ప్రభుత్వంగానీ మా మీద చూపే ప్రేమాభిమానాలు శూన్యం అని ప్రజలు తెలుసుకోవాలి. జర్నలిస్ట్‌ల జీవన విధానం, వృత్తి ప్రయాణం కటిక చీకటిలో గుడ్డి కన్ను ప్రయాణంలా ఉంది. ఏ ప్రభుత్వం వచ్చిన జర్నలిస్టులను ఉద్ధరించేది ఏమీ లేదు. రోజు వారీ కూలీ, బడ్డి కొట్టు పెట్టిన వ్యక్తుల జీవితాలతో సైతం మా జీవితాలు సరితూగటం లేదు. జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పే ప్రభుత్వాల మాటలన్నీ ఉత్తుత్తివే, అవన్నీ నీటి మీద రాతలు మాత్రమే. జర్నలిస్ట్ సంక్షేమం కోసం ఇవన్నీ మనం కష్టపడి సాధించాలి. వీటి కోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక చట్టాలు అమలు పరిచేలా కృషి చేయాలి.

## ప్రభుత్వం, మీడియా సంస్థలు జర్నలిస్ట్‌లకు అందిస్తున్న, అందించాల్సిన సంక్షేమ పథకాలు

## వాటి తీరు

1) అక్రిడేషన్.
2) ఇళ్ళ స్థలాలు, ఇంటి నిర్మాణం.
3) జర్నలిస్ట్ హెల్త్ కార్డ్స్.
4) ప్రమాద భీమా.
5) జర్నలిస్ట్ పిల్లలకు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ.
6) ప్రయాణ సౌకర్యం. (బస్ పాసులు)
7) పెట్రోల్ అలవెన్స్, ఇతర ఖర్చులు.
8) జర్నలిస్టుల పీ.ఎఫ్,పై ప్రభుత్వ నిఘా
9) జర్నలిస్టుల అంత్యక్రియలకు మీడియా సంస్థలు ఆర్థికసాయం చేయాలి.
10) జర్నలిస్ట్ వాహన కొనుగోలుకు ఫైనాన్స్ సహకారం ఉండాలి
. 11) ఫిల్మ్ జర్నలిస్టుల భద్రత కోసం
12) బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజం

## "అక్రిడేషన్స్ విధి, విధానాలు"[1]

మీడియా సంస్థల్లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో అక్రిడేషన్ సమస్య ఒకటి. మీడియా సంస్థలు తమ సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికి అక్రిడేషన్స్ అందటం లేదు. వార్తలు దమ్ముగా రాయగలిగి ఉండి కూడా ఆయా మీడియా సంస్థల నుండి ప్రభుత్వం నుండి అక్రిడేషన్స్ అందక నాన్ జర్నలిస్టులుగా మిగిలిపోతున్నారు. కొన్ని సమయాల్లో అక్రిడేషన్స్ లేక కొన్ని ప్రోగ్రామ్స్‌కి హాజరు కాలేక సమయానికి వార్తలు అందించలేక పలురకాల ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అక్రిడేషన్స్‌తో వ్యాపారం చేయడం వల్ల నిజమైన జర్నలిస్టులు ఇబ్బందుల పాలవుతున్నారు. దీనికి కారణం ప్రభుత్వం ఓలెక్క ప్రకారం ఇచ్చే అక్రిడేషన్స్‌ని తమ అనుయాయులకు, బంధువులకు, స్నేహితులకు అమ్ముకోవడం వల్ల నిజమైన జర్నలిస్టులు ఇబ్బందుల పాలవుతున్నారు.

## "జర్నలిస్టులకు అక్రిడేషన్లు కొలమానం కాదు"[2]

పోలీసులు స్పెషల్ డ్రైవ్ జరిపి అక్రిడేషన్ల కార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలను ఆపి తనిఖీ చేసి ప్రెస్ అని స్టిక్కర్ వేసుకున్న వాహనదారులకు అక్రిడేషన్



*Source Internet :* 1. 'అక్రిడేషన్స్ విధి,విధానాలు'[1] 2. 'జర్నలిస్టులకు అక్రిడేషన్లు కొలమానం కాదు'[2]

లేకుండా ప్రెస్ స్టిక్కర్ వేసుకోకూడదని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వస్తున్న వార్తల పట్ల గతంలో అల్ ఇండియా న్యూస్ పేపర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు సిహెచ్. పూర్ణచంద్రరావుగారు ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

వాస్తవానికి అక్రిడేషన్ కార్డ్‌ని ప్రభుత్వం ఒక్కొక్క మీడియాహౌస్‌లో కొంత మందికి మాత్రమే నిబంధనలకు లోబడి జారీ చేస్తుందని, అయితే అదే ప్రెస్ స్టిక్కర్ వేసుకోవద్దనేందుకు ఏ కొలమానం లేదని, ఆయా మీడియాహౌస్‌లు జారీ చేసిన ఆ సంస్థ గుర్తింపులో జర్నలిస్ట్ గుర్తింపు కార్డ్‌ని పోలీస్, రెవిన్యూ, ఇతరశాఖల ఉద్యోగులకు మాదిరి కలిగి ఉన్న జర్నలిస్టులను ఆ సంస్థ జారీచేసిన గుర్తింపు కార్డుని తనిఖీ చెయ్యాలి గాని అక్రిడేషన్ల ప్రధానం కాదన్నారు. అసలు అక్రిడేషన్ కార్డ్ మీదే  అనే నిబంధన ఉంటుందని పైగా ఇది కలిగి ఉన్నవారు ప్రభుత్వ గుర్తింపు కలిగియున్నట్లు కూడా ఎక్కడా పేర్కొనకూడదు అన్న నిబంధన ప్రభుత్వ (ఐ & పి.ఆర్.) జి.ఓ. లో కూడా పేర్కొనబడి ఉంటుంది. అలాంటి అక్రిడేషన్ల కార్డు లేని జర్నలిస్టులను ఇబ్బంది పెట్టకుండా సంస్థ ఇచ్చిన గుర్తింపు కార్డులు ప్రమాణంగా తీసుకోవాలన్నారు. ఒకవేళ తనిఖీ చేసిప్పుడు ఆ గుర్తింపు కార్డులు నకిలీవి అయినా, ఒకవేళ ఆ సమయంలో సంస్థ గుర్తింపు కార్డు చూపించలేకున్నా అలాంటి వారి స్టిక్కర్లు తొలగించవచ్చని పూర్ణచంద్రరావు విజ్ఞప్తి చేశారు.

అక్రిడేషన్లు అనేవి కొన్ని ప్రభుత్వ సౌకర్యాలు పొందేందుకు గుర్తింపు తప్ప జర్నలిస్ట్ వృత్తికి కొలమానం మాత్రం కాదని ఆయా మీడియా సంస్థలు జారీచేసే గుర్తింపు మాత్రమే అని పేర్కొన్నారు. ఈ క్రమంలో  కొందరు తమ వాహనాలపై ప్రెస్ స్టిక్కర్ వేసుకుని నిజమైన జర్నలిస్టులకు,అక్రిడేషన్ లేని జర్నలిస్ట్‌లకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇటువంటి వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం మంచిదే. కనీసం అక్రిడేషన్ లేక పోయినా సంస్థ గుర్తింపు కార్డు అయినా జర్నలిస్ట్ కలిగి ఉండాలి. చాలా మీడియా సంస్థలు తమ సంస్థకు పని చేసే జర్నలిస్ట్‌కు ఐడీ కార్డ్స్ ఇవ్వాలి అనే ఇంగితజ్ఞానం సంస్థలకు ఉండాలి. నకిలీ ఐడీ కార్డులతో మనుగడ సాగిస్తున్న కొందరు నకిలీ విలేకరుల ఆట కట్టించాలి అంటే ఒక నిర్దిష్టమైన ప్రణాళికలతో తమ సంస్థలో పనిచేసే ప్రతి విలేకరుకు గుర్తింపు కార్డు ఇచ్చేలా మీడియా సంస్థలు ఐడీ కార్డు లేని జర్నలిస్టుల సమస్య పరిష్కరించే దిశగా ఆలోచన చెయ్యాలి.

ఎవడో గొట్టంగాడు తెలియదుగానీ వాడికి అక్రిడేషన్ ఉంటుంది. వాడి పేపర్ ఏదో, ఛానల్ ఏదో తెలియదు. పలు వ్యాపారాలు చేసుకునే వారికి అక్రిడేషన్ ఉంది అంటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. అక్రిడేషన్ అడ్డంపెట్టుకొని సమాజంలో వాడు చేసే అక్రమాలు,

అన్యాయాలు నిజంగా వార్తలు రాసే జర్నలిస్టులకు అక్రిడేషన్స్ లేకపోవడం చాలా బాధాకరం. నిజమైన జర్నలిస్టులను కాదని ఇలా వ్యాపారాలు చేసుకునే వారికి అక్రిడేషన్స్ వస్తున్నాయి అంటే మన మీడియా సంస్థలు, కొందరు లోపాయికారీ వ్యక్తులు చేస్తున్న తప్పు అని మనం తెలుసుకోవాలి. ఈ విధానంలో మార్పు రావాలి అంటే అక్రిడేషన్స్‌ని కూడా విభజించాలి.

## "జర్నలిస్టులను కేటగిరీలుగా విభజన చేయాలి"...?[3]

ముందు చెప్పుకున్నట్లు జర్నలిస్ట్‌లకు అక్రిడేషన్ కొలమానం కాదు కానీ ప్రస్తుతం మీడియా వ్యవస్థల తీరు, ఏ ప్రామాణికం లేకుండా జర్నలిజంలోకి వస్తున్న ఎంతోమంది వ్యక్తులను నివారించేందుకు ప్రభుత్వం కొన్ని విధానాలను పాటించే దిశగా పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విధానం కూడా ఒకందుకు మంచిదే. గతంలో ఎన్నడూలేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రిడేషన్ జారీ విషయంలో కేటగిరీల విభజన చేపట్టినట్టు ఆ నోటా, ఈ నోటా వినిపిస్తుంది. పోలీసులు అన్ని జిల్లాల్లో జర్నలిస్టుల లిస్ట్ తీసుకుని ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించారని సమాచారం. దీంతో రాష్ట్రంలోని జర్నలిస్టుల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం ఆ నివేదికను బట్టి ఎటువంటి చర్యలు తీసుకుంటోందనే విషయం ఇప్పుడు ఏపి జర్నలిస్టుల్లో చర్చనీయాంసంగా మారింది. ప్రస్తుతం అందుతున్న సమాచారాన్ని బట్టి జర్నలిస్టుల కోసం వివిధ జిల్లాల నుంచి జిల్లా పౌరసంబంధాల అధికారి, పోలీసుల నుంచి ప్రభుత్వానికి విడివిడిగా నివేదికలు ఇచ్చినట్లు ప్రభుత్వానికి అందిన నివేదికల ప్రకారం జర్నలిస్టులకు ఇచ్చే అక్రిడేషనీలను నాలుగు రకాలుగా విభజించినట్లు కొన్నాళ్ళుగా ప్రచారం జరిగింది.

## "గ్రీన్ కలర్ అక్రిడేషన్"[4]

దీనికి జర్నలిజం రంగంలో పిజి తప్పని సరిగా ఉండాలి. దాంతో పలు పత్రికల ఆర్గనైజేషన్‌లో నిర్వహించిన జర్నలిజం కోర్సు చేసి 15 సంవత్సరాలు తక్కువ కాకుండా జర్నలిజంలో అనుభవం ఉండాలని ఇటువంటి వారికి నేరుగా అక్రిడేషన్ ఇస్తారని, పోలీసు వెరిఫికేషన్ ఉండనవసరం లేదని ఒకవేళ వీరు ఇప్పుడు ఏ పత్రికలో గానీ ఛానల్లో గాని విధులు నిర్వహించక పోయినా, తాత్కాలికంగా వారికి అక్రిడేషన్ మంజూరు చేస్తారని ఆరు నెలల లోపు ఏదో ఒక పత్రిక మీడియా సంస్థలో చేరితే నిబంధనల ప్రకారం అక్రిడేషన్ కొనసాగిస్తారని, లేదంటే డిపిఆర్వో విచక్షణ మేరకు తొలగించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తుంది.



*Source Internet :* 3. 'జర్నలిస్టులను కేటగిరీలుగా విభజన చేయాలి'...?[3] 4. 'గ్రీన్ కలర్ అక్రిడేషన్'[4]

## “ఎల్లో కలర్ అక్రిడేషన్”[5]

దీనికి ఏదైనా డిగ్రీ ఉండి జర్నలిజంలో 10 ఏళ్ల అనుభవం ఉన్నవారు అర్హులుగా గుర్తించి వీరికి అక్రిడేషన్ ఇచ్చేందుకు పోలీస్ వెరిఫికేషన్ ఉంటుందని అక్రిడేషన్ ఇచ్చినప్పటి నుంచి వీరిపై నిఘా ఉంటుందట! ఎటువంటి వివాదాల జోలికి వెళ్లినా పత్రిక, మీడియా పేరుతో హడావుడి చేసినా వెంటనే వీరి అక్రిడేషన్ రద్దవుతుందని తిరిగి అక్రిడేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి మూడేళ్లు వేచి ఉండాలని ఏదైనా ప్రముఖ ఆర్గనైజేషన్‌లో జర్నలిజంలో డిప్లొమా చేసిన వారు ఈ కోటా కిందకు వస్తారు అన్నట్లు సమాచారం.

## “వైట్ కలర్ అక్రిడేషన్”[6]

డిగ్రీ లేకుండా స్టాఫ్ రిపోర్టర్లుగా చలామణి అవుతున్నవారు, జిల్లాల్లోని మండల స్థాయిలో పనిచేసే కంట్రిబ్యూటర్లు, రెగ్యూలర్‌గా ప్రింట్ అయ్యే చిన్న పత్రికల వారు ఈ తెలుపు రంగు పరిధిలోకి వస్తారు. వీరికి అక్రిడేషన్ ఇచ్చేందుకు పోలీస్ వెరిఫికేషన్‌తో పాటు పని చేస్తున్న సంస్థ నుంచి లెటర్ తప్పనిసరి అవసరం. డిగ్రీ లేకపోయినా ఎందుకు తీసుకున్నారో పత్రికా యాజమాన్యం అఫిడవిట్‌ను ఇవ్వాల్సి ఉంటుందని అలాగే ఎటువంటి అనైతిక చర్యలకు పాల్పడమని సొంతంగా అపిడవిట్ దాఖలు చేయాలని వీరిపై నిరంతరం వీరు నివసించే ప్రాంతానికి సంబంధించిన పోలీస్ స్టేషన్ పరిధిలో మానిటరింగ్ ఉంటుందని నెలకొసారి వీరి కార్యకలాపాలపై  జిల్లాలో ఎస్పీకి నగరంలో ఐతే సీపికి ఎస్బీ విభాగం నివేదికలు ఇస్తుంటుందని ఎప్పుడైనా వీరిపై ఆరోపణలు వస్తే వెంటనే వీరి కార్డును రద్దు చేయనున్నట్టు 5ఏళ్ల వరకూ అక్రిడేషన్ పొందేందుకు అనర్హులవుతారన్నట్లు తెలుస్తుంది.

## “రెడ్ కలర్ అక్రిడేషన్”[7]

జర్నలిజంను అడ్డుపెట్టుకుని సంఘ విద్రోహ శక్తులకు సహకరించే వారిని ఈ కోటాలో ఉంచుతున్నట్టు వీరికి అక్రిడెషన్ అనేది మంజూరు కాదని, కానీ వీరందరిని గుర్తించి నగరంలో ఐతే సీపీ దగ్గర, జిల్లా పరిధిలో ఐతే ఎస్పీ దగ్గర వీరికి సంబంధించిన రికార్డును మెయిన్‌టెయిన్ చేస్తారని, వీఐపీల పర్యటనల సమయంలో వీరిపై ప్రత్యేక నిఘా ఉంచుతారని, వీరికి వీఐపీల పర్యటన కవరేజ్ అవకాశం ఉండదని, ఈ పరిధిలోకి ప్రధానంగా సోషల్ మీడియా రిపోర్టర్ల పేరుతో హడావుడి చేస్తున్నవారు ఉంటారని ముఖ్యంగా యూ ట్యూబ్ చానెల్స్, ఆన్ లైన్ పోర్టల్స్ నిర్వహించేవారు, కేవలం వాట్సప్‌లోనే పేపర్ పోస్టింగ్‌లు చేసేవారు ఈ కోవలోకే వస్తారని ముఖ్యంగా యూ ట్యూబ్ చానెల్స్ మొత్తాన్ని కంట్రోల్ చేసేందుకు రెడ్‌కలర్ అక్రిడేషన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరికి అక్రిడేషన్ అంటూ ఉండదు. వారిని ఆ పేరుతో ప్రత్యేకంగా మానిటరింగ్ చేసేందుకు ఉద్దేశించారు.



*Source Internet :* *5. 'ఎల్లో కలర్ అక్రిడేషన్'[5] 6. 'వైట్ కలర్ అక్రిడేషన్'[6] 7. 'రెడ్ కలర్ అక్రిడేషన్'[7]*

ఇవి కేవలం బయటకు వచ్చిన కొన్ని అంశాలు మాత్రమే. వీటికి మరిన్ని హంగులు చేర్చేందుకు ఐ అండ్ పీఆర్ ఏర్పాట్లు చేస్తున్నట్లు కూడా ఓ సమాచారం. నాలుగు కార్డుల వ్యవస్థకు సీఎం నుంచి ప్రాధమికంగా అంగీకారం తెలిపినట్లు భోగట్టా! ఐతే వీటిని మరింత అభివృద్ధి చేసి పంపాలని సీఎంఓ ఆదేశించింది అని సోషల్ మీడియా చానెల్స్ పై మరింత కసరత్తు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఇక ఈ కార్డుల వ్యవహారంపై అమరావతిలో ఇప్పటికే జర్నలిస్ట్ సంఘాల యూనియన్ నేతలు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. గ్రేడింగ్ చేసే కార్డుల విధానానికి స్వస్తి చెప్పి ఇప్పటిలాగే అందరికి ఒకే విధమైన కార్డులు ఇవ్వాలని నేతలు కోరుతున్నట్లుగా తెలుస్తోంది. ఐతే ఇప్పుడు తయారైన విధివిధానాల కంటే మరిన్ని కఠినమైన విధానాలు రూపొందించేందుకే ప్రభుత్వం ముందుకు వెళుతున్నట్లు మరో సమాచారం. ఏది ఏమైనా అక్రిడేషన్ల విధానంలో ప్రభుత్వం చేయదలచుకున్న మార్పుల పై సర్వత్రా నిరసన వ్యక్తమౌతోందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని ఒక రకంగా ఈ నాలుగు రకాల అక్రిడేషన్ విధానాన్ని కేవలం పరిశీలనలో కాక తప్పకుండా అమలు చేస్తే జర్నలిజం విలువలు పెరగడమే కాకుండా విలువలు కలిగిన జర్నలిస్టులు మాత్రమే ఈ వృత్తిలోకి వచ్చే అవకాశం ఉంటుంది అని మరికొందరు జర్నలిస్టుల ఆలోచన. ఈ విధానాలకు నిజమైన జర్నలిస్టులు సాదరంగా స్వాగతం పలకాలి. ఇలాంటి విధానం అమలు చేయాలి అని మన జర్నలిస్టులందరం కోరుకుందాం.విలువలు కలిగిన జర్నలిజం, జర్నలిస్ట్లను కాపాడుకోవడానికి ఈ విధానం మన జర్నలిస్ట్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.అయితే ఈ విధానం ప్రవేశపెట్టాలి అంటే ప్రభుత్వం జర్నలిస్ట్ సంఘాల నేతలను, కొంతమంది సీనియర్ జర్నలిస్టుల అభిప్రాయాలు తీసుకుని వారి ఆమోదం మేరకు వ్యవహరిస్తే మంచిది.

నోట్ : (కేవలం ఈ అక్రిడేషన్ ప్రక్రియ విధి, విధానాలు సమాచారం తెలియజేసేందుకు మాత్రమే లిఖించబడింది). 2023లో ఏ.పి. రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించినట్లు సమాచారం. అయినతే ఈ విధానం చాలా జాగ్రత్తగా అన్నీ పరిశీలించి, జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

## జర్నలిస్ట్ లకు ఇళ్ళ స్థలాలు,ఇంటి నిర్మాణం.

రాష్ట్రంలో ఎంతో మంది జర్నలిస్టులు ఏళ్ళ తరబడి జర్నలిజం వృత్తిలో ఉన్నా నేటికీ ఇళ్ళ స్థలాలు సాధించలేక ఇరుకు గదుల్లో,అద్దె ఇళ్ళల్లో జీవనం సాగిస్తున్నారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ళ స్థలం కేటాయింపు కోసం జీవో ఉండేది. కొన్నేళ్లుగా ఆ జీవో కోర్టుకు చేరి నేటికి పునరిద్ధరించబడలేదు. ఈ కారణంగా ప్రస్తుత జర్నలిస్ట్లు ఇళ్ల స్థలాల కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇళ్ల స్థలాల సాధన సాధ్యం కావడం లేదు. అయినప్పటికీ ఆయా

నియోజక వర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల సానుకూలత ఉన్న ప్రాంతాల్లో జర్నలిస్టులు అడపా దడపా ఎక్కడో ఒక చోట బీపీఎల్ కోటాలో ఇళ్ళ స్థలాలు సాధిస్తున్నారు. ఇది అన్ని ప్రాంతాల్లో సాధ్యపడటం లేదు. రాజధాని అమరావతి ప్రాంతంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య అసలు సాధ్యపడుతుందో, లేదో కూడా అర్థం కాని పరిస్థితి.ఏ ప్రభుత్వం వచ్చినా జర్నలిస్టులకు ఫలితం దక్కటం లేదు.

## జర్నలిస్ట్ల ఇళ్ళు, ఇంటి స్థలం కోసం అమరావతి హౌసింగ్ సొసైటీ ప్రయత్నం...?

రాజధాని అమరావతి ఏర్పడిన కొన్నాళ్ళకు నాటి టీడీపీ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళు, ఇంటి స్థలాల కోసం జర్నలిస్ట్లు సొసైటీగా ఏర్పడాలి అని సూచనలు చేయడంతో ఈ సొసైటీ ఏర్పడింది. కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన ఎంతో మంది జర్నలిస్ట్లు సొసైటీలో చేరి నాటి టీడీపీ ప్రభుత్వం తమ కలను సాకారం చేస్తుంది అని ఒకొక్కరు 23 వేలు సొసైటీకి చెల్లించారు.అనంతరం ఏ కారణాల వల్లనో అది సాధ్యపడలేదు. కానీ సొసైటీ వసూలు చేసిన నగదు మొత్తం సభ్యులకు పైసా తో సహా వెనక్కి తిరిగి ఇచ్చింది. అదే ఆ ప్రభుత్వం వసూలు చేసి ఉన్నట్లయితే పరిస్థితి వేరేలా ఉండేదేమో...? జర్నలిస్టులు చెల్లించిన డబ్బు వెనక్కి వచ్చేదో... లేదో....ఆ తరువాత అమరావతి పరిధిలో ఏ జర్నలిస్టులు ఇళ్ళ స్థలాల కోసం ఇళ్ల కోసం ప్రయత్నం చేయలేదు.

## "జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల కోసం వైసీపీ ప్రభుత్వం"[8]

జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక రాష్ట్రంలో ఏ పేదవాడు నాకు ఇళ్ళ స్థలం లేదు అని అనకూడదు అంటూ అంతకు ముందే 2019 లో తమ పార్టీ మ్యానిఫెస్టోలో జర్నలిస్టులకు అనువైన ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలు ఇస్తామని తమ మ్యానిఫెస్టోలో 18వ అంశంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎంతో మంది ఇది అమలు కావాలని ఆశగా ఎదురు చూశారు. అయితే నవంబర్ 2023 లో జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు అనే అంశం మంత్రిమండలి ఆమోదం పొందింది. అంతకు ముందు సి.యం. జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన శాసనసభ్యుల సమావేశంలో మంగళగిరి శాసనసభ్యులు శ్రీ ఆళ్ళ రామకృష్ణా రెడ్డి గారు ఈ అంశాన్ని లేవనెత్తడం జరిగింది. ఆయన మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో అన్ని అంశాలను పూర్తి చేయడం జరిగింది అని జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు అనేది కూడా మనం చేయగలిగితే దాదాపు మ్యానిఫెస్టోలో అంశాలన్నీ సంపూర్ణంగా పూర్తి అయినట్లు ఉంటుందని శ్రీ ఆళ్ళ రామకృష్ణారెడ్డి చర్చించినట్లు తెలుస్తుంది. ఈ చర్చ అనంతరం ఇదే అంశం మంత్రిమండలి సమావేశంలో అమోదం జరిగిందని భహిర్గతం అయినది. ఇక ఏది ఏమైనా



*Source Internet :* 8. 'జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల కోసం వైసీపీ ప్రభుత్వం'[8]

ఎన్నో ఏళ్ళుగా జర్నలిస్టులు ఎదురు చూస్తున్న ఇంటి స్థలాల సాకారం తీరబోతుందని జర్నలిస్టులు ఆనందపడ్డారు, ఈ ఆమోదం పట్ల ప్రభుత్వ తీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఇక వీలైనంత త్వరగా అర్హులైన జర్నలిస్టులు అందరికి ఈ ఫలం అందాలని కోరుకుందాం.

ఆయితే ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఇళ్ళ స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. 10-15 సంవత్సరాలుగా జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగి ఆరోగ్యం సహకరించక, ఇతర ఇబ్బందులతో వైదొలిగిన జర్నలిస్టులను కూడా ప్రత్యేకంగా గుర్తించి ఒక కాలపరిమితి ప్రకారం వారికి కూడా ఇళ్ళ స్థలాలు ఈ ప్రభుత్వం కేటాయించాలని కోరుకుందాం.

## జర్నలిస్ట్ హెల్త్ కార్డ్స్ ఉపయోగం

జర్నలిస్ట్ హెల్త్ కార్డ్స్‌కి అక్రిడేషన్ ప్రామాణికం కాదు అని ఎంతో గొప్పగా ప్రభుత్వాలు ఇస్తున్న హెల్త్ కార్డ్స్ కనీసం నాలుక గీసుకోవడానికి కూడా పనికి రావడం లేదు. హెల్త్ కార్డ్స్ వల్ల ఉపయోగం ఉంటుంది అని అప్పో, సోప్పో చేసి 1200/- రూపాయలు చెల్లించిన జర్నలిస్టులకు ఆ కార్డ్స్ చూసి మురిసిపోవటమే గానీ చాలా ఆసుపత్రుల్లో ఈ కార్డ్స్ పై జర్నలిస్టులకు అవసరమైన వైద్యం అందటం లేదు. ఒకవేళ ఏదో ఒక ఆసుపత్రిలో ఈ ఆవకాశం ఉంటే జర్నలిస్ట్‌కు వచ్చిన వ్యాధి ఆ కార్డు ద్వారా సాధ్యపడకపోవడం లేదా అన్ని రకాల టెస్టులకు, అవసరమైన మెడిసిన్‌కి ఉపయోగ పడకపోవడం వంటి లోపాలతో అసలే ఆర్థిక పరిస్థితి బాగోని జర్నలిస్ట్ తమ జేబులో డబ్బు ఖర్చు పెట్టక తప్పటం లేదు. ఈ పరిస్థితుల్లో జర్నలిస్ట్ హెల్త్ కార్డ్స్ ఉపయోగపడక, ఆర్థిక సాయం అందించే ఆపన్నులు, బంధువులు రాక ప్రాణాలు వదులుతున్నారు. ప్రభుత్వం ఆలోచించి జర్నలిస్టుల హెల్త్ కార్డ్స్ పై పర్యవేక్షణ చేసి తగు నిర్ణయాలు తీసుకోవాలని కోరుకుందాం.

## జర్నలిస్ట్‌లకు ప్రమాదభీమా సౌకర్యం

ప్రభుత్వం చేయలేని పని కొన్ని సంస్థలు, కొంతమంది వ్యక్తులు, లేదా జర్నలిస్టులే స్వయంగా తక్కువ ప్రీమియంతో ప్రమాదభీమా వర్తింపు కోసం పలు బ్యాంకుల్లో నగదు చెలిస్తూ కార్డులు, ప్రమాద భీమా బాండ్స్ పొందుతున్నారు. ఈ ప్రమాదభీమా సాధ్యమైన ఎక్కువ మొత్తంలో ఉండే విధంగా ఆయా మీడియా సంస్థలు లేదా ప్రభుత్వం ఒక ప్రత్యేక ప్రీమియం చెల్లించాలి. ఆర్థికంగా చితికిపోయి చివరికంటా మీడియా సంస్థలకు పనిచేసి చివరి రోజుల్లో కుటుంబానికి రూపాయి ఆదాయం మిగల్చకుండా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలు ఎంతో దీనావస్థలో ఉన్నాయి. ప్రమాదభీమా గానీ మరేదైనా ప్రభుత్వాన్ని అడగటం కొంత విడ్డురంగా ఉండవచ్చు. అప్పనంగా జర్నలిస్ట్‌గా కొనసాగినన్నాళ్లు మీడియా సంస్థలకు ప్రకటనల రూపంలో వేలకు, వేలు, లక్షలకు లక్షలు దోచిపెట్టి ప్రభుత్వాన్ని ఆదుకోమని


అడగటం కరెక్ట్ కాదు. మన మీడియా సంస్థలే మనకు అండగా నిలవాలి. మనం పనిచేస్తున్న మీడియాసంస్థలు ఈ విధానానికి ఒక ఐడీ కార్డు, లేదా కనీస గౌరవవేతనం కూడా ఇవ్వని మీడియా సంస్థలు ముందుకు వస్తాయి అనుకోవడం కూడా అత్యాశే. అందుకే ప్రభుత్వం అయినా ఆదుకోవాలని నా ఉద్దేశ్యం.

## జర్నలిస్ట్ పిల్లలకు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ

ఇదో రకమైన మోసంగా చెప్పుకోవచ్చు. జర్నలిస్ట్‌లు ప్రజాస్వామ్యానికి కట్టుబడి సరియైన జీతాలు లేక పిల్లలను మంచి పాఠశాలల్లో చదివించలేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వాలు ఏదో కంటి తుడుపు చర్యగా ప్రవేట్ పాఠశాలల్లో 50% రాయితీ కల్పించడం అర్ధాంతరంగా వాటిని వెనక్కి తీసుకోవటం వంటి చర్యలకు పాల్పడుతున్నాయి.

మన జర్నలిస్ట్ పిల్లలకు ప్రభుత్వం రాయితీ కల్పించింది అని కొన్ని ప్రవేట్ పాఠశాలల్లో పిల్లల్ని చేర్చేందుకు వెళితే ఆయా విద్యాసంస్థలు ఆ జీవో లతో మాకు సంభంధం లేదు అని ఫీజులు చెల్లించాల్సిందే, లేదంటే మా పాఠశాలలో సీట్లు లేవు అని వెనక్కి పంపిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ని ఏ మాత్రం ఖాతరు చేయకపోగా వారి పాఠశాలకు వెళ్లిన మన జర్నలిస్ట్ మిత్రులను చులకనగా మాట్లాడటం, తేలికచూపులు చూడటం జరిగింది. ప్రభుత్వం ఈ జీవో ని ప్రవేశ పెట్టి మేము జర్నలిస్టులకు అది చేస్తున్నాం, ఇది చేస్తున్నాం అని డప్పు కొట్టుకోవడమే గానీ వాటి అమలుకు తీసుకున్న చర్యలు ఏమీ లేవు. ప్రభుత్వం ఆలోచించి ఈ ఫీజు రాయితీపై తీసుకువచ్చిన జీవోను ఏ ప్రైవేట్ పాఠశాల అయినా తప్పనిసరిగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. అలాగే ఈ ఫీజు రాయితీ అనేది జర్నలిస్టు బిడ్డలకు ఇంటర్, డిగ్రి కోర్సుల వరకు అమలు చేసేందుకు ఏ ప్రభుత్వం వచ్చినా జర్నలిస్టుల పిల్లలకు అందించాలి.

# 4. జర్నలిస్ట్‌ల సంక్షేమం ‘ఎండమావులే’ - (2)




RAJA RATNAM TRUST HOPE FOR ALL

“జర్నలిస్టులు తాము పనిచేస్తున్న మీడియా సంస్థల నుండి కనీస గౌరవ వేతనం కూడా అందుకోలేని వారు ఎంతో మంది ఉన్నారు. వార్తల సేకరణకు ఎక్కడికి వెళ్ళాలన్నా... ఎంత దూరమైనా... సొంత ఖర్చులతో వెళ్లాల్సిందే... ఇదేనా జర్నలిస్టుల సంక్షేమం. ఆయా మీడియా సంస్థలకు బాధ్యత లేదా...?”

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

## ప్రయాణ సౌకర్యం (బస్ పాసులు)

జర్నలిస్టులకు ప్రభుత్వం అందిస్తున్న మరో సంక్షేమం ప్రయాణ సౌకర్యం ఒకటి. ఇది అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వం జర్నలిస్ట్ తమ జిల్లా పరిధిలో బసులో, రైళ్లలో ఉచితంగా ప్రయాణించేందుకు బసుపాస్, రైల్వేపాస్‌లను అందిస్తుంది. ఇందులో బస్‌పాస్ దాదాపు అక్రిడేషన్ ఉన్న ప్రతి జర్నలిస్ట్‌కు వస్తుంది. ఇక రైల్వేపాస్ మాత్రం అక్రిడేషన్ ఉన్నా అందని ద్రాక్షలా ఉంది. బస్‌పాస్ విషయంలో కూడా అక్రిడేషన్ ఉన్నా కొందరు జర్నలిస్టులకు బస్ పాస్ అందటం లేదు. కారణం డీపీఆర్వో నుండి బస్‌పాస్ అందించే కార్యాలయాలకు వెళ్ళే లిస్టులో జర్నలిస్ట్ పేరు ఎదురుగా స్టింగర్, కంట్రిబ్యూటర్ అని ఉండటమే కారణం. ఆయా జర్నలిస్ట్‌లకు అక్రిడేషన్ ఉన్నా కూడా బస్‌పాస్ ఇచ్చే అధికారులను సమస్య ఏమిటి అని అడిగితే వారికి ఇచ్చిన లిస్టులో జర్నలిస్ట్ పేరు ఎదురుగా స్పష్టంగా రిపోర్టర్ అని ఉంటేనే బస్‌పాస్ ఇస్తామని కొర్రీలు పెడుతున్నారు.ఇదొక సమస్య అయితే, అక్రిడేషన్ లేని జర్నలిస్టులకు ఇక బసుపాస్ అనేది ఎట్టి పరిస్థితుల్లో రాదు. ఇటువంటి జర్నలిస్ట్‌లకు కూడా ప్రభుత్వం బస్‌పాస్ సౌకర్యం కల్పించాలి. దీనికి అక్రిడేషన్ ప్రామాణికం చేయకూడదు. ఆర్.ఎన్.ఐ. రిజిస్ట్రేషన్ కలిగిన ఆయా పత్రికలు, ఛానెల్స్ ఇచ్చే ఐడీ కార్డులు అక్రిడేషన్ కన్నా విలువైనవి వీటిని ప్రామాణికంగా తీసుకొని అక్రిడేషన్ లేని ఐడీ కార్డ్స్ ఉన్న జర్నలిస్టులకు కూడా బస్ పాసులు ఇవ్వాలి..

అక్రిడేషన్ లేని వర్కింగ్ జర్నలిస్టులకు కూడా ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ బస్, రైల్వే పాసులు వచ్చే విధంగా ప్రణాళికలు తయారు చేయాలి. కొంతమంది ఆర్టీసీ కండక్టర్‌లకు జర్నలిస్ట్ బస్‌పాస్ దాని పరిధులు ఏమిటో కూడా తెలియకుండా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో మీ పాస్ చెల్లదు.టికెట్ తీసుకోవాలి అని జర్నలిస్ట్‌లతో వాదనకు దిగుతున్నారు. జిల్లా పరిధిలో అయితే పూర్తిగా ఉచితం అని,జిల్లా సరిహద్దులు దాటితే వన్ బై థర్డ్ ఛార్జ్ జర్నలిస్ట్ చెల్లించాలి అనే నిబంధనలు ఉన్నాయి. కానీ జర్నలిస్ట్ జిల్లా పరిధిలో ఉండగానే కండక్టర్స్ బసులో ప్రయాణిస్తున్న విలేకరులను ఇబ్బంది పెడుతున్నారు. టికెట్స్ కొట్టి మనుషులను లెక్కవేసుకుని వారికి లెక్క సరికాక అనుమానంతో బసులో ప్రయాణీకులను ఒకటికి రెండుసార్లు లెక్క చూసుకుని జర్నలిస్ట్‌ను దోషిగా చూసి పాస్ చూసి కూడా తమది జర్నలిస్ట్‌పాస్ అని ముందే చెప్ప వచ్చుగా అని జర్నలిస్ట్‌లపై దూషణకు దిగుతున్నారు. వాదనలు పెంచుకుంటున్నారు. అసలు కారణం ఏమిటంటే ఇటువంటి కండక్టర్‌లకు జర్నలిస్ట్ పాస్‌లపై అవగాహన లేకపోవడం. ప్రధాన సమస్య జిల్లా పరిధిలో ఉన్న నేను ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒకసారి మాచర్ల వెళుతున్న క్రమంలో స్వయంగా ఈ పరిస్థితి నాకు

ఎదురయ్యింది. జర్నలిస్ట్‌లమైన మమ్మల్ని ఇటువంటి కండక్టర్‌ల తీరుకు బసులో ఉన్న తోటి ప్రయాణీకుల ఎదుట దోషులుగా నిలుపుతున్నారు. కండక్టర్స్ మా బస్‌పాసులపై అవగాహన కలిగి ఉండాలి గానీ, ఈ రకమైన వివక్షత, వాదనలు సరికాదు. ఇక ఈ ప్రభుత్వం నిబంధనల పేరుతో కొంతమంది జర్నలిస్టులకు మాత్రమే అక్రిడేషన్స్ ఇవ్వడం కారణంగా చాలామంది జర్నలిస్టులు అక్రిడేషన్స్ లేక బసుపాసులు, హెల్త్ కార్డులకు దూరమైపోయారు.

## పెట్రోల్ అలవెన్స్, ఇతర ఖర్చులు

ఆయా మీడియా సంస్థల్లో పని చేస్తున్న క్రింది స్థాయి జర్నలిస్ట్‌ల కష్టాలు ఎంత చెప్పినా తక్కువే. అసలు వేతనాలు లేక పోయినా వారు అక్కడ, ఇక్కడ తిరిగి వార్తలు సేకరించి ఆయా పత్రికలకు, ఛానల్స్‌కి అవసరమైన ఎంతో బూస్ట్ వార్తల రూపంలో అందిస్తారు. కనీసం రోజుకు రూపాయి ఆదాయం కూడా లేని మా జర్నలిస్ట్‌లు అటూ, ఇటూ తిరిగేందుకు బైక్‌లో అవసరమైన పెట్రోల్‌కు సొంత పెట్టుబడి పెట్టుకుని వార్తలు సేకరిస్తున్నారు. జీతాలే ఇవ్వని మీడియా సంస్థలను జర్నలిస్టులు పెట్రోల్ అలవెన్స్ ఇవ్వమని అడగడం చెవిటి వాడి చెవిలో శంఖం ఊదటమే. మరో విషయం ఏమిటంటే అమరావతి రాజధాని ప్రకటన వచ్చాక అక్కడ భూముల పరిస్థితి, రైతుల ప్యాకేజి, మంత్రులు రాకపోకలు, అక్కడ జరిగే వివరాలను కవర్ చేసేందుకు జర్నలిస్ట్‌లు నిత్యం అక్కడకు తిరగవలసి వచ్చేది. అక్కడ కార్యక్రమాలు ఏ టైంలో జరిగేవి తెలిసేది కాదు. ప్రారంభంలో అమరావతిలో సమాచార వ్యవస్థ లేదు. రైతుల ద్వారా కార్యక్రమాల వివరాలు తెలుసుకుని కవరేజీకి వెళ్లవలసి వచ్చేది.

కవర్ చేసిన వార్తలను ఇతర ఛానల్స్‌తో పోటీపడి అందరికంటే ముందు ఇవ్వాలి. అయితే వార్తలు అప్‌లోడ్ చేయడానికి, ఎడిటింగ్ చేయడానికి అక్కడ సౌకర్యాలు లేవు. ఎక్కడ దాకో ఎందుకు కనీసం గుక్కెడు నీళ్లు దాగుదాం అన్న మంచినీళ్లు కూడా దొరికేవి కాదు. ఈ పరిస్థితుల్లో వార్తలు అప్‌లోడ్ చేయడానికి తుళ్లూరు నుండి మంగళగిరి 20 కిలోమీటర్లు ప్రయాణించి మంగళగిరిలో వార్తల ఫీడ్ అప్‌లోడు చేసేవారం. ఒక్కో సమయంలో వార్తలు పంపేందుకు ఎఫ్.టీ.పీ. సర్వర్లు పనిచేయక సేకరించిన వార్తలు పంపేదుకు సిద్ధంగా ఉన్న సర్వర్లు పని చేయక కొన్నిసార్లు అర్ధరాత్రి దాటినా సమయం తెలియక జాగారం చేసే వాళ్ళం. మరో ప్రక్క ఆఫీస్ నుండి త్వరగా పంపండి అని ఒత్తిడి ఇంకో ప్రక్క అమరావతిలో ఏ కార్యక్రమం జరుగుతుందో అది మిస్సవుతాం అనే టెన్షన్స్‌తో పనిచేసాం.ఇలా రోజుకు మూడు సార్లు, నాలుగు సార్లు రాత్రనక, పగలనక, ఎండ, వాన తెలియక బైకులో పెట్రోల్‌కు సొంత డబ్బులు ఖర్చుపెట్టి వార్తలు సమయానికి అందించే వాళ్ళం. మీడియా సంస్థలు రూపాయి ఇచ్చేవికాదు. వారికి అవసరమైన వార్తలు, టి.ఆర్.పీ. రేట్లు, ఎక్స్ క్లూజివ్, ఫస్ట్ ఆన్ అంటూ పరుగులు పెట్టించేవారు. ఈ విధంగా జర్నలిస్ట్‌లను పావులుగా వాడుకున్నారు.

ఇక జర్నలిస్ట్‌ల ఇతర ఖర్చుల విషయానికి వస్తే ఆంధ్రాలో సమైక్యాంధ్ర ఉద్యమంతో మొదలయ్యి అమరావతి రాజధాని శంఖుస్థాపన వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, మంగళగిరి, తుళ్ళూరు, మందడం, వెలగపూడి, నేలపాడు ప్రాంతాలపై మీడియా పెద్ద ఎత్తున దృష్టి పెట్టి తమ అవసరాలు మొత్తం తీర్చుకుంది. ఈ ప్రాంతాల్లో పనిచేసిన జర్నలిస్ట్‌లకు రూపాయి ఆదాయం లేకపోయినా ఆ సమయంలో అక్కడ జర్నలిస్టులకు డిమాండ్ మాత్రం బాగా పెరిగింది. ఇబ్బడి, ముబ్బడిగా స్ట్రింగర్స్‌ని నియమించాయి కొన్ని ఛానల్స్. జర్నలిస్ట్ ఎన్ని బాధలు పడింది వారికి అనవసరం వారికి అవసరమైన వార్తలు పంపిస్తే చాలు. ఏ అనుభవం లేకపోయినా పొలం పనులు చేసుకునే వారిని ఇతర వ్యాపారాలు చేసుకునే వారిని కూడా స్ట్రింగర్స్‌గా నియమించి తమ అవసరాలు గడుపుకున్నారు.

ఇక దారుణమైన విషయం ఏమిటంటే అమరావతి శంఖుస్థాపనలో జర్నలిస్ట్‌లు ఎదురుకున్న కష్టాలు పగవారికి కూడా రాకూడదు. అమరావతి శంకుస్థాపనలో వార్తలు కవర్ చేసేందుకు హైదరాబాద్ నుండి ఆయా మీడియా సంస్థలు ప్రత్యేక జర్నలిస్ట్ టీమ్‌లను అమరావతికి దించాయి. అమరావతి శంఖుస్థాపనకు మూడు రోజులు ముందుగానే అమరావతిలో ఈ టీమ్స్ దిగాయి. అయితే వారికి షెల్టర్ ఎక్కడ,భోజనం ఏమిటి, వంటి ఖర్చులు కూడా చూడకుండా టీమ్స్‌ని దించితే వారి పరిస్థితి ఏమిటి అని కూడా కొన్ని మీడియా సంస్థలు ఆలోచించలేదు. అదేమి అంటే అమరావతిలో ఉన్న స్ట్రింగర్స్ మీ అవసరాలకు అండగా ఉంటారని ఒక మాట చెప్పి హైదరాబాద్ జర్నలిస్ట్ టీమ్స్‌ని ఇక్కడకు నెట్టేశాయి.

సాధ్యపడిన స్ట్రింగర్స్ మంగళగిరిలో కళ్యాణ మండపాలు,ఫంక్షన్ హాల్స్ బుక్ చేసి మీడియా సంస్థల ఆదేశాలు పాటిస్తూ హైదరాబాద్ జర్నలిస్ట్‌లకు షెల్టర్ ఏర్పాటు చేశారు. చేయలేని స్ట్రింగర్స్‌కి మీడియా సంస్థల నుండి దూషణలు ఎదురయ్యాయి. అలా చేయలేని కొంతమంది స్ట్రింగర్స్ తమ టీమ్‌కి అమరావతిలో ఉన్నన్నాళ్ళు భోజన సౌకర్యం చూడాలని ఆర్డర్స్ వేసినట్లు పలువురు జర్నలిస్టులు చెప్పుకుని బాధపడ్డారు. ఈ క్రమంలో కొంతమంది స్ట్రింగర్స్, గ్రామీణ విలేకరులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టారు. అలాగే హైదరాబాద్ నుండి వచ్చిన కొంతమంది జర్నలిస్టులు స్ట్రింగర్స్ ని స్థానిక విలేకరులకు ఇబ్బంది కలిగించకుండా సొంత డబ్బులు ఖర్చు పెట్టుకున్నారు. ఇక తరువాత ఆయిన వారు ఖర్చుపెట్టిన నగదు మీడియా సంస్థలు ఇచ్చారో లేదో తెలియదు.

ఇక అక్కడ నుండి వచ్చిన టీమ్స్‌లో జర్నలిస్ట్‌లు, ఓబీ వ్యాన్ టెక్నీషియన్స్, డ్రైవర్లు ఇలా ఒక్కో ఛానల్ తరువున 10 మందికి పైగా దిగారు.కొన్ని ఛానల్స్ షెల్టర్, భోజనాల కోసం అవకాశం కల్పిస్తూ మీరు ఎక్కడ ఉన్నా మీ అవసరాలకు పెట్టిన ఖర్చులు ఆయా

మీడియా సంస్థలకు బిల్లులు పెట్టుకునే సౌకర్యం కల్పించింది. కొన్ని ఛానల్స్ మాత్రం ఈ అవకాశం కూడా కల్పించలేదు. ఈ పరిస్థితుల్లో ఓబీ వ్యాన్ టెక్నీషియన్స్, డ్రైవర్స్ ఇబ్బందులు వర్ణనాతీతం. కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు స్నానాలు చేసేందుకు వీరు ఇబ్బందులు పడ్డారు. వీరు స్నానాలు చేసేందుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు అమరావతి నుండి 10 కిలో మీటర్లు ప్రయాణించి ఉండవల్లి పెట్రోల్ బంకుకు వెళ్లి వారికి ఇచ్చిన టైంలోగా వచ్చేయ్యాలి అనే నిబంధన ఒకటి. ఇక సమయానికి టిఫిన్, భోజనం లేక పస్తులున్నారు. పడుకునే అవకాశం లేక ఓబీ వ్యానుల్లోనే కాళ్ళు ముడుచుకుని పడుకున్నారు. ఈ కష్టాలు చూసి అమరావతి రైతులు కొందరికి షెల్టర్ ఇచ్చి భోజనాలు పెట్టి ఆదుకున్నారు. ఇలా మీడియా సంస్థలు వ్యవహరించడం ఎంత మేరకు సబబు. కొంతమంది జర్నలిస్ట్‌లతో సహా ఇటువంటి వారిని బానిసలుగా వాడుకున్నాయి మీడియా సంస్థలు అందుకే మీడియా సంస్థలు ఇటువంటి కార్యక్రమాలకు పంపే జర్నలిస్ట్ బృందాలకు, ఇతర టెక్నీషియన్స్, డ్రైవర్లకు ఇతర ఉద్యోగులకు ముందుగానే కనీస అవసరాలకు ఖర్చులు చెల్లించాలి

అంతేగానీ ఈ విధంగా బానిసలుగా చూడటం తగదు. అందరికీ నీతులు చెప్పి ఈ విధంగా వ్యవహరించే కొన్ని ఛానల్స్, పత్రికలు అడిగేవారు ఎవరు లేరు అనుకుంటే ఏ మాత్రం క్షమార్హం కాదు. పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ నన్నెవరు చూడటం లేదు అనుకోవడం ఎంతో అలాగే ఉంది కొన్ని మీడియా సంస్థల తీరు. పిల్లి గుడ్డిది అయితే ఎలుక ఎగిరెగిరి ఏదో చూపించిందట. అలా ఉంది మీడియా సంస్థలు జర్నలిస్టుల మధ్య సంబంధం.లేకపోతే ఏంటడీ...! ప్రతి క్షణం గడియారంలో ముల్లులా కాలంతో పరుగు పెడుతూ ఎన్నో భాధలకోర్చి క్రొవ్వొత్తుల్లా కరిగిపోయాం. ఈ వృత్తికాక మరేదైనా వృత్తిలో కొనసాగి ఉంటే ఆయా జర్నలిస్ట్‌లు తమ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడేవారు. అందుకే నేనెంతో అభిమానించే ఒక సీనియర్ జర్నలిస్ట్ ఎప్పుడైనా, ఏ సమయమైనా మన జర్నలిస్ట్‌ల సంక్షేమం కోరే మా అన్నగారు ఒక మాట అంటారు. "జర్నలిజం వృత్తిలోకి వచ్చేవారు దేశ సరిహద్దుల్లో సైనికులు ఎలాగో మనం అలాంటి వారిమే.. అందుకే ఈ వృత్తిలోకి వచ్చేవారు ఇంట్లో ఒక ఫోటోకి దండ వేసుకుని జర్నలిస్ట్‌గా రావాలి" అని, కాబట్టి జర్నలిజంపై ఆశక్తితో జర్నలిస్ట్‌గా ప్రయాణం చేయాలి అనుకున్న వారు ఈ మాటను ఒకసారి బాగా పరిశీలించుకుని రావాలి.

## జర్నలిస్ట్‌ల పీ.ఎఫ్. చెల్లింపు పై ప్రభుత్వ నిఘా

జర్నలిస్ట్‌ల సంక్షేమం కోరుతూ కొన్ని మీడియా సంస్థలు గుర్తింపు కలిగి ఎంప్లాయి కోడ్ కలిగి ఉన్న జర్నలిస్టులకు నెలనెలా జీతం నుండి కొంత నగదు పీఎఫ్ క్రింద కట్

చేస్తుంది. కొన్ని మీడియా సంస్థలు ఈ విధానం పాటిస్తున్నామని జీతంలో కట్ చేస్తున్నా ఆయా జర్నలిస్ట్‌లు పీఎఫ్ తీసుకునే సమయంలో అకౌంట్‌లో డబ్బులు లేకపోవడం, లేదా కొన్ని టెక్నీకల్ సమస్యలు ఎదురుకావడం వంటి సమస్యలు మనం ఇంతకు ముందు తెలుసుకున్నాం. అసలు మీడియా సంస్థలు క్రమంగా జర్నలిస్ట్‌లకు పీఎఫ్ చెల్లిస్తుందా...? లేదా...? అనే విషయం పై ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేయాలి.ఒక వేళ చెల్లిస్తే జర్నలిస్ట్‌లకు టెక్నికల్ సమస్యలు లేకుండా చేయాలి. లేదంటే ప్రభుత్వ ఖజానా చిల్లు చివరికి జర్నలిస్ట్‌కు పీఎఫ్ విషయంలో మొండిచేయి ఎదురవుతుంది. ఈ విషయంలో ఓ ఛానల్ జర్నలిస్ట్‌ల పీఎఫ్ బొక్కేసినట్లు ఆయా జర్నలిస్ట్‌లు పీఎఫ్ రాకపోవటం, జీతాలు చెల్లించకపోవడంపై ఆ ఛానల్ పై హెచ్ ఆర్ సీ కి పిర్యాదు చేశారని చదువుకున్నాం. కాబట్టి ప్రభుత్వం దీనిపై ఓ కన్ను వేసి ఉండాలి.

## జర్నలిస్ట్‌ల అంత్యక్రియలకు మీడియా సంస్థలు ఆర్థిక సాయం చేయాలి

జర్నలిస్టులచే వెట్టి చాకిరీ చేయించుకుని కనీసం గౌరవ వేతనం కూడా ఇవ్వని మన మీడియా సంస్థలను అంత్యక్రియలకు సాయం అడగటం ఏ మాత్రం తప్పుకాదు. ఇది మన హక్కుగా పరిగణించాలి. సంస్థలో పని చేసినన్నాళ్లు మనకు ఏ ఆర్థిక భరోసా ఉండదు. చివరికంటా సంస్థ కోసం పనిచేసి ఆరోగ్యం క్షీణించి, ప్రమాదానికి గురై మరణిస్తే చేతిలో పైసా లేక ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడటంతో మన బ్రతుకులు ముగిసి పోతున్నాయి. జర్నలిస్ట్‌గా బ్రతికినన్నాళ్లు కుటుంబానికి రూపాయి సంపాదించలేని మన బ్రతుకులు చివరిరోజున కూడా ఒకరి పై ఆధార పడకూడదు. మన బ్రతుకంతా పలు మీడియా సంస్థలకు ధారబోసి మరణించిన సమయంలోను మన సంస్థలు మన అంత్యక్రియలకు సాయం చేయకపోవడం ఎంత పాపమో తెలుసుకోవాలి. కేవలం జర్నలిస్ట్‌కే కాదు ఈ సాయం మీడియా సంస్థల్లో పని చేసే ప్రతి చిన్న,పెద్ద ఉద్యోగికి అందాలి. దీనిని ప్రభుత్వం ఒక చట్టంగా రూపొందించాలి.

## జర్నలిస్ట్ వాహన కొనుగోలుకు ఫైనాన్స్ సహకారం ఉండాలి

జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగే ప్రతి వ్యకికి ఆయా మీడియా సంస్థలు సొంతగా వాహన కొనుగోలు చేసే జర్నలిస్ట్‌లకు ఫైనాన్స్ సహకారం అందించాలి. ఎందుకంటె జర్నలిస్ట్‌గా కొనసాగాలి అంటే పెన్ను,పేపర్, కెమెరా ఎంత అవసరమో జర్నలిస్ట్‌కు ద్విచక్ర వాహనము అంతే అవసరం.కావున మీడియా సంస్థలు ఈ అవసరాన్ని గుర్తించి జర్నలిస్ట్‌కు ఇచ్చే జీతంలో కొంత పెంచి ద్విచక్ర వాహన ఫైనాన్స్‌కి ఊతం అందించాలి. జర్నలిజంపై ఉన్న ఆశక్తితో కెమెరాలు, ద్విచక్ర వాహనాలు అప్పు చేసి కొనుగోలు చేసి చాలా మంది క్రింది స్థాయి

జర్నలిస్ట్‌లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీకు ఇవేమీ పట్టవు. వాడు ఎక్కడా రూపాయి తీసుకోకుండా ప్రతి పైసా మాకు కూడబెడితే చాలు అని మీడియా సంస్థలు అనుకుంటున్నాయి. అసలు ఎదురు పెట్టుబడి పెట్టి జర్నలిస్ట్‌లు మీకెందుకు పని చేయాలి...? జర్నలిస్ట్‌లు మీకేమైనా బాకీనా...? వారి ఆశక్తిని అలుసుగా తీసుకుని జర్నలిస్ట్‌ల పాలిట విషబీజాలు నాటుతున్నారు. ఈ పాప ఫలితం మీకు ఎప్పుడు ఫలిస్తుందో మరి.

జర్నలిస్ట్‌గా ఉన్న నా సోదర సమానుడైన అత్యంత సన్నిహిత మిత్రుడు సుమారు లక్ష రూపాయలు వెచ్చించి సొంతగా బైక్ కొనుగోలు చేసాడు. అమరావతిలో సెక్రటేరియట్ నిర్మాణ సమయంలో న్యూస్ కవరేజీకి వెళ్ళాడు. ఆ సమయంలో సెక్రటేరియట్ నిర్మాణ పనులు చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన ఓ కార్మికుడు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతని మృతికి ఆగ్రహించిన అక్కడి కార్మికులు నా జర్నలిస్ట్ మిత్రుడు బైక్‌ను పెట్రోల్ ట్యాంక్ పైపు పీకి నిప్పు అంటించారు. కార్మికులు చేస్తున్న ఆందోళనలు అతని బైకు పూర్తిగా కాలిపోయింది. దీనికి నష్ట పరిహారం ఎవరు ఇస్తారు. స్థానిక సీ.ఆర్.డీ.ఏ. అధికారులకు, నిత్యం వచ్చే, పోయే మంత్రులకు, అధికారులకు పిర్యాదు చేస్తే అప్పటి మంత్రి నారాయణ ఏదో కంటి తుడుపుగా కొంత నగదుఇచ్చి సరిపుచ్చారు. అందుకే మీడియా సంస్థలు జర్నలిస్ట్‌లకు అవసరం అయిన కెమెరా, ద్విచక్ర వాహనాలకు ఆర్థిక సహకారం అందించాలి. మనం పనిచేస్తున్న మీడియా సంస్థల నుండి మనకు సహకారం లభిస్తుంది అనుకోవడం, ఆశపడటం వంటివి తీరని కోరికలు. అయినప్పటికీ మనం కోరుకున్నవి మన మీడియా సంస్థలు తీర్చాల్సిన హక్కులుగా పేర్కొందాం.

### "ఫిల్మ్ జర్నలిస్టుల భద్రత కోసం"[1]

తెలంగాణలో న్యూస్ పేపర్లో కేవలం ఒక్క పేజీలో ప్రచురించే సినిమా వార్తలు,ఆ వార్తలు రాసే ఫిల్మ్ జర్నలిస్ట్‌ల సంక్షేమం కోరుతూ జర్నలిస్ట్‌ల పేరిట కొందరు సినీ నిర్మాతలు, ఎంతో విలువైన పాలసీలు ఏర్పాటు చేశారు. మరి అన్నీ పేజీలకు వార్తలు రాసే మనకు ఏ సంక్షేమం లభించడం లేదు.

సినీ నిర్మాతలు అందించే పాలసీలు పొందిన సినిమా జర్నలిస్టు సభ్యులతో పాటు వారి కుటుంబంలో ముగ్గురికి ఆదిత్య బిర్లా ఫ్యామిలీ హెల్త్ ఇన్సూరెన్స్ కింద రూ. 3 లక్షల మెడికల్ కవరేజ్, సభ్యులకు ఆదిత్య బిర్లా పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద రూ. 25 లక్షల యాక్సిడెంటల్ కవరేజ్, ఎస్బిఐ టర్మ్ పాలసీ కింద రూ. 15 లక్షల కవరేజ్ లభిస్తాయని సమాచారం.



*Source Internet : 1. 'ఫిల్మ్ జర్నలిస్టుల భద్రత కోసం'[1]*

## "బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజం"[2]

బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజం అనేది జర్నలిస్టులకు సానుకూల కథనాన్ని వ్రాయడానికి లేదా ప్రతికూల కథనాన్ని పంపడానికి వారికి ద్రవ్య ప్రేరణను అందించడం. బ్రౌన్ ఎన్వలప్‌లలో దాచిన నగదు ప్రేరణల నుండి ఈ పేరు వచ్చింది మరియు ప్రెస్ బ్రీఫింగ్ సమయంలో పాత్రికేయులకు ఇవ్వబడింది. ఇది మొట్ట మొదటిసారిగా నైజీరియాలో స్థాపించబడింది. అనంతరం మనదేశంలోకి ప్రవేశపెట్టబడింది. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పత్రికలు అవలభించవలసిన తీరు కాదు. ఎందుకంటే ఎవరు డబ్బు ఇస్తే వారికి అనుకూలంగా వార్తలు రాయవలసి ఉంటుంది.

ఇప్పుడు మన మీడియా వ్యవస్థలు, అందులో పని చేసే పై స్థాయి వ్యక్తులకు కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు నగదు ప్రేరణ కల్పిస్తూ పెద్ద మొత్తంలో బ్రవున్ ఎన్వలప్ జర్నలిజంకు పాల్పడుతున్నారు. అలాగే చాలా చోట్ల ఈ బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజం నడుస్తుంది. పై స్థాయి జర్నలిస్ట్‌ల కయితే కొంత ఎక్కువ నగదు క్రింది స్థాయి జర్నలిస్ట్‌లకయితే 500/– నుండి 1000/– రూపాయల వరకు ఈ బ్రవున్ ఎన్వలప్ జర్నలిజం నడుస్తుంది. ఒకప్పుడు ఇది చాలా గౌరవప్రదంగా నడిచేది. ఇప్పుడు మీడియా ప్రతినిధుల సంఖ్య అధికంగా పెరగటంతో ఈ బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజంను ప్రోత్సహిస్తూ జర్నలిస్ట్‌లకు కాస్తో, కూస్తో ఆర్థిక సహకారం అందించేవారు కూడా లేకపోవడంతో జర్నలిస్ట్‌లకు కనీస అవసరాలకు కూడా నగదు తావడం లేదు. అయితే జర్నలిస్ట్‌లందరూ ఈ బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజానికి పనిచేస్తున్నారు అనడం లేదు. ఒక రకంగా చెప్పాలి అంటే జీతాలు లేకుండా పని చేస్తున్న కొంతమంది దిగువ స్థాయి జర్నలిస్టులకు ఈ బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజం కొంత ఊరట కలిగిస్తుంది. అలా అని బ్రవున్ ఎన్వలప్ జర్నలిజాన్ని ప్రోత్సహించండి అని నేను చెప్పడం లేదు. జర్నలిజం వృత్తి పరంగా సమస్యలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులు బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజం విషయంలో మీరు ఎలా ఉండాలి అనేది మీ విచక్షణకే వదిలేస్తున్నాను.



*Source Internet : 2. 'బ్రౌన్ ఎన్వలప్ జర్నలిజం'[2]*

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

# 5. అమరావతిలో -
# జర్నలిస్ట్‌లు ఎదుర్కొన్న సమస్యలు - (1)



**"జర్నలిజం అనేది ఒక ఛాలెంజింగ్ వృత్తి మరి జర్నలిస్టులు తమ పరిధిలో జరిగే కార్యక్రమాలు, భారీ ప్రమాదాలు ఎలా... ఎంతలా కష్టపడి అంకితభావంతో పనిచేస్తున్నారు, ఇలాంటి జర్నలిస్టులను, కెమెరామెన్స్ ని గుర్తించేది ఎవరు...?"**

జర్నలిస్ట్‌లుగా పనిచేస్తున్న మా సోదరులు సమాజం కోసం,సామాజిక భద్రత కోసం ప్రజల తరపున ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారు. విధినిర్వహణలో ఎన్ని అడ్డంకులు, సమస్యలు వచ్చినా ఎదుర్కొని తమ పరిధిలో జరిగే సంఘటనలను మీడియా ద్వారా ప్రభుత్వానికి చేరవేస్తున్నారు. ఈ క్రమంలో పై స్థాయి జర్నలిస్ట్‌లు తమపై దూషణలకు దిగినా, కొన్ని వార్తల కవరేజీలో పలువురు ఆయా వ్యక్తులు దాడికి దిగినా, బెదిరింపులకు పాల్పడినా అన్నిటికీ ఓర్చుకుని అన్నిరకాల వార్తలు కవర్ చేస్తూ తాను పనిచేస్తున్న మీడియా సంస్థకు వార్తలు పంపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మా జర్నలిస్ట్ సోదరులు కొన్ని ముఖ్య వార్తా సంఘటనల్లో ఎదుర్కొన్న సమస్యలు మీ ముందుకు.

**కొన్ని ముఖ్యమైన వార్తా సంఘటనలు, జర్నలిస్ట్‌లు ఎదుర్కొన్న సమస్యలు**

**పార్ట్-1**

☞ యువగర్జన.
☞ యువగర్జన విశేషాలు
☞ గుంటూరు మిర్చియార్డు ధగ్ధం.
☞ కృష్ణానది వరద ఓలేరు ఘటన
☞ ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం.
☞ విజయవాడ నాగ వైష్ణవి కిడ్నాప్, మర్డర్.

**పార్ట్-2**

☞ రాష్ట్రంలో సైకో సాంబ టెర్రర్
☞ మంగళగిరిలో సైకో సాంబ ఫీవర్‌లో ప్రజలు
☞ పెదవడ్లపూడిలో సైకో సాంబ అసలు విషయం
☞ ఎట్టకేలకు మంగళగిరి పోలీసులకు చిక్కిన సైకో సాంబ
☞ పోలీసులకు చిక్కిన సైకో సాంబ ఏమైయ్యాడు
☞ గొడవర్రు ఇసుకరీచ్‌లో ఇసుక అక్రమ రవాణా
☞ ఇసుకరీచ్‌లపై మంగళగిరి మీడియా దాడులు
☞ ఎర్రబాలెం కొండపై క్షుద్ర పూజలు, బాలుడు అదృశ్యం
☞ తాడేపల్లి పాత సిమెంట్ ఫ్యాక్టరీలో క్షుద్ర పూజలు

**పార్ట్-3**

☞ క్రైస్తవ భక్తురాలికి సిలువ
☞ సమైక్యాంధ్ర ఉద్యమం

- సమైక్యాంధ్ర ఉద్యమంలో సీనియర్ జర్నలిస్ట్ దీక్ష
- మంగళగిరి బైపాస్‌లో గ్యాస్‌ట్యాంకర్ బోల్తా
- కాజా టోల్‌గేట్ వద్ద సల్ఫర్ గ్యాస్ ట్యాంకర్ బోల్తా

**పార్ట్–4**

- కులాల రొచ్చులో విద్యార్థులు.
- రిషితేశ్వరి ఆత్మహత్య
- ఇంజనీరింగ్ విద్యార్థినికి లైంగిక వేధింపులు
- ఎ.ఎఫ్.ఐ.ఆర్. కోర్టుకెళ్ళిన కేసు

**పార్ట్–5**

- కృష్ణా పుష్కరాలు
- కృష్ణా పుష్కరాలలో నలుగురు మృతి
- వెంకటపాలెం పోలయ్య స్వామి
- అమరావతిలో అరటి తోటలు ధగ్ధం
- అరటి తోటలు ధగ్ధం చేసిన వ్యక్తుల కోసం గాలింపులు

**పార్ట్–6**

- మీడియాపై అమరావతి రైతులు దాడి
- జగన్ ఓదార్పు యాత్ర
- గుంటూరులో వై.యస్. జగన్ ఓదార్పు యాత్ర
- చంద్రబాబు వస్తున్నా మీకోసం
- గుంటూరు జిల్లాలో చంద్రబాబు వస్తున్న మీకోసం పాదయాత్ర వస్తున్నా మీకోసంకి ఎమ్మార్పీఎస్ సెగ

**పార్ట్–7**

- షర్మిల పాదయాత్ర
- మాదిగల కురుక్షేత్ర మహాసభ
- కరోనా విలయ తాండవం
- సంక్షోభంలో ప్రింట్ మీడియా
- కరోనా కారణంగా జర్నలిస్టులకు కష్టకాలం
- ఎలక్ట్రానిక్ మీడియా
- కరోనా కవరేజీ – జర్నలిస్ట్‌ల ఇబ్బందులు
- కరోనాతో మరణించిన జర్నలిస్ట్‌ల ఆర్థిక సాయం మాటేమిటి?

చాలా ముఖ్యమైన వార్తా సంఘటనలు మాత్రమే మీ ముందుకు తీసుకు వస్తున్న ఈ వార్తల కవరేజీలో మా జర్నలిస్ట్‌లు ఇబ్బందులు తెలిపేందుకే.

## యువగర్జన

అది 2008వ సంవత్సరం నాడు రాష్ట్రం ఉమ్మడిగా ఉండేది. గుంటూరుజిల్లా మంగళగిరి మండలం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట కాజ గ్రామం. సువిశాలమైన ప్రదేశం సుమారు 70 ఎకరాల మైదానంలో నవంబర్ 5న ఎంతో ప్రతిష్టాత్మకంగా, ప్రత్యేకంగా జరిగిన అతిపెద్ద భారీ బహిరంగ సభ. ఈ సభకు ఆ రోజు రెండు రాష్ట్రాల నుండి 13లక్షల జనం పాల్గొన్నారు. ఈ యువగర్జన కార్యక్రమంలో ప్రతిఘటనను ఎంతో ప్రత్యేకంగా నిర్వహించింది నాటి తెలుగుదేశం పార్టీ. అయితే ఆ మైదానంలో నిర్వహించిన యువగర్జన కార్యక్రమానికి వారంరోజుల క్రితం నుండే జర్నలిస్ట్‌లు మీడియా సంస్థల ఆదేశాలతో న్యూస్ కవరేజీకి పూనుకున్నారు. అంటే మైదానంలో జంగిల్ క్లియరెన్స్ నుండి సభ అయిపోయిన రెండురోజుల వరకు సుమారు పదిరోజులు అక్కడే విధులు నిర్వహించారు మా జర్నలిస్ట్ సోదరులు. ఇందులో ప్రతి విషయాన్ని కవర్ చేస్తూ మంగళగిరి, గుంటూరు జర్నలిస్ట్‌లది చెప్పుకోదగిన ముఖ్య పాత్ర. ఇక యువగర్జన జరిగే రోజు ఉదయాన్నే 6 గంటలకు గుంటూరు, మంగళగిరి, విజయవాడ, జర్నలిస్ట్‌లతో పాటు జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో పని చేస్తున్న స్ట్రింగర్స్‌కి, గ్రామీణ విలేకరులకు ఆరోజు అక్కడే విధులు. ఏ ఇన్సిడెంట్ మిస్ అవ్వటానికి లేదు. ఎప్పటి వార్తలు అప్పుడు పంపించాలి అని పై స్థాయి జర్నలిస్ట్‌ల ఆదేశాలతో రాత్రి సభ ముగిసే వరకు అందరికీ అక్కడే డ్యూటీలు.

## "యువగర్జన విశేషాలు"[1]

2008 నవంబర్ 5 రానే వచ్చింది. అక్కడ విధులు నిర్వహించే జర్నలిస్ట్ లందరు రంగంలోకి దిగారు.

(1) గన్నవరం నుండి చిలకలూరిపేట వరకు 6 అడుగుల ఎత్తులో వున్న 20వేల జండాలతో రోడ్డుకు ఇరువైపులా అంతా పసుపుమయం. (2) యువగర్జన ప్రాంగణంలో సభ జరిగేటప్పుడు హెలికాప్టర్ ద్వారా పూలు చల్లటం. (3) లక్ష పసుపురంగు బెలూన్లు ప్రాంగణం నలుమూలల నుంచి ఎగురవేయడం. (4) 8 భారీ కటౌట్లు, 30 స్వాగత ద్వారాలు, 10 పెద్ద బెలూన్ల ఏర్పాటు. (5) గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలోని వేములూరిపాడు నుంచి 7గుర్రాల రథం పై యువజ్యోతి ప్రాంగణం చేరుకుని ఆ జ్యోతిని బాలయ్య చేతుల మీదుగా చంద్రబాబు నాయుడుకి అందించటం. (6) వేదిక పై భాగాన ఏనుగు దంత ఆకారంలో తోరణాలు, వేదిక మీద అటూ ఇటూ సింహాల ప్రతిమల (7) విజయవాడ, గుంటూరు నగరాలలో ఎటు చూసినా భారీ కటౌట్లు, స్వాగత ద్వారాలు, ఫ్లెక్సీలు. (8) ఒకనాటి 5వ నెంబర్ జాతీయ రహదారి ప్రస్తుతం 16వ నెంబర్ జాతీయ రహదారి 100 కి.మీ మేర పసుపుమయం.



*Source Internet : 1. 'యువగర్జన విశేషాలు'[1]*

(9) ప్రతీ గ్రామంలో యువగర్జన సంబరాలతో సభా ప్రాంగణానికి విచ్చేసే జనం 15 లక్షల పై మాటే పార్టీ శ్రేణుల అంచనా.

ఇవన్నీ ఏ ఒక్కటి మిస్‌కాకుండా జర్నలిస్ట్‌లు కవరేజీ ఇవ్వాలి. ఒక్కో జర్నలిస్ట్‌కు ఒక్కో ప్రాంతం కేటాయింపు. ఏది మిస్ అయినా ఆ ప్రాంతంలో విధులు నిర్వహించే జర్నలిస్ట్‌కు పై నుంచి అక్షింతలు. విజయవాడ, గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్‌కి ఓబీ వ్యాన్లు కేటాయింపు. మరి స్ట్రింగర్స్ ఫీడ్ ఎలా అప్ లోడ్ చేయాలి...? స్ట్రింగర్స్ కవర్ చేసిన న్యూస్ అప్‌లోడ్ చేయాలి అంటే, అన్ని లక్షల మంది జనంలో సభా ప్రాంగణం వెనుక ఉన్న ఓబీ వ్యాన్ వద్దకు చేరుకోవడం చాలా ఇబ్బంది. ఎలాగోలా చేరుకున్న ఫీడ్ పంపేందుకు స్ట్రింగర్స్ వద్ద ఉన్న కెమెరాలకు, ఓబీ వ్యాన్ సెటప్‌కి సెట్ అయ్యేవి కాదు. స్ట్రింగర్స్ కేవలం కెమెరాల్లో మాత్రమే విజువల్స్ తీయాల్సి వచ్చేది. అప్పటికి మొబైల్ ఫోన్స్‌లో ఇప్పటిలా వాట్సప్ అందుబాటులో లేదు. ఫీడ్ అందించే విషయంలో స్ట్రింగర్స్ సమస్య అంతా ఇంతా కాదు. ఇక ఉదయాన్నే 6 గంటలకు విధుల్లో చేరిన స్టాఫ్ రిపోర్టర్స్, స్ట్రింగర్స్ అంతా నైట్ సభ ముగిసే వరకు తాగేందుకు, తినేందుకు ఏమీ లేక ఖాళీ కడుపులతోనే డ్యూటీలు నిర్వహించారు.

చివరికి రాత్రి పది గంటల తరువాత సభ ముగిసింది. సభకు వచ్చిన వాళ్ళుగానీ జర్నలిస్ట్‌లుగానీ సభలో పాల్గొన్న నాయకులు, లీడర్స్ ఇళ్ళకు తిరుగు ప్రయాణం అయ్యేందుకు పెద్ద సమస్య ఏర్పడింది. కారణం యువగర్జన జరిగే ప్రాంగణంని ఆనుకొని ఉన్న నాటి 5వ నెంబర్ జాతీయ రహదారి మొత్తం కొన్ని కిలోమీటర్ల లెక్క భారీ స్థాయిలో ట్రాఫిక్‌జామ్ అందరూ ట్రాఫిక్‌లో గంటల తరబడి అక్కడే చిక్కిపోయారు. స్థానిక స్ట్రింగర్స్, కొంతమంది చుట్టు ప్రక్కల ప్రాంతాల జర్నలిస్ట్‌లు ట్రాఫిక్‌లోనే ఇరుక్కుంటూ, ఇరుక్కుంటూ పది కిలోమీటర్లు అర్ధరాత్రి దాటే వరకు వాహనాల మధ్య నుండి కాలినడకన ఎలాగోలా మంగళగిరికి చేరుకున్నారు. ఇక అక్కడ ఆవురావురు మంటూ టిఫిన్లు, టీలు తిని, త్రాగి ఊపిరి పీల్చుకున్నారు. ఇక ఓబీ వ్యాన్ డ్రైవర్స్, టెక్నీషియన్స్ ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు టీలు, టీఫిన్స్, భోజనాలు,లేకుండా సభాప్రాంగణంలోనే ఉండిపోయారు. సభ ముగిసిన రోజు తెల్లవారి నుండి సాయంత్రం మూడు గంటల వరకు ట్రాఫిక్ క్లియర్ కాలేదు. కారణం లెక్కలేని వాహనాలు నాడు డబల్‌లైను జాతీయ రహదారి కాగా ఇప్పటిలా సిక్స్‌లైన్స్ రహదారి కాకపోవడం. అలాగే యువగర్జన ముగిశాక కూడా రెండు రోజులు జర్నలిస్ట్‌లు అక్కడ విధులు నిర్వహించారు. సభావేదిక తొలగింపు, కిక్కిరిసిన జనం తొక్కిసలాటలో వదిలేసిన చెప్పులు ఒక లారీకి సరిపడా చెప్పులు ఆ ప్రాంగణంలో వదిలేశారు. ఇవికూడా కవర్ చేయాల్సి వచ్చింది.

ఈ విధంగా జర్నలిస్ట్‌లు ఎన్నో సమస్యలు ఎదుర్కొని తమ సంస్థకు అవసరమైన ఫీడ్ అందించి అందరూ సక్సెస్ ఫుల్‌గా విధులు నిర్వహించారు. వార్తలు సేకరించి పంపడంలో

మా జర్నలిస్ట్‌ల తెగింపు ఇలా ఉంటుంది. చూసే వారికి వీళ్ళకేమి వైట్ కాలర్ ఉద్యోగులు అనుకుంటారు. మా సమస్యలు చెపితే వినేవారు లేరు.ఆదరించే వారు అసలు లేరు.

## గుంటూరు మిర్చియార్డు ధగ్ధం

ఆసియా ఖండంలోనే అతిపెద్ద మిర్చియార్డుగా మన గుంటూరు మిర్చియార్డుకు పేరుంది. అటువంటి మిర్చియార్డు 2008, 2009లో కరెక్టుగా గుర్తులేదు. ఆ టైంలో మిర్చియార్డు అగ్ని ప్రమాదానికి గురై భారీ ఎత్తున అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో రైతులు తెచ్చిన కొన్ని లక్షల టిక్కీల మిర్చి మొత్తం కాలి బూడిదైంది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ ఘటన అతిపెద్ద బ్రేకింగ్ న్యూస్. ఇక జర్నలిస్ట్‌లందరు మీడియా సంస్థల ఆదేశాలతో, కెమెరాలు, ఓబీ వ్యాన్‌లతో గుంటూరు మిర్చియార్డు వైపు పరుగులు పెట్టారు.

జిల్లాలలో ఉన్న మంగళగిరి,తెనాలి, సత్తెనపల్లి పలుప్రాంతాల అగ్నిమాపక వాహనాలు, అగ్ని మాపక సిబ్బంది దాదాపు 10-15 కు పైగా అగ్ని మాపక వాహనాలు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా మంటలు ఆరక ఉదయం నుండి రాత్రి వరకు మిర్చి యార్డు ధగ్ధం అవుతూనే ఉంది.

ఈ ప్రమాదాన్ని కవర్ చేసేందుకు చుట్టుప్రక్కల స్ట్రింగర్స్‌ని న్యూస్ కవరేజీకి పిలిచారు స్టాఫ్ రిపోర్టర్స్. అక్కడ పరిస్థితి చూస్తే మిర్చియార్డులోకి అడుగు పెట్టేందుకు తావులేదు. భారీ ఎత్తున అన్ని వైపులా మంటలు అయినప్పటికీ ఎటువంటి ప్రికాషన్స్ లేకుండా జర్నలిస్ట్‌లు న్యూస్ కవర్ చేస్తూనే ఉన్నారు. మిర్చియార్డు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో నివసించేవారు ఇళ్ళల్లో సామాన్లు మొత్తం రోడ్లపై, పొలాల్లో వేసుకుని కూర్చున్నారు. వీటిని కవర్ చేసేందుకు స్టాఫ్ రిపోర్టర్స్ స్ట్రింగర్స్‌కి ఆర్డర్ వేసి వాళ్ళు మాత్రం ఓబీ వ్యాన్లు దూరంగా పెట్టుకుని ప్రతీ బులెటిన్‌కు లైవ్‌లు ఇచ్చారు.

మన ఇంటి చుట్టు ప్రక్కల ఒకటి,రెండు మిరగాయలు మంటలో పడితేనే ఆ క్షణంలో మనం తుమ్ములు, దగ్గుతో అల్లాడిపోతాం. కొన్ని లక్షల టన్నుల మిర్చి తగలబడితే అక్కడ మనం ఉంటే ఇక ఎలా ఉంటుందో ఆలోచించండి. అటువంటిది రోజంతా చిటా,చిటా పేలుతూ ఉన్న మిర్చి, పొగచూరిన మంటల్లో మగ్గుతూ, భయంకరమైన, తుమ్ములు, దగ్గులు నడుమ పలువురు జర్నలిస్ట్‌లు అక్కడ విధులు నిర్వహించారు. అంతా ముగిశాక మిర్చియార్డు అగ్నిప్రమాదంలో న్యూస్ కవర్ చేసిన ప్రతి ఒక్క జర్నలిస్ట్ ఒక పెద్ద సమస్యను ఎదుర్కొన్నారు. ఆరోజు మొదలుకొని మూడు నాలుగు రోజుల వరకు అస్వస్థతకు గురయ్యారు. భగ,భగా మండిన మిర్చి పవర్‌కి, దట్టమైన పొగ కారణంగా జర్నలిస్ట్‌ల కళ్ళు ఎర్రగా చింత నిప్పుల్లా మారాయి. ఒళ్ళంత మూడు, నాలుగు రోజుల వరకు చుర, చుర మంటలు రోజుకు మూడు నాలుగుసార్లు స్నానం చేసినా ఒళ్ళు మంటలు తగ్గక పోగా, దానికి తోడు దగ్గు కొంతమంది జర్నలిస్ట్‌లకు ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్లా చేరి కొన్నిరోజుల పాటు దగ్గు తగ్గలేదు. ఇటువంటి

వారు డాక్టర్స్ వద్దకు వెళ్లి ట్రీట్మెంట్ తీసుకున్నారు. కొంతమంది స్టాఫర్లు,స్ట్రింగర్స్ కాలే కాలే మిర్చిలో కాళ్ళు వేసి పాదాలు కాల్చుకున్నారు. ఇదంతా పై స్థాయిలో డెస్కులో కూర్చుని అది కావాలి, ఇది కావాలి అని ఆదేశాలు జారీ చేసే వారికి జర్నలిస్టుల సమస్యలు ఏమీ పట్టవు. వాళ్లకు బ్రేకింగ్‌లు, టీ.ఆర్.పీ రేట్లే ముఖ్యం. ఈ విధంగా సమస్యలు ఎదుర్కొని జర్నలిస్టులు ఇబ్బందులపాలవుతున్నారు. అయినా మేము ఇంత కష్టపడ్డాం, ఇన్ని సమస్యలు ఎదుర్కొన్నాం అని బయటకు చెప్పరు. అదొక బాధ్యతగా ముందుకు సాగిపోతుంటారు. వృత్తి పరంగా ప్రతి కవరేజీలో మా జర్నలిస్టుల డెడికేషన్ ఇలా ఉంటుంది.

## కృష్ణానది వరదలు ఓలేరు ఘటన

అది 2009వ సంవత్సరం నాటి రేపల్లె నియోజకవర్గం భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామం నేడు నియోజకవర్గాల పునర్విభజనలో నేడు అదే గ్రామం వేమూరు నియోజకవర్గంలో ఉంది. ఆ ఓలేరు గ్రామంలో అర్ధరాత్రి అనంతరం కృష్ణానది తన విశ్వరూపం చూపిస్తూ అందరూ నిద్రిస్తున్న సమయంలో ఓలేరు వద్ద కరకట్ట తెంచుకుని గ్రామంపై పడింది. కేవలం పది నిమిషాల వ్యవధిలోనే ఓలేరుతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలను నడుములోతు నీళ్లతో ముంచెత్తింది. ఇక చూసుకో జిల్లాల్లో పనిచేస్తున్న స్టాఫర్లు, స్ట్రింగర్స్‌కి ఉన్నపళంగా ఓలేరు వెళ్ళాలని అక్కడ జరిగే ప్రతి విషయాన్ని కవర్ చేసి పంపాలి అని మీడియా పెద్దల ఆదేశాలు. వారు చెప్పినట్లే లేవడం, లేవడంతోనే జర్నలిస్టులందరు ఓలేరుకు పరుగులు. స్టాఫర్లు అయితే తెల్లవారిందాకా కూడా కాకుండా రెండు మూడు గంటల్లోనే అక్కడ దిగిపోయారు.

ఇక ఓలేరు చేరుకున్న స్ట్రింగర్స్‌కి ఓలేరు గ్రామంలోకి ప్రవేశించేందుకు ఎక్కడ సరియైన మార్గం కనిపించలేదు.అయినా ఓలేరులోకి వెళ్లేందుకు ఏదైనా మార్గం ఉంటుందేమోనని స్థానికులను విచారించారు. అప్పుడు స్థానికులు సమీప గ్రామాల్లోకి ప్రవేశానికి ఎటూ మార్గం లేదని అన్ని గ్రామాలను చుట్టుముట్టాయని వారు తెలిపారు. స్థానికంగా ఒక గ్రామానికి వెళితే అక్కడ ఒక చప్టా ఉందని దాని మీదుగా గ్రామంలోకి వెళ్ళవచ్చు కానీ జాగ్రత్తగా వెళ్లాలని స్థానికులు తెలిపారు. దానితో అక్కడ నుండి ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ప్రయాణించి స్థానికులు చెప్పిన చప్టాకు చేరుకున్నాం. చప్టాపై నడుములోతు నీరు ప్రవహిస్తుంది. అయినప్పటికీ ఓ నలుగురైదుగురు జర్నలిస్టులం ఒకరి చేతులు ఒకరు పట్టుకొని ఒకచేత్తో వెంట తెచ్చుకున్న కెమెరా బ్యాగులు నెత్తిన పట్టుకొని ఆ నడుములోతు నీళ్లలో ప్రాణాలు అరచేతి పట్టుకుని ఓలేరు చేరాము.

అంతే అక్కడ గ్రామస్తులు అప్పటికే వరద నీటిలో నుండి ఒకరికొకరు సాయంగా చేతులు పట్టుకుని ఒడ్డుకుచేరే ప్రయత్నం చేస్తున్నారు. స్టాఫర్లు అప్పటికే అక్కడకు చేరిపోయి విధుల్లో నిమగ్నమయ్యారు. అప్పుడే వచ్చిన స్ట్రింగర్స్ ఇక తమ కెమెరాలకు పనిచెప్పారు.

మరో ప్రక్క స్టాఫర్లు నాటు పడవల్లో అక్కడ చిక్కుకున్న పిల్లలను, వృద్ధులను, మహిళలను మెరక ప్రాంతాలకు చేరుస్తున్నారు. ఆ విజువల్స్ ఎక్స్‌క్లూజివ్‌గా ఉండాలి అని కెమెరా రికార్డింగ్ సమయంలో కెమెరా లెన్స్ అడుగుభాగాన లోగోతో పాటు తీస్తున్న విజువల్స్ రికార్డ్ అయ్యేలా వీడియోలను రికార్డ్ చేశారు. అంటే వేరే ఛానల్ వారికి పనికి రాకుండా విజువల్స్ ఎవరు కాపీ చేయకుండా జాగ్రత్త పడ్డారు. ఎందుకంటే అక్కడ స్టాఫర్లు కష్టపడి విధులు నిర్వహించారు. వారి కష్టాన్ని మరో ఛానల్ క్రెడిట్‌గా చూపుకోకుండా అలా వ్యవహరించారు. అక్కడ విధులు నిర్వహించిన ఏ జర్నలిస్ట్ అయినా స్వయంగా నడుములోతు నీటిలో దిగి సొంతంగా విజువల్స్ తెచ్చుకోవాల్సిందే. వేరే వేరే ఘటనలు అయితే ఒకరు రికార్డ్ చేసిన విజువల్స్ మరొకరికి కాపీ చేసేవారు. కానీ ఓలేరులో ఏ జర్నలిస్ట్ మరో జర్నలిస్ట్‌కు విజువల్స్ అందించలేదు. ఇలా అక్కడ ఘటనలు ప్రతి ఒక్క జర్నలిస్ట్ కష్టపడి వరద నీటిలో దిగి సాధించినవే.

కరకట్ట కోతకు అసలు కారణం ఏమిటంటే స్థానికంగా కృష్ణా కరకట్టకు వెలుపల రొయ్యలు చెరువులు ఉన్నాయి. వాటికి అవసరమైన నీటిని అందుకోవడం కోసం రొయ్యలచెరువుల రైతులు కరకట్ట క్రింది భాగంలో పైపులు వేసి రొయ్యల చెరువులకు కృష్ణానది నుండి నీళ్ళు పెట్టుకునేవారు. ఇక ఆ ఏడాది కృష్ణానది ఎగువ భాగాన కురిసిన వర్షాలకు, పులిచింతల ప్రాజెక్ట్ గేటు కొట్టుకుపోవడం ప్రధాన కారణాలు. పులిచింతల ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడంతో కృష్ణా నదిలో నిల్వ చేయాల్సిన నీరు కంటే ఎక్కువ నీరు 4 లక్షల క్యూసెక్కుల నీరు రావడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద నిల్వ సామర్థ్యం దాటిపోయింది.

దీనితో ప్రకాశం బ్యారేజీ వద్ద నీరు ప్రమాద స్థాయికి చేరుతుంది అని గ్రహించిన నీటి పారుదల శాఖా అధికారులు కృష్ణానది దిగువస్థాయి అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తూ నీటిని దిగువ ప్రాంతాలకు వదిలేశారు. దిగువ ప్రాంతంలో నదిలో తొమ్మిదిన్నర లక్షల క్యూసెక్కుల వరకు పెద్దగా ప్రమాదం లేకపోయినా కృష్ణానదిలో 10 లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీరు అంచనాలు దాటి ప్రవహించింది దీనితో కృష్ణమ్మ ఉదృత రూపం దాల్చింది. అప్పటికే అధికారులు దిగువ ప్రాంతాల ప్రజలను హెచ్చరిస్తూ రాత్రిపగలు కరకట్టపై టెంట్లు వేసుకుని కృష్ణమ్మ ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఆ ఏడాది అక్టోబర్ 6న కరకట్ట క్రింద రొయ్యల చెరువుల రైతులు వేసిన పైపులు గుండా కరకట్ట కోతకు గురై సుమారు ఓలేరు వద్ద రెండు గజాల వెడల్పున కరకట్ట కోతకు గురైయింది. సుమారు 10–15 గ్రామాలు నడుములోతు నీళ్లతో జలమయం అయ్యాయి. రైతుల పంట పొలాలు నీట మునిగి వందల ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోయారు.

ఇవన్నీ కవర్ చేస్తూ జర్నలిస్ట్‌లు అక్కడే ఉండి చీకటి పడే సమయానికి ఇళ్ళకు చేరి మరుసటిరోజు ఉదయాన్నే మరలా విధుల్లోకి హాజరయ్యేవారం. ముక్కులు పగిలిపోయే దుర్గంధంలో పరిసరాలను రికార్డు చేస్తూ, అక్కడ ప్రజలకు ఏర్పాటు చేసిన సహాయక శిబిరాలు, వాళ్ళ అవసరాలు వంటివి ఎన్నో వార్తలు కవర్ చేసి పంపించాము. అలాగే ఓలేరు ఘటనకు

ముందు కృష్ణానది ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుంటే అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుండేవారు. దీంతో కృష్ణానది కరకట్ట పొడవునా స్ట్రింగర్స్‌కి డ్యూటీలు వేయడం జరిగింది. అమరావతి కరకట్ట వెలుపల ఉన్న పొలాలు సైతం 5 అడుగులలోతు వరకు ముంపుకు గురయ్యాయి. చాలా మంది ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫర్లు అమరావతి కరకట్ట క్రింద మునిగిపోయిన పంటపొలాల్లో 5 అడుగుల నీటిలో కూడా దిగి లైవ్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో చాలా మంది స్టాఫర్లు కృష్ణానది కరకట్ట ప్రమాదపు అంచుల్లో ఉందని కరకట్ట ఎక్కడైనా ఏక్షణాన అయినా తెగిపోయే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాలు ప్రజలు, కృష్ణానది దిగువ ప్రాంతాన ఉన్న గ్రామస్థులు ఎలర్ట్‌గా ఉండాలని ఓలేరు కరకట్ట తెగక ముందే హెచ్చరికలు జారీ చేస్తూ తమ ఛానల్స్‌లో లైవ్‌లు ఇచ్చారు. జర్నలిస్ట్‌లు ఎక్కడ, ఏమిటి అనేది కరెక్టుగా చెప్పలేకపోయినా ఆ ఘటన ఓలేరు వద్ద జరిగింది. ఇలా మా జర్నలిస్ట్‌లు చేసిన ఆపరేషన్స్‌లో ఓలేరు ఘటన ఒకటి ఈ కవరేజీలో కూడా జర్నలిస్ట్‌లు ఎన్నో సమస్యలు ఎదుర్కొని సాహసాలు చేసి తమ మీడియా సంస్థలకు మంచి పేరు తెచ్చారు.

ఈ క్రమంలో నేను పనిచేస్తున్న మీడియా స్ట్రింగర్ ఒకరు ఓలేరు రైతుల పరిస్థితి, గ్రామస్థుల పరిస్థితి గ్రహించి రైతులకు అవసరం అయిన విత్తనాలు పంపిణీ, ప్రజల కోసం ఒక మెగా ఉచిత మెడికల్ క్యాంపు పెసర్లంకలో ఏర్పాటు చేయించాడు. ఇది జరిగిన కొన్నాళ్ళకు ఆ స్ట్రింగర్‌ని ఛానల్ నుండి తొలగించడమైనది. దానికి తగిన కారణాలు తెలియవు. ఇలా తప్పు జరిగినా, ఒప్పు జరిగినా బలయిపోయేది క్రింది స్థాయి జర్నలిస్ట్‌లే.

## ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

అది 2014వ సంవత్సరం. రాష్ట్రం రెండుగా విడిపోయాక చంద్రబాబు ఏపీకి మొట్ట మొదటి సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించే కార్యక్రమం ఏపీలో ఎక్కడ నిర్వహించాలి అనే విషయాన్ని ఎంతగానో ఆలోచించారు. ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామం నాగార్జున యూనివర్సిటీ ఎదుట యువగర్జన జరిగిన ప్రాంగణాన్ని చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసేందుకు వేదికగా ఎంచుకున్నారు. అయితే నాడు రాష్ట్ర ప్రభుత్వ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఐ.వై.ఆర్. కృష్ణారావు, నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ జేవీ రాముడు ఇతర అధికారులు యువగర్జన ప్రాంగణాన్ని పరిశీలించి చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వేదిక ఖరారు కావడంతో 2014 జూన్ 8 సాయంత్రం 7:30 గంటలకు ముహూర్తం ఖరారైంది. ఇక ఆ ప్రాంగణంలో జంగిల్ క్లియరెన్స్ నుండి అధికారులు, కొందరు టీడీపీ నాయకుల పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు అన్నీ కవర్ చేసేందుకు స్టాఫ్ రిపోర్టర్స్ రావడంతో పాటు అక్కడ జరిగే ఏ కార్యక్రమం మిస్ కారాదని మంగళగిరి స్ట్రింగర్స్‌కి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారు.

అయితే యువగర్జన టైంలో రెండు మూడు ఛానల్స్ మాత్రమే ఉండగా, 2014 నాటికి దాదాపు ఇప్పుడున్న ఛానల్స్ అన్నీ 2014లో ఉన్నాయి. ఇక ఆ ప్రాంగణం చంద్రబాబు ప్రమాణస్వీకారం జరిగే రోజు వరకు స్థానిక జర్నలిస్టులతో కళ కళలాడుతూ ఉండేది. ఆ ఏడాది వర్షాలు లేకపోవడంతో జూన్ 8వ తేదీ వచ్చినా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండేది. జర్నలిస్టులు అక్కడ విధులు నిర్వహిస్తూ ఖాళీ సమయాల్లో కొంత స్వేద తీరుదాం అన్నా కాస్త నీడ కూడా కనిపించేది కాదు. అధికారులు వేసిన టెంట్లులో కూర్చుందామన్నా అక్కడ వారికి సరిపడే కుర్చీలు, టెంట్ నీడ ఉండేది కాదు. దానితో ఆప్రాంగణం ప్రక్క ఓ మామిడితోట ఉండేది. అక్కడ ఉండేవాళ్ళం. అయితే అక్కడ ఉండటం వల్ల ప్రాంగణంలోకి వచ్చే, పోయే నాయకుల, అధికారుల వివరాలు తెలిసేవి కాదు. దానితో ఒకరిద్దరు స్ట్రింగర్స్ ని మైదానంలో పెట్టి మిగతా వాళ్ళం మామిడితోటలో స్వేద తీరే వాళ్ళం. దాహం వేసినా, ఆకలి అనిపించినా ఎదురుగా ఉన్న నాగార్జున యూనివర్సిటీ క్యాంటీన్‌కి వెళ్ళే వాళ్ళం. అదీ అందరూ ఒకసారి వెళితే ఏ వార్త మిస్ అవుతామోనని విడతలవారీగా వెళ్ళేవాళ్ళం. మామిడితోటలో నీడలో కూర్చున్న వేడి వడగాలికి మగ్గిపోయేవాళ్ళం. సాయంత్రానికి వడబారిపోయిన ముఖాలతో నీరసించి పోయేవాళ్ళం.

ఇక జూన్ 8రానే వచ్చింది. యువగర్జనలో ఎలా జర్నలిస్టులు విధులు నిర్వహించారో అదే విధిగా విజయవాడ, గుంటూరు, మంగళగిరి జర్నలిస్టులతో పాటు కొంతమంది చుట్టుపక్కల ప్రాంతాల స్ట్రింగర్స్, ఒకరిద్దరు హైదరాబాద్‌కు చెందిన స్పెషల్ కరస్పాండెంట్స్ ప్రతి ఛానల్ తరుపున విధులు నిర్వహించేందుకు ఆ ప్రాంగణానికి ఉదయం ఆరుగంటలకే దిగిపోయారు. అయితే స్ట్రింగర్స్‌కు ఈ కార్యక్రమంలో యువగర్జనలో లా ఇబ్బందులు అయితే లేవు. అంతా హైదరాబాద్ నుండి వచ్చిన స్పెషల్ కరస్పాండెంట్స్, విజయవాడ, గుంటూరు జర్నలిస్టులే ప్రధాన ఘట్టాలన్నీ కవర్ చేసి స్ట్రింగర్స్‌ని నామమాత్రంగా వాడుకున్నారు. అయినప్పటికీ ఉదయం ఆరు గంటలనుండి రాత్రి పొద్దుపోయే వరకు నిలువనీడలేక ఎండలో మగ్గిపోయి సభాప్రాంగణంలో ఉడికిపోయి చెమటలు పట్టి జర్నలిస్టులందరూ నీరసించి పోయారు. వేదికపై ఏసీలు, వేదిక ఎదురుకూర్చున్న వీఐపీలకు ఏసీలు మిగతా ప్రజలు, పోలీసు, ఇతర అధికారులు అంతా నాటి ఎండలు ధాటికి ఎక్కడ వాళ్ళు అక్కడ కూలబడిపోయారు. వాస్తవానికి క్రింది స్థాయి జర్నలిస్టులకు అక్కడ పని లేకుండా చేసిన విజయవాడ, గుంటూరు స్టాఫర్లు, హైదరాబాద్ నుండి వచ్చిన స్పెషల్ కరస్పాండెంట్స్ కూడా ఆ రోజు బాగా నీరసించిపోయారు. కార్యక్రమం ముగిశాక వేదిక నుండి ప్రక్కకు వచ్చి అరగంటపైగా విశ్రాంతి తీసుకుని అప్పటికే నీరసంగా కష్టంగా తిరుగు ప్రయాణం కట్టారు. ఇక స్ట్రింగర్స్‌ని మాత్రం ప్రతి ఒక్కరు అక్కడ నుండి వెళ్ళేదాకా అక్కడే ఉండాలి అని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం నుండి ఖాళీగా ఉన్న మనం ఈ ఒక్క పని కూడా చేయకపోవడం బాగోదని స్ట్రింగర్స్ అక్కడ ఉండి ఏ

అర్ధరాత్రికో ఇళ్ళకు చేరారు. మొత్తానికి యువగర్జనలో ఫేస్ చేసిన సమస్యలు అయితే ఈ కార్యక్రమంలో లేవు.

అయితే తెల్లవారినుండి మరో కార్యక్రమానికి స్ట్రింగర్స్ సిద్ధం కావాల్సి వచ్చింది. నాటి సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు కోసం రాష్ట్ర స్థాయి అధికారులు, పోలీసులు, ఒకరిద్దరు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో భవనాలను పరిశీలించేందుకు వచ్చారు. వారి రాక కోసం ఉదయం వెళ్లిన స్ట్రింగర్స్ అప్పటికీ అలసిపోయి ఉన్నారు. చివరకు మధ్యాహ్నం అనంతరం వారిరాకతో న్యూస్ కవర్ చేసి ఊపిరి పీల్చుకున్నారు. ఈ కవరేజీలో కొసమెరుపు ఏమిటంటే కేవలం సీఎం క్యాంప్ కార్యాలయానికి భవనాలు పరిశీలించిన అధికారులు ఏపీ అసెంబ్లీ భవనం కూడా ఇక్కడే ఏర్పాటు చేసేందుకు వెళుతూ, వెళుతూ వర్సిటీ మెయిన్ గేట్ సమీపంలో ఉన్న డైక్‌మెన్ ఆడిటోరియంను పరిశీలించారు. ఇది గమనించని కొందరు స్ట్రింగర్స్ డైక్‌మెన్ ఆడిటోరియం పరిశీలనను కవర్ చేయలేకపోయారు. అధికారులు తిరుగు ప్రయాణం కట్టడంతో ప్రోగ్రామ్ అయిపోయింది అనుకున్నారు కొందరు స్ట్రింగర్స్ అందుకే దాన్ని కవర్ చేయలేకపోయారు. ఒకటి, రెండు లీడింగ్ ఛానల్స్ రిపోర్టర్స్ డైక్‌మెన్ ఆడిటోరియం పరిశీలనను కవర్ చేసి బయటకు వచ్చి స్క్రోలింగ్స్ చెప్పారు.

ఇక ఒక ఛానల్‌లో స్క్రోలింగ్ వచ్చింది అంటే హడావుడి ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. డైక్‌మెన్ ఆడిటోరియం పరిశీలనను కవర్ చేసిన జర్నలిస్టులు హడావుడిగా విజువల్స్ పంపించే కార్యక్రమంలో నిమగ్నమయితే, చేయలేని స్ట్రింగర్స్ ఆ విజువల్స్ కోసం శతవిధాలా ప్రయత్నాలు చేశారు. అందిన వారు అందినట్లు మేము ముందు, మేము ముందు అని హైదరాబాద్ ఆఫీసులకు విజువల్స్ అప్‌లోడ్ చేశారు. విజువల్స్ దొరకని స్ట్రింగర్స్ మరలా వర్సిటీకి వెళ్ళి డైక్‌మెన్ ఆడిటోరియం అవుట్ లుక్ విజువల్స్ తీసి పంపారు. ఇలా ఎక్స్‌క్లూజివ్, ఫస్ట్ ఆన్, బ్రేకింగ్ అంటూ ఎవరికి వారు ఛానల్స్‌లో ఆ విజువల్స్‌కి వాటర్ మార్క్ వేసి ప్రసారం చేసుకున్నారు. నాటి నుండి స్థానిక స్ట్రింగర్స్‌లో ఐక్యమత్యం లోపించింది. డైక్‌మెన్ ఆడిటోరియం అధికారుల పరిశీలన కవర్ చేసిన వారు ఒక వర్గం కవర్ చేయలేని వారు మరో వర్గంగా చీలిపోయారు. ప్రతి ఒక్క జర్నలిస్ట్ కు పోటీతత్వం పెరిగింది. ఒక్కొక్కరికి ఎవరికి వారే ఓ ప్రత్యేక విధానం ఏర్పర్చుకున్నారు. ఇలా స్ట్రింగర్స్ మధ్య అందరికంటే ముందుండాలి అనే భావన కల్పిస్తున్న మీడియా సంస్థలు స్ట్రింగర్స్ మధ్య ఐక్యమత్యాన్ని దెబ్బ తీస్తున్నాయి.

## విజయవాడ నాగవైష్ణవి కిడ్నాప్, మర్డర్

చిన్నారి నాగ వైష్ణవి కిడ్నాప్, మర్డర్ నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం రేకెత్తించింది. విజయవాడకు చెందిన పలగాని ప్రభాకరరావు కుమార్తె నాగవైష్ణవి. 2010 జనవరి 30 న కారులో స్కూల్‌లోకి వెళ్తోన్న వైష్ణవిని దుండగులు అపహరించారు. దీన్ని అడ్డుకోడానికి ప్రయత్నించిన డ్రైవర్ లక్ష్మణరావుపై కత్తితో దాడిచేసి నడిరోడ్డుపై హతమార్చారు.

విజయవాడలో కిడ్నాప్ అయిన నాగవైష్ణవిని కిరాయి హంతకులు నాడు మంగళగిరి వైపు తీసుకొచ్చారు. అప్పటి వరకు విజయవాడలో జల్లెడ పట్టిన పోలీసులు మంగళగిరి వైపు దృష్టి పెట్టకపోవడం కిరాయి హంతకులకు తప్పించుకునేందుకు ఎక్కువ సమయం దొరికింది. అయితే విజయవాడ నుండి కనకదుర్గమ్మ వారధి మీదుగా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి చేరుకున్నారు. ఈ విషయం ఎవరు గమనించలేదు. అప్పటికే టీవీల్లో బ్రేకింగ్ అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో స్క్రోలింగ్స్ వచ్చాయి. దానితో విజయవాడ చుట్టు ప్రక్కల ప్రాంతాలతో పాటు మంగళగిరి విలేకరులు, పోలీసులు ఎలర్ట్ అయ్యారు. అయితే నాగవైష్ణవిని కిడ్నాప్ చేసిన కిరాయి హంతకులు తాడేపల్లి బోటు యార్డు తూర్పు దిక్కున ఉన్న రోడ్డులో రైల్వే ట్రాక్ ప్రక్కన పాపను కిడ్నాప్ చేసిన వాహనాన్ని వదిలి అక్కడ నుండి మాయం అయ్యారు. అప్పటికే జర్నలిస్టులు వార్త కవర్ చేసేందుకు మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో ఆ అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతాలన్నింటిలో తిరిగేశారు.

ఇక కారు డ్రైవర్ లక్ష్మణరావుని తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రికి తీసుకొచ్చారని సమాచారం రావడంతో మణిపాల్ ఆసుపత్రికి వెళ్లాం కానీ అక్కడకు తీసుకురాలేదు. ఇక మంగళగిరి జర్నలిస్టులందరు వెనుదిరిగారు. ఉండవల్లి చేరేందుకు బోటుయార్డు రోడ్డులో వస్తుండగా ఆ రోడ్డులో ఓ వాహనం ఉంది. వాహనము ఉన్న ప్రాంతంగుండా వెళ్లిన జర్నలిస్టులు వాహనాన్ని చూసి చూడనట్లు వెళ్లిపోయాం. మరి కొన్ని గంటల తరువాత మరలా అదే మార్గంలో వేరే ప్రాంతానికి వెళ్లేందుకు వచ్చాం. అప్పుడు అక్కడ నిలిపి ఉన్న వాహనంపై మా జర్నలిస్టుల బృందానికి అనుమానం వచ్చింది. అయితే అదే నాగవైష్ణవిని కిడ్నాప్ చేసిన వాహనం అని ముందు తెలియలేదు. రెండవసారి అక్కడకు చేరుకున్న మేము వాహనం ఒకటి పలానా చోట అనుమానాస్పదంగా ఉంది అని మా సీనియర్ జర్నలిస్ట్ ఒకరు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు క్షణాల్లో అక్కడకువచ్చి ఈ వాహనం ఇక్కడ ఎంతసేపు నుండి ఉంది అని మమ్మల్ని విచారించి వాహనాన్ని పరిశీలించిన తాడేపల్లి పోలీసులు విజయవాడ పోలీసులకు ఫోన్ చేసి వాహనం వివరాలు కనుక్కుని అక్కడ విచారణ చేపట్టారు. విజయవాడ పోలీసులనుండి రాబడిన సమాచారం మేరకు అక్కడ నిలిపి ఉన్న వాహనంలోనే నాగవైష్ణవిని కిడ్నాప్ చేశారని పోలీసులు మాకు తెలిపారు. ఇంకేముంది ఆ వాహనాన్ని, పోలీసులు ఆ వాహనం పరిశీలిస్తున్న విజువల్స్ తీసి బిగ్ బ్రేకింగ్ అంటూ స్క్రోలింగ్స్ చెప్పి విజువల్స్ అప్‌లోడ్ చేశాం. పంపించిన క్షణంలో విజువల్స్ వార్త ప్లే అయ్యాయి.

ఇక గుంటూరు నుండి ఎస్పీ, వాహనం ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. ఆయన రావడం, రావడం జిల్లాలో పోలీసులను ఆయా బృందాలుగా ఏర్పాటు చేసి చుట్టు ప్రక్కల ఉన్న ప్రాంతాల్లో జల్లెడ పట్టించారు. అయినా ఎక్కడ నాగవైష్ణవి ఆచూకీ లభించలేదు. అయినప్పటికీ పోలీసులు,జర్నలిస్టులు వేరు వేరుగా బృందాలుగా ఏర్పడి నాటి నుండి కొన్నిరోజులు ప్రతీ చోట వెతుకుతూనే ఉన్నాం.

ఈ క్రమంలో తుళ్లూరు మండలం హరిచంద్రపురంలో కృష్ణానదిలో ఒక పాప మృతదేహం ఉంది అని సమాచారం జర్నలిస్టులకు అందింది. వెంటనే మంగళగిరి నుండి జర్నలిస్టులు హరిశ్చంద్రపురం చేరుకున్నాం. కొన్ని ఛానల్స్ నాగవైష్ణవి మృతదేహం లభ్యం


అంటూ గుడ్డిగా బ్రేకింగ్ న్యూస్ వేసేశాయి. ఇక స్థానిక స్ట్రింగర్స్ ప్రమేయం లేకుండా రెండు మూడు మీడియా సంస్థల ఓబీ వ్యాన్లు నిమిషాల్లో హరిశ్చంద్రపురం కృష్ణానది వద్దకు వచ్చేశాయి. అక్కడకు అంతకు ముందు చేరుకున్న జర్నలిస్ట్‌లకు నదితీర ప్రాంతంలో ఎంత వెతికినా అక్కడ ఎటువంటి మృతదేహం లభించలేదు. అనుమానం తీరక గ్రామస్తులను విచారించగా వాళ్ళు కూడా అనుమానంతో కృష్ణానదిలో దిగి తీరప్రాంతం మొత్తం వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ లోగా తుళ్లూరు పోలీసులు, మరి కొంతమంది ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫర్లు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అక్కడకు చేరుకున్నారు. మొత్తానికి ఏమీ లేదని పుకార్లు షికారు చేశాయని తెలుసుకుని అందరూ వెనుదిరిగారు.

ఇక ఆ పుకారు వచ్చిన నాటినుండి రెండు, మూడు రోజుల వరకు స్ట్రింగర్స్, కొంతమంది స్టాఫర్లు నాలుగైదు రోజులు తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో అక్కడ, ఇక్కడా అనకుండా రాత్రులు కూడా వేట కొనసాగించారు. అయినా నాగవైష్ణవి ఆచూకీ లభించలేదు.

వారం పై బడిన తరువాత అంతా సర్దుమణిగింది అనుకున్న సమయంలో గుంటూరు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫర్లు పోలీసుల సహకారంతో పెద్ద పెద్ద అక్షరాలతో రాత్రి 8:00, 8:30 సమయంలో బిగ్ బ్రేకింగ్ అంటూ ఒక ఛానల్ తరువాత ఒక ఛానల్ సరిసమానంగా స్క్రోలింగ్స్ వేశాయి. గుంటూరు ఆటోనగర్‌లో ఓ షెడ్డులో కొలిమిలో కాలి బూడిదైన నాగవైష్ణవి మృతదేహం లభ్యం అని ప్రతీ ఛానల్‌లో స్క్రోలింగ్స్. ఇక రాష్ట్రం మొత్తం ఆ బ్రేకింగ్స్ సంచలనం సృష్టించాయి. గుంటూరు సమీపప్రాంతంలో ఉన్న ప్రజలతో పాటు మంగళగిరి జర్నలిస్ట్‌లు ఆఘమేఘాల మీద గుంటూరు ఆటోనగర్‌కి చేరారు. జనంతాకిడి ఎక్కువయ్యింది. పోలీసులకు జనాన్ని నివారించడానికి పెద్ద సాహసమే అయ్యింది.


ఈ క్రమంలో ఐడీ కార్డు లేకుండా ఘటనా ప్రాంతానికి చేరుకోవటానికి సాధ్యపడలేదు మంగళగిరి స్ట్రింగర్స్‌కి దీనితో కెమెరా బ్యాగుల్లో ఉన్న లోగోలు, కెమెరాలు చూపించి ఐడీ కార్డు లేని జర్నలిస్ట్‌లు కొలిమి దగ్గరకు చేరగలిగారు. కానీ,అప్పటికే జిల్లా స్టాఫర్లు ఓబీ వ్యానులు పెట్టుకుని ప్రతీ బులెటిన్‌కి వార్తలు అందిస్తున్నారు. బులెటిన్ మొత్తం నాగవైష్ణవి కిడ్నాప్, హత్య గురించే వార్తలు అందించారు. నెక్స్ట్ బులెటిన్‌కి ఏమి ఇవ్వాలి, ఏమి ఇవ్వాలి అని స్టాఫర్లు ఆలోచిస్తుంటే, అక్కడకు వచ్చే నాయకులు, స్వచ్ఛంద సేవసంస్థల నిర్వాహకులు, పోలీసు అధికారులు, మహిళా సంఘాల మహిళలు, సమాజ సేవకులు, పలువురు వ్యక్తులను లైవ్ కార్యక్రమాల్లో వారి అభిప్రాయాలు తెలిపేందుకు ఒకొక్కరిని లైవ్ వెహికల్ వద్దకు చేర్చడం, లైవ్ వ్యాన్ కేబులు వైర్లు లాగడం. లైవ్ ఇస్తున్న స్టాఫర్లుకి ఇబ్బంది లేకుండా జనం కెమెరాలకు అడ్డురాకుండా చూసుకోవడం స్ట్రింగర్స్ పని మొత్తానికి ఒక పెద్ద ఇన్సిడెంట్‌ని బ్రేక్ చేసిన ఘనత గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్‌కి దక్కింది. స్ట్రింగర్స్ కూడా ఈ సంఘటన బ్రేక్ చేసేందుకు చాలా కష్ట పడ్డారు. రోజులు తరబడి వైష్ణవి కోసం వెతికినా గుంటూరు ఆటోనగర్ లో నాగవైష్ణవి మృతదేహం లభించడంతో నాటి రాత్రితో నాగవైష్ణవి కిడ్నాప్ మర్డర్ కథ సుఖాంతం అయ్యింది.

# 6. అమరావతిలో - జర్నలిస్టులు ఎదుర్కొన్న కవరేజ్ సమస్యలు-(2)




**"ప్రమాదకరమైన సంఘటనలు, ప్రత్యేకమైన వార్తా కవరేజ్ (అసైన్ మెంట్స్) చేయాల్సిన పరిస్థితుల్లో జర్నలిస్టులకు, కెమెరామెన్స్ రక్షణకు భాద్యులు ఎవరు...? ప్రాణాలు పోయినా కన్నెత్తి చూడని మీడియా సంస్థల తీరు ఏమిటి...?"**

## రాష్ట్రంలో సైకో సాంబ టెర్రర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి మొత్తం ఆరు జిల్లాల్లో మూడేళ్ళ పాటు ఆయా జిల్లాల్లో పలు ప్రాంతాల్లో పోలీసులకు, ప్రజలకు నిద్రలేని రాత్రులు గడిపారు. కారణం రాష్ట్రంలో సగం జిల్లాల్లో సైకోసాంబ సృష్టించిన టెర్రర్. అత్యంత భయంకరమైన నేర చరిత్ర కలిగిన సైకోసాంబ నేర చరిత్ర ఒకరకంగా ఉండేది కాదు. దోపిడీలు, దొంగతనాలు, దాడులు, మహిళలపై అత్యాచారాలు, ఎదురు తిరిగితే రక్తం కళ్ళజూడటం, అవసరమైతే హత్య చేయడం ఇలా ఉండేది సైకోసాంబ నేరాలు చేసే విధానం. అయితే వీటన్నింటిలో మహిళలపై దాడి చేయడమే అతని ప్రధాన లక్ష్యం. రైల్వే గేట్స్, రైల్వే లెవెల్ క్రాసింగ్స్ వద్ద ఉండే చిన్నపాటి షేడ్స్, రైల్వే ట్రాక్స్, రైల్వేస్టేషన్స్ వీడి నివాస ప్రాంతాలు. వాడు ఉన్న ప్రాంతాల్లో పగలు మాములుగా ఏమీ తెలియని వ్యక్తిలా సంచరించడం, రాత్రి అయ్యేసరికి తన విశ్వరూపం ప్రదర్శించి ఎవరికీ దొరక్కుండా వేరే ప్రాంతానికి చెక్కేయ్యటం సైకోసాంబ నేరాలు చేసే తీరు ఇలా ఉండేది. అతను నేరం చేసిన విధానాన్ని బట్టి సైకో అయితేనే ఇలాంటి నేరం చేస్తాడు అని పోలీసులు గ్రహించారు. అయితే అప్పటికీ సైకో చేస్తున్న నేరాలు చూసి పోలీసులు ఆశ్చర్యపోయేవారు. ఇంతలా దాడులకు పాల్పడి చోరీలు చేస్తున్నది ఎవరా....?అని తలలు పట్టుకునేవారు. ఎంతకీ వారికి బోధపడేది కాదు. ఈ క్రమంలో ఓ సారి తెనాలి లేడీస్ హాస్టల్‌లో దూరి ఓ విద్యార్థినిని దారుణంగా ముఖంపై కత్తితో కోసేశాడు. దీనితో ఆరు జిల్లాల్లో సైకోసాంబ చేసిన ఇటువంటి ఘటనలు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చాయి. అప్పటి నుండి పైన చెప్పబడిన ఆరు జిల్లాల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు.

ఇక అప్పటికే ఆరు జిల్లాల్లో టెర్రర్ పుట్టించిన సైకో సాంబ పై అతను ఎవరనేది తెలియకుండానే మొట్ట మొదటి కేసు కృష్ణా జిల్లా విజయవాడలో 2005లో కేసు నమోదయింది. అయితే ఆ కేసు దర్యాప్తు పోలీసులకు సాధ్యపడలేదు. రాను, రాను రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో అక్కడ, ఇక్కడ అని ఏమీ లేదు. ఆరు జిల్లాల పరిధిలో రోజుకో ప్రాంతంలో సైకో సాంబ నేరాలు చేస్తూ విజయయాత్ర కొనసాగించాడు.ఎక్కడ ఏ నేరం చేసినా ఎవ్వరికి చిక్కేవాడు కాదు. ఈ క్రమంలో ఒకసారి మంగళగిరి రైల్వేస్టేషన్ వద్ద ఇద్దరు వృద్ధ దంపతులు మాత్రమే నివసించే ఒక భవనంలోకి ప్రవేశించి ఆభవనంలో ఉన్న వృద్ధదంపతులపై విచక్షణారహితంగా ముఖంపై గాయాలు చేశాడు. దానితో వారు స్పృహతప్పి పడిపోయాక ఇంటిలో చోరీ చేసి ఎప్పటిలాగే ఎవరికి దొరక్కుండా పారి పోయాడు.

తెల్లవారాక అక్కడే మరో భవనంలో రూంలో ఉంటున్న నా మిత్రుడు సిటీ కేబుల్ కెమెరామెన్ రాధా విషయాన్ని గ్రహించాడు. వెంటనే పోలీసులకు మీడియా మిత్రులకు సమాచారం అందించాడు. ఇక పోలీసులు రంగంలోకి దిగాక వృద్ధులను ఆసుపత్రికి చేర్చి ఇంటిని పరిశీలించారు.అయితే ఇంటిలో అంతా చెల్లాచెదురుగా ఉన్నా పెద్దగా డబ్బుగానీ, ఇతర వస్తువులు గానీ చోరీ జరగలేదు. కొంత విదేశీ కరెన్సీ కూడా అక్కడ ఉన్నా ఆ కరెన్సీని సైకోసాంబ ముట్టలేదు. పోలీసులు అనుమానంతో ఆ ఇంటి ఎదురు సీసీ కెమెరాలు ఉన్న విషయాన్ని గ్రహించారు.సాయంత్రానికి సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు ఆ ఫుటేజీలో చొక్కాలేని వ్యక్తి, మోకాళ్ళ పైకి మడత వేసిన ప్యాంట్‌తో ఉన్న వ్యక్తి గేటు తీసుకుని ఇంటిలోకి వెళ్ళి అక్కడ పార్కు చేసి ఉన్న బైక్ సీట్ కత్తితో కోయడం, కిటికీల గుండా లోపలికి తొంగి, తొంగి చూడడం అటు, ఇటు తిరుగుతూ దేనికోసమో వెతకడం వంటి విజువల్స్‌ని సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గ్రహించారు.

ఇతర జిల్లాలో జరిగిన దాడులు, చోరీలు కూడా పరిశీలించిన పోలీసులు ఆరు జిల్లాల సంఘటనలకు వీడే కారణం అని ఓ క్లారిటీకీ వచ్చారు. అప్పటికీ వాడిపేరు, ఊరు తెలియనప్పటికి వాడు చేస్తున్న నేరాలను పరిశీలించిన పోలీసులు వాడు ఒక సైకోగా మంగళగిరి పోలీసులు గుర్తించారు.

ఆరు జిల్లాల పోలీసుల విచారణలో వాడి అసలు పేరు రాచకొండ సాంబశివరావు అని, అతనిది గుంటూరు జిల్లా ప్రత్తిపాడు అని పోలీసులు వివరాలు వెల్లడించారు. ఇక ఆరోజుల్లో ఇలాంటి దాడులకు పాల్పడుతుంది సైకోసాంబ అని ఇటువంటి దాడులు ఎక్కడ జరిగినా మీడియా సంస్థలు విజువల్స్ అర్జంట్, అర్జంట్ అంటూ తమ జర్నలిస్ట్‌లను ఉరుకులు, పరుగులు పెట్టించారు. సైకోసాంబ దాడులపై రోజు టీవీల్లో, పేపర్లలో సైకోసాంబ అక్కడదాడి, ఇక్కడదాడి అంటూ వరుస కథనాలు ప్రసారం/ప్రచురణ అయ్యేవి. అయినప్పటికీ సైకోసాంబను పోలీసులు పట్టుకోలేకపోయారు. ఆరు జిల్లాల్లో సైకోసాంబ చేసిన నేరాలపై కేసులు తప్ప సైకోసాంబ మాత్రం దొరకలేదు.

## మంగళగిరిలో సైకో సాంబ ఫీవర్‌లో ప్రజలు

మంగళగిరిలో ఆ వృద్ధ దంపతులపై దాడి ఘటన సైకో సాంబ పనేనని టీవీల్లో, పేపర్లలో వార్త చూసిన మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు సైకో సాంబ మంగళగిరి వచ్చాడట..! అని చెప్పుకోవడం నాటి నుండి పలు గ్రామాల్లో యువకులు రాత్రులు కర్రలు, ఇనుప రాడ్లు చేతబట్టి తెల్లవార్లు విడతల వారీగా గస్తీలు తిరిగేవారు. ఈ క్రమంలో పోలీసులు కూడా సైకో సాంబ కోసం రాత్రులు మారు వేషాల్లో లుంగీలు, తలకు గుడ్డ, మెడలో

కండువాలు వేసుకుని డ్యూటీలు నిర్వహించేవారు. మండలంలో అన్ని గ్రామాల ప్రజలకు సైకో సాంబ ఫీవర్ పట్టింది. ఇక మా మీడియా సంస్థలు గ్రామాల్లో యువకులు చేపట్టిన గస్తీ విజువల్స్ పంపండి. ఏ క్షణానైనా సైకో సాంబ పట్టుబడితే వెంటనే విజువల్స్ ఆఫీసుకు అప్‌లోడు చేయాలని ఆదేశాలు. దానితో మండలంలోని పలు గ్రామాల్లో యువకులు గస్తీ చేస్తుంటే,వాటి విజువల్స్ పంపించడం సైకో కోసం మేము కూడా గాలిస్తూ నిద్రలేని రాత్రులు గడిపాం. మంగళగిరి పట్టణం, మండలంలోని నూతక్కి, రామచంద్రాపురం, పెద్ద వడ్లపూడి గ్రామాల్లో రాత్రులు విధులు నిర్వహించాం. ఈ క్రమంలో ఒకసారి పెద్ద వడ్లపూడికి సైకో సాంబ వచ్చాడంటూ గ్రామస్తులు చెపితే అక్కడకు వెళ్లిన మమ్మల్ని చూసిన గ్రామస్థులు అటుపోయాడు, ఇటు పోయాడు అంటే వెతికేందుకు చీకట్లో ఓ ముగ్గురు, నలుగురు స్ట్రింగర్స్ జొన్న చేలోకి వెళ్లాం. అక్కడ నుండి తిరిగి వచ్చే క్రమంలో ఓ ముసలమ్మ మమ్మల్ని చూసి వచ్చాడు, వచ్చాడు, అని పెద్ద పెద్దగా కేకలు వేయడంతో అక్కడే కర్రలు, రాడ్లు పట్టుకుని ఉన్న గ్రామస్తులు మాలో ఒక స్ట్రింగర్‌పై దాడికి సిద్ధమయ్యారు. జొన్న చేను బయట ఉన్న కొందరు స్ట్రింగర్స్ కాదు, కాదు అని పెద్దగా కేకలు వేసి దాడికి సిద్ధమైన గ్రామస్తులకు అడ్డుపడి ఆపారు. లేదంటే ఆ చీకటిలో నాడు ఎవరో ఒక స్ట్రింగర్ బలైపోయేవాడు. అంత నిబద్ధతతో పనిచేసాం. అనుమానంగా ఎవరు కనిపించినా వాడే సైకో సాంబ అంటూ గ్రామ ప్రజలు ఏ మాత్రం ఆలోచించకుండా దాడి చేసేందుకు సిద్ధమయ్యేవారు. అంత భయాం దోళనలు మధ్య ప్రజలు బ్రతికారు.

## పెద్ద వడ్లపూడిలో సైకో సాంబ...? అసలు విషయం

ఆరు జిల్లాలో ఏ ఘటన జరిగినా సైకో సాంబ అంటూ ప్రజలు భపడిపోయేవారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెద్ద వడ్లపూడిలో ఓ పగటి పూట బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి ఓ ఇంటి ముందుకు వచ్చి తచ్చాడుతుండగా ఇంటి బయట నిద్రిస్తున్న మహిళ మెలకువ వచ్చి అతన్ని చూసి భయపడి ఇంటిలోకి వెళ్ళి పెద్ద పెద్ద కేకలు వేసింది. అయితే అతను మద్యం సేవించి ఉన్నాడు. ఆమె కేకలు విన్న గ్రామస్థులు పరుగు, పరుగున అక్కడికి వచ్చి చూస్తే మద్యం మత్తులో ఉన్న అతని చేష్టలు చూసి సైకోసాంబగా అనుమానించి పెద్ద ఎత్తున అతన్ని చుట్టి ముట్టి అతనిపై దాడి చేస్తూ కర్రలు, బండలు, బాదులు తీసుకుని చితకబాదారు. ఆ దెబ్బలకు అతడు స్పృహ తప్పిపడిపోయినా గ్రామస్థులు అతన్ని వదిలి పెట్టలేదు. ఇంతలో పోలీసులకు, మీడియాకు సమాచారం అందింది. మొత్తం పోలీసు, మీడియా క్షణాల్లో పెద్దవడ్లపూడి చేరారు. మీడియా సంఘటనా ప్రాంతానికి చేరుకోకుండానే మంగళగిరి మండలం పెద్దవడ్లపూడిలో సైకో వీరంగం, సైకో పై గ్రామస్థులు దాడి, సైకోను బంధించి పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు అంటూ అన్ని టీవీల్లో స్క్రోలింగ్స్.

ఇక మా మీడియా పెద్దలు ఊరుకుంటారా...? విజువల్స్ విజువల్స్ అంటూ ఒకటే పోరు. తీరా మేము అక్కడకు చేరేసరికి అప్పటికే పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని మంగళగిరి ఎన్నారై ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్థులు పోలీసు జీపును అడ్డగించి అతన్ని తమకు అప్పజెప్పాలని జీపును ఇంచి కూడా కదలకుండా అడ్డు పడిపోయారు.కొంతమంది యువత, మహిళలు జీపుకు అడ్డంగా పడుకుంటే, ఇంకొంతమంది జీపు అద్దాలపై దాడికిదిగి ఆ వ్యక్తిని తమకు అప్పగించాలని పోలీసులతో వాదనకు దిగారు. పోలీసు జీపు అక్కడ నుండి బయటకు రావడానికి చాలా సమయం పట్టింది. కొద్దిసేపటికి పోలీసు జీపు బయటకు వచ్చింది ఇక మీడియా హడావుడి చూస్తే అంతా, ఇంతా కాదు. ఈ లోగా మాకు ఎదురు వచ్చిన పోలీసు జీపులోనే సైకో సాంబ ఉన్నట్లు భావించి పోలీసు జీపు వెనుక కెమెరాలు ఆను చేసుకుని రికార్డింగ్‌లో పెట్టి జీపుని వెంటాడాం.. జీపు ఏమో 100-120 కిలోమీటర్ల వేగంతో వెళుతుంది. దాని వెనుక మంగళగిరి మీడియా స్ట్రింగర్స్ జీపులో ఉన్న వ్యక్తి విజువల్స్ తీసేందుకు 70-80 కిలోమీటర్ల వేగంతో బైకులపై జీపుని ఛేజింగ్ అచ్చంగా సినిమా సీన్స్‌ని తలపించే విధంగా ఉంది ఆ వాతావరణం. అంత వేగంతో జర్నలిస్టులు ప్రమాదం అని కూడా గ్రహించకుండా విజువల్స్ కోసం ప్రయత్నం. ఎందుకంటే మాకు మీడియా ఆఫీసుల నుండి విజువల్స్ కావాలి అని ఒకటే ఫోన్లు వత్తిడి. ఎట్టకేలకు పోలీసు జీపుని వెంటాడిన మేము చివరికి ఎన్నారై ఆసుపత్రి ఎమర్జెన్సీ ద్వారంలో అతన్ని దించి స్ట్రెచర్‌పై లోపలికి తీసుకెళుతున్న విజువల్స్ తీసి వెనుదిరిగి మంగళగిరి వచ్చి ఆఫీసులకు ఫీడ్ పంపించాము. అప్పటి దాకా స్క్రోలింగ్స్‌తో హడావుడి చేసిన మీడియా ఛానల్స్ ఒక్కసారిగా విజువల్స్ ప్రసారం చేస్తూ ఆ విజువల్స్ పై వాటర్ మార్క్ వేసుకుని ఒక్కో ఛానల్ ఒక్కో రకంగా ఉత్సాహం ప్రదర్శిస్తూ ఆ పూటకు శాంతించాయి. ఇక అంత కష్టపడి విజువల్స్ సాధించిన మేము అప్పుడు ఆలోచించాం.ఎంతప్రమాదకర పరిస్థితుల్లో విజువల్స్ చేజిక్కించుకున్నాం అని మొత్తానికి విజువల్స్ ఆఫీసుకు చేరాక ఊపిరి తీసుకున్నాం.

ఈ క్రమంలో మీడియాకు, స్థానిక ప్రజలకు ఓ ట్విస్ట్ సైకో సాంబాకు ఆసుపత్రిలో వైద్యం చేస్తుండగా మృతి. ఇంకేముంది. గ్రామస్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన సైకో సాంబ వైద్యం పొందుతూ మృతి అంటూ మరో బ్రేకింగ్. డెడ్‌బాడీ విజువల్స్ కావాలి అంటూ మరో మారు మా మీడియా సార్‌లు హడావుడి, పోలీసులు, ఆసుపత్రి వర్గాలు మాకు లోపలకు అనుమతి ఇవ్వడం లేదు. మరో ప్రక్క సైకో సాంబ దొరికాడట...! ఆసుపత్రిలో చనిపోయాడట..! అంటూ చూసేందుకు జనం ఎక్కడెక్కడ నుండో ఎన్నారై ఆసుపత్రికి చేరారు. పోలీసులు ఆసుపత్రి వర్గాలు మీడియాను లోపలకు అనుమతించకపోవడంతో బయట జనాన్ని కవర్ చేసి ఆఫీసుకు ఫీడ్ పంపించాము. సాయంత్రం దాకా ఆ విజువల్స్ వేసుకున్నారు.

అక్కడే తిండి తిప్పలు లేక కూర్చున్న మాకు రాత్రికి మరో ట్విస్ట్ చివరికి చనిపోయింది సైకో సాంబ కాదు అని పోలీసులు చాలా లేటుగా గ్రహించారు. చనిపోయిన వ్యక్తి వివరాలు సేకరించిన పోలీసులు చనిపోయిన వ్యక్తి సైకో సాంబ కాదు అని బీహార్‌కు చెందిన ఓ కూలీ కార్మికుడు అని మీడియాకు తెలిపి బీహారులో వాళ్ళ బంధువులకు పోలీసులు సమాచారం అందిస్తే వాళ్ళు వచ్చి మృతదేహాన్ని గుర్తించి బీహారుకు బాడీ తీసుకెళ్లారు. ఇలా ఓ అమాయకుడు ఆ రోజు  బలైపోయాడు. ఇలా ఏది తప్పు,ఏదీ ఒప్పు అని చూడకుండా ఫీడ్ అందిన కాడికి అందినట్లు సైకో సాంబ చనిపోయాడు అంటూ, ఆరు జిల్లాల్లో జరిగిన దాడులు ఆయా పాత విజువల్స్ వేసి సైకో సాంబ నేర చరిత్ర అలా ఇలా అంటూ వరుస కథనాలు వేసుకున్నాయి పలు టీవీ ఛానల్స్. చివరికి చనిపోయింది సైకో సాంబ కాదు అని బీహార్‌కు చెందిన కార్మికుడి డెడ్ బాడీ విజువల్స్ వేస్తూ  అప్పటిదాకా ప్రజల ఆశక్తిని మరింత పెంచేలా కథనాలు వేసిన న్యూస్ ఛానల్స్ ఒక్కసరిగా అక్కడ బీహారు కార్మికుడు మృతదేహం విజువల్స్ వేస్తూ సైకో సాంబ చనిపోలేదు బ్రతికే ఉన్నాడు, చనిపోయింది బీహారుకు చెందిన ఓ కూలీ అంటూ అయ్యో సైకో సాంబ ఫీవర్‌తో ఉన్న ప్రజలు ఆలోచన లేకుండా ఓ అమాయకుడైన వలసకూలీ అని, దీనికి ఎవరు బాధ్యులు అని, ప్రజల్లో సైకో భయం ఎంతగా ఉంది అనే మేల్కొలుపు కథనాలను మీడియా మరిచింది. అక్కడితో ప్రజలు ఊపిరి పీల్చుకున్నట్టే అనిపించినా స్థానికుల్లో పలుజిల్లాల్లో సైకోసాంబ దాడులు గూర్చి టీవీల్లో వేసిన కథనాలకు మరింత భయం ఏర్పడింది. ఇక మళ్లీ కథ మొదలకు గ్రామాల్లో గస్తీలు మామూలే పోలీసుల వేట ఆగలేదు.

## ఎట్టకేలకు మంగళగిరి పోలీసులకు చిక్కిన సైకో సాంబ

పై వ్యవహారం సర్దుమణిగిన కొన్నాళ్ళకు ఎట్టకేలకు 2013 జూలై 11న ఉదయం మంగళగిరి పోలీసులు మంగళగిరి మండలం చినకాకాని హాయిల్యాండ్ వెనుక రైల్వేగేటు వద్ద సైకో సాంబను అదుపులోకి తీసుకున్నారు. ఈ వార్త క్షణాల్లో మంగళగిరి పట్టణంలో దావానంలా వ్యాపించింది. అప్పటికీ విధుల్లోకిరాని మంగళగిరి స్ట్రింగర్స్ విషయం తెలుసుకుని ఉన్నపళంగా చినకాకాని రైల్వేగేటు వద్దకు చేరారు. అయితే పోలీసులు అప్పటికే సైకో సాంబను మంగళగిరి టౌన్ పోలీస్‌స్టేషన్‌కి తరలించి సెల్‌లో వేశారు. ఇక మా మీడియా మిత్రులకు అప్పటికే మీడియా ఆఫీసుల నుండి మా మొగుళ్లు ఫోన్లు. చాలా పెద్ద బ్రేకింగ్ కావడంతో కొందరు స్ట్రింగర్స్‌ని ఆఫీసు నుండి బూతులు దొబ్బటం మొదలుపెట్టారు. మేమయితే మంగళగిరి పోలీసుస్టేషన్‌లోనే ఉన్నాడు సైకో సాంబ అని తెలిసి అక్కడే మాటువేసి ఉన్నాం. కానీ మా ఆఫీసర్లు ఊరుకుంటారా..! కనీసం చినకాకాని గ్రామం బోర్డు,రైల్వే గేటు విజువల్స్

కావాలని పట్టుబట్టి అటు తరిమారారు. ఈ లోగా మంగళగిరి పోలీసులు పట్టుకున్న ఒకటి, రెండు గంటల టైమ్ కూడా లేదు వెంటనే సైకో సాంబాను గుంటూరు సీసీఎస్ పోలీసులకు అప్పగించారు.

సైకో సాంబాను సీసీఎస్ పోలీసులకు అప్పగించే విజువల్స్ మాలో ఒక లీడింగ్ ఛానల్ స్ట్రింగర్ షూట్ చేసాడు. అయితే ఇతనికి చినకాకాని గ్రామ బోర్డు, చినకాకాని రైల్వే గేటు కావాలని అక్కడకు వెళ్ళాలి అని అతని ఆఫీసు నుండి అతనిపై వత్తిడి లేదు. సైకో సాంబను సీసీఎస్ పోలీసులకు అప్పగించే విజువల్స్ ఆరాంగా తీసుకుని ఎంచక్కా ఆఫీసుకు అప్‌లోడ్ చేశాడు. ఇక ఆ ఛానల్ ఎక్స్‌క్లూజివ్‌గా విజువల్స్ వేసి సైకో సాంబ విజువల్స్ రాష్ట్ర ప్రజలకు మొట్ట మొదటిసారి చూపించి మంచి క్రెడిట్ సాధించింది.

మమ్మల్ని దారి మళ్లించిన మా సార్‌లకి ముందే చెప్పాం మేము ఇక్కడే ఉన్నాం సైకో సాంబాను బయటకి తీసుకు వచ్చిన మరు క్షణమే విజువల్స్ పంపిస్తాం అని చెప్పినా వినకుండా మమ్మల్ని తప్పుదారి పట్టించిన అయ్యగార్లు ఇక మమ్మల్ని ఏమీ అనలేక ఎక్స్‌క్లూజివ్‌గా వేసిన ఆఛానల్ విజువల్స్ కావాలని కొంత నింపాదిగా అడగటం మొదలు పెట్టారు. ఇక ప్రతి స్ట్రింగర్, ప్రతి స్టాఫర్ ఆ విజువల్స్ కోసం ఎంత ప్రయత్నం చేసినా దొరకలేదు. గంటలు గడిచే కొద్ది చేసేదిలేక ఎప్పటిలాగే మళ్ళీ మా మీద అయ్యగార్లు దూషణలు. ఏమి చేస్తారో మాకు తెలియదు. నెక్స్ట్ బులెటిన్‌కి ఆ విజువల్స్ కావాలి అని మా మీద వత్తిడి. ఇక మంగళగిరి స్ట్రింగర్స్ తెలివిగా వ్యవహరించి మీరు చేసిన పనికి మేము చేయగలిగింది ఏమీ లేదు అని స్ట్రింగర్స్ స్టాపర్లతో వాదనకు దిగి వాళ్ళు చెపితేనేగా మేము అక్కడ లేకుండా వెళ్ళింది ఇప్పుడు మమ్మల్ని తిడితే ఎలా అంటూ సైకో సాంబాను మీ గుంటూరు సీసీఎస్ పోలీసులకే గదా అప్పగించింది అక్కడ మీరే విజువల్స్ తీసుకోండి అని గట్టిగా చెప్పేసారు. ఇక ఆ తరువాత విజువల్స్ బాధ్యత గుంటూరు స్టాఫర్లుపై పడింది. అంతే సైకో సాంబ కథనాలకు మంగళగిరి స్ట్రింగర్స్‌కి సంభంధం తెగిపోయింది.

ఈ క్రమంలో మంగళగిరి స్ట్రింగర్స్‌కి వచ్చిన కష్టాలు గుంటూరు స్టాఫర్లకు వచ్చాయి. ఇక అక్కడ సీసీఎస్ పోలీసులు సైకో సాంబాను విచారించడం అక్కడ నుండి సైకో సాంబాను కొండపల్లి కిల్లాకు తీసుకెళ్లడం వంటి విషయాలు అన్నీ కవర్ చేయడం గుంటూరు, విజయవాడ జర్నలిస్ట్‌ల వంతయ్యింది.

## పోలీసులకు చిక్కిన సైకో సాంబ ఏమయ్యాడు?

మూడేళ్లు ఆరు జిల్లాల పరిధిలో లేక్కలేని కేసులున్న సైకో సాంబ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్. పోలీసులను ప్రజలను హడలెత్తించిన సైకోను పట్టిస్తే లక్ష రూపాయల రివార్డు

ప్రకటించిన పోలీసు డిపార్ట్మెంట్ సైకో సాంబ ఇన్నాళ్లుగా తాను దోచుకున్న నగదు కొండపల్లి ఖిల్లాలో దాచానని అది చూపిస్తాను అంటే, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, పది మంది పైగా కానిస్టేబుల్స్ పహారాలో సైకో సాంబాకు కాళ్లకు, చేతులకు బేడీలు వేసి కొండపల్లి ఖిల్లాకి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తరువాత బేడీలతో కొండ ఎక్కటం కష్టంగా ఉందని సైకో సాంబ అనడంతో బేడీలు తొలగించామని ఈ క్రమంలో సైకో సాంబ పోలీసులుపై దాడిచేసి తప్పించుకున్నాడని పోలీసులు ఆనాడు చెప్పారు.అంత మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ని చెప్పినంత ఈజీగా వదిలారా...? అనేది నేటికీ అర్థం కాని ప్రశ్న.

ఇక తప్పించు కున్నాడు సైకో సాంబ అని చెబుతున్న పోలీసులు కొండపల్లి ఖిల్లాలో మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ నుండి 150 మంది పోలీసులు. గుంటూరు, విజయవాడ నుండి మరికొంతమంది పోలీసు అధికారులు పెద్ద ఎత్తున కొండపల్లి ఖిల్లాలో నాలుగైదు రోజులు అడుగడుగునా గాలించారు. అలాగే రిజర్వుడ్ ఫారెస్ట్‌లోను ఇంచి ఇంచిన కూంబింగ్ చేసి గాలించినా సైకో సాంబ జాడలేదు అని ఎంచక్కా చేతులు దులుపుకున్నారు. ఆయితే సైకో సాంబ ఏమయ్యాడు...? ఎక్కడ ఉన్నాడు అనేది నేటికి అంతుపట్టని విషయం. కొండపల్లి ఖిల్లాకి సైకో సాంబాను తీసుకెళ్లిన పోలీసులకే అసలు విషయం తెలియాలి. లేదంటే అంతటి నేరస్థుడ్ని పోలీసులే మట్టు బెట్టారా....? లేక అత్యంత వేగంగా పరిగెత్త గలిగిన సైకో సాంబ నిజంగానే కొండపల్లి ఖిల్లాలో తప్పించుకున్నాడా, ఇది నిజమేనా....? నిజంగా సైకో సాంబ తప్పించుకుని ఉంటే ఎక్కడ ఉన్నాడు...? ఉంటే ఎక్కడో ఒక చోట అతని నేరాల ప్రక్రియ కొనసాగుతూనే ఉండేది కదా...! ఇక దీనిపై ఈ విషయం చదివిన పాఠకులుగా ఓ క్లారిటీ కోసం మీరే సమాధానం వెతకాలి, ఓ క్లారిటీకీ రావాలి.

## గొడవర్రు ఇసుక రీచ్‌లో ఇసుక అక్రమ రవాణా

సుమారు పదేళ్ల క్రితం కృషానది పరివాహక ప్రాంతం తుళ్ళూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల మండలాల్లో కృషానది గర్భం నుండి భారీ ఎత్తున ఇసుక మాఫియా చేస్తున్న అక్రమాలు రోజుకో విధంగా ఉండేవి. లెక్కకు మించి నదీగర్భంలో అనుమతులు ఉన్నా, లేకున్నా కొన్ని లక్షల టన్నుల ఇసుక భారీఎత్తున దోపిడీకి గురయ్యేది. కృషానది ఎగువ భాగం తుళ్ళూరు మండలం వైకుంఠపురం, తాళ్లాయపాలెం, వెంకటపాలెం, తాడేపల్లి మండలం ఉండవల్లి, సీతానగరం ప్రాంతాల్లో ఇసుక భారీగా అక్రమ త్రవ్వకాలు చేసి ఇసుక మాఫియా కోట్ల రూపాయలు దండుకుంది. ఈ ప్రాంతాల్లో కృషానది గర్భంలో నీళ్ళల్లో నుండి నదిలో డ్రెడ్జింగ్ చేసి నాటు పడవల ద్వారా ఒడ్డుకుచేర్చి భారీఎత్తున ఇసుక డంప్ చేసేవారు. అలాగే కృషానది ప్రకాశం బ్యారేజీ దిగువ భాగాన తాడేపల్లి మండలం ప్రాతూరు,

చిర్రావూరు, గుండిమెడ, మంగళగిరి మండలం రామచంద్రాపురం, దుగ్గిరాల మండలం వీర్లపాలెం, గొడవర్రు ప్రాంతాల్లో ఇసుక అక్రమరవాణా భారీ ఎత్తున జరిగేది. ఇలా అనుమతులు లేని రీచ్‌ల్లో అనుమతులు ఉన్న ప్రాంతాల్లో పరిమితులు దాటి ఇష్టానుసారంగా ఇసుక త్రవ్వకాలు జరిపి భారీ ఎత్తున ఇసుక మాఫియా సొమ్ము చేసుకునేది. ఈ క్రమంలో మీడియాకు సమాచారం ఉన్నా ఈ అక్రమాలు ఎవ్వరికీ పట్టేవి కాదు. పోలీసులు, ప్రభుత్వ అధికారులు, ఆయా ప్రాంతాల్లో ఉన్న చోటా, మోటా నాయకులతో పాటు కొంతమంది మీడియా ప్రతినిధులకు ఆయా ఇసుక రీచ్‌ల నుండి నెలవారీ మామూళ్లు అందేవి. దీనితో ఆ ఇసుక రీచ్‌ల వైపు వెళ్ళేవారు కాదు. అంతే కాకుండా ఇసుక రీచ్‌లలోకి వెళ్లి ఎవరైనా ప్రశ్నిస్తే ఇసుకమాఫియా నిర్వాహకులు దాడులకు పాల్పడేవారు.

దీనితో ఇసుక మాఫియా ఆగడాలు ఎక్కువైపోయాయి. మంగళగిరి మండలం రామచంద్రాపురం ఇసుక మాఫియా నిర్వాహకులు అక్కడ పనిచేసే ఓ వ్యక్తి ద్వారా వారికి నగదు లెక్కల్లో తేడాలు వచ్చి తెల్లారేసరికి అతన్ని హత్య చేసి రామచంద్రాపురం మెయిన్ రోడ్డు కాలువలో డెడ్‌బాడీ పడవేశారు. గ్రామస్థుల సమాచారంతో ఆ హత్య ఘటనను కవర్ చేసేందుకు అక్కడికి వెళ్లాం. అయితే గ్రామస్థులు ఇసుక అక్రమ రవాణా ద్వారా పగలు రాత్రి అనక తెల్లవార్లు తిరుగుతూ గ్రామంలో రోడ్లు పాడవుతున్నాయి, లారీల ద్వారా వచ్చే దుమ్ము-ధూళితో మట్టి కొట్టుకుపోతున్నాం, వంటి ఇబ్బందులతో పాటు ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు అని ఈ రోజు ఏకంగా ఇసుక మాఫియా చేసిన హత్య చూస్తే మాకు భయంగా ఉంది అని ఆనాడు మీడియా, పోలీసులు, అధికారులు ఎందుకు పట్టించుకోరు అని గ్రామస్థులు తమ ఆవేదన తెలిపారు. అయినప్పటికీ ఇసుక మాఫియాపై వార్తలు కవర్ చేసేందుకు ఎవరూ ముందుకు వెళ్ళలేదు.

దీనితో నేను పనిచేస్తున్న ఛానల్‌లో ఈ రామచంద్రాపురంకి చెందిన వ్యక్తి ఒకరు ఎడిటర్ స్థాయిలో ఉన్నారు. పై ఘటన జరిగిన కొన్నాళ్ళకు ఆయన మా స్టాఫర్‌తో, నాతో మాట్లాడి స్థానికంగా ఏ రీచ్‌లో అక్రమాలు ఎక్కువగా ఉన్నాయో తెలుసుకుని ఆరీచ్ అక్రమాలపై స్టోరీ కావాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇటువంటి బాధ్యత సహజంగా స్టాఫ్ రిపోర్టర్స్‌కి అప్పగిస్తారు. కానీ ఎడిటర్ స్థాయి వ్యక్తి ఒక స్ట్రింగర్‌తో మాట్లాడం ఆనాటి మీడియాలో ఒక ప్రత్యేకత. ఆయన నాతో మాట్లాడి నువ్వే ఆ కవరేజీ ఇవ్వాలి అన్నారు. దానికి కారణం నేను పనిచేస్తున్న ఛానల్‌లో నేను చాలా యాక్టివ్‌గా ఉండేవాడిని. ఛానల్లో చేరిన నాటి నుండి ఎక్కడా ఏదీ మిస్ కాకుండా జిల్లాలోనే ఒక గుర్తింపు పొందాను. అందుకే ఆ బాధ్యత నా మీద పెట్టారు అని నేను మా స్టాఫర్ మాట్లాడుకుని ఆలస్యం చేయకుండా నేను రంగంలోకి దిగేందుకు ఓ రోజు సిద్ధమయ్యాను.

ఇసుక మాఫియా చేసిన హత్య మనసులో మెదులుతున్నా మా ఎడిటర్ నా పై నమ్మకంతో నాకు అప్పగించిన పని ఎలాగైనా పూర్తి చేయాలి అని కంకణం కట్టుకున్నాను. ఇక ఓరోజు ఉదయం నాస్నేహితుడు, జర్నలిస్ట్ మిత్రుడిని దయాకర్ వెంట పెట్టుకుని స్టాఫ్ రిపోర్టర్‌కి నేను వెళుతున్నాను అని చెప్పాను. దానికి మా స్టాఫ్ రిపోర్టర్ జాగ్రత్త, చాలా జాగ్రత్తగా ఉండాలి. ఒక్కడివే వెళ్లకు ఎవరినైనా వెంటబెట్టుకెళుతున్నావా అని చాలా జాగ్రత్తలు చెప్పారు. ఏమి పర్వాలేదు సార్ అంటూ ధైర్యంగా గొడవర్రు ఇసుక రీచ్‌లోకి దొంగ మార్గంలో ఇసుక త్రవ్వకాలు వద్దకు కిలోమీటర్ ఇసుకలో నడుచుకుంటూ వెళ్లాం.

ఇక అక్కడ చూస్తే పదుల సంఖ్యలో భారీయంత్రాలు, తాడిచెట్టులోతులో రణగొణ ధ్వనులు చేస్తూ బారులు తీరిన పెద్ద పెద్ద లారీలకు ఇసుక తవ్వుతూ లోడింగ్ చేస్తున్నాయి. భారియంత్రాలు ఇదంతా ఎవరి కంటపడకుండా మేము కెమెరాలో రికార్డ్ చేస్తున్నాం. దాదాపు మా పని అంతా పూరయ్యింది. కానీ ఇంకా మంచి విజువల్స్ కావాలి అంటూ అక్కడే ఉన్నాం. ఇంతలో ఎవరో ఒకరు లోపలి నుండి మేము ఉన్న చోటికి వచ్చాడు. రావడం రావడంతో ఎవరు మీరు ఏం చేస్తున్నారు ఇక్కడ అంటూ అడుగుతూనే మా వద్ద కెమెరా చూసి మీడియా వాళ్ళు వచ్చారు, మీడియా వాళ్ళు వచ్చారు అంటూ పెద్ద, పెద్దగా అరుచుకుంటూ లోపలికి పరిగెత్తాడు. ఇక మేము అక్కడ ఉంటే ప్రమాదం అని, వచ్చిన దారిన వేగంగా వెనుతిరిగాం. కొంతదూరం వచ్చాక ఇసుకలో వేగంగా నడవలేక నెమ్మదించి వెనుకకు తిరిగి చూసాం. ఇంకేముంది నలుగురైదుగురు వ్యక్తులు మేమున్న సైడుగా కర్రలు పట్టుకొని పరుగెత్తుతూ వస్తున్నారు.

అది గమనించిన నా జర్నలిస్ట్ మిత్రుడు బందెల దయాకర్, నేను మరింత వేగంగా ఇసుకలో పరుగులు పెట్టి క్షణాల్లో కరకట్ట ప్రక్కన ఎవరికీ కనబడకుండా పెట్టిన బైక్ వద్దకు చేరుకుని బండి తీసుకుని క్షణాల్లో అక్కడ నుండి మాయమై టెన్షన్‌తో చివరికి మంగళగిరి చేరుకున్నాం. అంతే ఆ విజువల్స్ ఆఫీసుకు అప్ లోడ్ చేసి స్క్రిప్ట్ రాసి స్కాన్ చేసి పంపిచాను. ఇక విజువల్స్, స్క్రిప్ట్ పంపిచాను అని మా స్టాఫ్ రిపోర్టర్‌కి చెప్పాను. దానితో ఆయన ఎడిటర్ సార్‌కి చెప్పు నీవు చెపితే బాగుంటుంది అన్నారు. ఇక నేను కూడా మా ఎడిటర్ సార్‌కి ఫోన్ చేసి చెప్పాను. ఆయన సింపుల్‌గా ఒకే అన్నారు. దానితో నేను ఇంత సాహసం చేస్తే సింపుల్‌గా ఒకే అన్నారు ఏమిటి ఈయన అనుకుని కొంచెం బాధ అనిపించింది. మా స్టాఫ్ రిపోర్టర్ మాత్రం ఇసుక క్వారీలో దిగిన సమయం నుంచి నేను బయటకు వచ్చేవరకు జాగ్రత్త రత్నం, జాగ్రత్త అంటూ హెచ్చరిస్తూనే ఉన్నాడు. చివరికి మంగళగిరి చేరాక నాకు, నా తోడు వచ్చిన నా మిత్రునికి థ్యాంక్స్ చెప్పి జాగ్రత్తగా ఉండండి అని చెప్పారు.

ఇక మరుసటి రోజు ఉదయం 9గంటల బులెటిన్‌లో విజువల్స్‌పై వాటర్ మార్కు వేసి సుమారు 8 నిమిషాల నిడివితో గొడవర్రు ఇసుక రీచ్ అక్రమాలు అంటూ కథనం ప్రసారమయ్యింది. ఇలా అవే విజువల్స్ వాడుతూ ప్రతీ గంటకొకసారి ప్రసారమయ్యే బులెటిన్‌లో రోజంతా కథనాలు వేయడం జరిగింది. ఇలా వరుసబెట్టి నాలుగు రోజులు ప్రతీ బులెటిన్‌లో కనీసం మూడు, నాలుగు నిమిషాల నిడివితో గొడవర్రు ఇసుకరీచ్ పై మా ఛానల్ దండెత్తింది. తరువాత ఫీడ్ బ్యాక్ కోసం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాయిస్ తీసుకుంటే గ్రామస్థులు ఛానల్‌కి అభినందనలు, కృత్ఞతలు పెద్ద ఎత్తున తెలిపారు.

ఇక రెండు రోజుల వరుస కథనాలు తరువాత నాటి భూగర్భ, గనుల శాఖా మంత్రి గల్లా అరుణకుమారి స్పందిస్తూ ఆ ఇసుక క్వారీని తక్షణమే పరిశీలించాలి అని, ఛానల్‌లో ప్రసారమయినట్లు అక్కడ అక్రమాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ఉంటే మారు మాట్లాడకుండా ఇసుక క్వారీ సీజ్ చేయాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. దీనితో నాటి గుంటూరు కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, స్థానిక తాహశీల్దార్ స్థానిక పోలీసులు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కదిలింది. ఇసుక క్వారీని పరిశీలించి ఉన్నపళంగా గొడవర్రు ఇసుక రీచ్‌ని అధికారులు సీజ్ చేశారు. ఇక నాటి నుండి నేటికీ ఆ ఇసుక రీచ్ మూతబడే ఉంది. ఇక ఇసుక రీచ్ పై కథనాలు ప్రసారం అయిన 2వ రోజు నుండే గొడవర్రు ఇసుక రీచ్‌కి అక్కడ మాఫియాకి అండదండలు అందించిన కొందరు చోటా, మోటా నాయకులు న్యూస్ కవరేజీ ఉంది రావాలి అంటూ పిలిచి నేను అక్కడకు వెళ్ళాక ఇసుక రీచ్ గురించి మాట్లాడుతూ వార్నింగ్ ఇచ్చి వదిలేశారు. ఇంకో సారి ఇటుకనబడితే పద్ధతిగా ఉండదని హెచ్చరించారు. దీనితో దుగ్గిరాల మండలం పెద్ద కొండూరులో నాకు బాగా తెలిసి మావయ్యే వరుసయ్యే వ్యక్తికి జరిగిన విషయం చెప్పా.అతను వారి వద్దకు వెళ్ళి తీవ్రంగా దూషించి రిటర్న్ వార్నింగ్ ఇచ్చి వచ్చాడు. అయినప్పటికీ ఆ రోజు నుండి ఎక్కడ బయటకు వెళ్లాలన్నా భయంగా ఉండేది. ఎవరూ తోడు లేకుండా బయట న్యూస్ కవరేజీకి వెళ్ళే వాడిని కాదు.జర్నలిస్ట్‌ల సాహసాలు ఇలా ఉంటాయి. పిల్లి పోరాటం ఎలుకకి ప్రాణ సంకటంలా ఉంటుంది మా మీడియా సంస్థలకు మాకు మధ్య సంభంధం.

## ఇసుక రీచ్ లపై మంగళగిరి మీడియా దాడులు

మా ఛానల్ ఇచ్చిన కథనాలు చూసిన మిగతా ఛానల్స్ కూడా తమ స్టాఫర్లుకి, స్ట్రింగర్స్‌కి ఇసుక క్వారీలపై కథనాలు కావాలి అంటూ ఆదేశాలు జారీ చేశారు. దానితో మంగళగిరి స్ట్రింగర్స్ ఇసుక రీచ్‌లపై దృష్టి పెట్టారు. రాత్రి వేళల్లో ఇసుక రీచ్‌లలో పడుకుని అక్కడ విజువల్స్ తీసుకుని కృష్ణా నది పరివాహంలో ఉన్న అన్ని రీచ్‌లపై అన్ని ఛానల్స్‌లో

వరుస కథనాలు ప్రసారమయ్యేవి. ఒకరకంగా చెప్పాలి అంటే ఆ సమయంలో మంగళగిరి స్ట్రింగర్స్ ఇసుక రీచ్‌లపై దండ యాత్ర చేశారు. నాటి మీడియా దండయాత్రలో కొన్ని ఇసుక రీచ్‌లు శాశ్వతంగా మూతపడితే కొన్ని మాత్రం కొనసాగాయి.

## ఎర్రబాలెం కొండపై క్షుద్ర పూజలు, బాలుడు అదృశ్యం

గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, ఎర్రబాలెం కొండపై ఓ ఏడాది క్షుద్రపూజలు నిర్వహించారు గుర్తు తెలియని ఆగంతకులు. అయితే ఇది నిధులు నిక్షేపాలు ఆ కొండపై ఉన్నాయని వాటి కోసం క్షుద్రపూజలు చేసినట్లు తెలుస్తుంది. ఆ కొండపై ప్రాచీన కాలంలో నిర్మించిన కోనేరు, శిథిలమైపోయిన నిర్మాణాల ఆనవాళ్లు చదును చేయబడిన విశాల భూములు అక్కడ ఇప్పటికీ ఉన్నాయి. వాటిని పరిశీలించిన కొందరు ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున నిధి నిక్షేపాలు ఉంటాయని భావించారు. ఈ కొండ ఎర్రబాలెం నుండి ఉండవల్లి వరకు పొడవు ఉంటుంది. చాలా పెద్దకొండ. ఒకప్రక్క అనంతపద్మనాభస్వామి మరో ప్రక్క ప్రాచీన కాలంనాటి చారిత్రక ఆధారాలు. ఇక వాళ్ళ ఆలోచనలకు పరిమితి లేదు. కొండ పొడవునా ఎక్కడో ఒక చోట నిధులు ఉంటాయని వారి నమ్మకం. గతంలో కొండపై ఎక్కడో ఒకచోట నిధుల కోసం త్రవ్వకాలు జరిపిన ఆనవాళ్లను స్థానిక జర్నలిస్టులు న్యూస్ కవర్ చేయడం జరిగింది.

ఈ క్రమంలో ఓ ఏడాది కొండపై పశువులు మేపే పశువుల కాపరులు కొండపై క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లను గమనించారు. అయితే అంతఎత్తున కొండ ఎక్కి క్షుద్రపూజలు చేయటానికి గల కారణాలు ఏమై ఉంటాయని గ్రామస్తులకు అనుమానాలు వచ్చాయి. గ్రామంలో ఉత్సాహవంతులైన కొందరు యువత కొండ ఎక్కి ఆ పూజల తంతు వ్యవహారాన్ని పరిశీలించి వచ్చారు. ఇక గ్రామంలో ఈ టాక్ ఎక్కువైపోయింది. సరిగ్గా ఇదే సమయంలో కొండ దిగువ భాగాన ఉన్న శ్రీ కృష్ణ ఆనంద ఆశ్రమంలో ఓ బాలుడు అదృశ్యం అయ్యాడు. అయితే క్షుద్రపూజలు విషయాన్ని స్థానిక జర్నలిస్టులు ఎవ్వరు కవర్ చేసేందుకు ఆశక్తి చూపలేదు. ఎప్పుడయితే బాలుడు అదృశ్యం అయ్యాడు అని తెలిసిందో అక్కడకు వెళ్లిన మీడియాకు కొండపై క్షుద్రపూజలు చేసిన వారు బాలుడిని కిడ్నాప్ చేసి కొండపైకి తీసుకెళ్లి ఆ క్షుద్రపూజల్లో బలి ఇచ్చారని ఓ పుకారు బాగా షికారు చేసింది.

ఆశ్రమంలో విచారించిన జర్నలిస్టులు బాలుడు అదృశ్యం అయిన మాట వాస్తవమేనని తెలుసుకుని అందులో నిజమెంత, అబద్ధం ఎంత అని ఆలోచించకుండా జర్నలిస్టుల బృందం మొత్తం కొండ ఎక్కాం. కొండ ఎక్కిన వారిలో ముగ్గురు, నలుగురు జర్నలిస్టులకు షుగర్, బీపీలు ఉన్నాయి. అయినా సరే ఏ మాత్రం వెనుకాడకుండా ఆయాసపడుతూనే సగం పైగా

కొండ ఎక్కాం. ఇక ఎక్కలేక కొంచెం అనువుగా ఉన్న ప్రాంతంలో నిలిచిపోయాం. అలా నిలుచుని ఉండగానే నాకు తెలియకుండానే నేను మా జర్నలిస్ట్ మిత్రులు చూస్తుండగానే కళ్ళు తిరిగి ఒక రాయి మీద పడటం తలపగిలి రక్త స్రావం కావటం జరిగింది. అంతే మా జర్నలిస్ట్‌ల బృందం బెదిరిపోయింది. ఇక అక్కడ నుండి నాలా షుగర్, బీపీ ఉన్న వాళ్ళు ఎవరూ పైకి ఒక్క అడుగు కూడా ముందుకు వేసేందుకు సాహసించ లేదు. అయితే నేను పడింది నాకే తెలియలేదు, తల నుండి భుజాలపైకి కారుతున్న రక్తం తెలియలేదు. నా మిత్రులు కర్చీఫులు చించి తలకు కట్టుకట్టి కొద్దిసేపు అక్కడే కూర్చోబెట్టి పర్వాలేదా కొండ దిగగలవా అని అడిగి నన్ను ఇద్దరు, ముగ్గురు జర్నలిస్ట్ మిత్రులు చాలా జాగ్రత్తగా కొండపై నుండి క్రిందికి తీసుకువచ్చారు. మరో ప్రక్క మిగిలిన జర్నలిస్ట్‌ల బృందం నాకు దెబ్బ తగిలిన ప్రదేశంలో నుండి నన్ను జాగ్రత్తగా క్రిందికి తీసుకెళ్లి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లమని నన్ను క్రిందికి తీసుకువస్తున్న వారికి అన్ని జాగ్రత్తలు చెప్పి వాళ్ళు మాత్రం కొండపై క్షుద్రపూజలు ప్రాంతానికి వెళ్ళి చుట్టు ప్రక్కల ఆశ్రమంలో తప్పిపోయిన బాలుడు ఆచూకీ ఏమైనా లభిస్తుందేమోనని అంతా పరిశీలించి విజువల్స్ తీసుకుని వచ్చారు. ఈ లోగా నేను కొండ దిగే వరకు నాతలకు కట్టు కట్టినా తలగాయం నుండి కొద్దీ కొద్దిగా రక్తం కారుతూనే ఉంది. వేసుకున్న చొక్కా మొత్తం రక్తసిక్తం అయ్యింది. చొక్కాని దాటి ప్యాంట్ మోకాళ్ళ వరకు రక్తంతో తడిసిపోయింది. చివరికి నా మిత్రులు నా పరిస్థితి చూసి ఆలస్యం చేయకుండా ఎర్రబాలెంలోనే ఒక ఆర్.ఎం.పీ. డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. నన్ను, నా దుస్తులుపై ఉన్న రక్తం చూసి మొదట కంగారుపడిన ఆ డాక్టర్ వెంటనే నా తలపై గాయం పరిశీలించి చాలా పెద్ద గాయం అయ్యింది. మంగళగిరి తీసుకెళ్లమని చెప్పాడు. అయితే డాక్టర్‌తో మాట్లాడి ఆయన వద్దే చికిత్స చేయించారు. నాడు నా తలకు అయిన గాయానికి మొత్తం ఆరుకుట్లు వేశారు. ఇక నా మిత్రులు నన్ను ఇంటికి చేర్చారు. రక్తంతో తడిసిపోయిన నా దుస్తులు, తలపై కట్టు, అటు, ఇటు చేతులు పట్టుకుని ఉండటాన్ని గ్రహించిన నా భార్య ఏమయ్యింది, ఏమయ్యింది అంటూ ఒకటే ఏడుపు, నాకు ఏమయ్యిందో అర్ధంకాక నా పదేళ్ళ వయసు పిల్లల బిత్తర చూపులు వారిని చూసి నాకు దుఖః ఆగలేదు. నన్ను ఇంటికి తీసుకు వచ్చిన మీడియా మిత్రులు నా భార్యకు, పిల్లలకు ధైర్యం చెప్పి ఏమైనా అవసరం ఇబ్బంది ఉంటే ఫోన్ చేయమని డాక్టర్ ఇచ్చిన మెడిసిన్ అప్పగించి వెళ్ళి పోయారు.

అలాంటి పరిస్థితిలో ఉన్న నాకు ఇక శర మొదలయ్యింది. అదే నండి మా హైదరాబాద్ ఆఫీస్ నుండి ఫోన్, ఫోన్ ఎత్తగానే నేను మాట్లాడక ముందే ఏవయ్యా ఎక్కడ ఉన్నావు. ఏమి చేస్తున్నావు. విజువల్స్ పంపవా అని...ఇంతలో నా భార్య ఫోన్ తీసుకుని సార్ వార్త కవర్ చేసేందుకు వెళ్లి కొండపై నుండి పడి ఆరు కుట్లు పడ్డాయి అని చెప్పగానే

అవతల వ్యక్తి నాతో మాట్లాడారు. విషయం తెలుసుకుని సరే,సరే అని ఫోన్ పెట్టేశారు మా హైదరాబాద్ కో ఆర్డినేటర్. ఇక గుంటూరు స్టాఫర్‌కి ఫోన్ చేసి ఆ మంగళగిరి స్ట్రింగర్ కొండ మీద నుంచి పడి తలకు గాయం అయ్యిందట. ఆ వార్తకు సంభందించిన విజువల్స్ త్వరగా పంపించండి అని నాకు ఫోన్ చేసిన అతనే స్టాఫ్ రిపోర్టర్‌కి ఫోన్ చేసి విజువల్స్ కావాలి అని అడిగారని మా స్టాఫ్ రిపోర్టర్ వెంటనే నాకు ఫోన్ చేశాడు. విజువల్స్ నేనయితే తీయలేదు ఎవరినయినా అడిగి పంపిస్తాను అన్నాను.

కానీ నేను అలాంటి పరిస్థితిలో ఉండి ఏముందిలే.. అని లైట్ తీసుకున్నాను. మరో అరగంట తరువాత మా స్టాఫర్ ఫోన్ చేసి ఎలా ఉంది ఏమిటి అని అడగకుండా కొంచెం ఆ వార్త విజువల్స్ ఎవరి చేతనైనా పెట్టించు ఆఫీసు నుండి దొబ్బేస్తున్నారు అన్నాడు. ఈ లోగా ఓ ప్రముఖ శాటిలైట్ ఛానల్‌లో ఎర్రబాలెం కొండపై క్షుద్రపూజలు, బాలుడు అదృశ్యం అంటూ న్యూస్ ప్రసారం అయ్యింది. చివరిలో కొండపై కవరేజీకి వెళ్లిన జర్నలిస్ట్ కొండపై నుండి పడి తలకు తీవ్రగాయం అంటూ కొండపై నా తల పగిలి రక్తం కారుతుంటే నా చుట్టు ఉన్న జర్నలిస్ట్‌లు నా తలకు గుడ్డ కడుతున్న దృశ్యాలు,నన్ను కొండ దించుతున్న విజువల్స్ ఛానల్లో వేశారు. అది చూసిన మా కో ఆర్డీనేటర్ మళ్ళా ఫోన్ చేసి అప్పుడు ఎలా వుంది, ఆసుపత్రికి వెళ్ళావా అని అప్పుడు పరామర్శ చేశారు. అయినా మా స్టాఫ్ రిపోర్టర్‌కి విజువల్స్ అడుగుతూనే ఉన్నారట...! స్టాఫర్ మరోసారి ఫోన్ చేసి రిక్వెస్ట్ చేస్తూ నన్ను విజువల్స్ అడిగాడు. ఇక చేసేది లేక నేనే నా మిత్రుడికొకరికి ఫోన్ చేసి ఏఫ్టీపీ నెంబర్ ఇచ్చి విజువల్స్ అప్‌లోడ్ చేయించాను.విజువల్స్ వెళ్లాయి అని చెపితే మరి స్క్రిప్ట్ అన్నారు. స్క్రిప్ట్ విషయం చెపుతాను మీరే కొట్టండి అంటే విషయం అడిగి స్క్రిప్ట్ పంపించారు స్టాఫ్ రిపోర్టర్. అనంతరం అనుకున్నాను ఏ మాత్రం జాలి, దయ లేకుండా ఈ విధంగా వ్యవరిస్తారా..అని భాధపడ్డాను. ఇక వారం రోజుల దాకా గాయం మానలేదు, సెలవులు ఉండవు. ఆ వారం రోజులు కూడా రెస్ట్ లేకుండా వారికి అవసరమయ్యే వార్తల కవరేజీ చేస్తూనే ఉన్నాను. అలా ఎక్కడికి వెళ్లినా తలకు ఏమయ్యింది. ఎలా జరిగింది అని అడిగే వారికి చెప్పలేక ఇబ్బందిగా ఉండేది. అలా ఉండి బయటకు రాకపోతే ఏమి అని ఇంట్లో ఉండవచ్చుగా అని తెలిసిన ప్రతిఒక్కరు నా వైపు అదోలా చూసేవారు. ఏమి చేస్తాం మాకు ఇవన్నీ మామూలే కదా అనుకున్నాను. ఏమి చేస్తాం ఒక ప్రక్క ప్రాణాలు పోతున్నా మేము మాత్రం మా మీడియా సంస్థలకు పనిచేసి పెట్టాల్సిందే.

## తాడేపల్లి పాత సిమెంట్ ఫ్యాక్టరీలో క్షుద్రపూజలు

ఇక మరో ఘటన విషయానికి వస్తే గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రస్తుతం మూసివేయబడిన ఒకనాటి పాత ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరి స్థలంలో ఒక ఏడాది క్షుద్రపూజలు జరిగాయి. విషయం తెలుసుకుని కవరేజీకి వెళ్లిన మేము ఆ ప్రాంతాన్ని చూడగానే ఒళ్ళు గగుర్పొడిచింది. కేజీల లెక్క పసుపు, కుంకుమ, ఎండుమిర్చి, ఉప్పు, డజన్ల పైగా నిమ్మకాయలు, పదుల సంఖ్యలో కోడిగ్రుడ్లు, పొడవాటి వెంట్రుకల తుట్టె, డజన్ల సంఖ్యలో గాజులు వీటి మధ్యలో గొంతుకోసిన పెద్ద నల్లటిపంది, అలాగే సుమారు ఆరు అంగుళాల అమ్మాయి రబ్బర్‌బొమ్మ ఒక ప్రక్క ఏదో తగులబెట్టిన ఆనవాళ్లు, ఆ ప్రాంతం చూసిన వాళ్ళు తప్పనిసరిగా భయపడాల్సిందే.

దీనితో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఆ మార్గంలో నడవటానికి రాకుండా వేరే మార్గం గుండా వెళుతున్నారు. చూసిన వాళ్ళు చూడని వారికి చెపితే అది చూసేందుకు కూడా అక్కడ వాళ్ళు సాహసం చేయలేదు. స్థానికుల పరిస్థితి గమనించిన మా జర్నలిస్ట్ సోదరులు వారికి ధైర్యం కలిగించేందుకు స్థానికులు కొందరు చూస్తుండగానే చనిపోయి ఉన్న పందిని కాలుపట్టుకొని బయటకు లాగి అక్కడ చెల్లాచెదురుగా ఉన్న పసుపు, కుంకుమ, గాజులు, వెంట్రుకలు మొత్తాన్ని కాళ్ళతో తన్నుతూ మొత్తం చెరిపేశారు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి జర్నలిస్ట్‌లు చేసిన పనికి కొద్దిగా అసహనం వ్యక్తం చేస్తూ ఫోటోలు తీసుకుని వెళ్లారు.

ఇలా మా జర్నలిస్ట్‌లు దేనికి వెనుకాడకుండా ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలు, భయాలు తొలగిస్తూ అక్కడ చేసిన పనికి కొందరు బాగా మెచ్చుకున్నారు. ఇక అంతకు ముందు షూట్ చేసిన విజువల్స్, జర్నలిస్ట్‌లు ఇద్దరు, ముగ్గురు వాటిని తొలగించి, చేరిపేస్తున్న విజువల్స్ సేకరించి ఆఫీసులకు ఫీడ్ పంపించారు. ఇక ఛానల్స్ ఆ వార్తను ఎవరికి తోచినట్లు వాళ్ళు ప్రసారం చేశారు. స్థానిక ప్రజల్లో ఉన్న మూఢవిశ్వాశాలు, భాయాందోళనలను తొలగిస్తూ వాటిని తొలగిస్తున్న జర్నలిస్ట్‌లను చూపిస్తూ మా జర్నలిస్ట్‌ల బృందం స్థానికుల్లో చైతన్యం కల్పించింది అంటూ ఆ విజువల్స్‌పై వాటర్ మార్క్ వేసుకుని లెక్కకు మించి ప్రతీ బులెటిన్‌లో ప్రసారం చేశాయి.

# 7. అమరావతిలో - జర్నలిస్ట్‌లు ఎదుర్కొన్న సమస్యలు (3)




"ఒకప్పుడు మద్రాసు నుండి విడిపోయిన అచ్చమైన తెలుగు రాష్ట్రం రెండు ముక్కలైన వేళ ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర, వారికి ఎదురైన వార్తల కవరేజి ఇబ్బందులు తెలుసుకోండి"

## క్రైస్తవ భక్తురాలికి సిలువ

**సు**మారు ఓ ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామం. తాడేపల్లి బైపాస్ సమీపంలో ఒక క్రైస్తవ భక్తురాలికి ఓ చర్చి భక్తులు సిలువ వేయటానికి సిద్దపడ్డారు.ఆ రోజు క్రైస్తవుల పండుగ గుడ్‌ఫ్రైడే. ఈ పండుగను క్రైస్తవులు ఎంతో నిష్టతో, అత్యంత భక్తి శ్రద్ధల నడుమ జరుపుకుంటారు. దాదాపు రోజులో ఎక్కువ గంటలు చర్చిలో ఉండి, ప్రార్ధనలు నిర్వహిస్తారు. అయితే ఆ రోజు ఉదయం తరువాత మధ్యాహ్నం సమయంలో కుంచనపల్లిలో ఓ చర్చికి చెందిన క్రైస్తవ భక్తులు నిండా ప్రార్ధనల్లో మునిగిపోయారు. ఆ సమయంలో ప్రార్ధనల్లో పాల్గొన్న ఒక మహిళ భక్తితో ఊగిపోయింది. ఒక్కసారిగా ఆమె పూనకం వచ్చినట్లు పాపుల రక్షణ కోసం జీసస్ సిలువ ఎక్కారని, పాపుల రక్షణకు నన్ను కూడా సిలువ వేయాలని భక్తులకు సందేశాలు ఇచ్చింది. అయితే అప్పటికే అక్కడ సిలువ తయారు చేసి పెట్టినట్లు మా జర్నలిస్టులకు సమాచారం.ఇది ఈ ఘటన ముందస్తు ప్రణాళికతో జరిగినట్లు తెలుస్తుంది. ఇక ఆమెతో ఆ రోజు క్రైస్తవభక్తులు ఆమెతో సిలువ మోయించి చర్చికి కొంత దూరంగా బైపాస్ రోడ్డుకు సమీపంలో ఆమెను సిలువ పై పడుకోబెట్టి చేతులకు మేకులు కొట్టే ప్రయత్నం చేసి కొంతమేరకు మేకులు కూడా కొట్టారు. ఇంతలో ఎవరో గమనించి మీడియాకు, పోలీసులకు సమాచారం అందిం చారు.అయితే మా జర్నలిస్టుల కంటే ముందే పోలీసులు అక్కడ వాలిపోయారు. అక్కడ సిలువకు సిద్ధపడిన మహిళను, మేకులు కొట్టేందుకు ప్రయత్నం చేసిన కొందరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని మంగళగిరి డీఎస్పీ ఆఫీసుకు తరలించారు. అక్కడకు వెళ్లిన మా మంగళగిరి మీడియా మిత్రులకు ఏ విధమైన విజువల్స్ అందలేదు. దానితో సంఘటన వివరాలు తెలుసుకుని స్క్రోలింగ్స్ చెప్పాం.

అంతే ఎప్పటిలాగే మాకు ఆఫీస్ అయ్యగార్ల నుండి విజువల్స్ కావాలి అంటూ హడావుడి మొదలయ్యింది. అక్కడ విజువల్స్ దొరికే పరిస్థితి లేదు. వెంటనే మంగళగిరి డీఎస్పీ ఆఫీసుకు చేరాం.అక్కడకు చేరేలోపు విజువల్స్, విజువల్స్ అంటూ మీడియా ఆఫీసుల నుండి, స్టాఫ్ రిపోర్టర్స్ నుండి ఫోన్లు.అయితే సంఘటనా ప్రాంతంలో ఉన్న సిలువ, చర్చి, అక్కడ ఉన్న జనాలను షూట్ చేసిన మేము మంగళగిరి డీఎస్పీ ఆఫీసు ఆవరణలో అరెస్ట్ చేసిన మహిళ, ఆమె చేతికి అయిన గాయాలు, కొంతమంది వ్యక్తుల విజువల్స్ తీస్తుండగా పోలీసులు గమనించి వారిని లోపలికి తీసుకెళ్లారు. ఇక మేము చేసేది ఏమీ లేక మా దగ్గర ఉన్న విజువల్స్ పంపించి స్క్రిప్ట్‌లు కూడా అప్‌లోడ్ చేసాం. మీడియా ఛానల్స్ అన్నీ మేము పంపిన విజువల్స్ వేసి వార్త ప్రసారం చేస్తున్నాయి.

ఈ క్రమంలో ఓ లీడింగ్ ఛానల్ మాత్రం ఎక్స్ క్లూజివ్‌గా ఆమె సిలువ మోస్తున్న విజువల్స్, ఆమెను సిలువపై పడుకోబెట్టి రెండు చేతులకు పొడవాటి మేకులు కొడుతున్న విజువల్స్ వేస్తూ వార్తను ప్రసారం చేసింది. అంతే మేము పంపిన విజువల్స్, ఆ ఛానల్ ఎక్స్‌క్లూజివ్‌గా వేసిన  విజువల్స్‌లో తేడా గ్రహించిన మిగతా ఛానల్స్ అన్నీ మంగళగిరి స్ట్రింగర్స్‌కి ఫోన్లు చేసి బూతుపురాణం ఎత్తుకున్నారు. ఆ ఒక్క ఛానల్‌కి తప్ప అందరికీ అంక్షింతలుపడ్డాయి. ఇక ఏమి జరిగిందో అర్ధంకాక స్ట్రింగర్స్ అందరూ ఆ విజువల్స్ వేసిన స్ట్రింగర్‌కి విజువల్స్ కోసం ఫోన్ చేస్తే అతని ఫోన్ స్విచ్ ఆఫ్, వెతికితే ఎక్కడా కనబడలేదు. అయితే ఆ స్ట్రింగర్ బంధువు ఒకరు సంఘటన ప్రాంతంలో వీడియో తీసి జర్నలిస్ట్‌లెవరికీ తెలియకుండా అతను ఆ స్ట్రింగర్‌కి అందజేశాడు. ఆ వీడియో క్యాసెట్ తీసుకుని ఆ స్ట్రింగర్ పక్కనే ఉన్న విజయవాడ ఆఫీసుకు వెళ్లి విజువల్స్, స్క్రిప్ట్ అప్‌లోడు చేసాడు. అలా ఆ ఛానల్ ఆ రోజున ఎక్స్‌క్లూజివ్‌గా వార్త ప్రసారం చేసింది.

ఇక ఆ వార్త ప్రసారం అయిన మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు మాకు ఆ విజువల్స్ ఎక్కడా దొరక లేదు. విజువల్స్ ఉన్న ఆ ఒక్క స్ట్రింగర్ మాత్రం సాయంత్రం వరకు ఎవరికీ టచ్‌లోకి రాలేదు. ఒక ప్రక్క సాయంత్రం అయినా మా పెద్దసార్లు మమ్మల్ని వదలలేదు. విజువల్స్ కావాలి అంటూ ప్రతీ అరగంటకొకసారి అన్ని ఛానల్స్ స్ట్రింగర్స్‌కి, స్టాఫర్లుకి ఫోన్లు చేసి ఇష్టానుసారంగా వాయించేశారు. అయితే ఆ స్ట్రింగర్‌కి నాటి వాళ్ళ స్టాఫర్ అతని వద్ద ఉన్న క్యాసెట్ విజయవాడ ఆఫీసులో అప్పగించి ఫోన్ స్విచాఫ్ చేయవలసిందిగా ఎవరికి విజువల్స్ ఇవ్వవద్దని చెప్పటం వల్ల మిగతా స్ట్రింగర్స్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎవరెలా పోతే మాకేంటి మేము మాత్రం ఎక్స్‌క్లూజివ్‌గా విజువల్స్ వేశాం. మా పని అయిపోయింది అని సంబరపడిపోయారు. సాటి జర్నలిస్ట్‌లు ఇబ్బందులు పడుతున్న ఏ మాత్రం కనికరం చూపలేదు.చివరికి రాత్రి ఏడు గంటల బులెటిన్‌కి స్ట్రింగర్స్ అందరూ ఆ విజువల్స్ పంపించారు. ఇదెలా సాధ్యం అనుకున్నారా...? మాలో ఓ స్ట్రింగర్ చేసిన పని ఆ రోజు మా స్ట్రింగర్స్ అందరిని ఆదుకుంది. ఆ మహిళకు సిలువ వేస్తున్న విజువల్స్ ప్రసారం చేసిన ఆ ప్రముఖ ఛానల్ ఆ రోజు ఏ కారణం చేతనో తాను ప్రసారం చేసిన విజువల్స్‌పై తమ లోగో వాటర్ మార్క్ వేయలేదు. అది మాకు ప్లస్ పాయింట్ అయ్యింది. ఆ న్యూస్ డౌన్‌లోడ్ చేసి ఆ ఛానల్ లోగో రాకుండా ఆ విజువల్స్ మాత్రమే వచ్చేలా కాపీ చేసి అందరు స్ట్రింగర్స్‌కి ఇవ్వడం జరిగింది. అదే మహా ప్రసాదంలా మిగిలిన అన్ని ఛానల్స్ వాటిని ప్రసారం చేశాయి. అప్పటిదాకా స్ట్రింగర్స్, స్టాఫర్లు పడిన ఇబ్బందులు మీడియా ఆఫీసుల నుండి చాలా హింసాత్మకంగా ఉన్నాయి.

ఈ ఘటనతో అప్పటిదాకా అందరితో సరదాగా ఉండే ఆ స్ట్రింగర్‌కి మిగతా జర్నలిస్ట్‌లతో ఎడబాటు ఏర్పడింది. తోటి జర్నలిస్ట్‌ల ఆత్మీయ పలకరింపుకు దూరమయ్యాడు. ఒక్క వార్త విషయంలో అందరికంటే ముందుండాలి అని అతని ప్రయత్నం బాగున్నా, కొన్ని గంటలు గడిచాక అయినా విజువల్స్ ఇవ్వలేదని మిగతా స్ట్రింగర్స్ అందరు అతనికి దూరంగా ఉండటం మొదలు పెట్టి అతన్ని ఒంటరిని చేశారు. ఇలా మా పైనున్న మీడియా సార్లు వ్యవహరించే తీరు, ఎంతో ఐక్యంగా ఉండే స్ట్రింగర్స్ మధ్య కయ్యాలు పెట్టేందుకు ఒక కారణం అయింది.

## సమైక్యాంధ్ర ఉద్యమం

అది 2009 డిసెంబరు 9న అప్పటి కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ప్రారంభమైందని చేసిన ప్రకటన సమైక్యాంధ్ర ఉద్యమ పుట్టుకకు కారణమైంది. దీనితో తెలంగాణా ప్రాంతాలలో సంబరాలు ప్రారంభం కాగా సీమాంధ్రలో భగ్గుమంది. మిన్నంటిన నిరసనల మధ్య అప్పటి కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమీక్షించి 2009 డిసెంబరు 23న విభజన ప్రక్రియపై అందరి అభిప్రాయాలను తీసుకుంటామని, అదే మంత్రిచేత మరొక ప్రకటన విడుదల చేయించింది. అయినప్పటికీ సీమాంధ్రలో ఉద్యమాలు ఆగలేదు. ఈ క్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కేంద్రంగా సమైక్యాంధ్ర ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగులు, ఇతర సంఘాలు సీమాంధ్ర మొత్తం అన్ని ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. అలాగే సీమాంధ్రలోని 14 యూనివర్సిటీలు మంగళగిరి సమీపంలో ఉన్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా సమైక్యాంధ్ర ఉద్యమ ప్రణాళికలు చేస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేసేవి. ఇక ఇందులో నిరసన కార్యక్రమాలు, పలు ప్రణాళికలు కవర్ చేస్తూ గుంటూరు, మంగళగిరి, విజయవాడ జర్నలిస్ట్‌లు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాగార్జున యూనివర్సిటీ కేంద్రంగా సమైక్యాంధ్ర ఉద్యమం జరిగిన తొలినాళ్ళలో మంగళగిరి జర్నలిస్ట్‌లు ఉదయం నుండి రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటల వరకు అక్కడే ఉండాల్సి వచ్చేది. ఈ సమయంలో ఉదయం టిఫిన్ చేసి వెళ్లిన స్ట్రింగర్స్ రాత్రి వరకు కాళీ కడుపులతోనే ఉండేవాళ్ళం. మధ్యాహ్నం ఆకలి అనిపిస్తే డబ్బులు లేని స్ట్రింగర్స్ యూనివర్సిటీ గేట్ బయట చిన్న బడ్డీకొట్టు ఉండేది. అక్కడ వేరుశనగ ఉండలు, చెకోడీలు, చెక్కలు కొనుగోలు చేసి తిని ఆకలి తీర్చుకునేవాళ్ళం. కొద్దో గొప్పో జేబులో డబ్బులున్న స్ట్రింగర్స్ వర్శిటీ క్యాంటీన్‌లో టిఫిన్ చేసే వాళ్ళు. కొన్నాళ్ల

తరువాత మా పరిస్థితి గమనించిన నాటి వర్శిటీ సమైక్యాంధ్ర ఉద్యమనేత ప్రొఫెసర్ ఎన్ శామ్యూల్ జర్నలిస్ట్‌లకు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టిఫిన్ ఏర్పాట్లు ఉచితముగా తినేందుకు ఏర్పాటు చేశారు. ఇది మా జర్నలిస్ట్ సోదరులకు చాలా వరకు ఊరట కలిగించింది.

ఈ క్రమంలో మంగళగిరిలో జరిగే ఉద్యమాలతో పాటు క్రమం తప్పకుండా వర్శిటీ నిరసన కార్యక్రమాలు కవర్ చేయాల్సి వచ్చేది.ఇక యూనివర్సిటీ నిరసన కార్యక్రమాలు ఒకదాని తరువాత, ఒకటి జరుగుతూ ఉండేవి. వర్శిటీ ఎదురు గల జాతీయ రహదారి పై గంటల తరబడి రాస్తారోకో, హైవే దిగ్భంధం, విద్యార్థులు, కొంతమంది ప్రొఫెసర్లు రాస్తారోకో అర్ధనగ్న ప్రదర్శనలు, తరగతుల బహిష్కరణ జాతీయరహదారిపై రాస్తారోకో, జాతీయ రహదారిపై టైర్లు, ట్యూబులు తగలబెట్టడం ఇలా రోజుకో రకంగా విద్యార్థి నాయకులు నిరసనలు చేపట్టడం వాటిని కవర్ చేస్తూ మంగళగిరి వచ్చి న్యూస్ అప్‌లోడ్ చేయడం. మళ్ళా యూనివర్సిటీకి వెళ్లి అక్కడ జరిగే కార్యక్రమాలు మళ్ళీ కవర్ చేసుకోవడం ఇలా కవర్ చేసిన న్యూస్ పంపేందుకు, మంగళగిరి, యూనివర్సిటీకి రోజు మొత్తం మీద మూడు, నాలుగు సార్లు తిరిగే వాళ్ళం.

ఇలా ఏ ఒక్క నిరసన కార్యక్రమం మిస్ అయినా ఆఫీసు నుండి స్టాఫర్లుకు, స్ట్రింగర్స్‌కి చీవాట్లు తప్పేవి కాదు. అక్కడ జరుగుతున్న నిరసన కార్యక్రమాలు అందరికంటె ముందుగా పంపాలి అని ఆజ్ఞలు. కొన్ని ప్రముఖ ఛానల్స్ ఓబీ వ్యాన్‌లు పెట్టుకొని జరుగుతున్న నిరసన కార్యక్రమాలు నిమిషాల వ్యవధిలో ప్రసారం చేసేవి. ఓబీ వ్యాన్‌లు అందుబాటులో లేని స్టాఫర్లు, స్ట్రింగర్స్‌పై విజువల్స్ కావాలి అంటూ మామూలు ఒత్తిడి ఉండేది కాదు. ఓబీ వ్యాన్లతో పోటీపడి విజువల్స్ పంపించమని దూషణలు. లేదంటే విజువల్స్ తీసుకొని గుంటూరు కానీ విజయవాడ కానీ ఆఫీసులకు వెళ్లి అప్‌లోడ్ చేయమని ఆదేశాలు. అలా వెళితే ఇక్కడ ఏ కార్య క్రమం మిస్ అవుతామోనని మనసులో ఆందోళన దీనితో కూర్చోవటానికి, నిలుచోవటానికి సమయం ఉండేది కాదు. ఒకరిద్దరి వద్ద మొబైల్ ఉన్నా వాట్సాప్ విజువల్స్ వద్దని ఆంక్షలు ఇక అక్కడ విధులు నిర్వహించే జర్నలిస్ట్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది.ఒకొక్కరోజు ఉదయం ఆరు, ఏడు గంటలకే వర్సిటీలో నిరసన కార్యక్రమాలు జరిగేవి. ఇలా జరుగుతున్న క్రమంలోనే కొంతమంది విద్యార్థులు వర్సిటీలో ఉన్న సెల్ టవర్స్ ఎక్కడం, వర్శిటీలో అతి పెద్ద భవనం అయిన దూరవిద్యాకేంద్రం భవనం పైకి ఎక్కి సమైక్యాంధ్ర నినాదాలు, సమైక్యాంధ్ర కోసం ఆత్మహత్య చేసుకుంటాం అంటూ క్రిందికి దూకే ప్రయత్నం చేయడం. ఈ క్రమంలో కొంతమంది విద్యార్థులు భవనం పైనున్న సన్ సైడులు, కిటికీలు పట్టుకుని వేలాడుతూ క్రిందికి పడిపోయేంత హడావుడి చేస్తూ జై సమైక్యాంధ్ర అంటూ

పోలీసులకు క్రింద ఉన్న మీడియాకు చుక్కలు చూపించేవారు. మరోప్రక్క పోలీసులు పెద్ద ఎత్తున అక్కడకు చేరి మైకులు పెట్టి విద్యార్థులను క్రిందికి దిగమని అభ్యర్థనలు చేయడం, భవనం క్రింది భాగంలో భారీస్థాయి వలలు ఏర్పాటు చేయడం మామూలు హడావుడి ఉండేది కాదు.దీనితో అక్కడ జరిగే విషయం స్క్రోలింగ్ చెప్పటం ఆలస్యం ఇక మా పెద్ద సార్లు విజువల్స్ పాట అందుకునేవారు.ఆ విజువల్స్ కోసం జర్నలిస్ట్‌లు కెమెరామెన్‌లు ఒకరిపై ఒకరు పడటం ఈ క్రమంలో చూడక పోలీసులను ఢీకొంటే వారితో వాదనలు. ప్రతీ రోజు ఇలా ఉండేది అక్కడ వాతావరణం.

సీమాంధ్రలోని 14 యూనివర్సిటీల విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో జరిగే సమైక్యాంధ్ర ఉద్యమ ప్రణాళికలు,భవిష్యత్ కార్యాచరణ మొత్తం నాగార్జున యూనివర్సిటీ నుండే వెలువడేవి. వీటిలో ముఖ్యాంశాలు స్క్రోలింగ్స్ చెప్పేందుకు,లైవ్ ఇచ్చేందుకు పలువురు స్టాఫ్ రిపోర్టర్స్ బాగా పోటీపడేవారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమాలు అన్నీ కలిపి రాత్రికి  ప్యాకేజీ ఐటమ్స్, స్క్రిప్ట్‌లు పంపాల్సి వచ్చేది. ఒకరోజు వినూత్నంగా మీడియా అంతా అందుబాటులో లేని సమయంలో యూనివర్సిటీ వెనుక భాగంలో గుంటూరు ఛానల్ కాలువ ఉండేది. విద్యార్థి నాయకులు రాష్ట్రంలో మంత్రులు, కొద్దీ మంది పాలకుల దిష్టిబొమ్మలకు వర్శిటీ ప్రాంగణంలో శవయాత్ర నిర్వహించి ఆ దిష్టిబొమ్మలను కాలువలో వేసి అక్కడ పూజారులను ఏర్పాటు చేసి పిండాలు పెట్టారు. ఈ వార్త కవరేజీలో విజువల్స్ అందుకోలేని చాలామంది జర్నలిస్ట్‌లు ఆఫీసుల నుండి తిట్ల పురాణం ఎదురయ్యింది. ఇలా చాలారోజుల పాటు జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమం కవర్ చేస్తూ జర్నలిస్ట్‌లు యూనివర్సిటీకి అంకితమయ్యారు.

## సమైక్యాంధ్ర ఉద్యమంలో సీనియర్ జర్నలిస్ట్ దీక్ష



మా జర్నలిస్ట్‌ల సంకల్పం ఎంతో గొప్పది అని చెప్పేందుకు నేను గర్వపడుతున్నాను. సామాజిక స్పృహ కలిగి ప్రజాసమస్యలు ప్రభుత్వం దృష్టికి చేరుస్తూ ఆయా పత్రికలు, ఛానల్స్ ద్వారా ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధిలా పనిచేసే మా జర్నలిస్ట్‌లు ప్రజా సమస్యలు తీర్చటంలో ఎప్పుడూ ముందుంటారు. 2009 లో సీమాంధ్ర ప్రాంతంలో సమైక్యాంధ్ర ఉద్యమం పెద్ద ఎత్తున జరిగింది. ఈ క్రమంలో జర్నలిస్ట్‌లు సమైక్యాంధ్ర ఉద్యమాలు, నిరసనలు కవర్ చేస్తూ రోజు మొత్తం క్షణం తీరిక లేకుండా ఉండేవారు. ఆ ఉద్యమ సమయంలో మేము ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా మాకు పూట సెలవు కూడా దొరికేది కాదు. అటువంటి పరిస్థితులలో కూడా మా సీనియర్ జర్నలిస్ట్,మా అన్న గారు కంభాల ముక్కంటి నాటి స్టూడియో-ఎన్ గుంటూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సమైక్యాంధ్ర ఉద్యమం కోసం ఒక్కరోజు దీక్ష చేపట్టారు.

గుంటూరు హిందూ కాలేజీ వద్ద గల మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద సొంత ఖర్చులతో టెంట్, మైక్ ఏర్పాటు చేసి దీక్ష కొనసాగించారు. రాష్ట్రాన్ని విడదీయటం అన్యాయం అంటూ మా అన్న గారు దీక్ష చేశారు. దేశంలో ఉత్తరాది రాష్ట్రాల పెత్తనం ఎక్కువగా ఉందని, దీనికి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు, సామాజిక పరిస్థితులు విశ్లేషణ చేసే ఎంతోమంది తమ అభిప్రాయాలను తెలియజేసేవారు. దీనికి అనుగుణంగా దేశాన్ని నిలువునా రెండు భాగాలు చేసి ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశంగా విభజించి దేశానికి రెండవ రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటించాలి అని, అలాగే ఆంధ్రప్రదేశ్‌ని రెండుగా విభజించాలి అంటే ముందు దేశాన్ని రెండు భాగాలుగా విభజించి హైదరాబాదును దేశానికి రెండవ రాజధానిగా ప్రకటించాలి అని, ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్ర రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలి అని అన్న, సీనియర్ జర్నలిస్ట్ ముక్కంటి ఒక్క రోజు దీక్ష చేశారు. అప్పటికే సమైక్యాంధ్ర కోసం ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగులు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. అయితే ముక్కంటి తన విధులకు సెలవు దొరక్కపోయినా సామాజిక స్పృహతో చేసిన దీక్షకు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, వ్యాపారస్తులు, ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగులు, జర్నలిస్ట్‌ల నుండి విశేషమైన అభినందనలు లభించాయి. ఈ సంధర్భంగా నాడు కోడెల శివప్రసాద్ కూడా ముక్కంటి దీక్షా శిబిరాన్ని సందర్శించి ఏ శాఖలు, ఏ సంస్థలు ఎలా ఉన్నా జర్నలిస్ట్ రోడ్డు ఎక్కితే, ఆయా పరిధిలో ఉన్న ప్రభుత్వాలు రోడ్డునపడ్డట్లే అని వ్యాఖ్యానిస్తూ దీక్షలో ఉన్న ముక్కంటికి పూలదండ వేస్తూ అభినందించారు. ఇలా చాలా మంది ప్రముఖులు ముక్కంటి దీక్షకు మద్దతు ప్రకటించారు.

ఇలా జర్నలిస్ట్‌లు కూడా సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత వహిస్తూ సమైక్యాంధ్ర కోసం పని చేశారు. అయితే ఆ సమయంలో జర్నలిస్ట్‌లకు సమైక్యాంధ్ర ఉద్యమం వార్తలు కవర్ చేయటానికి కూడా సమయం ఉండేది కాదు. ఇక స్టాఫ్ రిపోర్టర్ అంటే జిల్లాలో జరిగే ప్రతి విషయాన్ని స్ట్రింగర్స్ ద్వారా కనుగొని గంట, గంటకు ఫోన్ ఇన్,పీ టూ సీ, లైవ్ ఇస్తూ ప్రతిరోజు బిజీగా ఉండే సమయం అది. అటువంటి పరిస్థితిలో కూడా ఆయన దీక్ష చేపట్టారు అంటే ఆయన పని చేస్తున్న మీడియా సంస్థ ఏమైనా ఇబ్బందులకు గురి చేసిందో లేదో గానీ నాడు ముక్కంటి అన్నగారు చేపట్టిన దీక్ష చాలా ప్రాంతాల్లో హాట్ టాపిక్ అయ్యింది. అలా ముక్కంటి తన దీక్ష ద్వారా గుంటూరు జిల్లా జర్నలిస్ట్‌ల గౌరవ మర్యాదలు మరింత పెంచారు. దానితో రోజంతా జిల్లాలో పలు ప్రాంతాల్లో సమైక్యాంధ్ర ఉద్యమాలు కవర్ చేస్తున్న జర్నలిస్ట్‌లు కూడా తమ విధులు తాము నిర్వహిస్తూ సమైక్యాంధ్ర ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించారని ముక్కంటి దీక్ష ద్వారా చాలా మంది గ్రహించారు. దీనితో నిత్యం సమైక్యాంధ్ర ఉద్యమం

వార్తలు కవర్ చేసిన జర్నలిస్ట్‌ల వల్లనే కొంతమేరకైనా సమైక్యాంధ్ర ఉద్యమం మీడియాపరంగా సక్సెస్ అయ్యిందని, జర్నలిస్ట్‌లు లేకపోతే సమైక్యాంధ్ర ఉద్యమం మీడియా పరంగా కూడా సక్సెస్ అయ్యేది కాదని పలువురు అభిప్రాయపడ్డారు. ఎవరు ఎంత చేసినా, సమైక్యాంధ్ర ఉద్యమం ఓ రకంగా సక్సెస్ అయినా చివరకు రాష్ట్రం రెండు ముక్కలుగా విడిపోవడం సమైక్యాంధ్ర ఉద్యమకారులకు జీర్ణించుకోలేకపోయిన అంశంగా మిగిలిపోయింది.

## మంగళగిరి బై పాస్‌లో గ్యాస్ ట్యాంకర్ బోల్తా

ఇది కూడా సుమారు పదేళ్ల క్రితం వార్త. గుంటూరు జిల్లా మంగళగిరి బైపాస్ రత్నాల చెరువు వద్ద వైజాగ్ నుండి చెన్నై వెళుతున్న ఓ భారీ గ్యాస్ ట్యాంకర్ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. విషయం తెలుసుకున్న మా మంగళగిరి స్ట్రింగర్స్ అంతా ప్రమాద ప్రాంతానికి చేరుకున్నాం. అప్పటికే రోడ్డుకు అడ్డంగా పడిపోయిన గ్యాస్ ట్యాంకర్ నుండి ఓ మాదిరిగా గ్యాస్ లీక్ అవుతుంది. బైపాస్ ప్రాంతం అంతా గ్యాస్ వాసన వస్తుంది.ప్రమాదం గమనించిన కొందరు యువకులు గ్యాస్ లీక్ అవుతున్న ప్రాంతాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో ఇసుక కూర్చడం, నీళ్లు చల్లటం వంటి పనులు చేస్తున్నారు. స్ట్రింగర్స్ అక్కడకు చేరుకోగానే ఆ ప్రాంతం మొత్తం చాలా హడావుడిగా ఉంది. పోలీసులు మీడియాతో సహా ఎవ్వరిని అక్కడకు రానివ్వడం లేదు. ఇక మేమయితే స్క్రోలింగ్స్ చెప్పి విజువల్స్ కోసం అక్కడే కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాం. అయితే అప్పటికే అక్కడకు చేరుకున్న మంగళగిరి రాయల్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులు నన్నపనేని నాగేశ్వరరావు తమ కంపెనీలో పనిచేసే గ్యాస్ కంపెనీ సిబ్బంది మొత్తాన్ని అక్కడకు తీసుకెళ్లి గ్యాస్ లీక్ కాకుండా నివారణ చర్యలు సాగిస్తున్నారు.

పోలీసులు మాత్రం ఎవ్వరిని దగ్గరకు రాకుండా అరకిలోమీటర్ దూరంలోనే ఆపేస్తున్నారు. ఒక ప్రక్క మాకు విజువల్స్ కావాలి అంటూ మీడియా ఆఫీసుల నుండి ఫోన్లు. అరకిలోమీటర్ దూరం నుండి మాకు విజువల్స్ రావడం లేదు. పోలీసుల కళ్ళుగప్పి ఒకరిద్దరు స్ట్రింగర్స్ విజువల్స్ తెచ్చారు. విజువల్స్ లో చాలా క్లియర్‌గా అక్కడ కూర్చిన ఇసుక, చల్లిననీళ్లమధ్య బుస, బుస మంటూ గ్యాస్ లీక్ అవుతుంది. ఇక ఆ విజువల్స్ తెచ్చుకున్న స్ట్రింగర్స్ ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆఫీసులకు విజువల్స్ అప్‌లోడ్ చేశారు. వెంటనే ఆ విజువల్స్ వేస్తూ ఆ ఒకటి, రెండు ఛానల్స్ వార్త ప్రసారం చేశాయి. ఇక మిగిలిన స్ట్రింగర్స్‌కి పైనుండి విజువల్స్ కావాలి అంటూ తీవ్ర వత్తిడి. మరో ప్రక్క ఆ విజువల్స్, ట్యాంకర్ పడిపోయిన విధానం చూసిన మీడియా పెద్దలు అక్కడ చాలా పెద్ద ప్రమాదం జరగనుందని, భారీ విస్ఫోటనం జరిగే అవకాశం ఉందని భావించి విజయవాడ నుండి ఓబీ వ్యానులు, గుంటూరు నుండి స్టాఫ్ రిపోర్టర్స్‌ని రంగంలోకి దించారు.


గ్యాస్ ట్యాంకర్ రోడ్డుకు అడ్డంగాపడిపోవడంతో హైవే మొత్తం కిలోమీటర్ల లెక్క భారీస్థాయిలో ట్రాఫిక్ జామ్. విజయవాడ నుండి న్యూస్ కవర్ చేసేందుకు బయలుదేరిన ఓబీ వ్యాన్లు ట్రాఫిక్ కారణంగా సంఘటనా ప్రాంతానికి చేరేందుకు చాలా ఇబ్బందిపడ్డాయి. చివరకు తాడేపల్లి బైపాస్ నుండి మంగళగిరి పాత హైవే గుండా ఏదోలా సంఘటనా ప్రాంతానికి చేరాయి. ఓబీ వ్యాన్లు కూడా అరకిలోమీటరు దూరంగా పెట్టి స్టాఫ్ రిపోర్టర్స్ లైవ్‌లు ఇచ్చారు. ప్రమాదం జరిగిన రోడ్డుకు పక్కనే అతి సమీపంలో ఓ కాలనీ ఉందని జరగరానిది ఏమైనా జరిగితే ఆ కాలనీ వాసులకు చాలా ప్రమాదం అంటూ, గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడిన ప్రాంతం నుండి చుట్టుపక్కల అరకిలోమీటర్ వరకు నో స్మోకింగ్ జోన్‌గా పోలీసులు పహారా కాస్తున్నారు అంటూ స్టాఫ్ రిపోర్టర్స్ అన్ని ఛానల్స్‌లో లైవ్ ప్రోగ్రామ్స్ ఇస్తున్నారు. పొరపాటున ఫైర్ అయితే జరిగే ప్రమాదం గుర్తించిన పోలీసులు ఆ కాలనీ వాసులను ఎలర్ట్ చేయడం ఆ చుట్టుపక్కల ఎవరైనా సిగరెట్లు కాలుస్తూ కనిపిస్తే వారిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కి తరలించడం చేస్తున్నారు. మరో ప్రక్క ఓ.ఎన్. జీ.సీ.,కొండపల్లి గ్యాస్ రెస్క్యూ టీమ్ బృందాలు వస్తూ, వస్తూనే రోడ్ల పై పరుగెత్తుతూ అక్కడ ఉన్న జనాన్ని ప్రక్కకు వెళ్లి పోవాల్సిందిగా మైకుల్లో అరుస్తూ చాలా హడావుడి చేశారు. ఇలా సాయంత్రం ఐదు,ఆరు గంటల వరకు ఆ ప్రాంతం చాలా హడావుడిగా ఉంది. ఎట్టకేలకు భారీ క్రేన్లు రప్పించి గ్యాస్ ట్యాంకర్‌ని పైకిలేపారు. ఇక అక్కడ జరిగే వ్యవహారం మొత్తం స్టాఫ్ రిపోర్టర్స్ కవర్ చేస్తుంటే, కాలనీ వాసులు ఇళ్ళల్లో సామాన్లు బయట వేసుకుని బిక్కు, బిక్కు మంటూ కూర్చున్న విజువల్స్, లారీల పైకి ఎక్కి కిలోమీటర్ల లెక్క ఆగిన ట్రాఫిక్ కవర్ చేస్తూ స్ట్రింగర్స్ మొత్తానికి అందరూ విజయవంతంగా ఆ సంఘటన ద్వారా ఎటువంటి ప్రమాదం జరగకుండా విధులు నిర్వహించారు. అక్కడ నుండి గ్యాస్ ట్యాంకర్‌ని లేపి తరలించే వరకు పోలీసులు, రెస్క్యూ టీమ్స్, అధికారుల విధులు కవర్ చేస్తూ ప్రతీ బులెటిన్‌కి వార్తలు అందిస్తూ జర్నలిస్టులు చాలా ఇబ్బందులు పడ్డారు.

## ఖాజ టోల్‌గేట్ వద్ద సల్ఫర్ గ్యాస్ ట్యాంకర్ బోల్తా

నాలుగైదేళ్ల క్రితం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఖాజ టోల్ గేట్ వద్ద ఓ గ్యాస్ ట్యాంకర్ ఒక స్తంభాన్ని ఢీకొని రోడ్డు ప్రక్కకు మోకాళ్ళలోతు ఉన్న చెట్ల మధ్య పడిపోయింది. దానితో ట్యాంకర్ నుండి ద్రవ రూపంలో ఉన్న సల్ఫర్ గ్యాస్ భారీగా లీక్ అయ్యింది. ఇక ఆ వార్త కవర్ చేయటానికి వెళ్లిన మంగళగిరి స్ట్రింగర్స్ అక్కడకు వెళ్లారు.

మాలో ఒక స్ట్రింగర్ ట్యాంకర్ పడిపోయిన ప్రాంతంలో చెట్ల మధ్యకు దిగాడు. దిగిన మరుక్షణమే అతను అరుచుకుంటూ బయటకు పరుగెత్తుకొచ్చాడు. ఏమయ్యిందని మేము ప్రశ్నిస్తే కాళ్ళు మండుతున్నాయని కూర్చోలేక, నిలుచోలేక ఇబ్బంది పడ్డాడు. అప్పుడు అతని కాళ్ళు పరిశీలిస్తే అరికాళ్ళు, పాదాలు నల్లగా మారిపోయాయి. పాదాలు పై భాగంలో చర్మం లేచి పోయి గాయాలు కనిపించాయి. వెంటనే మంగళగిరిలో ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలిస్తే డాక్టర్స్ రెండు కాళ్ళ పాదాలకు కట్లు కట్టారు. ఆ గాయాలు మానడానికి ఆ స్ట్రింగర్‌కి వారం పైగా టైం పట్టింది. ఇలా వార్తలు కవరేజీ విషయంలో మా జర్నలిస్ట్ సోదరులు ఏదో రకంగా ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా అక్కడ జరిగిన సంఘటనలు మా జర్నలిస్ట్ సోదరులు కవర్ చేయాల్సిందే. లేదంటే మీడియా ఆఫీసుల నుండి ఏ మాత్రం క్షమించరు. ఇలా ఉంటుంది వృత్తి పట్ల మా జర్నలిస్ట్‌ల డెడికేషన్.కొద్ది రోజుల తరువాత ఆ ట్యాంకర్ పడిపోయిన ప్రాంతాన్ని చూస్తే అక్కడ ఉన్న చెట్లన్నీ నల్లగా మాడిపోయి ఉన్నాయి. టోల్ గేట్ నిర్వాహకులు ద్రవ రూపంలో లీక్ అయిన గ్యాస్ ప్రాంతంలో భారీగా ఇసుక వేసి అక్కడ ఎవరూ దిగకుండా ఉండేందుకు డేంజర్ బోర్డు ఏర్పాటు చేశారు. అప్పుడు అనిపించింది. అక్కడకు దిగిన మా జర్నలిస్ట్ మిత్రుడు ఎంత ఇబ్బంది పడ్డాడోనని వెంటనే బయటకు వచ్చాడు కాబట్టి సరిపోయింది. లేదంటే కాళ్ళ పాదాలు పూర్తిగా కాలిపోయేవి.

# 8. అమరావతిలో - జర్నలిస్ట్‌లు ఎదుర్కొన్న సమస్యలు (4)




**"విశ్వ విద్యాలయాలలో విధ్యార్థులు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలు చేయాల్సింది పోయి, కులాల వెంట పరుగులు పెట్టడం తప్పు. పైగా ర్యాగింగ్, లైంగిక వేధింపులు వంటి చర్యలను తుప్పు వదిలించిన జర్నలిస్టుల సామాజిక బాధ్యత విధానం చూడండి"**

# కులాల రొచ్చులో విద్యార్థులు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఒక కులాలకుంపటి. అది ఒకప్పుడు కులాలు, వర్గాలకు నిలయం. మేధావులు ఎందరో కులాల పునాదులపై ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించలేమని చెపుతున్న విశ్వవిద్యాలయాలు మేధావులను తయారు చేస్తాయి అనేదానికి వ్యతిరేకంగా ఒకప్పుడు నాగార్జున యూనివర్సిటీలో కులాలు, వర్గాలు పూర్తిగా వర్సిటీని ఏలాయి. వర్శిటీ వీసీ నుండి ప్రొఫెసర్లు, విద్యార్థులు, వర్శిటీ ఉద్యోగులు అందరూ కులాల రొచ్చులో పీకల్లోతు మునిగిపోయి ఉండేవారు. తమ కులానికి, వర్గానికి కొమ్ముకాస్తూ యూనివర్సిటీలో ఏకులానికి ఆ కులం, ఏ వర్గానికి ఆ వర్గం ఆధిపత్యం కోసం పాకులాడేవి. వీసీ, రిజిస్ట్రార్ రెక్టార్, పలు డిపార్ట్‌మెంట్స్ హెచ్.ఓ.డీ. తమవాడు అంటూ, మావర్గం, మాకులం అంటూ ఆధిపత్యం చెలాయించేవి. ఓవరాల్‌గా వర్సిటీలో ఈ వ్యవహారం మామూలుగా ఉండేదికాదు. విద్యార్థులు కులాలు, వర్గాలుగా విడిపోయి, ఎవరికి వారు ఆధిపత్య ధోరణిలో ఉండేవారు. ఎవరి కులాన్ని వారు, ఎవరి వర్గాన్ని వారు చాటుకుంటూ సాటి విద్యార్థుల మధ్య విభేదాలు కలిగి విష సంస్కృతితో మనుగడ సాగించేవారు.

దీనికి నిదర్శనం నిలువెత్తు సాక్ష్యంగా ఆరేడు ఏళ్ళ క్రితం ముందు వర్శిటీ ప్రాంగణంలో క్యాంటీన్ ఎదురు వర్శిటీలో ఆయాకులాల, విద్యార్థి సంఘాల బోర్డులు ఉండేవి. రాష్ట్రంలో ఎక్కడా ఏ యూనివర్సిటీలోలేని విధంగా నాగార్జున యూనివర్సిటీలో కులసంఘాల, విద్యార్థిసంఘాల బోర్డులు అప్పట్లో దర్శనమిచ్చేవి. ఆయా కులసంఘాల నాయకులు పుట్టిన రోజు, వర్ధంతి కార్యక్రమాలు వస్తే ఆ కుల సంఘాల బోర్డులు వద్ద తమ నాయకుడి ఫోటో ఏర్పాటు చేసి తమవర్గానికి, కులానికి చెందిన విద్యార్థులను పిలిచి మైకులు పెట్టి దండలు వేసి ఆది ఓ పెద్ద పండుగలా ఎవరికి వారు ఉపన్యాసాలు ఇచ్చి పెద్ద తతంగం నిర్వహించేవారు. వీటి కవరేజీకి మంగళగిరి నుండి మీడియాను ఆహ్వానించేవారు.అలా యూనివర్సిటీకి వెళ్లిన నాకు వర్సిటీలో ఇలాంటి వ్యవహారాలు ఏమిటి...? ఉన్నత విద్యకై వచ్చిన విద్యార్థులు ఈ విధంగా కులాలకు కొమ్ముకాయటం సరైన వాతావరణంలా నాకు అనిపించలేదు. నాకు అప్పుడే ఒక ఐడియా వచ్చింది. అక్కడ ఉన్న కులసంఘాల, వర్గాల బోర్డులు, వర్శిటీ విద్యార్థులు వ్యవహరిస్తున్న తీరు మొత్తం కవర్‌చేసి ఒక స్టోరీ ప్రిపేరు చేశాను. అప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రిషితేశ్వరి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తులకు, విద్యార్థులకు ఓ కులవర్గం విద్యార్థులు సపోర్ట్ చేయడం జరిగిన అన్యాయాన్ని మూకుమ్మడిగా ప్రశ్నించాల్సిన విద్యార్థులు తమ వర్గీయులను కాపాడటం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఎత్తిచూపుతూ కులాల రొచ్చులో విద్యార్థులు అనేస్టోరీ నేను పనిచేసిన ఛానల్‌లో

ప్రసారం అయ్యింది. నాడు ఆ స్టోరీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక మిగిలిన ఛానల్స్ వారు కూడా ఇదే అంశంపై స్టోరీ చేయడం జరిగింది. నా జర్నలిస్ట్ మిత్రులు ఆ స్టోరీకి నేను రాసిన స్క్రిప్ట్ వాడుకున్నారు. 10 రోజుల వ్యవధిలో అన్ని చానల్స్ ఆ స్టోరీ వేసి వర్సిటీలో విద్యార్థుల కులసంఘాలను, వర్సిటీని అన్ని ఛానల్స్ ఏకి పారేశాయి.

అంతే ఇక యూనివర్సిటీ పాలకవర్గానికి, నాటి వీసీకి అప్పటి ఉన్నత విద్యాశాఖమంత్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్ నుండి వర్సిటీ ప్రాంగణంలో ఉన్న కులసంఘాల బోర్డులు తక్షణమే తొలగించాలని ఆదేశాలు వెలువడ్డాయి.

ఇక యూనివర్సిటీ అధికారులు కులసంఘాల బోర్డులు తొలగించేందుకు పెద్ద సాహసమే చేయాల్సి వచ్చింది. ఎవరికి చెప్పకుండా ఓ రోజు ప్రొక్లెయిన్ ఏర్పాటు చేసి కులసంఘాల బోర్డులు తొలగించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కులసంఘాల విద్యార్థి నాయకులు అక్కడకు చేరుకుని ప్రొక్లెయిన్‌కు అడ్డం పడి పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ దానిని అడ్డుకున్నారు. దానితో వర్శిటీ అధికారులకు అవి తొలగించటానికి వీలు పడలేదు. ఈ వార్తను కవర్ చేసాం.

ఇక మా పెద్ద సార్లు ఊరుకుంటారా... వర్సిటీలో కులసంఘాల బోర్డులు తొలగించే వ్యవహారంని ఏ సమయమైనా, ఎప్పుడైనా మిస్ కాకుండా పంపించాలి అని ఆదేశాలు. ఇక దాని కోసం మేము యూనివర్సిటీపై ఓ కన్ను వేసి ఉంచాల్సి వచ్చింది. నాలుగైదు రోజుల తరువాత రాత్రి 10 గంటల సమయంలో విద్యార్థులు ఆదమరిచిన సమయంలో వర్శిటీ అధికారులు పెద్దఎత్తున పోలీసు బలగాలను పెట్టి రెండు ప్రొక్లెయిన్‌లతో ఇరుప్రక్కల రెండు, మూడు కులసంఘాల బోర్డులు పీకేశారు. ఈ లోగా హాస్టల్ భవనాల్లో ఉన్న విద్యార్థి కులసంఘాల నాయకులు హాస్టల్ విద్యార్థులను తీసుకొని సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. ఎవరికి వారే పెద్ద పెద్ద అరుపులు, నినాదాలు పోలీసులు అయితే ఒక్కరిని కూడా అక్కడకు చేరకుండా లాఠీలకు పనిచెప్పారు. ఈ క్రమంలో కవరేజీకి వెళ్లిన మా జర్నలిస్ట్ మిత్రులకు కూడా లాఠీ దెబ్బలు తగిలాయి. అయినప్పటికి వర్శిటీ విద్యార్థులు పోలీసులను ఛేదించుకుని ఓ అరగంట పాటు కులసంఘాల బోర్డుల పీకివేతను ప్రొక్లెయిన్‌లకు అడ్డుపడి పోలీసుల లాఠీదెబ్బలు తగులుతున్నా అక్కడ నుండి తొలగిపోలేదు. చివరికి పోలీసులు విడతలవారీగా వారిని అదుపులోకి తీసుకుని కొందరిని మంగళగిరి, కొందరిని పెదకాకాని, మరికొందరిని వేరే పోలీసు స్టేషన్స్‌కి తరలించారు. ఈ క్రమంలో విద్యార్థులు అరెస్ట్ చేసిన జీపుల నుండి క్రిందికి దూకి మరలా బోర్డుల తొలగింపు వద్దకు చేరుకోవడం ఇలా ఆ రాత్రి పెద్ద హడావుడి జరిగింది. చివరకు బోర్డులన్నీ పీకే సరికి రాత్రి 12 గంటలు దాటిపోయింది. ఇక గ్రౌండ్ లో మేము, పోలీసులు తప్ప ఎవరూ లేరు.రాత్రి కావడంతో న్యూస్ బులెటిన్స్ హడావుడి

లేదు.కాకపోతే రాత్రి కవర్ చేసిన న్యూస్ అంతా ఉదయాన్నే 6 గంటల బులెటిన్‌కి అందించాలి. ఈ క్రమంలో తొలగించిన కులసంఘాల బోర్డులు ఏమి చేస్తారు.అవి ఎక్కడ వేస్తారు. తొలగించిన కులసంఘాల బోర్డుల పట్ల విద్యార్థి నాయకులు ఎలా స్పందిస్తారు అనే విషయాలు తప్పనిసరిగా కవర్‌చేసి పంపించాలి అని మా సార్లు ఆర్డర్స్. ఇక వాటి కోసం మంగళగిరి స్ట్రింగర్స్ అందరూ అక్కడ తెల్లవార్లు జాగారం.

ఎట్టకేలకు అంతా సర్దుమణిగాక తొలగించిన కులసంఘాల బోర్డులను ప్రొక్లెయిన్‌తో నెట్టుకుంటూ యూనివర్సిటీ వెనుక భాగంలో ఎవ్వరూ తిరగని ప్రాంతానికి చేర్చారు. అయితే అక్కడ గబ్బుచీకటి తొలగించిన బోర్డులు ఒక్కటి కూడా చీకటి కారణంగా మా జర్నలిస్ట్‌ల కెమెరాలలో విజువల్స్ రికార్డు కాలేదు. ఇక తెల్లవార్లు అక్కడే ఉండి పొద్దు పొద్దునే ఆ విజువల్స్ తీసి ఆఫీసుకు అప్‌లోడ్ చేసాం. ఇక ప్రతి ఛానల్‌లో యూనివర్సిటీ కులసంఘాల బోర్డుల పీకివేత, విద్యార్థులపై లాఠీచార్జ్, విద్యార్థులు అరెస్ట్ వార్తలతో ఒకటే హడావుడి ఎట్టకేలకు మంగళగిరి మీడియా వర్సిటీ కులసంఘాలపై గురి పెట్టిన పాచిక సక్సెస్ అయ్యింది. మంగళగిరి మీడియా వరుస కథనాల వల్లనే నాడు వర్సిటీలో కులసంఘాల బోర్డుల నిర్మూలన సాధ్యపడింది. అయినప్పటికీ నేటికీ యూనివర్సిటీలో కులాల ఆధిపత్యం లేదు అనుకోవడానికి వీలులేదు. ఆనాడు సాగిన కులసంఘాల ఆధిపత్యం ప్రస్తుతం అంతగా లేకపోయినా కొద్దిస్థాయిలో నేటికి చాపక్రింద నీరులా మనుగడ సాగిస్తూనే ఉంది. ఈ పరిస్థితి మారాలి. అందుకోసం నాటి మంగళగిరి జర్నలిస్ట్‌లు మరియు గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్ చేసిన ప్రయత్నం ఒక మంచి ఫలితం ఇచ్చింది.

## "రిషితేశ్వరి ఆత్మహత్య"[1]

అది 2015 ఆచార్య నాగార్జున యూనివర్సిటీ  ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి లెడీస్ హాస్టల్లో తన హాస్టల్ రూమ్‌లో ఫ్యాన్‌కి  ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన. మీడియా ట్రోలింగ్స్ ద్వారా ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా దావానంలా వ్యాపించింది. మీడియా, పోలీసులు, విద్యార్థులతో వర్సిటీ ప్రాంగణం అంతా హడావుడిగా ఉంది. మొదట రిషితేశ్వరి ఆత్మహత్య వివరాలు ఎవరికీ భోదపడలేదు. తెలంగాణలోని వరంగల్‌కి  చెందిన రిషితేశ్వరి.. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ విద్యార్థిని. మొదటిసంవత్సరం చదువుతున్న సమయంలో ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. ర్యాగింగ్, లైంగిక వేధింపుల గురికావడం వల్లే ఆమె ఆత్మహత్య చేసుకున్నారనే విషయాన్ని పోలీసులు ఛార్జిషీట్లో నమోదు చేశారు.

రిషితేశ్వరి ఆత్మహత్య ఘటన కవరేజీలో మంగళగిరి స్ట్రింగర్స్‌ది ఎనలేని పాత్ర ఎందుకంటే రిషితేశ్వరి ఆత్మహత్య చేసుకున్న సమయంలో గుంటూరు, విజయవాడ స్టాఫ్



*Source Internet : 1. 'రిషితేశ్వరి ఆత్మహత్య'*[1]

రిపోర్టర్స్ ఇక్కడలేరు. వారంతా గోదావరి పుష్కరాల్లో విధులు నిర్వహించేందుకు అక్కడికి వెళ్లిపోయారు. దీనితో రిషితేశ్వరి ఆత్మహత్య సంఘటన ప్రతీ విషయాన్ని కవర్‌చేసే బాధ్యత మీడియా సంస్థలు మంగళగిరి స్ట్రింగర్స్‌పై పెట్టేశాయి. అక్కడ జరిగే ప్రతీ విషయాన్ని మంగళగిరి స్ట్రింగర్స్ కవర్ చేసి మీడియా ఆఫీసులకు అప్‌లోడ్ చేయాల్సి వచ్చేది.ఏ వార్త మిస్ అయినా స్ట్రింగర్స్‌కి మామూలుగా ఉండేది కాదు.

ఆయితే రిషితేశ్వరిపై ర్యాగింగ్, లైంగిక వేధింపులు జరగడంతో 2015 జులై 14వ తేదీన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు ఛార్జిషీట్లో పేర్కొన్నారు. అయితే.. రిషితేశ్వరి ఆత్మహత్య చేసుకునే సమయానికి మేజర్ కావడంతో ఈ కేసును తాము విచారించలేమని ఫోక్సో న్యాయస్థానం స్పష్టం చేసింది. నాగార్జున యూనివర్సిటీలో ఓ కులం వారి ఆగడాలకు అడ్డులేకుండాపోతోందని అప్పటి వర్శిటి ప్రొఫెసర్ డేవిడ్‌రాజు అన్నారు. ప్రశ్నించినవారిని, నిజాలు మాట్లాడేవారి నోరునొక్కేస్తూ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ బాబూరావు మద్యంతాగి క్లాసుకు వస్తారని, ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల పాటు స్టాఫ్ రూంలోనే నిద్రపోతారని, అమ్మాయిలతో బాబూరావు అసభ్యకరంగా వ్యవహిరించే మాట వాస్తవమని డేవిడ్‌రాజు అన్నారు. రిషితేశ్వరి ఆత్మహత్యకు ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ బాబురావు, మరో ముగ్గురు విద్యార్థులకు సంభంధం ఉందని అప్పటికే తేలిపోయింది. బాబురావు, ఆ ముగ్గురు విద్యార్థుల విజువల్స్ కావాలని మాపై పెద్ద ఎత్తున వత్తిడి ఏర్పడింది.వారేమో ఎవరికి కనిపించేవారు కాదు.

విద్యార్థులు ప్రతివారం ప్రిన్సిపాల్‌కి మందుపార్టీ ఇవ్వాలని, లేదంటే విద్యార్థులకు మార్కులు వేయరని, ఇలాంటి చరిత్ర ఉందనే గతంలో బాబురావు పని చేసిన కాలేజీల యాజమాన్యాలు తరిమేశాయని, ఫ్రెషర్స్ పార్టీలో ఆయన మద్యం సేవించి డాన్స్ చేశారని, బాబూరావు బాధలు తట్టుకోలేక ఇద్దరు మహిళా ఫ్యాకల్టీలు వెళ్లిపోయారని, రిషితేశ్వరి చనిపోయిన రోజు... ఇంకా బతికే ఉందని లెటర్ కోసం వర్సిటీ మెడికల్ ఆఫీసర్‌పై ఒత్తిడి తెచ్చారని డేవిడ్‌రాజు ఆరోపించారు. ఇవన్నీ కవర్ చేయడం మంగళగిరి స్ట్రింగర్స్‌కి కొంత కష్టతరంగా ఉండేది. ప్రతీ విషయం కవర్ చేసి ఆఫీసులకు క్షణాల్లో పంపించాల్సి వచ్చేది. ప్రిన్సిపాల్ బాబురావు వ్యవహారం వెల్లడించిన ప్రొఫెసర్ డేవిడ్‌రాజ్ వాయిస్ కావాలని పెద్దఎత్తున మంగళగిరి స్ట్రింగర్స్‌కి ఆఫీసుల నుండి బాగా వత్తిడి ఉండేది.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రిషితేశ్వరి ఆత్మహత్య ఈ ఘటనలో నిందితులుగా ఉన్న సీనియర్ విద్యార్థులను శ్రీనివాస్, జయచరణ్, అనీషలను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత వారు బెయిల్ పైన విడుదలయ్యారు. ఈ ఘటనలో అనీషా అనే విద్యార్థినిని కావాలనే ఉద్దేశ్యపూర్వకంగా ఇరికించారని ఆమెతండ్రి పెద్ద హంగామా చేశారు.

ఇక రిషితేశ్వరి ఆత్మహత్య విచారణ సమయంలో ఎన్నో రాజకీయాలు జరిగాయి. ఆమె ఆత్మహత్య వెనుక ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి.వాటికి సమాధానాలు వెతికేవారే లేరు. మరి ప్రభుత్వం దగ్గర వీటికి సమాధానం ఉందా అంటే అదీ లేదు అనే దిశగా మంగళగిరి మీడియా ప్రతినిధులు పరిశోధన దిశగా వార్తలు కవర్ చేశారు.

1. ఆ రోజు రిషితేశ్వరి ఆత్మహత్య మీద ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు..? కుల రాజకీయాలకు ప్రభుత్వం తలొగ్గిందని వస్తున్న వార్తల్లో నిజం లేదా.?
2. ఆడవాళ్లకు మా ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది అని బీరాలు పలికిన ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం... రిషితేశ్వరికి రక్షణ కల్పించడం మాట అటుంచి కనీసం మాట కూడా మాట్లాడలేదు ఎందుకు.?
3. యూనవర్సిటీలో విద్యార్థిని చనిపోతే చంద్రబాబు నాయుడు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకు ఉన్నారు...?
4. అసలు రిషితేశ్వరి కేసుకి ప్రిన్సిపాల్ బాబూరావుకి సంభందమేంటి?
5. ప్రిన్సిపాల్ బాబూరావును ఎందుకు సస్పెండ్ చెయ్యలేదు..?
6. బాబూరావు సస్పెన్షన్‌కు ముందుగానే నాటకీయంగా రాజీనామా ఎందుకిచ్చాడు? బాబూరావును కాపాడే ప్రయత్నం ఎవరు చేస్తున్నారు?
7. కాలేజీలో సుప్రీం ఆదేశాల మేరకు ఏర్పాటు చేయాల్సిన యాంటీ ర్యాగింగ్ కమిటీని ఎందుకు ఏర్పాటు చేయలేదు?
8. రిషితేశ్వరిని వేదిస్తున్నారంటూ ఆమె చనిపోవటానికి పది రోజుల ముందు ఆమె పేరెంట్స్ ప్రిన్సిపాల్‌కు కంప్లైంట్ ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు?
9. రెండువేల మంది సాక్షిగా, నిజనిర్ధారణ కమిటీ సమావేశం జరుగుతుండగా విద్యార్థుల మీద ఓ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది విద్యార్థులు దాడిచేసినా ఆనాటి విసి ఎందుకు స్పందించ లేదు..?
10. హాస్టల్‌లో ఉన్న తోటి విద్యార్థినుల కంటే ముందు ఆమె మరణవార్త బాయ్స్ హాస్టల్‌కు ఎలా చేరింది?
11. ఉరితాడు బిగించుకున్నప్పుడు ఆమెను మొదట చూసింది ఎవరు?
12. బాబూరావుకు ఎందుకు ఫోన్ చేశారు? హాస్టల్ వార్డెన్‌కు ఎందుకు సమాచారమివ్వలేదు?
13. కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకమైన ప్రొఫెసర్, వర్సిటీ కాలేజీలు/విభాగాలకు కనీసం అర్హతగా నియమింపబడాలన్నా అతనొక పర్మినెంట్/రెగ్యులర్ ఉద్యోగి అయిఉండాలి. కానీ బాబూరావు విషయంలో నిభందనలు వర్తించవు. ఎందుకంటే అతని కులమే అతని అర్హత?

14. రిషితేశ్వరిని వేదిస్తున్నారంటూ ఆమె చనిపోవటానికి పది రోజుల ముందు ఆమె పేరెంట్స్ ప్రిన్సిపాల్‌కు కంప్లైంట్ ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు?

15. నాటి ప్రతిపక్ష నేత జగన్‌కు ఈ విషయం పై మాట్లాడితే అధికార పక్ష నాయకులు ఆయేషా కేసు గురించి లేవనెత్తుతారని నోరు మెదపడంలేద?

రిషితేశ్వరి ఉదంతంతో ఉలిక్కిపడి భాగ్యలక్ష్మిని వేధించిన విద్యార్థినులను గతంలోనే హాస్టల్ నుండి బయటకు పంపివేసినట్టు చెపుతున్నారు. అయితే ఆ ముగ్గురు వర్శిటీ గెస్ట్‌హౌస్‌లో ఉండి తరగతులకు హాజరవుతున్నారు. గెస్ట్‌హౌస్‌లో ఉండటానికి రిజిస్ట్రార్ అనుమతి తప్పనిసరి, మరి వారికెలా అనుమతినిచ్చారు? తప్పుచేసినా ఒక కులానికి చెందిన వారైతే వారిపై కంటితుడుపు చర్యలేనా? ఇలా తప్పు చేసిన వారిని ప్రోత్సహించి ఆ రోజు రిషితేశ్వరి ప్రాణం పోవటానికి ప్రత్యక్షంగా కారణమైంది ఎవరు? అంటూ అనేక ప్రశ్నలతో మంగళగిరి స్ట్రింగర్స్ తమ మీడియా ఛానల్స్‌కి క్రమం తప్పకుండా కవరేజీలు చేసి పంపించాల్సి వచ్చేది. ఇవన్నీ స్టాఫ్ రిపోర్టర్స్ అయితే ఛేదించగలిగేవారు. కానీ స్ట్రింగర్స్ కూడా స్టాఫ్ రిపోర్టర్స్‌లా వ్యవహరించి అన్ని రకాల వార్తలు కష్టం అయినా కవర్ చేసేవారు. చివరికి ప్రిన్సిపాల్ బాబురావు, ముగ్గురు విద్యార్థులకు సపోర్ట్ చేస్తూ ఒక కులవర్గం నానా హంగామా చేసింది. ఇది కూడా దృష్టిలో పెట్టుకున్న అధికారులు యూనివర్సిటీ కులాల కుంపటి అనే కథనం అన్ని ఛానల్స్‌లో ప్రసారం కావటంతో ఉన్న పళంగా ఆ కులసంఘాల బోర్డులు పీకేసింది. అయినప్పటికీ నాటి ప్రతిపక్ష వైసీపీ ఎమ్మెల్యే రోజా రిషితేశ్వరి కేసు విషయంలో పెద్ద ఎత్తున పోరాడారు. వీటన్నిటిని కవర్ చేసి మంగళగిరి స్ట్రింగర్స్ మధ్య మధ్యలో కవర్ చేయలేని అంశాల విషయంలో పలు మీడియా సంస్థల పెద్దసార్లు దూషణలకు బలయ్యేవారు. మంగళగిరి స్ట్రింగర్స్ చేసిన కవరేజీల్లో రిషితేశ్వరి ఆత్మహత్య సంఘటన తదుపరి పరిణామాలు చాలా పెద్ద విషయం. స్టాఫ్ రిపోర్టర్స్ లేకుండా కవరేజీలో సమస్యలు ఎదుర్కొంటూ సమయానికి ఫీడ్ అందించలేక మీడియా పెద్దసార్‌లు దూషణలు భరిస్తూ చివరికి ఎలాగోలా తమ పాత్ర పోషించారు.

## 13. ఇంజనీరింగ్ విద్యార్థినికి లైంగిక వేధింపులు

ఇది కూడా రిషితేశ్వరి ఆత్మహత్య జరిగిన అతికొద్ది కాలంలో నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఘటన. ఇంజనీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థినిపై కన్నేసిన ఓ యువ ప్రొఫెసర్ ఆమెను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తూ ఉండేవాడు. సందర్భం లేకుండా విద్యార్థినితో మాటలు కలపటం, మధ్యాహ్నం భోజనం సమయంలో సాయంత్రం కళాశాల వదిలాక విద్యార్థినిని ఎవరు లేకుండా చూసి మాటలు చెపుతూ, మీద చేతులు వేస్తూ వెకిలిచేష్టలు చేసేవాడని ఆ విద్యార్థిని కొందరు తోటి విద్యార్థులకు చెప్పింది.ఆ విషయం తెలుసుకున్న ఎవరు ప్రొఫెసర్ తీరును ఖండించలేదు. అడిగితే మార్కులు తగ్గిస్తారనే భావనతో



*Source Internet : 1 – 15 పాయింట్స్*[1]

విద్యార్థులందరితో పాటు ఆ విద్యార్థిని కూడా అతని ఆగడాలు ఎవ్వరికీ చెప్పుకోలేక బాధ భరిస్తూ వచ్చింది. దీనితో అతని ఆగడాలు మరింత శృతిమించాయి. అంతా ఒకే అని భావించిన ఆ యువప్రొఫెసర్ ఓ రోజు ఎవరులేకుండా చూసి ఉన్న ఒకరిద్దరిని బయటకు పంపి ఏకంగా తలుపులువేసి ఆ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వెంటనే ఆ విద్యార్థిని అతని చర్యలకు భయపడి తలుపు తీసుకుని బయటకు వచ్చి తోటి విద్యార్థులకు విషయం చెప్పింది. అయితే ఆ విద్యార్థులు ఎవరు పట్టించుకోలేదు. కారణం అడిగితే మార్కులు తగ్గిస్తారేమోనని కొందరు, ప్రొఫెసర్ తమవర్గం, కులం అంటూ ఆయనకు కొమ్ముకాసిన కొందరు. అంతే ఏమీ చేయలేక హాస్టల్‌కి వెళ్లిన ఆ విద్యార్థిని మరుసటిరోజు కళాశాలకు వచ్చేందుకు భయపడుతూ, భయపడుతూ వచ్చింది.

అయితే అమ్మాయికి ఎదురైన లైంగిక వేధింపులు విషయం ఆ నోటా, ఈ నోటా అమ్మాయి కులానికి చెందిన వర్సిటీ కులసంఘం నాయకునికి తెలిసింది. అంతే అతనో పదిమందిని వేసుకుని క్లాస్రూమ్‌లో ఉన్న ఆ ప్రొఫెసర్‌ని చొక్కాపట్టి దాడి చేస్తూ బయటకు లాక్కొచ్చాడు. మరో ప్రక్క విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడి దెబ్బలు తిన్న ప్రొఫెసర్‌కి చెందిన కులవర్గం నాయకులు, వ్యక్తులు అమ్మాయి కులవర్గం వ్యక్తులతో పెద్ద ఎత్తున ఒకరిపై, ఒకరు కర్రలు, రాళ్ళు, కుర్చీలతో దాడులు చేసుకున్నారు. ఇది చూసిన ఆ ఇంజనీరింగ్ విద్యార్థిని భయపడిపోయి తనవర్గం వ్యక్తులతో వద్దు, వద్దు నేను వర్సిటీ నుండి వెళ్లిపోతాను అంటూ ఏడవటం మొదలు పెట్టింది. కానీ అమ్మాయి వర్గంవారు ఊరుకోలేదు. ఆమెకు ధైర్యం కల్పిస్తూ ప్రొఫెసర్ పై కేసు పెట్టాల్సిందిగా సూచించారు. అప్పటికే మా మీడియా మిత్రులకు సమాచారం అందింది. లేటు చేయకుండా వర్సిటీకీ చేరుకున్నాం. గొడవయితే సర్దుమణిగింది. ప్రొఫెసర్‌ని ఆయన వర్గంవారు ఎక్కడో దాచేశారు. ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణ అంతా హడావుడిగా ఉంది. ఇక అమ్మాయి వర్గంవారు అమ్మాయిని మీడియా ముందుకు తీసుకువచ్చారు. అమ్మాయి ముఖానికి చున్నీ చుట్టుకుని మీడియాకు తనకు జరిగిన అన్యాయాన్ని, లైంగిక వేధింపులను వివరిస్తూ మీడియాకి వాయిస్ ఇచ్చింది.

ఇది గమనించిన ప్రొఫెసర్ కులవర్గీయులు అమ్మాయిని బయటకులాగి మీడియాపై దాడికి దిగారు. మా వీపులపై పిడిగుద్దులు గుద్దుతూ కెమెరాలులాక్కునే ప్రయత్నం చేశారు. మేము కూడా వాళ్ళతో పెనుగులాడాం. అయినప్పటికీ ఒక్కో జర్నలిస్ట్‌ని పదిమంది దాకా చుట్టుముట్టి కెమెరాల్లో క్యాసెట్స్ లాక్కునే ప్రయత్నం చేశారు. ఒకరిద్దరి ప్రింట్ మీడియా జర్నలిస్ట్‌ల కెమెరాలు లాక్కుని నేలకేసి కొట్టి పగలగొట్టారు. కొందరు జర్నలిస్ట్‌లు పారిపోతే, కొందరు వారితో గొడవపడుతూ అక్కడే ఉండిపోయారు.

అక్కడ ఇంత జరుగుతున్నా పోలీసులు ఎవరూ రాలేదు. ఘర్షణ వాతావరణం ముగిశాక జర్నలిస్ట్‌లమైన మేము పెదకాకాని పోలీసు స్టేషన్‌కి కేసు పెట్టేందుకు వెళ్ళాలి

అని నిర్ణయించుకున్నాం. అది తెలిసిన అమ్మాయి కులవర్గీయులు కూడా అమ్మాయితో కేసు పెట్టించేందుకు మేము వస్తున్నాం అన్నారు. అయితే విడివిడిగా వెళ్లిన మేము మాపై దాడి చేసిన వారిపై కేసుపెట్టాం. అమ్మాయి తరపు వచ్చిన వారు ప్రొఫెసర్‌పై కేసు పెట్టారు. విద్యార్థులు రౌడీల్లా వ్యవహరించడం ప్రత్యక్షంగా చూసిన మంగళగిరి స్ట్రింగర్స్‌మయిన మేము ఆ విద్యార్థులను సస్పెండ్ చేయాలని ఆనాటి వర్శిటీ వీసీ చాంబర్ ఎదుట నిరసన కార్యక్రమాలు రెండు రోజులు చేసాం. ఎక్కడెక్కడి నుండో చదువుకోవటానికి వచ్చిన ఈ వర్సిటీ విద్యార్థుల తీరు కులాహంకారంతో ఉన్నారని, జర్నలిస్ట్‌ల పట్ల రౌడీల్లా వ్యవహరించి మాపై దాడి చేసి ఒకరిద్దరి జర్నలిస్ట్‌ల కెమెరాలు పగలగొట్టారని, మమ్మల్ని భయ భ్రాంతులకు గురి చేశారని ఆనాటి వీసీ దృష్టికి తీసుకెళ్లాం. అయినా నాటి వీసీ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా మమ్మల్ని పిలిచి ఆ విద్యార్థులపై పెట్టినకేసు వాపస్ తీసుకోవాలని మమ్మల్ని కోరారు. అంటే అక్కడ వారందరు ఆ విద్యార్థుల కులానికి కొమ్ము కాశారు.

## ఎఫ్.ఐ.ఆర్, కోర్టుకెళ్ళిన కేసు

ఇక వర్సిటీలో ఆ ప్రొఫెసర్‌కి కొమ్ముకాచి, మా జర్నలిస్ట్‌లపై దాడిచేసిన కేసులో మా కెమెరాల్లో రికార్డ్ అయిన ఏడుగురు పై పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ నమోదు అయ్యింది. పోలీసులు వారిని అరెస్టు చేసే క్రమంలో ఆ విద్యార్థులు అప్పటికే గుంటూరుకి చెందిన ఓ క్రిమినల్ లాయర్ కొటేశ్వరరావుని ఆశ్రయించారు. నాటి నుండి లాయర్ కోటేశ్వరరావు మా జర్నలిస్ట్‌లకు ఫోన్ చేయడం విద్యార్థులకేసు విషయంలో రాజీకి రమ్మని మంతనాలు జరపడం చేశారు. మేము ససేమిరా అనడంతో ఏకంగా మంగళగిరి వచ్చి మాకు టీలు, టీఫిన్స్ ఇచ్చి కేసులు ఉంటే విద్యార్థుల భవిష్యత్ పాడవుతుంది వారు చదువుకొని ఉపయోగంలేదని పెద్దఎత్తున వేదాంతం బోధించారు. అయినప్పటికీ మేము ఒప్పుకోలేదు. ఆ రోజు మేము అంత ఇబ్బందిపడ్డాం. వారిని ఏ మాత్రం క్షమించదలుచుకో లేదు. అయితే వారి అరెస్టులు అయ్యాయి. కోర్టుకు పెట్టారు. కానీ లాయర్ మమ్మల్ని వదల లేదు. లాయర్ బ్రతిమలాడి, ఆ విద్యార్థులతో మా జీవితాలు పాడవుతాయని మమ్మల్ని క్షమించండి మేము చేసింది తప్పుఅని మమ్మల్ని వేడుకునేలా మాతో మాట్లాడించారు. అయినప్పటికీ మీరు ఏ మాత్రం క్షమార్హులు కాదంటూ మేము రాజీకి ఒప్పుకోలేదు. చివరకు కోర్టులో కేసు పరిశీలనకు వచ్చిన రోజు మేము వారి ద్వారా ఎన్ని ఇబ్బందులు పడ్డా విద్యార్థుల భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకుని క్షమాగుణంతో ఆ విద్యార్థుల కేసులో కోర్టులో రాజీపడ్డాం. అప్పుడు మా చేతులు పట్టుకుని అన్నా చాలాథ్యాంక్స్ అని ఇవి చేతులు కాదు కాళ్ళు అంటూ ఏవేవో మాటలు చెప్పి కేసు నుండి బయటపడ్డారు. వాళ్ళు విద్యార్థులు కాకపోతే ఆ కేసులో రాజీకి వచ్చేవారం కాదు.

# 9. అమరావతిలో - జర్నలిస్ట్‌లు ఎదుర్కొన్న సమస్యలు (5)




"ప్రజల్లో ఉన్న నమ్మకాలను కాదని మనం అనలేము, ఎవరి భక్తి వారిది,
అయినప్పటికీ మీడియాకి సంచలనాలు అనేవి మహాప్రసాదం,
ఇక్కడ జర్నలిస్టుల బాధలు ఎవరికి పట్టే...ను"

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

## కృష్ణా పుష్కరాలు



**కృ**ష్ణా పుష్కరాలు ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే కృష్ణానది పండుగ. ఇది చాలా వైభవంగా జరుపుకుంటారు. బృహస్పతి కన్యారాశిలోకి ప్రవేశించినప్పటి నుండి 12 రోజులపాటు పుష్కరాన్ని జరుపుకుంటారు. అయితే భారతీయుల విశ్వాసాల ప్రకారం మొదటి 12 రోజులు అత్యంత పవిత్రమైనవిగా పరిగణించబడతాయి. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మరియు తెలంగాణలలో పుష్కరం పురాతనమైన ఆచారం. 2016లో, వేడుక ఆగస్టు 12న ప్రారంభమై ఆగస్టు 23న ముగిసింది.

అయితే కృష్ణా పుష్కరాలకు నాలుగు రోజులు ముందే అన్ని మీడియా ఛానల్స్ తమ సంస్థలో పనిచేసే జర్నలిస్ట్‌లకు ఎవరెవరు ఎక్కడ విధులు నిర్వహించాలనేది నిర్ణయించాయి. ఆ బాధ్యత ఏ జిల్లా స్టాఫర్‌కి ఆ జిల్లాలకు అప్పగించగా మా జిల్లా వరకు గుంటూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్‌కి అప్పగించాయి. ఇక స్టాఫ్ రిపోర్టర్స్ తమ పరిధిలో కృష్ణానది పరిహారపు ప్రాంతంలో ఎక్కడెక్కడ పుష్కర ఘాట్లు ఉన్నాయో లిస్ట్ తెప్పించుకుని జిల్లాలో ఉన్న స్ట్రింగర్స్ అందరికి ఆయా పుష్కర ఘాట్స్‌లో 12 రోజుల పాటు డ్యూటీలు వేశారు.

మరో ప్రక్క రాజమండ్రి, వైజాగ్ స్పెషల్ కరస్పాండెంట్స్‌ని, కెమెరామెన్స్‌ని గుంటూరు జిల్లాలో కృష్ణానది పుష్కరాల్లో 12 రోజులపాటు విధులు నిర్వహించేందుకు మా మీడియా సార్లు మంగళగిరికి రప్పించారు. వారిని ఇక్కడకు రప్పించేముందు మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, తాడేపల్లి సీతానగరం ఆంజనేయస్వామి ఆలయాల్లో వారికి ఉచితంగా రూమ్స్ ఏర్పాటు చేయమని మంగళగిరి స్ట్రింగర్స్‌కి ఆర్డర్స్ వేశారు. మా స్ట్రింగర్స్ రెండు ఆలయాల్లో ఈవోలను సంప్రదించి రూమ్స్ అడిగితే లేవని, పుష్కరాలు అయ్యేంత వరకు రూమ్స్ దొరకవని ఖరాఖండిగా చెప్పేశారు. ఇదే విషయాన్ని మా మీడియా సార్‌లకి తెలిపితే ఇక్కడ కూడా మాకు వారి నుండి తిట్లే. ఎలాగయినా సరే వారికి రూమ్స్ ఏర్పాటు చేయమని సార్‌లు ఆదేశాలు. అయినా కుదరలేదు. చివరకు కృష్ణానది తీర ప్రాంతమైన సీతానగరం, ఉండవల్లిలో కనీసం రెంట్ హౌస్‌లైనా చూడమని హుూంకరింపు. అయితే 12 రోజులకు రెంట్ చెల్లిద్దాం అన్నారు. ఇక స్ట్రింగర్స్ అందరూ తాడేపల్లి, ఉండవల్లి, సీతానగరం తిరిగి పూర్తి స్థాయి గృహాలు కాకపోయినా చిన్న చిన్న గదులు, షెడ్డులు ఏర్పాటు చేసాం.

కొంతమంది అయితే మంగళగిరి స్ట్రింగర్స్‌పై అభిమానం ఉన్నవాళ్ళు ఏ విధమైన రెంట్ వసూలు చేయకుండా చిన్న చిన్న గదులు, షెడ్స్ 12 రోజుల పాటు ఉచితంగా ఇస్తే,

ఒకరిద్దరు తమ ఇళ్ళల్లోనే వరండాలు మా టీమ్స్ ఉండేందుకు ఉచితంగా అవకాశం కల్పించారు. అయితే ఆ చిన్న చిన్న గదులు, షెడ్స్, వరండాలలో పడుకోవటానికి మంచాలు గానీ, కనీసం చాపలు గానీ, ఫ్యాన్స్‌గానీ లేవు. ఉదయం వేకువజామున లేచి సాయంత్రం తొమ్మిది గంటల వరకు పుష్కరఘాట్స్‌లో విధులు నిర్వహించి రాత్రికి వారికి కేటాయించిన ప్రాంతాలకు వెళితే సుఖంగా నిద్రపోవటానికి అవకాశం లేదు. ఇలా వేరే ప్రాంతాల నుండి వచ్చిన మా జర్నలిస్ట్‌లు 12 రోజుల పాటు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

2016 కృష్ణా పుష్కరాలు మొదలయిన మొదటి మూడు రోజులు సీతానగరం పుష్కర ఘాట్‌లో విధులు నిర్వహించిన మా జర్నలిస్ట్‌లకు మధ్యాహ్నం భోజనం లేదు. సీతానగరం, ఉండవల్లి వెళ్ళి ఎక్కడ హోటల్స్ ఉన్నాయని, బడ్డీ కొట్టులున్నాయని వెతుక్కుని బడ్డీ కొట్టులో చిన్న చిన్న తినుబండరాలు, హోటల్స్‌లో టిఫిన్ చేసే వారం. హోటల్స్, బడ్డీ కొట్టులు కూడా ఎంత వెతికినా కనిపించేవి కాదు. కారణం పుష్కరాల సందర్భంగా రోడ్డు వెంటఉన్న హోటల్స్, బడ్డీ కొట్టులు పుష్కరాలు జరిగినన్నాళ్లు ట్రాఫిక్‌కి అడ్డం లేకుండా మూసి వేయాలని పోలీసుల ఆర్డర్స్. ఇలా ఇబ్బందులుపడుతూ ఉదయం టిఫిన్ కూడా చేయకుండా వచ్చిన కొందరు జర్నలిస్ట్‌లు మధ్యాహ్నం భోజనం ఎక్కడ దొరుకుతుందా అని అన్వేషించేవారు. ఈ క్రమంలో కృషానది ఒడ్డున ఉన్న చిన జీయర్ స్వామి ఆశ్రమంలో ఉచిత భోజనం ఏర్పాటు చేస్తే ఆ విషయం తెలుసుకొని అక్కడకు వెళ్లి భోజనం చేసి వచ్చేవారు. మూడు రోజుల తరువాత స్థానిక టీడీపీ నాయకుడు, తాడేపల్లి గ్యాస్ కంపెనీ అధినేత దండమూడి మనోజ్ కృష్ణా పుష్కరాలు జరిగినన్ని రోజులు మా జర్నలిస్ట్‌లకు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టిఫిన్స్ ఏర్పాటు చేశారు. న్యూస్ కవరేజీ విషయంలో ఎక్కడా ఇబ్బందులు లేకపోయినా మొదట్లో భోజనానికి చాలా ఇబ్బంది పడ్డాం.

మరి కృష్ణాతీరం వెంబడి పలు గ్రామాల్లో కూడా పుష్కరఘాట్స్ ఏర్పాటు చేశారు. ముందుగా చెప్పినట్లు జిల్లాలో స్ట్రింగర్స్ అందరికి ఆయాగ్రామాల పుష్కరఘాట్స్‌లో డ్యూటీలు వేశారు. మరి జిల్లాలో ప్రత్తిపాడు, తాడికొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ళ, గురజాల, నరసరావుపేట,పెద్దకూరపాడు ప్రాంతాల నుండి వచ్చిన స్ట్రింగర్స్ కృష్ణాతీరం వెంబడి ఉన్న గ్రామాల పుష్కర ఘాట్స్‌లో విధులు నిర్వహించారు. వారి పరిస్థితి మరీ దారుణం ఉదయం టిఫిన్ చేసివస్తే సాయంత్రం ఏడెనిమిది గంటలకు భోజనం లేకుండా విధులు నిర్వహించి పుష్కర ఘాట్స్ నుండి బయటకు వచ్చేవారు.

ఇక నేను పనిచేసిన ఛానల్ అయితే కృష్ణా పుష్కరాలలో విధులు నిర్వహిస్తున్న తమ జర్నలిస్ట్‌లకు ఆ ఛానల్ లోగో ఉన్న టీషర్ట్‌లు పంపిణీ చేసింది. పుష్కరాల విధుల్లో ఆ ఛానల్ జర్నలిస్ట్‌లు టీషర్ట్‌లు ధరించి విధులు నిర్వహించాలి అని ఆదేశం జారీ చేసింది.

ఒకరోజు మూడు జిల్లాల ఇన్చార్జ్ అయిన విజయవాడకు చెందిన రిపోర్టర్ మాకు ఫోన్లు చేసి ఎక్కడున్నారు... ఏమి చేస్తున్నారు... ఏ డ్రెస్ వేసుకున్నారు అని అడిగితే ఏమిటా అనుకున్నాం. మామూలు డ్రెస్ వేసుకున్నాం సార్ అని చెప్పాం. మీకు టీషర్ట్లు ఇచ్చాం కదా...అవి ఎందుకు వేసుకోలేదు అని ప్రశ్నిస్తూ మీకెందుకు అంత స్టయిల్, ఒక్కొక్కడికి బలుపా...అంటూ ఇష్టానుసారంగా మాట్లాడాడు. దానికి మీరిచ్చిన టీషర్ట్లు మా భుజాలు,చంకలు దాటి క్రిందికి రావటం లేదు చాలా టైట్గా ఉన్నాయని చెపితే దానికి ఆహా...అయ్యగార్లు మీ కొలతలు తీసుకుని మీకు సౌకర్యంగా ఉండే టీషర్ట్లు ఇవ్వాలా... మర్యాదగా ఇచ్చిన టీషర్ట్లు వేసుకోండి లేదంటే ఒకొక్కడికి పగిలిపోయిద్ది అని మా మీద దూషణలకు దిగాడు. దానితో కొందరు అలాగే వేసుకున్నారు మరికొందరు వేసుకోలేదు. ఇలా ఇబ్బందులకు గురి చేశారు. తరువాత ఏమనుకున్నారో భుజాలు జారిపోయి, మోకాళ్ళ పైకి వేలాడే టీషర్ట్లు పంపారు. అవి వేసుకుంటే పుష్కరాలకు వచ్చిన భక్తుల మధ్య మేము భఫూన్లు, జోకర్లుగా తిరగాల్సి వచ్చింది. మమ్మల్ని చూసిన ప్రతి ఒక్కరు మమ్మల్ని అదోలా చూస్తూ ముసిముసి నవ్వులు నవ్వుకునేవారు అది మాకు చాలా ఇబ్బందిగా తోచింది. పుష్కరాలు జరిగినన్ని రోజులు ఆయా పుష్కరఘాట్స్లో ఆ టీషర్ట్స్ వేసుకుని మేము జోకర్లమయ్యాము. ఇతర ఛానల్స్ మీడియా మిత్రులు మమ్మల్ని ఆ టీషర్ట్ల విషయంలో సరదాగా ఓ ఆటాడుకునే వారు. మాకు టీషర్ట్లు ఇచ్చి జర్నలిస్ట్ డిగ్నిటీని దెబ్బ తీశారు.

## కృష్ణా పుష్కరాలలో నలుగురు యువకులు మృతి

2016 కృష్ణా పుష్కరాలలో ఏ విధమైన ప్రమాదాలు జరగకపోయినా నాడు కృష్ణాపుష్కరస్నానానికి వచ్చి నలుగురు యువకులు నీటిలో మునిగి మృతిచెందిన ఘటన అతి పెద్ద బ్రేకింగ్ అయ్యింది. గుంటూరు జిల్లా అమరావతి మండలం దిడుగు గ్రామంలో కృష్ణానది ఆవలి భాగం కృష్ణాజిల్లా నందిగామకు చెందిన ఐదుగురు యువకులు బైకులపై వచ్చి బైకులు కృష్ణా జిల్లా వైపు పార్కింగ్ చేశారు. ఆ ఏడాది కృష్ణానదిలో పెద్దగా నీళ్లులేవు. ఆ కారణంచే అమరావతి పరిధిలో ఉన్న దిడుగు ప్రాంతంలో నీళ్లు ఉండేవి. దీనితో ఆ ఒడ్డు నుండి ఈ ఒడ్డుకు వచ్చి స్నానానికి దిగారు. ఐదుగిరిలో నలుగురు దిగారు. అయితే వీళ్ళు దిగిన నీళ్ల ప్రాంతంలో గతంలో ఇసుక రీచ్ ఉండేది. ఇసుక యథేచ్ఛగా తవ్విన క్రమంలో దాదాపు 15నుండి 20అడుగుల గోతులు ఏర్పడి వాటిలో నీరు చేరాయి.

అది గమనించని యువకులు తెలియక అందులో దిగారు. దిగటం దిగటమే అగాధంలోకి వెళ్ళిపోయి ఎవ్వరు బయటకు రాలేదు. దానితో వారితోపాటు వచ్చిన ఐదోయువకుడు కంగారు పడిపోయి గ్రామంలోకి పరుగులు పెట్టి గ్రామస్తులకు విషయం

చెప్పాడు. అక్కడకు చేరుకున్న కొందరు గ్రామస్థులు అందులోకి దిగే ప్రయత్నం ఎవరూ చేయలేదు. పోలీసులకు సమాచారం ఇస్తే అమరావతి నుండి పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితి గమనించి గజ ఈతగాళ్లను రప్పించారు.

ఈ లోపు అమరావతి ధ్యానబుద్ధ పుష్కరఘాట్‌లో విధులు నిర్వహిస్తున్న కొందరు గుంటూరు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్స్‌కి సమాచారం అందింది. అంతే వాళు ్ళ స్క్రోలింగ్స్ చెప్పి తాడేపల్లి సీతానగరం పుష్కరఘాట్‌లో విధులు నిర్వహిస్తున్న తమ జర్నలిస్టులను ఉన్నపళంగా ఆలస్యం చేయకుండా దిడుగు ఇసుక రీచ్ ఉన్న ప్రాంతానికి రమ్మని చెప్పారు. ఇటునుండి సీతానగరం అటునుండి సత్తెనపల్లి స్ట్రింగర్స్‌ని ప్రమాద ప్రాంతానికి రావలసిందిగా ఆజ్ఞలు. సీతానగరంలో మావద్ద త్రీజీ కిట్ ఆపరేటర్లు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఆ ఆపరేటర్లుని తీసుకుని బైకులపై చాలా వేగంగా అక్కడకు చేరాం. అప్పటికే గజ ఈతగాళ్ళు మృత దేహాలు బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. సీతానగరం, సత్తెనపల్లి స్ట్రింగర్స్ అక్కడకు చేరిన అరగంట తరువాత చాలాలోతు నుండి గజ ఈతగాళ్ళు ఒక యువకుడి మృతదేహం బయటకు తీశారు.

ఇక ఆ విజువల్స్ కోసం కెమెరామెన్స్ హడావుడి మామూలుగా లేదు. మరో ప్రక్క త్రీజీ కిట్లు ఆన్ చేసుకుని మృతదేహం విజువల్స్ తీసుకుంటూ స్టాఫ్ రిపోర్టర్స్ లైవ్‌లకు సిద్ధమయ్యారు. దిడుగు పూర్తిగా గ్రామీణ ప్రాంతం కావడంతో త్రీజీ కిట్లకు సిగ్నల్స్ అందటం లేదు. అక్కడకు వెళ్లిన స్ట్రింగర్స్‌ని ఎవరి మొబైల్స్‌లో వారు విజువల్స్ తీసి వాట్సాప్ ద్వారా అప్‌లోడ్ చేసే ప్రయత్నం చేస్తున్నాం. మొబైల్స్‌కి అక్కడ సిగ్నల్స్ లేవు ఆ కారణంగా విజువల్స్ పంపడం కొంత ఆలస్యం అయ్యింది. ఈ లోగా ఆఫీసుల నుండి ఫోన్లు ప్రమాద ఘటన జరిగి ఎంతసేపు అయ్యింది, మీరెల్లి ఎంతసేపు అయ్యింది ఏమి పీకుతున్నారు అక్కడ అంటూ మా మీడియా పెద్ద సార్‌లు అన్ని ఛానల్స్ వారిని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. మొత్తానికి త్రీజీ కిట్లు అయితే అక్కడ ఏ మాత్రం పనిచేయలేదు. ఇక జర్నలిస్టుల వద్ద ఉన్న మొబైల్స్ ద్వారా వాట్సాప్ విజువల్స్ మాత్రమే అన్ని ఛానల్స్‌కి దిక్కయ్యాయి. ఇందులో అక్కడ అన్ని మొబైల్ నెట్ వర్క్‌లు పని చేయలేదు. పని చేసిన నెట్ వర్క్‌ల ద్వారా జర్నలిస్టులు ఒకరి సహకారం ఒకరితో కల్పించుకుని ఎవరి ఛానల్స్‌కి వారు విజువల్స్ అందించాం. ఇక్కడ జర్నలిస్టులు ఏ స్థాయిలో ఇబ్బందులుపడైనా ఫీడ్ అందిస్తారు. కానీ హైదరాబాద్ ఆఫీసుల్లో ఏసీల్లో, కాలుమీద కాలు వేసుకుని ఎంతో ఈజీగా విజువల్స్ అంటూ మమ్మల్ని దూషించే మీకేం తెలుసు ఆ వార్తా ప్రసారం కోసం విజువల్స్ అందించే మాకష్టం. వార్తకు అవసరమైన ముడి సరుకు అంతా మేమిస్తే వార్తను చక్కగా వడ్డివారించాం అని మీకు మీరు చంకలు గుద్దుకుంటే సరిపోదు.

## వెంకటపాలెం పోలయ్యస్వామి

ఏ.పి. రాజధాని అమరావతి ప్రాంతం తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామంలో పోలయ్యస్వామి ఉండేవాడు. ఈ స్వామి అంతా చిన్న పిల్లల మనస్తత్వం కలిగి ఉండేవాడు. ఒంటిపై నూలుపోగు కూడా ఉండదు. ఎవరైనా దుస్తులు వేస్తే పీకేసేవాడు అలా నగ్నంగానే ఉండేవాడు. మానసిక పరిస్థితి చాలా చిన్నపిల్లాడిలా ఉండేది, మాటలురావు, అలా అని ఎవరిని ఏమీ అనేవాడు కాదు, అతని లోకం అతనిది.

పోలయ్యస్వామిది గుంటూరు జిల్లా తాడికొండ. చిన్నప్పటి నుండి ఇలానే ఉండేవాడు. తాడికొండ నుండి వెంకటపాలెం వచ్చిన క్రమంలో రెండున్నర దశాబ్దాల క్రితం వెంకటపాలెం గ్రామానికి వచ్చి అక్కడే ఉంటూ ఉండేవాడు. ఆకలైనా ఎవరిని ఏమీ ఆడిగేవాడు కాదు. అయినప్పటికీ వెంకటపాలెం గ్రామస్థులు పెట్టింది తిని అక్కడే వీధులవెంట తిరుగుతూ ఎక్కడో ఒకచోట పడుకునేవాడు.

ఇలా సాగిపోతున్న క్రమంలో గ్రామంలో వ్యక్తులు ఎవరైనా ఎక్కడికైనా వెళ్లే క్రమంలో వారికి పోలయ్యస్వామి ఎదురుపడితే వారికి శుభాలు జరిగేవి అని చెప్పుకునేవారు. ఇలా ఒకరోజు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారులో విజయవాడకు బయలు దేరాడట...ఆ సమయంలో పోలయ్య స్వామి అతని కారుకు అడ్డుగా నిలబడి ఉంటే ఆయన ఎన్నిసార్లు హారన్ మోగించినా పోలయ్యస్వామి ప్రక్కకుకూడా తప్పుకోలేదట. అప్పుడు ఆయన క్రిందకు దిగి చిన్న పుల్ల తీసుకుని అతన్ని అదిలించాడట అప్పటికి కారుకు అడ్డుతొలగకుండా అతన్ని దీవిస్తున్నట్లు చేయి పైకెత్తి ఆశీర్వదిస్తున్నట్లు చెయ్యి ఊపాడట కొంతసేపటికి ఎలాగోలా ప్రక్కకు తొలిగించుకుని ఆయన విజయవాడ చేరాడట. అంతే ఆయనకు అంతకుముందు ఎప్పటినుంచో రావలసిన డబ్బు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాలేదని పోలయ్యస్వామి ఎదురు రావటం ఆయన దీవించడం వల్ల ఆరోజు నయాపైసలుతో సహా లక్షలాది రూపాయలు వచ్చి చేరాయట. దానికి ఆయన ప్రతిఫలంగా పోలయ్యస్వామికి గుడికట్టాలని అతనికి ఓ నివాసం ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలను కోరాడట. ఇలా ఒకరు సాయిబాబా గుడికి స్థలం కేటాయించి గుడి కట్టిన స్థలంలో సాయిబాబా ఆలయంలో కొంతభాగంలో పోలయ్యస్వామికి రేకుల షెడ్డు అందులో ఆయనకు కొన్ని ఏర్పాట్లు చేయగా కొన్నాళ్ళకు పోలయ్యస్వామి ఉండే పోర్షన్‌కి ఏసీ, మహారాజా కుర్చీ, పట్టుపరుపులతో బెడ్డు వంటి సకల సౌకర్యాలు కల్పించారు. నాటి నుండి పోలయ్యస్వామిని పోలయ్య తాతగా, అవధూతగా కొలుస్తూ దేవుడ్ని చేశారు.

అలా చుట్టుపక్కల గ్రామాలలో పోలయ్యస్వామికి వెంకటపాలెం పోలయ్యస్వామిగా పేరు వచ్చింది. ఇక చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు పోలయ్యస్వామిని దర్శించుకోవటం, పూజలు చేయటం ఎవరికి వారు మాకు మంచి జరిగింది, మాకు మంచి జరిగింది అని చెప్పుకోవడం అలా పోలయ్యస్వామి లీలలు గుంటూరు జిల్లా నుండి వేరే జిల్లాలకు పాకిపోయింది. దీనితో పోలయ్యస్వామిని దర్శించుకునేందుకు, ఆయన ఆశీస్సులు పొందేందుకు చాలా ప్రాంతాల నుండి భక్తులు వచ్చేవారు.

దీనిని ఆసరాగా చేసుకుని కొందరు గ్రామస్థులు పోలయ్యస్వామిని క్యాష్ చేసుకుంటున్నట్లు అప్పట్లో మీడియాకు సమాచారం అందింది. ఈ సమాచారం అందుకున్న నాటి సీనియర్ జర్నలిస్ట్ ఒకరు తాను పని చేస్తున్న ఛానల్‌లో పోలయ్యస్వామిపై ఎక్స్‌క్లూజివ్‌గా స్టోరీ వేసాడు. స్టోరీ అంతా పోలయ్యస్వామికి అనుకూలంగా ఇవ్వగా చివరిలో గ్రామస్థులు కొందరు పోలయ్యస్వామి ఆలయ కమిటీగా ఏర్పడి భక్తుల ద్వారా వచ్చే కానుకలు, నగలు, వెండి, నగదును క్యాష్ చేసుకుంటున్నారు అని స్టోరీ ఇవ్వడమైనది.

ఇక అది చూసిన మా ఛానల్ మీడియా పెద్ద సార్లు నాకు ఫోన్ చేసి నన్ను కూడా పోలయ్యస్వామిపై స్టోరీ చేయమన్నారు. అయితే అప్పటికే పైన చెప్పిన జర్నలిస్ట్ స్టోరీ వేసిన విధానాన్ని తెలుసుకున్న పోలయ్యస్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు ఆ జర్నలిస్ట్‌కు ఫోన్ చేసి దూషించి నీ అంతు తేలుస్తాం అంటూ వార్నింగ్ ఇచ్చారు. దానితో ఏ ఛానల్ జర్నలిస్ట్ కూడా పోలయ్యస్వామిపై స్టోరీ చేసేందుకు సాహసించలేదు. అందుకు నేను పని చేసిన ఛానల్ పెద్దసార్‌లు నన్ను స్టోరీ చేయమన్నా ఇప్పుడు కుదిరే పనికాదు కొద్దిరోజులు ఆగుదాం ప్రస్తుతం ఆ కమిటీవారు ఏ మీడియా వారిని అక్కడకు రానివ్వడం లేదు ఎవరైనా కెమెరాతో వస్తే మీడియా వ్యక్తులుగా అనుమానించి దాడి చేస్తున్నారు అని నేను మా సార్‌లకి బదులు చెప్పాను.

దానికి నన్ను కాకమ్మ కబుర్లు చెప్పొద్దు నీ వల్ల కాకపోతే చెప్పు హైదరాబాద్ నుండి వేరే వారిని పంపిస్తాం అన్నారు. దానికి నేను సరే పంపించండి అని చెప్పాను. మూడు రోజుల తరువాత హైదరాబాద్ నుండి వచ్చిన వ్యక్తి విజయవాడకు చేరి నాకు ఫోన్ చేసాడు. వెంకటపాలెం ఎలారావాలి అని అడిగాడు. అడ్రెస్ చెప్పాను. ఇక తాను వెంకటపాలెం వస్తున్నాను మీరు కూడా మంగళగిరి నుండి వెంకటపాలెం రండి అక్కడ కలుసుకుందాం అన్నాడు. ఇక అంతా అతనే చూసుకుంటాడులే అని నేను అతనికంటే ముందే వెంకటపాలెం చేరాను. కొద్దిసేపటికి అతను కూడా వచ్చి సెంటర్‌లో దిగి నాకు ఫోన్‌చేస్తే బండిపై వెళ్ళి

అతన్ని తీసుకుని పోలయ్యస్వామి వద్దకు వెళ్లేందుకు సిద్ధం అయ్యాము. ఇద్దరం భక్తులమాదిరిగా వెళ్లాం. అక్కడకు వెళ్ళేటప్పుడు నాతో ఉన్న వ్యక్తిని కెమెరా ఏదీ సారు విజువల్స్ ఎలా తీస్తారు అని అడిగాను. దానికి అతను అక్కడకు వెళ్ళాక చెపుతాపదా అన్నాడు. అయితే అక్కడకు వెళ్లే వరకు నా మదిలో కెమెరా లేకుండా విజువల్స్ ఎలా అనేది నా మెదడును తొలుస్తూనే ఉంది.

అక్కడకు వెళ్లిన మేము అక్కడున్న వారికి అనుమానం రాకుండా భక్తుల మాదిరి బొట్లు పెట్టుకున్నాం. లోపలికి వెళ్లాం పోలయ్యస్వామి చక్కగా ఓ మూలన కూర్చుని ఉన్నాడు. ఇక హైదరాబాదు నుండి వచ్చిన ఆ వ్యక్తి పెన్ కెమెరా ఒకటి బయటకుతీసి ఇది లెన్సు, ఇది ఆన్, ఆఫ్ బటన్ అని చెప్పి విజువల్స్ నీవే తీయాలి అని పెన్ కెమెరా నా షర్టుజేబులో పెట్టి బయటకు వెళ్ళిపోయాడు ఎవరైనా వస్తే నన్ను ఎలర్ట్ చేయడానికి. ఇక నేను పోలయ్యస్వామికి అతిభక్తుడిగా వ్యవహరిస్తూ అతనికి దండం పెడుతూ అక్కడ పరిసరాలు పెన్ కెమెరాలో రికార్డ్ అయ్యేలా నాపని నేను చేసాను. వచ్చిన పని అయిపోయింది అని ఇద్దరం వెనుదిరిగాము. హైదరాబాద్ నుండి వచ్చిన వ్యక్తి హైదరాబాద్‌కు వెళ్ళిపోయాడు. వెళ్లిన మరుసటి రోజు అతని నుంచి నాకు ఫోన్ విజువల్స్ బాగోలేదు అన్నీ షేకు అవుతున్నాయి. విజువల్స్ అసంపూర్తిగా ఉన్నాయి. స్వామి ముఖం వస్తే కాళ్ళు రాలేదు, కాళ్ళు వస్తే ముఖం రాలేదు అని అతను చెప్పాడు. దానికి నేను పెన్ కెమెరాలో విజువల్స్ తీసేంత ప్రావీణ్యం నాకు లేదు. పెన్ కెమెరా చూడటం కూడా అదే మొదలు నాకు అని చెప్పాను. ఇక హైదరాబాద్ డెస్కులో అతను ఏమి సమాధానం చెప్పుకున్నాడో నాకు తెలియదు. అయినా హైదరాబాద్ నుండి పెద్ద పోటుగాడిలా వచ్చిన ఆ వ్యక్తి ఆ పెన్ కెమెరాలో విజువల్స్ తీసేందుకు అతనేందుకు ప్రయత్నం చేయలేదో ఆ అంశం నాకు ఇప్పటికీ భోదపడలేదు. అంతగా కష్టపడ్డా విజువల్స్ రాలేదనే భాద నాకు కలిగింది.

ఇక రెండవరోజు మా పెద్దసారు నుండి నాకు ఫోన్. ఏమయ్యా విజువల్స్ తీయమంటే అంతేనా తీసేది. పనికిమాలిన వెదవలు అంటూ ఆయన అక్షింతలు. నీవు ఏమి చేస్తావో తెలియదు రెండు, మూడు రోజుల్లో నాకు ఆ విజువల్స్ కావాలి అంటూ ఓ ప్రమాదకర కవరేజీని నాకు అప్పగించాడు. ఇదే విషయం ఆనాటి మా స్టాఫ్ రిపోర్టర్‌కి తెలియజేస్తే అతని తీరు నీ భాద నీవు పడు అన్నట్లు అనిపించింది నాకు.

అయితే న్యూస్ కవరేజీ విషయంలో నేను ఏ మాత్రం వెనుకాడే మనిషిని కాదు. ధైర్యంగా ముందడుగు వేశాను. నా డిగ్రీ క్లాస్‌మెట్, మిత్రుడు అదే గ్రామానికి చెందిన కృష్ణారావు అనే వ్యక్తిని కలుసుకొని నన్ను అక్కడికి తీసుకెళ్లి ఆ విజువల్స్ తీసుకునేందుకు

సాయపడాల్సిందిగా కోరా.. దానికి అతడు ఓకే వెళదాం అంటూ నన్ను వెంట బెట్టుకు వెళ్లాడు. లోపలికి వెళ్లిన తరువాత కెమెరా బయటకు తీసి ఏదైతే అది అని ఒక్కొక్కటిగా విజువల్స్ తీసుకుంటున్నాను. అదే సమయంలో ఓ ఐదారుగురు మహిళలు పోలయ్యస్వామిని దర్శించుకోవటానికి వచ్చారు. ఇక పోలయ్య స్వామి వారిపై తన ప్రతాపం మొదలుపెట్టాడు. ఒక మహిళకు పెళ్ళయ్యి మూడేళ్లు అంటా, ఆమెకు పిల్లలు లేరు. స్వామి వారిని దర్శించుకుంటే పిల్లలు పుడతారు అనే నమ్మకంతో ఆమె స్వామిని దర్శించుకుంటున్న సమయంలో వారు స్వామికి దండం పెడుతుంటే ఆ పోలయ్యస్వామి మాత్రం ఒక బల్లపై పడుకుని ఆ భక్తురాలిని తనకాళ్ళ వద్దకు రమ్మని సైగ చేసి వచ్చిన వారిని వచ్చినట్టు కాలితో ఎగిరి ముఖంపై తన్నుతున్నాడు.

ఇలా ఆమెతో కూడా వచ్చిన వారిని ముఖం పై తన్నుతున్నాడు. అలాగే వారు తెచ్చిన చిన్న చిన్న తినుబండారాలు స్వామికి ఇస్తే అవి తీసుకుని స్వామి తన సొల్లుకారే పెదాల మధ్య పెట్టుకుని ఆ తినుబండరాలు కొద్దిగా కొరికి వారికి ప్రసాదంలా ఇస్తున్నాడు. అతను కొరికి ఇచ్చిన పదార్ధాలను వారు అక్కడే తినేస్తున్నారు. ఈ విజువల్స్ అన్నీ రికార్డ్ చేసాను. ఆ మహిళల వాయిస్‌లు లోగో పెట్టి తీసుకున్నాను. వాయిసుల్లో వారు స్వామివారు ఎంతో మహిమలు కలిగిన వ్యక్తి అని, అతన్ని దర్శించుకుంటే సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది అని వారికున్న నమ్మకాలు వారు చెప్పారు. మొత్తం రికార్డ్ చేసుకుని నా మిత్రుడు సాయంతో గుడి నుండి బయటకు వచ్చి ఊరు దాటాను. అక్కడ కవరేజీ పూర్తి అయ్యేదాకా నాకు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. అయితే మాత్రం ఎవ్వరికి దొరకని విజువల్స్ దొరికాయి. అంతకు ముందు పోలయ్యస్వామిపై కథనం వేసిన ఛానల్ కూడా సాదా సీదా విజువల్స్ వేసింది. నాకు దొరికిన విజువల్స్ మరెవ్వరికీ దొరకలేదు.

ఇక విజువల్స్‌కి అనుగుణంగా స్క్రిప్ట్‌రాసి విజువల్స్ ఆఫీసుకు పోస్ట్ చేసాను ఆలస్యం చేయకుండా మరుసటిరోజునే మా ఛానల్ ఆ కథనాన్ని తన్నులబాబా అంటూ రోజు మొత్తం మీద మూడు, నాలుగుసార్లు ఆ కథనాన్ని ప్రసారం చేసింది. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక ఆ గ్రామస్థులు, పోలయ్యస్వామి ఆలయకమిటీ నిర్వాహకులు ఆ స్టోరీ చూసినట్లున్నారు. అప్పటికే ఓ ఛానల్‌లో వచ్చిన కథనం, మరలా మా ఛానల్‌లో వచ్చిన ఎక్స్‌క్లూజివ్ విజువల్స్ అన్నీ చూసిన కమిటీవారు నాకు ఫోన్ చేసి మొదటిసారి కథనం వేసిన జర్నలిస్ట్‌కు ఇచ్చినట్లే నాకు వార్నింగ్. ఏరా మీ టీవీ వాళ్లకు మరీ ఆటలెక్కువయ్యాయి. పోలయ్యస్వామిని అప్రతిష్ట పాలు జేస్తారా...?స్వామిని మేము క్యాష్ చేసుకుంటున్నామా...? మీ ఇష్టానుసారంగా

వేస్తారా...? ఇటుప్రక్కకు రండి మీ అంతు చూస్తాం అంటూ బెదిరింపు కాల్స్. నా కోసం మంగళగిరి కూడా వచ్చారు. అయితే నేను వారి ముందుకు వెళ్ళలేదు. కొన్నాళ్ళకు సమస్య తొలగిపోయింది. అయితే కొన్నాళ్ల తరువాత కొంతమంది స్ట్రింగర్స్ నా వద్ద విజువల్స్ తీసుకుని వాళ్ళ ఛానల్స్‌లో కూడా పోలయ్యసామి పై కథనాలు వేశారు.

అలా వేసిన నాటినుండి వెంకటపాలెం పోలయ్యస్వామికి భక్తులతాకిడి ఎక్కువయ్యింది. అలా కొన్నేళ్లపాటు భక్తుల విశేషఆదరణ లభించగా 2021 డిసెంబర్ 9వ తేదీన పోలయ్యస్వామి తనకు కేటాయించిన స్థలంలోనే అనారోగ్యంతో మృతిచెందాడు. మృతిచెందిన స్వామిని బయట సమాధి చేసేందుకు సి.ఆర్.డి.ఎ. అధికారులు ఒప్పుకోవకపోవటంవల్ల ఆయనకు కేటాయించిన గుడి స్థలంలోనే గ్రామస్థులు సమాధి చేశారు. ప్రస్తుతం ఆయన సమాధి అయిన ప్రాంతంలో పోలయ్యస్వామికి విగ్రహం ఏర్పాటు చేసే ఆలోచనలో కమిటీ సభ్యులు ఉన్నట్లు సమాచారం. ఇలా మేము మా మీడియా సార్‌లు ఇచ్చే న్యూస్ అసైన్మెంట్స్ కష్టపడి సాధిస్తాం ఈ క్రమంలో మాపై దాడులు జరిగినా, ప్రాణరక్షణకు గ్యారెంటీ లేకపోయినా మేము పడే ఇబ్బందులు ఏ మాత్రం వారికి పట్టకపోగా బాగా చేశావు అని ఒక్క కితాబు కూడా ఇవ్వలేరు. పైగా స్టోరీ బాగా ఇచ్చాం మంచిగా మేకప్ చేసి క్రెడిట్ సాధించాము మేమే అసలైన జర్నలిస్టులం అని బాకాలు కొట్టుకుంటారు. ప్రత్యక్షంగా బరిలో దిగి విజువల్స్ సేకరించి, స్క్రిప్ట్ రాసి 90 శాతం వర్క్ చేసి ఆఫీసుకు అప్‌లోడ్ చేస్తే 10 శాతం మార్పులు చేసి ఆ పది శాతం స్క్రిప్ట్‌లో కూడా వ్యక్తుల పేర్లు, ఊరు పేర్లు, సంఘటన వివరాల్లో తప్పులు చేర్చి మా పనితనం ఎంతో విలువైంది అని చెప్పుకుంటారు. ఇంత గ్రౌండ్‌వర్క్ చేసే మనం జర్నలిస్టులం కాదట..! వారు మాత్రమే నిజమైన జర్నలిస్టులట...? సొమ్మొకడిది...సోకు ఒకడిది. చెప్పుకోవటానికి సిగ్గు ఉండాలి. ఇలాంటి కథనాలు వేసినప్పుడు ఆ కథనం కోసం కష్టపడిన రిపోర్టర్ పేరు, ఏ ప్రాంతం అనే వివరాలు ఓ కార్నర్‌లో వేయడానికి కూడా ఇష్టపడరు.

## అమరావతిలో అరటితోటలు ధగ్ధం

అమరావతి రాజధాని ప్రకటన వచ్చాక నాటి అప్పటి అధికారపార్టీ ఆడిందో, లేక నాటి ప్రతిపక్ష పార్టీ ఆడిందో తెలియదుగానీ అమరావతి అరటితోటలు ధగ్ధం అనే విషయం ఓ పెద్ద రాజకీయ క్రీడ. ప్రకటన వెలువడిన కొన్నాళ్ళకు రాజధాని గ్రామాలుగా ప్రకటించిన 29 గ్రామాల్లో భూ సమీకరణ కోసం ఒక్కో గ్రామంలో ఒకరోజు గ్రామ సభలు జరుతున్నాయి. నాటి అధికార పార్టీ టీడీపీ మంత్రులు, సి.ఆర్.డి.ఎ. అధికారులు భూ సమీకరణ కోసం 29 గ్రామాల్లో రైతులతో సమావేశాలు జరుపుతూ భూ సమీకరణ పై అవగాహన కల్పిస్తున్నారు.

సరిగ్గా అదే సమయంలో అమరావతి రాజధాని గ్రామాల్లో రాజధాని భూ సమీకరణకు రైతులు ఇచ్చే పంట పొలాల్లో అరటి తోటలు ధగ్ధం అనే వార్త భగ్గుమంది. ఏ అర్ధరాత్రి కాడ ముష్కరులు ఈ పరంపర కొనసాగించారో తెలియదుగానీ, రాజధాని గ్రామాలైన ఉండవల్లి, కృష్ణాయపాలెం, మందడం, వెంకటపాలెం, వెలగపూడి, లింగాయపాలెం, ఉద్దండ్రాయినిపాలెం, ఇలా రాయపూడి వరకు ఉన్న రైతుల పొలాల్లో పెట్రోల్ పోసి అరటి తోటలు ధగ్ధం, అరటి తోటలు నరికి వేత, వ్యవసాయ బావులవద్ద ఉండే పాకలు,వెదురు బొంగులు ధగ్ధం, మోటార్లు ధ్వంసం, రైతుల పొలాలకు ఉండే విద్యుత్ లైన్లు కట్ చేయడం, అరటితోటలకు ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పైపులు పీకివేత ఇలా ఒక రకంగా కాదు ఒక్క రాత్రిలో గుర్తుతెలియని వ్యక్తులు చేసిన అరాచకం మాటల్లో చెప్పలేం.

రాత్రి జరిగిన ఘటన తెల్లవారేసరికి మంగళగిరి స్ట్రింగర్స్‌కి సమాచారం అందింది. వెంటనే స్క్రోలింగ్స్ చెప్పాం. ఆది ఓ బిగ్ బ్రేకింగ్ ఇక పరుగు, పరుగున అక్కడకు చేరాం. చేరేలోపే విజువల్స్ కావాలి అంటూ మా మొగుళ్ళు మమ్మల్ని తగులుకున్నారు. అరే స్క్రోలింగ్స్ చెప్పటం ఆలస్యం విజువల్స్ చేతిలో ఉన్నట్టు విజువల్స్, విజువల్స్ అంటూ ఊపిరి తీసేసేవారు. మొదట మంగళగిరికి దగ్గరగా ఉన్న ఉండవల్లి చేరాం. మేము అక్కడకు చేరుకున్నాక కూడా అరటి తోటలు మంటల్లో సన్నగా కాలుతూనే ఉన్నాయి. మొదటగా రైతులు, పోలీసులు, గ్రామస్తులు గుర్తించిన పాయింట్ ఉండవల్లి కావడంతో వెంటనే అక్కడ అరటితోటలు ధగ్ధం అవుతున్న విజువల్స్ మొబైల్‌లో షూట్ చేసి వాట్సప్ ద్వారా అప్‌లోడ్ చేసే ప్రయత్నం చేస్తున్నాం. అక్కడ నెట్‌వర్క్ సరిగా లేక విజువల్స్ చాలా స్లోగా అప్‌లోడ్ అవుతున్నాయి.

ఈ లోగా ఓ ఛానల్‌లో న్యూస్ టెలికాస్ట్ అయ్యింది. ఇక మాకు ఒకటే వత్తిడి. విజువల్స్ రాలేదు రాలేదు అంటూ మా సార్‌లు నుండి ప్రతి ఐదు నిమిషాలకు ఓ సారి ఫోన్లు. ఈ లోగా మరో గ్రామంలో వ్యవసాయ బావుల వద్ద పాకలు,షెడ్లు, వెదురు బొంగులు ధగ్ధం అని సమాచారం. అటు వెళ్లాలి. ఇక్కడ విజువల్స్ అప్‌లోడ్ కావడం పూర్తి కాలేదు. కాకుండానే రెండవ ఘటనపై స్క్రోలింగ్ చెప్పాం. మొదటి విజువల్స్ కూడా అప్‌లోడ్ కాక మేము టెన్షన్‌లో ఉంటే, స్క్రోలింగ్ చెప్పిన రెండవ ఘటన విజువల్స్ కావాలి అని మళ్ళీ ఫోన్లు. ఎలాగోలా మొదటి ఘటన విజువల్స్ అప్ లోడ్ అయ్యాయి. ప్రక్క గ్రామంలో రెండవ ఘటన విజువల్స్ సేకరిస్తున్నాం. ఈ లోగా మూడవ ఘటన, ఇలా వరుసపెట్టి ప్రతి గ్రామంలో రైతుల నుండి మా మోటార్లు ధ్వంసం, మా అరటి తోటలు నరికివేత, మా అరటితోట డ్రిప్ పైపులు పీకివేత, మా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్ కట్ అంటూ తాడేపల్లి మండలం నుండి తుళ్ళూరు మండలంలోని రాజధాని గ్రామాల రైతులు ఒకటే ఫోన్లు. ఎక్కడ ఏది కవర్

చేయాలో తెలియక రెండు మండలాల్లో పొలాల వెంబడి ఉన్న డొంకరోడ్లు, పొలం గట్లపై నడక ఆయా ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు కవర్ చేసి ఆఫీసులకు ఫీడ్ పంపించేందుకు ఆ రోజు మంగళగిరి స్ట్రింగర్స్, తుళ్ళూరు స్ట్రింగర్స్ చాలా ఇబ్బందులు పడ్డాం. ఈ లోగా గుంటూరు నుండి మా స్టాఫ్ రిపోర్టర్స్ తుళ్ళూరు గ్రామాలకు చేరారు.

ఎవరికి దొరికిన విజువల్స్ వారు తమ ఛానల్స్‌కి వాట్సాప్ ద్వారా విజువల్స్ అప్‌లోడ్ చేస్తున్నారు. వెళ్ళిన విజువల్స్ వెళ్లినట్లు ఆ గ్రామంలో అలా, ఈ గ్రామంలో ఇలా అంటూ టీవీ ఛానల్స్ అన్నీ పెద్ద ఎత్తున వరుసబెట్టి వార్తలు వేస్తున్నాయి. మా ఛానల్‌కి మేము అక్కడ జరిగిన ఘటనలు అన్నీ కవర్ చేస్తూ పంపిస్తున్నాం. అన్నీ వాడుకుంటూనే ఉన్నారు. సుమారు 10,12 చోట్ల జరిగిన సంఘటనలు ఒకొక్కటిగా పంపిస్తున్నా అవి వాడుకుంటునే ఆ ఛానల్ లో వచ్చింది, ఈ ఛానల్‌లో వచ్చింది మనకు రాలేదు అంటూ వేరే ఛానల్స్‌తో పోల్చుకునే వారు అడిగేటప్పటికీ మేము అన్ని ప్రాంతాల నుండి విజువల్స్ అప్‌లోడ్ చేసినా వాటిని ఓ క్రమ పద్ధతిలో చూసుకోవడంలో కన్ఫ్యూజ్ అయిన మా ఇన్‌పుట్ ఎడిటర్ మాకు ఫోన్ చేసి ఏమయ్యా ఆ విజువల్స్ ఏవి,ఈ విజువల్స్ ఏవి అడిగితేగానీ పంపించరా. నీయమ్మ..., వెధవ నాయాల్లారా..., ఏమి చేస్తున్నారు ఎక్కడ ఆడుక్కు తింటున్నారా?..., పనికిమాలిన సంత అంటూ స్టాఫ్ రిపోర్టర్‌ని స్ట్రింగర్స్‌ని మొత్తాన్ని ఇష్టానుసారంగా మాట్లాడాడు. ఏం చేస్తాం వాడి హోదాకి విలువ ఇవ్వాలిగా మరి. ఏదో ఒక రోజు నీ పాపం పండుద్ది లేరా అనుకుని సర్దుకున్నాం.

## అరటి తోటలు ధగ్ధం చేసిన వ్యక్తుల కోసం గాలింపు

అమరావతి అరటి తోటలు ధగ్ధం కేసులో ఏ ఆధారాలతో పోలీసులు సుమారు 17 మంది నిందితులను గుర్తించారో తెలియదుగానీ వారి అరెస్ట్‌ల కోసం పోలీసులు తుళ్ళూరు రాజధాని గ్రామాల్లో విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులతోపాటు మంగళగిరి, తుళ్ళూరు స్ట్రింగర్స్ అలాగే గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్, కెమెరామెన్స్ అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా పోలీసు వాహనాలను వెంటాడే వాళ్ళం. ఈ క్రమంలో పోలీసులు తమ వాహనాల జాడ తెలియకుండా జర్నలిస్ట్‌ల కళ్ళబడకుండా దారులు మళ్లించి మరీ నిందితుల కోసం అన్వేషణ చేసేవారు. అయినప్పటికీ జర్నలిస్ట్‌లు పలు గ్రామాల్లో రాత్రి నుండి తెల్లవారుఝాము వరకు పోలీసులు అరెస్ట్ చేసే నిందితుల విజువల్స్ కోసం నిఘా వేసి ఉండేవారం. మీడియాకు తెలియకుండానే ఒకరిద్దరు నిందితులను అరెస్ట్ చేసి పోలీసులు గుంటూరు తరలించారు. దీనితో జర్నలిస్ట్‌లు అందరు పోలీసులపై విజువల్స్ కోసం నిఘా టైం పెంచి గాలింపు చర్యల్లో పాల్గొనేవారం.

ఇలా ఒకొక్కరిగా 17 మంది నిందితులలో సగానికి పైగా నిందితులను మీడియా కంటబడకుండానే అరెస్ట్‌లు చేశారు పోలీసులు. ఇక నిందితులలో ఓ ఇద్దరిని ఏ1, ఏ2లుగా గుర్తించి వారి కోసం మరింత విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఏ1, ఏ2 నిందితులను ఏ టైంలో అరెస్ట్ చేసినా ఆ విజువల్స్ కావాలి అంటూ మా సార్లు మా స్టాఫ్ రిపోర్టర్స్‌కి ఫోన్లు చేసి వారిపై ఆ బాధ్యతలు పెట్టారు. ఇక మా స్టాఫ్ రిపోర్టర్స్ ఆదేశాల మేరకు రాత్రి వేళల్లో స్ట్రింగర్స్ కొన్ని గ్రామాలలో, స్టాఫ్ రిపోర్టర్స్ కొన్ని గ్రామాల్లో పోలీసులను వెంటాడుతూ విధులు నిర్వహించాం. నిందితులలో ఏ1 గా ఉద్దండ్రాయినిపాలెం వాసి నాటి సామాన్య రైతు కుటుంబానికి చెందిన స్థానిక వైసీపీ నాయకుడు, 2023 సం॥ ముందు బాపట్ల ఎంపిగా ఎంపిక కాబడిన ఏ2గా లింగాయపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని నిందితులుగా చేర్చారు. వీరికోసం పోలీసులు వారి గ్రామాల్లో చేపట్టిన గాలింపు చర్యల్లో మీడియా పోలీసులను వదలకుండా వెంటాడింది.అయినా మీడియా కంటబడకుండా పోలీసులు ఆ ఏ1, ఏ2 నిందితులను అరెస్ట్ చేసింది. అరెస్ట్ చేసిన విషయం తరువాత మా జర్నలిస్ట్‌లకు తెలిసినా వారిని ఎప్పుడు అరెస్ట్ చేసింది, ఎక్కడకు తరలించింది ఏ మీడియాకు భోదపడలేదు. అలా అర్ధరాత్రి, అపరాత్రి అనక పోలీసులను వెంటాడుతూ కూడా ఏ1, ఏ2 నిందితుల విజువల్స్ సాధించలేకపోయాం. పోలీసులు అంత రహాస్యంగా వారిని అరెస్టు చేశారు. దీనికి ఆఫీసుల నుండి మా స్టాఫ్ రిపోర్టర్స్‌కి మీడియా పెద్దసార్‌లు ఫోన్ చేసి దూషించడంతో ఈ కథ అక్కడితో ముగిసింది.

# 10. అమరావతిలో - జర్నలిస్ట్‌లు ఎదుర్కొన్న సమస్యలు (6)




**"పలు రాజకీయ పార్టీల నాయకులు పలు ప్రాంతాల్లో చేసే యాత్రలు వెంట రోజులు తరబడి వారి నీడల్లా సాగిపోతున్నారు జర్నలిస్టులు. ఆదారుల్లో జర్నలిస్టుల ఇబ్బందులు, చిన్న చిన్న దాడులు ఆలకించేవాడు ఎవడు...?"**

# మీడియాపై అమరావతి రైతులుదాడి

రాజధాని అమరావతి ప్రకటన వచ్చాక రాష్ట్ర మీడియా కొన్నాళ్లపాటు అమరావతి రాజధాని గ్రామాలపై దృష్టి పెట్టింది. అక్కడ జరిగే పలు కార్యక్రమాల్లో భూ సమీకరణపై ప్రధానంగా వార్తలు వేసింది. అమరావతి భూములు చాలా విలువైనవి అని, ఏడాదికి మూడు పంటలు పండే భూములు అని, అటువంటి భూములు రాజధానికి తీసుకోవడం అన్యాయం అంటూ మీడియా వేసిన కథనాలను పట్టించుకోని అమరావతి రైతులు ఒక విషయంలో మాత్రం రెచ్చిపోయి మీడియాపై దాడికి దిగారు.

నాటి ప్రభుత్వం టీడీపీ మంత్రులు ప్రధానంగా మంత్రి నారాయణ, మరో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో సి.ఆర్.డి.ఎ. అధికారులు, సిబ్బంది భూ సమీకరణపై రాజధాని 29 గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తూ 25 వేల మంది రైతులవద్ద 33వేల ఎకరాలు సేకరించే క్రమంలో చివరిదశలో ఉన్నారు. చివరిదశకు వచ్చిన క్రమంలో మిగిలిపోయిన రైతుల నుండి సాధ్యమైనంత వేగంగా భూములు సేకరణకు చర్యలు చేపట్టారు. అయితే నాటి ప్రతిపక్ష పార్టీ వైసీపీకి చెందిన కొందరు రైతులు మాత్రం చివరికంటా వారి భూములను భూ సమీకరణకు ఇచ్చేందుకు సుముఖంగా లేరు.

దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని ఛానల్స్ ప్రభుత్వం రైతులను బెదిరించి బలవంతపు భూసేకరణ చేస్తుంది అని, రైతులు ఈ భూ సేకరణలో ఇబ్బందులు పడుతున్నారని ఉత్సాహంగా కొన్ని కథనాలు వేశాయి. ఇందులో రెండు ప్రధాన ఛానల్స్ మరింత ఉత్సాహం ప్రదర్శించాయి. దానితో అమరావతి రైతులు కొందరు 29 గ్రామాల్లో జరుగు గ్రామసభల్లో తమ అభిప్రాయాలను మిగిలిన రైతులకు తెలియజెప్పారు. అమరావతి రాజధాని ప్రకటనకు ముందు అమరావతి 29 గ్రామాల్లో ఎకరం 10 లక్షలు కూడా లేదని రాజధాని ప్రకటన వచ్చాక ఎకరం భూమి కోట్లు పలుకుతుందని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూసమీకరణకు పొలాలు ఇచ్చిన రైతులకు కౌలు, రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు ఆ భూముల్లో ఇచ్చే రిటర్నబులు ఫ్లాట్స్, ప్యాకేజీలు, భూములు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం వల్ల అమరావతి రైతులందరు ప్రభుత్వం చేపట్టిన భూ సమీకరణకు పూర్తి మద్దతు ఉంటే,ఒకటి,రెండుఛానల్స్ మాత్రం అమరావతిలో రైతులు భూ సమీకరణకు పొలాలు ఇచ్చేందుకు సుముఖంగా లేరని, ప్రభుత్వం రైతులను బెదిరించి భూ సమీకరణ చేస్తుంది అని వేస్తున్న కథనాలను వ్యతిరేకిస్తూ గ్రామసభల్లో రైతులను ఓ వర్గం రైతులు మిగిలిన రైతులను రెచ్చగొట్టారు.

దీనితో పబ్లిక్‌గా ఒకటి, రెండు మీడియా ఛానల్స్ వ్యవహరించిన తీరును ఆ మీడియా ఛానల్స్ పేరులతో సహా రైతులు గ్రామసభల్లో ఉచ్ఛరిస్తూ మీడియాకు ఈ విధానం తగదని తమపై వ్యతిరేక కథనాలు వేస్తే ఏ మాత్రం సహించేది లేదని ఆరోజే మీడియా మొత్తాన్ని హెచ్చరించారు. రైతులు మీడియా పట్ల తమ అభిప్రాయాన్ని వెల్లడించిన విధానాన్ని అన్ని ఛానల్స్ ఆనాడు ప్రసారం చేశాయి. అయినప్పటికీ కొన్ని ఛానల్స్ తీరు మార్చుకోలేదు. ఇందులో నేను పని చేసిన ఛానల్ సైతం అప్పటి దాకా రైతులకు, రాజధానికి ఎంతో సపోర్ట్‌గా కథనాలు ఇచ్చి, ఒక్కసారిగా భూసమీకరణకు వ్యతిరేకంగా స్టోరీ కావాలని అడిగారు. అయితే భూసమీకరణకు వ్యతిరేకత అనేది ఆరోజు అమరావతిలో లేదు. కొద్ది మంది వైసీపీ నాయకుల సృష్టి. ఓ టీవీ కల్పితకథనాలు మాత్రమే. తరువాత స్థానిక వైసీపీ నాయకులే ఒప్పుకున్నారు. వాస్తవానికి భూసమీకరణకు ఇక్కడ ఎవరు వ్యతిరేకంగాలేరని ఏదో పార్టీ విధానాలకు కట్టుబడి ఉండాలనే వ్యతిరేకత ఉన్నట్లు వ్యవహరించామని కొందరు వైసీపీ నాయకులు ఆఫ్ ది రికార్డుగా స్థానిక జర్నలిస్ట్‌లతో ఓపెన్ అయ్యారు.

అయినా స్టోరీ చేసేందుకు నేను నాటి లింగాయపాలెం మాజీ సర్పంచ్ ని రైతులు ఎవరైనా భూ సమీకరణకు వ్యతిరేకంగా వాయిస్‌లు ఇస్తారేమో చెప్పండి సార్ అని అడిగాను. దానికి ఆయన అక్కడే నా పై సీరియస్ అయ్యాడు. ఇక్కడ ఎవరూ భూసమీకరణకు వ్యతిరేకంగా లేరని లేనిపోనీ కథనాలు ఇచ్చే ప్రయత్నం మానుకోవాలని సున్నితంగా వార్నింగ్ ఇచ్చాడు. తరువాత అదే విషయాన్ని నేలపాడు సర్పంచ్ దనేకుల రామారావు కుమారుడు ధనేకుల సుబ్బారావుకు నా విషయం తెలిపినట్లు ఉన్నాడు. ఒకరోజు రాజధాని గ్రామం ఉద్దండ్రాయినిపాలెం గ్రామసభ కవరేజీకి వెళ్లిన నన్ను సుబ్బారావు అనే వ్యక్తి నేను కవరేజీలో ఉండగానే చెయ్యి పట్టుకొని పక్కకు తీసుకెళ్లాడు. రాజధాని భూసమీకరణకు వ్యతిరేకంగా రైతుల వాయిస్ కావాలని ఆడిగావట కదా...ఏమిటి మీ ఆలోచన ఇప్పటి వరకు మాకు సపోర్ట్‌గా మీ ఛానల్ కథనాలు ఇస్తే, నీవెందుకు వ్యతిరేకంగా కథనాలు ఇవ్వాలని చూస్తున్నావు. ఇక్కడ లేని వ్యవహారాలు సృష్టించి లేనిపోనీ ఇబ్బందులు ఎందుకు కొని తెచ్చుకుంటావు. మర్యాదగా వచ్చిపోండి. లేదంటే తుళ్ళూరులో అడుగుకూడా పెట్టరు. అంటూ నా పై దాడికి దిగినంత పని చేశాడు. అయితే ఇదే వ్యవహారంలో నాటి ఓ టీవీ స్ట్రింగర్‌పై సుబ్బారావు దాడి చేసినట్లు తరువాత నాకు తెలిసింది.

అప్పటి నుండి రాజధానికి, తుళ్ళూరు రైతులకు వ్యతిరేకంగా కథనాలు వేసిన ఛానల్స్‌పై అమరావతి రైతులు కన్నేసి ఉన్నారు. ఈ క్రమంలో భూసమీకరణకు వ్యతిరేకంగా కథనం వేసిన ఓ టీవీ ప్రతినిధులకు కాపు వేశారు. ఓ రోజు తుళ్ళూరు సినిమాహాల్ సెంటర్‌లో ఓ టీవీ ఓబీ వ్యాన్‌ని గ్రహించిన కొందరు అమరావతి రైతులు ఒక్క సారిగా ఓబీ వ్యాన్‌కి అడ్డుపడి అందులో ఉన్న నాటి గుంటూరు స్టాఫ్ రిపోర్టర్‌ని, కెమెరామెన్‌ని క్రిందికి లాగి

వారిపై దాడి చేసి, తీవ్రంగా దూషించారు. వారి వాహనం వెనుక ఉన్న మమ్మల్ని కూడా దాడి చేయబోయి అరెరె... ఇది మనఛానల్ అంటూ మమ్మల్ని వదిలేశారు.

ఇక రాజధాని గ్రామాల్లో భూ సమీకరణ, ఉద్దండ్రాయినిపాలెంలో రాజధాని శంఖుస్థాపన ముగిసిన కొన్నేళ్లకు కన్నా లక్ష్మీనారాయణ రాజధాని శంకుస్థాపన ప్రాంతంలో ఓరోజు మౌనదీక్ష చేపట్టారు. ఆ దీక్ష కవరేజీకి వచ్చిన ఓ ప్రముఖ తెలుగు న్యూస్ ఛానల్ మహిళా జర్నలిస్ట్ 'కన్నా' ప్రోగ్రామ్ లైవ్ ఇచ్చే క్రమంలో అక్కడ ఉన్న రైతులను, రైతులుకాదు పెయిడ్ ఆర్టిస్టులు అంటూ సంభోదించింది. అంతే ఆగ్రహంతో ఊగిపోయిన రైతులలో కొందరు మహిళలు ఆమె పై దాడి చేశారు. చెంపపై కొట్టి, జుట్టు పట్టుకుని మహిళలు మరీ దాడి చేశారు. అడ్డుకోవడానికి వెళ్లిన ఇద్దరు గుంటూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్‌పై అక్కడ ఉన్న కొందరు రైతులు దాడి చేయడం జరిగింది. ఎలాగోలా అక్కడ నుండి పారిపోయి వెలగపూడి చేరారు. అప్పటికే వెలగపూడిలో కొందరు రైతులు వారు ఇటుగా వస్తున్నారని తెలుసుకుని ఆ మహిళాజర్నలిస్ట్ ఉన్నకారును అడ్డగించి కర్రలు, రాళ్లు వేసి కారుఅద్దాలు ధ్వంసంచేసి మహిళ అని కూడా చూడకుండా దాడి చేసేందుకు ప్రయత్నం చేశారు. అక్కడి నుండి కూడా ఆమె ఎలాగోలా తప్పించుకుని కారులో కరకట్ట మీదుగా విజయవాడకు వెళ్ళిపోయింది. పైన ఆఫీసుల నుండి ఇక్కడ వాస్తవ పరిస్థితులు గమనించని పెద్ద సార్‌లు వేసే ఆర్డర్స్ జర్నలిస్ట్‌లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తాయి. ఇలా జర్నలిస్ట్‌లకు సమస్యలు ఎదురైతే కనీసం మీడియా సంస్థల నుండి చిన్న పరామర్శ కూడా జర్నలిస్ట్‌లకు కలుగదు. జరగరానిది ఏమైనా జరిగితే మీడియా సంస్థల సహకారం జర్నలిస్ట్‌లకు ఏ మాత్రం లభిస్తుందో మీడియాలో కొనసాగే జర్నలిస్ట్‌లకు మాత్రమే ఎరుక.

## జగన్ ఓదార్పు యాత్ర

అది 2011వ సంవత్సరం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.యస్. జగన్మోహన్‌రెడ్డి తన తండ్రి మరణాన్ని తట్టుకోలేక రాష్ట్రంలో సుమారు 600 మంది వైఎస్సార్ అభిమానులు చనిపోయారని వారికుటుంబాలను ఓదార్చే దిశగా ఓదార్పుయాత్రను ప్రారంభించారు. ఇందులో భాగంగా మరణించిన వ్యక్తి కుటుంబాన్ని ఓదార్చడం. లక్ష రూపాయలు ఇవ్వడం ఇలా ఆనాడు చనిపోయిన వైఎస్సార్ అభిమానుల కుటుంబాలకు జగన్ 600 కోట్లు వెచ్చించారు. అయితే ఈ ఓదార్పు యాత్రను పలు రాజకీయపార్టీలు ఇది కేవలం రాజకీయయాత్రగా పరిగణించాయి. అయినా జగన్ ఏ మాత్రం వెనుకడుగు వేయక సక్సెస్ ఫుల్‌గా ఓదార్పు యాత్ర చేశారు.

## "గుంటూరులో వైయస్ జగన్ ఓదార్పుయాత్ర"[1]

*"ఆనాడు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు, కడప పార్లమెంటు సభ్యుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లాలో తన ఓదార్పు యాత్రను ప్రారంభించారు. జిల్లాలో 18 రోజులపాటు జరిగిన ఈ ఓదార్పుయాత్రలో ఆయన 8 నియోజకవర్గాలలో సుమారు ఏడు వందలకు పైగా కిలోమీటర్లు ప్రయాణించారు. 25 కుటుంబాలను ఓదార్చారు. జిల్లాలో పలుచోట్ల దివంగత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను, అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ప్రకాశం బ్యారేజి వద్ద నుండి ఓదార్పుయాత్ర ప్రారంభమయ్యింది. గన్నవరం నుండి ఓరోజు మధ్యాహ్నం మంగళగిరికి చేరుకున్నారు. అక్కడి నుండి తాడేపల్లి మండలంలోని ప్రకాశం బ్యారేజ్ చేరుకున్నారు. తాడేపల్లిలో రెండు మూడు కుటుంబాలని ఓదార్చి అనంతరం మంగళగిరిలో బసచేశారు. కాగా నాలుగు రోజులపాటు ఆయన జిల్లా సమీక్షలు చేశారు. పార్టీని పటిష్టం చేయాల్సిందిగా జిల్లా కో ఆర్డి నేటర్లు, కార్యదర్శులకు సూచించారు"[1].*

ఇక ఇవన్నీ కవర్ చేసేందుకు ఆనాడు పలు పత్రికలు, ఛానల్స్ జగన్ ఓదార్పు యాత్రకు సపోర్టుగా మంచి కవరేజీ ఇచ్చాయి. అయితే నాడు మంచి కవరేజీ ఇచ్చిన పత్రికలు,ఛానల్స్‌ని ప్రస్తుతం జగన్ దూరంగా పెట్టారనే అపవాదు ఒకటి ఇప్పుడు ఆ పత్రికలు, ఛానల్స్ వెల్లడిస్తున్నాయి. ఇది వేరే విషయంలే...

ఇక ప్రకాశం బ్యారేజీ మీదుగా తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల,పెద్దకాకాని, గుంటూరు ఆటోనగర్ పశ్చిమంగా ఉత్తర భాగాన ఉన్న గ్రామాలు వెనిగళ్ల, కంతేరు ప్రాంతాల గుండా గుంటూరు చేరే వరకు ఓదార్పుయాత్ర మంగళగిరి స్ట్రింగర్స్, ఆ తరువాత గుంటూరు నుండి గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్ ఓదార్పు యాత్రను కవర్ చేశారు. మంగళగిరి నుండి వెనిగళ్ల, కంతేరు ప్రాంతాల్లో మంగళగిరి స్ట్రింగర్స్‌కి ఓదార్పుయాత్ర నుండి కవరేజ్ విముక్తి లభించింది.

ఈ క్రమంలో ఓరోజు మంగళగిరి మండలం ఆత్మకూరులో జరిగిన ఓదార్పు యాత్రలో పలువురు మంగళగిరి స్ట్రింగర్స్‌కి ఓ పెద్ద సమస్య వచ్చింది. ఆ గ్రామంలో కూడా ఓ వైఎస్సార్ అభిమాని మృతిచెందగా అతడు చేనేత కార్మికుడు. జగన్ అతని ఇంటికి వెళ్ళి ఓదార్చి, ఆ కుటుంబానికి లక్ష రూపాయల చెక్కు అందించి, ఆ ఇంటిలో కొన్ని నిమిషాల పాటు మగ్గంపై కూర్చుని మగ్గం నేశారు. అయితే ఆ కుటుంబాలను ఓదార్చడం, వారికి లక్ష రూపాయలు చెక్కు అందించడం ఓదార్పుయాత్రలో మామూలే అయ్యింది. కాగా ఇక్కడ



*Source Internet : 1. 'గుంటూరులో వైయస్ జగన్ ఓదార్పు యాత్ర'[1]*

మాత్రం వాటితోపాటు జగన్ మగ్గం నేయడం అతి పెద్ద బ్రేకింగ్ అయ్యింది. ఇది ముందుగా గ్రహించని మంగళగిరి స్ట్రింగర్స్ పోలీసు ఆంక్షలు మధ్య చిన్నగృహం కావడంతో లోపలికి ఒకరిద్దరు కెమెరామెన్స్‌ని మాత్రమే అనుమతించి మిగతా స్ట్రింగర్స్‌ని లోపలికి అనుమతించలేదు. ఇక మా స్ట్రింగర్స్‌ని జగన్ మగ్గం నేసిన విజువల్స్ కావాలి అని మీడియా ఆఫీసుల నుండి ఒకటే ఫోన్లు. ఎవ్వరి వద్ద విజువల్స్ లేవు. ఇక విజువల్స్ కోసం మంగళగిరి స్ట్రింగర్స్ అన్వేషణ. ఒక్క సాక్షి టీవీ కెమెరామెన్ వద్ద మాత్రమే విజువల్స్ ఉన్నాయని అదీ వారు లైవ్ ఇచ్చారని మాకు తెలిసింది.మా అదృష్టం బాగుండి స్థానిక సిటీ కేబుల్ కెమెరామెన్ వద్ద మాకు విజువల్స్ లభించాయి. ఆ విజువల్స్ పంపేవరకు మాకు మా పెద్ద సార్‌లు నుండి ఒకటే ఫోన్లు. అయితే సాక్షి టీవీ కవర్ చేస్తున్న ఓదార్పుయాత్ర, కుటుంబాలకు ఓదార్పు, చెక్కులపంపిణీ వంటి ప్రధాన ఘటనలు కొన్ని ఛానల్స్‌కి సాక్షి టీవీ ద్వారా లైవ్ ఫ్రీక్వెన్సీ లింక్, ద్వారా ఫీడ్ అందుతూనే ఉంది. కానీ ఆరోజు ప్రత్యేకంగా ఆ మగ్గం నేసే విజువల్స్ సాక్షి టీవీ నుండి తీసుకున్నారో, లేదో తెలియదు గానీ మమ్మల్ని విజువల్స్ కోసం చాలా ఇబ్బందిపెట్టారు. అక్కడ ప్రోగ్రాం రాత్రి 7గంటల సమయంలో జరిగితే ఆ విజువల్స్ సిటీ కేబుల్ కెమెరామెన్ వద్ద తీసుకుని రాత్రి 9, 10గంటల మధ్య ఆఫీసులకు అప్‌లోడ్ చేసాం.

ఓదార్పుయాత్ర మా పరిధిలో జరిగినన్ని రోజులు యాత్రలో నడుస్తూ, యాత్రలో పెట్టిన డీజే సౌండ్స్‌కి చెవులు దిబ్బిళ్ళు ఎక్కేవి. సాయంత్రానికి తలనొప్పితో ఇబ్బంది పడేవారం. దీనిని తట్టుకోవడానికి తలనొప్పి రాకుండా తలకు కర్చీఫ్, చెవులు దిబ్బిళ్ళు ఎక్కకుండా రెండు చెవుల్లో దూది పెట్టుకునేవాళ్ళం. మరో ప్రక్క సాక్షి టీవీ కెమెరామెన్స్, జగన్ ప్రవేట్ సెక్యూరిటీ మా మంగళగిరి స్ట్రింగర్స్‌ని చాలా ఇబ్బందులకు గురిచేసేవారు. అక్కడక్కడ జరిగే సభలను మేము కవర్ చేసేందుకు కొంచెం ముందుకు వెళ్ళినా, సాక్షి టీవీ కెమెరా మెన్స్ ప్రక్కకు వెళ్ళినా సెక్యూరిటీవాళ్ళు, సాక్షి టీవీ కెమెరామెన్స్ నిర్దాక్షిణ్యంగా తోసివేయడం, వెనుకనుండి ప్రవేట్ సెక్యూరిటీ పిడిగుద్దులు గుద్దటం వంటిచర్యలకు పాల్పడేవారు. వారి అరాచకం అన్ని చోట్లా ఇలానే ఉండేదట...! మొత్తానికి జగన్ ఓదార్పు యాత్ర వారి కెమెరామెన్స్, ప్రవేట్ సెక్యూరిటీ ఆగడాలు తట్టుకుని కవరేజీ చేయడం అప్పట్లో మాకు పెద్ద సాహసమే అయ్యింది.

## "చంద్రబాబు వస్తున్నా మీకోసం"[2]

ప్రతిపక్షనేతగా నారా చంద్రబాబు చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర 2012 వ సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజున హిందూపురం నుంచి చంద్రబాబు పాదయాత్ర ప్రారంభించారు. 2009 రెండోసారి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఆర్థికంగా, రాజకీయంగా ఛిన్నాభిన్నం చేసిన నేపథ్యంలో ప్రజలకు భవిష్యత్తు మీద భరోసా ఇచ్చేందుకు ఈ యాత్ర ప్రారంభించారు. అందుకే ఈ యాత్రకు 'వస్తున్నా... మీకోసం' అని పేరు పెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాలలోగుండా 2817కిలోమీటర్లు పాదయాత్ర చేసి రికార్డ్ నెలకొల్పారు.

## గుంటూరు జిల్లాలో "చంద్రబాబు వస్తున్నా మీకోసం" పాదయాత్ర

చంద్రబాబు వస్తున్నా మీకోసం పాదయాత్ర కృష్ణా జిల్లా ప్రకాశం బ్యారేజీ మీదుగా గుంటూరు జిల్లాలో ప్రవేశించింది. ఆ పాదయాత్ర గుంటూరు జిల్లాలో ప్రవేశించడంతోనే బిగ్ బ్రేకింగ్ అయ్యింది. ఆ రోజు చంద్రబాబు వస్తున్నా మీకోసం పాదయాత్ర కృష్ణాజిల్లా నుండి గుంటూరు జిల్లా ముఖద్వారంలోకి ప్రవేశించనుండడంతో గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున తాడేపల్లి చేరారు. అక్కడ నుండి సీతానగరం ప్రకాశంబ్యారేజీ నుండి ఉండవల్లి స్క్రూ బ్రిడ్జీ వరకు ఇసకేస్తే రాలనంతగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో ఆ ప్రాంతం కిక్కిరిసి పోయింది. అంతటి జనసందోహం ముందట చంద్రబాబు ప్రకాశం బ్యారేజీపై సీతానగరంలో అడుగు పెట్టే క్రమంలో గుంటూరుజిల్లా టీడీపీ నాయకులు ఒకొక్కరిగా చంద్రబాబుకి నమస్కారం చేస్తూ గుంటూరు జిల్లాలోకి స్వాగతం పలుకుతున్నారు.

ఈ క్రమంలో పల్నాడు ప్రాంతానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు చంద్రబాబుకు సుమారు ఆరు, ఏడు కేజీల బరువుగల వెండిచెప్పులు బహూకరించాడు. ఆ సమయంలో అక్కడ ఓ వివాదం చెలరేగింది. ఆ చెప్పులు చంద్రబాబుకి బహుకరిస్తున్న సమయంలో చెప్పులు బహుకరించే నాయకుడి చెంత తాడేపల్లికి చెందిన తొత్తుక బాబు అనే జేబుదొంగ ఉన్నాడు. ఇతను కూడా తాడేపల్లి ప్రాంతంలో ఓ టీడీపీ నాయకుడు. ఆ చొరవతో చెప్పులు బహుకరించే నాయకుడు చెంతకి, చంద్రబాబు దగ్గరకు అతను చేరగలిగాడు.

అంతే విషయం గ్రహించిన నాటి తాడేపల్లి ఎస్సై తొత్తుక బాబు అనే జేబుదొంగ అక్కడ ఎవరి జేబులు కొడతాడో, లేక ఏ అలజడి సృష్టిస్తాడో అనే అనుమానంతో ఆ ఎస్సై



*Source Internet :* 2. 'చంద్రబాబు వస్తున్నా మీ కోసం'[2]

వెంటనే ఆలస్యం చేయకుండా తొత్తుక బాబును చొక్కా పట్టుకుని బయటకులాగాడు. దానికి బదులుగా తొత్తుకబాబు కూడా చంద్రబాబు ప్రక్కనే ఉన్నాననే ధైర్యంతో వెంటనే తనచొక్కా పట్టుకున్న ఎస్సై చొక్కా కాలర్ పట్టుకున్నాడు. ఇద్దరు పరస్పరం చొక్కా కాలర్స్ పట్టుకుని ఒకరిని ఒకరు గుంజుకోవడం, చంద్రబాబు వారిని వారించడం, మిగిలినవారు వారిని విడదీయటం మొత్తం రెండు, మూడు నిమిషాల్లో ముగిసిపోయింది. ఈ విషయాన్ని అక్కడ ఎలర్ట్‌గా ఉన్న మీడియా కవర్ చేసింది. అంతే విజువల్స్ సేకరించిన ఛానల్స్‌లో ఒకటే బ్రేకింగ్స్. వెంటనే విజువల్స్ అప్‌లోడ్. అప్‌లోడ్ అయిన కొద్దీ నిమిషాలకి పలుఛానల్స్‌లో విజువల్స్ వేస్తూ చంద్రబాబు వస్తున్నా మీ కోసం పాదయాత్రలో ప్రకాశం బ్యారేజీ పై చంద్రబాబు సమక్షంలోనే పోలీసులు, టీడీపీ జేబుదొంగ నాయకుడు మధ్య ముష్టి యుద్ధం అంటూ వార్తకు బ్యాక్ గ్రౌండ్ వాయిస్ ఇస్తూ వార్త ప్రసారం అయ్యింది. ఇదే చంద్రబాబు వస్తున్నా మీ కోసం పాదయాత్ర గుంటూరు జిల్లాలోకి ప్రవేశించిన మొదటి రోజే బిగ్ బ్రేకింగ్ అయ్యింది. విజువల్స్ దొరకని స్ట్రింగర్స్, ఓబీ వ్యాన్స్ లేని జర్నలిస్టులు ఆ క్షణంలో ఆఫీసుల నుండి విజువల్స్ అడుగుతుంటే దిక్కుతోచని స్థితిలో అయోమయానికి గురయ్యారు.

## వస్తున్నా మీకోసంకి ఎమ్మార్పీఎస్ సెగ


గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఖాజ గ్రామంకు చంద్రబాబు వస్తున్నా మీకోసం పాదయాత్ర ఖాజ గ్రామానికి  రెండు కిలోమీటర్ల దూరంగా ఉన్న సమయంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఖాజ గ్రామానికి చేరారు. ఖాజ దళితవాడలో అప్పటికే నూతనంగా ప్రారంభించిన బాబూ జగజ్జీవన్‌రావు విగ్రహానికి చంద్రబాబు పూలదండ వేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పట్టుబట్టారు. చంద్రబాబు యాత్ర ముందుకు సాగకుండా ఖాజ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున బైఠాయించారు. అయితే అక్కడ ఏం జరుగుతుంది అనేది తెలుసుకోవటానికి మంగళగిరి స్ట్రింగర్స్‌కి కొంత సమాచారలోపం కలిగింది.

ఈలోగా చంద్రబాబు యాత్ర ఎమ్మార్పీఎస్ నాయకుల బైఠాయించిన ప్రాంతానికి చేరువఅవుతుంది. పోలీసులేమో వారిని తొలగిపోమని ఒత్తిడి, వారేమో చంద్రబాబు గ్రామంలోకి వస్తానని హామీ ఇస్తే తప్ప తొలగేది లేదని లాఠీ ఛార్జ్ చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసులకు హెచ్చరికలు. ఓ వైపు మీడియా హడావుడి అక్కడ జరిగే తంతు అంతా స్క్రోలింగ్స్, ఫీడ్ అప్‌లోడ్ ఎప్పటివార్త అప్పుడు

ప్రసారం అవుతుంది. ఈ లోగా చంద్రబాబు అక్కడకు వచ్చేశాడు. పోలీసులు లాఠీఛార్జ్ చేసేందుకు సిద్ధంకాగా రోడ్డుపై బైఠాయించిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పక్కకు వైదొలిగినట్లు వైదొలిగి చంద్రబాబు ఖాజ దళిత వాడ సెంటర్‌కి వంద మీటర్ల దూరంలో ఉండగా ఒక్కసారిగా వందల సంఖ్యలో రోడ్డుపైకి వచ్చారు. ఇక పోలీసులవల్ల కాలేదు. అరుపులు, కేకలు, స్లోగన్స్ విన్న చంద్రబాబు జరుగుతున్న నిరసన కార్యక్రమం పై ఆరా తీశారు. విషయం కనుగొన్న చంద్రబాబు కాజ దళితవాడలో జగజ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాల వేసి వచ్చారు. అయితే ఈ విజవల్స్ కూడా కొంత మంది మంగళగిరి స్ట్రింగర్స్‌కి అందలేదు. అప్పటి దాకా అక్కడ జరిగిన ప్రతి ఘటన కవర్ చేసిన స్ట్రింగర్స్ చంద్రబాబు పూల దండలు వేసే విజువల్స్ అందుకోలేకపోవటానికి పోలీసులు ప్రధాన కారణం. రోడ్డు పై బైఠాయించిన 10మంది నాయకులను, కార్యకర్తలను మాత్రమే లోపలికి అనుమతించారు. మీడియాను కూడా పరిమితంగా పంపడంతో కొందరు స్ట్రింగర్స్‌కి విజువల్స్ దొరకలేదు. ఇక ఒక ఛానల్ వార్త వేసి మరో ఛానల్ వేయకపోతే ఎలా ఉంటుందో మీకు తెలియంది కాదు.

ఇక ఈ యాత్ర గుంటూరు చేరే నాటికి కొద్ది,కొద్దిగా ఎండలు ముదిరాయి. గుంటూరు పట్టణం నుండి స్టాఫ్ రిపోర్టర్స్ మాచర్లలో జిల్లా దాటేవరకు గుంటూరు జర్నలిస్ట్‌ల కష్టాలు కష్టాలు కాదు. రెంటచింతల ప్రాంతానికి చేరేసరికి ఎండలు మరింత ముదిరాయి. ఇక ప్రతిరోజు ఎర్రటి ఎండలో స్టాఫ్ రిపోర్టర్స్, పలు ఛానల్స్ కెమెరా మెన్స్ ముఖాలు ఎర్రబారిపోయి సాయంత్రానికి బాడీలు డీ హైడ్రేషన్‌కి గురయ్యి నీరసం వచ్చి ఎక్కడబడితే అక్కడ వాలిపోయేవారు. తెల్లవారితే మరలా అదే డ్యూటీ ఇలా గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్ మాచర్ల వరకు చంద్రబాబు వస్తున్నా మీ కోసం పాదయాత్ర కవరేజీలో నల్లగాముఖాలు మాడిపోయి, పర్సనాలిటీలు తగ్గిపోయి గుర్తు పట్టలేని విధంగా అనారోగ్యాలకు గురయ్యారు.

# 11. అమరావతిలో – జర్నలిస్ట్‌లు ఎదుర్కొన్న సమస్యలు (7)




RAJA RATNAM TRUST
HOPE FOR ALL

"ప్రపంచ దేశాలపై కరోనా చేసిన విలయతాండవంలో తెలుగు రాష్ట్రాలలో జర్నలిస్టులు పడిన ఇబ్బందులు, కష్టాలు"

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

## వై.యస్. షర్మిల పాదయాత్ర

*"వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు, కడప పార్లమెంటు సభ్యుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఓదార్పు యాత్ర తరువాత ఆయన సోదరి వై.యస్. షర్మిల చేపట్టిన మరో ప్రజా ప్రస్థానం పాదయాత్ర 2012 అక్టోబర్ 18వ తేదిన కడప జిల్లా ఇడుపులపాయ నుండి ఆమె పాదయాత్రను ప్రారంభించారు. 58 రోజుల పాదయాత్ర తర్వాత ఆమె మోకాలిగాయం కారణంగా విరామం ఇచ్చారు. చికిత్స అనంతరం 2013 ఫిబ్రవరి 6నుంచి పాదయాత్రను పునఃప్రారంభించారు. నడక ద్వారా ఏడు జిల్లాల్లోని 43 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టారు. 100 రోజుల పాదయాత్ర నాటికి ఆమె గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్నారు. షర్మిల పాదయాత్ర 100రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నాడు పార్టీ గౌరవ అధ్యక్షురాలు వైయస్ విజయమ్మ సహా పలువురుపార్టీ ఎమ్మెల్యేలంతా గుంటూరుజిల్లాకు వచ్చారు. జగన్ జైలుకు వెళ్లడంతో పార్టీ పటిష్టత కోసం ఆమె పాదయాత్ర చేపట్టారు"[1].*

ఈ నేపథ్యంలో మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం నుండి షర్మిల పాదయాత్ర మంగళగిరిలోకి ప్రవేశించింది. దుగ్గిరాల మండలంలోని పేరుకలపూడిలో ఓరాత్రి ఆమె బసచేశారు. అక్కడ నుండి మంగళగిరి మండలంలోకి ప్రవేశించే క్రమంలో మంగళగిరి స్ట్రింగర్స్, గుంటూరుజిల్లా స్టాఫర్లు, కెమెరామెన్స్ ఉదయం అక్కడకు చేరుకున్నాం. రాత్రి ఆమె బస చేసిన ప్రాంతాన్ని కవర్ చేస్తూ అందరి కంటే ముందు వెళ్లిన ఓ ఛానల్ కెమెరామెన్ అక్కడ విజువల్స్ తీసుకున్నాడు. అయితే కొద్దిగా అత్యుత్సాహంతో ఆ కెమెరామెన్ షర్మిలకు ఏర్పాటు చేసిన బస్సులో ఆమె వాష్‌రూమ్‌లో ఉన్న సమయంలో బస్ఎక్కి వెంటనే బస్ దిగివచ్చాడు. కెమెరామెన్ బస్ ఎక్కిన విషయం గమనించని షర్మిల సెక్యూరిటీ అతను కెమెరా చేతబట్టుకుని బస్ దిగిరావడం గమనించారు. వెంటనే రెండు అంగల్లో అక్కడకు వెళ్ళి ఆ కెమెరామెన్‌పై ఇద్దరు, ముగ్గురు సెక్యూరిటీవారు దాడి చేసి అక్క షర్మిల వాష్‌రూమ్‌లో ఉంటే నీవెందుకు బస్సు ఎక్కావు అంటూ దూషిస్తూ పిడిగుద్దులు గుద్దుతూ దాడి చేశారు. అతని కెమెరా లాగేసుకున్నారు.

దానితో భయపడిపోయిన ఆ కెమెరామెన్ షర్మిల బసచేసిన శిబిరం ప్రక్కనే ఉన్న బస్సువద్ద నుండి బయటకు పరుగులు పెడుతూవచ్చాడు. ప్రక్కనే రోడ్డుపై ఉన్న మేము, గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్ ఏమిటి...? ఏమయ్యింది...? అని అడిగితే జరిగిన విషయం చెప్పాడు. దానికి స్టాఫ్ రిపోర్టర్స్ కొందరు కెమెరామెన్‌ని మరి అంత ఉత్సాహం ఎందుకు బస్ ఎక్కాల్సిన అవసరం ఏముంది అని వారించారు. దానికి కెమెరామెన్ అన్నా ఎక్కి



**Source Internet :** *1. 'వై.యస్. షర్మిల పాదయాత్ర'[1]*

వెంటనే దిగిపోయాను అక్కడ నేను ఏ విజువల్స్ తీయలేదు నా కెమెరా ఇప్పించండి అని అడిగాడు. అందరం కలిసి సెక్యూరిటీ వారి వద్దకు వెళ్ళి మాట్లాడితే మేము కెమెరా విజువల్స్ చెక్ చేయాలి ఆ తరువాతనే కెమెరా ఇస్తాం అంటూ వెళ్లిన స్ట్రింగర్స్, స్టాఫ్ రిపోర్టర్స్‌ని, మీడియాని మొత్తాన్ని రెండు మూడు మాటలని కెమెరా విజువల్స్ చెక్ చేసుకుని అప్పుడు కెమెరామెన్‌కి మళ్లీ వార్నింగ్ ఇస్తూ కెమెరా ఇచ్చేశారు.

అలా దుగ్గిరాల, మంగళగిరి మండలాల నుండి షర్మిల పాదయాత్ర తాడేపల్లి చేరుకుంది. తాడేపల్లిలో వైఎస్సార్, జగన్, షర్మిల, వైసీపీ అభిమానులు ఎక్కువగా ఉండటంతో డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేట ప్రాంతాల్లో షర్మిలకు అభిమానుల తాకిడి ఎక్కువయ్యింది. ఈ నేపథ్యంలో మంగళగిరి స్ట్రింగర్స్ అయిన మేము షర్మిలకు అక్కడ ప్రజలు స్వాగతం చెప్పడం, షేక్‌హ్యాండ్స్ ఇవ్వటం, షర్మిల కూడా వారిని ఆప్యాయంగా పలకరించడం, షేక్‌హ్యాండ్స్ ఇవ్వడం, మహిళల వద్దనున్న చిన్నారులను ఎత్తుకోవడం వారితో కొన్నినిమిషాలు మాట్లాడం జరుగుతుంది. మరి ఆ విజువల్స్ తీసుకోవాలి అనే ప్రయత్నంలో మంగళగిరి స్ట్రింగర్స్ జనాల్లోకి చొచ్చుకుపోతుంటే షర్మిల సెక్యూరిటీ మాత్రం షర్మిల అభిమానులను, మహిళలను, మమ్మల్ని ఇష్టానుసారంగా షర్మిల వద్దకు చేరకుండా ప్రక్కకు తోసివేయడం, విసురుగా నెట్టివేయడం జరుగుతుంది. ఈ క్రమంలో విజువల్స్ కోసం రెండు అడుగులు ముందుకు వేసి ఒకచేత్తో కెమెరా ముందుకు పెట్టి విజువల్స్ తీసుకుంటున్న నా కుడి చేతిని ఓ సెక్యూరిటీ తన చేతితో బలంగా గుద్దాడు. దానితో చేతిలో ఉన్న కెమెరా జారి రోడ్డుపై పడింది.

వెంటనే కెమెరా కోసం క్రిందికి వంగిన నన్ను వీపుపై గుద్దాడు. ఈలోగా క్రిందపడిన కెమెరా తీసుకుని నేను కెమెరా ఏమైనా అయ్యిందా... అని పరిశీలిస్తే కెమెరా లెన్స్ పగిలి లెన్స్‌పై క్రాకు కనబడ్డాయి. ఇక అంతే నాకు పట్టరాని కోపం వచ్చింది. కానీ వారిని ఏమీ చేయలేని పరిస్థితి. నా తోటి స్ట్రింగర్స్‌కి విషయం చెప్పాను. సెక్యూరిటీ వారు మీడియా అని కూడా గ్రహించకుండా వారు వ్యవహరిస్తున్న తీరు ఎవరికి చెప్పాలో తెలియక ప్రకాష్ నగర్, నులకపేట మధ్యలో షర్మిల పాదయాత్రలో కొంతదూరం నడిచి ఆ సెక్యూరిటీ వ్యక్తిని వెనుక నుండి కాలర్ పట్టుకుని జనంలో నుండి బయటకు లాక్కోచ్చాం. రోడ్డు ప్రక్కన నిలుచోబెట్టి పగిలిపోయిన కెమెరాలెన్స్ చూపించి మీడియాపై దాడి చేస్తావా...?అంటూ పాదయాత్రలో అతన్ని ముందుకు పోనీయకుండా అక్కడే నిలిపి వేయడం జరిగింది. అది గమనించిన కొందరు తాడేపల్లి వైసీపీ నాయకులు మా వద్దకు వచ్చి విషయం ఏమిటి అని అడిగారు. జరిగిన విషయం చెప్పాం. వారు ఉన్నారనే ధైర్యంతో ఆ సెక్యూరిటీ వాడు మమ్మల్ని ఏ మాత్రం లెక్క వేసుకోలేదు. చివరకి వాడితో మాకు సారీ చెప్పించారు. అయినప్పటికీ

మాకు ఆవేశం తగ్గలేదు. మెల్లగా సాగుతున్న పాదయాత్రలో కొంతదూరం పోయాక మళ్లీ వాడిని బయటకులాగి కొట్టాలని ప్రయత్నం చేసాం. కానీ అక్కడ నుండి వాడు పద్ధతిమార్చుకుని షర్మిలకు ప్రక్కనే నడుస్తూ మాకు అందకుండా తప్పించుకున్నాడు. ఇలా జగన్ ఓదార్పుయాత్రలో, షర్మిల పాదయాత్రలో వాళ్ళ సెక్యూరిటీ ఆగడాలు సాక్షి ఛానల్ తప్ప మిగతా మీడియా మొత్తానికి ఎక్కడో ఒక చోట ఇటువంటి ఘటనలు ఎదురయ్యాయి.

## మాదిగల కురుక్షేత్ర మహాసభ

గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట గతంలో యువగర్జన, 2014లో చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విశాలమైన మైదానంలో 2017 జులై 7వ తేదీన మాదిగల కురుక్షేత్ర మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ పెద్ద ఎత్తున పిలుపునిచ్చారు. 2014కి ముందు చంద్రబాబు తాను గెలిస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తానని ఎమ్మార్పీఎస్ నాయకుడు మందా కృష్ణకు మాట ఇచ్చి పొత్తుకుదుర్చుకుని మాదిగల ఓట్లతో చంద్రబాబు సీఎం అయ్యాడని కృష్ణ మాదిగ అన్నారు. నాడు మాదిగలకు కృష్ణమాదిగ కాదు నేనే మీ మాదిగలకు పెద్దన్న అని, చెప్పులు కుట్టి, డప్పు కొట్టి అధికారంలోకి రాగానే వర్గీకరణ చేస్తానని కృష్ణమాదిగను వెంటపెట్టుకుని మాదిగ పల్లెల్లో ఎలక్షన్ క్యాంపెయిన్ చేసి మాదిగలను నమ్మించి ఓట్లు దండుకున్నాడు చంద్రబాబు అని స్వయంగా కృష్ణమాదిగ ఆరోపించారు.

చివరికి సీఎంగా గెలిచిన చంద్రబాబు 2014 నుండి 2017 వరకు ఎస్సీ వర్గీకరణ విషయం కృష్ణమాదిగ ఎప్పుడు అడిగినా స్పష్టమైనహామీ ఇవ్వకుండా, అసలు ఆ విషయం ఊసే ఎత్తకుండా వ్యవహరించిన చంద్రబాబు తీరును ఎండగట్టేందుకు అమరావతిలోనే విషయం తేల్చుకుందాం అనే ఉద్దేశ్యంతో కృష్ణమాదిగ నాగార్జున యూనివర్సిటీ ఎదుట మాదిగల కురుక్షేత్ర మహాసభకు పిలుపు నిచ్చారు.

ఇకనాటి సీఎం అయిన చంద్రబాబు కుటిలబుద్ధితో మాదిగల కురుక్షేత్ర మహాసభకు అనుమతి ఇవ్వరాదని ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరో ప్రక్క కృష్ణమాదిగ ఆ సభకు అనుమతులు వస్తాయని ఎదురుచూస్తూ వచ్చారు. అయినప్పటికీ అనుమతి రాలేదు. చంద్రబాబు తనతీరును ఎండగట్టేందుకే కదా... ఈ మాదిగల కురుక్షేత్ర మహాసభ అసలు అనుమతి ఇవ్వకపోతే ఎలా జరిపిస్తారు అని భావించి సభ జరగకుండా ఉండేందుకు సీఎంగా తన ప్రయత్నాలు తాను చేశాడు. రోజులు గడిచే కొద్ది అనుమతి వస్తుంది... వస్తుంది... అని కృష్ణమాదిగ, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు ఎదురుచూశారు. కానీ అనుమతి రాలేదు. ఇక ఒక్కరోజే సమయం ఉంది. కొన్ని మీడియా ఛానల్స్ కృష్ణమాదిగను పట్టుకుని

ఈ రోజు వరకు మీసభకు అనుమతి లభించలేదు కదా..సభ నిర్వహిస్తారా...? లేదా...?అని మీడియా ఛానల్స్ అడిగిన ప్రశ్నలకు మీడియా ఇంటర్వ్యూ ద్వారా మా సభకు అనుమతి వచ్చినా, రాకపోయినా అమరావతిలో ప్రకటించిన తేదీ, సమయానికి మాదిగల కురుక్షేత్ర మహాసభ జరుగుతుంది. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులుపెట్టినా మనం అనుకున్న సమయానికి సభ నిర్వహిస్తాం అంటూ తన ఇంటర్వ్యూ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగలను ఉత్సాహపరుస్తూ మాట్లాడారు. సభ నిర్వహించుకునేందుకు చివరినిమిషం వరకు ఎదురుచూశారు. సభకు అనుమతులు లభించకపోగా సభాస్థలంలో భారీ ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి.

ఇక సభాస్థలంలో భారీగా పోలీసులు, మరో ప్రక్క మీడియా ఎందుకంటే కృష్ణమాదిగ ఈ సభను ఓ ఛాలెంజ్‌గా తీసుకున్నారు. దానితో అక్కడ ఏమి జరుగుతుందోనని పోలీసులు, మీడియా అక్కడ నిఘా వేశాయి. ఇక జులై 7వ తేదీ సభ సమయం మరో రెండుగంటలే ఉంది. అక్కడ వాతావరణం చూస్తే సభ ప్రాంగణంలో అడుగడుగునా వందల సంఖ్యలో పోలీసులు వారి కదలికలు, అక్కడక్కడా మీడియా కెమెరామెన్స్ తప్ప అక్కడ మరో హడావుడి లేదు. మరోప్రక్క ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాల నుండి, రాయలసీమ నుండి సభకు వస్తున్న మాదిగలను ఎక్కడబడితే అక్కడ లక్షల సంఖ్యలో మాదిగలు, ఎమ్మార్పీఎస్ నాయకుల అరెస్టులు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఈ ఆరెస్టులు పలు టీవీఛానల్స్‌లో లైవ్‌లు వస్తున్నాయి. సభా ప్రాంతం నుండి పోలీసులు, మీడియా తప్ప ఇక్కడ సభకు వచ్చిన వారు ఎవరూ లేరు. అయినా సభ జరుగుతుంది అని కృష్ణమాదిగ అన్నారు. అసలు ఏమి జరుగుతుంది అనేది ఆద్యంతం ప్రశ్నగా ఉంది అని గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్ లైవ్‌లు ఇస్తున్నారు. అంతే సాయంత్రం నాలుగు గంటల సమయంలో మంగళగిరి మండలం చినకాకాని, పెదకాకాని మండలం కంతేరు, వెనిగండ్ల, యూనివర్సిటీ సమీపప్రాంతాలు నంబూరు, కొప్పురావూరు ప్రాంతాలనుండి వేలాదిగా మాదిగలు పొలాలనుండి, రైల్వే ట్రాక్స్ నుండి చిన్న చిన్న సందు గొందుల నుండి సభా ప్రాంతానికి చేరేందుకు వర్సిటీ ఎదుట ఉన్న జాతీయరహదారిపై పెద్దపెద్దగా అరుస్తూ, నినాదాలు చేస్తూ పరుగులు పెట్టారు. అప్పటిదాకా స్తబ్దుగా ఉన్న ఆ ప్రాంతంలో పెద్ద అలజడి. రోడ్ల పొడవునా ప్రశాంతంగా కూర్చున్న పోలీసులకు పనిపడింది. వేలాది సంఖ్యలో సభాస్థలికి వెళ్లేందుకు జాతీయరహదారిపై పరుగులుపెడుతున్న మాదిగలపై పోలీసులు లాఠీచార్జ్ చేయకతప్పలేదు. చేతికి అందిన వారిని అందినట్లు లాఠీలతో బాదుతుంటే దెబ్బలు లెక్క చేయక మాదిగలు సభాస్థలంలోకి పరుగులు పెడుతున్నారు. అక్కడ దాకా వెళ్లిన వాళ్ళను అరెస్ట్ చేసి పోలీసు వాహనాలు ఎక్కించి పలు పోలీసు స్టేషన్స్‌కి పోలీసులు తరలిస్తున్నారు.

నిజంగానే అక్కడ పరిస్థితి కురుక్షేత్రంలా ఉంది. ఆ సీన్స్ కవర్ చేసేందుకు స్ట్రింగర్స్, గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్, కెమెరామెన్స్ బైకులపై, రోడ్లపై పరుగులు పెడుతూ విజువల్స్ కవర్ చేస్తున్నాం. పోలీసులు మీడియా అని కూడా చూడకుండా లాఠీచార్జ్ చేస్తుంటే అందులో చాలామంది జర్నలిస్టులకు, కెమెరామెన్స్‌కి పోలీసు లాఠీ దెబ్బలు తగిలాయి. అలాగే విజువల్స్ కోసం రోడ్డులో బైకులపై రిపోర్టర్స్, కెమెరామెన్స్ కలసి వెళుతున్న బైక్ చక్రాల్లో లాఠీలు పెట్టి పోలీసులు బైకులు పడవేయడం, క్రిందపడ్డ జర్నలిస్టులను, కెమెరామెన్స్‌ని, పడిపోయిన బైకుల హెడ్‌లైట్లు, సిగ్నల్‌లైట్స్‌ను లాఠీలతో బలంగా కొడుతూ పగలగొట్టడం, బైక్ టైర్లలో గాలితీయడం ఇలా పోలీసుల అరాచకం మాములుగా లేదు. దానితో జర్నలిస్టులు పోలీసులకు ఎదురుతిరిగి వాదనకు దిగితే సైలెంట్‌గా ప్రక్కకు తప్పుకున్నారు పోలీసులు.

అలా కొందరు మాదిగలు ఎలాగైనా సరే పోలీసులను ఛేదించుకుని సభాప్రాంగణంలోకి ప్రవేశించారు. ఎక్కువగా సభా ప్రాంగణం వెనుక ఉన్న రైల్వే ట్రాక్ నుండి కొంత మంది సభాప్రాంగంలోకి చేరారు. వారు అక్కడకు చేరారో లేదో సభాప్రాంగణంలో ఉన్న పోలీసులు ఒక్క ఉదుటన పెద్ద ఎత్తున లాఠీ చార్జ్ చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న స్ట్రింగర్స్ మొబైల్‌లో విజువల్స్ తీసి వాట్సాప్ ద్వారా ఆఫీసులకు అప్‌లోడ్ చేశారు. వెంటనే మాదిగల కురుక్షేత్ర మహాసభలో మాదిగలపై పోలీసులు లాఠీచార్జ్ అంటూ బ్రేకింగ్ విజువల్స్ వేశాయి. ఇక మిగిలిన స్ట్రింగర్స్‌కిపై నుండి లాఠీచార్జ్ విజువల్స్ కావాలి అంటూ ఫోన్లు. అవి సేకరించి పంపిస్తున్న సమయంలో చినకాకాని జాతీయ రహదారిపై మరో అలజడి. సభా ప్రాంగణానికి చేరుకునేందుకు మాదిగలు పెద్ద ఎత్తున పొలాలలో నుండి ఒక్క సారిగా జాతీయ రహదారి పైకి దూసుకువచ్చారు. పోలీసులు అక్కడ పెద్దఎత్తున మోహరించి ఉన్నారు.

నాటి గుంటూరు జిల్లా ఎస్పీతో సహా 50కి పైగా పోలీసులు ఉన్నారు. ఉవ్వెత్తున దూసుకువస్తున్న మాదిగలను నియంత్రించడం పోలీసులకు కష్టం అయ్యింది. పోలీసులను సైతం తోసుకుంటు, నెట్టుకుంటూ హైవే మీదకు వచ్చే ప్రయత్నంలో పోలీసులకు, మాదిగలకు పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. జాతీయరహదారికి ఎడ్జ్‌లో సిమెంట్ పోల్స్‌కి ఉన్న ఇనుప ఫెన్సింగ్‌ని 50 మీటర్ల పొడవునా సిమెంట్ పోల్స్‌ని, ఇనుప ఫెన్సింగ్‌ని భూమట్టానికి ఇరగదొక్కి అటునుండి హైవే పైకి దూసుకువచ్చి సభాప్రాంగణం వైపు వందలమంది మాదిగలు పరుగులు పెట్టారు. ఇదిగమనించిన పోలీసులు అక్కడకు చేరారు. జిల్లా ఎస్పీ సైతం లాఠీ చేతబట్టి అక్కడకు వచ్చారు. అక్కడకూడా పోలీసులకు, మాదిగలకు పెద్దఎత్తున తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పాల్గొన్న జిల్లా ఎస్పీని సైతం వెనుక నుంచి మాదిగలు పిడిగుద్దులు గుద్దుతూ

నాటి ఎస్పీని క్రింద పడేశారు. ఈ క్రమంలో ఎస్పీ మోకాలుకు గాయం అయ్యింది. వెంటనే పోలీసులు మళ్ళా అక్కడ లాఠీచార్జ్ చేసి అందరిని చెదరగొట్టారు. ఈ క్రమంలో కొందరు మాదిగలు ఎటునుండివచ్చారో అటువైపు పొలాల్లోకి పరుగులు పెట్టి తప్పించుకున్నారు. కొందరు మాత్రం సభాప్రాంగణం వైపు పరుగులు తీశారు. దీనితో అక్కడ వాతావరణం కురుక్షేత్రంని తలపించింది.

ఈ క్రమంలో సభాప్రాంగణంలోకి రైల్వేట్రాక్ నుండి వచ్చిన మాదిగలపై లాఠీచార్జ్ జరిగింది అని చెప్పాను కదా...ఆ లాఠీచార్జ్‌లో ఓ వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యి స్పృహతప్పి పడిపోయాడు. అలా పడిపోయిన వ్యక్తి చనిపోయాడు అని మాకు ఓ తప్పుడు సమాచారం అందింది. ఇక అటు పరుగులు పెట్టాం. అంతే ఈ లోగా కృష్ణ మాదిగతో ఓ ప్రముఖ ఛానల్ రహస్య ప్రాంతం నుండి లైవ్ ఇచ్చింది. ఆ లైవ్ ఎక్కడ నుండి వచ్చింది...కృష్ణ మాదిగ ఎక్కడ ఉన్నాడు. ఆ ప్రముఖ ఛానల్‌కి ఇవ్వగా లేనిది మీరు ఏమిచేస్తున్నారు అని గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్‌కి ఆఫీసుల నుండి స్టంటింగ్. ఇంకేముంది కృష్ణమాదిగ సభాప్రాంగణంలోకి వచ్చేశారు. ఆ ఛానల్‌తో మాట్లాడుతున్నారు అని మాదిగలు మళ్ళీ హైవే పైకి పరుగులు పెట్టారు. కొన్ని నిమిషాల పాటు అక్కడ ఏమి జరుగుతోంది అనే విషయం అక్కడ ఉన్న జర్నలిస్ట్‌లకు అర్థం కాలేదు. ఏది కవర్ చేయాలి, ఎటు వెళ్లాలి అనేది అర్థం కాక హైవే పై అటు,ఇటు పరిగెత్తడం తప్ప మాకు ఏమీభోదపడలేదు.

ఓ అరగంట తరువాత సభాప్రాంగణంలో జరిగిన లాఠీచార్జ్‌లో ఓ ఎమ్మార్పీఎస్ కార్యకర్త స్పృహతప్పి పడిపోయాడు అతన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అని క్లారిటీ వచ్చింది. అయితే కృష్ణమాదిగ ఆ ఛానల్‌తో ఎక్కడ లైవ్‌లో మాట్లాడింది తెలియలేదు. ఇక స్టాఫ్ రిపోర్టర్స్ కృష్ణమాదిగ ఆచూకీ కోసం ఆరా తీయడం మొదలుపెట్టారు. ఆ రోజు రాత్రికి ఆ ఛానల్ లైవ్‌లో పాల్గొన్న కృష్ణమాదిగ ఎక్కడ నుండి వచ్చాడో గానీ, సభాప్రాంగణంలో లాఠీచార్జ్‌లో దెబ్బలు తగిలి స్పృహకోల్పోయి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తను పరామర్శించేందుకు ఆసుపత్రికి వచ్చి ఆ కార్యకర్తను పరామర్శించే క్రమంలో గుంటూరు పోలీసులకు సమాచారం అందింది. కార్యకర్త పరామర్శ ముగియగానే కృష్ణమాదిగను గుంటూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక విషయం తెలుసుకున్న గుంటూరుజిల్లా స్టాఫ్ రిపోర్టర్స్‌కి గుంటూరులో కవరేజీ హడావుడి.కృష్ణమాదిగను అదుపులోకి తీసుకున్న గుంటూరు పోలీసులు వారి వాహనంలో ఎక్కించుకుని రాత్రికి రాత్రే హైదరాబాద్‌కు తరలించే క్రమంలో విజయవాడ రోడ్డు మార్గం గుండా తీసుకెళ్ళి తెలంగాణ బోర్డర్‌లో అక్కడ పోలీసులకు కృష్ణమాదిగను అప్పగించారు. ఇక అక్కడితో కథ సుఖాంతం అని పోలీసులు, జర్నలిస్ట్‌లు అనుకున్నారు.

కానీ సభాప్రాంగణంలోకి వెళ్లేందుకు అప్పటికీ మాదిగలు ఎక్కడి నుండి వస్తున్నారో తెలియదు. ఆ చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుండి గ్రూపులు, గ్రూపులుగా వస్తూనే ఉన్నారు. ఆ టైంలో కూడా పోలీసులు మాదిగలను అక్కడికి చేరకుండా నియంత్రణ చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో కృష్ణమాదిగను గుంటూరులో అదుపులోకి తీసుకుని పోలీసులు ఆయన్ని తెలంగాణా పోలీసులకు అప్పగించారని ఇక సభ జరగనట్లేనని తెలుసుకున్న మాదిగలు ఎక్కడోళ్ళు అక్కడ నుండి వెనుదిరిగారు.

ఈ క్రమంలో పోలీసుల తీరును వ్యతిరికిస్తూ హైవేపై నిరసన స్లోగన్స్ ఇస్తూ ఇళ్ళకు బయలుదేరారు. పోలీసులు అంతా సేఫ్ అనుకున్నారు. మేము కూడా అంతా ముగిసింది అని ఇళ్ళకు బయలుదేరాం. దాదాపు వర్శిటీ నుండి మంగళగిరి స్ట్రింగర్స్ మంగళగిరి చేరుకుంటున్న సమయంలో మరో అలజడి. జాతీయరహదారిపై ఉన్న ఖాజ టోల్‌గేట్ క్యాష్ కౌంటర్‌లను మాదిగలు ఆవేశం ఆపుకోలేక ధ్వంసం చేశారని సమాచారం. అంతే వెంటనే వెనక్కి తిరిగి ఖాజ టోల్‌గేట్ వద్ద విజువల్స్ తీసుకున్నాం. అవి పంపిస్తూ ఉండగానే వర్సిటీ సమీపంలో కొప్పురావూరు వద్ద పోలీసుఫోర్స్‌ని తీసుకువచ్చిన స్వరాజ్ మాజ్డా వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మేము అక్కడకు వెళ్ళేసరికి ఆ వాహనం ఓ మాదిరిగా మంటల్లో దగ్ధం అవుతూనే ఉంది. విజువల్స్ తీసి ఆఫీసులకు అప్‌లోడ్ చేశాం. అప్పటికి సమయం రాత్రి 9:30. ఇక ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని గుంటూరు స్టాఫ్ రిపోర్టర్స్ మంగళగిరి స్ట్రింగర్స్‌కి మొత్తం క్లియర్ అయ్యే వరకు అక్కడే ఉండాలని ఆదేశాలు. అంతా ముగిసేసరికి మరికొంత సమయం కలుపుకొని మేము ఇళ్ళకు చేరేసరికి అర్ధరాత్రి అయ్యింది.

## కరోనా విలయతాండవం

ప్రపంచ దేశాలను గడగడలాడించిన కరోనా భారత్‌ని చుట్టు ముట్టింది. అనేక సంస్థలను, వర్గాలను, వ్యక్తులను అప్పటి వరకు వచ్చిన మూడువేవ్‌ల ద్వారా ప్రతీ రాష్ట్రంలో 100లు, వేల సంఖ్యలో ప్రాణాలు తీసింది. ఎంతటి ఆర్థికస్థితిమంతులైనా, ఎంత గొప్పవారైనా కరోనా కాటుకు బలికాక తప్ప లేదు. 2019 డిసెంబర్‌లో కరోనా కళ్ళు తెరిచింది. నాటి నుండి కొన్నాళ్ళ వరకు విలయతాండవం చేస్తూనే ఉంది. ప్రపంచ దేశాలు కరోనా నిర్మూలనకు వ్యాక్సిన్‌లు కనుగొన్నా పలురూపాల్లో చాపక్రింద నీరులా ఎప్పటికప్పుడు కొత్తరకం వైరస్‌గా మనుగడ కొనసాగిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో అన్ని సంస్థలు, మరియు అన్ని రంగాలతోపాటు మీడియా రంగం కూడా ఇబ్బందులు ఎదుర్కొంది. దీనితో జర్నలిస్ట్‌లకు కష్టకాలం ఏర్పడింది.

## సంక్షోభంలో ప్రింట్ మీడియా

క్షరము కానిది అక్షరం అన్నది ఎప్పటి నుంచో వినిపించే సంగతి. అలాంటి అక్షరం కరోనా కారణంగా రెండున్నరేళ్లుగా సంక్షోభంలో చిక్కుకుంది. స్వాతంత్రోద్యమకాలం నుంచి జనాలకు మార్గదర్శనం చేసి, ఆ తరువాత కార్పొరేట్ స్థాయికి ఎదిగి, వేలకోట్ల వ్యాపారంగా మారిన ప్రింట్ మీడియా ఇప్పుడు దిక్కు లు చూస్తోంది. విజువల్ మీడియాను తట్టుకుని, డిజటల్ మీడియాను ఢీకొని తన స్థానం నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూ వస్తున్న పత్రికా రంగం రెండున్నరేళ్లుగా అనుకోకుండా విరుచుకుపడిన కరోనా వైరస్ నేపథ్యంలో వచ్చిన మార్పులకు తలంవంచి, పక్కకు తప్పుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

## కరోనా కారణంగా జర్నలిస్టులకు కష్టకాలం :

కరోనా కారణంగా అన్నివిధాలా ప్రింట్ మీడియా ఇప్పుడు కార్నర్ అవుతుంటే దాని ప్రభావం జర్నలిస్ట్ల మీద పడుతోంది. అసలే తెలుగు జర్నలిస్ట్లకు సరైన జీత భత్యాలు లేవు. దీనికి తోడు ఇప్పుడు కోతలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగాలు తీసివేయడం ప్రారంభమైంది. దీనికి తోడు ప్రధాన దినపత్రికలను పక్కన పెడితే, ముక్కుతూ మూలుగుతూ నడుస్తున్న మెయిన్ స్ట్రీమ్ మీడియా పత్రికలు, అలాగే జిల్లాల వారీ నడిచే లోకల్ పత్రికలూ పూర్తిగా మూలన పడే పరిస్థితి కనిపించింది. ఇది జర్నలిస్ట్లు జీతాల మీదా దారుణ ప్రభావం కనబర్చే అవకాశం క్లియర్గా కనిపించింది. మొత్తం మీద డిజిటల్ యుగాన్ని తట్టుకున్న ప్రింట్ మీడియా కరోనాను తట్టుకోవడం మాత్రం కష్టంగానే కనిపించింది. చరిత్రలో కలిసిపోయిన చాలా వ్యవస్థల మాదిరిగా ప్రింట్ మీడియా కూడా ఇప్పుడు కాకున్నా, మరికొన్నాళ్లకు అయినా కనుమరుగు అయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

## ఎలక్ట్రానిక్ మీడియా

కరోనా కారణంగా ఎలక్ట్రానిక్ మీడియాకు వచ్చిన చిక్కులు ఏమీ లేవు అని చెప్పుకోవచ్చు. ఇంకా ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలే తమ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేశాయి. కరోనా కారణంగా యాడ్స్ తగ్గిపోయి ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం దాదాపు సగానికి పైగా ఛానల్స్ తగ్గించి వేశాయి. ప్రింట్ మీడియాలా ప్రతిరోజు ప్రింటింగ్ ఖర్చు చేయాల్సిన అవసరం లేకపోవడంతో న్యూస్ బులెటిన్స్కి ఏ విధమైన ఇబ్బంది లేదు. ఈ నేపద్యంలో ఛానల్స్ నడుస్తున్నా ప్రకటనలు లేక ఆదాయం తగ్గింది అంటూ ఉద్యోగులకు కొన్ని ఛానల్స్ నెలంతా పని చేసినా సగం జీతాలు ఇచ్చి సరిపుచ్చింది.

ఇలా సగం, సగం జీతాలు తీసుకున్న జర్నలిస్ట్‌లు, కెమెరామెన్స్ కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్ వల్ల నిత్యావసర సరుకులు ధరలు, వ్యాపారులు భారీగా పెంచిన కారణంగా కంపెనీ ఇచ్చిన సగం జీతంతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేక ఇళ్ళ అద్దెలు చెల్లించలేక భారంగా బ్రతుకులు ఈడ్చలేక జర్నలిస్ట్‌లం కదా అనే భరోసాతో ఎవరైనా సాయం చేయకపోతారా అని ఎదురుచూసిన జర్నలిస్ట్‌లు ఎందరో ఉన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చి కొన్ని నగర ప్రాంతాల్లో ఇళ్ళు అద్దెకు తీసుకొని జర్నలిజంలో కొనసాగుతున్న జర్నలిస్ట్ మిత్రులు, కెమెరామెన్స్ బ్రతుకు భారమై వృత్తిని వదిలి సొంత ప్రాంతాలకు వెళ్ళిపోయిన వారు ఉన్నారు.

## కరోనా కవరేజీ - జర్నలిస్ట్ ల ఇబ్బందులు

ప్రపంచాన్ని ఒక ఊపు ఊపేసిన కరోనా సమయంలో ప్రభుత్వం పోలీసులు, పారిశుధ్య కార్మికులను, వైద్య రంగంలో కొన్ని విభాగాల ఉద్యోగులను, పలువురిని ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా గుర్తించింది. కానీ నిత్యం ప్రజా సంబంధాలు కలిగి వృత్తి భాద్యతలు నిర్వహించే జర్నలిస్ట్‌లను మాత్రం ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా గుర్తించలేదు. కరోనా మొదటి వేవ్ నుండి ప్రభుత్వం ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా గుర్తించిన వ్యక్తులకు మాత్రమే కరోనా వ్యాక్సిన్ ఇచ్చింది. మొదటి వేవ్‌లో జర్నలిస్ట్‌లను విస్మరించిన ప్రభుత్వం మూడవ వేవ్ నాటికి జర్నలిస్ట్‌లతో సహా ప్రజలందరికి వ్యాక్సిన్‌లు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మొదట్లో జర్నలిస్ట్‌లు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని న్యూస్ కవరేజీ చేయాల్సి వచ్చింది. కరోనా ఆరంభంలో ప్రజలు ఇంటికే పరిమితం అవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ప్రభుత్వ, ప్రవేట్ సంస్థలు సైతం ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించాయి. కానీ జర్నలిస్ట్‌లకు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం లేదు. దీనితో జర్నలిస్ట్‌లు ప్రత్యక్షంగా సంఘటనా స్థలాలకు వెళ్ళి న్యూస్ కవరేజీ చేయాల్సిన పరిస్థితి ఉండేది.లాక్ డౌన్, కర్ఫ్యూ, కరోనా ప్రత్యేక జోన్‌లలోకి వెళ్ళి న్యూస్ కవరేజీ చేయాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్ట్‌లకు మాస్క్ ఒక్కటే రక్షణ మార్గం. జర్నలిస్ట్‌లకు వ్యాక్సిన్ కూడా ఇవ్వకపోవడంతో మాస్క్, చేతులకు గ్లౌస్‌లు ధరించి భయం, భయంగా విధుల్లో పాల్గొనేవారం. ఆసుపత్రుల్లో, కరోనా కేంద్రాల్లో రోగుల పర్యవేక్షణ, వారికి అందుతున్న సేవలు వంటి విషయాలు కరోనా వార్డులకు వెళ్ళి విజువల్స్, ఫోటోలు తీసే క్రమంలో ఎంతోమంది జర్నలిస్ట్‌లు కరోనాకు గురైయ్యారు. కరోనా ఏ విధంగా సోకినా ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా 50 నుండి 100 మంది జర్నలిస్ట్‌లు కరోనాతో మృతి చెందినట్లు అనధికారిక లెక్కలు. అధికారికంగా చెప్పాలి అంటే ఏపీ వ్యాప్తంగా 48 మంది జర్మలిస్ట్‌లు కరోనాతో మృతిచెందినట్లు సమా చారం. ఒక ప్రక్క జర్నలిస్ట్‌లకు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం

లేకపోవడంతో అలా వెళ్ళి కరోనాకు గురై చనిపోయిన జర్నలిస్ట్‌లను చూసిన పలువురు జర్నలిస్ట్‌లు, కెమెరామెన్స్ వృత్తిని వీడిపోయారు. తరువాత తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్స్‌తో పాటు చాలామంది కెమెరామెన్స్ కరోనా సోకి సొంత డబ్బులు ఖర్చు చేసి డెత్‌బెడ్‌ల మీద నుండి ప్రాణాలతో తిరిగి వచ్చారు.

## కరోనాతో మరణించిన జర్నలిస్ట్‌ల ఆర్థిక సాయం మాటేమిటి...?

రాష్ట్రంలో కరోనాతో మరణించిన జర్నలిస్ట్‌ల కుటుంబాలకు ఆర్థిక చేయూత ఇచ్చే దిశగా వైసీపీ ప్రభుత్వం 5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించింది. కరోనాతో మరణించిన జర్నలిస్ట్ కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం ఎంతో అవసరం. అయితే ప్రకటన జరిగిందిగానీ మరణించిన ఏ జర్నలిస్ట్ కుటుంబానికి ఈ 5లక్షల ఆర్థిక సాయం అందిన దాఖలాలు లేవు. ప్రభుత్వం ఒక మంచి మనసుతో ప్రకటించిన ఈ 5 లక్షల సాయం కరోనాతో మృతి చెందిన జర్నలిస్ట్ కుటుంబాలకు వీలైనంత త్వరగా అందించే అవకాశం కల్పించాలి అని ఈ ప్రభుత్వం ప్రకటించిన విధంగా కలం యోధులకు అండగా నిలవాలని మన జర్నలిస్ట్‌లం ప్రభుత్వాన్ని కోరుకుందాం.

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

# 12. సమాజం పట్ల సామాజిక భాద్యత - భద్రత దిశగా జర్నలిస్టులు




"సమాజం పట్ల జర్నలిస్టులు ఎంత బాధ్యతగా ఉంటారో,

ఆపదలో ఉన్న వారికి తాము ఎంత భద్రత కల్పిస్తారో తెలిపే కధనాలు"

## జర్నలిజంలో సామాజిక స్పృహ

మన జర్నలిస్ట్‌లు జర్నలిజంలో అడుగుపెట్టి సామాజిక స్పృహతో రాస్తున్న కథనాలు ఎంతోమంది సమస్యలు తీరుస్తున్నాయి. సమాజానికి పట్టిన చీడపీడలను కలంతో కౌంటర్ ఇచ్చి గాడితప్పుతున్న వ్యవస్థను దారిలో పెడుతున్న మన జర్నలిస్ట్‌ల పోరాటం అనిర్వచనీయమైనది. ప్రజాస్వామ్యానికి వెన్నుదన్నుగా ఉంటామని పత్రికలు, ఛానల్స్ లెక్కకు మించి పుట్టుకొచ్చాయి. ఇప్పటి మీడియా సమాజం పట్ల ఏ మాత్రం సామాజిక బాధ్యత వహించటం లేదు. ఇక ఎప్పుడో ఒకసారి ఏదైనా చిన్న కార్యక్రమం చేస్తేచాలు అది చాలా ఎక్కువ అలా మన మీడియా మనుగడ సాగిస్తుంది. అయితే మన జర్నలిస్ట్‌లు మాత్రం పూర్తిస్థాయిలో ఆ భాధ్యత నెరవేరుస్తున్నారు.

మనం పనిచేసే ప్రాంతాల్లో ఎవరైనా ఆర్థికంగా నష్టపోయినా, ఆరోగ్యం క్షీణించి ప్రాణాలుపోయే పరిస్థితి ఉన్నా, మంచి ర్యాంకులు సాధించి పై చదువులు చదువుకోలేని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సమాజంలో వివక్షకు గురౌవుతున్న సమస్య ఏదైనా మన దృష్టికి వస్తే సామాజిక స్పృహతో మనం మన కలాలతో రాసే కథనాలు పలు పత్రికలు,ఛానల్స్‌లో ప్రచురణ/ప్రసారం అయినప్పుడు అవి చూసిన పాఠకులు స్పందించి వారికి తన సహాయ, సహకారాలు అందిస్తున్నారు. మనం సాయం చేయలేకపోయినా మన కలాలు రాసే కథనాలు చదివిన పాఠకుల ద్వారా వారికి సామాజిక భద్రత కల్పిస్తున్నాయి. మనం రాసే కథనాల ద్వారానే పలురకాల ఇబ్బందులలో ఉన్న పీడితులు మనపత్రిక, ఛానల్స్ పాఠకులు / వీక్షకుల ద్వారా సహాయసహకారాలు పొందుతున్నారు. ఇది ఎవరు అవునుఅన్నా, ఎవరు కాదుఅన్నా అక్షరసత్యం.

ఇలాంటి పీడితులకు ఒకప్పుడు మాత్రమే పత్రికలు, ఛానల్స్ అండగా ఉండేవి. ఇప్పుడు మనం చెప్పుకుంటున్న పలురకాల పీడితులకు మనం వాట్సాప్ గ్రూప్‌ల్లో రాసే కథనాల ద్వారా మాత్రమే పైన చెప్పబడిన పీడితులు ప్రస్తుతం లబ్దిపొందుతున్నారు. ఒకప్పుడు పీడిత ప్రజల తరపున మనం రాసిన కథనాలు ప్రచురణ/ప్రసారం చేసిన మీడియా సంస్థలు ప్రస్తుతం అటువంటి కథనాలను రాసే జర్నలిస్ట్‌లను ప్రోత్సహించకపోయినా సామాజిక బాధ్యతతో మనం రాసిన కథనాలను ప్రస్తుతం మన మీడియా సంస్థలు ఇటువంటివి అవసరం లేదు అని సున్నితంగా తిరస్కరిస్తున్నాయి. సామాజిక బాధ్యత మరిచిన మీడియా సంస్థలు లక్షలాది రూపాయల యాడ్స్‌ని దండుకునే విధానానికే ప్రాధాన్యత ఇస్తున్నాయి తప్ప చాలా వరకు సామాజిక భాధ్యత వహించడం లేదు. ఈ నేపథ్యంలో సామాజిక స్పృహతో మనం రాసిన కథనాలు వృధా కాకుండా పీడిత ప్రజలకు అండగా ఉండాలని ఆ కథనాలను వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్ట్‌చేసి మనం వారికి అందే సహాయసహకారాల విషయంలో ఎంతగానో

ఊతం అందిస్తున్నాం. పత్రికలు, ఛానల్స్ సామాజిక భాద్యత మరిచినా మన జర్నలిస్ట్‌లు మాత్రం ఆ భాద్యత మరువలేదు.

## మత్తులో జోగుతున్న వీధిబాలలు

విజయవాడ నగరంలో వీధిబాలలు ఎందరో ఉన్నారు. ఏ తల్లిదండ్రులు కన్నబిడ్డలో పాపం బాల్యంలో సరియైన ఆదరణలేక యుక్తవయసు వచ్చేనాటికి మద్యం, గంజాయి, సిగరెట్టు, గుట్కా, ఖైనీ వంటి చెడు అలవాట్లకు బానిసలై వాటికోసం జేబుదొంగల్లా మారి చిన్నవయసులోనే జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ కోవకు చెందిన వీధిబాలలు మనకు విజయవాడలో ప్రధాన వీదుల్లో, రైల్వేస్టేషన్, బస్టాండు, రాజ్,యువరాజ్ థియేటర్లు అడ్డాగా బేలమైన జీవితాలు జీవిస్తున్నారు. పొద్దుపొద్దు తెల్లవారు తుండగానే వీరికి మత్తు నిచ్చే పదార్థాలు కావాలి. అవి కోనుగోలు చేయడానికి డబ్బులు కావాలి. అలా అవసరమైన డబ్బు వారికి ఎవరు ఇస్తారు. ఎక్కడ నుండి వస్తుంది. ఏముంది ఈజీ...పైన చెప్పబడిన ప్రాంతాల్లో జేబు దొంగతనాలకు పాల్పడతారు. రాత్రి వేళల్లో జేబు దొంగతనాలే కాక, సమీప గృహాల్లో చోరీలు చేస్తారు. ఇలా మారిన వీధిబాలలకు రాత్రివేళ పడుకోవటానికి, చిన్న చిన్న అవసరాలకు స్థానిక రౌడీషీటర్లు వీరికి ఆశ్రయం కల్పిస్తారు. ఇలా ఆశ్రయం కల్పించినందుకు, వారి మధ్య వచ్చే చిన్న, పెద్దా సమస్యలకు పరిష్కారం చేసి వారి వద్దనున్న డబ్బులో కొంత ఈ వీధి బాలలు అక్కడ రౌడీ షీటర్స్‌కి మామూళ్లు ఇచ్చుకోవాలి. లేదంటే వారికి నగరంలో మనుగడ లేదు.

ఈ నేపథ్యంలో ఓసారి తాడేపల్లి బైపాస్‌లో ఓ నలుగురైదుగురు వీధిబాలలు రోడ్డు డివైడర్ చెట్ల మధ్య కూర్చుని తచ్చాడుతూ, ఊగుతూ  మా మంగళగిరి జర్నలిస్ట్ మిత్రుల బృందం నాడు నేను, దయాకర్, కళ్యాణ్ కంటపడ్డారు. ఏమిటా...?ఈ పిల్లలు రోడ్డు మధ్యలో ఏమి చేస్తున్నారు అని వారికి తెలియకుండా పరిశీలనగా చూసాం. పిల్లలందరూ చేతుల్లో కర్చీఫ్‌లు పెట్టుకుని నోటితో, ముక్కుతో గాలి పీలుస్తూ మత్తులో ఊగిపోతున్నారు.

వెంటనే షాక్‌కు గురైన మేము వారిని చుట్టుముట్టి ఐదుగురు వీధి బాలలను పట్టుకున్నాం. రోడ్డు ప్రక్కకు తీసుకొచ్చి కూర్చోబెట్టాం. ఏమిటి రా...? ఏమి చేస్తున్నారు ఇక్కడ అని ప్రశ్నించాం. దానితో భయం, భయంగా వారి చేతులో ఉన్న కర్చీఫ్‌లు జేబులో పెట్టుకునే ప్రయత్నం చేశారు. మేము వాటిని లాగేసుకున్నాం.ఎక్కడ నుండి వచ్చారు. ఏ ఊరు అని ఆరా తీస్తే ఏడుస్తూ విజయవాడ అని చెప్పారు. రెండు దెబ్బలు వేయగా అన్నా వెళ్లిపోతాం మమ్మల్ని వదిలేయండి ఇకనుండి ఇటు ప్రక్కకు రాము అంటూ శోకాలు పెట్టారు. అయినా మేము వారిని వదిలిపెట్టలేదు.

వెంటనే నాటి మంగళగిరి లేబర్ ఆఫీసర్‌కి ఫోన్ చేసాం. ఆయన వచ్చేవరకు వారిని నిలువరించటం మాకు పెద్ద సాహసమే అయ్యింది. ఆ సమయంలో వారి చేతులను పరిశీలిస్తే మణికట్టుపై భాగంలో బ్లేడుతో గీసుకున్న గాయాలు మానిపోయి ఉన్నాయి. ఏమిట్రా ఈ గాయాలు అంటే ఒక్కడి నుండి సమాధానం లేదు. జేబులు వెతికితే స్పిరిట్ బాటిల్స్, వైట్నర్, బ్లేడు, సూదులు, మరికొన్ని పౌడర్ బాటిల్స్ వంటివి వారి వద్ద లభించాయి. ఈలోగా మంగళగిరి నుండి లేబర్ ఆఫీసర్ తన జీప్‌లో వచ్చారు. మేము పట్టుకున్న ఐదుగురు వీధి బాలలను చూసి ఆయన వారిని జీప్ ఎక్కించుకుని మంగళగిరి వెళ్ళిపోయారు. కొన్ని గంటల తరువాత ఏమిటి సార్ ఆ పిల్లల పరిస్థితి అని ఫోన్లో అడిగాం. దానికి ఆయన ఈ పిల్లలు పూర్తి స్థాయిలో మత్తుకు అలవాటుపడ్డారని, నేరచరిత్ర కూడా కలిగి ఉన్నారని, చేతులపై గాయాలు చేసుకుని ఆ గాయాలలో మత్తు పదార్థాలు చొప్పించి మత్తుని ఆస్వాదించడం వీరికి అలవాటు అని చెబుతూ వీరికోసం విజయవాడలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం వల్ల విజయవాడకు సమీప ప్రాంతమైన తాడేపల్లి బైపాస్‌కు వచ్చారని తెలుపుతూ వారిని విజయవాడ పోలీసులకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. అక్కడ పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి అక్కడే స్వచ్ఛంద సేవా సంస్థలకుగానీ, అనాథ పిల్లల ఆశ్రమాలకుగానీ పంపించే ఏర్పాట్లు చేస్తారని చెబుతూ వీరు సామాన్యంగా ఎవరికి పట్టుబడకుండా తప్పించుకు తిరుగుతారు మంచి పని చేశారు అని మంగళగిరి జర్నలిస్ట్‌లకు మంచి కితాబు ఇచ్చారు. అలా మత్తులో జోగుతున్న వీధి బాలలను పట్టుకొని అధికారులకు అప్పగించి మత్తు పదార్థాల నుండి వారిని విముక్తి కలిగించి మంచి భవిష్యత్ కల్పించాలని లేబర్ ఆఫీసర్‌ని కోరిన మంగళగిరి జర్నలిస్ట్‌లు న్యూస్ కవరేజీ అయిపోయింది ఇంతటితో తమ పని అయిపోయిందని అనుకోకుండా సామాజిక బాధ్యతతో విధులు నిర్వహించారు.

## ఇటుక బట్టీలలో బాలకార్మికులు

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం చిర్రావూరు అనే గ్రామంలో కరకట్ట లోపలి భాగంలో పెద్దఎత్తున అక్రమ ఇటుక బట్టీల నిర్వహణ గతంలో జరిగేది. ఈ ఇటుక బట్టీల నిర్వహణలో కూలీలుగా పల్నాడు జిల్లా నుండి పెద్దఎత్తున కూలీలు కుటుంబాలతో సహా బట్టీల నిర్వహణ జరిగినన్ని రోజులు ఇక్కడకు మకాం మార్చేవారు. మూడు, నాలుగు నెలలు పాటు బట్టీలలోనే చిన్నచిన్న గుడిసెలు ఏర్పాటు చేసుకుని ఇటుక బట్టీలలో కూలీ పనులు చేసుకుంటూ పనులు ముగిశాక కొన్నాళ్ళకు పల్నాడుకు చెక్కేసేవారు.

ఈ క్రమంలో వారితో పాటు వచ్చిన 10,12,14 ఏళ్ళ లోపు పిల్లలు సుమారు ఓ 10 మంది బాలకార్మికులుగా ఆ ఇటుక బట్టీలలో కూలీ పనులు చేస్తుండేవారు. ఓరోజు రాజారత్నం అను నేను, దయాకర్ అను నా జర్నలిస్ట్ మిత్రుడు ఇద్దరం కలసి అక్రమ ఇటుక

బట్టీలుపై స్టోరీ చేసేందుకు వెళ్ళాం. మాకు అక్కడ బాలకార్మికులు కంటబడ్డారు. వెంటనే మా కెమెరాలు ఆ బాలకార్మికులపై ఫోకస్ పెట్టి విజువల్స్ తీసుకున్నాం. ప్రక్కకు వెళ్ళి ఈ కవరేజ్‌లో కూడా మరలా మంగళగిరి లేబర్ ఆఫీసర్‌కి ఫోన్ చేసి సంఘటనా ప్రాంతానికి రావాలని 10 మంది బాలకార్మికులు ఎర్రటి ఎండలో కూలీలుగా పని చేస్తున్నారని తెలిపాం. కొద్దిసేపటికి ఆయన అక్కడకు వచ్చారు. రావడం రావడంతోనే అక్కడ పని చేస్తున్న బాలకార్మికులను పని ఆపించి ఓ చెట్టు నీడన కూర్చోబెట్టారు. బట్టీలలో పనిచేసే మేస్త్రీలను పిలిచి బట్టీల యజమానులను పిలవాలి అని చెప్పారు. దానితో బట్టీల యజమానులు ఎవరికివారే సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారు.

దానితో లేబర్ ఆఫీసర్ ఇటుక బట్టీల యజమానుల వివరాలు కనుగొని పిల్లలను పనికి తీసుకువచ్చిన మెస్త్రీలపై పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు బాలకార్మికుల వివరాలు సేకరించి తల్లిదండ్రులు కూడా అదే బట్టీలలో పనిచేయడం గమనించి సున్నితంగా వార్నింగ్ ఇచ్చి రెండు రోజుల్లో మీ పిల్లలను మీ స్వగ్రామంలో వదిలి వేయాలని ఇక్కడ పిల్లల చేత పనులు చేయిస్తే కేసులుపెట్టి అరెస్ట్ చేస్తామని హెచ్చరించడంతో తీసుకెళ్లిపోతామని, మరలా ఇక్కడకు పనులకు తీసుకురామని తెలిపారు. దానితో అక్కడ ఇటుక బట్టీలలో పనిచేస్తున్న బాలకార్మికులకు విముక్తి లభించింది. ఇక్కడ కూడా మీడియా కవరేజీ అయిపోయింది అని జర్నలిస్టులుగా సర్దుకుపో లేదు. సామాజిక భాద్యత వహిస్తూ ఆ బాలకార్మికులు తమ స్వగ్రామంలో బంధువుల ఇళ్ళల్లో ఉంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఏర్పాటు చేయాలని, అవకాశం లేకపోతే వారిప్రాంతంలో ఆశ్రమాల్లో ఆశ్రయం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని లేబర్ ఆఫీసర్‌ని మేము కోరడం అయినది. దానికి లేబర్ ఆఫీసర్ మీరు చెప్పినట్లు మన ప్రయత్నం మనం చేద్దాం కానీ వీరిని మాత్రం ఇక్కడ ఉండటానికి వీలులేదని ఏ అవకాశం లేకపోతే ఇక్కడే ఉండేలా అవకాశం కల్పిస్తూ కూలీపనులు చేయకుండా ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తామని లేబర్ ఆఫీసర్, పోలీసులు తెలిపారు.

## మంగళగిరి బైపాస్‌లో నలుగురు వలస కార్మికులు మృతి

కొన్నేళ్ల క్రితం మంగళగిరి బైపాస్ ఆత్మకూరు జంక్షన్ కలకత్తా టు చెన్నై జాతీయ రహదారిలో జరిగిన ఓ లారీ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. నెల్లూరు జిల్లా నుండి కోస్తాతీరంలో ఉత్తరాదిజిల్లాలకు వెళుతున్న భారీసైజ్ ఐరన్ పైపులలోడు లారీ క్యాబిన్‌కి బాడీకి మధ్య కొంతగ్యాప్ ఉండటంతో ఆ ఖాళీ ప్రాంతంలో ఓ వలస కార్మికుల కుటుంబం మరో ఇద్దరు మొత్తం ఆరుగురు ఉత్తరాది జిల్లాల గమ్యస్థానం చేరేందుకు ఎక్కారు. వీరు నెల్లూరు జిల్లాలో లారీ ఎక్కారు. మంగళగిరి బైపాస్ ఆత్మకూరు నాలుగు రోడ్ల జంక్షన్‌కి చేరుకోగానే ఏ కారణం చేతనో లారీడ్రైవర్ సడన్‌బ్రేకు వేశాడు. అంతే భారీసైజ్‌లో ఉన్న ఆ

పైపులు క్యాబిన్ వైపు ఖాళీలో కూర్చున్న వలస కార్మికులను ఢీకొని క్యాబిన్‌లోకి చొచ్చుకు పోయినంత ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆ వలస కార్మికులలో నలుగురు అక్కడికక్కడే చనిపోయారు.

ఈ ప్రమాదం రాత్రి పదిన్నర, పదకొండు గంటల మధ్య జరిగింది. విషయం తెలుసుకున్న మంగళగిరి మీడియా జర్నలిస్ట్‌లం అక్కడకుచేరాం. లైట్లుసరిగా లేవు. మసక, మసకచీకటి లారీలోనుండి చిన్న చిన్నగా అరుపులు, మూలుగులు వినిపిస్తున్నాయి. ప్రమాద ప్రాంతానికి అప్పటికీ పోలీసులు రాలేదు. ఇక లారీలో నుండి వినిపిస్తున్న ఆరుపులు, మూలుగులు విన్న స్థానిక జర్నలిస్ట్‌లు చీకట్లో లారీ బాడీలోకి పైకి ఎక్కి చూస్తే ఎవరు ఎక్కడ ఉంది స్పష్టంగా కనిపించడం లేదు. చనిపోయినవారు ఎవరు...? బ్రతికున్నవారు ఎవరు....? అని తేడా తెలియక అందులో ఇరుక్కున్న వారిని ఒకొక్కరిగా మా జర్నలిస్ట్‌లు సామాజిక బాధ్యతవహిస్తూ తీవ్రగాయాల పాలైన వారిని ఆసుపత్రికి తరలించాలి అనే ఉద్దేశ్యంతో లారీ నుండి బయటకు తీస్తున్న క్రమంలో పోలీసులు వచ్చారు. పోలీసులు, జర్నలిస్ట్‌లు కలసి వారిని క్రిందకు దించే క్రమంలో జర్నలిస్ట్‌ల పాత్ర బాధ్యత ఎంత అంకితభావ కలిగి ఉంటుందో తెలియజేసే సందర్భం. లారీలో నుండి వారిని దించే క్రమంలో వారిని భుజాలపై మోసుకుంటూ చేతులతో పట్టుకుని రోడ్డు ప్రక్కకు చేర్చే క్రమంలో జర్నలిస్ట్‌ల చొక్కాలకు భుజాలపై చేతులకు పెద్దఎత్తున రక్తం మరకలు అయ్యి చొక్కాలు మొత్తం రక్తంతో తడిసిముద్దలయ్యాయి. అయినప్పటికీ పోలీసులతో కలసి లారీలోఉన్న వారినందరిని జర్నలిస్ట్‌లు క్రిందికి దించారు.

ఈ క్రమంలో నలుగురు మృతిచెందగా ఇద్దరుతీవ్ర గాయాలతో ప్రాణాపాయస్థితిలో ఉన్నారు. గాయాలు అయిన వారిని పోలీసులు అంబులెన్స్ ఏర్పాటు చేసి ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన నలుగురిలో ఇద్దరు భార్యా భర్తలు, మరో ఇద్దరు 10 ఏళ్ళలోపు బాలిక, బాలుడు ఉన్నారు. గాయాలపాలైన వారిలో లారీక్లీనర్, మరో వలస కార్మికుడు ఉన్నారు. జర్నలిస్ట్‌లు వారిని సమయానికి లారీదించి ఆసుపత్రికి తరలించడంతో ఇద్దరు ప్రాణాలు కాపాడినవారు అయ్యారు. ఇక్కడ కూడా న్యూస్ కవరేజీకి ప్రాధాన్యత ఇవ్వకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించి విలువైన రెండు ప్రాణాలు కాపాడిన జర్నలిస్ట్‌ల సామాజిక బాధ్యత ఎంతటిదో చాటారు.

## ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వ్యక్తి భార్యకు అండగా...

జర్నలిజం అంటేనే సామాజిక బాధ్యత.... సామాజిక స్పృహ ఉన్నవారే ఆ వృత్తికి న్యాయం చేయగలరు అని నిరూపించిన ఘటన. అన్నిరంగాల్లో అవగాహన కలిగి ప్రత్యక్షంగా పరోక్షంగా సమాజసేవ చేసే అరుదైన అవకాశం జర్నలిస్ట్‌ల సొంతం..అని తెలియజేసిన అంశం.

అది 2003వ సంవత్సరం హెచ్.ఐ.వి. విజృంభిస్తున్న వేళ.. గుంటూరుజిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడులో ఓ యువకుడు ఎయిడ్స్ వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై మరణించాడు. చంటి బిడ్డతో ఉన్న అతని భార్యను అత్తింటివారు ఆదరించక వివక్ష చూపి ఇంటి నుండి గెంటేశారు. న్యాయం కోసం పెద్ద మనుషులని ఆశ్రయించింది. పోలీసుల సాయం కోరింది అయినా న్యాయం జరగలేదు. గుంటూరుకి చెందిన అప్పటి ప్రజాశక్తి విలేకరిగా ఉన్న కంభాల ముక్కంటి వద్దకు వెళ్ళింది బాధితురాలు. అప్పుడు ఒక విలేకరిగా వార్తరాసి చేతులెత్తేయకుండా ఆమెకి న్యాయం జరిగేవరకు పెద్దఎత్తున ఉద్యమం చేసి అమె కోసం నిరాహారదీక్ష చేసి వేలాది మందిని కదిలించి ఆమెకు రావాల్సిన వాటాతో పాటు ఎక్కడైతే అగౌరవము జరిగిందో అక్కడే గౌరవించేలా చేసి ప్రభుత్వం నుండి ఇంటిస్థలం, పింఛను ఇప్పించగలిగారు నాటి సీనియర్ జర్నలిస్ట్ ముక్కంటి. జర్నలిస్ట్‌కి ఇంతకంటే లభించిన తృప్తి మరొకటి ఉంటుందా..? జర్నలిస్ట్ నిజాయితీ, సామాజిక స్పృహ ఉంటే చాలు. చిన్న పత్రిక, పెద్దపత్రిక, పెద్దఛానల్ అవ్వాల్సిన అవసరం లేదు. సామాజిక స్పృహ, సామాజిక భాధ్యత లేకుంటే ఎంతపెద్ద హోదా అయినా, ఎంతపెద్ద మీడియా అయినా గొప్పకాదు అని ఆనాడు ముక్కంటి సామాజికబాధ్యతతో వ్యవహరించిన తీరు జర్నలిస్ట్‌ల సామాజిక స్పృహ, సామాజిక భాధ్యతను మరింత పెంచింది.

**గుంటూరులో 72 మంది జర్నలిస్ట్‌లకు ఇళ్ళస్థలాల సాధనకై :**

నేటితరం జర్నలిస్ట్‌లకు గద్దెనెక్కిన ప్రభుత్వాల నుండి జర్నలిస్ట్‌ల ఇళ్ళ స్థలాల సాధనలో శాయశక్తుల ప్రయత్నం చేస్తున్నా సెంట్ స్థలం కూడా లభించని ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కడిగా ముందుండి కొందరి సాయంతో గుంటూరులో 72 మంది జర్నలిస్ట్‌లకు ఇళ్ళస్థలాలు వచ్చే విధంగా చేసిన సీనియర్ జర్నలిస్ట్ కంభాల ముక్కంటి పోరాటం ఎంతో గొప్ప పోరాటం. ఏ యూనియన్ సభ్యుడు కాదు.ఏ సంఘానికి నాయకుడు కాదు. కేవలం నాటి సీనియర్ జర్నలిస్ట్ మాత్రమే అతను. అయినా సరే 2010లో గుంటూరు నగరంలో పనిచేసే చిన్నపత్రిక, పెద్దఛానల్ అనే భేదం లేకుండా నాటి మంత్రి కన్నా లక్ష్మీనారాయణ గారి చొరవతో 72 మంది జర్నలిస్ట్‌లకి ఇంటిస్థలాలు ఇప్పించడం మాములు విషయం కాదు. ముందుగానే స్థలం గుర్తించి, దానిని రక్షించి కంచెవేసి కాపాడి సింగల్ హాండ్‌తో కొంత టీంవర్క్‌తో జర్నలిస్ట్‌ల ఇళ్ళ స్థలాలు సాధించగలిగారు. కొంతమంది మీడియామిత్రులు అడ్డుకునే యత్నం చేసినా ఈర్ష్యపడ్డా సంకల్పం నెరవేరే వరకు పట్టువీడ లేదు. ఇది కదా సామాజిక స్ఫూర్తి. జర్నలిస్ట్‌ల అందరి మేలు కోరకుండా స్వార్థం చూసుకుంటే అతనికి అరుదైన ఆఫర్ ఇచ్చినా త్రోసిపుచ్చి 72 మందికి మేలు చేసిన వ్యక్తి నాటి సీనియర్ జర్నలిస్ట్ ముక్కంటి.

## పసి బిడ్డల పాల పోషణకు ఓ పేదతల్లి వేడుకోలు

అణగారిన వర్గానికి చెందిన ఓ యువతిని ప్రేమపేరుతో మోసం చేసి ముగ్గురు పసి పిల్లలను, భార్యను వదిలేసి పారిపోయాడు ఓ యువకుడు. పసి బిడ్డలకు పాల ఖర్చులు ఎక్కువ కావడంతో వారి పోషణకు ఆమె ఆర్థిక పరిస్థితి చాలటం లేదు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరు మక్కేవారిపేట ఆర్టీవో ఆఫీసు వద్ద రోడ్డు పోరంబోకులో చిన్నగుడిసెలో నివాసం ఉండే ఆ యువతి ఒకరోజు మంగళగిరికి చెందిన జర్నలిస్ట్‌గా నన్ను గుర్తించి ఇంటికి వచ్చి ఆమె పసిబిడ్డల పాలపోషణ గురించి నాకు ఏదైనా సహాయం కల్పించండి అని కోరింది.దానికి నేను ఆ యువతికి 1000/- రూపాయలు ఇచ్చి ఆమెకు ఇంకా నేను ఏ సహాయం చేయగలను అని ఆలోచించి సామాజిక మాధ్యమం అయిన వాట్సాప్ గ్రూప్‌ల్లో "భర్త చేతిలో మోస పోయా... పసి బిడ్డల పాల పోషణ భారంగా ఉంది సాయం చేసి ఆదుకోండి" అనే కథనం రాసి సామాజిక స్పృహ, సామాజిక బాధ్యతగా గుర్తెరిగి నా వద్ద ఉన్న అన్ని వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్ట్ చేశాను.

అదిచూసిన చాలామంది ఆమెకు నగదు సహాయం, బియ్యం, నిత్యావసర వస్తువులు, పసిపిల్లలకు అవసరమైన పాలడబ్బాలు ఇలా ఎవరికి తోచిన సాయం వారు ఆమెకు అందించారు. అలా నేను రాసిన కథనం చూసిన ప్రజలు సామాజిక బాధ్యతతో తనకు అందించిన సాయానికి ఆ యువతి పెద్ద ఎత్తున భావోద్వేగానికి గురై చిన్నసాయం కోరివచ్చిన నాకు నా పసిబిడ్డలకు ఇంతపెద్ద ఎత్తున సాయం అందుతుంది అనుకోలేదు అంటూ నాకు దండం పెట్టి బోరున విలపించింది. నాటి నుండి ఆమెకు ఆరు నెలలపాటు పలురకాలుగా సాయం అందుతూ వచ్చింది. ఒకసంస్థవారు ఆమె ఏదైనా వ్యాపారం చేసుకుని బ్రతికేందుకు నెట్టుడుబండి తయారు చేయించి ఉచితంగా అందించారు. ఇలా సామాజిక స్పృహతో మా జర్నలిస్ట్‌లు రాసే కథనాలు వారికి సామాజిక భద్రత కల్పిస్తున్నాయి. జర్నలిస్ట్‌లు అంటే హోదా అడ్డుపెట్టుకుని అడ్డదారుల్లో సంపాదించేవారు కాదు అని అందరూ అలాంటివారు కాదు అని మా జర్నలిస్ట్‌లు సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత కలిగి సమాజానికి సామాజిక భద్రత కల్పించే అక్షర సైనికులు, కలం యోధుల విధులు ఎంతో ప్రాముఖ్యమైనవి కావాలి అని ప్రజలకు నా మనవి.

## రెండు కిడ్నీలుపాడై 5 ఏళ్లుగా మంచానికి పరిమితమైన మహిళ

మంగళగిరి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఓ వివాహిత మహిళ రెండుకిడ్నీలు చెడిపోయాయి. అప్పటికే రెండుసార్లు గుండెపోటు వచ్చింది. గత 25ఏళ్లుగా ప్రేగుపూతతో బాధపడుతోంది. థైరాయిడ్, షుగర్, బీపీ సమస్యలు ఆమెను వెంటాడుతున్నాయి. కిడ్నీ ఫెయిల్యూర్ వల్ల రెండుసార్లు డయాలసిస్ నిర్వహించారు. దీనితో గతఐదేళ్లుగా మంచానికే పరిమితం అయింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావటంతో దాతల సాయంకోసం ఎదురుచూస్తోంది.

తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎక్కువకావడంతో ఆర్థికభారం శాపంలా మారింది. గుండెసంబంధిత శస్త్రచికిత్స జరిగి అప్పటికే మూడురోజులకు రూ. లక్ష ఖర్చయిందని వడ్డీకితెచ్చి ట్రీట్మెంట్ చేయించామని కుటుంభసభ్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించదని డాక్టర్లు చెప్పటంతో వైద్యానికి అప్పులుచేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆమె ఆవేదన చెందారు. తన ఇద్దరు కుమారులు రోజువారి కూలీలు కావటం వల్ల తనకు ప్రతినెలా మందులకు అయ్యేఖర్చు భరించే పరిస్థితి లేదని ఆమె వాపోయింది. దాతలు స్పందించి ఆర్థికంగా సహకారం అందించే వారికోసం ఆమె ఎదురుచూస్తుంది.

అదే సమయంలో విషయం తెలుసుకున్న మంగళగిరి సీనియర్ జర్నలిస్ట్ బత్తుల సాంబశివరావు (సాంబ) ఆమె ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్య విషయం కనుగొని సామాజిక స్పృహతో, తన సామాజిక బాధ్యతను గుర్తెరిగి ఆమెకు ఏ విధంగా సహాయపడగలను అని ఆలోచించి ఆమె ఆరోగ్య పరిస్థితి వివరిస్తూ, ఆర్థిక పరిస్థితి తెలియజేస్తున్నాడు. అతను పనిచేసిన పత్రిక జిల్లా ఎడిషన్లో “అనారోగ్యం వేదిస్తుంది దాతల సాయంకోసం ఎదురు చూపులు” అంటూ  ఓ కథనం రాసి పత్రికతో పాటు వాట్సాప్ గ్రూప్లో పోస్ట్ చేశాడు.

ఈ నేపథ్యంలో ఆ కథనానికి మొదటిగా స్పందించిన మంగళగిరి జర్నలిస్టులు బాపనపల్లి శ్రీనివాసరావు, బత్తుల సాంబశివరావు, మద్దెల కిషోర్లు తమ మిత్రుల సహకారంతో బాధితురాలికి రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబసభ్యులు జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు.

నాడు ఆ జర్నలిస్ట్ మిత్రుడు రాసినకథనంతో ప్రజలు ఎంతోమంది స్పందించారు. మంగళగిరికి చెందిన సత్య సాయిట్రస్ట్ వారు బాధితురాలి నివాసానికి వెళ్ళి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. భవిష్యత్లో బాధితురాలి వైద్యఖర్చులకు తమవంతు సాయం అందిస్తామని ప్రతినెల నిత్యావసర సరుకుల పంపిణీ కొనసాగిస్తామని ట్రస్ట్ ప్రతినిధి ఉదయలక్ష్మీ పేర్కొన్నారు. నాటి నుండి కొన్ని నెలలపాటు బాధితురాలికి జర్నలిస్ట్ సాంబ రాసిన కథనంద్వారా మంగళగిరి, ఇతర ప్రాంతాల ప్రజలద్వారా ఆమెకు సహాయ, సహకారాలు పలురూపాల్లో అందాయి. ఇది కాదా... జర్నలిస్ట్ల సామాజిక స్పృహ, సామాజికబాధ్యత అందుకే జర్నలిస్ట్లపై కొందరికి ఉండే చెడు అభిప్రాయం సరికాదు అని చెపుతున్నా... జర్నలిస్ట్లందరూ కొందరు ప్రజలు అనుకునే చెడు అభిప్రాయం కలిగిలేరు అలా కొందరు జర్నలిస్ట్లపై ఉన్న చెడు అభిప్రాయంతో జర్నలిస్ట్లందరిని ఒకే గాటన కట్టేయరాదని నా మనవి.

# 13. సమాజంపట్ల సామాజిక భాధ్యత - భద్రత దిశగా జర్నలిస్టులు - (2)




RAJA RATNAM TRUST HOPE FOR ALL

"కరోనా వేళ ఆకలితో అలమటిస్తూ... ఆకలి కేకలు వేసిన నిరుపేదల కడుపులు నింపిన ఓ జర్నలిస్ట్ చేపట్టిన గుప్పెడు బియ్యం పేరిట చైతన్యం, నెలలు తరబడి విధుల్లో మగ్గిపోయిన పోలీసులు సైతం విముక్తికి సాయం కోరగా మరో జర్నలిస్ట్ చూపిన ఔధార్యం"

## తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు అండగా

మంగళగిరి పట్టణపరిధిలో రత్నాలచెరువుకు చెందిన ఇద్దరుచిన్నారులు నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. అభం,శుభం తెలియని ఆ చిన్నారులకు తల్లిదండ్రులు దూరమయ్యారు. భవిష్యత్‌కు అండగా, ఉంటూ కనురెప్పలా కాపాడాల్సిన వారిని మృత్యువు కాటేసింది. ఈ పరిస్థితుల్లో దిక్కులేక ఆదరించేవారులేక ఆ చిన్నారులు బిక్కు, బిక్కుమంటూ కన్నప్రేమ కరువై తల్లడిల్లిపోతున్నారు. పట్టణంలోని రత్నాలచెరువులో పులివర్తి అనిల్ (26) ఓ భవనంలో తాపీపని చేస్తుండగా, ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. అనారోగ్యంతో అతనిభార్య అతనికంటే ముందే మృత్యువాత పడింది. వీరికి నందిని అనే ఏడేళ్ల పాప, భువన శ్రీ అనే ఐదేళ్ల పాప ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ తిరిగిరాని లోకాలకు వెళ్లటంతో ఆ చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. చిన్నారుల అమ్మమ్మ అతికష్టం మీద వారి పోషణ చూసుకుంటోంది.పులివర్తి అనిల్ పనిచేస్తున్న ఇంటి యజమాని అనిల్ మరణానికి మొదట నష్టపరిహారం ఏమీ ఇవ్వలేదు.

అనిల్ మృతదేహం ఇంట్లో ఉండగానే తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులను తీసుకుని వారి అమ్మమ్మ న్యాయంకోసం బిల్డింగ్ యజమానిపై కేసుపెట్టి పోలీసు స్టేషన్ ఎదుట కూర్చుంది. ఆ రోజు పోలీసుస్టేషన్ వద్ద చిన్నారులతో న్యాయంకోసం కూర్చున్న ఆమెను బిల్డింగ్ యజమాని ఏమే ముసలదానా...50 వేలు నష్టపరిహారం ఇస్తాను అన్నాను కదా...నీకు అవి చాలవా...అని చిన్నారుల అమ్మమ్మను దూషిస్తున్న ఘటన స్థానిక జర్నలిస్ట్ బందెల దయాకర్ కళ్ళబడింది. వెంటనే ఆ బిల్డింగ్ యజమానిని వారించి బాధితులను సీఐ రూమ్‌కి తీసుకెళ్లి చిన్నారులకు న్యాయం చేయవలసిందిగా సీఐని కోరడమైనది.

నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు పూర్తి స్థాయి న్యాయం జరగాలి అంటే వేరే మార్గం అనుసరించాలి అని భావించి మరో ఆలోచన చేయకుండా పట్టణంలో ఉన్న దళిత కులసంఘాలకు సమాచారం ఇచ్చి ఆ చిన్నారులకు న్యాయం చేయాలని ఒక జర్నలిస్ట్‌గా దయాకర్ ఆ సంఘాలను కోరారు. అంతే ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, దళిత వర్గాల ఫెడరేషన్, బహుజన పోరాట సమితి వంటి కుల సంఘాలు సీన్ లోకి దిగాయి. మృతిచెందిన కార్మికుడు అనిల్ మృతదేహాన్ని బిల్డింగ్ యజమాని ఇంటి ముందు ఉంచి న్యాయం కావాలి అంటూ పెద్దఎత్తున నిరసన చేశాయి. మన జర్నలిస్ట్ దయాకర్ తీసుకున్న నిర్ణయానికి దెబ్బకు బిల్డింగ్ యజమాని దిగి వచ్చాడు. బాధిత కుటుంబానికి 4లక్షలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకారం అయ్యాడు. స్పాట్‌లో లక్షన్నర చెల్లించి మిగతా రెండున్నర లక్షలకు నోట్లు రాయడం జరిగింది. ఇదికదా మన జర్నలిస్ట్‌ల

సామాజిక బాధ్యత. ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్‌కి కాస్తైనా భరోసా కల్పించిన మన జర్నలిస్ట్‌ల సమయస్ఫూర్తి అదీ మరి.

అక్కడితో ఆగని మన జర్నలిస్ట్‌లు ఆ చిన్నారులకు మనం ఏ విధంగా సాయపడగలం అని ఆలోచించారు. ఈ నేపథ్యంలో పట్టణంలో నాయకులు స్పందించి, వారి పోషణ, చదువుకు అయ్యే ఖర్చులు భరిస్తే చిన్నారుల భవిష్యత్ కు బంగారుబాటలు వేసిన వారవుతారు. పసి హృదయాలకు అండగా నిలిచిన వారవుతారు అని భావించి సామాజిక బాధ్యతతో కథనాలు వేశారు. మన జర్నలిస్ట్‌లు మరి ముఖ్యంగా బత్తుల సాంబశివరావు అనే జర్నలిస్ట్ రాసిన కథనాలకు పట్టణంలో ఎంతోమంది దాతలు స్పందించారు. పలువిధాలా ఆ చిన్నారులకు వేలల్లో నగదు, బియ్యం, నిత్యావసర వస్తువులు కొన్ని నెలలపాటు ప్రజల నుండి కొంతకాలం నిర్విరామంగా అందాయి. మన జర్నలిస్ట్‌లు రాసిన కథనాలు వాట్సాప్ ద్వారా గ్రహించిన సింగపూర్‌లో స్థిరపడ్డ విజయవాడ వాసి దేశంకాని దేశం నుండి ఆ చిన్నారులకు సాయం అందించారు పిల్లలపేరున పది వేలు ఫిక్సిడ్ చేయించారు. ఫిక్సిడ్ డిపాజిట్‌కాక ప్రతి నెల వెయ్యిరూపాయలు వారికి సాయంగా అందిస్తున్నారు. అది మన జర్నలిస్ట్‌ల సామాజిక బాధ్యత, ఇది కదా... కలం యోధుల పోరాట ఫలితం.

## కరోనా కాలంలో గుప్పెడు బియ్యం

అది కరోనా సెకండ్‌వేవ్. మనిషి, మరో మనిషిని ముట్టకూడని పరిస్థితులు. పేద, బిక్కి, ధనిక, దర్పం కలిగి ఉన్నా, కోట్లుకూడబెట్టినవారైనా, ఎవరైనాసరే కరోనా సోకితే ప్రజలు పిట్టల్లా రాలిపోతున్న సమయం. కాలు బయటపెట్టలేని పరిస్థితులు. దానికితోడు లాక్‌డౌన్ అంతే దేశ,దేశాలతోపాటు మన దేశంలోనూ, రాష్ట్రంలో, నగరాల్లో, పల్లెల్లో ప్రజల రక్షణకు ప్రభుత్వం రక్షణచర్యల్లో భాగంగా ప్రజలను కేవలం ఇళ్ళకే పరిమితం అయ్యేలా నిభందనలు. దీనితో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఈ క్రమంలో కూలీ,నాలీ చేసుకునే నిరుపేదలు సాయంకోసం ఎన్నో ఎదురుచూపులు చూశారు. కరోనా కారణంగా కొందరు వ్యాపారులు నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెంచేసి దోపిడీకి మార్గాలు ఏర్పాటు చేసుకున్నారు. ఏ సరుకులు కొందామన్నా ఉన్న ధరకన్నా, రెండు, మూడురెట్లు ఎక్కువ. దీనితో గుప్పెడు బియ్యం కూడా కొని ఆకలి తీర్చుకోలేని పరిస్థితులు నిరుపేదలకు ఎదురయ్యాయి.

అదే సమయంలో మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజు తన గ్రామంలో కరోనా కారణంగా బసవతారక నగర్‌లో నివసిస్తున్న సుమారు 60 కుటుంబాలకు పైగా నిరుపేదలు పెడుతున్న ఆకలికేకలు విన్నాడు.

అంతే ఆలస్యం చేయకుండా ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. ఒక సరుకు రవాణా ఆటో అద్దెకు, దానికి సొంత ఖర్చులతో మైకు ఏర్పాటు చేసి గ్రామంలో "గుప్పెడు బియ్యం" అంటూ బియ్యం సేకరణ కార్యక్రమం చేపట్టాడు. గ్రామంలో కరోనా కారణంగా పనులులేక ఆకలితో అలమటిస్తున్న నిరుపేదల బాధను మైక్ ద్వారా స్వయంగా ప్రచారంచేస్తూ వీధి,వీధి, బజారు, బజారు, సందు గొందులను వదలకుండా "గుప్పెడు బియ్యం" సేకరణ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల నుండి కొన్ని రోజుల వ్యవధిలో 25 క్వింటాళ్ళ బియ్యం సేకరించాడు. 25 క్వింటాళ్ళ బియ్యం సేకరణ వెనుక ఉన్న కష్టం, లక్ష్యం మామూలు విషయం కాదు.

ఒక ప్రక్క బియ్యం సేకరిస్తూనే మూడు, నాలుగు రోజులకు, వారానికి, పదిరోజులకు ఒకసారి బసవతారక నగర్‌లో ఉన్న నిరుపేదలతోపాటు గ్రామంలో మరికొన్ని నిరుపేద కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 10 కేజీలు, 20 కేజీలు వచ్చిన బియ్యం వచ్చినట్లు సుమారు 60కి పైగా కుటుంబాలకు బియ్యం అందించి లాక్‌డౌన్ సమయంలో తన గ్రామంలో నిరుపేదల ఆకలితీర్చిన మన జర్నలిస్ట్ సామాజిక బాధ్యత వెలకట్టలేనిది. బియ్యంతో పాటు గ్రామస్థులు అందించిన ఆర్థిక సహకారంతో ఇదే నిరుపేద కుటుంబాలకు కూరగాయలు సైతం కొన్ని రోజులు అందించడం జరిగింది.

## మీడియా సాయం కోరిన పోలీసులకు విముక్తి

కరుకుతనం, గాంభీర్యం కలిగిన పోలీసులు సైతం మనుషులే అని ఏ మాత్రం యంత్రాలు కాదు, అహంకారులు కారు అని నిరూపించిన ఘటన. వారంతా ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంజిల్లా ఎ.పి.ఎస్.పి బెటాలియన్‌లో పనిచేసే పోలీసు సిబ్బంది. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో అల్లర్లరీత్యా వారంరోజుల బందోబస్తుకి వచ్చారు. ఆ తర్వాత కోవిడ్ కష్టకాలంలో అక్కడే వారం రోజులని విధులకు వచ్చిన 100మంది పోలీసు సిబ్బంది నెలలు తరబడి కుటుంబాలకు దూరంగా ఉన్నారు. తమని రిలీవ్ చేయమని పోలీసు అధికారులను అర్థించారు. పని కాలేదు. ఆ సమయంలో వారుపడ్డ బాధలు వర్ణనాతీతం. ఈ సమయంలో కట్టుబట్టలతో వచ్చామని మీడియా దృష్టికి  తెచ్చారు. అయినా పని కాలేదు. వారికీ ఉన్న పరిచయాలతో స్పందించే మీడియా వ్యక్తి మొబైల్ నంబర్ సేకరించారు. వారి విన్నపం చెప్పారు. అదే మన గుంటూరు జర్నలిస్ట్ కంభాల ముక్కంటికి వారి బాధలు వివరించారు. అంతే సామాజిక భాద్యత వహిస్తూ తాను పనిచేస్తున్న మీడియాలో వారికష్టాలు తెలుపుతూ ఒక్క స్టోరీ వేయడం జరిగింది. స్టోరీ వేసిన అనంతరం అక్కడి బెటాలియన్ కమాండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి స్టోరీ వివరణ ఇవ్వడం జరిగింది. ఇక అంతే 2వరోజు వారు విడుదలయ్యారు. కట్టుబట్టలతో వచ్చినవారు  ఇంటికి వెలుతూ బస్‌లో ఉండి ఆనందంగా వీడియోకాల్ చేసి

మన జర్నలిస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆ క్షణం ఆ మేలు చేసి వారిని విధుల నుండి విముక్తిచేసి వారికి ఆనందం, సంతోషంపంచిన జర్నలిస్ట్ సాయానికి వారి ఆనందానికి అవధులు లేవు. ఇలా ఉంటాయి. సామాజిక బాధ్యతతో స్పృహతో స్పందించి నిస్వార్థంగా మంచి సకల్పంతో చేస్తే ఎన్నో సేవలు జర్నలిస్ట్‌లు చేయవచ్చు అని నిరూపించిన సంఘటన అది. ఇది కాదా కరుకైన, గాంభీర్యం, ఎవరైతే మాకేంటి అనే భావన కలిగిన పోలీసులను సైతం కదిలించిన మన జర్నలిస్ట్‌ల సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత ఇదీ ప్రజలు గ్రహించాలి. కొందరి మనస్సులో ఉన్న విధంగా జర్నలిస్ట్‌లు అంటే సేఫ్‌జోన్‌లో ఉన్న దోపిడీదారులు అనే భావనను ప్రజలు తొలగించాలి. ఎందుకంటే మీరు అనుకున్నట్లు అందరు జర్నలిస్ట్‌లు అలా లేరు అని తెలుసుకోవాలి అని మనవి.

## కిడ్నీలు చెడిపోయి-లివర్ పాడైన సచివాలయ ఉద్యోగి

మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని మంగళగిరి పాత ఎస్‌బిహెచ్ బ్యాంకు వద్ద నివాసముండే ఓ మహిళ ఎర్రబాలెం 3 సచివాలయంలో సర్వేయర్‌గా పని చేస్తోంది. ఆమెకు ఆకస్మాత్తుగా డెంగ్యూ జ్వరం రావటంతో చికిత్స నిమిత్తం తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించారు. డెంగ్యూ తగ్గక ముందే కిడ్నీలు, లివర్ చెడిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. డయాలసిస్ చేస్తూ వైద్యం అందిస్తున్నారు. ఈహెచ్‌ఎస్ లేదు. రైస్‌కార్డు లేదు.సచివాలయ ఉద్యోగుల్ని ప్రభుత్వం అదే సమయంలో పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వ్యులిచ్చింది. దీనితో ఉద్యోగుల ఆరోగ్య స్కీంకు నోచుకోవడంలేదు. ఉన్న రైస్ కార్డుల్ని తిరిగి ఇచ్చేయాలనే అధికారుల ఆదేశాలతో వాటిని తీసుకెళ్లి అప్పగించేశారు. ఆరోగ్యశ్రీ వర్తించే పరిస్థితిలేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో దిగువ మధ్య తరగతికి చెందిన ఆ కుటుంభం తమ కుమార్తె వైద్యఖర్చులు భరించలేని దుస్థితిలో ఉంది. ఇప్పటి వరకు వైద్యానికి మూడున్నర లక్షలు ఖర్చయిందని ఇక భరించే స్థోమత లేదని ఆమెతల్లి వాపోతోంది. దాతలు చేయూతనిస్తే, తమకుమార్తె వైద్యఖర్చులకు దాతలు ముందుకొచ్చి సాయమందించాలని ఆమె వేడుకుంటోంది. 3 నెలల క్రితం ఆమెకు వివాహమైంది. సర్వేయర్‌గా ప్రజలకు సేవలందిస్తూ విధినిర్వహణలో ఉండగా డెంగ్యూ ఓ శాపంలా పరిణమించింది. కిడ్నీలు, లివర్‌పై ప్రభావం చూపి ప్రాణాపాయస్థితిలో ప్రాణంకోసం పోరాడేలా చేసింది. పాలనలో విప్లవాత్మక మార్పు తెస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన రెడ్డి సచివాలయాల వ్యవస్థను ప్రారంభించారు. దిగువ మధ్య తరగతి వర్గాలవారే అత్యధికశాతం ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవలందిస్తు అందరి మన్ననలు అందుకుంటున్నారు. అటువంటి ఓ మధ్య తరగతి ఉద్యోగినికి దాతలు చేయూత నిచ్చి అండగా నిలబడితే ఆ కుటుంబానికి

భరోసా తోటి ఉద్యోగులకు మనో ధైర్యాన్ని ఇచ్చినవారవుతారు అంటూ మన మంగళగిరి సీనియర్ జర్నలిస్ట్ బత్తుల సాంబశివరావు (సాంబ) సామాజిక స్పృహతో రాసిన కథనంతో ఆమెకు కొంత ఆర్థిక సహకారం లభించింది.

మన జర్నలిస్ట్ సాంబ రాసిన కథనం ద్వారా ఆ సచివాలయ ఉద్యోగి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేసిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణా రెడ్డి ఆపదలో ఉన్నవారి కుటుంబాలకు చేయూత నివ్వటంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు. మణిపాల్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎర్రబాలెం-3 సచివాలయ సర్వేయర్‌కి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థికసాయం ప్రకటించారు. లక్ష నగదును మంగళగిరి తహసీల్దార్ జీవి రామ్ ప్రసాద్ చేతులమీదగా సర్వేయర్ తల్లిదండ్రులకు అందజేయించారు. అలాగే రెవెన్యూ ఉద్యోగులు తమవంతు సాయంగా వసూలు చేసిన మరో రూ లక్ష నగదును కూడా రామ్ ప్రసాద్ వారికి అందజేశారు. ఇలా భాదితులు ఎవరైనా విషయం కనుగొని ఆర్థికంగా మన జర్నలిస్ట్‌లు సహాయం చేయలేకపోయినా బాధితుల తరపున సామాజిక స్పృహతో రాసిన కథనాలకు స్పందన వచ్చి భాధితులకు అందే సహాయ, సహకారాలు చూసి జీతాలులేని జర్నలిస్ట్‌ల జీవితాలకు మిగిలే ఆనందాలు ఇవి కాదా...చివరికి మిగిలి పోయే సంతోషాలు ఇవి కాదా...ఇది మన వృత్తిపట్ల మనకు ఉన్న డెడికేషన్. సమాజంలో అందరు బాగండాలి అని మన జర్నలిస్ట్‌లు సామాజిక స్పృహ, సామాజిక భాధ్యత వహిస్తున్న తీరును జర్నలిజాన్ని హేళన చేయకుండా, జర్నలిస్ట్‌లను కించపరచకుండా ఉంటే చాలు.

## నులకపేట అటవీ ప్రాంతం వాసులకు రక్షణ

గుంటూరు జిల్లా, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలో భాగమైన నులకపేట ప్రాంతం చాలా వరకు కొండప్రాంతంలో ఉంటుంది. ఈ కొండ ప్రాంతంలో సుమారు ఆరు,ఏడు కాలనీలు ఏర్పడి ఉన్నాయి. ఈ కాలనీలు అన్నీ కొండల మధ్య ఉండటంతో ఆ ప్రాంతాన్ని నులకపేట అటవీప్రాంతంగా పిలుస్తారు. ఈ కాలనీలకు మౌలిక సదుపాయాలు చాలాతక్కువ. కొన్ని ఏరియాలకి అప్పట్లో కరెంట్ సదుపాయం లేదు. అయితే కొన్నేళ్ల క్రితం ఇక్కడ ఏర్పడిన కాలనీల ప్రజలకు పెద్ద ఎత్తున ఓ సమస్య ఉండేది. రాత్రి అయితే చాలు అక్కడ నివసించే ప్రజల ఇళ్ళలోకి తేళ్లు, మండ్ర గబ్బలు, పాములు, కొండ చిలువలు, అడవిపందుల తాకిడి బాగాఎక్కువగా ఉండేది. ఇళ్లలోకి చొరబడి స్థానిక ప్రజలను అవి భయాందోళనకు గురి చేసేవి. ఆదమరిచి ఉంటే విషసర్పాల, విషపురుగుల కాటు తప్పేది కాదు. అలాగే అడవిపందుల దాడికి ఇక్కడ ప్రజలు గురయ్యేవారు. ఇలా విషసర్పాలు, కొండచిలువలతో సహవాసం చేయాల్సి ఉండేది. ఇళ్ళల్లో కొద్దిగా మధుగు ఉంటేచాలు

అక్కడ పాములు, కొండచిలువలు స్థావరం ఏర్పాటు చేసుకునేవి. ఈ నేపద్యంలో రోజూ ఏదో ఒకఇంటిలో పాములు, కొండచిలువలను చంపుతూ ఉండేవారు. అప్పుడప్పుడు అడవి పందుల దాడి అనే వార్తలు వస్తూ ఉండేవి. అధికారులకు ఎంత మొరపెట్టుకున్నా రక్షణ చర్యలు తీసుకునేవారు కాదు. చివరకు స్థానికులు మీడియాని ఆశ్రయించారు.

ఈ నేపథ్యంలో రక్షణకల్పించాలి అంటూ పత్రికలు కథనాలు వేసేవి. అయినా అధికారుల్లో స్పందన కరువు. ఇదే సమయంలో నాటి టీవీ జర్నలిస్ట్ సతీష్, సీనియర్ జర్నలిస్ట్ దయాకర్ నాడు కెమెరామెన్‌గా ఓ ప్రత్యేక స్టోరీ రూపొందించి టీవీలో ఓ కథనం వేశారు. దానికి స్పందించిన అటవీశాఖ అధికారులు నులకపేట అటవీప్రాంత ప్రజలరక్షణ కోసం మూడు, నాలుగు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇళ్ళల్లో సోదాలు చేసి పాములు, కొండ చిలువలను గుర్తించి వాటిని బంధించారు. మూడు కొండచిలువలు, కొన్ని పాములు, ఒక అడవిపందిని ఆధీనంలోకి తీసుకున్నారు. కరెంట్ లేని కాలనీలకు విద్యుత్ అవసరం తెలియజేస్తూ విద్యుత్ ఏర్పాటు సౌకర్యం కల్పించాలని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీనితో అక్కడ విద్యుత్ సౌకర్యం లేని కాలనీలకు ఆ శాఖ అధికారులు విద్యుత్‌సౌకర్యం కల్పించారు. అలాగే ఇళ్లలోకి చొరబడిన పాములు, కొండచిలువలను చంపరాదని వాటి నుండి రక్షణ కోరుతూ తమకు సమాచారం ఇస్తే సమస్య పరిష్కరిస్తామని స్థానికులకు అటవీశాఖ అధికారులు మొబైల్ నంబర్స్ ఇచ్చారు. నాటి నుండి అక్కడ ప్రజలు అటవీశాఖ అధికారుల ద్వారా రక్షణ పొందుతున్నారు. లేదంటే గతంలో నిద్రలేని రాత్రులు గడిపిన నులకపేట అటవీ ప్రాంత ప్రజలు ప్రస్తుతం ప్రశాంతంగా జీవిస్తున్నారు. ఇది కాదా...మన జర్నలిస్ట్‌లు నులకపేట అటవీ ప్రాంత ప్రజలకు కల్పించిన సామాజిక భద్రత అందుకే ప్రతి నలుగురిలో ఒక జర్నలిస్ట్ ఉండాలి అనేది.

# 14. సమాజంపట్ల సామాజిక భాధ్యత - భద్రత దిశగా జర్నలిస్టులు - (3)




"జర్నలిస్టులే తాము చేయగలిగిన పనులు సామాజిక స్పృహతో భాధ్యత వహించిన/వహిస్తున్న కొన్ని చిన్న చిన్న పనులు బాధ్యతగా నెరవేరుస్తున్న విధానం"

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

## చేయి విరిగిన 8 నెలల చిన్నారికి చేయి ఆపరేషన్

గుంటూరు జిల్లా, మంగళగిరి– తాడేపల్లి నగరపాలకసంస్థ పరిధి నవులూరుకు చెందిన కస్తూరి మాధవి భర్త తనను, తన ఇద్దరి చిన్నారి కవల పిల్లలను, మరో బాబుని వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. భర్త వదిలేసినా మాధవి మొకవోని ధైర్యంతో... దాతల సహకారంతో గతంలో పుట్టిన తన పెద్ద కుమారుడితోపాటు ఏడాది క్రితం జన్మించిన ఇద్దరు కవల పిల్లలను అల్లారు ముద్దుగా పెంచుకుంటోంది. ఈ క్రమంలో కవల చిన్నారుల్లో ఒకరు రాత్రివేళ ప్రమాదవశాత్తూ మంచంపై నుంచి జారిపడిపోయాడు. గుక్కపట్టి ఏడుస్తోండటంతో గమనించిన తల్లి మాధవి కిందపడిన చిన్నారిని పైకిలేపింది. అయితే అప్పటికే ఆ చిన్నారికి చేయి విరిగింది. తన చేతిలో ఉన్న కొద్దిపాటినగదుతో ఓ ప్రైవేటు వైద్యశాలలో కట్టు వేయించింది. రోజులు గడచినా నొప్పి తగ్గక చిన్నారి మరింత బాధపడుతుండటంతో మళ్లీ వైద్యశాలకు తీసుకువెళ్లి ఎక్సరే తీయించగా చేయి లోపల ఎముక విరిగిపోయిందని, కట్టుకట్టిన ఉపయోగం ఉండదని, ఆపరేషన్ చేయాలని వైద్యులు తేల్చిచెప్పారు. ఇందుకు రూ. 20వేల వరకూ ఖర్చు అవుతాయని వైద్యులు తెలిపారు. అప్పటికే పిల్లల పోషణకు ఎన్నో ఇబ్బందులు పడుతూ దాతల సహకారంతో నెట్టుకొస్తున్న తరుణంలో కవలల్లో ఒకచిన్నారి విరిగిన చేయికి రూ.20వేలు చెల్లించి ఆపరేషన్ చేయించే ఆర్థికస్థోమత తనవద్దలేదని వాపోతోంది. కావున దయగల దాతలు విరిగిన నా చిన్నారి కుమారుని చేతి ఆపరేషన్ నిమిత్తం ఆర్థిక సాయం అందజేయాలని వేడుకొంటోంది.

ఇదే విషయం మంగళగిరికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజుకి తెలిసింది వెంటనే బాధితురాలికి ఫోన్‌చేసి అన్ని వివరాలు కనుగొని “విరిగిన చిన్నారి చేతికి ఆపరేషన్ చేయించి ఆదుకోరూ...ఆపన్నుల సహాయం కోసం ఓ కన్నతల్లి ఎదురుచూపు” అంటూ వాట్సాప్ గ్రూపుల్లో ఓ కథనం రాసి పోస్ట్ చేయడం జరిగింది. అలా మన సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజు రాసిన కథనానికి గంటల వ్యవధిలోనే పట్టణానికి చెందిన ఒకనాటి జర్నలిస్ట్, ప్రస్తుత ఆడిటర్ దామర్ల వెంకట నరసింహం చిన్నారి చేతికి ఆపరేషన్ చేయించేందుకు ముందుకు వచ్చారు. ఇటు భాదితురాలుతో, అటు డాక్టర్‌తో మాట్లాడి మరుసటిరోజు చిన్నారి ఆపరేషన్‌కి అవసరమైన 20 వేలు నరసింహా ఒక్కరే ఏర్పాటు చేశారు. దామర్ల నరసింహదంపతులు మన సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజు చిన్నారికి దగ్గర ఉండి ఏ ఇబ్బందులు లేకుండా బాబు చేతికి ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ అనంతరం ఖర్చులకు కొంతనగదు ఆ చిన్నారి కన్నతల్లికి అందించి బాబుచేయి సాధారణ స్థితికి వచ్చే వరకు అండగా ఉంటామని ఆ పేదరాలు అయిన తల్లికి భరోసా ఇచ్చారు. లేదంటే చేయివిరిగి

భరించలేని నొప్పితో అమ్మా...నొప్పి అని చెప్పలేని ఆ చిన్నారి భాద, చేయినొప్పితో కన్నబిడ్డ అల్లాడిపోతుంటే ఏమీ చేయలేక నిస్సాహాయ స్థితిలో ఉన్న దాతల సాయం కోరిన ఇటువంటి తల్లుల మానసిక సంఘర్షణ అర్ధం చేసుకోగలిగిన మనసున్న మా రాజులు మన జర్నలిస్ట్‌లు అయితే, ఏ బంధం లేని దాతలు ఇలా వచ్చి, అలా సాయం అందించిన దాతల్లో ఇటువంటి భాదితులు దైవాన్ని, దేవుళ్లను, దేవతలను చూస్తున్నారు. ఇది కదా... ఎంతైనా మన జర్నలిస్ట్‌ల సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత.

## "మన పేట-మన గ్రామం" గ్రామ సమస్యల పరిష్కార వేదిక

ఒక సీనియర్ జర్నలిస్ట్‌గా మంగళగిరికి చెందిన నేను మా గ్రామంలో సమస్యల పరిష్కార దిశగా ఏర్పాటు చేసిన వాట్సాఫ్ గ్రూప్ "మన పేట–మన గ్రామం" గ్రూప్‌లో గ్రామ ప్రజలను సభ్యులుగా చేర్చి వారి ద్వారా గ్రామసమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని సమస్యను వివరిస్తూ పూర్తి సమాచారంతో స్థానిక అధికారులు, పాలకులు దృష్టికి తీసుకెళుతూ "మన పేట–మన గ్రామం" సహకారంతో సమస్యల పరిష్కారం చేస్తున్న గ్రూప్ "మన పేట–మన గ్రామం"గా ఏర్పాటు చేయడం జరిగింది.

గ్రామస్థాయిలో ఆయాగ్రామాల్లో ప్రజలకు ఎన్నో సమస్యలు ఉంటాయి. సమస్యలు ఎవరి దృష్టికి తీసుకెళితే పరిష్కారం అవుతాయో గ్రామప్రజలకు పెద్దగా అవగాహన ఉండదు. ఈ నేపధ్యంలో సమస్యల పరిష్కారం ఎవరి దృష్టికి తీసుకెళితే పరిష్కారం అవుతాయో అవగాహన కలిగిన జర్నలిస్ట్‌గా సామాజిక బాధ్యత వహిస్తూ గ్రామంలో అక్కడ ఈ సమస్య, ఇక్కడ ఆ సమస్య అంటూ ప్రత్యేక కథనాలు వాట్సాప్‌లో రాసి అధికారులకు పోస్ట్ చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఒకవేళ అధికారులు స్పందించని నేపథ్యంలో తోటి జర్నలిస్ట్‌ల సహకారంతో సమస్యను న్యూస్ పేపర్‌లో వార్తగా వేయడం ద్వారా అధికారులు సాధ్యమైన మేరకు సమస్యలు పరిష్కరిస్తున్నారు.

"మనపేట–మనగ్రామం" గ్రూప్ స్థాపించిన అతికొద్ది కాలంలోనే గ్రామంలో సమస్యలు గ్రూప్ దృష్టికి వచ్చి చాలా వరకు పరిష్కారం అయ్యాయి. ఇప్పటికి సమస్యలు గ్రూప్ దృష్టికి వెల్లువలా వస్తూనే ఉన్నాయి. ఎప్పటి సమస్య అప్పుడు అధికారుల దృష్టికి వెళుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొంత ఆలస్యం ఆయినా సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఇది ఒకరకమైన సామాజిక బాధ్యత కాదా.... వినూత్నమైన ఆలోచన కాదా....ఇలా సమస్యల పరిష్కారవేదిక ఏర్పాటు చేయడం కూడా మన జర్నలిస్ట్‌లకే సాధ్యం.

ఇదే రకమైన స్పూర్తితో యర్రబాలెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజు తన గ్రామంలోని పారిశ్రామికవాడలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, తాగునీటి

సమస్యలను సామాజిక మాధ్యమాల ద్వారా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి గ్రామస్థుల సమస్యను పరిష్కరించడం జరిగింది. నాగరాజు వహించిన సామాజిక బాధ్యత ద్వారా ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో పారిశ్రామిక వాడలో లక్షల రూపాయల అభివృద్ధి పనులు అక్కడ జరిగాయి. మన జర్నలిస్ట్‌లు సామాజిక స్పృహ, సామాజిక భాధ్యత వహిస్తే ఎటువంటి సమస్య అయినా ఇట్టే పరిష్కారం అవుతుంది. ఇది కాదా సమాజంలో జర్నలిస్ట్‌ల పాత్ర. అందుకే జర్నలిస్ట్‌లను వేరే భావంతో చూడవద్దు అని తెలియజేస్తున్నాను.

## ఎర్రబాలెం పారిశ్రామికవాడ అగ్నిప్రమాదం

గుంటూరు జిల్లా, అమరావతి రాజధాని గ్రామం, యర్రబాలెం పారిశ్రామికవాడలో జరిగిన అగ్ని ప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాల సహాయం నిమిత్తం సొంత ఖర్చులతో ఆటో ఏర్పాటు చేసి గ్రామంలో దాతల నుంచి రూ. 40 వేల నగదు, టన్ను బియ్యం, దుస్తులతో పాటు మరికొందరి దాతల సహకారంతో నిత్యావసర సరుకులను సేకరించి తహశీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ చేతుల మీదుగా అగ్నిప్రమాదం బాధితులకు అందజేయడం జరిగింది. ఇది కూడా మన సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజు చేపట్టి ప్రభుత్వ సాయం కన్నా ముందే వారికి అండగా ఉండి చేసిన సేవ మన జర్నలిస్ట్‌ల సామాజిక బాధ్యత ఎంతటిదో తెలియజేస్తుంది.

## ఆఖరి మజిలీల అభివృద్ధి కమిటీ

ఆఖరి మజిలీల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి దాతల సహకారంతో సుమారు రూ. 2 లక్షలతో ఏసీ మార్చురీ బాక్స్, అంతిమ యాత్ర వాహనాన్ని కొనుగోలు చేసి గ్రామంలోని మృతుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచడం జరిగింది. ఇదికూడా మన సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజు సామాజిక స్పృహ, సామాజిక భాధ్యతతో గ్రామంలో మృతుల సౌకర్యార్థం ఇబ్బందులు ఎదుర్కొకుండా ఉచిత సేవలుగా కేవలం ట్రావెలింగ్ ఛార్జీలు మాత్రమే కమిటీకి చెల్లించి సేవలు పొందే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామస్థులు ఈ ఆఖరి మజిలీల కమిటీ అందిస్తున్న ఉచిత సేవలు చక్కగా వినియోగించుకుంటున్నారు.

## ఆఖరి మజిలీల కమిటీ నిర్వహణలో చలివేంద్రం

ప్రతి వేసవి సీజన్ అన్ని రోజులు ఆఖరి మజిలీల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎర్రబాలెం గ్రామంలోని శివాలయం ఎదుట చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు దాతల సహకారంతో వేసవికాలం అంతా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టి ఆ మార్గంలో ప్రయాణించే బాటసారుల దాహార్తిని చల్లటి మజ్జిగ అందించడం ద్వారా తీరుస్తుంది. ఈ కార్యక్రమం కూడా మన జర్నలిస్ట్ నాయుడు నాగరాజు నిర్వహిస్తున్నారు.

## కరోనా వేళ మంగళగిరి ఐ.బి.ఎన్. ప్రెస్ క్లబ్ సేవలు

కరోనా సమయంలో ప్రజలకు ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా సేవలు అందించిన మన జర్నలిస్ట్‌ల జీవన విధానం చాలా ప్రశ్నార్థకంగా మారింది. సమాజాసేవలో ఉన్న జర్నలిస్ట్‌ల జీవన విధానం అట్టడుగు స్థితికి చేరింది. అసలే జీతాలు లేని కొలువు. కరోనా రోజుల్లో పూటగడవటం కష్టం అయిపోయింది. ఈ పరిస్థితుల్లో నాకు తెలిసిన ఓ జర్నలిస్ట్ రోజు గడవటం కోసం ఇంటిలో చిత్తుకాగితాలు, పనికిరాని ప్లాస్టిక్ అంతా పోగుచేసి అమ్మితే 600 రూపాయలు వచ్చాయి. వాటితో తనకుటుంబం ఆకలి తీర్చుకోవచ్చు అని సంబరపడిపోయాడు. మరి అంత కష్టం వచ్చింది ఆ రోజు. విషయం తెలుసుకున్న మంగళగిరి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.వెంకటేశ్వర రెడ్డి, బి. దయాకర్ పలుసేవా సంస్థలతో సంప్రదింపులు జరిపి మంగళగిరి జర్నలిస్ట్‌లకు అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో కరోనా కాలంలో కొన్ని రోజుల పాటు స్థానిక రైతుల నుండి కూరగాయలు, ఎన్నారై ఆసుపత్రి,కె.ఎల్ యూనివర్సిటీ, పలుసేవా సంస్థలు నుండి ఊహించని విధంగా 25 కేజీల బియ్యం బస్తాలు, పుష్కలంగా నిత్యావసర వస్తువులు, స్థానిక ఓ డాబా హోటల్ అందించిన కమ్మని ఆహారం ఉచితంగా మన మంగళగిరి జర్నలిస్ట్‌లకు అందించారు. ఈ సమయంలో మన మంగళగిరి జర్నలిస్ట్‌ల ఐక్యత, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల సామాజికభాధ్యత వెలకట్టలేనిదిగా మనకు అండగా నిలిచింది. అలాగే కరోనా కాలంలో జర్నలిస్ట్‌లకే గాక పట్టణంలో నిరుపేదలకు మంగళగిరి ఐ.బి.ఎన్, ప్రెస్ క్లబ్ విశిష్ట సేవలు అందించడం జరిగింది.

# 15. సమాజసేవలో మానవతా విలువలు చాటిన సీనియర్ జర్నలిస్ట్



"అతను ఒకే ఒక వ్యక్తి,అంతకు మించి అతి పెద్దశక్తి, ఎదుట వ్యక్తి కష్టాల్లో ఉన్నానయ్యా అని అతన్ని ఆశ్రయిస్తే చాలు వారి కష్టాలు దాదాపు తీరిపోయినట్లే, అంతే కాదు తన కళ్ళెదుట జరిగే ఏ అన్యాయాలను ప్రశ్నించకుండా దారి తప్పించి వెళ్ళే మనిషి కాదు, అబ్బా ఈ రోజుల్లోనూ ఇంతటి మనసున్న మా రాజులు ఉన్నారా...! అనిపించే ఓ గొప్ప సీనియర్ జర్నలిస్ట్ కోసం....చదవండి"



**జ**ర్నలిజం అంటేనే సామాజిక స్పృహ, సామాజిక భద్రత. అలాగే సమస్యలపై అవగాహన, వార్తరాసే విధానంలో భాషపై పట్టు, వార్తను చక్కగా డ్రాఫ్టింగ్ చేయగలనేర్పు కలిగి ఉన్న జర్నలిస్ట్‌లు మీడియారంగంలో రాణించేందుకు ప్రధాన అర్హతలు. ఈ క్రమంలో సామాజిక స్పృహ, భాద్యత, భద్రత కల్పిస్తూ మన జర్నలిస్ట్‌లు సమాజానికి సేవ చేస్తూ సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు వెలికితీస్తూ, సమాజంలో వివక్షకు గురవుతున్న అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ ప్రజాస్వామ్య విలువలు కాపాడుతున్న మన జర్నలిస్ట్‌ల తీరు వారిని మానవవాదులుగా ఒప్పుకోక తప్పదు.

ఈ క్రమంలో మన జర్నలిస్ట్‌లు అందరికన్నా కొంచెం భిన్నంగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఒక సీనియర్ జర్నలిస్ట్‌గా భాదితులకు అవసరమైన సమయాల్లో సమాజ సేవలో ఉండే వ్యక్తి  కంభాల ముక్కంటి. ఈ సీనియర్ జర్నలిస్ట్ గురించి ఎందుకు ప్రత్యేకంగా చెప్పుకోవాలి అంటే అందరి జర్నలిస్ట్‌ల లాగా బాధిత, పీడితుల తరపున కధనాలు రాసి వదిలి వేయకుండా వారి పక్షాన నిలిచి అవసరమైతే దీక్షలు, నిరసనలు చేసి, అధికారులు, పాలకుల దృష్టికి వారి సమస్య తీసుకెళ్ళి వారికి న్యాయం జరిగేవరకు పట్టువదలని విక్రమార్కుడులా పోరాటం చేసి భాదితులకు లబ్ధిచేకూరేలా వ్యవహరించే వ్యక్తి ఈ కంభాల ముక్కంటి. సమస్య ఇది అని తెలిస్తేచాలు ఎటువంటి ఫలితం, స్వప్రయోజనం చూసుకోకుండా సాయపడటం ఈ సీనియర్ జర్నలిస్ట్ రక్తంలోనే సాయం అనే పదం ఇమిడి ఉంది. ఒకటికాదు, రెండుకాదు జర్నలిజంలో అడుగుపెట్టిన నాటి నుండి ఈరోజు వరకు భాదితులకు అండగా నిలిచిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ సీనియర్ జర్నలిస్ట్ మన జర్నలిస్ట్‌లకు ఎంతో ఆదర్శంగా ఉన్నారు. కొంతమంది నకిలీ జర్నలిస్ట్‌ల వల్ల ఆదుగంటిపోతున్న జర్నలిజం విలువలు ఇప్పటికీ ఎక్కడో ఒకచోట మిణుకు, మిణుకు మంటున్నాయి అంటే ముక్కంటి వంటి జర్నలిస్ట్‌ల ద్వారానే మనకు సమాజంలో గౌరవ, మర్యాదలు ఇంకా దక్కుతున్నాయి. ఈ సందర్భంలో మన ముక్కంటి కొందరు భాదితులు, నిరుపేదలకు అండగా నిలిచిన కొన్ని సంఘటనలు మీ ముందుకు ఇలాంటి ఓ వ్యక్తి గురించి మన జర్నలిస్ట్ లోకం, జర్నలిస్ట్‌లపై మంచి అభిప్రాయం లేని ప్రజానీకం తప్పక తెలుసుకోవాల్సిన అవసరం ఉందని నా అభిప్రాయం.

## ఒక సీనియర్ జర్నలిస్ట్ ప్రాణానికి భరోసా

ఒక సీనియర్ జర్నలిస్ట్ ప్రాణం మీదకు వచ్చింది. అతనికి  లివర్ మార్పిడి చేయాలి 30 లక్షలు అవసరం ఏర్పడింది. తప్పక డబ్బులు కావాలి. మన జర్నలిస్ట్‌ల ఆర్థిక పరిస్థితి

ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయితే నాడు అది ప్రభుత్వం మారుతున్న కాలం. అటువంటి సమయంలో మన ముక్కంటి, మరో జర్నలిస్ట్ మిత్రుడు చొరవ చూపితే అతని ప్రాణం నిలిచింది. సామాజిక స్పృహ, భాద్యత వహిస్తూ ఇద్దరు జర్నలిస్ట్‌లు ఒకే ఒక కథనం రాసారు..అలా ఆ కధనానికి కొందరు స్పందించారు.. ప్రభుత్వం 15 లక్షలు ప్రకటించి బాధిత జర్నలిస్ట్ ఇంటికి వెళ్ళి అప్పటి సమాచార, పౌర సంబంధాల శాఖామంత్రి పేర్ని నాని 15 లక్షల సాయం అందించడం జరిగింది. భాదిత జర్నలిస్ట్ సతీమణి తన లివర్‌ను దానం చేసారు. ఒకే ఒక్క మాట, వార్త సాయం అతనికి పునర్జన్మ ప్రాప్తి చెందింది. అందుకే జర్నలిస్ట్ సేవలకు గల విలువ వారి సేవలను నిశితంగా గమనిస్తే గానీ మనకు అర్థం కాదు. దేవుడులాంటి ఇంలాంటి కొందరు జర్నలిస్టులు కూడా ఉన్నారని తెలుసుకొని మనం అందరిని దొంగలు అనేస్తున్నాం ఇది కూడా గమనించాలి.

## రోడ్డున పడ్డ కెమెరామెన్ కుటుంబానికి అండగా

విజయవాడలో పదేళ్ల నుండి లోకల్ ఛానల్‌లో పని చేస్తున్న కెమెరామెన్ సురేష్ అనారోగ్యంతో మరణించాడు. ఆయనకు భార్య, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు. సొంత ఇల్లు లేదు. భార్య మల్లీశ్వరి దివ్యంగురాలు, ఆమె ఎంబీఏ చదువుకున్నా చేసేందుకు ఉద్యోగంలేక కుటుంబపోషణ భారంగా మారింది. మీడియాలో పనిచేసిన సురేశ్ కుటుంబానికి ప్రభుత్వం నుండి ఏమైనా సహాయం అందుతుందేమోనని జర్నలిస్ట్‌ల ద్వారా 8 నెలలు ప్రయత్నం చేసింది. ఎలాంటి ఫలితం రాలేదు. ఇంతలోనే కరోనా లాక్‌డౌన్‌తో జీవనం కష్టతరమైంది. చివరి ప్రయత్నంగా ఆమె సీనియర్ జర్నలిస్ట్ కంభాల ముక్కంటికి ఆమె దీనస్థితి వివరించింది. స్పందించిన ముక్కంటి వెనువెంటనే భాదితురాలు తరపున వినతిపత్రం తయారు చేసారు. అక్కడ నుండి బాధితురాలిని నేరుగా నాటి సమాచారశాఖమంత్రి గారి వద్దకు తీసుకెళ్లి జర్నలిస్ట్ సురేష్ మరణం తర్వాత కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలు వివరించారు.

దానికి క్షణం ఆలస్యం చేయకుండా స్పందించిన మంత్రి పేర్నినాని లక్ష నుండి 2 లక్షలు సహాయం వచ్చేలా చేస్తానన్నారు. అంతేకాదు ఎం.బి.ఏ. సురేష్ భార్య మల్లీశ్వరికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం కల్పించేలా కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. ఇక అంతే, సరిగ్గా నెల తిరిగేలోగా మంత్రి కార్యాలయం నుండి మల్లీశ్వరికి ఫోన్ చేసి 2 లక్షల చెక్ వచ్చింది. మీ ఇంటికి వచ్చి ఇస్తామన్నారు మంత్రి సిబ్బంది. చెప్పినట్లే మంత్రి కార్యాలయం

నుండి వచ్చిన ప్రతినిధులు నాడు మల్లీశ్వరికి సాయం అందచేశారు. ఇంటికొచ్చి చెక్ ఇవ్వడంతో సాయం పొందిన కెమెరా జర్నలిస్ట్ సురేష్ భార్య మంత్రిగారికి రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలియజేసింది. కనీసం రెండోసారి ఫాలోఅప్ చేయకుండానే మంత్రిగారు సాయం చేయడం ఎంతో గొప్ప విషయం.

**ఓ ఆంగ్ల పత్రిక జర్నలిస్ట్ భార్య అనారోగ్య పరిస్థితి అర్థం చేసుకుని**

విజయవాడకు చెందిన ఒక సీనియర్ జర్నలిస్ట్ పేరుగాంచిన ఆంగ్ల పత్రిక అతని అర్ధాంగికి ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రిలో బెడ్ పై ఉంది. ఆమె వైద్యానికి లక్షలు కావాలని డాక్టర్ చెప్పారు. వారు ఎవరిని అడగలేరు. విషయం సోషల్ మీడియాలో బాగా ట్రోల్ అయింది. షేర్లు, లైక్లు ఎన్నో వచ్చాయి. దానికి స్పందించిన ఆ మాట సహాయకారి అయిన మన ముక్కంటి ఏమిచేయాలో అదే చేసాడు. అంతే అరగంటలో 8 లక్షల తోడ్పాటు ప్రభుత్వం కల్పించింది. ఇదంతా ఒక పట్టుదల, సంకల్పం సాయం చేయాలనే తలంపు వల్లనే సాధ్యం అయ్యాయి.

**వెన్ను విరిగిన భర్తను వీపుపై మోస్తున్న మహిళకు అండగా**



ఒకే ఒక క్షణం...ఆ కుటుంబాన్ని విధివంచించింది. ఆ దంపతుల అన్యోన్య దాంపత్యంకి షడన్ బ్రేక్‌లుపడ్డాయి. శివపార్వతుల్లా ఆదర్శ దంపతుల్లా సాగుతున్న వారి జీవితం ఒక్కసారిగా కుప్పకూలింది. భర్త వెన్ను విరిగి కదల్లేకున్నా తన స్వార్థం చూసుకోలేదు ఆ సతి,పతియే నా ప్రత్యక్ష దైవం అంటూ వెన్నుకుదన్నుగా నిలుస్తూ మోయలేని భారాన్ని మోస్తున్న ఓ అర్ధాంగి ధీనగాధ ఇది. బంధం ముందు బరువు పెద్ద లెక్కేమి కాదంటూ ఓ మహిళ తన భర్తను వీపుపై ఎక్కించుకుని మోస్తోంది. ఇంతకీ ఎవరు ఆవిడ, అతన్ని ఎందుకు మోస్తోంది. వారికి కావాల్సింది ఏమిటో తెలియాలంటే మీరు ఈ స్టోరి పూర్తిగా చదవాల్సిందే. భర్తను భారం అనుకోకుండా వీపుపై మోస్తున్న ఆమె పేరు కుమారి, ఆమె వీపుమీద ఎక్కింది ఆమె భర్త శివప్రసాద్. వీరు విజయవాడ నగరంలో చిట్టినగర్ సమీపంలోని కలరా హాస్పటల్ వద్ద నివసిస్తున్నారు. కొన్నేళ్ళక్రితం ఎలక్ట్రికల్ షాపులో పనిచేసే శివప్రసాద్, బైండింగ్ షాపులో పనిచేసే కుమారిల మధ్య పరిచయం ప్రేమగా మారింది. వారి మనసులు కలిసాయి. కులాలు వేరైనా, ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో 2012 లో దంపతులయ్యారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు కలిగారు. ఇరువురి సంపాదనతో హాయిగా వారి సంసార జీవితం సాగుతుంది. ఉన్నట్లుండి వీరి బంధాన్ని చూసి ఏ శక్తికి కన్ను కుట్టిందో ఏమో ఐదేళ్ల క్రితం ఒకరోజు

చిట్టినగర్ కొండపై ఉండే  అత్తగారి ఇంటి వద్దకు వెళ్లాడు శివప్రసాద్. అక్కడ భవనంపై పిట్టగోడపై కూర్చుని ఉండగా అకస్మాత్తుగా గోడ కూలి క్రింద పడిపోయాడు శివప్రసాద్.

ఇంకేముంది వెన్నుపూస విరిగింది. ఇక కుప్ప కూలిపోయాడు. ఇక అంతే అప్పటి నుండి జీవచ్ఛవంలాగా మారాడు శివప్రసాద్. ఒక్క క్షణంలో సీను మారిపోయింది. అప్పటి వరకు కుటుంబభారం మోసిన భర్త  ఎటూ కదల్లేని పరిస్థితిని చూసి తల్లడిల్లింది భార్య శివకుమారి .ఒకరోజు కాదు అప్పటి నుండి ఇప్పటి వరకు చంటి పిల్లవానిలాగా భర్తకు సపరచర్యలు సాగిస్తుంది. మరో వైపున వారి పిల్లలను పోషించేందుకు అష్టకష్టాలు పడుతోంది. ఏ రోజుకా రోజు ఎలా గడుస్తుందా అంటూ ధీనంగా కాలం వెళ్లదీస్తున్నారు. మరో వైపున వారు తలదాచుకునేందుకు సొంత ఇల్లు కూడా లేదు. అద్దెకు ఇల్లు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఎవరైనా అద్దెకు ఇల్లు ఇచ్చినా సకాలంలో అద్దె చెల్లించలేక చీవాట్లు చీధరింపులు భరించాల్సి వస్తోంది. సొంత ఇల్లు కల్పించాలంటూ అడుగు పెట్టని కార్యాలయం లేదు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం శూన్యం. ఒక వైపున ఇద్దరు పిల్లలు మరో వైపున భర్త పరిస్థితి చూసి  ఆమె పడుతున్న మానసిక వేదన అంతా, ఇంత కాదు. పగవానికి సైతం ఇంతటి కష్టం రాకూడదు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే మథర్ థెరిస్సా  స్ఫూర్తితో  ఇలాంటి వారికి గోరంత సాయం చేస్తే కొండంత అండగా ఉంటుంది. తమ దయనీయ పరిస్థితిని చూసి మానవతవాదులు, దయాహృదయం కలిగినవారు ఆర్థికంగా సాయం చేయాలని, ఉండటానికి ప్రభుత్వం ఒక ఇల్లు కల్పించాలని రెండు చేతులు జోడించి వేడుకుంటున్నారు. సాయం చేసి అండగా నిలవాలనుకున్న  దాతలు కోసం ఎదురుచూపులు చూశారు ఆ దంపతులు.

ఈ క్రమంలో ఓరోజు చేతిలో దరఖాస్తులు, వినతి పత్రాలు. అర్జీలు చేతపట్టిన పిర్యాదుదారులతో విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం కిటకిటలాడుతోంది. ఒక మహిళ అతని భర్తని వీపుపై  మోసుకుంటూ వెళ్తోంది. ఎంతోమంది మీడియా ప్రతినిధులు ఉన్నారు.కానీ ఎవరికీ  ఆలోచన రాలేదు. ఆ దృశ్యం సామాజిక స్పృహ ఉన్న మన జర్నలిస్ట్ ముక్కంటిని కదిలించింది. వారి వివరాలు తెలుసుకుని వారి భాధ గోడును ఆయన ఆలకించారు. ఇల్లు లేక, అద్దె కట్టలేక, ఇల్లు గడవక, బ్రతక లేక, ఛావ లేక కాలం వెళ్లదీస్తున్నామని ఆ దంపతులు ముక్కంటి వద్ద కన్నీటి పర్యంతం అయ్యారు. ఇక మన మనసున్న మారాజు ముక్కంటి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తన కెమెరామెన్‌ని పిలిచి విజువల్స్ తీయించి ఒకే ఒక కథనం టీవీలో వేశారు. అంతటితో అతను ఆగలేదు. తన పని

ముగిసింది అని ఏ మాత్రం అనుకోలేదు. కలెక్టర్, కమిషనర్, మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సొంత ఇల్లు ఇప్పించి దగ్గరుండి గృహప్రవేశం చేయించాడు మన సీనియర్ జర్నలిస్ట్ ముక్కంటి.

కుటుంబభారంతో సతమతమవుతూ, భర్తను భుజాన మోస్తున్న ఆదర్శ అర్ధాంగి కుటుంబానికి ఎట్టకేలకు ప్రభుత్వం సొంత ఇల్లు కేటాయించింది. విజయవాడ, సింగ్‌నగర్‌లోని 77వ బ్లాక్‌లో జి ఎఫ్ 3 ఫ్లాట్‌ను శివప్రసాద్‌కు కేటాయించి మున్సిపల్ కమీషనర్ అందజేశారు. హౌసింగ్ అధికారులు దగ్గరుండి ముక్కంటి పని చేస్తున్న యాక్ట్ టీవీ సమక్షంలో చింతా శివప్రసాద్, కుమారి దంపతులకు ఇంటి తాళాలు అందచేసి వారిని గృహప్రవేశం చేయించారు. ఆ సమయంలో సొంత ఇల్లు పొందినవారి ఆనందానికి అవధులు లేవు.

## తల్లిపాల కోసం బిడ్డల ఆక్రందన



ఉమ్మడి గుంటూరు జిల్లా, దాచేపల్లి మండలం, రామాపురంకు చెందిన ఓ పేదింటి మహిళ ఒకే కాన్పులో ముగ్గురు ఆడ శిశువులకు జన్మనిచ్చింది. ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు కావడంతో తల్లిపాల కోసం ఆ శిశువులు ముగ్గురు తల్లడిల్లుతుంటే ఆ కన్నతల్లి ఆవేదన అంతా, ఇంతా కాదు. పాలకోసం పిల్లల రోదన చూసి తల్లి ఆవేదన మాటల్లో చెప్పలేనిది. ఈ విషయం తెలుసుకున్న ముక్కంటి ఆ పేదరాలు అయిన చిన్నారి శిశువుల తల్లిని తన సొంత ఖర్చులతో ప్రత్యేకంగా కారు ఏర్పాటు చేసి దాచేపల్లి మండలం రామాపురం నుండి ఏకంగా తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీస్‌కి రప్పించారు ముక్కంటి. ఆయితే ఆ తల్లి తాడేపల్లి వచ్చిన రోజు ముక్కంటికి గానీ, ఆ తల్లికి గానీ సీఎంగారి అపాయింట్మెంట్ దొరకలేదు. దానితో ముక్కంటి ఆ తల్లి, బిడ్డలను కారులోనే కూర్చోబెట్టి స్టోరీ ఫైల్ చేసి తాను బ్యూరోగా పనిచేస్తున్న ఛానల్‌లో ఆ రోజే స్టోరీ ప్రసారం చేసి ఆమెను తిరిగి అదే కారులో సురక్షితంగా దాచేపల్లి పంపి వేశారు. ఇక అంతటితో తన వల్ల కాదు అని ముక్కంటి అనుకోలేదు. సమస్య ఎటువంటిది అయినా ఆయన లక్ష్యం ఒక్కటే, ఎలాగయినా భాదితులకు సాయం చేయించటమే. అందుకు తన ఛానల్‌లో ప్రసారం అయిన స్టోరీని సీఎంఓ దృష్టికి తీసుకెళ్లారు. అలా ఆమె సమస్య సీఎం దృష్టికి వెళ్ళింది. అంతే నాటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్‌కి సీ.ఎం.ఓ ఆఫీసు నుండి ఫోన్ వెళ్ళింది. అక్కడ నుండి దాచేపల్లి తాహశీల్దార్‌కి ఫోన్. ఇక దాచేపల్లి రెవిన్యూ యంత్రాంగం మొత్తం దాచేపల్లి రామాపురంలో భాదితురాలు ఇంటికి ఉన్నపళంగా పరుగులు పెట్టారు. ఆమె పరిస్థితులు వాకబు చేసి పిల్లల్ని కన్నప్పుడు అయిన ఆపరేషన్ ఖర్చులు, పిల్లల పోషణకు అవసరమైన పాల ఖర్చులు, ఇతర ఖర్చుల నిమిత్తం చాలా ఎక్కువ 5 లక్షలసాయం ఆ తల్లికి ప్రభుత్వం నుండి అందింది. ఇక ఈ స్టోరి చూసి స్పందించిన పొలిటికల్ లీడర్స్, పలు

సేవాసంస్థలు, ఎవరికివారు చాలామంది భాదితురాలి కుటుంబానికి నగదు, దుస్తులు, నిత్యావసరవస్తువులు పలు రకాలుగా సాయం అందించారు.

**గూడు లేని గువ్వలు, ఫ్లాట్ ఫామ్‌పై నివాసం**



స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళ పైబడినా నేటికి  పేదరికం రూపుమారలేదు అనటానికి సజీవ సాక్ష్యం ఈ స్టోరీ. కనీస అవసరమైన కూడు, గూడుకు నోచుకోక గరీబోళ్లు దయనీయంగా జీవనం సాగిస్తున్నారు. ఎండా, వానా, రేయి పగలు అనే తేడా లేదు. ఆరు పదుల వయసున్న వృద్ధురాలు ముగ్గురు మనుమరాళ్లతో ఆరేళ్లుగా రోడ్డు ప్రక్కనే పుట్‌పాత్‌పై జీవిస్తున్న వైనం.

అది విజయవాడ మహానగరం. సత్యనారాయణపురంలోని ఏలూరు కాల్వ వంతెన. నిత్యం రద్దీగా ఉండే ఇక్కడ పుట్‌పాత్‌పై  ఓ బీద కుటుంబం జీవిస్తోంది. ఒకరోజు కాదు, ఒకనెల కాదు, ఏకంగా ఆరేళ్లు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కనీసం ఏ పరదా చాటు లేకుండా రేయి, పగలు భేదం లేకుండా ముగ్గురు మనుమరాళ్లతో  కాలం వెళ్లదీస్తుంది ఓ వృద్దురాలు.ఆమెపేరు పీతల పార్వతి.ఈమె చిన్న  కుమార్తె, అల్లుడు కొన్నేళ్ల క్రితం కాలం చేశారు. దీంతో వారి సంతానం తల్లితండ్రి లేని అనాధలయ్యారు. ముగ్గురు ఆడపిల్లలకు అమ్మమ్మ పార్వతి అన్నీతానై అతికష్టం మీద ఆ ఆడపిల్లల్ని పోషిస్తుంది. అద్దె కట్టే స్థోమత లేక రోడ్డుపైన జీవిస్తూ కలో గంజో తాగి కాలం వెల్లదీస్తున్నారు..

వారికి ఎలాంటి అడ్రస్ లేకపోవడం వలన  ప్రభుత్వం ఇచ్చే రేషన్ కార్డు వీరికి దక్కలేదు. ఆధారం లేని అభాగ్యులకు  ఆధార్‌కార్డు లేకపోయింది. దీంతో ఎంతో భవిష్యత్ ఉన్న ఆ ముగ్గురు బాలికల  భవితవ్యం ప్రశ్నార్ధకంగా మారింది. చదువుకోవాలని ఆశ ఉన్నా ఆ బంగారు తల్లుల ఆశ నెరవేరడం లేదు. ప్రభుత్వం నవరత్నాలు ఇస్తున్నా వీరికి ఆధార్, రేషన్‌కార్డు లేకపోవడంతో అమ్మ ఒడి, బడిలో సీటు వారి దరిచేర లేదు. మరో వైపున ఆడపిల్లలకు ఏ రూపంలో ప్రమాదం పొంచి ఉందనే భయం ఆ  వృద్దురాలిని వెంటాడుతూ కంటికి రెప్పలా ముగ్గురు ఆడపిల్లల్ని కాపాడుకుంటోంది. ఏ అర్ధరాత్రికాడ రౌడీలు, తాగుబోతులు, గంజాయి బ్యాచ్ వంటి ప్రమాదకారుల నుండి ఈ ఆడపిల్లల్ని కాపాడుకోవడం చాలా కష్టంగా ఉందని ఆ వృద్దురాలు బోరున విలపిస్తుంది. రాత్రి అయితే ఎవడు ఈ ఆడపిల్లల పక్కలో దూరతారోనని నిద్రలేని రాత్రులు గడపడం తప్ప వేరే మార్గం

తనకు లేదని చెమ్మగిల్లిపోతుంది. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి వారికి ఓ గూడు కేటాయిస్తే ఆడ పిల్లలను సంరక్షించుకుంటానంటుంది, అడ్రస్ ఏర్పాటు చేసి ఆధార్, రేషన్‌కార్డు ఇస్తే వారిజీవితంలో వెలుగులు నింపవచ్చు. అయితే ఓ ప్రముఖ పత్రిక ఈ భాదితులపై ఓ కధనం రాసింది. ఆ కధనం చూసిన మన ముక్కంటి ఆడ పిల్లలకు సామాజిక భద్రత కల్పించాలి అని తాను కూడా "గూడు లేని గువ్వలు" అంటూ మానవీయకోణం ఉట్టిపడేలా, టీవీ వీక్షకుల అందరి మనసులు హత్తుకునేలా, అయ్యోపాపం అనేలా స్టోరీ వేయడం జరిగింది.

మీడియా కథనాలకు స్పందించిన అధికార యంత్రాంగం ఆఘమేఘాలపై వీరివద్ద వాలింది. అప్పటికప్పుడు వివరాలు సేకరించి న్యాయం చేసేందుకు రంగంలోకి దిగారు. బాలికలకు అవసరమైన వసతి, విద్యను కల్పించేందుకు చైల్డులైన్ సాయం అందించేందుకు ముందుకొచ్చింది. విజయవాడ, గాంధీనగర్ చైల్డ్ లైన్ ద్వారా ముగ్గురు ఆడ పిల్లలకు అధికారులు వసతి కల్పించి వారి జీవితాలకు భద్రత కల్పించారు. ఇక ఇల్లు లేక రోడ్డు పైన జీవిస్తున్న వైనాన్ని తెలుసుకున్న నాటి ఎన్ టి ఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు మానవత్వంతో స్పందించారు. వారికి అన్ని విధాలుగా అండంగా ఉంటామని వృద్దురాలికి హామీ ఇవ్వడం జరిగింది.

ఇలా మన ముక్కంటి ఎన్నో సందర్భాలలో ఎంతో మంది భాదితుల తరపున కఠినమైన హృదయాలను సైతం కదిలించి భాదితులకు అండగా నిలిచి మన జర్నలిస్ట్‌ల సామాజిక స్పృహ, సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ ఆపదలో ఉన్న వారికి సామాజిక భద్రత కల్పిస్తూ తన వంతు పాత్రను పోషిస్తూ జర్నలిజం విలువలు కాపాడుతున్నారు.

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

# 16. టీ.ఆర్.పి రేటింగ్స్ కోసం మీడియా వెర్రితలలు - బార్క్ మాయాజాలం




"సమాజం పట్ల బాధ్యత మరిచి, జర్నలిజం విలువలు తుంగలో తొక్కి దర్జాగా మనుగడ సాగిస్తున్న కొన్ని మీడియా సంస్థలు, సిగ్గు లేకుండా బజారు కెక్కాయి. పైగా జర్నలిజం అనే ముసుగు వేసుకుని వారి బట్టలు వారే చించుకొని జర్నలిజాన్ని నడిరోడ్డులో నగ్నంగా నిలుచోబెట్టి సిగ్గు తీస్తున్న తీరు"

ఒకప్పుడు మీడియా ఎంతో భాద్యతగా వ్యవహరించేది. దేశంలో ప్రజాస్వామ్యం ఫరిడవిల్లే విధంగా, సామాజిక భాద్యత కల్పిస్తామని పురుడు పోసుకున్న పత్రికలు, టీవీ న్యూస్ ఛానల్స్ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో తీసుకొస్తున్న మార్పులు, సమాజంపట్ల భాద్యత ఏ మేరకు కల్పిస్తున్నాయో పత్రికా పాఠకులకు, టీవీ వీక్షకులకు తెలియంది ఏమీ కాదు. నిత్యం బ్రేకింగ్స్, బిగ్ బ్రేకింగ్స్, న్యూస్ అప్‌డేట్స్, ఫస్ట్‌ఆన్, స్పెషల్ స్టోరీస్, ఎక్స్‌క్లూజివ్ అంటూ మీడియా చేస్తున్న రచ్చ అంతా, ఇంతా కాదు. ఏ మీడియా ఆయినా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందా...? అంటే అదీ చాలామంది ప్రజలకు,పలువురు విమర్శకులకు తెలియంది కాదు. మరి మీడియా చేస్తుంది ఏమిటి అంటే... అదే విషయం మనం ఇక్కడ ప్రస్తావనకు తెస్తున్నాం. ప్రస్తుతం సమాజంలో మీడియా పాత్ర ఏమిటి అంటే..? ఇప్పుడు మీడియా కూడా వ్యాపార ధోరణికి అలవాటు పడింది. ఇప్పుడే కాదు కొన్నేళ్ల క్రితమే మీడియా వ్యాపార ధోరణికి దిగింది. కుప్పలు, తెప్పలుగా న్యూస్ పేపర్స్, లెక్కకుమించి న్యూస్ ఛానల్స్ రాష్ట్రంలో మనుగడ సాగిస్తున్నాయి. మీడియా రంగంలో ఆయా పత్రికలు, టీవీ న్యూస్ ఛానల్స్ ప్రకటనలు లేకుండా నడుస్తున్నాయా..? లేదు. మీడియా రంగం అభివృద్ధిచెందాలి అంటే కొంతమేరకు ప్రకటనలు అవసరమే కాదు అని చెప్పలేము. కానీ ప్రకటనలే ప్రధమావదిగా మీడియా రంగం నడుస్తుంది. ప్రకటనల ద్వారా ఆదాయం కోకొల్లలుగా సంపాదించి అపర కుభేరులుగా మారిపోదామనే దృక్పథంతోనే మీడియా మనుగడ సాగిస్తుంది.

ఈ ఆలోచనతోనే ఎటువంటి న్యూస్ ఇస్తున్నాం. ఎటువంటి ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నాం అనే ఇంగిత జ్ఞానం లేకుండా సమాజానికి చేటుచేసే న్యూస్, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తుంది. మీడియా. ప్రజలను ఆకట్టు కునేందుకు జనరంజకమైన కార్యక్రమాలు అంటూ తనకు తానే భుజం తట్టుకుని కుప్పలు, తెప్పలుగా ప్రసారం చేస్తున్న కార్యక్రమాల వల్ల ఏది మంచి, ఏది చెడు మనం ప్రసారం చేస్తున్న కార్యక్రమాలు సమాజానికి ఎంత మంచి చేస్తుంది, ఎంత చెడు ప్రభావం కలిగిస్తుంది అని ఏ మాత్రం ఆలోచన లేకుండా మీడియా వ్యవహరిస్తుంది. ఈ క్రమంలో పత్రికలు ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్ కోసం, టీవీ న్యూస్ ఛానల్స్ టీ.ఆర్పీల కోసం అర్రులు చాచి రకరకాల చెత్త ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నాయి. ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్, టీ.ఆర్పీల మొదటి, రెండు, మూడు స్థానాలు సాధిస్తే వాటి ఆధారంగా తారాస్థాయిలో తమ పత్రికకు, ఛానల్స్‌కి కుప్పలు, కుప్పలుగా ప్రకటనలు సాధించి అపారమైన ఆస్తులు సంపాదించ వచ్చు అని ఆలోచనతోనే ప్రస్తుత మీడియా రంగం పనిచేస్తుంది.

ఈ ఆలోచనతోనే చెత్త కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఆరు నెలలకొకసారి పత్రికలు ఆడిట్ బ్యూరో సర్క్యూలేషన్ కోసం, వారానికి ఒకసారి గురువారం బ్రాడ్ కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్, బార్క్ సంస్థ ప్రకటించే పలు ఛానల్స్ టీఆర్పీల కోసం మీడియా వెర్రితలలు వేస్తుంది. భాద్యత మరిచి ప్రవర్తిస్తుంది అనడంలో అతిశయోక్తి కాదు. ఇందులో ప్రాంతీయ విద్వేషాలు, మతాల మధ్య రచ్చ, కులాల మధ్య చిచ్చు రేపే ఘటనలు, అసాంఘీక కార్యకలాపాల న్యూస్ పదే,పదే రిపీట్ చేసి ప్రసారం చేయడం. అవినీతి, అక్రమాలను ఎండగట్టడం కన్నా వాటి ఆధారంగా దొరికిన వార్తలను ప్రసారంలో భాగంగా తమ ఛానల్ పేరు ఆ విజువల్స్ పై వాటర్ మార్క్పువేసి, స్క్రిప్ట్‌లో మంచి మషాల దట్టించి ఒకటికి నాలుగుసార్లు ఆ విజువల్స్ వేసి సగటు ప్రేక్షకుడిని ఆకట్టుకునేలా కథనాలు వేయడం వెనుక సమాజానికి ఉపయోగం ఏమిటి...? కానీ న్యూస్ ఛానల్స్ వీక్షకుల తల ప్రక్కకు త్రిప్పుకోనీయకుండా అదే ఛానల్ చూసే విధంగా దాని ద్వారా తన ఛానల్ టీఆర్పీ పెంచుకునేందుకు ప్రేక్షకుణ్ణి అక్కడే కట్టిపడేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు కావా ఇవి. టోటల్‌గా టీ.ఆర్పీ రేటింగ్స్ కోసం మన తెలుగు మీడియా ముంబై రెడ్ లైట్ ఏరియాలో వేశ్యల కోసం విటులు చేస్తున్న ప్రయత్నంగా పలువురు విమర్శకులు వర్ణించినా.., మన మీడియా పద్ధతి మార్చుకోవడం లేదు.

కానీ టీవీ న్యూస్ ఛానల్ ప్రేక్షకులు కూడా ఏ మాత్రం మినహాయింపు కాదు. ప్రజలు అటువంటి కార్యక్రమాలే చూస్తున్నారు కాబట్టే మీడియా కూడా వాటినే ప్రసారం చేస్తుంది. ఒక ఛానల్ చూస్తూనే ప్రక్క ఛానల్ అక్కడ ప్రసారం అవుతున్న వార్తను ఇంకా ఏ విధంగా చూపిస్తున్నారో అనే ఆశక్తితో ప్రజలు నిమిషం, నిమిషానికి చేతిలో ఉన్న టీవీ రిమోట్‌కి పని చెప్పి ఛానల్స్ పదే,పదే మార్చేస్తున్నారు. ఈ క్రమంలో జనరంజకంగా కార్యక్రమం లేకపోతే టీవీ ప్రేక్షకుని చేతిలో ఉన్న టీవీ రిమోట్ తనపని తాను చేసుకుపోతుంది. ఇలా జరగటం వల్ల న్యూస్ ఛానల్స్ రేటింగ్ లెక్కించడం కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. అందువల్లనే టీవీ న్యూస్ ఛానల్స్ ప్రేక్షకుడిని తన ఛానల్ చూసే విధంగా కట్టిపడేయడానికి రకరకాలుగా వెర్రితలలు వేస్తున్నాయి. భాద్యత మరిచి ప్రవర్తిస్తున్నాయి. టీ.ఆర్పీల కోసం పరుగులు పెడుతున్నాయి. టీఆర్పీలలో మొదటి స్థానాలు సాధిస్తే ప్రకటనలు ద్వారా ఆదాయం కూడబెట్టుకోవచ్చు అని చేసే ప్రయత్నాల ద్వారా మీడియా రంగం మంచి వ్యాపారంగా మారింది.

## "టీఆర్పీ అంటే ఏమిటి".?[1]

టీఆర్పీ అంటే 'టెలివిజన్ రేటింగ్ పాయింట్స్'. ఇది ఒక ప్రత్యేకమైన టూల్. దీని ద్వారా ఏ కార్యక్రమాన్ని ఏ చానెల్‌ను జనాలు ఎక్కువగా ఇష్టపడి చూస్తున్నారో అంచనా వేయవచ్చు. వీటితో ప్రజల ఇష్టాలను తెలుసుకోవడానికి వీలవుతుంది. దీన్ని బట్టి కంపెనీలు ఆయా చానెల్స్‌కు టీవీ కార్యక్రమాలకు ప్రకటనలు ఇస్తుంటాయి. ఏజెన్సీలకు ఈ టీఆర్పీతోనే ప్రయోజనం కలుగుతుంది. ఏ కార్యక్రమాన్ని ప్రజలు ఎక్కువగా చూస్తున్నారో ఈ రేటింగ్స్ బట్టి తెలుస్తుంది. 2008లో టీవీ రేటింగ్స్‌ను ట్రాయ్ ఏర్పాటు జరిగింది. ప్రకటనలు ఇచ్చేవారికి తమ డబ్బుకు తగిన పూర్తి ప్రయోజనం లభించేలా రేటింగ్ వ్యవస్థను ట్రాయ్ ఏర్పాటు చేసింది. ఇదే 'బ్రాడ్ కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బార్క్)' ఇదే టెలివిజన్ చానెళ్ల నంబర్ 1 ర్యాంకును నిర్ధారిస్తున్నాయి. దీన్ని సమాచార ప్రసార మంత్రిత్వశాఖ సిఫారసు చేస్తోంది.

టీవీలో జనాలు దేన్ని ఎక్కువగా చూస్తున్నారో ఒక ప్రత్యేక మీటర్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతానికి దేశంలో 44వేల ఇళ్ల నుంచి టీవీ కార్యక్రమాల డేటా సేకరిస్తున్నారు అని తెలుస్తుంది. రెస్టారెంట్లు షాపుల్లో మొత్తం శాంపిల్ సైజ్‌గా సేకరిస్తారు. దేశంలో 130 కోట్ల మంది ప్రజలు ఉన్నారు. ఇందులో 19.5 కోట్లకు పైగా టెలివిజన్ సెట్లు ఉన్నాయి. అందుకే ప్రజల వరకు చేరడానికి కంపెనీల కోసం ఈ టీఆర్పీలు చాలా కీలకంగా మారాయి. ఫిక్కీ రిపోర్ట్ ప్రకారం 2016లో భారత్‌లో ప్రకటనల వల్ల టీవీ చానెళ్లకు ఏకంగా 243 బిలియన్ల ఆదాయం లభించింది అని తెలుస్తుంది. 2020కి 368 బిలియన్లకు పెరిగింది. టీవీ రేటింగ్స్ మీద ఒకప్పుడు పెద్దఎత్తున చర్చ జరిగింది. టామ్ ఆధ్వర్యంలో రేటింగ్స్ లెక్కింపులో ఎన్నో అవకతవకలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. శాంపిల్ ఇళ్ళు రహస్యంగా ఉంచలేకపోవటం కారణంగా టామ్ నిజాయితీని శంకించే పరిస్థితి వచ్చింది. ఆ మాటకొస్తే జాతీయస్థాయి చానల్స్ కోర్టుకెక్కాయి. ఆ విధంగా రేటింగ్స్ వ్యవహారం ఒకప్పుడు పెద్దరాద్ధాంతమే సృష్టించింది. ఆ తరువాత పరిశ్రమ స్వయంగా ఏర్పాటు చేసుకున్న బార్క్ సైతం అదే విమర్శల సుడిగుండంలో చిక్కుకుంది?

రేటింగ్ సంపాదించుకోవటం చానల్స్‌కు జీవన్మరణ సమస్యగా మారింది. ఎక్కువ రేటింగ్స్ ఉంటే ఎక్కువ ప్రకటనలు వస్తాయి.ఎక్కువ ప్రకటనలు వస్తే ఎక్కువ ఆదాయం వస్తుంది. అందుకే, రేటింగ్స్ సంపాదించటమనేది చానల్స్ ముందున్న ప్రధాన సమస్య. రేటింగ్ ఎంత ఎక్కువ ఉంటే ఆ చానల్‌కి సమాజంలో అంత ఎక్కువ హోదా. చానల్‌కే కాదు, చానల్‌లో పనిచేసే సిబ్బంది కూడా అలాంటి హోదా తమకు తాము ఆపాదించుకోవటం చూస్తున్నాం. అందుకే ప్రతివారం రేటింగ్స్ కోసం ఎదురుచూడటం ఒక అనివార్యమైన



*Source Internet : 1. 'టీ.ఆర్.పి అంటే ఏమిటి'.?[1]*

అలవాటుగా మారింది. ఉద్యోగుల ఉద్యోగభద్రత కూడా వాళ్ళు పనిచేసే చానల్ రేటింగ్స్ మీద, వాళ్లు బాధ్యత తీసుకున్న కార్యక్రమం రేటింగ్ మీద ఆధారపడి ఉందంటేనే ఈ రేటింగ్స్ ప్రాధాన్యం అర్థమవుతుంది. అయితే ఈ రేటింగ్స్‌ని ఎవరికి అనుకూలంగా వారు విశ్లేషించుకుంటూ అనుకూలమైన అంశాలను ప్రచారం చేసుకుంటూ లబ్ధిపొందాలని ప్రయత్నించటం ప్రజలు గమనించ వచ్చు. ప్రతి గురువారం మధ్యాహ్నం టీవీ చానల్స్ తమ రేటింగ్స్ కోసం ఉత్కంటతో ఎదురు చూస్తాయి. చానల్ గొప్పదనానికి అదే నిదర్శనమనే అభిప్రాయం సామాన్య ప్రజలకూ ఏర్పడింది. కేవలం రేటింగ్స్ ఆధారంగా చానల్ గొప్పతనాన్ని నిర్ధారించటమే ఒక దారుణమైతే, అదే రేటింగ్స్‌ని అన్ని చానల్స్ ఒక పౌరసంబంధాల ఆయుధంగా మలుచుకోవటం మరింత దురదృష్టకరం. దీన్ని బట్టి ప్రకటనలు సంపాదించుకోవటానికే రేటింగ్స్ పరిమితం కావటం లేదని అర్థమవుతోంది.

టెలివిజన్ చానళ్ల ప్రేక్షకాదరణను అంకెల్లోకి అనువదించే ప్రక్రియనే స్థూలంగా రేటింగ్స్ లెక్కింపుగా నిర్వచించుకోవచ్చు. ప్రకటనకర్తలకు ప్రేక్షకులను సమకూర్చి పెట్టటమే చానల్స్ పని కాబట్టి వీలైనంత ఎక్కువ మందిని ఆకట్టుకోగలుగుతున్నట్టు నిరూపించుకోవటం వాటి బాధ్యతగా మారింది. ఆ విధంగా మరిన్ని ప్రకటనలు తెచ్చుకోగలిగే స్తోమతను చానల్స్ చాటుకుంటున్నాయి. ఒక టీవీ కార్య క్రమం ఎక్కువ మంది చూడటానికీ, ఆ కార్యక్రమం ఎక్కువ మందికి నచ్చడానికీ తేడా ఉంది. చూసిన వాళ్ళందరికీ నచ్చకపోవచ్చు. నచ్చని వాళ్ళు కూడా ఆ కాసేపు చూసినందుకు ఆటోమేటిక్‌గా పేక్షకుల జాబితాలో చేరిపోతారు. ఆ విధంగా రేటింగ్స్ లెక్కలో వాళ్ళంతా ఆ చానల్ ప్రేక్షకులే. చానల్స్ ఇప్పుడు తమ కార్యక్రమాలకు వస్తున్న రేటింగ్స్‌ను బట్టి ప్రకటనలు తెచ్చుకునే పరిస్థితి దాటిపోయింది. కేవలం రేటింగ్స్ కోసమే కార్యక్రమాలు రూపొందిస్తున్న పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. దీని వలన ప్రేక్షకులకు అవసరమైన కార్యక్రమాల కంటే ప్రేక్షకులు కళ్లు తిప్పుకోకుండా చూస్తారనుకునే కార్యక్రమాల మీదనే చానల్స్ దృష్టి పెడుతున్నాయి. ఈ ధోరణి మీద విమర్శలు ఏ స్థాయికి వెళ్ళాయంటే అసలు రేటింగ్స్ అనేవే ఉండ కూడదనే వాదన ఇప్పుడు తెరమీదకొచ్చింది. ఇది రేటింగ్స్ తప్పా ? రేటింగ్స్‌ను ఆపాదించుకోవటంలో ఉన్న తప్పా? వాటిలో శాస్త్రీయత లోపించటం తప్పా ? ఇన్ని రకాల ప్రశ్నల నేపథ్యంలో ఈ రేటింగ్స్ లెక్కించే విధానం మొదలుకొని ఆపాదిస్తున్న తీరువరకూ సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

ఇక పత్రికల విషయానికి వస్తే ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్ పత్రికల సర్క్యులేషన్ నిర్ధారించటానికి కచ్చితమైన లెక్కలుంటాయి. అందువలన ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఎబిసి) పని చాలా సులభం. టీవీ విషయానికొచ్చే సరికి అదికుదరదు. కేవలం సర్వేపద్ధతి మీద ఆధారపడాలి. అందుకే ఇది వివాదాస్పదంగా మారింది. పత్రికల పట్ల పాఠకుల

ఆదరణలో గంటలూ రోజులూ అంతగా ముఖ్యం కాదు. ఆరు నెలలకొకసారి ఫలితాలు వస్తాయి. టీవీలకు మాత్రం వారానికొకసారి రేటింగ్స్ వెలువడతాయి. ఇందుకోసం ప్రతినిమిషం చానల్స్‌ను రేటింగ్స్ సంస్థ గమనిస్తూ ఉంటుంది. అందుకే ప్రతిటీవీ చానల్ క్షణ క్షణానికీ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు కృషి చేయాలి. లేకపోతే రిమోట్ తనపని తాను చేసుకుపోతుంది. ఒకసారి ప్రేక్షకుడు అటువైపు వెళ్ళిపోతే ఇక్కడ ఎంత మంచి కార్యక్రమం ప్రసారం చేసినా ప్రయోజనం ఉండదు. ఇటువంటి పోటీ వాతావరణంలో టీవీ రేటింగ్స్ అత్యంత సున్నితమైన అంశంగా మారిపోయాయి.

రేటింగ్స్ లెక్కించేందుకు భారతదేశంలో గతంలో టామ్ (టెలివిజన్ ఆడియెన్స్ మెజర్మెంట్) అనే సంస్థ ఉండేది. నిజానికి పదిహేనేళ్ల కిందట టామ్, ఇన్టామ్ అనే రెండు సంస్థ లుండేవి. ఈ రెండూ సంస్థలూ భిన్నమైన ఫలితాలు ప్రకటిస్తూండటంతో అప్పట్లో కొంత వివాదం చెలరేగింది. అయితే, అదే సమయంలో అమెరికాలోని వీటి మాతృసంస్థలు కలిసిపోవటంతో సహజంగానే ఇక్కడ గుత్తాధిపత్యం ఏర్పడింది.దానితో ఇన్టామ్ మాయమైంది. ఆ తరువాత టామ్ చెప్పిందే వేదం. ప్రకటనకర్తలూ. ఏజెన్సీలూ, చానల్ యాజమాన్యాలూ తప్పనిసరిగా టామ్ సమాచారం మీదనే ఆధారపడుతూ వచ్చారు. అటువంటి గుత్తాధిపత్యంలో టామ్ ఎంత మేర బాధ్యతాయుతంగా వ్యవహరించిందో, ఏపాటి విశ్వసనీయత సంపాదించుకున్నదో పరిశీలించాలంటే లెక్కింపు విధానాన్నే సమీక్షించాల్సి ఉంది. ముందే చెప్పినట్టు, రేటింగ్స్ లెక్కించటమంటే సర్వే మాత్రమే. టామ్ ఆధ్వర్యంలో జరిగిన సర్వే ఎంత దారుణంగా ఉండేదో చూస్తే రేటింగ్స్ మీద కొద్దిపాటి గౌరవం కూడా మనకు మిగలదు. దేశం మొత్తం మీద 15 కోట్లకు పైగా కేబుల్ కనెక్షన్లు ఉంటే కనీసం 12వేల ఇళ్లు కూడా ఈ సర్వేలో లేవు. అంటే పదివేల ఇళ్లలో ఒకటి చొప్పున మాత్రమే సర్వే చేసి దాన్నే ప్రేక్షకుల అభిప్రాయంగా చెబుతున్నారు. 130 కోట్ల జనాభాలో 50 వేలలోపు మంది అభిప్రాయమే రేటింగ్ అవుతోంది. అంటే పాతిక వేల మందిలో ఒకరిని లెక్కపెడుతున్నారన్నమాట. రెండు తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఇక్కడున్న రెండుకోట్ల కనెక్షన్లలో టామ్ 1200 ఇళ్లను మాత్రమే పరిగణనలోకి తీసుకునేది. ఈ లెక్కలనే మనం ప్రేక్షకుల తీర్పుగా భావిస్తూవచ్చాం.

ఇక సర్వే పద్ధతి కూడా అయోమయమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పట్టణాలను మూడు రకాలుగా విభజించారు. మొదటిది హైదరాబాద్ నగరం. ఆ తరువాత విభాగంలోకి విశాఖపట్నం, విజయవాడ నగరాలొస్తాయి. ఈ మూడు నగరాలు కాకుండా పది పట్టణాలు కూడా రేటింగ్ పరిశీలనలో ఉన్నాయి. వీటి జాబితా రహస్యమని టామ్ సంస్థ చెబుతుంది గాని ఇది బహిరంగ రహస్యమే. అన్ని చానల్స్‌కూ ఈ పట్టణాలు తెలుసు. అందుకే అక్కడ చానల్ తప్పని సరిగా వచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఎంటర్టైన్మెంట్ చానల్స్ అయితే

రకరకాల కార్యక్రమాల ప్రిలిమినరీ సెలక్షన్స్‌కు ఈ పట్టణాలనే ఎంచుకుంటాయి. న్యూస్ చానల్స్ కూడా ఆయా పట్టణాల వార్తలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాయి. అక్కడి ఎమ్.ఎస్.ఓ. కు క్యారేజ్ ఫీజు కూడా చెల్లిస్తాయి.

ఇక లెక్కింపు విషయానికొస్తే, ఈ ఎంపిక చేసిన ఇళ్లలో పీపుల్స్ మీటర్ ఏర్పాటు చేస్తారు. దీన్ని ఒక రిమోట్‌తో అనుసంధానం చేస్తారు. ఎవరైనా టీవీ ఆన్ చేయాలంటే ఈ మీటర్ మీద తమకు సంబంధించిన బటన్ నొక్కాలి. స్త్రీ పురుషులకు వేరువేరు బటన్స్ ఉంటాయి. వయసులను బట్టి కూడా బటన్స్ మారతాయి. ఎవరైనా టీవీ దగ్గర నుంచి పక్కకి వెళ్ళిపోవాలంటే వాళ్ల బటన్ ఆఫ్‌చేసి వెళ్ళాలి. ఆ విధంగా ఎవరెవరు ఎంతసేపు ఏ చానల్ చూశారో బరోడాలోని టామ్ కార్యాలయ రికార్డులలో నమోదయ్యేది. అందరూ అంత కచ్చితంగా టీవీ చూసేముందూ, అక్కడి నుంచి వెళ్ళే ముందూ బటన్ నొక్కుతారా లాంటి ధర్మ సందేహాలకిక్కడ తావులేదు. లక్షలోపు జనాభా ఉన్న మండల కేంద్రాలూ, గ్రామ పంచాయితీలూ లెక్కకురావా అంటే రావన్నదే ఇక్కడ సమాధానం. సగం జనాభా అభిప్రాయాలు లెక్కలోకి తీసుకోకుండా ఇది సరైన సర్వే ఎలా అవుతుందనేది జవాబు దొరకని ప్రశ్న. అయితే, అదే సమయంలో పాత పద్ధతిని గుర్తు చేసుకునే వారు కూడా ఉన్నారు. అమెరికా లాంటి దేశాల్లో రేటింగ్ లెక్కింపు మొదలుపెట్టిన తొలినాళ్ళలో డైరీ పద్ధతి అమలులో ఉండేది. అంటే, ప్రేక్షకులు తాము ఏయే కార్యక్రమాలు ఎంతసేపు చూశారో తమకిచ్చిన డైరీలో నమోదు చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగా రేటింగ్స్ లెక్కవేస్తారు. దూరదర్శన్ కూడా మొదట్లో ఇదే పద్ధతి పాటించేది. ఇప్పటికీ ఎక్కువ దేశాల్లో పీపుల్స్ మీటర్ ద్వారా రేటింగ్స్ లెక్కిస్తున్నప్పటికీ కొన్ని దేశాలు ఇందుకు భిన్నమైన పద్ధతులను కూడా అనుసరిస్తున్నాయి. టామ్ రేటింగ్స్ మీద అలా ఎన్నో విమర్శలొచ్చాయి. అతి తక్కువ శాంపిల్స్‌తో రూపొందించే నివేదికలు సమగ్రంగా ఉండే అవకాశమే లేదు. అయినా సరే టామ్ దగ్గర ఒక రెడీమేడ్ గడసరి సమాధానం ఉండేది. రక్త పరీక్ష చేయటానికి ఎంత రక్తం తీస్తారన్న ఎదురు ప్రశ్నే వాళ్ళ సమాధానం. భిన్నమైన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యం ఉన్న భారత దేశంలో ఏకరూపత ఉండదని తెలిసినా ఇదే బుకాయింపు. అసలు కారణం ఏమిటంటే, రేటింగ్స్ లెక్కించటానికి ఇళ్లలో టీవీలకు బిగించే పీపుల్స్ మీటర్ ఖరీదు దాదాపు లక్షన్నర రూపాయలు. అప్పటికే దేశంలో పదివేల మీటర్లకు వంద కోట్లు ఖర్చుపెట్టిన టామ్ ఇంతకు మించి ఖర్చు వద్దనుకుంది. రేటింగ్స్ నిర్ణయించే ఏకైకసంస్థ గనుక అందరినీ శాసించే స్థితిలో ఉండి గుత్తాధిపత్యం ప్రదర్శించింది.

చివరికి చానల్స్ అన్నీ టీ ఆర్ పీ (టెలివిజన్ రేటింగ్ పాయింట్స్) చట్రంలో ఇరుక్కుపోయాయి. మొత్తం టీవీ పరిశ్రమనే శాసించే స్థానంలో రేటింగ్స్ స్థిరపడ్డాయి. చానల్స్

కూడా మంచి రేటింగ్ వస్తే ఆనందించటం, రాకపోతే రేటింగ్స్‌ని తిట్టుకుంటూ టామ్‌ని విలన్‌గా చిత్రీకరించటం ఆనవాయితీగా తయారైంది. అయితే, ప్రత్యామ్నాయ వ్యవస్థ మీద దృష్టి పెట్టటంతోబాటు టామ్ పనితీరు మీద పర్యవేక్షణ ఉండాలన్న కోణంలో చర్చ మొదలైంది. ఒకే రేటింగ్ ఏజెన్సీ సరిపోతుందా, ఎక్కువ దేశాల్లో ఉన్నట్టు కనీసం రెండు ఉండాలా అనేది కూడా ఆ చర్చలో భాగమైంది. టీవీ రేటింగ్స్ లెక్కించే టామ్ మీద విమర్శలు భారతదేశానికే పరిమితం కాలేదు. అమెరికాలో టామ్ మాతృ సంస్థ ఏసీ నీల్సెన్ కూడా ఎన్నో ఆరోపణలు ఎదుర్కోక తప్పలేదు. ఏసీ నీల్సెన్ గుత్తాధిపత్యానికి అక్కడి మరో సంస్థ టీ ఎన్ ఎస్ బ్రేక్ వేసింది. ఒక్కసారిగా ఏసీ నీల్సెన్ అరాచకాలు వెలుగు చూడటంతో ఎన్నో కోర్టు కేసులు ఎదుర్కోవలసి వచ్చింది. అమెరికాలో మీడియా రేటింగ్స్ కౌన్సిల్ ఉంది. అది రేటింగ్స్ తీసే క్రమాన్ని పర్యవేక్షిస్తుంది. భారత్‌లో మాత్రం అలాంటి వ్యవస్థ ఏదీ లేదు. ట్రాయ్ ఎప్పుడు ఏ విషయంలో జోక్యం చేసుకుంటుందో ఎవరికీ తెలియదు. ఏయే అంశాలలో దాని పాత్ర ఉంటుందో ఇప్పటికీ ఎవరూ చెప్పలేరు. కార్యక్రమాలకు సంబంధించి నంతవరకు తన ప్రమేయం ఎంత మాత్రమూ ఉండదని ట్రాయ్ చెబుతుంది. ఇది సాంకేతికమైన అంశం కాదు గనుక పట్టించుకోనంటుంది. ఈ రేటింగ్స్ ఆధారంగానే కార్యక్రమాలు తయారవుతున్నాయి కాబట్టి సమాచార ప్రసారాలశాఖ పరిధిలోనివని మరోవాదన. ప్రకటనకర్తలు, యాడ్ ఏజెన్సీలు, చానల్స్ కలసి అంగీకరించి ఏర్పాటు చేసుకున్న ఈ వ్యవస్థమీద అభ్యంతరాలుంటే వాళ్ళే సరిచేసుకోవాలని ట్రాయ్ సూచిస్తూ వచ్చింది. చాలాకాలం పాటు సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ కూడా చేతులెత్తేసింది. ఒక దశలో అప్పటి సమాచార కార్యదర్శి అరోరా ' సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ ' ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ " మియా బీవీ రాజీ హై తో క్యా కరేగా ఖాజీ " అన్నారు. అంటే, “భార్యాభర్తలు రాజీపడితే మధ్యలో ఖాజీ ఏం చేస్తాడు ?” అనటం ద్వారా రేటింగ్స్ విషయంలో ప్రభుత్వం చేయగలిగేదేమీ లేదని నేరుగానే చెప్పేసినట్టయింది. ఇది కేవలం ప్రకటనదారులకూ, సంస్థలకూ, చానల్స్‌కూ సంబంధించిన వ్యవహారంగానే ప్రభుత్వం చాలా కాలం దాటవేస్తూ వచ్చింది.

అయితే, ప్రభుత్వం చెబుతున్నట్టుగా అది కేవలం మార్కెట్‌కి సంబంధించిన సమస్యేనా...? రేటింగ్స్‌ని ప్రజాదరణగా అర్థం చేసుకోవటమే తప్పన్న విషయాన్ని ప్రభుత్వమే పట్టించుకోకపోతే చౌకబారు కార్యక్రమాలతో ప్రేక్షకులు ఇబ్బంది పడాలా ? సెక్స్, క్రైమ్ లాంటి కార్యక్రమాలు ప్రసారమవుతున్నప్పుడు చాలామంది ఆసక్తితో చూడవచ్చు. ఆ తరువాత అలాంటి కార్యక్రమాలు మంచివి కావనే అభిప్రాయానికి రావచ్చు. అంతమాత్రాన ఆ కార్యక్రమాలకు ప్రజాదరణ ఉన్నట్టు భావించటం సమంజసం కాదు. చూస్తే తప్ప మంచో

చెడో తెలియనప్పుడు తీరా చూశారు కాబట్టి మంచి కార్యక్రమమనే నిర్ధారణకు రావటం మీద విమర్శలొచ్చాయి. కేవలం రేటింగ్ వచ్చినంత మాత్రాన అది మంచి కార్యక్రమం అనుకోవటానికి వీల్లేదు. దురదృష్టవశాత్తూ అలా అనుకోవటం వల్లనే మిగిలిన చానల్స్ కూడా అటువంటి కార్యక్రమాన్నే ప్రసారం చెయ్యాలని తహతహలాడుతున్నాయి. కనీసం ప్రయోగాత్మకంగానైనా మంచి కార్యక్రమాలు అందించే ప్రయత్నం చేయటం లేదు. ఒక విధంగా చెప్పాలంటే చానల్స్ కంటే ప్రకటనకర్తలే కాస్త బాధ్యతతో వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తుంది. రేటింగ్స్ ఎక్కువ వస్తున్నప్పటికీ క్రైమ్ కార్యక్రమాలకు ప్రకటనలు ఇవ్వటానికి ముందుకు రావటం లేదు. ప్రకటన కర్తలకు సహాయపడాల్సిన రేటింగ్స్ ఇప్పుడు కార్యక్రమాల రూపకల్పనకు మార్గదర్శనం చేస్తున్నాయి. ఆ మాటకొస్తే , యాడ్ ఏజెన్సీల కంటే చానల్స్ ఎక్కువగా రేటింగ్స్‌ని వాడుకుంటున్నాయేమో అనిపిస్తుంది.మరోసారి టామ్ వారి రేటింగ్స్ తీరు గమనిస్తే, గ్రామీణ ప్రాంతాల ప్రజల అభిప్రాయాలను లెక్కలోకి తీసుకోవటం లేదని ఆ సంస్థ స్వయంగా అంగీకరించింది. లక్షలోపు జనాభా ఉన్న ప్రదేశాలను పట్టించుకోదు. దీన్నిబట్టి చానల్స్ కూడా గ్రామీణ ప్రజలకు అవసరమయ్యే కార్యక్రమాల గురించి ఆలోచించటం కూడా అనవసరమనే అభిప్రాయానికి వచ్చాయి. ఎంటర్టైన్మెంట్ చానల్స్ తమ కార్యక్రమాలలో ప్రేక్షకులకు భాగస్వామ్యం కల్పించాలనుకుంటే రేటింగ్స్ లెక్కించే పట్టణాలనే ఎంచుకుంటాయి. అక్కడి ప్రేక్షకుల దృష్టిలోపడాలన్న ఆశే అందుకు కారణం. న్యూస్ చానల్స్ అయితే రేటింగ్స్ లెక్కించే పట్టణాల వార్తలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వటం, అటువంటి కీలక పట్టణాలలో గట్టి రిపోర్టర్లను నియమించటం రహస్య మేమీకాదు. మొత్తంగా టామ్ రేటింగ్స్ మీద విశ్వసనీయత పూర్తిగా సడలిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రేక్షకుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నదనే అభిప్రాయం బలపడుతూ వచ్చింది.

## "టీఆర్పీల కోసం మీడియా వెర్రితలలు"[2]

ఇక మీడియా న్యూస్ ఛానల్స్ టీఆర్పీ రేటింగ్స్ కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంత జుగుప్సాకరంగా ఉంటున్నాయో ప్రజలకు, చాలామంది విమర్శకులకు తెలియంది ఏమీ కాదు. ఈ నేపథ్యంలో ప్రజాదరణ, జనరంజకంగా ఉండే కార్యక్రమాలు రూపొందిస్తున్నామని అడ్డమైన చెత్త కార్యక్రమాలు ప్రజల నెత్తిన రుద్దుతున్నాయి. ఏమాత్రం సామాజిక బాధ్యత మీడియా వహించడం లేదు. తమ ఛానల్‌లో ఏమి ఇస్తున్నాం అనే దాని కన్నా ప్రక్క ఛానల్లో ఏమి వస్తుంది. ఆ ఛానల్ ఏ విధమైన విజువల్స్ వేస్తుంది అనే యావలోనే న్యూస్ ఛానల్స్ ఉన్నాయి. ప్రజాదరణ, జనరంజకం అని చెప్పుకుంటూ కొత్త కొత్త కార్యక్రమాలు రూపొందించడం పరిపాటి అయ్యింది. పొద్దున మొదలుకొని పొలిటికల్ డిబేట్, హాట్ టాపిక్స్,



*Source Internet : 2. 'టీ.ఆర్.పి కోసం మీడియా వెర్రితలలు'[2]*

అంటూ హడా వుడి.మధ్యాహ్నం లేడీస్ కోసం అంటుకుంటే పదివేలు, కాల్ కొట్టు చీర పట్టు, గాజులు, అందానికిసూచనలు వంట, గింట అంటూ కడుపులో మంట పుట్టించే ప్రోగ్రామ్స్‌తో మహిళలకు పిచ్చెక్కించే కార్యక్రమాలు. ఇక సాయం సంధ్య వేళ కుటుంబాలతో ప్రశాంతంగా గడిపే అవకాశం లేకుండా ప్రైమ్‌టైం అంటూ ప్రత్యేక ప్రోగ్రామ్స్,ఇక అర్ధరాత్రులు నిద్ర లేకుండా పలు క్రైమ్ కథనాలు ఆనేరంఅలా, ఈనేరం ఇలా అంటూ నేరాలపై యువతకు తర్ఫీదు ఇస్తున్నట్లు క్రైమ్ కథనాలు. అందరూ నిద్రపోయాక స్పర్శ, సుఖసంసారం, లైంగిక పటుత్వం అంటూ అనేక కార్యక్రమాలతో ప్రతీ ఛానల్‌ని ప్రజల ముఖానికి కట్టి టీఆర్పీలు పెంచుకునే ప్రయత్నమే గానీ ఉపయోగకరమైన ప్రోగ్రామ్స్ ఏమైనా ఉన్నాయా...?

ఇక డిబేట్‌ల విషయానికి వస్తే రాజకీయ నాయకులు, పలురంగాలకు చెందిన నలుగురు వ్యక్తులను కూర్చోబెట్టి ఏదో సమాజాన్ని ఉద్ధరించినట్లు వారిలో వారిని రెచ్చగొట్టి గొడవలు పెట్టి కాలర్లు పట్టుకొని, చొక్కాలు చింపుకొని, చెప్పులతో కొట్టుకునే స్థాయికి వారిని రెచ్చగొట్టి మరలా ఏమీ తెలియనట్లు విజువల్స్ కట్ చేయడం. అలాగే మహిళా మణుల కోసం నిర్వహించే కార్యక్రమాలు చూస్తే పాపం ఏమీ తెలియని మన అమాయకపు తెలుగింటి దీపాలు ఆ ప్రోగ్రామ్స్‌లో ఎలా పాల్గొనాలో తెలియక ఆయా ఛానల్స్ జర్నలిస్ట్‌ల మొబైల్ నెంబర్లు కోసం విశ్వ ప్రయత్నాలు చేసి సాధించాక ప్రోగ్రాం ముందు కూర్చొని ఇక అదేలోకం అన్నట్లు భర్త,పిల్లలు అన్నిటినీ మరిచి టీవీలను ముఖానికి కట్టుకుంటున్నారు.ఇక టీవీలో చూసిన వంటకాలు పెద్ద నలభీముడిని మరిపించే రుచులు అందించే గృహిణిల్లా టీవీలో చూసిన సరికొత్త రుచులు అంటూ అడ్డమైన చెత్తని ఇంట్లో వారికి వండి,వడ్డించడం. మరో ప్రక్క ప్రైమ్ టైం ప్రోగ్రామ్స్ అంటూ భార్యా, భర్తలకు, పిల్లలకు, బాధ్యతగా చూసుకోవాల్సిన వృద్ధులకు సాయం సంధ్య వేళల్లో ఒకరికి ఒకరు సంబంధం లేకుండా టీవీ ఛానల్స్ నిర్వహిస్తున్న కొన్ని కార్యక్రమాల వల్ల మానవ సంబంధాలకు ఏ మాత్రం విలువ లేకుండాపోతుంది. మరో ప్రక్క కలర్ టీవీ ఇంట్లోకి వచ్చి కయ్యం బెట్టిందిరో... అన్నట్టు అర్ధరాత్రి వేళ మిడ్ నైట్ మషాల అంటూ సెక్స్‌కి సంభందించిన విషయాలు వాటి కోసం లైంగిక సమస్యలు ఎదుర్కొంటున్న కొందరు దంపతులు ఉదయం నుండి అర్ధరాత్రి వరకు ఎదురుచూడటం చివరికి అక్కడ వచ్చే ప్రోగ్రామ్ అర్ధంకాక చెవులు జాడించుకొని నిద్రపోవడం. ఉదయం లేచింది మొదలు మరుసటి రోజు అర్ధరాత్రి వరకు జనాల్ని తల తిప్పుకోనీయకుండా ఒకటే కార్యక్రమాలు. ఇందులో మంచి ఏది...? చెడు ఏమిటి...? అనే విధానం టీవీ యాజమాన్యాలకు అసలు సంభంధం లేదు. లక్ష్యం ఒక్కటే టీఆర్పీ సాధించడమే.

## "తెలంగాణా ఉద్యమ నేపథ్యంలో"[3]

అప్పట్లో ప్రత్యేక తెలంగాణా కోసం జరుగుతున్న ఉద్యమంలో భాగంగా... ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం అయిన కొన్ని నిరసన పద్ధతులు చూస్తే జుగుప్స కలిగింది. ప్రజలు కసి తోనో.. తెలిసో.. తెలియకో... వినూత్నత్వం పేరిట చేస్తున్న నిరసనలు బాధ కలిగించే అంశాలు. అలాంటి వాటిని ఛానెల్స్ చిత్రీకరించి.... మసాల దట్టించిన కాపీ తో స్టోరీగా ప్రసారం చేయడం చాలా వరకు నొప్పించే అంశాలు మనం చూసాం.

## "తెలంగాణాలో 610జీ.ఓ,రగడ - నేతల నోటికి పేడతో కేకు"[4]

నాడు తెలంగాణాలో 610–జీవో విడుదల సందర్భంగా ఒకచోట కొందరు పట్టభద్రులు... పేడతో చేసిన ఒక కేక్‌ను కట్ చేసారు. దాన్ని చెప్పులసహాయంతో లగడపాటి, జగన్ తదితర కొందరు నేతల ఫోటోలకు తినిపించారు. నిజానికి.... ఈ రెండు వాక్యాలు ఇలా రాయడానికే ఇబ్బందిగా ఉంది. ఈ 610జీఓ అమలు కాకపోబట్టి ఈ ప్రాంతంలో నిరుద్యోగులు నష్టపోయారనేది నిజం.అంత మాత్రాన ఇంత ఘోరంగా నిరసన తెలపాలా? దీన్ని ఛానెల్స్ ఒక పెద్ద విడ్డూరంగా చూపడం బాగోలేదు.

## "నుదుటిపై ముద్దు వారిద్దరి ఫోటోలకు పెళ్ళి"[5]

అలాగే ఆంధ్రాలో ఉద్యమం సందర్భంగా నిరసన చేస్తున్న ఒకనాటి ఎం.పి. లగడపాటి రాజగోపాల్‌ని తెలుగుదేశం నాయకురాలు నన్నపనేని రాజకుమారి అభినందన పూర్వకంగా...రెండు చేతులతో తలపట్టుకుని నుదురు మీద ఒక ముద్దు ఇవ్వడాన్ని తెలంగాణా నిరసనకారులు ఘోరంగా అపహాస్యం చేశారు.అసలు నుదుటిమీద ముద్దుకు అర్థం తెలుసా...? ఇది వెర్రితలలు వేసిన కొన్నిచోట్ల...లగడపాటి, నన్నపనేని ఫోటోలకు పెళ్లి చేసారు. ఇంత విపరీతార్థం తీయడం బాగోలేదు. దీనిని నాడు మీడియా ఏదో ఘనకార్యం చూపించినట్లు మీడియాలో ప్రసారం చేసి టీఆర్పీ కోసం చేసిన ప్రయత్నాలు కాదా...?

## "కేసీఆర్ మెడలో, చేతిలో మద్యం బాటిల్స్"[6]

సమైక్యాంధ్ర ఉద్యమం నేపథ్యంలో ఆంధ్రులు చేపట్టిన నిరసన కూడా వ్యతిరేకించవలసిన విషయం ఒకటి. చెప్పేవాడు, అడ్డుకునేవాడు లేకనే ఈ విధమైన విపరీత దోరణీలు వెలుగుచూస్తున్నాయి. తెలంగాణాలో ఎంతో ప్రజాదరణ కలిగిన నాయకుడు కేసీఆర్‌ని అవమానించిన తీరు సమంజసమేనా...? నాడు ఆంధ్రప్రదేశ్‌లో ఒక బిచ్చగాడికి కేసీఆర్ వేషం కట్టి అతని మెడలో క్వాటర్ సైజు మద్యం బాటిల్స్ దండవేసి, చేతిలో ఓ మద్యం బాటిల్ పెట్టి వెనుక నుంచి చెప్పులతో కొడుతూ, రోడ్ల వెంబడి తరుముతూ చేసిన నిరసన



*Source Internet : 3. 'తెలంగాణా ఉద్యమ నేపథ్యంలో'[3] 4. 'తెలంగాణాలో 610 జీ.ఓ,రగడ–నేతల నోటికి పేడతో కేకు'[4] 5. 'నుదుటి పై ముద్దు వారిద్దరి ఫోటోలకు పెళ్ళి'[5] 6. 'కేసీఆర్ మెడలో, చేతిలో మద్యం బాటిల్స్'[6]*

కార్యక్రమాన్ని ఆనాడు మీడియా ఎంచక్కా ప్రసారం చేసి చేతులు దులుపుకుంది. ఇదితప్పు అని తెలిసినా ఎంచక్కా ప్రసారం చేయడం అంటే టీ.ఆర్పీల కోసం మీడియా బాధ్యతలేని కార్యక్రమాల వెంట గుడ్డిగా పరుగులు తీయడం కాదా....?

### ప్రజాదరణ కలిగిన నాయకులకు శవయాత్రలు, పిండప్రధానాలు

ఇక ప్రజలచే ఎన్నుకోబడి ప్రజాదరణ కలిగిన నాయకులు ప్రభుత్వ వైఫల్యాలకు, ప్రజాప్రతినిధుల వైఫల్యాలను ఆసరాగా చేసుకుని ఆయా రాజకీయనాయకుల దిష్టిబొమ్మలను తయారు చేసి వాటికి శవయాత్రలు నిర్వహించడం, ఫోటోలకు దండలు వేసి పిండ ప్రధానం చేయడం వంటి కార్యక్రమాల పట్ల మీడియా అత్యుత్సాహం ప్రదర్శించి సామాజిక భాధ్యత లేకుండా టీఆర్పీలు పెంచుకునే ప్రయత్నం కాదా...?ఇవి కూడా ఆంధ్రా, తెలంగాణా విభజన నేపథ్యంలోనే వెలుగు చూశాయి. చదువుకుని జ్ఞానం కలిగిన యూనివర్సిటీ స్థాయి విద్యార్థులు సైతం ఏది మంచి, ఏది చెడు అని ఆలోచించకుండా నాటి కేంద్రమంత్రి చిదంబరంకి పిండ ప్రధానం చేశారు. మీడియా దీనిని కవర్ చేసి ప్రసారం చేసింది.ఇదికాదా మీడియా టీఆర్పీల చట్రంలో ఇరుక్కోవడం అంటే....!

### ఆంధ్రాని బొచ్చుకుక్క పిల్లతో పోలిక

ఆంధ్రాలో సమైక్యాంధ్ర ఉద్యమం నడుస్తున్న నేపథ్యంలో కొందరు నిరసనకారులు తెలంగాణాలో చేసిన నిరసన కార్యక్రమం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే అవకాశం ఉంది అనికూడా చూడకుండా పలు న్యూస్ ఛానల్స్ ప్రదర్శించిన ఉత్సాహం జుగుప్సాకరంగా ఉంది. కొంతమంది తెలంగాణా నిరసనకారులు చేసినపని అటువంటిది మరి.ఈ అంశాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేయకూడదు. కానీ మీడియా తీరు మార్పు చెందకపోతే ఇటువంటివి రాయడం తప్పడం లేదు. నాడు హైదరాబాద్‌లో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఒక బొచ్చు కుక్క పిల్లను కుర్చీలో కూర్చోబెట్టి దానిమెడలో ఆంధ్రా అని రాసిన బోర్డు వేశారు. దానిని కవర్ చేసి నాడు అది ఒకపెద్ద వార్తలా న్యూస్ ఛానల్స్ ప్రసారం చేశాయి.అలాంటి వార్తల పర్యవసానం మీడియా సంస్థలకు తెలీదా....?ఇది కాదా టీఆర్పీల కోసం మీడియా వేస్తుంది వెర్రితలలు అని.

### కలెక్టరేట్‌లో పురుగుమందు సేవించిన రైతు విజువల్స్ కోసం

కొన్నేళ్ల క్రితం నాటి ఉమ్మడి గుంటూరుజిల్లాలో భారీగా పంట నష్టపోయిన ఓ రైతు పురుగుల మందు చేతబట్టి గుంటూరు కలెక్టరేట్‌కి వచ్చాడు. పంట నష్టపోయిన ఆ రైతు కలెక్టర్ చాంబర్ ప్రక్కనే మెట్లపై కూర్చొని పురుగుల మందు సేవించి ప్రాణాపాయస్థితిలో ఉంటే అతన్ని రక్షించాల్సింది పోయి మీడియా ప్రతినిధుల్లో కెమెరామెన్స్ విజువల్స్ తీయడం

కోసమే ప్రాధాన్యత ఇచ్చారు. అయితే కొంతమంది సీనియర్ జర్నలిస్ట్‌లు వెంటనే స్పందించి అతన్ని ఆసుపత్రికి చేర్చారు. ఇందులో కెమెరామెన్స్ విజువల్స్ కోసం ప్రయత్నించడం తప్పు కాదు. ఎందుకంటే మీడియా ఛానల్స్ మధ్య అంతటి భయంకరమైన పోటీతత్వం ఉంది మరి. ఒక ఛానల్ ఆ విజువల్స్ వేసి మరో ఛానల్ ఆ విజువల్స్ వేయకపోతే పరిణామం మాములుగా ఉండదు. విజువల్స్ తీయకపోతే ఆ ఛానల్ జర్నలిస్ట్ ఏమంటాడో అని కెమెరామెన్ భయం.మరో ప్రక్క మీడియా సంస్థలు ఏమంటాయో అని జర్నలిస్ట్‌ల భయం వెరసి కెమెరామెన్ ఇద్దరికి భయపడాలి...ముందు విజువల్స్ తీద్దాం తరువాతే ఆలోచిద్దాం అని కెమెరామెన్స్ ప్రయత్నం. ఇలా జర్నలిస్ట్‌లకు, కెమెరామెన్స్‌కి సామాజిక బాధ్యత ఉన్నా టీవీ ఛానల్స్ టీఆర్పీ రేటింగ్స్ కోసం జర్నలిస్ట్‌లను, కెమెరామెన్స్‌ని పావులుగా వాడుకుంటుంది. ఇవి కాదా మీడియా విపరీత దోరణీలు. ఇది కాదా మీడియా వెర్రితలలు వేయడం అంటే...?

### "బార్క్ మాయాజాలం"[7]

ఇక బార్క్ విషయానికి వస్తే దేశంలో పలు న్యూస్ ఛానల్స్ టీఆర్పీ రేటింగ్ కోసం బార్క్ సంస్థకు లంచాలు ఇచ్చే స్థాయికి ఎదిగాయి అనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో మహారాష్ట్రకు చెందిన ఓ న్యూస్ ఛానల్ నాటి బార్క్ సంస్థ ప్రతినిధులకు లంచాలు ఇచ్చి కొన్నాళ్లపాటు టీఆర్పీ రేటింగ్ స్థానాన్ని పదిలం చేసుకుంది.దానితో ఆ న్యూస్ ఛానల్‌కి అత్యధిక ప్రకటనలు వచ్చి లెక్కకు మించి ఆదాయం పొందింది. ఆ సమయంలో ఆ న్యూస్ ఛానల్ యాజమాన్యం మహారాష్ట్ర లోనేకాక దేశంలో అన్ని ప్రాంతీయ భాషల్లో తమ ఛానల్‌ని ప్రవేశపెట్టనున్నట్లు ప్రగల్భాలు పలికింది. అంతే ఈ న్యూస్ ఛానల్స్ టీఆర్పీ రేటింగ్స్ వ్యవహారం,అప్పటి దాకా బార్క్ సంస్థ చేసిన మాయాజాలం పోలీసులకు చేరింది.దానితో దేశంలో న్యూస్ ఛానల్స్ టీఆర్పీ రేటింగ్స్,బార్క్ మాయాజాలం బయటకు పొక్కింది. దానితో మన తెలుగు మీడియా,న్యూస్ ఛానల్స్ వ్యవహారం కూడా బయటపడింది. మన తెలుగు మీడియాలో కూడా పెద్దగా ప్రజాదరణ లేని ఛానల్స్‌కి కొన్నాళ్ల పాటు టీఆర్పీ రేటింగ్ నిలకడగా వస్తుండటంతో బార్క్ సంస్థ ఓ కన్నేసి ఆ విధానానికి ముగింపు పలికింది. అయితే ఇప్పటికి పలుమీడియా సంస్థలు టీఆర్పీ రేటింగ్స్‌కోసం అడ్డదారులు తొక్కుతూనే ఉన్నాయి.

దీంతో ప్రభుత్వం రంగప్రవేశం చేసింది. రేటింగ్స్ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ సిఫార్సుల ప్రకారం మీటర్ల సంఖ్య 50వేలకు పెంచాలి, గ్రామీణ ప్రాంతాలనూ లెక్కలోకి తీసుకోవాలి. రేటింగ్స్ లెక్కించే సంస్థకు ప్రకటనల సంస్థలతో భాగస్వామ్యం ఉండిఉండకూడదు లాంటి సిఫార్సులు వచ్చాయి. కేంద్రం ఈ సిఫార్సులకు ఆమోదముద్ర వేసింది. అదే సమయంలో టీవీ పరిశ్రమ స్వయంగా ఒక రేటింగ్స్ ఏజెన్సీ ఏర్పాటుకు



***Source Internet :*** *7. 'బార్క్ మాయాజాలం'[7]*

సిద్ధమైంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లేని టామ్ అనివార్య పరిస్థితుల్లో మూతబడగా, టీవీ చానల్స్ యాజమాన్యాలు, ప్రకటనల ఏజెన్సీలు, ప్రకటనకర్తలు భాగస్వాములుగా స్వయంగా బ్రాడ్ కాస్ట్ ఆడియెన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బార్క్) అమలులోకి వచ్చింది.

బార్క్ రంగ ప్రవేశంతో చానల్స్ అన్నీ ఇక రేటింగ్స్ న్యాయబద్ధంగా ఉంటాయని భావించాయి. క్రమంగా మీటర్ల సంఖ్య పెంచటం ద్వారా మరింత కచ్చిత ఫలితాలు వస్తున్నాయని చానల్స్ సంతృప్తి వ్యక్తంచేశాయి. అయితే, అదే సమయంలో గ్రామీణ ప్రేక్షకుల ఆదరణను సైతం కొలవటం మొదలవటం ఒక పెను సంచలనమైంది. చానల్స్ తలరాతలు మారిపోయాయి. గ్రామీణ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కార్యక్రమాలు, చానల్స్ ప్రారంభించటం మొదలైంది. మరోవైపు ఇంతకాలంగా గ్రామీణ ప్రేక్షకులను లెక్కించకపోవటం వల్లనే వెనుకబడినట్టు చెప్పుకుంటూ వచ్చిన దూరదర్శన్ ఇప్పుడూ వెనకబడటంతో మారు మాట్లాడలేక పోయింది.

కానీ బార్క్ సైతం విమర్శలకు తావిచ్చింది. చాలాచోట్ల మీటర్లున్న ఇళ్ళు బైటికి తెలిసిపోతున్నాయని, చానల్ యాజమాన్యాలు అక్రమమార్గాల ద్వారా తెలుసుకొని ప్రలోభ పెడుతున్నాయని ఆరోపణలు వచ్చాయి. టెలివిజన్ పోస్ట్ అనే పోర్టల్ ఏర్పాటు చేసిన డిజిటైజ్ ఇండియా సదస్సులో ఒకప్పుడు బార్క్ సీఈవో పార్థోదాస్ స్వయంగా ఈ ఆరోపణలను ఒప్పుకున్నారు. కొన్ని చోట్ల తమ సిబ్బందిని ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వచ్చాయని వెల్లడించారు. పదిఇళ్లు చెబితే ఐదు లక్షలిస్తామంటూ లక్ష రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చినమాట నిజమేనని తమ దర్యాప్తులో వెల్లడైందని ఆయనే చెప్పటంతో మళ్లీ ఈ కోణంలో విమర్శలు రావటం మొదలయ్యాయి.

మరికొద్ది రోజులకే ఒక చానల్ సిబ్బంది కొన్ని మీటర్లున్న ఇళ్ళకు వెళ్ళి ప్రలోభపెట్టే ప్రయత్నం చేసిందని కూడా నాడు చూచాయిగా చెప్పిన బార్క్ సీఈవో ఆ కొద్ది రోజుల తరువాత తమిళనాడుకు చెందిన రాజ్ టీవీ యాజమాన్యానికి నోటీసు లివ్వటంతో ఆయన ప్రస్తావించిన చానల్ అదేనని తేలిపోయింది. దీన్ని బట్టి బార్క్ హయాంలోనూ దొడ్డిదారి వ్యవహారాలు నడుస్తున్నాయని దీన్ని సమర్థంగా ఎదుర్కోలేక పోతున్నదని విమర్శలు పెరుగుతూ వచ్చాయి. తాజాగా కేరళ టీవీ సమాఖ్య చేసిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం ముదురు పాకాన పడింది. కొంతమంది ఈ మీటర్లున్న ఇళ్ళకు వెళ్ళి తాయిలాలు ఇవ్వజూపుతూ తమ చానల్స్‌కు రేటింగ్స్ సంపాదించుకునే పనిలో ఉన్నారని స్వయంగా కేరళ టీవీ సమాఖ్యతోబాటు బార్క్ కూడా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఇది తారా స్థాయికి చేరింది. ఈ వ్యవహారం పోలీసుల దర్యాప్తులో ఉంది.

బార్క్ మీటర్లు ఉన్న ఇళ్ళ చిరునామాల కోసం పదే,పదే ప్రయత్నాలు జరుగుతున్నట్టు బార్క్ ఇండియా వారి విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు అందుతూవచ్చాయి. ఆ విధంగా ఆ ఇళ్ళను ప్రభావితం చేయాలన్నది వాళ్ళ లక్ష్యంగా కనబడుతోందని బార్క్ ఆ ఫిర్యాదులో పేర్కొంది. రెండు చానల్స్ కోసం బార్క్ ఇండియా వారి ప్రేక్షకాదరణ సమాచారాన్ని తస్కరించినట్టు నిర్దుష్టమైన సాక్ష్యాధారాలు లభించాయని నాటి బార్క్ సీఈవో పార్థోదాస్ గుప్తా వెల్లడించారు. విజిలెన్స్ బృందం క్షేత్రస్థాయిలో జరిపిన దర్యాప్తును బట్టి చూస్తే ఆ వ్యక్తులు కేవలం మీటర్లున్న ఇళ్ళను గుర్తించటానికే పరిమితం కాకుండా ఆ ఇళ్ళలోనివారికి తాయిలాలు ఇచ్చి వారిని ఫలానా కార్యక్రమాలు మాత్రమే చూసేలా కూడా ప్రయత్నించినట్టు తేలిందన్నారు. దీనివలన కొన్ని చానల్స్ ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, మిగిలిన చానల్స్ ప్రతిష్ఠ దిగజారే ప్రమాదమూ ఉన్నదని, అదే సమయంలో బార్క్‌కున్న విశ్వసనీయత సైతం మంటగలిసే ప్రమాదం ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

ఈ విషయం తెలిసిన వెంటనే బార్క్ ఆ ఇళ్ళను రేటింగ్స్ లెక్కింపు నుంచి మినహాయించింది. దాని ప్రభావం మొత్తం రేటింగ్స్ మీద పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంది. బార్క్ ఇచ్చే లెక్కలమీద ఆధారపడి టీవీ పరిశ్రమ నడుస్తున్నప్పుడు ప్రతి బ్రాడ్‌కాస్టర్‌కూ ఒక్కో రేటింగ్ పాయింట్ ఎంతోవిలువైంది కాబట్టే తక్షణ చర్యలతో పరిస్థితిని చక్కదిద్దుతున్నట్టు బార్క్ ప్రకటించింది. అక్రమాలకు యత్నించిన ఇద్దరు బ్రాడ్ కాస్టర్లను గుర్తించామని చెప్పినప్పటికీ ఇంకా పేర్లు వెల్లడించాల్సి ఉంది. ఎవరైనా అలాంటి అడ్డదారులు తొక్కితే ఆ చానల్స్ పేర్లు బైటపెట్టటంతోబాటు రేటింగ్స్ లెక్కల నుంచి తొలగిస్తామని బార్క్ స్పష్టంగా ప్రకటించింది. నిజానికి మీటర్లున్న ఇళ్ల వివరాలు బైట పడకూడదనే ఉద్దేశంతోనే ఏటా కనీసం 25% మీటర్లను మార్చి వేస్తున్నామని కూడా పార్థోదాస్ గుప్తా అన్నారు.


## ప్రస్తుత పరిస్థితుల్లో మీడియాలో మార్పు ఎంతో అవసరం

ప్రజాస్వామ్య ప్రభుత్వానికి మీడియా నాలుగవ మూలస్థంభం అని, దేశ ప్రజల సామాజిక బాధ్యత,భద్రత కల్పిస్తామని మనుగడ సాగిస్తున్న ఏ ప్రాంతీయ మీడియా అయినా సరే ఇప్పటి వరకు మనం చెప్పుకున్న విధానాలనే అవలంభిస్తూ తమ పబ్బం తాము గడుపుకుంటున్నాయి.ఏదో ఆర్.ఎన్.ఐ, గుర్తింపుపొందాం. ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్ సాధించాం, టీఆర్పీలు సాధించాం, ప్రభుత్వ ప్రకటనలు సాధిస్తున్నాం అంటూ పత్రికలు పొడవాటి సర్క్యులేషన్ అని పత్రికలు ప్రకటించుకోవడం, టీ.ఆర్పీ మొదటిస్థానం అని టీవీ న్యూస్ ఛానల్స్ చెప్పుకోవడం వెనుక భాగోతం అంతా బహిర్గతం అవుతున్నా ఇంకా పులిచర్మం కప్పుకొని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి ప్రజలను మభ్యపెట్టడం కాదు. గొప్పలకుపోయి కూర్చున్న కొమ్మను నరుక్కునే స్థితికి, భస్మాసురుడు తన నెత్తిన తానే చెయ్యి పెట్టుకుని

నాశనం అయ్యినట్లు దొరల గడీల్లో బందీ అయిన జర్నలిజంకు విముక్తి రావాలి. మీడియా సంస్థలు విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలి. విలువలు కలిగిన జర్నలిజాన్ని, జర్నలిస్ట్‌లకు మనుగడ కల్పించాలి. కొంచెంలో కొంచెం అయినా సామాజిక బాధ్యత, భద్రతలకు కట్టుబడి ఉండాలి. మీరు ప్రసారం చేసే కార్యక్రమాలు జనరంజకమైనవి అని వాళ్ళు చూసే కార్యక్రమాలు రూపొందించడమే సామాజిక భాద్యత అనుకోరాదు. ప్రజలు మంచి చూస్తారు....చెడు చూస్తారు....అలా అని ఉపయోగం లేని కార్యక్రమాలు ప్రజలపై రుద్దే ప్రయత్నం చేసే కన్నా, ఉపయోగకరమైన కార్యక్రమాలు ఇస్తే బాగుంటుంది.


ప్రాంతీయ తత్వం, సమానత్వం, అణగారిన వర్గాల అభివృద్ధి, అక్షరాస్యత శాతం పెంపొందించడం, కుల, మత, వర్గ విభేదాలు రూపు మాపటం, రాజకీయ పరిజ్ఞానం అందించడం, ప్రజల్లో సామాజిక స్పృహ, సామాజిక భాద్యత పెంపొందించే కథనాలు, మహనీయుల చరిత్రలు, శాస్త్రవేత్తల సాంకేతిక నైపుణ్యం, ఐ.ఏ.ఎస్, ఐ.పీ.ఎస్, ఐ.ఆర్.ఎస్, ఐ.ఎఫ్.ఎస్ వంటివాటిలో యువత స్థానం సాధించేందుకు సూచనలు ఇలా ఎన్నో సమాజానికి అవసరం. రాష్ట్రంలో అటవీప్రాంతాల్లో, గిరిజన తండాల్లో ప్రజలు ఇంకా వెనుకబడి ఉన్నారు వారిని చైతన్యపరచాలి. వ్యవస్థలో చాలామంది మూఢనమ్మకాలతో జీవిస్తున్నారు. వీలుంటే వారిని కూడా మార్చే కథనాలు వేయండి. యువతను శాస్త్ర, సాంకేతికరంగాల వైపు నడిపించే ప్రయత్నం చేయండి. అవినీతి, అక్రమాలకు పాల్పడే వ్యవస్థలపై వారి తాటతీసే విధంగా పరిశోధనాత్మక కథనాలు వేయండి. దమ్ముంటే నక్సలిజం, మావోయిజం, ఉగ్రవాదం వంటి అరాచకశక్తులను నిరోధించే ప్రయత్నంగా కథనాలు వేయండి. ప్రజాధనం దోచుకునేందుకు రాజకీయం చేస్తున్న వ్యక్తుల నుండి సమాజాన్ని రక్షించే ప్రయత్నం చేయండి.ప్రజల్లో దేశభక్తి నింపండి. ఇలా సమాజానికి ఉపయోగపడే అంశాలు ఎన్నో ఉన్నాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి నాలుగవ స్థంభం అని చెప్పుకునే ముందు ప్రజాస్వామ్యం ఫరిడవిల్లే ప్రయత్నాలు చేయండి. అంతేగానీ ప్రజా స్వామ్యానికి నాలుగవ స్థంభం అయిన మీడియా ప్రస్తుత పరిస్థితుల్లో చీడలా పట్టింది అని మీడియాకి చెడ్డ పేరు తీసుకురావద్దు. ఇకనైనా ఆడిట్‌బ్యూరో సర్క్యులేషన్, టీఆర్పీ స్థానాల కోసం గుడ్డిగా పరుగులు తీసి అందరి కంటే ముందుండాలి అనే ప్రయత్నంతో మీడియా సంస్థలు స్థాపించడంతో ప్రారంభమైన మీ మీడియా సంస్థల పరుగులు చివరికి శ్మశానాల్లో అంతం అవుతాయి అని అప్పుడు తీసుకెళ్లేది ఏమీలేదని మీడియా సంస్థలు గ్రహించాలి.అలాగే “అన్నీ పోతాయి ఏదీ శాశ్వతం కాదు”.. అని వివిధ రంగాల్లో ఈ విధంగా పరుగులు పెట్టే వారు కూడా తెలుసుకోవాలి.

# 17. మీడియారంగంలో అసలుసిసలైన హీరోలు 'కెమెరామెన్స్'




"సృష్టికి ప్రతిసృష్టిని రూపొందించ గలిగినవారే కెమెరామెన్స్.
మీడియా రంగంలో వీరి సేవలు ఏ మాత్రం కొట్టి వేయలేం. అలాగే రిపోర్టర్‌తో
సమానం అని చెప్పగలం. రానున్న రోజుల్లో కెమెరామెన్స్ ప్రాముఖ్యత తగ్గిపోయి
ఆ బాధ్యతలు కూడా రిపోర్టరే నిర్వహించాల్సిన పరిస్థితుల్లోకి
జర్నలిస్టులు వెళ్ళిపోనున్నారట...!!"

RAJA RATNAM TRUST
HOPE FOR ALL



మీడియా రంగంలో జర్నలిస్ట్‌లు రాసే కథనాలకు, ఫోటోలు, వీడియోలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఒక్క మాటలో చెప్పలేని వివరణ ఒక్క ఫోటో ద్వారా, వీడియో ద్వారా తెలియజేయడంలో మీడియాలో పనిచేస్తున్న ప్రెస్ ఫోటోగ్రాఫర్స్, వీడియో జర్నలిస్ట్‌ల పాత్ర ఏ మాత్రం తీసిపుచ్చలేము. మీడియాలో ఈ పాత్ర పోషిస్తున్న మన కెమెరామెన్స్, వీడియో జర్నలిస్ట్‌ల పరిజ్ఞానం చాలా సూక్ష్మ స్థాయికి వెళ్ళి చాలా పరిశోధనాత్మకంగా తీస్తున్న ఫోటోలు, వీడియోలు జర్నలిస్ట్‌లు రాసే కథనాలకు ఆయువుపట్టుగా ఉంటాయి. ఒక రకంగా చెప్పాలి అంటే వార్తా కథనానికి ఫోటోలు, వీడియోలు ప్రచురణ/ప్రసారం ఆధారాలతోసహా చూపించడం అంటే ఒక కెమెరామెన్ లేకుండా సాధ్యపడే విషయం కాదు. ఇంకా చెప్పాలి అంటే ఒక ఫోటోని, వీడియోని చూసి జర్నలిస్ట్ అనే వ్యక్తి సంఘటన ప్రాంతంకి వెళ్ళకుండానే దానికి అనుగుణంగా మంచి కథనం రాయడానికి ఈ కెమెరామెన్స్ తీసిన ఫోటో, వీడియోలు ఆధారంగా ఉపయోగపడతాయి. చాలామంది నిపుణులైన జర్నలిస్ట్‌లు ఎంచక్కా హాయిగా ఎక్కడో ఒకచోట కూర్చుని కెమెరామెన్స్ తెచ్చిన ఫోటోలు, వీడియోలు పరిశీలించి మీడియాలో ఫ్యూచర్ రైటింగ్ అనే విధానాన్ని అనుసరించి ఒక్క ఫోటో ఆధారంగా సమగ్ర సమాచారాన్ని తమ పత్రికా పాఠకులకు జర్నలిస్ట్ లు అందిస్తున్నారంటే ఆ ఫోటో తీసిన కెమెరామెన్ గొప్పతనం ఎంతటిదో గ్రహించాలి. అదే విధిగా వీడియో జర్నలిస్ట్ పనితనం కూడా ఉంటుంది. కదిలేచిత్రాలు, వాటికదలికలు, వాయిస్‌లు సేకరించిన వీడియో జర్నలిస్ట్‌ల పనితీరు కూడా మన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్‌లకు ఫ్యూచర్ రైటింగ్ విధానంలో టీవీ ప్రేక్షకులను మెప్పించే కథనాలు రాయటానికి మన వీడియో జర్నలిస్ట్‌లు తీసిన క్లిప్పింగ్స్ ఆధారంగా ఉపయోగపడతాయి. ఈ క్రమంలో ఒక వార్తా ప్రచురణ/ప్రసారం వెనుక ఒక జర్నలిస్ట్ కృషి కొంతయితే, కెమెరామెన్స్ కృషి ప్రాముఖ్యమైనదిగా చెప్పుకోవచ్చు. కాబట్టి కెమెరామెన్స్, వీడియోజర్నలిస్ట్‌ల పాత్రే ఆ కథనం వెనుక మూలం అని గ్రహించాలి. ఇందులో జర్నలిస్ట్ తక్కువకాదు, కెమెరామెన్స్ తక్కువకాదు ఇద్దరు సమానమే...సింపుల్‌గా చెప్పాలి అంటే కెమెరామెన్, జర్నలిస్ట్ అనే ఇద్దరు ఒక తల్లికి జన్మించిన కవల పిల్లలు లాంటి వారు కాగా ఆ కవలపిల్లల్లో కెమెరామెన్ అనేవాడు పెద్దకొడుకు అని ఇక్కడ పెద్దకొడుకు అనే వాడి ప్రాముఖ్యత, పాత్ర ఎలా ఉంటుందో మనం గ్రహించాలి.

మీడియా కథనాలకు కెమెరామెన్స్ అందిస్తున్న సేవలు ఎవ్వరూ కొట్టిపారేయరాదు. కెమెరామెన్స్ అంటే ఒక జర్నలిస్ట్ తరువాతనే అని అనుకోవడం పొరపాటు.అయితే నేడు మీడియాలో కెమెరామెన్స్/వీడియో జర్నలిస్ట్‌లకు లభిస్తున్న స్థానం ఏమిటి...?అని మనకు

మనం ప్రశ్నించుకుంటే మీడియారంగంలో వారు పనిచేస్తున్న సంస్థల్లో చాలా వరకు కెమెరామెన్స్ పట్ల చాలా చులకన భావం ఉంది. ఈ విధానంలో జర్నలిస్ట్‌లకు లభించే గౌరవ మర్యాదలకు, ఆదరణకు ఈ కెమెరామెన్స్ ఆమడదూరంలో ఉన్నారనేది తెలుసుకోవచ్చు. శారీరకశ్రమ, ఒక జర్నలిస్ట్‌కు లభించే గౌరవానికి దూరంగా కెమెరామెన్స్, ప్రోత్సాహంగా, ఒక్క చాలీచాలని జీతం తప్ప ఏ విధంగా ఆర్థిక సహకారం లేకపోవడం, జర్నలిస్ట్‌లు ఉన్నా, లేకపోయినా అన్నీ తానై జర్నలిస్ట్ పాత్ర కూడా పోషించడం, కొన్ని కొన్ని సమయాల్లో త్రీజీ, ఫోర్ జీ కిట్లు మోసే గాడిదల్లా, మరికొన్ని సమయాల్లో ఓబీ వ్యాన్ల టెక్నీషియన్స్‌గా, ఇంకా చెప్పాలిఅంటే తాము పనిచేస్తున్న మీడియా ఆఫీసుల్లో స్వీపర్స్‌గా, ఆ ఆఫీసులకు వచ్చే పలువురు అతిథులకు సర్వర్లుగా టీలు, టిఫిన్లు అందించడం అనంతరం వాటిని క్లీన్ చేసేపనులతో పాచి పనులు చేసే వారిగా ఇలా ఎన్నో వారుచేయరాని పనులు చేస్తూ గౌరవప్రదమైన మీడియారంగంలో  ఉండి కూడా అణిచివేతకు గురవుతున్న మాట వాస్తవం కాదా...? జర్నలిస్ట్‌లందరి వద్ద కాదు  కొంతమంది జర్నలిస్ట్‌ల వద్ద దూషణలు, దెబ్బలకు గురిఅవుతూ మనుగడ కోల్పోతున్న వీడియో జర్నలిస్ట్‌లు ఎంతోమంది ఉన్నారు.

ఉన్నత విద్యలో డిగ్రీలు, పీజీలు, ఫోటో, వీడియో గ్రఫీలలో ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించి ఎక్కడా అవకాశాలు లేక తనకంటే తక్కువ విద్యార్హత కలిగి స్టాఫ్ రిపోర్టర్స్ స్థాయిలో ఉన్న కొంతమంది జర్నలిస్ట్‌ల వద్ద మనసు, ఆత్మాభిమానం చంపుకొని కేవలం యంత్రాల్లా పనిచేస్తున్న కెమెరామెన్స్ ఎంతోమంది ఉన్నారు. అసలు వీరికి జర్నలిజంలో కెమెరామెన్స్‌గా ఉండటం వల్ల లాభాలు ఏమిటి...? వీరి జీవితాలకు చివరి వరకు భరోసా ఉందా....?వయసుడిగిపోక ముందే మేలుకున్నా జీవితచారమాంకంలో వీరికి బ్రతకడానికి ఆర్థికభరోసా ఏమైనా ఉందా....? అటువంటి సమయంలో ఈ కెమెరామెన్స్‌ని ఆదుకునేవారు ఎవరు....?జీవిత కాలం మీడియాలో పనిచేసినా, వారు పనిచేసిన మీడియా సంస్థ అయినా వీరిని ఆదుకుంటుందా...?అంటే... అదీ లేదు. ఒక రకంగా చెప్పాలంటే మీడియాలో అత్యంత ప్రాముఖ్యం కలిగిన వారు ఎవరు అంటే కెమెరామెన్స్ అని మనం చెప్పుకున్నాం...!కానీ మీడియాలో పని చేస్తున్న అత్యంత ప్రాముఖ్యత లేని విభాగం కెమెరామెన్స్ వింగ్ అని మనం క్షుణ్ణంగా పరిశీలన చేస్తే తేలిపోతుంది.లేదా ఏ కెమెరామెన్‌ని కదిలించినా వారి ప్రాముఖ్యత ఎలాఉంది అని భరోసాలేని, మనుగడలేని దారిద్ర్యపు జీవితాలు అని, మనం వినగలిగే ఓపిక ఉండాలి గానీ భోరున విలపిస్తూ కథలు,కథలుగా చెప్పేవారు ఉన్నారు. ఇలా ఉన్నాయి మీడియారంగంలో పనిచేస్తున్న కెమెరామెన్స్ జీవితాలు. మీడియారంగంలో పనిచేస్తున్న మన కెమెరామెన్స్ జీవితచరమాంకంలో హాయిగా జీవించేందుకు వారు పనిచేస్తున్న

మీడియా సంస్థలు గానీ, ప్రభుత్వం గానీ ఆదుకుని భరోసా కల్పించేందుకు మంచి మనసుతో ముందుకు రావాలి. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి జర్నలిజం నాలుగవ స్థంభం అని చెప్పుకోవడమే గానీ ఆ నాలుగవ స్థంభంను నిలబెట్టేందుకు జీవితాలను ఫణంగా పెడుతున్న జర్నలిస్ట్‌లు, కెమెరామెన్స్ పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలియంది కాదు. ఎవ్వరో కొందరు జర్నలిస్ట్‌లు అక్రమ సంపాదనతో స్థిరపడితే జర్నలిస్ట్‌లందరు అలానే ఉన్నారు అనుకోవడం పొరపాటు. ఇక్కడ మరో విషయం ఏమిటంటే ఎక్కడో ఒక చోట జర్నలిస్ట్‌లు జర్నలిజాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించుకున్నారు అనుకోవడం తప్పుకాదు. మరెక్కడయినా ఒక కెమెరామెన్ జర్నలిజాన్ని అడ్డుపెట్టుకుని ఎంత మేరకు అక్రమ ఆస్థులు సంపాదించాడా...? అంటే భూమండలంపై ఎంతటి దర్పణం వేసి చూసినా సమాధానం దొరకని ప్రశ్న ఇది. అంతటి విలువగలిగిన జీవితాలు మీడియారంగంలో పనిచేస్తున్న కెమెరామెన్స్ జీవితాలు. అసలు మీడియారంగంలో ఉన్న మన కెమెరామెన్స్/వీడియో జర్నలిస్ట్‌ల జీవితాలు, వారి పనితీరు, మనుగడ ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

## "ఫోటో జర్నలిజం ప్రాముఖ్యత"[1]

మీడియా రంగంలో ఫొటో జర్నలిస్టుల, వీడియో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమైనది. ఫొటో జర్నలిజం పితామహుడు ఆస్కార్ బర్నాక్ . ఫొటో జర్నలిజం వృత్తినే ప్రాణప్రదంగా భావిస్తూ పనిచేస్తున్న పాత్రికేయులకు, ఫోటో/వీడియోజర్నలిస్ట్‌లకు మీడియారంగంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఇవ్వాలి. ఫొటో జర్నలిజం సాహసంతో కూడుకున్న వృత్తి. ఈ రోజుల్లో ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్‌లతో ఫొటోలు తీస్తున్నా.. ఫొటో జర్నలిస్టలు, వీడియో జర్నలిస్ట్‌లు తీసే చిత్రాలు పాఠకుని/వీక్షకుని హృదయాన్ని కదిలించే విధంగా ఉంటాయి.ఫోటో జర్నలిజంలో నాటికి నేటికి ఫోటో జర్నలిజం పితామహుడు ఆస్కార్ బర్నాక్ కనుగొన్న 35.ఎం.ఎం, స్టిల్ కెమెరా, లైకా వంటి వీడియో కెమెరాలు ఫోటో జర్నలిజంకి మూలాలు. ఫోటో/వీడియో జర్నలిస్ట్‌లకు ఆస్కార్ బర్నాక్ అనే వ్యక్తి ఫోటో జర్నలిజం పితామహుడు అని ఫోటో జర్నలిజంలో ఉన్నవారు చాలామంది గ్రహించలేని విషయం.

మీడియా రంగంలో ఫోటో జర్నలిస్ట్/వీడియో జర్నలిస్ట్‌లుగా ఉన్నవారు ఒక ఛాలెంజింగ్ వృత్తి చేపట్టిన సాహసవీరులుగా గుర్తించాలి.వృత్తిపట్ల ఎంతో అంకితభావంతో ఎన్నిసమస్యలు ఉన్నా వాటిని అధిగమిస్తూ పగలనక, రాత్రనక, కుటుంబాలకు, బంధుమిత్రులకు,స్నేహితులకు, పండగలు, పబ్బాలు, బంధువుల ఇంట శుభకార్యాలకు అన్నిటికి దూరమవుతున్నారు. జర్నలిస్ట్‌లకు ఇదే సమస్య ఉన్నా, కెమెరామెన్‌లకు కనీస సెలవులు కూడా లేకుండా వృత్తికి అంకితమై చాలావరకు పర్సనల్ లైఫ్‌ని కోల్పోతున్నారు.



*Source Internet :* 1. 'ఫోటో జర్నలిజం ప్రాముఖ్యత'[1]

## స్ట్రింగర్స్ కూడా వీడియో జర్నలిస్ట్‌లే

2005వ సంవత్సరం అనంతరం మీడియారంగంలో టీవీ న్యూస్ ఛానల్స్ క్రమ క్రమంగా లెక్కకు మించి పుట్టుకొచ్చాయి. దీనితో ఎలక్ట్రానిక్ మీడియారంగంలో పోటీ ఏర్పడింది. ఈ కారణంగా ప్రతి నియోజకవర్గంతో పాటు, ముఖ్యమైన ప్రాంతాలలో జర్నలిస్ట్‌లని, కెమెరామెన్స్ ని మీడియా సంస్థలు రిక్రూట్ చేసుకుంటూ వచ్చాయి. అయితే పేరుకే ఇటువంటి స్ట్రింగర్స్ జర్నలిస్ట్‌లుగా పరిగణించబడుతున్నారు. వీరిని జర్నలిస్ట్‌లని హోదా కల్పిస్తూ కనీసం వేతనం, ఐడీ కార్డ్స్, వంటి సదుపాయాలు కూడా కల్పించకుండా పరోక్షంగా స్ట్రింగర్స్‌ని కెమెరామెన్‌ల లాగానే మీడియా సంస్థలు వాడేస్తున్నాయి.

చాలా వరకు స్ట్రింగర్స్‌ని కెమెరామెన్ వలే వాడుతున్న విషయం స్ట్రింగర్స్ కూడా తమస్థానం ఏమిటి అని గ్రహించలేకపోతున్నారు. స్ట్రింగర్స్ అంటే జర్నలిజం లో ఏ మాత్రం ప్రావీణ్యం లేని వారిగా ఒక తేలికపాటి దృష్టితో మీడియా సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ఒక స్ట్రింగర్ ఎంతో కష్టపడి తన సొంత కెమెరాతో విజువల్స్ తీసి, సేకరించిన వార్త కు స్క్రిప్ట్ రాసి ఆఫీసుకు పంపితే వాటిని పరిశీలించిన డెస్క్ ఇంచార్జ్‌లు నిర్దాక్షిణ్యంగా స్క్రిప్ట్ మార్చి వేయడం జరుగుతుంది. మరి ఇటువంటి పరిస్థితులు ఉన్నాయా...?లేదా.....?అంటే స్ట్రింగర్స్‌ని అడిగితే సరైన సమాధానం వస్తుంది. ఒక్కో సమయంలో విజువల్స్ బాగాలేదు, క్లారిటీలేదు, షేక్ అవుతున్నాయి, వాయిస్ లేదు అని స్ట్రింగర్స్ పంపిన విజువల్స్ అసలు ఎందుకు పనికిరావు అని స్ట్రింగర్స్‌ని ఇష్టానుసారంగా దూషించే ఇంచార్జ్‌లు ఉన్నారు. ఇటువంటి ఇంచార్జ్ లు ఒకటి గమనించాలి. స్ట్రింగర్స్‌ని ప్రావీణ్యం లేని వారిగా గుర్తించి ఏ మీడియా సంస్థ ఆయినా కొంతకాలం న్యూస్ కవరేజీకి సంభందించి విజువల్స్ ఎలా ఉండాలి అనే దానిపై స్ట్రింగర్స్‌కి ఏమైనా న్యూస్ విజువల్స్ టేకింగ్ ఎలా ఉండాలి అని ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు స్ట్రింగర్స్‌కి ఎప్పుడైనా, ఎక్కడైనా ఇన్ని రోజులు అని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాయా...? మీడియా సంస్థలు తమ పబ్బం తాను గడుపుకుంటూ స్ట్రింగర్స్‌ని విజువల్స్ బాగా లేదని దూషించడం సబబేనా...? ఆయా ఛానల్స్‌కి పగలనక, రేయి అనక, ఎండా, వానా, చలి అని చూడకుండా అహోరాత్రులు స్ట్రింగర్స్ తమ శ్రమనంతా ధారబోసి శక్తివంచన లేకుండా పనిచేస్తుంటే స్ట్రింగర్స్‌ని తేలికభావంతో చూస్తూ పలుఛానల్స్ కనీస గుర్తింపు లేకుండా ఐడీ కార్డ్స్ గానీ, కనీస గౌరవ వేతనం గానీ ఇవ్వకుండా, అలాగే కొందరు స్ట్రింగర్స్‌కి అక్రిడేషన్ కూడా ఇవ్వకుండా ఇష్టానుసారంగా వాడేస్తూ స్ట్రింగర్స్ వ్యవస్థను ఏదో నియామకం చేసాం అని సరిపుచ్చుకుంటే ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు ఈ పద్ధతి సరికాదు. కాబట్టి స్ట్రింగర్స్ కూడా ఒకసారి

ఆలోచించాలి. అసలు ఎలక్ట్రానిక్ మీడియాలో స్ట్రింగర్స్‌ది క్షేత్రస్థాయిలో పనిచేసి ఆయా ఛానల్స్‌కి కావలసిన న్యూస్‌ఫీడ్ తమ సొంతకెమెరాల ద్వారా అందిస్తున్న ప్రముఖపాత్ర స్ట్రింగర్స్‌దే అని మీడియాసంస్థలు ఇప్పటికైనా గ్రహిస్తే మంచిది. ఇక మీడియారంగంలో స్ట్రింగర్స్ అనేవారు కూడా ఆయా మీడియాసంస్థలకు తాము అందించే వీడియో విజువల్స్ ఎంత ప్రాముఖ్యం ఉందంటే...స్ట్రింగర్స్ రాసే స్క్రిప్ట్ అయితే విసిరి అవతల పడేసినా, స్ట్రింగర్స్ పంపించిన విజువల్స్ మాత్రం నాణ్యత లేకపోయినా ఏదో ఒక విధంగా వాడుకునే ప్రయత్నం తప్పనిసరిగా చేస్తారు. ఇక్కడే అర్థం అవుతుంది. నీ స్క్రిప్ట్ ఎవరికి కావాలోయి... ముందు విజువల్స్ మంచిగా పంపించు అని పలువిధాలా బెదిరించి స్ట్రింగర్స్‌ని కేవలం నాణ్యతా,ప్రమాణాలు లేని కెమెరామెన్స్ గానే మీడియాసంస్థలు వాడుకుంటున్నాయి. కాబట్టి మీడియా హెడ్ ఆఫీసుల్లో,జిల్లా కేంద్రాలలో పనిచేసే స్టాఫ్ కెమెరామెన్స్, స్ట్రింగర్స్ అనే వారు కూడా తమలో ఓ అంతర్ భాగమే అని గ్రహించాలి. కెమెరా మెన్స్ సమస్యలలో స్ట్రింగర్స్‌ని కూడా తమతో సరిసమానంగా కలుపుకుపోవాలి. లేదంటే స్ట్రింగర్స్ అన్యాయం అయిపోయే అవకాశం ఉంది. ఎంతయినా మనతోటి జర్నలిస్ట్‌లు కాని కెమెరామెన్స్ కాబట్టి ఇది నేను నా పరిశోధనలో గ్రహించిన విషయం. ఈ విషయం పై స్ట్రింగర్స్, సంస్థలో గుర్తింపు కలిగిన వీడియోజర్నలిస్ట్‌లు ఓసారి పరిశీలన చేసుకోమని సూచన. అందరూ బాగుండాలి, అందులో నేను ఉండాలి అని సూక్తితో మీడియా సంస్థల్లో గుర్తింపు కలిగిన కెమెరామెన్స్, జర్నలిస్ట్ అనే హోదా వెనుక పని చేస్తూ నలిగిపోతున్న మన స్ట్రింగర్స్‌ని ఫోటో/ వీడియో జర్నలిస్ట్‌లు ఆలోచించి కలుపుకుపోయే మనసుతో మమేకం కండి.

## ఫోటో/వీడియో జర్నలిస్ట్‌లకు కంటి చూపుతో ఫిట్నెస్ టెస్టులు

ప్రస్తుతం మీడియారంగానికి ఫోటో/వీడియో జర్నలిస్ట్‌ల అవసరం కొంతకాలంగా బాగా డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఎంత డిమాండ్ ఉన్నా పలుమీడియా సంస్థల కెమెరా విభాగాలు కెమెరామెన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్లిన వ్యక్తులను తమ సంస్థలో కెమెరామెన్‌గా ఉద్యోగం ఇవ్వాలి అంటే ఆ పోస్ట్ కోసం ఇంటర్వ్యూకి వెళ్ళిన వ్యక్తికి అన్నిరకాల స్కిల్స్ ఉన్నా, ఎక్కడో తేడా కొట్టి వెనుదిరుగుతున్నారు. ఇక్కడ వెనుదిరిగి రావటానికి కొన్ని కారణాలు ఉన్నాయి.

ప్రధానంగా కెమెరామెన్ పోస్ట్ కోసం ఇంటర్వ్యూకి వెళ్ళినవ్యక్తి ఆయామీడియా సంస్థలో కెమెరా డిపార్ట్మెంట్ హెడ్ వర్గానికి, కులానికి చెందినవాడై ఉండాలి. అలాగే రిపోర్టర్ లేని సమయంలో కెమెరామెన్స్ అనే వారు తాము సేకరించిన వార్త ఆఫీసుకు చేరవేసి ఉపయోగం లేదు. అందుకు కెమెరామెన్ అనే వాడు కనీసం డిగ్రీ అర్హత కలిగిఉంటే ఆ

వార్తకు సబంధించి సమాచారం న్యూస్ డెస్క్‌కి అందించే ప్రావీణ్యం కలిగి ఉండేందుకు కెమెరామెన్స్‌కి కూడా కొన్ని మీడియా సంస్థల్లో డిగ్రీ అర్హతగా నియామకం చేస్తున్నారు.

ఇక మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే... ఫోటో/వీడియో జర్నలిస్ట్ అనే వ్యక్తిని తమ సంస్థలో నియామకం చేయాలి అంటే ప్రధానంగా శారీరక దృఢత్వం అనే టెస్ట్ కంటిచూపుతోనే జరిగిపోతుంది. కెమెరామెన్ పోస్ట్‌కి వచ్చిన వ్యక్తి వయసు ఎంత...?వ్యక్తి బలంగా ఉన్నాడా...లేదా....? ఈ వ్యక్తి వల్ల మనకు పూర్తి సహకారం ఉంటుందా... లేదా....? మాటతీరు... బాడీ లాంగ్వేజీ వంటి అన్ని విధాలా కంటిచూపుతోనే పలురకాల టెస్టులు జరిగి పోతున్నాయి. ఇప్పుడు చెప్పుకున్న ప్రధానాంశాలు అన్నీ ఒక ఎత్తు అయితే ఎన్ని స్కిల్స్ ఉన్నా అక్కడ ఏ రిపోర్టర్ క్రింద పని చేయాలో...ఆ రిపోర్టర్ గారి రెఫరెన్స్,రికమండేషన్ తప్పనిసరి. ఈ విధానం అన్ని ఛానల్స్‌లో కాదు గానీ ఎక్కువ శాతం ఛానల్స్‌లో ఇదే జరుగుతుంది.

## 24అవర్స్ 365డేస్ ఆన్‌డ్యూటీలో కెమెరామెన్స్

పైన మనం చెప్పుకున్నట్లు ఎలక్ట్రానిక్ మీడియారంగంలో జర్నలిస్ట్–కెమెరామెన్ అనే ఇద్దరు ఒకేతల్లి గర్భాన పుట్టిన కవలలు అని అనుకున్నాం. అయితే ఇందులో కెమెరామెన్ అనేవాడు ఎంతకాదు అన్నా పెద్దవాడు అనే విషయం ఇక్కడ ప్రస్తావన చేద్దాం.ఒక న్యూస్ కవరేజి చేయాలి అంటే జర్నలిస్ట్, కెమెరామెన్ ఇద్దరు ముఖ్యమే. అయితే ఇక్కడ ఏమిజరుగుతుంది ఒకసారి పరిశీలనచేద్దాం.ఒక జర్నలిస్ట్‌కు కేటాయించిన ప్రాంతంలో ఏ సంఘటన జరిగినా... జర్నలిస్ట్– కెమెరామెన్ ఇద్దరు పని చేయాల్సిన అవసరం ఉంది. ఎంత అవసరం ఉన్నా జర్నలిస్ట్‌కు కవరేజికి వెళ్లకుండా వెసులుబాటు ఉంటుందిగానీ, కెమెరామెన్‌కు ఏ మాత్రం వెసులుబాటు ఉండదు. కెమెరామెన్ న్యూస్ కవరేజీకి వెళ్ళాక గడియారంలో ముల్లులా ప్రతి నిమిషం పనిచేయాల్సి ఉంటుంది. ఏ అర్ధరాత్రి,అపరాత్రి అయినా కెమెరామెన్ సంఘటనా ప్రాంతానికి వెళ్లక తప్పదు. కానీ ఈ సమయంలో ఆ కెమెరామెన్‌కి చెందిన జర్నలిస్ట్ మాత్రం హాయిగా రెస్ట్‌లో ఉంటాడు. కాకపోతే సంఘటనా ప్రాంతానికి వెళ్ళిన కెమెరామెన్‌పై ప్రతిక్షణం పర్యవేక్షణలో ఉంటాడు. మరో నగ్నసత్యం ఏమిటంటే జర్నలిస్ట్‌లందరూ కాదుగానీ కొంతమంది జర్నలిస్ట్‌లు ఉన్నారు. అది లైవ్ ఇవ్వాల్సిన న్యూస్ కాకపోతే ఇక పూర్తి బాధ్యతలు కెమెరామెన్ నిర్వహించాల్సిందే. ఇక కెమెరామెన్స్ తీరికలేని ఉద్యోగ బాధ్యతల నడుమ పూర్తిగా నలిగిపోతున్నారు. డ్యూటీలో ఎంతవర్క్ ఉన్నా పూర్తిస్థాయిలో అంకితభావంతో పనిచేస్తున్నారు. కొన్ని ఛానల్స్ కెమెరామెన్స్ కి వీక్‌ఆఫ్‌లు, నెలలో ఇన్ని సెలవులు అని అమలుచేస్తున్నాయి. ఇది చాలా వరకు మెచ్చుకోదగిన విషయం.

ఇక కొన్ని ఛానల్స్ మాత్రం కెమెరామెన్స్‌ని వీక్‌ఆఫ్‌లు, నెలకు ఇన్ని సెలవులు అని లేకుండా ఏడుతరాల బానిసత్వం అన్నట్లు పిండి పిప్పి చేస్తున్నాయి.

## పర్సనల్ లైఫ్ కోల్పోతున్న కెమెరామెన్స్

పర్సనల్ లైఫ్ అంటే మరోలా భావించకండి. ఇక్కడ నేను చెప్పదలుచుకున్న విషయం. ప్రతి కెమెరామెన్‌కి ఓ కుటుంబం ఉంటుంది.కొందరు బ్యాచిలర్స్ కూడా కెమెరామెన్స్‌గా జర్నలిజంలో వీడియో జర్నలిస్ట్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక వివాహం చేసుకుని నిరుద్యోగ సమస్యను పూరించుకోవాలి అనుకొని మీడియారంగంలో వీడియో జర్నలిస్ట్‌గా చేరితే కాస్త జీవితానికి జీవనభరోసా దొరుకుతుంది, అలాగే పలువురు జర్నలిస్ట్‌లకు లభిస్తున్న గౌరవమర్యాదలు తనకు దక్కుతాయి అలా దక్కటం ఒక హోదా అని భావిస్తూ ఫోటో స్టూడియో రంగం నుండి మీడియా రంగంలోకి వస్తున్న కెమెరామెన్స్ ఎక్కువమంది వీడియో జర్నలిస్ట్‌లు కావడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తూ వారిలో కూడా ఏ కొద్ది మంది మాత్రమే మీడియారంగంలో స్థానం సాధిస్తున్నారు.

ఇక ఏ పనిచేస్తున్నా చివరికి లోకం అంతా ప్రశాంతంగా నిద్రపోతున్నా కెమెరామెన్ అనే వాడు ఏ రాత్రి కాడ, ఏ ఫోన్ వస్తుందో ఎక్కడ ఏ సంఘటన జరుగుతుందో, ఏ కవరేజీకి ఎటు వెళ్లాల్సివస్తోందో అనే ఆలోచనలో ప్రశాంతంగా నిద్రపోలేని రాత్రులు గడపాల్సి వస్తుంది. ఇందుకోసం ఏ సమయాన అయినా అందుబాటులో ఉండేందుకు సెల్‌ఫోన్ దిండు క్రింద పెట్టుకుని నిద్రపోతున్నారు మన కెమెరామెన్స్. ఇక అనుకోని పరిస్థితుల్లో ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగితే ఆ సంఘటనా సమాచారం ఏదైనా ఛానల్‌లో స్క్రోలింగ్ వచ్చిన వెంటనే ముందుగా ఆ ఏరియా జర్నలిస్ట్‌కు మీడియా సంస్థల నుండి మొదట ఫోన్ వస్తుంది. ఇక అంతే ఎవరో పేళ్లుమని చరిచినట్టే ఆ జర్నలిస్ట్ తుళ్ళిపడి నిద్రలేవటం జరుగుతుంది. ఫోన్ లిఫ్ట్‌చేసి ఎవరు...ఏమిటి అని చూసేలోగా అవతలి నుండి ఫోన్ చేసిన మీడియా సంస్థలో పై స్థాయి డెస్క్ ఇంచార్జ్‌లు గానీ, కో–ఆర్డినేటర్స్ గానీ మరే స్థాయి ఇంచార్జ్ గానీ అప్పుడు వారు మాట్లాడే లాంగ్వేజీ వినాలి. ఏమయ్యా...అక్కడ అది జరిగింది. ఇక్కడ ఇది జరిగింది. ఎప్పటికి స్క్రోలింగ్ చెబుతావు... విజువల్స్ ఎప్పుడు పంపిస్తావు. వాళ్ళనిచూడు, వీళ్ళనిచూడు ఉత్త పనికిమాలిన సంతలా... ఉన్నారు.ఏం చేస్తున్నావు, తిని తొంగున్నావా...? కాళ్ళు ఆరజాపుకున్నావా..? పెళ్ళాం పక్కలో పడుకున్నావా...! ఇలా వామ్మో... వినరాని, భరించలేని మాటలు కొంతమంది పై స్థాయి సుపీరియర్స్ నుండి వినాల్సి వస్తుంది. అయితే ఇలాంటి మాటలు కేవలం జర్నలిస్ట్‌లకే కాదు...ఏక కాలంలో కెమెరామెన్స్‌కి తప్పవు.

అయితే ఓ పది నిమిషాలు అటూ,ఇటుగా జర్నలిస్ట్‌లు వెళ్లినా వెళ్లకపోయినా కెమెరామెన్స్ మాత్రం తప్పనిసరిగా వెళతారు. కాకపోతే ముందు స్క్రోలింగ్ ఎందుకు చెప్పలేదని జర్నలిస్ట్‌లను తిడితే, ముందు ఎందుకు విజువల్స్ పంపలేదు ఆ విజువల్స్ ఏవి...? ఈ విజువల్స్ ఏవి...?అని కెమెరామెన్స్‌ని వాయించడం తప్పదు.ఇక ఏ కెమెరామెన్ అయినా కాస్త బద్ధకించి లేటుగా వెళ్లినా మొత్తం తిట్లన్నీ జర్నలిస్ట్‌కు తప్పవు.ఇలా ఉంటుంది మరి అహోరాత్రులు పనిచేసినా ఒక్కరాత్రి ఏ సంఘటన అయినా మిస్ అయితే అంతా కెమెరామెన్ వెళ్లకపోవడం వల్లే ఈ సమస్య అని ఉన్నపళంగా కెమెరామెన్‌ని ఆ ఛానల్ నుండి పీకేయడం జరుగుతుంది. ఇకదానితో ఆ కెమెరామెన్ పనికిరాడు, అసలు పనిచేయడు అనే ముద్ర అతనిపైపడుతుంది. దానితో మరోఛానల్‌లో ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎక్కడా అవకాశం రాదు. కాబట్టి మీడియా సంస్థలు కాస్త కెమెరామెన్స్ పట్ల పట్టు విడుపుల భావన కలిగి ఉండాలి. 24గంటలు కెమెరామెన్ అనేవారు ఆయా ఛానల్ జర్నలిస్ట్ అండర్‌లో ఉంటాడు కాబట్టి వారిద్దరి మధ్య సఖ్యత, సమానభావం అనేవి ఉండేలా పలుఛానల్స్ కెమెరా డిపార్ట్మెంట్ హెచ్.ఓ.డీ,లు తగిన చర్యలు తీసుకుని ఆరోగ్యకరమైన వాతావరణంలో వారు పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇక అసలు విషయం ఏమిటంటే...! ఎంతోమంది పెళ్ళైనవారు మీడియారంగంలో కెమెరామెన్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 24గంటలు 365రోజులు విధుల్లో ఉండే కెమెరామెన్స్ పాపం వారికి కుటుంబాలు ఉన్నాయనే సంగతి ఆంతగా గుర్తించలేరు. కోడికూతకు ముందే నిద్రలేచి,ఊరంతా గాఢనిద్రలో ఉన్న సమయంలో ఇంటికిచేరే జర్నలిస్ట్‌లుగానీ, కెమెరామెన్స్‌కుగానీ కుటుంబ బాధ్యతలు ఇంటిలో ఎవరు ఉంటే వారిపై వదిలేసి పొద్దు పొద్దునే తిని,తినక విదుల్లోకి వెళ్ళిపోతారు. ఇక భార్యకు రోజువారీ అవసరమైన కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందించే సమయం కూడా ఉండదు. చదువుకునే చిన్నపిల్లల ఆలనా, పాలనా వీరికి పట్టదు. అసలు ఎప్పుడూ బిజీగా ఉండే కెమెరామెన్స్, జర్నలిస్ట్‌లు తమ చిన్నారిబిడ్డల ఎదుగుదల చూడలేకపోతున్నారు. సాయం సంధ్య వేళ పిల్లలకు ప్రేమను పంచలేక, ఇంటిలో వృద్ధులైన తల్లిదండ్రులు ఉంటే వారి బాగోగులు పట్టించుకోక, వారి ఆరోగ్య సమస్యలు తీర్చలేక తల్లిదండ్రులని చేజేతులా కోల్పోతున్న కెమెరామెన్స్, జర్నలిస్ట్‌లు ఎందరో ఉన్నారు. కావాలి అంటే అటువంటి వారిని ఒకసారి కదిలిస్తే మన కెమెరామెన్స్, జర్నలిస్ట్‌లు ఏం కోల్పోతున్నారో వారి మాటల్లో వింటుంటే అర్థం అవుతుంది.

మన కెమెరామెన్స్, జర్నలిస్ట్‌ల కన్నీటి గాధలు. ఏదో...నేను చెబుతున్నాను అనుకోవద్దు. పరిశీలించుకోండి... జర్నలిస్ట్ మిత్రులారా....? తేలికగా తీసుకోవద్దు. ఇలాంటి భావన ఉన్నవాళ్ళు జర్నలిజంలోకి రావడం ఎందుకు...? అని ఎదురు ప్రశ్న వేయకండి.

ఎందుకంటే జర్నలిజం ఒక పవిత్రమైన వృత్తి. అది ఒక గౌరవప్రదమైన హోదాగా భావించిన మన జర్నలిస్టులు ఎన్నో ఆశలతో, అంకితభావంతో జర్నలిజంలో పనిచేసి సమాజంలో ఓ గుర్తింపు, పేరు, సంపాదించడంతో పాటు సామాజిక బాధ్యత, సమాజానికి ఓ భద్రత కల్పించాలి అని జర్నలిజంలో ప్రారంభమైన మన పరుగులు చివరికి ఏమీ సాధించలేక మన బ్రతుకులు శ్మశానాల్లో అంతమవుతున్నాయి. ఇంకా చెప్పాలి అంటే ఎంతో అందంగా, సుందరంగా, దూరపుకొండలు నునుపు అన్నట్లు మనం జర్నలిజం అనే దగ, దగా మెరిసిపోతున్న స్వర్ణసాగరం అనే నడిసముద్రంలో చిక్కుకుని ఉన్నాం. నడిసంద్రంలో ఏ దిక్సూచి లేని నావలా మన బ్రతుకులు చిక్కుకుని ఉన్నాయి. ఆదమరిస్తే మొదటికే మోసం తప్ప మనకు చివరకు మిగిలేది ఏమీ లేదు. అయితే మన జర్నలిస్టులకు తెలియంది ఏమీ కాదు. అన్నీ పోతాయి...ఏదీ శాశ్వతం కాదు అనే సిద్ధాంతం మనకు బాగా తెలుసు. ఇంత తెలిసినా జర్నలిజంలో మన హక్కుల కోసం మనం పోరాటం చేయలేక రెక్కలు తెగిన పక్షుల్లా, దేని కోసం...ఎందుకోసం ఈ జర్నలిజం అనే స్వర్ణసాగరాన్ని ఈదే ప్రయత్నం చేస్తున్నామో...? ఏ జర్నలిస్ట్ చెప్పలేని మిలియన్ డాలర్ల ప్రశ్న.

## వృత్తి కెమెరామెన్ కానీ అదనపు బాధ్యతలు

మీడియా రంగంలో మొదట కెమెరామెన్‌గా విధుల్లో చేరే పలువురు కెమెరామెన్స్ ఈ రోజు మీడియా రంగంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో కెమెరామెన్ అంటే భుజాన కెమెరా వేసుకుని, కెమెరాకు అవసరమైన పవర్ కావాలి అంటే మూడు, నాలుగు కేజీల బరువు ఉండే బ్యాటరీ భుజాన వేసుకుని కొంత బరువును మోస్తూ న్యూస్ కవరేజి చేయాల్సి ఉండేది. అయితే ప్రస్తుతం ఆ బ్యాటరీల స్థానం కెమెరాలోనే ఇమిడి ఉండటంతో బ్యాటరీల బరువు తగ్గింది. పోనీ బ్యాటరీల బరువుతగ్గింది అనుకుంటే ప్రస్తుతం మరింతబరువు, బాధ్యతలు కెమెరామెన్స్‌కి పెరిగాయి. అయితే ఈ బరువు బాధ్యతలు జర్నలిస్టులకు ఏ మాత్రం పట్టవు.

ప్రస్తుతం మీడియా రంగంలో కెమెరామెన్స్‌కి అదనపు బాధ్యతలు అని ఎందుకు చెపుతున్నానంటే టెక్నాలజీ బాగా పెరిగింది. ఈ పెరిగిన టెక్నాలజీ కెమెరామెన్స్‌కి అదనపు బాధ్యతలు అంటగట్టింది. ఎలాగంటే...ఎలక్ట్రానిక్ మీడియాలో లైవ్ ప్రోగ్రామ్స్ ఇచ్చేందుకు మారుతున్న కాలానికి అనుగుణంగా ఓ.బీ వ్యాన్స్ వచ్చాయి. ఓబీ అంటే (అవుట్ సైడ్ బ్రాడ్ కాస్టింగ్) అని అర్థం అంటే ఎక్కడి వార్తలు అక్కడ లైవ్ టెలికాస్ట్ చేయడం. అలాగే కొన్ని సమయాల్లో కొందరు కెమెరామెన్స్ ఓబీవ్యాన్ టెక్నీషియన్స్ లేని సమయంలో కెమెరామెన్స్ టెక్నీషియన్స్ గాను మారుతున్నారు. ఓబీవ్యాన్ డిష్‌లు ఎత్తడం, శాటిలైట్ సిగ్నల్స్ కోసం

కష్టపడటం వంటి పనులతో ఓబీవ్యాన్ రేడియేషన్‌కి భయపడి ఉద్యోగం వదిలేయడం చేస్తున్నారు. ఇక ఇక్కడ కెమెరామెన్ ఓబీవ్యాన్‌కి కనెక్ట్ చేయబడిన కేబుల్ వైర్లు కెమెరాకి ఫిక్స్ చేసుకుని కొన్ని మీటర్ల దూరంవరకు వెళ్ళి అక్కడ జరిగే కార్యక్రమం కవర్ చేయాలి. ఈ క్రమంలో తన కెమెరాకు, ఓబీవ్యాన్‌కి కనెక్ట్ అయిన కేబుల్ వైర్లను లాక్కుంటూ, భారీ సభలు అయితే జనాల మధ్య నుండి కెమెరా బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు, వెనక్కి, ప్రక్కకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతూ కెమెరాకు ఎంటువంటి సమస్య రాకుండా,మంచి ఫ్రేమ్,కలర్స్ సెట్టింగ్, క్లోజప్,వైడ్ షాట్స్‌తో పాటు అవసరానికి తగినట్లు టిల్ అప్, టిల్ డౌన్, రైట్ టూ లెఫ్ట్ ప్యానింగ్, లెఫ్ట్ టూ రైట్ ప్యానింగ్ తో పాటు తగినంత రిసీవింగ్ వాయిస్ ఇలా అక్కడ దృశ్యాలను ప్రొఫెషనల్ గా షూట్ చేసేందుకు కళ్ళన్నీ కెమెరా వ్యూ ఫాయిండర్‌లో చొప్పించి ఏకకాలంలో కేబుల్‌వైర్లు లాక్కుంటూ చాలా పెద్దరిస్క్ చేస్తున్నారు. కావలసిన విధంగా అక్కడ జరిగే కార్యక్రమాన్ని కెమెరాలో బంధించి వార్తకు అవసరమైన విజువల్స్ సేకరించిఒక ప్రోగ్రామ్ కి సజీవ సాక్ష్యంగా, ఒక బ్రహ్మలా ఆ కార్యక్రమానికి ఓ రూపు ఇచ్చి అది పదికాలాలు చరిత్రలో నిలబడిపోయేలా కెమెరామెన్స్ కష్టపడుతున్నారు.

ఇక ఇదే టెక్నాలజీ మరోఅడుగు ముందుకు వేసి ఓబీవ్యాన్స్, కేబుల్ వైర్లు లేకుండా ఇప్పుడు 3జి,4జి కిట్లు వచ్చాయి. అయినా కెమెరామెన్స్‌కి ఇది కూడా అదనపు భారం అయ్యింది.ఎక్కడైనా లైవ్ ఇవ్వాలి అంటే ఓబీ వ్యాన్ అవసరం ఈ కిట్ల రంగ ప్రవేశం ద్వారా లేకుండాపోయింది. అయితే కొన్ని ఛానల్స్ 3జి,4జి కిట్లు ఆపరేట్ చేయడానికి ప్రత్యేకంగా ఆపరేటర్లని నియమించుకున్నాయి. కొన్ని ఛానల్స్ 3జి,4జి, కిట్లు లైవ్ ప్రోగ్రామ్స్‌కి వెళ్లాల్సివస్తే వాటి ఆపరేటింగ్ బాధ్యతలు కూడా కెమెరామెన్స్ నిర్వహించుకోవాలి అని అందుకు కొంత సమయం కేటాయించి కెమెరామెన్స్ ఆపరేట్ చేసుకోవాలి అనే నిభందనలతో కెమెరామెన్స్‌కి అదనపు బాధ్యతలు విధిస్తున్నాయి.ఇక ఒకప్రక్క భుజం మీద కెమెరా...వీపు మీద 3జి,4జి కిట్లు వేసుకుని ఒక కన్ను కెమెరాలో చొప్పించి ఏకకాలంలో శరీరంలో అన్ని భాగాలు పనిచేసే మర మనుషుల్లా మారిపోయారు మన కెమెరామెన్స్.పాపం దేవుడు కెమెరామెన్ అనే వ్యక్తికి పదిచేతులు, మరోనాలుగు కాళ్ళు, అలాగే ఇంకో రెండుజతల కళ్ళు ఇస్తే బాగుండేది. లేకపోతే ఏంటీ...! కెమెరామెన్స్‌ని మనుషులు అనుకొని అన్నిపనులు ఏకకాలంలో చేయటానికి అతనేమైనా మనిషా.... లేక, యంత్రమా...?

ఇవిచాలవు అన్నట్లు కెమెరామెన్ తనపని తాను చేసి ఒక వార్త సేకరించి/చిత్రీకరించి విజువల్స్ తెస్తే వాటిని ఆఫీస్‌కు చేర్చేందుకు మరలా సిస్టమ్ ముందు కూర్చుని వీడియో ఎడిటింగ్ చేసి న్యూస్ ఫైల్స్ అప్లోడ్ చేసి, అవసరమైతే స్క్రిప్ట్ డ్రాఫ్టింగ్ చేసి, నెట్‌సరిగా పనిచేయక సర్వర్లు స్లోగా ఉండి ఆ వార్త అప్‌లోడ్ అయ్యేవరకు సిస్టం ఎదురు

పడిగాపులుపడుతూ ఎలా పనిచేస్తున్నారో మీడియా సంస్థలు గ్రహించలేక పోతున్నాయా....? చూడండి కెమెరామెన్స్ కష్టాలు పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కెమెరామెన్స్‌ని యంత్రాల్లా వాడుకుంటూ అరకొర జీతాలు ఇస్తూ, ఏదో వారిని ఏడుతరాల బానిసల్లా చూస్తూ..మీడియారంగంలో అణిచివేతకు గురి చేయవద్దు.

## ఎవరికి చెప్పుకోలేని మానసిక సంఘర్షణ

ఇదికూడా మనం మాట్లాడుకోవాల్సి ఉంది. ఏమంటే...!మన మీడియా సంస్థలకు చెందిన పైస్థాయి ఉద్యోగుల బంధువులు, స్నేహితులు, సన్నిహితులు ఏదో ఒక ప్రాంతం నుండి మనం పనిచేస్తున్న ప్రాంతంలో ప్రధాన దేవాలయాల ఆలయ దర్శనకు, దేవుడు/ దేవత పూజలకు లేదా ఇతర పనులకు వచ్చిన సందర్భాలలో మన కెమెరామెన్స్/స్టింగర్స్ ఆ వచ్చిన వ్యక్తులకు సబార్డినెట్స్, సర్వర్లుగా పని చేయాలి. ఎందుకంటే ఆ వచ్చిన వారు మన సుపీరీయర్స్‌కి ఆత్మీయులు కదా... మరి. అసలువారు ఒక భరోసాతో మన ప్రాంతానికి వస్తారు. అంటే ఏముంది మనకోసం అక్కడ ఒకరున్నారు అంతా వారే చూసుకుంటారు అనే భరోసాని మన సుపీరీయర్స్ చేత కల్పించుకుంటారు. మొదటవారు వస్తున్న విషయం కెమెరామెన్స్/స్టింగర్స్‌కి చెప్పకపోయినా అప్పటికే మన జిల్లా రిపోర్టర్‌కి ఫోన్ చేసి ఈ టైంలో వస్తాం అని చెబుతారు. ఇక అంతే మన జిల్లా రిపోర్టర్ మనకు ఫోన్ చేసి మన చైర్మన్‌గారి బంధువులు, కో–ఆర్డినేటర్‌గారి స్నేహితులు, ఎడిటర్‌గారి సన్నిహితులు పలానాచోటికి వస్తున్నారు నీవు ఉన్నపళంగా వెళ్లి వారికి తోడుగా దేవుడు దర్శనాలు,అవసరమైన పనులు చూడాలి అని అసలే వారు మన ఛానల్ సీఈవో, చైర్మన్,కో–ఆర్డినేటర్, ఎడిటర్‌గారి బంధువులు, స్నేహితులు, సన్నిహితులు అని మన జిల్లా రిపోర్టర్ మనకు ఓ ఆర్డర్ వేసి హమ్మయ్య ఒకపని అయిపోయింది అని ఆయన ఫ్రీ అవుతాడు. ఇక మన కెమెరామెన్స్/ స్టింగర్స్ పడే అవస్థ అంతా...ఇంతాకాదు. వారువస్తున్నారు అన్న ప్రాంతానికి ఎన్నిపనులు ఉన్నా, అవన్నీ వదిలేసి ఉన్నపళంగా పరుగులు పెడుతున్నారు. ఇంతచేసి అక్కడకు వెళితే అలా వచ్చే ఆ సార్‌లు ఆర్చుకుని, తీర్చుకుని మనవాళ్ళు వెళ్లిన కొన్ని గంటల తరువాతగానీ వారు అక్కడికి రారు.ఇక వస్తూ వస్తూనే ఏమయ్యా... ఎక్కడ ఉన్నావు. మేము ఎటురావాలి, ఇబ్బందిలేని రోడ్డు మార్గం చెప్పు. మేము మళ్ళీ వెంటనే వెళ్ళి పోవాలి అక్కడ ఏ ఇబ్బందులు లేకుండా చూడు మరి, అని కాస్త హెూదా ప్రదర్శిస్తారు. ఆ హోదా చూసి మన కెమెరామెన్స్/ స్టింగర్స్ కొంత అసహనంగానే ఎవరికి ఏ మాట రాకూడదని మనవాళ్ళు ఎంతో మానసిక సంఘర్షణకు గురవుతు, వచ్చిన వారికి వంగి వంగి నమస్కారాలు, వారు ఏదైనా అడిగితే, ఆడిగిందే తడవుగా క్షణాల్లో వారి అవసరం తీర్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేసి వారికి కావలసింది చేయక తప్పదు. వారు అక్కడ నుండి వెళ్ళే వరకు వారికి అన్ని సపర్యలు చేసే

సబార్డినేట్స్‌గా మారక తప్పదు. ఒకరకంగా చెప్పాలి అంటే ఈ విధానం ఆర్డర్లీ వ్యవస్థ కాదా...?ఒకరి క్రింద ఈ విధంగా పని చేయాలి అంటే అలా పనిచేయాల్సిన వ్యక్తుల మానసిక సంఘర్షణ ఎవరు గుర్తిస్తారు. ఇటువంటి ఆర్డర్లీ వ్యవస్థను మన జర్నలిస్ట్‌లు కెమెరామెన్స్ అడ్డుకోవాలి.

**ఈ ఆర్డర్లీ వ్యవస్థను అడ్డుకోకపోతే....**

ఇలా మన జర్నలిస్ట్‌లు/కెమెరామెన్స్/స్ట్రింగర్స్ ఈ ఆర్డర్లీ వ్యవస్థకు తలవంచి పనిచేస్తే జరుగుతున్న పరిణామాలు మరింత బాధాకరంగా/మానసిక సంఘర్షణకు బలి కావల్సి వస్తుంది. ఎలాగో ఓసారి పరిశీలన చేయండి. ఇక్కడ అందరిని అని కాదుగానీ మన సుపీరీయర్స్ రికమండేషన్‌తో వచ్చే వారిలో కొందరు వెధవలు ఉన్నారు. వారు పెద్ద వెధవలు అని మనకు తెలియక అయ్యోసార్... అలాగే సార్...సరే సార్ అంటూ ఆ వచ్చిన వెధవలను మనం వారిని గౌరవించే క్రమంలో ఆ గౌరవాన్ని వారు అలుసుగా తీసుకుని ఎక్కడ లేని గాంభీర్యం, హోదా ప్రవర్తిస్తు వారి అవసరాల ఖర్చు మనమే భరించేలా వ్యవహరిస్తారు. ఉదయం వస్తే అలా వచ్చిన వారు ఏమయ్యా...ఇక్కడ ఏ హోటల్లో టిఫిన్ బాగుంటుంది, ఏ హోటల్లో భోజనం బాగుంటుంది అంటూ ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనాలు అలాగే టీలు, సిగరెట్లు, పాన్ మసాలాలు, స్పెషల్ వాటర్ బాటిల్స్ ఇలా అన్ని అవసరాలకు కొంతమంది మనచేతనే డబ్బులు చెల్లింపులు చేయించి మన ముందు ఫోజులు కొడుతూ తిరిగేవారు ఉన్నారు.

ఇక ఇవి చాలవు అన్నట్లు వారువచ్చిన పని ఆ రోజుకు పూర్తి కాకపోతే రాత్రికి మన ప్రాంతంలోనే ఏదో ఒక హోటల్లో బస చేస్తారు. ఇక ఇలా రాత్రికి స్టే అయ్యే క్రమంలో కొంతమంది అయ్యగార్లకు ఆ రాత్రికి మందు,విందు అన్ని ఏర్పాట్లు చేయాలి. ఇదంతా మనం మొఖమాటానికి పోవడంవల్ల జరుగుతుంది. అయితే ఇది మన కెమెరామెన్స్/స్ట్రింగర్స్ కొద్దిగా ఆర్థిక స్థోమత పర్వాలేదు అనుకుంటే ఆయా ప్రాంతాల కెమెరామెన్స్/స్ట్రింగర్స్ వారి మందు– విందులకు తన జేబులో డబ్బు ఖర్చుపెట్టక తప్పదు. ఒకవేళ కెమెరామెన్స్/స్ట్రింగర్స్ ఆర్థికస్థోమత లేకపోతే ఈ ఖర్చులు జిల్లా రిపోర్టర్‌కి చెల్లించే భాద్యత తప్పదు. ఇది మన జర్నలిస్ట్‌లు, కెమెరామెన్స్, స్ట్రింగర్స్ కి మానసికక్షోభ కలిగించే పరిస్థితులు కాదా...?మనలో ప్రతి ఒక్కరు ఈ సమస్య ఫేస్ చేసే ఉంటారు.

**ఆత్మీయ బంధాలకు దూరంగా ....**

మన జర్నలిస్ట్‌లు, కెమెరామెన్స్ అందరిలా ఆత్మీయ బంధాలకు దగ్గరగా ఉండటం లేదు. ఎక్కడ దాకా ఎందుకు 24గంటలు, 365రోజులు గడియారంలో ముళ్ళులా పనిచేస్తూ తెలిసో... తెలియకో.... జర్నలిజం అనే గడియారంలాంటి చట్రంలో ఇరుక్కుపోయిన మనం

మన కన్నబిడ్డలకు, భార్యకు, వృద్ధులైన తల్లిదండ్రులకు, స్నేహితులు, సన్నిహితులకు, అన్న-తమ్ముడు, అక్క-చెల్లి వంటి రక్తసంభదీకులతో కూడా మాట్లాడేందుకు క్షణం తీరికలేక కుటుంబ బాధ్యతలు నెరవేర్చలేని జీవితాలు గడుపుతున్నాం.ఇటువంటి జీవితాల విషయంలో జర్నలిస్ట్‌లకు కొంత వెసులుబాటు ఉంటుంది గానీ కెమెరామెన్స్‌కి ఆ అదృష్టం కూడా లేదు.

ఇక మనజీవితాలకు పండుగలు-పబ్బాలు.వేడుకలు-వేధనలు, శుభ-అశుభ కార్యాలు, బందువులు-బాంధవ్యాలు, ఆత్మీయ-అపూర్వ కలయికలు, స్నేహితులు-సన్నిహితులతో కలిసే మధురక్షణాలు అన్నిటికి దూరమే. కుటుంబాలకు కనీస ప్రేమ-ఆప్యాయత కూడా పంచలేని మన జర్నలిస్ట్‌లు/కెమెరామెన్స్ మానసిక వేదన ఏమి చెప్పను... ఏమని చెప్పను...ఎవరికి చెబితే ఈ బంధాలు- బంధుత్వాలు,స్నేహాలు నిలబడతాయి. మిత్రులారా... అలా అయిపోయాయి మన జీవితాలు.జర్నలిజం అనే స్వర్ణ సాగరంలో నడి మధ్యన చిక్కుకుని అలుపెరుగని ఈ సిరా చుక్కల సంగ్రామం ఎవరి కోసం-ఎందుకోసం.ఏ దిక్కున చేరేందుకు-ఏమి సాధించేందుకు ఈ చుక్కాని లేని ప్రయాణం. ఇది కాదా మనం ఎవరికి చెప్పుకోలేని మానసిక సంఘర్షణ.

## ఉత్తమ ఫోటో జర్నలిస్ట్‌లుగా కెమెరామెన్స్

జర్నలిజంలో ఫొటో జర్నలిజం ప్రాముఖ్యత ఏమిటంటే మన కెమెరా మెన్స్/వీడియో జర్నలిస్ట్‌లు అందించే చిత్రాల ద్వారానే జర్నలిస్ట్‌లు ఒక మంచి కథనం రాయటానికి ఆధారాలుగా ఉన్నాయి. దీని ప్రత్యేకతను గుర్తించి జర్నలిస్ట్‌లకు ప్రోత్సాహంగా జర్నలిజంలో ఇచ్చే అత్యుత్తమ "పులిట్జర్" అవార్డు కూడా ఎక్కువ శాతం కెమెరామెన్స్ సాధిస్తున్నారు. జర్నలిజం రంగంలో పులిట్జర్ అవార్డు సాధించేంత శక్తి, యుక్తి, ప్రావీణ్యం కలిగిన ఫోటో జర్నలిస్ట్‌లు ప్రత్యేకస్థానం కలిగి ఉన్నారు కాబట్టి వారిని మీడియారంగంలో తక్కువ చేసి చూడటం తగదు.

## జీవిత చరమాంకంలో బ్రతుకు దెరువుకు భరోసా లేని కెమెరా మెన్స్ జీవితాలు :

మీడియారంగంలో కెమెరామెన్స్‌గా పని చేసినన్నాళ్లు అరకొర జీతాలతో బ్రతుకుబండినెడుతూ, ఓ ప్రక్క జర్నలిస్ట్‌లు తమకున్న పలుకుబడి, పరిచయాలతో మీడియారంగంలో ఎంతోకొంత ఆర్ధికంగా బలపడతారు. ఈ అవకాశం కెమెరామెన్స్ అందరికీ లేదు. సంస్థ ఇచ్చే జీతంతోనే సర్దుకుపోయి బ్రతకాలి. ఒంట్లో ఓపిక ఉన్న సమయంలోనే రూపాయి వెనకేసుకుని జాగ్రత్త పడేందుకు వస్తున్న జీతం ఏ మాత్రం భరోసా కాదు. 40-45 ఏళ్లు పైబడిన కెమెరామెన్స్ ఎక్కడ జర్నలిజం ఫీల్డ్‌లో కనిపించరు. మరి వీళ్లంతా ఏం చేస్తారు. ఎలా బ్రతుకుతున్నారు అంటే దానికి సమాధానం వారి నుండి జీవితంలో ఏమి కోల్పోయాం అనేది అప్పటికిగానీ వారికి తెలియదు. అలాంటి ఫోటో/వీడియో

జర్నలిస్ట్‌లను కదిలిస్తే వారి కన్నీటిగాథలు అన్నీ ఇన్నీ కాదు. ఇక ఏదైనా పని చేసుకుందాం అంటే ఒంట్లో ఓపిక ఉన్నన్నాళ్ళు తమ శక్తులన్నీ మీడియా సంస్థలకు దారబోసి ఇక మరోపని చేసేందుకు ఓపికలేక దుర్భరజీవితాలు గడుపుతున్న కెమెరామెన్స్ ఎందరో ఉన్నారు. జీవిత చరమాంకంలో ఉన్నన్నాళ్ళు ఒక హోదాగా బ్రతికి చివరికి కూరగాయలు, పల్లీలు అమ్ముకునేంత పరిస్థితుల్లోకి వెళ్ళిపోతున్నారు. ఎవరికి చెప్పుకోలేని మానసికబాధ అనుభవిస్తున్నారు.

ప్రభుత్వాలు వస్తున్నాయి, పోతున్నాయి, జర్నలిస్ట్‌లకు కనీస వేతనాలు అందించే దిశగా ఏ ప్రయత్నాలు చేయకపోగా, రాష్ట్రంలో వెటరన్ జర్నలిస్ట్‌లకు ఫించన్ ఇవ్వాలి అని కొంతకాలంగా జర్నలిస్ట్ సంఘాలు పోరాడుతున్నా వచ్చే, పోయే ప్రభుత్వాలు కల్లబొల్లి మాటలు చెప్పి తప్పించుకుపోతున్నాయి గానీ జర్నలిస్ట్‌ల బాధలు పట్టించుకునే ప్రభుత్వాలు లేవు. కనీసం ఏ ఆధారం లేక చివరిరోజుల్లో రోడ్డునపడి జీవితాలు భారంగా నెట్టుకొస్తున్న కెమెరామెన్స్ కైనా రాబోవు ప్రభుత్వాలు వారి జీవితాలకు భరోసా ఇస్తూ వారు బ్రతికేందుకు అవసరమైన నగదు “కెమెరామెన్స్ పింఛన్ పథకం” అమలుచేసి ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వం గుర్తించాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యం ఫరీడవిల్లెందుకు, సమాజంపట్ల భాధ్యత, భద్రత కల్పించేందుకు పలు ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా పనిచేసేది జర్నలిస్ట్‌లు కాబట్టి. మరి ప్రభుత్వాలు నాలుగు కాలాలు పాలనలో సాగాలి అంటే ఏ ప్రభుత్వానికైనా దిశ, దశ చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్నారు జర్నలిస్ట్‌లు. ఇక జర్నలిస్ట్‌లు గానీ, ఫొటో/వీడియో జర్నలిస్ట్‌లు గానీ రోడ్డున పడ్డారు అంటే అక్కడ ప్రభుత్వాలు కూడా రోడ్డున పడినట్లే ఇది ఏ ప్రభుత్వం ఆయినా గుర్తు పెట్టుకుని వారి జీవితాలకు ఎంతో కొంత ఆర్థికభరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

ఒక మీడియాకి రిపోర్టర్ కెమెరామెన్ ఇద్దరూ రెండు కళ్ళులాంటి వారని, ఇద్దరూ ఒక తల్లి కడుపున జన్మించిన కవలలు అని చెప్పుకున్నాం కదా, అయితే ఈ కార్పోరేట్ మీడియా 2023లో ఈ కవలలను ఇద్దరినీ వేరు చేసే ఆలోచనలలో ఉన్నట్లు తెలుస్తుంది. అదే గనుక జరిగితే మీడియాలో కెమెరామెన్స్ విభాగం తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. అయితే పూర్తిస్థాయి అనుభవజ్ఞులైన కెమెరామెన్స్ తప్ప చాలా వరకు ఇక రాబోవు ఎలక్ట్రానిక్ మీడియాలో కెమెరామెన్ పాత్ర కూడా రిపోర్టర్‌పై పడే అవకాశాలు ఉన్నాయి. ఇక ఎక్కడ న్యూస్ కవరేజ్ అయినా కెమెరాలు, ట్రైపాడ్, లోగోలు అన్నీ రిపోర్టర్ మోసుకెళ్ళే పరిస్థితులు దిశగా నక్కజిత్తుల కార్పోరేట్ మీడియా పాటించనున్నట్లు తెలుస్తుంది. ఇది ప్రస్తుతానికి ఓ సమాచారంగా తెలుస్తుంది కాబట్టి కెమెరామెన్స్ ఎంత ఎలర్ట్‌గా ఉంటే అంత మంచిది.

# 18. జర్నలిజంలో "దొంగలుపడ్డారు"




**"ప్రస్తుతం మీడియా విలువలు కోల్పోయింది, విలువలు కలిగిన మీడియాని కార్పొరేట్ శక్తులు ఆవహించాయి, మీడియాని మంచి ఆదాయ మార్గంగా ఎంచుకున్న కార్పొరేట్ వ్యవస్థ జర్నలిజాన్ని, దాని విలువలను డబ్బే ప్రధానం అనే దాని బూటు కాలి క్రింద తొక్కి పట్టేసింది. ఇక్కడ జర్నలిజంలో అన్నీ అమ్మబడుతున్నాయి, అన్నీ కనబడుతున్నాయి, ఇలా జర్నలిజం దొంగలకు రక్షణ నిలయంగా మారింది"**

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

జర్నలిజానికి ప్రజాస్వామ్య ప్రభుత్వంలో నాలుగవ స్థంభంగా పేరుంది. భారతదేశ మీడియారంగం ఆరంభం నుండి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అర్థశతాబ్దం పైగా మీడియా రంగం కొన్ని ప్రత్యేక సిద్ధాంతాలు, విలువలతో పని చేసింది. సరిగ్గా నాకు తెలిసి 10 సంవత్సరాల నుండి మీడియా రంగం విలువలకు తిలోధకాలు ఇస్తూ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మనుగడ సాగిస్తుంది. అయితే ఇక్కడ పవిత్రమైన జర్నలిజాన్ని నేను తప్పు పట్టడం లేదు. ఈ పవిత్రమైన జర్నలిజాన్ని అడ్డుపెట్టుకుని మీడియా రంగంలో అడుగుపెట్టి/పెడుతున్న కొన్ని మీడియా సంస్థలు ఈ రంగాన్ని మంచి వ్యాపారసంస్థగా గుర్తించి లెక్కకు మించి పుట్టుకొస్తున్నాయి. దీనికి కారణం ఏదైనా ఒకపేపర్/ టీవీ ఛానల్ ప్రారంభించేవారు మొదట ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజాసమస్యలపై పోరాటం అంటూ ప్రతి పేపర్‌కు/ప్రతి ఛానల్‌కి సమాజాన్ని ఉద్ధరించే విధంగా ట్యాగ్ లైన్ ఏర్పాటు చేసుకుని ఆర్.ఎన్.ఐ సర్టిఫికేట్ పొంది ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టి కొన్నాళ్లు గడిచాక స్వలాభం కోసం పని చేస్తున్నాయి. మీడియా రంగంలో ఉన్న అన్ని పేపర్స్, టీవీ ఛానల్స్ గురించి ఇక్కడ చెప్పడం లేదు. 2005వ సంవత్సరం తరువాత పురుడు పోసుకున్న కొన్ని పేపర్స్/ టీవీ ఛానల్స్ రావడం, రావడంతోనే జర్నలిజంలో ఓనమాలు కూడా తెలియని కొందరు వ్యక్తులను ఏ ప్రమాణాలు పాటించకుండా ఇబ్బడి ముబ్బడిగా తమ పత్రికకు/ఛానల్‌కి ఒక్కో ఏరియాకు ఒక్కో ప్రతినిధిని నియమించి మీ ఇంట్లో తిని మా ఇంట్లో పని చేయండి అన్న చందంగా మనుగడ సాగిస్తున్నాయి. జర్నలిస్ట్ అని ఒక హోదా కల్పిస్తూ తమ పేపర్/ ఛానల్‌కి నియమించిన ప్రతినిధులకు కనీస గౌరవ వేతనం కూడా ఇవ్వకుండా ప్రకటనలు తీసుకురండి ఆ ప్రకటనల్లో కమీషన్ జీతాల రూపంలో తీసుకోండి అని ప్రజాక్షేత్రం లో వదిలేస్తే ఆయా జర్నలిస్ట్‌లు తాము పనిచేస్తున్న మీడియా సంస్థలకు ఎంతని దోచిపెట్టాలి. ఎన్నాళ్లు ఆ కమీషన్ల పై జర్నలిస్ట్‌లు జీవనం సాగించాలి.

ముందుగా చెప్పినట్లు ఇక్కడ అన్ని మీడియా సంస్థలు గురించి చెప్పడం లేదు. 5ఏళ్ళ క్రితం పుట్టుకొచ్చిన మీడియా సంస్థలు కొన్ని తన మీడియా సంస్థ స్థానం ఏమిటి...? అని కూడా ఆలోచన లేకుండా కొన్ని మీడియా సంస్థలు ఇలా వ్యాపార ప్రకటనల కోసం జర్నలిస్ట్‌లను ఏజెంట్లుగా పెట్టి ఒకొక్కరికి లక్షలు, లక్షలు టార్గెట్స్ విధించే వాటి గురించే ఇక్కడ మన ప్రస్తావన. అలాగే ఏ వ్యాపార సంస్థ అయినా/ఏ పారిశ్రామిక సంస్థ అయినా/ ఏ విద్యాసంస్థ అయినా అనుకూలంగా లేని ఏ వ్యవహారాలనైన అందిపుచ్చుకుని క్యాష్ చేసుకోవడానికి అడిగిన వెంటనే ప్రకటన ఇవ్వకపోతే ఆ సంస్థల బొక్క లు వెతికి దానిపై ఒక వార్తా కథనం వేస్తే వాడే దారికి వస్తాడని జర్నలిస్ట్‌లను ఉసిగొల్పి, ఒకవేళ జర్నలిస్ట్‌లు

తమ మీడియా సంస్థ చెప్పినట్లు చేయకపోతే వృత్తి నుండి పీకేస్తామని భయపెట్టి జర్నలిస్ట్‌లను పావులుగా వాడుకునే కొన్ని మీడియా సంస్థలు ప్రస్తుతం మీడియా రంగంలో చెలామణీ అవుతున్నాయి. ఈ విధానం కాదా ..జర్నలిజంలో దొంగలు పడ్డారు అనే పదానికి అర్థం.ఈ విధానాన్ని ఎవరైనా కాదన గలరా....? లేదు ఇది తప్పు అని ఎవరైనా చెప్ప గలరా...? కావాలి అంటే లక్షలు, లక్షలు టార్గెట్స్ రీచ్ అయ్యేందుకు మా జర్నలిస్ట్ సోదరులు పడుతున్న అవస్థలు, జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగేందుకు మీడియా సంస్థలు చెప్పినట్లు చేయక పోతే వృత్తి నుండి నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తున్న తీరు ఆ సమస్యలు ఎదుర్కొన్న జర్నలిస్ట్‌లకు బాగా తెలుసు. ఇలా మీడియా సంస్థల నుండి పీడించబడుతూ, తప్పక జర్నలిస్ట్‌లుగా కొనసాగుతున్న వారిని కదిలించి చూడండి. మీడియా సంస్థలు విధించే ప్రకటనల టార్గెట్స్ విషయానికి వస్తే వాళ్ళ అమ్మ, బాబులు సంపాదించిన సొమ్ములు ఆయా సంస్థల వద్ద కట్టలు-కట్టలు, గోతాలు-గోతాలు వీరు కూడబెట్టినట్లు ఆడిగిందే తడవుగా వీరికి వేలకు-వేలు, లక్షల-లక్షలు ప్రకటనలు కుమ్మరించేయాలి అన్నట్లు ఉంది కొన్ని మీడియా సంస్థల తీరు. మీడియా ముసుగులో ప్రకటనలు ఈజీగా వచ్చేస్తాయి అన్నట్లు జర్నలిస్ట్‌లను ఎజెంట్స్‌గా పెట్టి వసూళ్ళ పర్వం కొనసాగిస్తున్నారు. ఇక్కడ మరోమాట నిజంగా సామాజిక బాధ్యత వహిస్తూ పనిచేసే మీడియాకి ఆర్ధిక సహకారం అందించే దిశగా ఆ మీడియా సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రకటనలు చాలా అవసరం.

ఇలా ప్రోత్సాహం కల్పించే వ్యవస్థల నుండి న్యాయంగా ప్రకటనలు తీసుకోవడం ఓ రకంగా మీడియాకి ఆరోగ్యకరంగా ఉంటుంది. అంతేగానీ కులానికో పేపర్/మతానికో ఛానల్ పెట్టుకుని ఎవరిని ఉద్ధరించడానికి వచ్చాయో కూడా తెలియని పరిస్థితుల్లో ఉన్న కొన్ని మీడియా సంస్థలు ప్రకటనలకోసం పాకులాడుతున్నాయి. ఇక జర్నలిస్ట్‌లు ప్రకటనల టార్గెట్స్ రీచ్ అవ్వక పోతే జర్నలిజం వృత్తి నుండి పీకేయడం నువ్వు చేయలేకపోతే ఇక సెలవు తీసుకో టార్గెట్స్ చేస్తామని వచ్చేవారు ఎందరో ఉన్నారు అని ఖరాఖండిగా హెచ్చరిస్తూ నిమిషాల వ్యవధిలో వేరే వారిని నియామకం చేస్తున్న పరిస్థితులు ప్రస్తుత మీడియా రంగంలో బాగా ఉన్నాయి.

ఇలా వృత్తి నుండి పీకివేయబడిన జర్నలిస్ట్‌లు చేయలేని టార్గెట్స్ కొత్తగా నియామకం చేసుకున్నవారు వచ్చి పొడిచేది, పీకేది ఏమీలేదు. కానీ మీడియా సంస్థల భరోసా ఏమిటో...! తెలియదు కానీ ముందు పనిచేసిన వారు టార్గెట్స్ చేయలేదని పీకి వేసి టార్గెట్స్ చేసేవారు వస్తారని కొత్తవాళ్ళను నియామకం చేసుకొని వారు చేయలేదని మరొకరిని నియామకం చేస్తు అలా ఎవరో వస్తారు...ఏదో చేస్తారు అని చివరికి తమ మీడియా సంస్థకు దోచిపెట్టె దొంగనాయాళ్ళు దొరికేవరకు ముందువారిని పీకేయడం, కొత్తగా వచ్చే దొంగ జర్నలిస్ట్‌లను

నియామకం చేయడం అనే పరంపర అడ్డూ-అదుపు లేకుండా నిర్విరామంగా కొన్ని మీడియా సంస్థల్లో  కొనసాగుతూనే ఉంది.ఇది కాదా... జర్నలిజంలో దొంగలు పడ్డారు అనే దానికీ నిలువెత్తు సాక్ష్యం. లేదంటే మీడియా సంస్థలు జర్నలిస్ట్‌లను తమ పత్రికలకు/టీవీ ఛానల్స్‌కి జర్నలిస్ట్‌లను నియామకం చేసే విధానంలో ఉన్న శ్రద్ధ అలా నియామకం చేసిన జర్నలిస్ట్‌కి ఉద్యోగ భద్రత కల్పిస్తుందా...? కనీస గౌరవ వేతనం ఇస్తుందా. ..? ఒక ఐడీకార్డు ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం కలిగి ఉందా ...? కార్మిక, వేతనచట్టాలు అమలు చేస్తున్నాయా....? ఇవన్నీ మీడియా ఆడుతున్న దొంగాటలు కాదా...?వైట్ కాలర్ దోపిడీ కాదా...? ఇలా వ్యవహరించే మీడియా సంస్థల వ్యవహారాన్ని ఏ ప్రభుత్వాలైనా...? కనీస రక్షణాచర్యలు చేపట్టాయా....? చేపట్టవు...! ఎందుకంటే ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకునేది స్వప్రయోజనాలకు, అక్రమ ఆర్జనకేగా...! అలా వచ్చిన ప్రభుత్వాలు ఏకంగా మీడియా సంస్థల సహకారంతోనేగా...? ప్రజలకు వరాలజల్లు కురిపించి, వాటిని అమలు చేసినా- చేయక పోయినా కొద్దిపాటి పప్పు-బెల్లాలు పెట్టి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకోవడానికి రాజకీయ నాయకులు మీడియా సంస్థలకు స్పెషల్ ప్యాకేజీలు ఇచ్చి విస్తృత ప్రచారం పొందుతున్న వ్యవహారం ప్రజలకు తెలియంది కాదు. కాకపోతే పార్టీకో పత్రిక-నాయకుడికో  ఛానల్ ఇలా మీడియా రంగాన్ని చేతుల్లోకి తీసుకుని సొంతడబ్బా కొట్టుకునే పాలకుల తీరుతో ఇప్పుడు మీడియా రంగం పూర్తిగా గాడి తప్పిపోయింది.

ఒకప్పుడు బ్రతకలేక బడిపంతులు అనేవారు. కానీ ఇప్పుడు బ్రతకనేర్చినవాడు జర్నలిస్ట్ అంటున్నారు. కానీ ఒకప్పుడు బ్రతక లేక బడిపంతులు అయినా ఏ లాభం ఆర్జించక సమాజంలో అక్షర జ్ఞానం లేని వ్యక్తులను ఉన్నత స్థితికి చేర్చినవారు ఆ బడిపంతుల్లే. అలాగే ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో అల్లుకుపోయిన అవినీతి, అక్రమాలను, రాజకీయ నాయకుల అడ్డు-అదుపు లేని విధానాలను, లంచగొండి అధికారుల తీరు వంటి అవినీతి-అక్రమాలను పరిశోధనాత్మక కథనాల రాతలతో ఎండగడుతూ చెడిపోయిన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ఓ బడిపంతులు చేతిలో బెత్తంలా కలాన్ని ఉపయోగించి నాటి నేటి సమాజానికి దిశా నిర్దేశం చేసిన/చేస్తున్న మా అక్షర సైనికుల సిరాచుక్కల సంగ్రామం ఎంతమంది అర్థం చేసుకోగలరు. సింపుల్‌గా బ్రతక నేర్చినవాడు జర్నలిస్ట్ అంటే సరిపోతుందా...? అలాఅని మాలో ఉన్న దొంగ అవినీతి, అక్రమాలకు పాల్పడే జర్నలిస్ట్‌లను నేను వెనకేసుకొస్తూ ఈ అంశం రాయటం లేదు.

ప్రస్తుతం నీతి, నిజాయితీలతో, విలువలతో జర్నలిజం వృత్తిలో పనిచేసే వారు ఎందరో.... సర్వంకోల్పోయి, ఆరోగ్యాలు క్షీణించి చావలేక, బ్రతకలేక జీవనం సాగిస్తున్న

కలం వీరులు ఎందరో ఉన్నారు. ఇది గమనించి జర్నలిస్ట్‌లు అందరిని దొంగలు, దోపిడీ దారులుగా ఒకేగాటన కట్టేయరాదని విలువలు కలిగిన జర్నలిస్ట్‌లపై కూడా చులకనభావం కలిగిన వారికి మనవి. ప్రస్తుతం జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న వారిని చూసి ప్రజలు అందరూ జర్నలిస్ట్ వృత్తిలో ఉన్న వారందరినీ దొంగలే అన్నట్లు చూస్తున్నారు. జనం జర్నలిస్ట్‌లను అలా అనుకోవడంలో తప్పులేదు. కానీ మా జర్నలిస్ట్‌లు ఎందుకు దొంగలు అవుతున్నారు. మీడియా సంస్థలు అవలంభిస్తున్న వ్యవహారం అని ఎందరు అర్ధం చేసుకోగలరు. ఇక్కడ ఓ ఉదాహరణ చెపుతా...! నేను జర్నలిజంలోకి వచ్చిన కొత్తలో గతంలో నాకు పరిచయం ఉన్న ఓ ముగ్గురు పెద్ద మనుషులు, నేను బాగా గౌరవించి, అభిమానించే వ్యక్తులు కొంతకాలం గ్యాప్ తరువాత ఒకరికొకరు ఎదురుపడ్డాం. మంచిగా పలకరించుకొని యోగక్షేమాలు మాట్లాడుకుంటున్న సమయంలో ఏమయ్యా ...ఏం చేస్తున్నావు అని అడిగారు.

దానికి నేను ఓ జర్నలిస్ట్‌ని అనే హోదా..తో జర్నలిస్ట్‌గా చేస్తున్నా అని చెప్పాను. దానికి వారు ముగ్గురు అబ్బా పర్వాలేదే...అన్నారు. అంతే మరోవ్యక్తి కల్పించుకుని జీతం ఎంత...?అని ప్రశ్నించాడు. దానితో ఏదో చిన్నపాటి రెమ్యునరేషన్ ఇస్తారు అనిచెప్పా.... వెంటనే మరోవ్యక్తి అందుకుని ఏముందండీ...వాళ్ళ అవసరాన్ని బట్టి ఎవడోఒకడు ఆవారాగాడిని పట్టుకుని గొప్పగా ఒక లోగో ఇస్తారు. ఇక ఊరి మీదకు వదిలి జర్నలిస్ట్ హోదాతో దోచుకోండి-మాకు దోచి పెట్టండి అని ఇక వీళ్ళని చూసి ప్రతివాడు భయపడి వారు ఇచ్చే డబ్బులే వీరికి సంపాదన అని చాలా తప్పుపడుతూ మాట్లాడారు. వారు మాట్లాడిన విధానానికి కొంత బాధపడినప్పటికి నాడు వారి మాటలను పెద్దగా పట్టించుకోలేదు. కానీ వారు మాట్లాడింది అక్షరసత్యం అని మరికొన్నేళ్లకు గానీ నాకు అర్ధం కాలేదు. ఇటువంటి వ్యవహారాల్లో మా జర్నలిస్ట్‌లను ఓసారి పరిశీలించి ఎవరు దొంగలు అనే ఓ నిర్ణయానికి ప్రజలు రావాలని నా మనవి. అయితే ఎంతో పవిత్రమైన వృత్తిలో ఉండి 24గంటలు, 360రోజులు జర్నలిస్ట్‌లు జర్నలిజం అనే వృత్తిలో కొనసాగుతూ నిజంగా వారు ఎన్నికష్టాలు పడుతున్నారో ఓసారి పరిశీలన చేయండి. జర్నలిస్ట్‌లు దొంగలు అనుకున్నవారికి ఇక్కడ ఒక్కటే చెప్పదలుచుకున్నా, ఇప్పుడు జర్నలిజం అనేది కొందరు అవినీతిపరులు, అక్రమార్కులు, దోపిడీ గాళ్ళు, పలువురు నేరస్థులు, తప్పుడు- తారుపుడు గాళ్ళు, అక్రమ వ్యాపారులు వంటివారు ఎంతోమందికి ఒక షెల్టర్ జోన్‌గా మారింది. జర్నలిజంని అడ్డుపెట్టుకుని వారి వారి అవినీతి- అక్రమాలకు జర్నలిజాన్ని సేఫ్‌జోన్‌గా మార్చుకున్నారు వీళ్ళ వలనే జర్నలిజంలో దొంగలుపడ్డారు అనేదానికి సరైన నిర్వచనంగా చెప్పుకోవాలి. ఈ విధానమే అసలుసిసలైన మాట అదే జర్నలిజంలో దొంగలుపడ్డారు అంటే...! ఇటువంటి వారు జర్నలిజంలోకి రావడం వలనే విలువలతో పనిచేసే జర్నలిస్ట్‌లకు చెడ్డపేరు వస్తుంది. ఈ విధానాన్ని అరికట్టాలి

అంటే మీడియా సంస్థలు జర్నలిస్ట్‌లను నియామకం చేసేటప్పుడు నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. మీడియా రంగాన్ని గాడితప్పిపోయేలా చేసిన కొన్ని మీడియా సంస్థలు జర్నలిజంలో దొంగలకు అవకాశం కల్పిస్తున్నాయి. విలువలు కలిగిన జర్నలిస్ట్‌లను నియామకం చేసుకోవడం కన్నా, సామాజిక స్పృహ, సామాజిక భాధ్యత లేని అవారాగాళ్లకు, పేరు ఊరు లేని గొట్టంగాళ్లకు ఓ డబ్బా లోగో ఇచ్చి జర్నలిస్ట్ అనే హోదా కల్పించి ప్రజాక్షేత్రంలో మనకు ఎదురు లేదు ఆడిందే ఆట-పాడిందే పాట ఆంటూ క్యారెక్టర్ లేనివారిని జర్నలిస్ట్‌లుగా నియమించుకోవడం వల్లనే సమస్య. కాబట్టి ఇక్కడ జర్నలిజం అర్హతలు విలువలను ఎవరు కూనీ చేస్తున్నారో ప్రజలు గమనించాలి. ఇక ఏ భయం-బెరుకు లేకుండా అవినీతి-అక్రమాలకు పాల్పడేవారిని తన స్వలాభం కోసం నియామకం చేసుకుంటున్న మీడియా సంస్థలదే ఇక్కడ నేరం. ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్ట్‌లుగా వచ్చేవారి ప్రవర్తన తీరు, క్యారెక్టర్, విద్యార్హతలు వంటి వాటిపై ఏ మీడియా సంస్థలైనా... నియమ-నిబంధనలు పాటిస్తాయి అనుకోవడం మన అత్యాశ....!

## పెట్టుబడిదారీ వ్యవస్థ గుప్పిట్లో జర్నలిజం

భారతదేశంలో అత్యంత ప్రమాదకరమైన వ్యవస్థ ఒకటి ఉంది. ఈ వ్యవస్థలో ఉన్నవారు దేశాన్ని, దేశంలో ఉన్న రాజకీయ పార్టీలను, మీడియాను పెద్ద ఎత్తున తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. దేశంలో ప్రతి వ్యవహారాన్ని, అవినీతి అక్రమాలకు పాల్పడే రాజకీయ వ్యవస్థను, ప్రజాస్వామ్య పరిరక్షణకు నిత్యం పాటుపడే మీడియాను వీరు తమ కబంధహస్తాలలో చేజిక్కించుకున్నారు.

ప్రజా సేవే తనసేవ అంటూ రాజకీయ పార్టీలు పెట్టేవారు సమాజానికి వారి సేవలు ఎలా ఉన్నాయో.... తెలియంది ఏమీ కాదు. అదేదో పాటలా పాకెట్లో పైసా ఉంటే ప్రపంచమే పిల్లవుతుంది పులై మనం బతికేయచ్చు అన్న విధంగా ఓ రాజకీయపార్టీ పెట్టుకోవడం, దానిని నడిపించేందుకు ఓపత్రిక లేదా ఓఛానల్ పెట్టుకోవడం. ఇక తాము చెప్పేది ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడని విధానాలు అవలంభిస్తూ తాముచేసేది తప్పు అయినా దర్జాగా అదే ఒప్పు అన్నట్లు తాము స్థాపించిన మీడియాలో ప్రచురణ/ప్రసారాలుచేస్తూ ప్రజలను వెర్రి గొర్రెలుగా భావించి మీడియా రంగాన్ని పాడుచేశారు ఈ పెట్టుబడిదారులు ఒక్క రాజకీయ పార్టీలే కాదు. కాస్త డబ్బున్న ప్రతి పెట్టుబడిదారుడు ఎంతో కొంత పెట్టుబడిపెట్టి ఒక్కోవ్యవస్థ ఒక్కోపత్రిక ఒక్కోఛానల్ పెట్టుకుని మీడియాను స్వప్రయోజనాలకు వాడేస్తున్నారు.

ఇలా పెట్టుబడిదారుల కబంధహస్తాలలో చిక్కిన మీడియా తీరును ఓసారి పరిశీలిస్తే రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు ప్రజాసేవ ఆంటూ తనసేవ ఎంతో గొప్పదని

చెపుతూ ఏదో ఒక మీడియాను అడ్డం పెట్టుకుని మరింత ఎదిగిపోతున్నారు. ఇంకొంత ముందడుగు వేసిన పెట్టుబడిదారులు కుల–మత వ్యవస్థలను పోషిస్తూ కులానికో పేపర్–మాతానికి ఓ ఛానల్ పెట్టుకుని వర్గ విభేదాలు లేని వ్యవస్థ కోసం అని వారు చెప్పేదే నిజం అంటూ తన కుల మతాల మనుగడ కోసం 24 గంటలు బాకా ఊదుతూ,బ్యాండ్ బాజా వాయించే మీడియా సంస్థలు ఉన్నాయా...? లేదా...?అనేది కూడా ప్రజలు పరిశీలన చేయాలి. ఇలా వ్యవహరిస్తున్న కొన్ని మీడియా సంస్థలు ఏ ప్రయోజనాల కోసం పనిచేస్తుంది అనేది ప్రజలు మరింత లోతుగా పరిశీలన చేయాలి. ఇలాంటి మీడియా సంస్థలు దొంగలా...? లేదు అందులో పని చేసే జర్నలిస్ట్‌లు దొంగలా...?ఇలా ఫోర్త్ ఎస్టేట్‌గా పిలువబడుతున్న జర్నలిజంలో తమ పేరులోని మొదటి అక్షరాన్ని, లేదా తమకు లక్కీ నెంబర్‌గా భావించే అంకెలను, ఇంటి పేర్లను, ఇష్ట దైవాల పేర్లు పెట్టి సామాజిక భాధ్యత, సామాజిక భద్రత ఏ మీడియా వ్యవస్థ అయినా కల్పిస్తుందా...? ఇటువంటి విధానాలు కలిగిఉన్న కొన్ని మీడియా సంస్థలను నడిపించే శక్తి, అవసరం ఎవరికి ఉంటుంది పెట్టుబడిదారులకేగా...! ఏ పెట్టుబడి దారుడైన సొంతలాభం లేకుండా వ్యవహరిస్తారా...? ధనార్జన కోసం మీడియా రంగంలో కూడా పెట్టుబడిదారులు ప్రవేశించడంతో జర్నలిజంలో దొంగలుపడ్డారు అని ఓ పాత్రికేయుడిగా ఒక్క బల్లకాదు... వందబల్లలు గుద్ది చెబుతున్నా... అలాగే ఇప్పుడు మీడియారంగం గాడి తప్పింది, మీడియా రంగం ఇప్పుడు విలువలకు తిలోదకాలు ఇచ్చింది, మీడియా రంగం కొంతకాలంగా చెడిపోయింది, మీడియా రంగం ఇప్పుడు ధనార్జనకు వేదిక అయ్యింది, మీడియా రంగం గత కొంతకాలంగా అవినీతి–అక్రమార్కులకు, నేరస్తులకు సేఫ్‌జోన్‌గా మారింది. మీడియా రంగం రాజకీయ పార్టీలకు కరపత్రాలుగా మారింది. సామాజిక భాధ్యత, సామాజిక భద్రత, మూఢనమ్మకాలతో ఉన్న జనాన్ని, ప్రజలను సామాజిక వ్యవహారాల్లో చైతన్య పరచలేక కుంటి గుర్రంపై గుడ్డివాడు సవారీ చేస్తున్నట్లు ఈ రోజున మీడియా రంగం తాను చెప్పిందే వేదంలా ప్రజల కళ్ళు, నోరు, చెవులు టీవీ ఛానల్స్‌కి/ పేపర్స్‌కి అతికించేసింది. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ.

## జర్నలిస్ట్‌లలో దొంగలు ఉన్నారు అనే కొందరిభావన వాస్తవమే...!

మరి ముఖ్యంగా ఇక్కడ చెప్పదలచుకున్న అంశం మన జర్నలిస్ట్‌లు అందరూ న్యాయంగా ఆలోచించాలి. మనలో అందరూ దొంగలే ఉన్నారు అని మొదటి నుండి చెప్పటం లేదు. ఈరోజు వరకు జర్నలిజం వృత్తిలో ఎంతో అంకిత భావంతో, విలువలతో పనిచేసే జర్నలిస్ట్‌లు ఇంకా ఎందరో ఉన్నారు. ఇలా విలువలతో జర్నలిస్ట్‌లుగా పనిచేసే జర్నలిస్ట్‌లు మన మీడియా రంగంలో దొంగలు ఉన్నారా...? లేదా...? అనేది తేల్చాల్సిన అవసరం

ఎంతైనా ఉంది. ఇదే సమయంలో ప్రస్తుత మీడియా పరిస్థితులు చూసి ప్రజాక్షేత్రంలో అధికశాతం ప్రజలకు జర్నలిజంలో దొంగలు ఉన్నారు అనే ప్రజాభిప్రాయాన్ని గౌరవించి మన జర్నలిస్టులు వారి అభిప్రాయాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలి. ఎందుకంటే జర్నలిస్ట్‌గా పని చేసేవారు ఎవరైనా ప్రజల అభిప్రాయాలను గౌరవించే గుణం కలిగి ఉంటారు. అలా ప్రజల అభిప్రాయాలను గౌరవించలేని వారు జర్నలిజం వృత్తిలో కొనసాగడానికి, జర్నలిస్ట్‌గా పని చేయడానికి అర్హులు కాదు అని నా అభిప్రాయం. ఇక వారి అభిప్రాయాలకు సరైన సమాధానం చెప్పి మనపై వారికి ఉన్న చెడు అభిప్రాయాన్ని తొలగించాల్సిన భాధ్యత మనపై ఉంది. ప్రజలకు మన జర్నలిస్ట్‌లపై ఉన్న చెడు అభిప్రాయాన్ని తొలగించే దిశగానే ఈ చాప్టర్ రాయడం జరిగింది. ఇక అలాంటి భావన కలిగిన వారికోసం ఇక్కడ రాయబడిన అంశాలు పరిశీలన చేయాల్సిందిగా మనవి.

## ఇప్పటికే జర్నలిజంలో

దొంగలు ఇప్పటికే మీడియాలో ఎవరు అనేది చెప్పటం జరిగింది. మా జర్నలిస్ట్‌లపై మంచి అభిప్రాయం లేని వారి కోసం మరింత లోతైన అంశాలతో ఈ వ్యాసం రాయబడిందిగా గ్రహించాలి. ఇప్పటివరకు పెట్టుబడిదారీ వ్యవస్థ జర్నలిజంలో చేరి జర్నలిజాన్ని, జర్నలిస్ట్‌లను భ్రష్టు పట్టించింది అని తెలుసుకున్నాం. ఇక ఇదే పెట్టుబడిదారీ వ్యవస్థ మీడియా ముసుగులో పారిశ్రామిక రంగాన్ని, సినీరంగాన్ని, విద్యా–వైద్య రంగాలను, రాజకీయ రంగాన్ని మరికొన్ని రంగాలతో పాటు, ప్రభుత్వ వ్యవస్థ మరికొన్ని వ్యవస్థలను ఆసరాగా చేసుకుని ధనార్జన కోసం మీడియా రంగాన్ని వ్యాపారంగా మార్చింది. ఇందులో భాగంగా పైనచెప్పబడిన రంగాలకు, వ్యవస్థల ఎదుగుదలకు ఆ రంగం అలా, ఈ రంగం ఇలా, ఆ వ్యవస్థ అలా, ఈ వ్యవస్థ ఇలా ఆంటూ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి స్పెషల్ ప్యాకేజిలు తీసుకుని మీడియాపేరిట ప్రచురణ/ప్రసారాలు చేసి మీడియా సంస్థలు ధనార్జన చేస్తున్నాయి. ఇక్కడే ప్రజలు సరియైన ఆలోచన చేయాలి. ప్రజాస్వామ్యం, సామాజిక భాధ్యత, సామాజిక భద్రత అంటూ లైసెన్సులు తెచ్చుకుని ప్రజలకు ఎంతవరకు సామాజిక బాధ్యత, భద్రత కల్పిస్తున్నాయి మీడియా సంస్థలు సమాధానం చెప్పాల్సిన అవసరం మీడియా సంస్థలకు ఉంది.

ఈ విధంగా పైనచెప్పబడిన రంగాలన్నింటి నుంచి, వ్యవస్థల నుంచి అవి తుమ్మినా – దగ్గినా ఆహా...ఓహో అంటూ భజన కార్యక్రమాలతో వారి నుండి మీడియా సంస్థలు ప్రకటనలు పొందటంలేదా...? ఉదాహరణకు చిన్న విషయం అందరికి అవగాహన ఉన్నదే...! ప్రవేట్ విద్యాసంస్థల వ్యవహారం. పరీక్షా ఫలితాలు వెలువడినప్పుడు ఆ విద్యాసంస్థ ర్యాంకుల మోత, ఈ విద్యా సంస్థ విజయడంఖా – విజయదుందుభి ఆంటూ మీడియాలో

వచ్చే ఫుల్ పేజీ ప్రకటనలు, చానల్స్‌లో ఒకటి.... ఒకటి....ఒకటి... అంటూ, రెండు....రెండు..., మూడు.... మూడు అంటూ ఒక్కో ర్యాంకు పదిసార్లు భారీశబ్దాలతో ఊదరగొట్టి ఆయా విద్యాసంస్థల నుండి లక్షల లక్షల ప్రకటనలు పొంది, అవిచాలక ఆయా విద్యాసంస్థల నిర్వాహకులతో ప్రత్యేక ఇంటర్వ్యూలతో అలాగా.... ఆహా...., ఇలాగా.... ఓహో అంటూ ఎవరిమెప్పు కోసం-ఎవరిలాభం కోసం ఈ ఊక దంపుడు ప్రకటనలు. ఇక ప్రభుత్వం ఈ విధానాలకు చెక్కు పెట్టింది కాబట్టి సరిపోయింది. లేదంటే ఈ ప్రకటనల టార్చర్ మాములుగా ఉండేది కాదు.

ఈ ప్రకటనలు చూసి పిల్లల భవిష్యత్ బాగుండాలి అని నిత్యం ఆలోచించే ఆర్ధిక స్థోమత లేని తల్లిదండ్రులు ప్రకటనలు చూసి మోసపోయి అక్కడ విద్య బాగున్నా....బాగోలేకపోయిన పిల్లల కోసం వేలకు వేలు ఫీజులు పోసి మరి ఏ మాత్రం పిల్లల భవిష్యత్ బాగు చేసుకుంటున్నారో.... లేదోగానీ  అలాంటి విద్యా సంస్థలు దోపిడీకి విద్యార్థుల తల్లిదండ్రులు గురవుతుంటే, ఇలా వ్యవహరించే విద్యా సంస్థలు మీడియాని వేదిక చేసుకుంటున్న వైనాన్ని మీడియా సంస్థలు కూడా ఆ విద్యా సంస్థల అవసరాలను ఎంచక్కా క్యాష్ చేసుకుంటున్నాయి. ఇక్కడ మనం ఒకటి గ్రహించాలి సామాజిక భాద్యత అంటూ పురుడు పోసుకున్న ఏ మీడియా అయినా అన్ని తరగతుల విద్యార్థుల కోసం రోజుకో గంట, రెండు గంటలు నిపుణులైన అధ్యాపకులతో బోధనాక్లాసులను నిర్వహిస్తున్నాయా....? ఎందుకు ప్రసారం చేయవు...? ఇదేనా మీడియా చెప్పుకుంటున్న సామాజిక భాద్యత అంటే...? ఈ విషయంలో కొన్ని పత్రికలను కొంత మేరకు మినహాయించాలి. ఎందుకంటే కొన్ని పత్రికలు విద్యార్థుల పాఠ్యాంశాలకు సంభందించిన మెటీరియల్ అందిస్తున్నాయి కాబట్టి. ఇలా అన్నిరంగాలను మీడియా సంస్థలు దోచుకుంటున్నాయి. ఇది కాదా జర్నలిజంలో దొంగలు పడ్డారు అంటే...! ఇక్కడ చెప్పండి జర్నలిస్ట్‌లు దొంగలా ...? మీడియా సంస్థలు దొంగవా ...? ఇక్కడకూడా చెబుతున్నా అన్ని మీడియా సంస్థలు గురించి చెప్పటం లేదు. సామాజిక భాద్యత వహించని మీడియా సంస్థల గురించి మాత్రమే చెపుతున్నా....

## క్రిందిస్థాయి జర్నలిస్ట్‌లను దొంగలుగా భావించరాదు

రామాయణం అంతా విని రాముడు ఎవరు....? రాజకీయం అంతా విని రాజీవ్ గాంధీ ఎవరు....అనే వారి కోసం ఈ చాప్టర్‌లో చివరి అంశంగా చెబుతున్నా... జర్నలిజంలో దొంగలు ఉన్నారు అనే భావన కలిగిన వ్యక్తులకు ఇప్పటికే ఎవరు దొంగలు అనేది పూర్తిగా


భోధపడి ఉంటుంది. ఇంకా క్లారిటీ కోసం మరికొన్ని విషయాలు చెప్పదలుచుకున్నా....అసలు జర్నలిజం ఎందుకు గాడితప్పింది. జర్నలిస్ట్‌లు అందరూ దొంగలు కాదు వివరణ ఇస్తూనే వస్తున్నా.... కానీ అసలు చెప్పాల్సిన విషయం ఇది.అందరికి క్రిందిస్థాయిలో నిత్యం మీ మధ్య తిరిగే చిన్న చిన్న జర్నలిస్ట్‌లనే ప్రజలందరు దొంగలు అనుకుంటున్నారు. ఇది అక్షరాలా తప్పు. మీడియా సంస్థలు జర్నలిస్ట్ లను ఏ విధంగా వాడుకుంటున్నాయి. బరువు భాద్యతలు ఎలా నెత్తిన పెడుతున్నాయి. ఆయా మీడియా సంస్థల్లో పనిచేసే జర్నలిస్ట్‌లు ఆయాసంస్థల ఒత్తిళ్ల మధ్య ఎంతగా నలిగిపోయి, మానసిక వత్తిళ్లకు గురవుతూ ప్రాణాలను హరించే వ్యాధులకు గురవుతున్నారో ఎంతమంది గ్రహించ గలరు.

ఇన్ని బాధలు పడుతూ జర్నలిజం ఓ హాబీగా కనీస గౌరవ వేతనం లేకపోయినా వృత్తి పట్ల నిబద్ధతగా పని చేసే జర్నలిస్ట్‌లు తమ కుటుంబాలను ఎలా బ్రతికించుకోవాలి..? సైన్యంలో పనిచేసే సైనికుడు సైతం జీతం కోసం ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉంటాయని తెలిసి కూడా ఎందుకు సైన్యంలో చేరుతున్నారు. బ్రతకటానికి ఆదాయం కావాలి కాబట్టి. శత్రు దేశాలతో సరిహద్దుల్లో ప్రాణాలను లెక్క చేయక పోరాడే సైనికుల్లా, దేశంలో మన పాలకులు, అధికారులు, పలువ్యవస్థల్లో, రంగాలలో జరిగే అవినీతి అక్రమాలు, లంచగొండి వ్యవహారాలు, పలు తప్పుడు వ్యవహారాల నుండి స్వచ్ఛమైన ప్రజాస్వామ్య విధానాలు అమలు అయ్యేందుకు సమాజం పట్ల భాద్యత- భద్రత కోసం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఇలా ప్రతి వ్యవహారంలో ప్రజాక్షేమం కోరుతూ కలం పట్టి అక్షరాలను ఆయుధాలుగా మలిచి మా జర్నలిస్ట్‌లు చేస్తున్న నిత్యపోరాటం సిరా చుక్కల సంగ్రామం దేశ సైనికులతో పోల్చితే ఏ మాత్రం తక్కువ కాదు.

మీడియా సంస్థలు కనీస గౌరవ వేతనం ఇవ్వకపోయినా జీతం తీసుకుని పనిచేసే సైనికులతో పోల్చితే మా జర్నలిస్ట్‌లు ఏ మాత్రం తీసిపోరు.జీతంలేని కొలువుల్లో మా జీవితాలు మా కుటుంబాలు ఎలా బ్రతకాలి అందుకే మాకు ఇక్కడ ఓ అవకాశం ఉంది. ఒక ప్రెస్‌మీట్ జరిగినా, ఓ ప్రారంభోత్సవం జరిగినా, మరే చిన్న చిన్న కార్యక్రమాలు జరిగినా ఆయా నిర్వాహకులు గౌరవంగా బ్రవున్ ఎన్వలపు జర్నలిజం పేరిట మాకు ఇచ్చే 500/-, 1000/- రూపాయలు ద్వారా మేము దొంగలం అవుతామా...? మేము ఎప్పటికీ 500/-లు, 1000/- రూపాయల గాళ్లమే, ఇలా 500/-లు, 1000/- రూపాయలు గౌరవంగా ఇచ్చే చేతులను కూడా పాము పడగల్లా భావించే విలువలు కలిగిన జర్నలిస్ట్‌లు మా క్రిందిస్థాయి జర్నలిస్ట్‌ల్లో ఎంతోమంది ఉన్నారు. ఇక్కడ చెప్పే అంశం కూడా మననం చేసుకోండి. ఎవరు

ఏ ప్రయోజనాల కోసం చేసే వ్యవహారాలనైనా పెంచి పోషించేందుకు అధిక మొత్తాలలో మీడియా సంస్థలు బొక్కేస్తుంటే, వాటిని ఆసరాగా చేసుకుని మా మీడియా సంస్థలకు చెందిన కొందరు పెద్దసార్లు ఆయా ప్రాంతాలకు వెళ్ళి గంటా–అరగంటా కార్యక్రమాలు నిర్వహించి అంతా ముగిశాక నిర్వాహకుల నుండి పెద్ద మొత్తంలో స్పెషల్ ప్యాకేజీలు దండుకుని వెళ్ళేవారు దొంగలు కాదా...? గౌరవంగా చిన్న చిన్న కార్యక్రమాల ద్వారా 500/–లు, 1000/–లు తీసుకునే మా క్రింది స్థాయి జర్నలిస్ట్‌లే ప్రజలకు దొంగలుగా కనపడుతున్నారా....?అయితే ఇక్కడ కూడా ఒకటి చెప్పాలి ప్రజలకు తెలిసి క్రింది స్థాయి జర్నలిస్ట్‌ల్లో కూడా దొంగలు ఉన్నారనే భావన ఇంకా చాలా మందికి ఉండవచ్చు.దానికి కూడా పైన వివరణ ఇవ్వడం జరిగింది. అదే సింపుల్‌గా చెపుతున్న మళ్ళీ... అవినీతి – అక్రమార్కులు, నేరస్థులు మీడియా సంస్థలతో మిలాఖత్ అయ్యి లక్షలు లక్షలు యాడ్స్ టార్గెట్ చేస్తాం అంటూ నమ్మబలికి ఒక ఐడీ కార్డు, పేరూ– ఊరూ లేని ఓ చిడత (లోగో) చేత బట్టి పెద్ద ప్రొఫెషనల్ జర్నలిస్ట్‌ల్లా ఫోజు కొడుతూ అందినకాడికి అందినంత దోచుకుని మనుగడ సాగిస్తున్న కొందరు జర్నలిస్ట్‌లే అసలైన దొంగలు.

# 19. జర్నలిస్ట్‌ల “కట్టె” మిగిల్చిన కన్నీటి గాధలు




RAJA RATNAM TRUST
HOPE FOR ALL

**“జర్నలిజంలో విలువలు కలిగిన జర్నలిస్టుల జీవితాలు మధ్యలోనే అనంత లోకాలకు చేరిపోతున్నాయి. ప్రాణాలు ఉన్నంత వరకూ జర్నలిజంని ప్రేమించి సమాజం కోసం, ఆర్మీ సైనికులు దేశం కోసం పోరాడినట్లు, అదే సమాజం కోసం అక్షర సమరం చేస్తూ, కలం వీరులుగా మరణిస్తున్న జర్నలిస్టుల “కట్టె” మిగిల్చిన ఈ కన్నీటి గాధలు చదవండి”**

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

**ఈ** టైటిల్ కథనం, క్రింది రాయబడిన గాథలు ఒక జర్నలిస్ట్‌గా ఏ 'సిరా'తో, ఏ 'కలం'తో రాసినా.... చాలా తక్కువే అని నా భావన. తెలుగు జర్నలిజం పుట్టాక ఎంతోమంది జర్నలిస్ట్‌లు తమ కలాలు ఉపయోగించి ఎన్నో అంశాలలో సమాజం కోసం పాటుబడి సర్వం కోల్పోయారు. కుటుంబాలను తాము నమ్మిన జర్నలిజం సిద్ధాంతాల కోసం త్యాగం చేశారు. ఎప్పటినుండో సమాజంలో పాతుకుపోయి ఉన్న మూఢ, అంధ విశ్వాసాల నుండి ప్రజలను మేల్కొల్పారు, చైతన్యపరిచారు. సమాజాభివృద్ధిలో, మనిషి మనుగడ కోసం, విద్యా, వైద్యం, కూడు, గుడ్డ, నివాసం, ఉపాధి-ఉద్యోగం వంటి అవసరాలు ప్రతి మనిషికి ప్రభుత్వాలు కల్పించేందుకు జర్నలిస్ట్‌లు ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా సుమారు రెండు శతాబ్దాలుగా పనిచేస్తున్నారు. రెండు శతాబ్దాలుగా ప్రజలపక్షాన పలు అంశాలలో మా జర్నలిస్ట్‌లు ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వాలకు ఓ దశ-దిశా నిర్దేశం చేస్తూ చాలావరకు మార్గదర్శిలా ఉంటున్నాం.

ప్రసార మాధ్యమాలు అందులో పనిచేసే జర్నలిస్ట్‌ల కృషితోనే ఆయా ప్రభుత్వాలు ప్రజలకు మంచిపాలన అందిస్తున్నాయి. ఇందులో ప్రజలకు సంక్షేమపథకాలు, ఆయా ప్రాంతాలఅభివృద్ధి, వెనుకబడిన ప్రాంతాల పురోగమనం, జరుగుతుంది. ఇదంతా ఎలా సాధ్యపడుతుంది ప్రజలు ఆలోచించాలి. ఒక మహానుభావుడు దేశంలో పత్రికలు లేని సమాజాన్ని ఏ మాత్రం ఊహించలేనని అన్నాడు ఇందుకేనేమో...! మరో విషయం ఏమంటే సమాజంలో బాధ్యతగా పనిచేసే ఏ విభాగం అయినా నాలుగురోజులు విధులు మానివేస్తే పరిస్థితులు ఎంత అల్లకల్లోలంగా ఉంటాయో తెలుసా... అదే విధానంతో జర్నలిస్ట్‌లు, ప్రసార మాధ్యమాలు కూడా విధులు బంద్ చేస్తే లోకంలో పరిస్థితులు చాలా దారుణంగా ఉంటాయి. ఇది గ్రహించిన ఓ మహానుభావుడు అందుకే పత్రికలు లేని సమాజాన్ని ఊహించలేను అన్నాడు. అంటే ఇక్కడ జర్నలిస్ట్‌లకు, మీడియా రంగానికి ఎంత ప్రాముఖ్యత ఉందో తెలుస్తుంది.

## గుడ్డిరాతలు కాదు... అక్షర కురుక్షేత్రం మా జర్నలిస్ట్‌లది

సమాజాభివృద్ధి కోసం నాటికి నేటికీ ఆలోచన చేస్తూ,కనీస కృషి చేస్తోంది ఈ సమాజంలో ఒక్క జర్నలిస్ట్ మాత్రమే. ఎన్నో రంగాలు ఉన్నాయి అన్నిరంగాలు ప్రజావ్యవస్థను దోచుకోవడం తప్ప ప్రజాసంక్షేమం కోసం ఏ రంగం కృషి చేస్తుందో ఆ రంగం గురించి గొప్పగా చెప్పే వ్యక్తులు గుండెల మీద చేయివేసుకుని ముందుకు రావాలి.

1835లో ప్రారంభం అయిన తెలుగు జర్నలిజం ప్రజల్ని మూఢ-అంధ విశ్వాసాల నుండి ఆధునిక యుగంలో అంతరిక్షానికి చేరుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల వరకు ఎన్నో రకాలుగా ప్రజలను చైతన్య పరచడంలో జర్నలిస్ట్ల పాత్ర కూడా కొంతమేరకు ఉందని అందరూ గ్రహించాలి. సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, చారిత్రాత్మక, రాజకీయ, సాంస్కృతిక, పారిశ్రామిక, విద్యా-ఉద్యోగ, వ్యవసాయ, కార్మిక, సినిమా వంటి ఎన్నో రంగాలలో మార్పులు, ఉద్యోగుల హక్కులు, సమాన అవకాశాలు ప్రజలకు రాజ్యాంగం కల్పించగా, వాటిని కాపాడే దిశగా మా జర్నలిస్ట్ల కలాలు ఎక్కడా. కుంటి – గుడ్డి రాతలు, జీవం లేని రాతలు రాయలేదు. నిత్యం ప్రజాక్షేమం కోరుతూ ప్రజల హక్కులు, అభివృద్ధి, ఉపాధి, అంటూ పోరాట మార్గంలో నడిచిన మా జర్నలిస్ట్ల కలాలు రాసిన అక్షరాలు నిప్పు కణాలుగా రగిలి ప్రజలపక్షాన నాడు – నేడు పోరాడుతూనే ఉన్నాయి. అక్షరాలను ఆయుధాలుగా చేసుకుని మా జర్నలిస్ట్లు ఈ చెడిపోయిన సమాజాన్ని బాగు చేయడానికి, మేల్కొలపడానికి అక్షరసైనికులుగా సుదీర్ఘ కాలంగా అక్షరసమరం చేస్తున్నారు. ఈ క్రమంలో మా జర్నలిస్ట్లు ఏమి సాధిస్తున్నారు. ఏమి కోల్పోతున్నారో ఎవరైనా...ఎప్పుడైనా... కనీస మనసు పెట్టి ఆలోచించారా...? మా అక్షరాల పాఠక దేవుళ్ళారా...వీలైతే ఈ కథనం పూర్తిగా చదవండి. మీకు నచ్చితే విలువలు కలిగిన జర్నలిస్ట్లకు ఓ చిన్న సెల్యూట్ కొట్టండి. మీకు ఇంకా నచ్చితే మా జర్నలిస్ట్లను అగౌరవ పరచకుండా మీరు గౌరవించే జర్నలిస్ట్ల గురించి నలుగురికి గొప్పగా చెప్పండి. దొంగ జర్నలిస్ట్లకు ఈ చాప్టర్లో రాయబడిన ఏ చిన్న అక్షరం కూడా వర్తించదు అని పాఠకులకు మనవి.

### జర్నలిస్ట్లు ఏమి కోల్పోతున్నారు... మా ఆస్తి పాస్తులు ఏమిటో మీకు తెలుసా.....?

రూపాయి ఆదాయం లేక గజం స్థలం లేక, బిడ్డల భవిష్యత్ బాగుచేయలేక, కుటుంబానికి ఏ భరోసా కల్పించలేక, కుటుంబ బరువు- భాద్యతలు పక్కనబెట్టి, పిల్లల ఎదుగుదల కళ్లారా... చూడలేక, వృద్దులైన తల్లిదండ్రులు ఆరోగ్య పరిరక్షణకు కనీస భాద్యతలు నెరవేర్చలేక, కన్న కూతుళ్ళ పెళ్ళికి కట్నాలు చెల్లించలేక 24 గంటలు, 360రోజులు నమ్ముకున్న జర్నలిజం కోసం మా జీవితాలు ప్రజాసంక్షేమం, సమాజాభివృద్ధి, సామాజిక భాద్యత, సామాజిక భద్రత,అంటూ పగలు-రాత్రి తేడాలేకుండా అహోరాత్రులు జర్నలిజానికి అంకితమై, మా మీడియా సంస్థలకు లక్షల లక్షలు యాడ్స్ టార్గెట్స్ చేస్తూ, పత్రికలైతే సంవత్సర చందాలు,ఛానల్స్ అయితే వార్షికోత్సవాలు,ఇవి చాలక వాడుపుట్టాడు-వీడుసచ్చిన రోజు,

అలాగే ఉగాది పంచాంగం, నూతన సంవత్సర క్యాలెండర్, ఇలా ఒకటేమిటి... సమాజ సంక్షేమం అనే అంశాన్ని అడ్డుపెట్టుకుని దేవుడు- దేవతల కల్యాణం జరిపించే మీడియా సంస్థల బూటకపు భక్తి - అందులో దోపిడీ, అలాగే ఇక రాజకీయ నాయకులు అయితే వారు తుమ్మినా... ఆహా...., దగ్గినా... ఓహో.... అంటూ వారు పదవిలో ఉన్నా..., లేకపోయినా.... వారి మెప్పుకోలు కోసం విషయం ఉన్నా.... లేకున్నా... వార్తలు వేసి వారివద్ద యాడ్స్ తీసుకురండి అని యాడ్స్ తేలేకపోతే పత్రిక నుండి, ఛానల్ నుండి వెళ్లిపోండి మీరు మాకు అవసరం లేదనే మీడియా సంస్థల నుండి మేము ఉద్యోగాన్ని కాపాడుకునేందుకు ఎంత టెన్షన్ పడుతూ, ఎన్ని కష్టాలు పడతామో...ఆ కష్టాలు ఎవరైనా గమనించారా...? ఇలా మా జర్నలిస్ట్‌లు ఏమి కోల్పోతున్నాం, ఏమి సాధిస్తున్నాం అంటే దశాబ్దాలుగా జర్నలిజంలో ఉన్న మమ్మల్ని, మా కుటుంబాలను ఒకసారి పరిశీలించండి.చాలా మంది ప్రజలు అనుకుంటునట్లు జర్నలిజం వృత్తిలో మేము సాధించిన, సంపాదించిన ఆస్తిపాస్తులు ఏమిటో మీకు తెలుసా....?ఈ వృత్తికి అంకితమైన మేము శరీరాలు చెదలు పట్టి షుగర్, బీపీ వంటి రోగాలతో కుళ్ళి, కుశించి పోయే దేహాలతో చావలేక, బ్రతకలేక జీవనం సాగిస్తున్నాం. మీకు దగ్గరగా ఉన్న మా సీనియర్ జర్నలిస్ట్‌ల ఆరోగ్య సమస్యలపై సరదాగా ఓ చిన్న పరిశోధన చెయ్యండి అదీ మీకు వీలుపడితే తెలుసుకునే ప్రయత్నం మాత్రమే...పది మందిలో సగానికి పైగా మా జర్నలిస్ట్‌లు దీర్ఘకాలిక వ్యాధులతో (షుగరు-బీపీ) వీటి ద్వారా వచ్చే వ్యాధులతో భాదపడుతున్నారు. చాలామంది అనుకుంటున్నట్లు వేలకు వేలు,లక్షలకు లక్షలు, కోట్లకు కోట్లు, ఎకరాలకు ఎకరాలు, లెక్కకు మించిన బ్యాంక్ బ్యాలెన్స్‌లు కాదు మా ఆస్తులు. అయ్యా... మీకు ఓపిక ఉంటే... మా జర్నలిస్ట్‌లని, మా కుటుంబాలను ఓసారి పరిశీలించే ప్రయత్నం చేయండి.

మా ఆస్తులు అంటే ఏమిటి అనేది మా దేహాలను పట్టి పీడిస్తున్న షుగర్, బీపీలు అని మీకు ఈజీగా అర్థం అవుతుంది. వాటివల్ల కలిగే ఇతర రోగాలు మా ఆస్తులు అని మీకు మా జర్నలిస్ట్‌ల దేహాలు సజీవసాక్ష్యాలుగా దర్శనమిస్తాయి. అప్పుడైనా మా ఆస్తులు ఏమిటి అనేది మీకు పూర్తిగా అర్థం అవుతుంది. అలాగే ఇప్పుడు నేను చెప్పినది అంతా, మరి కొన్ని రంగాలలో ఉన్నప్పటికీ ఈ సమస్యలు 80% జర్నలిజంలో జర్నలిస్ట్‌లు మాత్రమే ఎదుర్కొంటున్నారు. ఈ వివరణ అంతా... జర్నలిజంలో విలువలు కలిగిన జర్నలిస్ట్‌ల జీవితాలు గురించే గానీ, జర్నలిజంను అడ్డుపెట్టుకుని అపార ఆస్తులు సంపాదించిన దొంగ జర్నలిస్ట్‌ల గురించి మాత్రం కాదని అందరూ అర్థం చేసుకోవాలి. ఇక మా జర్నలిస్ట్‌ల దీన గాథలు

చెపితే ఎందుకురా.... ఈ బతుకు అనిపించక తప్పదు. అందుకే ఈ కధనం ఏ "సిరా"తో రాసినా,ఏ "కలం"తో రాసినా తక్కువే అని మొదలు పెట్టడం జరిగింది.

## జర్నలిజంలో ప్రత్యేక హోదాల కోసం

ఈ జర్నలిజంలో జర్నలిస్ట్ అనే పదమే ఒక పెద్ద హోదా...! జర్నలిస్ట్ అయ్యేందుకు విశ్వప్రయత్నాలు....అయ్యాక జర్నలిస్ట్‌గా పలు హోదాల కోసం వెంపర్లాట....ఇదండీ సరిగ్గా ఇక్కడ ప్రారంభం అవుతుంది మా జర్నలిస్ట్‌ల పతనం.ఇప్పటికే రెండు, మూడు చాప్టర్స్‌లో చెప్పా ఒక వాఖ్యం. అయితే ఆ వాఖ్యానికి సరియైన అర్ధం మీకు ఇక్కడ దొరుకుతుంది. ఆ వాఖ్యం ఇదే మనసు పెట్టి అర్ధం చేసుకోండి అందరికంటే ముందుండాలని జర్నలిజంలో పలురకాల హోదాల కోసం ప్రయత్నించి ఆ హోదాలు నిలుపుకోవడం కోసం మా జర్నలిస్ట్‌లు పెట్టే అలుపెరుగని పరుగులు కేవలం స్మశానాల్లో అంతం అవుతున్నాయి. ఇదీ అసలు కథ.జర్నలిస్ట్‌ల కట్టె మిగిల్చిన కన్నీటి గాధలు కథనానికి మూలం పైన చెప్పబడిన ఈ వాఖ్యం. ఇది ఎంతమంది గ్రహించగలరు. దీనికి మీకు పూర్తి వివరణ ఇస్తున్నాను. కావాలంటే మా జర్నలిస్ట్‌లను పరిశీలించండి.

సాధారణ జర్నలిస్ట్ హోదా మామూలే.అయితే హోదా అని చెప్పాను కదా...!అదే ఈ హోదాల కథ.సబ్ ఎడిటర్ ఇదో హోదా... కాపీ ఎడిటర్, స్టేట్ బ్యూరో, ఇంకా రీజనల్ కో-ఆర్డి నేటర్, బ్యూరో ఇన్ ఛార్జ్,స్టాఫ్ రిపోర్టర్, సిటీ రిపోర్టర్, ఆర్.సీ ఇన్చార్జ్, క్రైమ్ రిపోర్టర్,అగ్రి జర్నలిస్ట్, బిజినెస్ రిపోర్టర్, స్పోర్ట్, ఎడ్యుకేషన్, పొలిటికల్, సినిమా పలు రకాల బీట్ జర్నలిస్ట్ వంటి జర్నలిస్ట్ హోదాల కోసం ఉదయం కోడి కూతకు ముందు మొదలయ్యే పరుగు అర్ధరాత్రి వరకు ఆగేదిలేదు. కొంచెం, ఇంకొంచెం కష్టపడితే ప్రస్తుతం ఉన్న హోదాను దాటి మరో హోదాకు వెళతాం అనే ఆలోచనలో 24గంటలు, 360రోజులు విరామం ఎరుగని పరుగులే తప్ప ఎంత పరుగులు పెట్టినా సాధించాలి అనుకున్న హోదా సాధ్యపడినా, పడకపోయినా రూపాయి ఆదాయం మాత్రం ఎట్టి పరిస్థితుల్లో పెరిగే అవకాశంలేదు. అయినా మా జర్నలిస్ట్‌ల పోరాటం ఎక్కడా ఆగదు... స్మశానంలోనే ఈ పరుగుకు ముగింపు అని తెలుసుకోలేని పోరాటం మా జర్నలిస్ట్‌లది.

## వార్తా సేకరణకు పడిగాపులు

ఈ పడిగాపులు ఏ పగవాడికి రాకూడదు. ఆ జర్నలిస్ట్, ఈ జర్నలిస్ట్ అనే హోదా కోసం ఒక్కో హోదా జర్నలిస్ట్‌గా నియామకం అయిన మా విలేకరుల దినచర్య ఇలా

ఉంటుంది. ఇందులో కొన్ని రకాల హోదా కలిగిన జర్నలిస్ట్‌లు వార్తలు సేకరణకు కోడికూత కంటే ముందు నిద్రలేచి తాను పనిచేస్తున్న ప్రాంతానికి చేరుకోవాలి. అలాగే మరి కొన్ని జర్నలిస్ట్ హోదాలో పని చేస్తున్న జర్నలిస్ట్‌లు అర్ధరాత్రి దాటే వరకు నిద్రాహారాలు మాని వార్తా సేకరణకు కట్టుబడి ఉండాలి. ఈ క్రమంలో ఉదయం వేకువజామున ఫీల్డ్‌లోకి వచ్చే జర్నలిస్ట్, నుండి అర్ధరాత్రి అనంతరం ఇంటికి వెళ్ళే జర్నలిస్ట్ వరకు ఎవరికి వారిగా ఉదయం అల్పాహారం ఎక్కడ...?మధ్యాహ్నం భోజనం మాటేమిటి...?రాత్రికి డిన్నర్ ఎలా...?మా జర్నలిస్ట్‌ల జేబులు ఎప్పుడూ చిల్లులుపడే ఉంటాయి కదా...!జేబులు ఎంత వెతికినా ఏదో తగులుతుంది గానీ...!ఏ జేబులోనూ,పావలా... బిళ్ళ దొరకదు. ఈ కారణంతో ఆఫ్ లీటర్ వాటర్,ఎవరో పరిచయస్థులు ఇచ్చే టీ తప్ప నాలుకమీద పేరుకుపోయిన పాచి అంగిట్లోకి దిగి కడుపులోకి జారిపోతే  అదే మాకు ఆహారం అయ్యేది.రోజు ఇదే పరిస్థితి సమయానికి ఒకటి రెండు ముద్దలైనా ఆహారం తీసుకోకపోతే షుగర్ వ్యాధి తప్పదు అని డాక్టర్స్ ఎన్నిసార్లు హెచ్చరించినా వృత్తి ధర్మం పాటించే మా జర్నలిస్ట్‌లు ఎక్కడా ఈ  పరుగులు ఆపటం లేదు.

ఈ పడిగాపులకు ఒక కారణం ఉంది. ఏ హోదాలో పనిచేసే జర్నలిస్ట్ అయినా ఉదయాన్నే నియోజకవర్గ కేంద్రానికి చేరుకోవాలి. ఇక ఉదయం నుండి రాత్రి వరకు 10నిమిషాలు కూడా  నియోజకవర్గాన్ని వదిలి వెళ్లడానికి లేదు. ఒక వేళ వెళ్ళామా... ఈ లోపు ఏదైనా సంఘటన జరిగితే దానికి సంబంధించిన వార్త విజువల్స్ కవర్ చేయలేక పోతే మా మీడియా సంస్థలపై స్థాయి వ్యక్తుల తో నీ యమ్మ...!వాడి...అమ్మ...!ఏం... పీకుతున్నావు....!ఏం పొడుతున్నావు....!అనే బూతుపురాణం మమ్మల్ని చెప్పుకోలేని ఆవేదనకు గురిచేస్తుంది. అందుకోసం ఉదయం  నుండి అర్ధరాత్రి వరకు మమ్మల్ని నియామకం చేసిన ప్రాంతాల్లో ఏ చెట్టో, పుట్టో, షెడ్డో చూసుకుని గోతికాడ నక్కల్లా జీవిస్తున్నాం.ఈ క్రమంలోనే సరియైన సమయానికి ఆహారంలేక షుగర్‌వ్యాధికి, ఇక ఆ వార్త – ఈ వార్త, అదేమిటి...?ఇదేమిటి...?అంటూ సవాలక్ష ప్రశ్నలకు జవాబులు, ఏక్షణంలో ఏమడుగుతారో తెలియని టెన్షన్ మధ్య షుగర్‌తో పాటు బీపీ ఈ రెండు వ్యాదులవల్ల కలిగే ఇతర వ్యాధులు మా జర్నలిస్ట్‌ల దేహాలను ఆవహించి మా శరీరాలను, అవయవాలను స్లో పాయిజన్ లా తినేస్తున్నాయి.

## అంతుపట్టని వ్యాధులు- అల్లకల్లోలంగా జీవితాలు

ఇప్పటి వరకు మా జర్నలిస్ట్‌లకు షుగర్,బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రావటానికి కారణం తెలుసుకున్నాం. షుగర్–బీపీలే కదా...!ఏముంది అని తేలిగ్గా తీసుకోకండి. అలాగే ఈ రోజున ఇవి సహజం అయినప్పటికీ ఇక్కడ సింహ భాగం ఈ వ్యాధులకు గురై జీవితాలు అల్లకల్లోలమై అత్యధికంగా వేధనలకు, పీడనకు గురవుతున్న వ్యక్తుల్లో జర్నలిస్ట్‌లే ఎక్కువమంది ఉన్నారు. వృత్తిపరంగా సమయానికి నిద్రాహారాలు లేక,వత్తిడి–టెన్షన్,అతిగా ఆలోచన వంటి విధానాల వల్ల మా జర్నలిస్ట్‌లు ముందుగా షుగర్ వ్యాధికి గురవుతున్నారు. షుగర్–బీపీలు అన్న దమ్ముల వంటివి అని చాలామంది చెబుతారు. ఈ క్రమంలో షుగర్ వచ్చిన కొన్నాళ్ళకు బీపీ కూడా వస్తుంది. ఇక ఈ రెండు వ్యాధులు మా జర్నలిస్ట్‌లను ఆవహించినప్పటికి వృత్తిపరంగా మా దినచర్య మామూలే. దీని కారణంగా ఆరోగ్యంపై ఏ మాత్రం శ్రద్ధ పెట్టలేని మా జర్నలిస్ట్‌లు ఏమి త్యాగం చేసి, ఏమి కొని తెచ్చుకుంటున్నారో చూడండి.

షుగర్, బీపీల వల్ల క్రమ క్రమంగా శరీరంలో ఒక్కో భాగం పాడవుతాయి జాగ్రత్తగా ఉండాలి అని డాక్టర్స్‌తో పాటు ఎందరు హెచ్చరించినా జర్నలిజమే జీవితంగా, జర్నలిస్ట్ అనేదే..అతి పెద్ద హోదాగా మొదలు పెట్టిన పరుగులో ప్రాణాలు హరించే వ్యాధులకు గురయినప్పటికి గానీ తెలియటంలేదు.ఇక ఈ షుగర్, బీపీల వల్ల కిడ్నీలు ఫెయిల్, హార్ట్ స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్, పెరాలసిస్, కంటి చూపు, పంటి సమస్యలు, ఒకటేమిటి.ఈ వ్యాధులు వచ్చిన జర్నలిస్ట్‌లు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇంతటి నరకయాతన ఏ పాపం చేసుకుంటే వస్తుందో మరి..! పడుకుంటే అటు–ఇటు కదలలేని పరిస్థితి, కూర్చుంటే లేవలేక–లేస్తే కూర్చోలేక, మల–మూత్రాలకు వెళితే అక్కడ కలిగే ఇబ్బందులు బయటకు చెప్పుకోలేక, ఒంటరిగా నాలుగు అడుగులు వేయలేక జీవంలేని నడక, ఏ మాత్రం పట్టులేని తుంటి చేతులు, బేల చూపులు ఇక వ్యాధుల నివారణకు అవసరమైన మెడిసిన్ కొనుగోలుకు కనీసం వంద రూపాయలు దొరక్క ఆసుపత్రి బెడ్డులపై, ఇంటిలో మంచాలపై ఓ మూల చెత్త–పేడదిబ్బల్లో పురుగుల్లా అంతు చిక్కని రోగాలతో శరీరాలు కుశించిపోతూ, కుళ్ళిపోతుంటే కొందరు జర్నలిస్ట్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.మరి కొందరు పైన చెప్పబడిన వ్యాధులతో పాటు సీనియర్ డాక్టర్స్‌కి కూడా అంతుబట్టని మరి కొన్ని రకాల వ్యాధులతో కానరాని లోకాలకు చేరుతున్న మా జర్నలిస్ట్ కుటుంబాల కన్నీటి గాథలు చెప్పుకుంటే మామూలు వ్యథలు కాదు. సింపుల్‌గా చెప్పాలి అంటే... కన్నీటి బొట్టు బరువుగా ఉండకపోవచ్చు కానీ ఆ కన్నీటి బొట్టు వెనుక మోయలేనంత బరువైన బాధలు ఉన్నాయి.

## జర్నలిజంలో జర్నలిస్టుల తపస్సు...

జర్నలిజాన్ని...ప్రేమించారు...ప్రేమించారు....ప్రేమించారు... తస్సదియ్యా! ఎట్టకేలకు జర్నలిస్ట్‌గా ఎదిగిపోయారు మా వాళ్ళు. ఇక్కడ కూడా చెపుతున్నా....ఈ అంశం కూడా విలువలతో పనిచేసి,నీతి–నిజాయితీగా జర్నలిజం విలువలకు కట్టుబడి పనిచేసిన జర్నలిస్ట్‌ల తపన ఎలా ఉంటుంది. జర్నలిజంలో వారు కొనసాగించిన తపస్సు నాలుగు ముక్కల్లో ఓ సారి అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి చాలు. ప్రతీరోజు తూరుపు తెల తెల వారుతుండగా మసక–మసక చీకట్లో సద్ది–బొద్ది తినే సమయం కూడా ఉండదు మా జర్నలిస్ట్ లకు, లేచిందే లేడికి 'పరుగు'లా, వార్తలు సేకరణ కోసం ఉదయం ప్రారంభం అయ్యే పరుగులే అడుగులుగా చేసుకున్నాం. జర్నలిజమే మార్గంగా ఎంచుకున్నాం. రెండు గుక్కలు దాహం–నాలుగు మెతుకులు ఆహారం సమయానికి అందుకోలేక ఆకలి–దప్పులకు ఓర్చాం. కుటుంబ భాధ్యతలు– జీవన స్థితిగతులు మరిచాం.జర్నలిస్ట్ లు దొంగలు–ఈజీ మనీ సంపాదకులు అనే ఎన్నో నిందలు మోసాం. అవి నీతి–అక్రమాలు బయటపెడుతున్న క్రమంలో బెదిరింపులు, దాడులకు, హత్యలకు గురవుతున్నాం. అలివి కాని రోగాలతో కుళ్ళి,కుశించిపోతున్నాం. నిలువ నీడలేని బ్రతుకులు రెంట్‌హౌస్‌లే భారంగా ఆవాసం.మగపిల్లలకు చదువులు–ఆడకూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేయలేని బికారీ బ్రతుకులు ఇలా చెప్పుకుంటూపోతే కొండవీడు చాంతాడు అంత లిస్టు మా జర్నలిస్ట్ ల జీవితాల అంతుచిక్కని ఆవేదన.

## జర్నలిజం...జర్నలిస్ట్‌కి ఓ..సంకల్పం

ఇక దశాబ్దాలుగా జర్నలిజంలో ఉన్న కొందరు విలువలు కలిగిన జర్నలిస్ట్‌లు ఎలా ఉన్నారో... తెలుసా...?మరో లోకం తెలియని వ్యక్తులుగా మారిపోయారు.అన్నీ మరిచారు. ఈ రోజు వార్తలు ఏమిటి...?ప్రత్యేక కథనాల కోసం అన్వేషణ, వార్తా కథనాలను అవసరమైన రిఫరెన్సు సాధన, పాఠకులకు ఆశక్తికరమైన అంశాలు అందించాలని కొత్త కొత్త విషయాలు వెంట పరుగులు, సామాజిక అంశాలు, సామాజిక భాధ్యత, వెలివాడల్లో అణిచి వేయబడుతున్న బ్రతుకులను చైతన్య పరుస్తూ రాస్తున్న ప్రత్యేక కథనాలుతో పాటు అనేక విషయాలపై ఎక్కడెక్కడో అలుపెరగని అన్వేషణ ఈ క్రమంలో శారీరక శుభ్రత మరిచి, చీకిపోయిన, చిరిగిపోయిన వస్త్రధారణ, చింపిరి జుట్టు,మాసిన గడ్డం, మనిషి ప్రక్కనే ఉన్నా కంటి చూపుకు–మాట పలకరింపుకు అందనంత దూరంగా ఉన్నట్లుగా ఏదో ఎవరికి తెలియని లోకంలో

ఉంటున్నారు.బహుశా ఈ విధానమే జర్నలిజం అనే లోకం అనుకుంటా...!ఈ జర్నలిజం కోసం మా జర్నలిస్ట్‌ల తపస్సు ఎలా ఉందో... తెలుసుకున్నారు గా...అదీ మరి జర్నలిస్టుల సంకల్పం అంటే...

## ఇవి కాదా...జర్నలిస్ట్‌ల కట్టె మిగిల్చిన కన్నీటి గాధలు

పాఠకులకు ఇక్కడ కూడా మరోసారి చెపుతున్నా...విలువలతో జర్నలిజం చేసిన జర్నలిస్ట్‌ల గురించి మాత్రమే ఈ అంశం రాయబడింది. పాఠకులు, పలువురు సీనియర్ జర్నలిస్ట్‌లకు ప్రత్యేక మనవి. ఈ చాప్టర్‌లో నేను ఇక్కడ రాయబడిన మృతులైన జర్నలిస్ట్‌ల వివరాలు నాకు తెలిసిన, నేను చూసిన అలాగే నాకు తెలిసి, చూసిన వారి గూర్చి విన్న అంశాలను మాత్రమే ఇక్కడ నేను రాస్తున్నాను. క్రింది విధంగా విలువలతో పనిచేసి మరణించిన జర్నలిస్ట్‌లు, అటువంటి జర్నలిస్ట్‌ల కట్టె మిగిల్చిన కన్నీటి గాధలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నో ఉండి ఉంటాయి. అయితే ఇక్కడ జర్నలిస్ట్‌గా  నేను పనిచేసిన ప్రాంత పరిధిలో నాకు తెలిసి నేను చూసిన జర్నలిస్ట్‌ల గురించి మాత్రమే ఈ చాప్టర్ లో కొన్ని విషయాలు చెపుతున్నాను. కావున పాఠకులు మరోలా భావించకుండా నాకు తెలిసి నేను పొందుపరిచిన అంశాలను సహృదయంతో అర్థం చేసుకుంటారని మనవి.

## పింగళి దశరధ్‌రామ్ (డేరింగ్ అండ్ డాషింగ్ జర్నలిస్ట్)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పింగళి దశరథ్ రామ్ ఓ ప్రత్యేక జర్నలిస్ట్. ఎన్ కౌంటర్ దశరథ్‌రామ్ అనే పేరు 1980వ దశకంలో జర్నలిజంలో ఓ ప్రత్యేక సంచలనం. ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాల కోసం, కుళ్ళు రాజకీయ వ్యవస్థను ఎప్పటికప్పుడు తన కథనాలతో ప్రశ్నిస్తూ సమాజంలో జరుగుతున్న అవినీతి–అక్రమాలపై నిత్యం అక్షర పోరాటం చేసిన ఎన్ కౌంటర్ దశరద్‌రామ్ మరణానంతరం ఆయన కుటుంబం ఎన్నో కష్టాలు పడింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ కౌంటర్ పత్రికకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. ప్రస్తుతం 45–50 ఏళ్ళ వయసు పైబడిన  వారికి ఈ పత్రిక గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఈ పత్రిక వ్యవస్థాపకులు దశరద్‌రామ్ డేరింగ్ అండ్ డాషింగ్ జర్నలిస్ట్‌గా ఎన్నో సంచలనాత్మక కథనాలు రాసి చావుని కొని తెచ్చుకున్నారని కొన్ని వార్తా కథనాల ద్వారా

హత్యకు గురయ్యారని తెలుస్తుంది. జర్నలిజం కోసం బ్రతికి అదే జర్నలిజం కోసం ప్రాణాలు విడిచారు. ఆయన హత్య అనంతరం ఆయన కట్టె మిగిల్చిన కన్నీటి గాథలు విషయానికి వస్తే దశరథ్ రామ్ గారిని నేనైతే కళ్ళారా చూడలేదు.అతని పత్రికపై, అతనిపై కొంత మేరకు అభిమానం ఉండేది.

అయితే ఆయన హత్యకు గురైన నాటికి భార్య సుశీలమ్మ తన పిల్లలను బ్రతికించడాని ఆమె వద్ద ఆస్తిపాస్తులు ఏమీ లేవు.ఈ క్రమంలో విజయవాడ నుండి ప్రస్తుత రాజధాని అమరావతి గ్రామాలలో ఒక గ్రామం నవులూరు (మంగళగిరి మండలం) బ్రతుకుదెరువుకు స్థానిక మక్కెవారిపేటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఆమె జీవనం సాగించారు. అలాగే చిన్న పిల్లలతో నివాసం ఏర్పాటు చేసుకున్న ఆమె ఒక చిన్న టిఫిన్ హోటల్ పెట్టుకుని  పిల్లలకోసం చాలా కష్టాలు పడ్డారు. సుశీలమ్మ గారి హోటల్లో నేను కూడా టిఫిన్ చేసే వాడిని. అయితే అప్పట్లో మాకు తెలిసిన సుశీలమ్మ, ఆమె పిల్లలు దశరథ్ రామ్ గారి కుటుంబం అని ఏ మాత్రం మాకు తెలియదు. ఇక ఉదయం టిఫిన్ హోటల్, సాయంత్రం నవులూరు ప్రక్కనే ఉన్న ఈనాటి రాజధాని అమరావతి గ్రామాలు నిడమర్రు, కురగల్లు, బాపూజీనగర్ పూలతోటల్లో ఆ రోజుల్లో పూలు కోసేందుకు రోజువారీ కూలీలుగా వెళ్ళేవారు.

సుశీలమ్మగారు చిన్నబిడ్డలతో బ్రతుకుభారమైనా బాధ్యతగా నెట్టుకొచ్చారు. ముగ్గురు పిల్లల ఆకలి- అవసరాలు, చదువులు తీరుస్తూ తినడానికి తిండి, ఉంది.. .లేదు....అనే భావన లేకుండా నాలుగు కారం మెతుకులు, చింత తొక్కుడు పచ్చడి నాలుకకు రాసుకుని కన్నీళ్ళే దాహంగా అర్ధాకలి మంటలతో సుశీలమ్మ పిల్లలకోసం కష్టాలు పడ్డారు. ఇదంతా...మా ఇంటి వద్ద చిన్న పిల్లలుగా మేము చూసాం... విన్నాం...ఇప్పుడు మా ఇంటి వద్ద కొందరు పెద్దలు,నా కన్నా వయసులో కాస్త పెద్దలైన అన్నలు వివరంగా సుశీలమ్మ గారి టిఫిన్ హోటల్ గురించి చెపితే నాకు గుర్తుకు వచ్చి, అవగాహన చేసుకుని ఆశ్చర్యానికి గురయ్యాను. విషయం తెలిసే వరకు సుశీలమ్మ, ఆమె కూతురు చైతన్య, ఇద్దరు మగ పిల్లలు వీరు దశరథ్ రామ్ గారి కుటుంబం అని ఏ మాత్రం తెలియలేదు. తెలిసే నాటికి మా ఊరి నుండి వారు మరో చోటికి వెళ్ళి పోయారు.

అయితే అప్పుడు నా వయసు 10 ఏళ్ళు దాటింది. దశరద్ రామ్ గారి కుటుంబం బ్రాహ్మణ వర్గానికి చెందిన వారు. అయినప్పటికీ సుశీలమ్మ ఆ హోదా ప్రదర్శించకుండా కొన్నాళ్ళపాటు నవులూరు దళిత కాలనీలో... దళితులు అనే హేయమైన భావనలు లేకుండా సామాజిక ఆలోచనతో మనుషులు అంతా ఒక్కటే అంటూ...దళిత కాలనీలో జీవించారు.

విలువలతో జర్నలిజం చేసి కుటుంబానికి సామాజిక భావనలు అలవర్చి జర్నలిజం కోసం ప్రాణాలు అర్పిస్తే ఇలాంటి విలువలు కలిగిన జర్నలిస్టులు మరణిస్తే వారి కట్టె మిగిల్చిన కన్నీటి గాధలు ఎలా ఉంటాయో.. తెలుసుకునేందుకు ఈ కథనం ఓ ఉదాహరణగా ఇక్కడ రాయబడింది అని తెలియజేస్తున్నా...

**కలేకూరి ప్రసాద్. (బహుముఖ ప్రజ్ఞాశాలి)**



కలేకూరి ప్రసాద్ ఒక దళిత విప్లవ కవి, సినీ గేయ రచయిత, సామాజిక విప్లవకారుడు అలాగే జర్నలిస్ట్‌గా ఒకటి-రెండు పత్రికలకు సబ్-ఎడిటర్‌గా విధులు నిర్వహించారు. ఒక జర్నలిస్ట్‌గా కలేకూరి సమాజానికి ఏమి చేసినా... చేయక పోయినా...., సామాజిక దృక్పథంతో కొన్ని పోరాటాలు చేశాడు. ఇటువంటి దృక్పథం మన జర్నలిస్ట్‌లలో కూడా చాలావరకు ఉంటుంది. ఆ కోణంలో ఆలోచించి ఇక్కడ కలేకూరి ప్రసాద్‌ని జర్నలిస్ట్‌గా అతని మూలాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఇతని ప్రస్తావన తెస్తున్నాను.

కలేకూరి ప్రసాద్ ఈ పేరు నేను మొదటిసారి చుండూరు, కారంచేడు వంటి దళిత విప్లవాల కాలంలో విన్నాను.అయితే కలేకూరిని మంగళగిరిలో 1993లో చూడటం జరిగింది. అంతకుముందు నుండి కలేకూరి ప్రసాద్‌ని అంతదగ్గరగా గమనించలేకపోయినా, అతని కదలికలు తెలుసుకుంటూ ఉండేవాడిని. ఈ క్రమంలో 1993లో మంగళగిరి రైల్వే స్టేషన్‌లో కలేకూరి, ఒకరిద్దరు డప్పు కళాకారులు, కొద్దిమంది మహిళలు ఒకచోట కూర్చుని ఒక పాట ప్రాక్టీసు చేస్తూన్నారు. సన్నగా వినబడుతున్న డప్పుల మోత, అదే సమయంలో రైల్వేస్టేషన్ గుండా నేను రైల్వేస్టేషన్ ప్రక్కనే ఉన్న మా ఇంటికి వెళుతూ ఆ మోతకు, అక్కడ ఉన్నవారిని చూసి అక్కడే ఆగి పోయాను. అక్కడ ఉంది ఎవరు...ఏమిటి అని ఎంక్వయిరీ చేస్తే కలేకూరి ప్రసాద్ అని చెప్పారు. అంతే..ఆ రోజుల్లో కలేకూరి పేరు వినడమే గానీ అప్పటి వరకు అతన్ని చూడలేదు.

అయితే...ఓ విషయంలో కలేకూరి గురించి కొంత గొప్పగా విన్నాను.అంతే... ఆ రోజు వారు ప్రాక్టీసు చేసిన పాట..ఆ డప్పుల మోత నన్ను అడుగు ముందుకు వేయనీయలేదు. ఇక అక్కడ కలేకూరి ఆధ్వర్యంలో ప్రాక్టీసు చేస్తున్న పాటపేరు.. “కీచకుల సీమలోన చెల్లెలా...అలజడివై రగలాలి కదలిరా...” ఆ డప్పు మోతకు.. ప్రక్కన మహిళల కౌరస్‌కి అక్కడ నుండి అడుగు ముందుకు పడలేదు నాకు. చివరికి దాని వెనుక కథ ఏమిటీ

అంటే...కలేకూరి తీసుకున్న ఓ..సామాజిక భాద్యత అని అంతా ముగిశాక తెలిసింది.అప్పుడుగానీ తెలియలేదు నాకు కలేకూరి ప్రసాద్ అంటే పూర్తిగా...,ఇక ఆ పాట వెనుక ఆ కథ ఏమిటంటే మంగళగిరిలో ఓ రాత్రి వేళ ఆనాటి  ఒక ప్రముఖ సినీతారను స్టేజిడాన్సర్‌గా టికెట్స్ విక్రయించి మరీ అర్ధనగ్నంగా, అంగాంగ ప్రదర్శన చేయించే ఏర్పాట్లను...,అడ్డుకునే దిశగా కలేకూరి చేసిన మహిళల ఆత్మ గౌరవ పోరాటం అది. దానిని అడ్డుకునే దిశగా ఆ పాట అప్పటికప్పుడు రాసి పాడటం జరిగింది. అది ఫలితం ఇవ్వకపోగా కలేకూరి టీమ్ మొత్తాన్ని పోలీసులు ఆ రోజున అరెస్ట్ చేయడం జరిగింది.

ఇంతటి సామాజికస్పృహ, సామాజిక బాధ్యత ఉన్న కలేకూరి ఉద్యమాలే ఊపిరి అంటూ దళిత ఉద్యమాల్లో చుండూరు, కారంచేడు, వంటి ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నాడు.కర్మ భూమిలో పూసిన ఓ పువ్వా... అనే పాటతో రాష్ట్రంలో ఓ గుర్తింపుపొందాడు. ఇంకా ఇతను రాసిన పాటలు ఆల్ టైం. హిట్స్‌గా గుర్తింపు పొందాయి. ఇక కలేకూరి మంగళగిరిలో ఓ మహిళతో సహజీవనం చేశాడు. దానితో అతనికి మంగళగిరి అల్లుడుగా పేరుబడింది. మంగళగిరి మహిళతో సహజీవనం చేసిన కాలంలో ఆ మహిళకు ఒక బాబు ఉన్నట్లు, ఆ బాబు కలేకూరి కుమారుడు అన్నట్లు స్థానికులు చెబుతారు. కలేకూరి జీవితం దళితుల్లో ఎంతో గొప్పది. అయితే ఇతను సంచార జీవుడిలా...బ్రతికాడు.మద్యానికి బానిస అనేది జగమెరిగిన సత్యం. ఇతని జీవితం ఇతడే చేజేతులా తాగి..తాగి పాడు చేసుకుంటే కుటుంభం ముక్క చెక్కలైంది.భార్యకు,తనకు,కొడుకుగా చెప్పబడుతున్న యువకుడికి ఒకరికొకరికి బంధాలు తెగిపోయాయి. ఎవరికి వారే యమునా తీరేలా... అతని మరణంతో 100 ఏళ్లకు ఒక్కసారి కూడా పుట్టని అద్భుత మైన జీవితంగా కలేకూరి కథ ముగిసిపోయింది.

మంగళగిరిలో కలేకూరి కుటుంబ పరిస్థితులు నేను కొంచెం దగ్గరగానే చూశాను. నేను నా స్నేహితుడుతో కలిసి కలేకూరితో కూర్చుని ఒకటి,రెండుసార్లు నేను పనిచేసిన స్టూడియోలో కూర్చుని  పిచ్చాపాటి కూడా మాట్లాడుకున్నాం. అయితే కలేకూరి నా స్నేహితుడుకి, తెలిసిన వ్యక్తి కావటం వల్ల నేను కలేకూరిని దగ్గరగా చూడటం.. క్లోజ్‌గా మాట్లాడటం జరిగింది. అతని మాట తీరు ప్రతీ అంశాన్ని ప్రశ్నించే విధంగా ఉండేది. ప్రశ్నతో పాటు జవాబు చెప్పేవాడు. ఇక కలేకూరి గురించి ఇక్కడ చెప్పాల్సిన అవసరం లేక పోయినా, ముందుగా చెప్పినట్లు మన జర్నలిస్ట్‌లు కూడా చాలా మంది ఇలాంటి సామాజిక దృక్పథంతో మునిగి ఉండేవారు ఉన్నారు. అటువంటి వారిని కూడా ఈ కథనంలో పరిగణనలోకి తీసుకుని ఉదహరించడం కోసం కలేకూరి ప్రస్తావన ఇక్కడ తీసుకురావడం జరిగింది.

## చిమ్మన నాగభూషణం



చిమ్మన నాగభూషణం మంగళగిరికి చెందిన మొదటితరం జర్నలిస్ట్‌లలో మంచి గుర్తింపు కలిగి సామాజిక భావాలు కలిగిన ఆనాటి వ్యక్తులలో ఒక వ్యక్తి. వామపక్ష భావాలు కలిగిన ఈయన ప్రస్థానం 1944లో మంగళగిరి పోరాటాల యోధుడిగా మొదలయ్యింది. ఇక 1962లో వామపక్ష పార్టీల పత్రికలలో ఓ పత్రికకు జర్నలిస్ట్‌గా నియామకం అయ్యారు. 1962 నుండి 2000 వరకు 38 ఏళ్ళు జర్నలిజంలో కొనసాగారు. ఈయన రచనాశైలి ఎంతో పదునుగా ఉండేది. జర్నలిస్ట్‌గా కొనసాగుతూనే పార్టీ జండా క్రింద ఎన్నో ఉద్యమాలు చేశారు. మంగళగిరి ప్రస్తుత పట్టణపరిధిలో ఉన్న ఎన్నో కాలనీలు వామపక్ష పార్టీల పోరాటాల ద్వారా ఏర్పడినవే. ఈ కాలనీల ఏర్పాటులో సీపీఐ నాయకులుగా చిమ్మన నాగభూషణం పాత్ర చాలాముఖ్యమైనదిగా చెబుతారు. మంగళగిరి పట్టణంలో పేదల ఇళ్ళ స్థలాల కోసం ఉద్యమాన్ని ఊపిరిగా...కలాన్ని కత్తిలా వాడి ఎంతోమంది పేదల గూడు నిర్మాణాలకు కారకుడు అయ్యాడు. ఈ క్రమంలో పోరాటాలలో భాగంగా పోలీసులు అరెస్ట్ చేయగా, జైలుకు వెళ్ళారు ఈ మోస్ట్ సీనియర్ జర్నలిస్ట్. అనంతరం సీపీఐ నాయకులుగా పట్టణ ప్రజలకు రాజకీయాల ద్వారా మంగళగిరి మున్సిపల్ చైర్మన్‌గా గెలిచి ప్రజాసేవ చేయాలని చిమ్మన మున్సిపల్ ఎన్నికలలో పోటీచేసి ఓటమి పాలయ్యారు.

## చిమ్మన శేషజీవితం కన్నీటిమయం

గుంటూరు జిల్లా, మంగళగిరి పట్టణానికి చెందిన చిమ్మన నాగభూషణం ఒక సామాజిక వేత్త, వామపక్ష ఉద్యమకారుడు, జర్నలిస్ట్, ఈయనకు పిల్లలులేరు. బిడ్డలు లేరనే భావనను ప్రక్కన బెట్టి తనభార్యతో కలిసి ఎక్కడనుండో మరి ఓ నెలల వయసు ఉన్న బాలుడిని దత్తత తెచ్చుకోవడం జరిగింది. మొదటి ఆ బాబు బాగున్నా... కొన్నాళ్ళ తరువాత ఆ అబ్బాయికి కంటిచూపు పూర్తిగాపోయింది. ఈ లోపు చిమ్మన గారికి కూడా కళ్ళుశుక్లాలు ముదిరిపోయి కంటి చూపుపోయింది.అప్పటి దాకా భర్తను,పెంచుకున్న కొడుకును కంటికిరెప్పలా చూసుకున్న చిమ్మన నాగభూషణం భార్య ఓ రోజు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వైద్యులవద్ద టెస్ట్ చేయిస్తే ఆమెకు క్యాన్సర్ అని తేలింది.ఇక క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖామంత్రి సిఫారసు లేఖ ద్వారా క్యాన్సర్‌వ్యాధి చికిత్సకోసం ఓ మహానగరంలో పేరుగాంచిన ఆసుపత్రికి తరలిస్తే ఏ సిఫారసు

లేఖలు చెల్లవు అని ఆసుపత్రివర్గాలు చెబితే చేసేదిలేక ఆసుపత్రికి వెళ్లినవాళ్ళు వెళ్లినట్లే తిరిగి వచ్చారట.. అలాంటి పరిస్థితుల్లో ఆమె ఇంటివద్దనే అనారోగ్యాన్ని భరిస్తూకొన్నేళ్ల తరువాత కాలం చేశారు. ఇదంతా చిమ్మన కంటి చూపు బాగున్నప్పటి విషయం. ఇక ఆమెమరణం తరువాత కంటి చూపులేని తండ్రి కొడుకుల పరిస్థితి ప్రతీ విషయంలో చీకటి వీరితో దోబూచులాడింది.

పగవాడికి కూడా రాకూడదు అనుకునే కష్టాలు ఈ తండ్రీ కొడుకులను నీడలా వెంటాడాయి. ఓ రోజు మాకు సీనియర్ జర్నలిస్ట్ అయిన చెన్నా అజయ్ కుమార్‌తో కలసి నేను జర్నలిస్ట్‌గా చేరిన కొత్తలో చిమ్మన గారిని చూడడానికి వెళ్లాం.ఆ సమయంలో ఆయన రెండు కర్రలు రెండు చేతులతో పట్టుకుని కర్రలు రోడ్డు మీద తడుముకుంటూ ఎక్కడికో బయలుదేరాడు. ఆ పరిస్థితి చూసి అతనితో మాట్లాడాక సమాజం కోసం పాటుబడిన ఓ జర్నలిస్ట్ పరిస్థితి ఇలా ఉంటుందా...?అని పించింది నాకు.దీనితో ప్రతి జర్నలిస్ట్‌ని నిశితంగా పరిశీలించడం నాకు అలవాటుగా మారింది.

ఇక నాతోటి జర్నలిస్ట్‌లు చిమ్మన పరిస్థితులుపై ఎలక్ట్రానిక్ మీడియాలో స్పెషల్ స్టోరీ ఫైల్ చేయడం జరిగింది. ఆ స్టోరీ టెలికాస్ట్ అయ్యాక హైదరాబాద్ నుండి ఎవరో మంగళగిరి వచ్చి ఆయన జీవితకాలం ఆయనకు ఒక హోటల్లో ఉదయం టిఫిన్, టీ..., మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టిఫిన్ గానీ భోజనం గానీ అతనికి అవసరమైన ఆహారం అందించే ఏర్పాట్లు చేసి అతనికి అండగా నిలిచారు. ఇకపోతే ఈయన పెంచిన కుమారుడు ఏ ఆధారం లేక మంగళగిరిలో ఒకనాటి గ్రేట్ ఇండియా, ప్రస్తుత జామ్...జామ్.... హోటల్ వద్ద చూపులేకపోయినా ఉదయం నుండి రాత్రివరకు నిలువుకాళ్ళ మీద నిలుచుని చిల్లరనాణేల భిక్షాటన చేస్తూ ఉండేవాడు. ఆ మధ్య ఎవరినో తోడుగా పెట్టుకుని మంగళగిరి పట్టణ వీధుల్లో భిక్షాటన చేసేవాడు. ఇక ఇప్పుడైతే అతనిక లేడు అనారోగ్యంతో దిక్కులేని అనాధగా మరణించాడు. అలా మరణించిన చిమ్మన నాగభూషణం కుమారుడి అంత్యక్రియలు మంగళగిరికి చెఉందిన ఖిద్మత్ సేవాసంస్థ చేయడం జరిగింది. ఈ సేవా సంస్థను ఈ విషయంలో చాలామంది జర్నలిస్టులు, ఇతరులు అభినందిచారు. విలువలు కలిగిన జర్నలిస్ట్‌ల కట్టె మిగిల్చిన గాధలు ఇలా ఉంటే...ఈ పరిస్థితులకు అంతులేని కథలకు సమాధానం ఎక్కడ లభిస్తుంది.

ముఖ్యంగా మరో విషయం ఏమిటంటే... చిమ్మనకు ఆత్మాభిమానం ఎక్కువ. ఎక్కడ రూపాయి అవినీతికి పాల్పడిన చరిత్రలేదు. ఇతను కళ్ళ సమస్యతో భాధపడుతున్నాడని

తెలిసి ఎంతోమంది కళ్ళు ఆపరేషన్ చేయించేందుకు వస్తే సున్నితంగా తిరస్కరించి పంపేవాడు. అలాగే పార్టీకి పనిచేసి ఇబ్బందుల్లో ఉన్నవారి కోసం హైదరాబాద్‌లో ఉన్న సీఆర్ ఫౌండేషన్ ఆశ్రయం కల్పిస్తుంది. ఇతన్ని కూడా ఆ ఫౌండేషన్‌కి తరలించే ఏర్పాట్లు చేస్తే కళ్ళులేని కుమారుడిని ఒంటరిగా వదిలివెళ్ళలేక ఆ అవకాశాన్ని కూడా వదులుకున్నాడు. ఓ...రోజు తనకు కావలసిన ఆహారానికి ఎవరిని సాయం కోరని రోజుల్లో ఒకరోజు ఉదయం పూట రెండు ఇడ్లీల కోసం కొంత చిల్లర తీసుకుని ఓ హోటల్ దగ్గరకు వెళ్లిన చిమ్మన హోటల్ కౌంటర్‌లో ఉన్న వ్యక్తికి చిల్లరనాణేలు ఇచ్చి రెండు ఇడ్లీలు అడిగితే, కౌంటర్‌లో ఉన్న వ్యక్తి ఆ చిల్లర వెనక్కి విసురుగా నెట్టి రావు...పో...అని గద్దిస్తే.. చూపు కనిపించని కళ్ళతో తాను ఎంత ఇచ్చింది తెలియక, ఇంకా ఎంత ఇవ్వాల్సింది అడగకుండా ఒక్క మాటకూడా మాట్లాడకుండా వెనుదిరిగాడు. ఈ సంఘటనలో ఆయన వయసుకు గౌరవం ఇస్తూ ఆయన ఎవరో తెలిసి ఉన్న నా సోదరుడు పచ్చల కిరణ్ కళ్ళారా... చూసిన సంఘటనగా తెలిపారు. ఆయనకు అవసరమైన ఇడ్లీ ఆయనపై అభిమానంతో తాను ఇప్పిస్తే...ఆ రెండు ఇడ్లీల పార్సిలు తీసుకోవడానికి కూడా చిమ్మన నిరాకరించారని అంతటి ఆత్మాభిమానం.. నిజాయితీ గల వ్యక్తి చిమ్మన నాగభూషణం అని కిరణ్ అన్నారు. ఇక చిన్న పూరిల్లు, భార్య ఉన్న సమయంలో కట్టెల పొయ్యి, కుంకిలి నులకమంచం, చనిపోయేవరకు ఇంటికి కరెంట్ లేదు. చూసినవాళ్ళు అయ్యో పాపం అనడమే గానీ... తాను మాత్రం ఓ చిన్న చిరునవ్వే సమాధానంగా బ్రతికి మంగళగిరి మట్టిలో కలిసిపోయారు.

## చెన్నా అజయ్ కుమార్



నేను చెన్నా అజయ్ కుమార్‌ని నా తమ్ముడు అని అనడం వెనుక ఓ ఆత్మీయ అనుబంధం ఉంది. వాస్తవానికి చెన్నా అజయ్ కుమార్ నాకంటే పది సంవత్సరాలు పెద్దవాడు అయితే నేను జర్నలిజం ఫీల్డ్‌లోకి వచ్చేనాటికే అజయ్ కుమార్ నాకు పదేళ్లు సీనియర్ జర్నలిస్ట్‌గా ఉండేవాడు. మొదట్లో తమ్ముడు అజయ్ రెండు మూడు ప్రింట్ మీడియా పత్రికల్లో పనిచేసి ఉన్నాడు అయితే నేను ఫీల్డ్‌లోకి వెళ్లే నాటికి మీడియా రంగంలో కేబుల్ చానల్స్ అప్పుడప్పుడే వస్తున్నాయి అప్పటికే తమ్ముడు అజయ్ కుమార్ ఓ కేబుల్ టీవీలో రిపోర్టర్‌గా చేస్తున్నాడు మంగళగిరి కేబుల్ టీవీ మీడియా రంగంలో కేబుల్ టీవీ జర్నలిస్ట్‌లలో మొదటివాడు. మంగళగిరి పట్టణంలో సమస్య ఏదైనా కానీ ముందుగా సమాచారం అజయ్ కుమార్‌కి తెలిసేది.

ఈ క్రమంలో మంగళగిరి రత్నాల చెరువు, లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ, అలాగే రాజీవ్ గృహకల్ప, పక్కనే ఉన్న పావురాల కాలనీ, ఇలా పట్టణంలో ఏ కాలనీలోనైనా సరే సమస్యలను వెతికి పట్టుకొని వాటిని రికార్డ్ చేసి తన లోకల్ ఛానల్‌లో ప్రసారం చేసేవాడు. అతనే రిపోర్టర్, కెమెరామెన్, న్యూస్ రీడర్, స్క్రిప్ట్ రైటర్ అన్నీ తానై ఆ కేబుల్ ఛానల్‌కి చాలా సేవలు చేస్తూ కష్టపడేవాడు. పట్టణ ప్రజలకు సమస్యల పరిష్కార విషయంలో చేదోడు వాదోడుగా ఉంటూ లోకల్ ఛానల్ రిపోర్టర్‌గా పట్టణ ప్రజలకు బాగా దగ్గరయ్యాడు. నేను మీడియారంగంలోకి వెళ్లాక రెండు మూడు సంవత్సరాలకు లోకల్ ఛానల్ నుండి ఓ ప్రముఖ శాటిలైట్ ఛానల్‌కి జర్నలిస్టుగా నియామకం అయ్యాడు. ఈ నేపథ్యంలో నేను అజయ్‌బాబు ఇద్దరం పేరుగాంచిన శాటిలైట్ చానెల్స్‌లో జర్నలిస్టులుగా కొనసాగుతున్నాం. ఇక మా ఇద్దరికీ మధ్య పోటీ ఉండేది. ఈ క్రమంలో అజయ్‌బాబుకి న్యూస్ కవరేజీ విషయంలో ఎక్కడికైనా వెళ్లాలంటే బైక్ ఉండేది కాదు.

అయినప్పటికీ మంగళగిరి పట్టణం మొత్తం ఒక చేత్తో కెమెరా, మరో చేత్తో లోగో పట్టుకొని పట్టణంలో ఎంత దూరమైనా నడిచి వెళ్లేవాడు అక్కడ న్యూస్ కవరేజ్ చేసుకొని నన్ను అన్నాయి ఫలానా చోట ఉన్నా... ఇక్కడో ఇన్సిడెంట్ జరిగింది వచ్చెయ్, అని ఫోన్ చేసి పిలిచేవాడు ఇలా న్యూస్ కవరేజ్ విషయంలో ఎక్కడా రాజీ పడేవాడు కాదు. సమాచారం పంచుకునే విషయంలో తోడుగా ఉంటూ న్యూస్ కవరేజ్ విషయంలో అందరికంటే ముందుండాలని మంగళగిరి పట్టణం వరకు కాలినడకతోనే పరుగులు పెట్టేవాడు నియోజకవర్గంలో ఎక్కడైనా న్యూస్ కవరేజ్‌కి వెళ్లాల్సి వస్తే నాతోపాటు వచ్చేవాడు ఇలా చానల్స్ మధ్య పోటీ ఉన్న ఒక సమన్వయంతో పని చేసుకునే వాళ్ళం. ఈ క్రమంలోనే కొన్ని కొన్ని న్యూస్ కవరేజీ విషయాలలో నేనుకూడా తమ్ముడు అజయ్‌బాబుని కాదని వెళ్ళిపోయేవాడిని ముందుగానే న్యూస్ కవరేజ్ చేసుకొని తమ్ముడు అజయ్ దగ్గరికి వచ్చేవాడిని అలా వచ్చినప్పుడు నన్ను చూసి అన్నాయ్ వెళ్లొచ్చావా... కవరేజ్ అయిపోయిందా.... అని సరదాగా అనేవాడు. అట్లా అతని కంటే నేను కొన్ని కొన్ని న్యూస్ విషయాలలో ముందు ముందుగా ఉండేవాడినని నన్ను అన్నాయని అతను అంటే... నేను కూడా సరదాగా అతన్ని తమ్ముడు అని పిలిచేవాడిని అలా సరదాగా గడిచిపోయిన రోజులు ఇప్పుడు చాలా బాధాకరంగా ఉన్నాయి. వయసులో, జర్నలిజంలో, మాకంటే సీనియర్‌గా.... ఉన్న తమ్ముడు అజయ్ జర్నలిజంలో పెట్టిన పరుగులు ఏ విజయాలను సాధించలేకపోయాయి.

చివరికి ఒక కవి, రచయిత, సామాజిక భావాలు వామపక్ష భావజాలం చిన్న చిన్న నాటకాలు పలు రచనలు తప్ప జర్నలిజంలో ఉండి తన కుటుంబానికి ఉపయోగపడింది లేదు. ఇక అజయ్ మాటల మనిషి కాదు చేతల మనిషి అనే విధానాలను చేసి చూపించాడు. అజయ్ కుమార్‌కి నలుగురు ఆడపిల్లలు వారి చదువులు వారి ఎదుగుదల కుటుంబ పోషణ ఎవరిని ఏ పనికి పంపకుండా అందరిని చదివిస్తూ జర్నలిజంలో చాలీచాలని జీతాలతో ఎన్నో కష్టాలను అనుభవించి షుగరు, బీపీలతో అనారోగ్యం పాలయ్యారు. అలా ఉండి కూడా మా తరువాత వచ్చిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో కూడా అడుగడుగునా పోటీపడుతూ ఉండేవాడు. అందరూ సరదాగా...అరె ముసలోడా..పరుగెత్తు... పరుగెత్తు... అంటే సరదాగా అందరిని అరేయ్ ' 'తమ్ముడన్నాయిలు" ఇన్నాళ్ళుగా పరిగెత్తుతూనే ఉన్నా... ఇంకా ఎక్కడ పరిగెత్తను అని నవ్వుతూ మా వద్దకు చేరుకునేవాడు. చివరకు ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రిలో కిడ్నీలవ్యాధి డయాలసిస్ పేషెంట్‌గా ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం ఏం జరిగిందో నాకు తెలియదు ఎందుకంటే నా తమ్ముడు అజయ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్న సమయంలో నేను అతన్ని కలిశాను ఆ తర్వాత అనుకోని పరిస్థితుల్లో ఓ రోజు షడన్‌గా  బీపీ, షుగర్లు అదుపులోలేక నేను కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కి గురయ్యాను. వెంటనే నా కుటుంబీకులు నన్ను ఆసుపత్రికి తీసుకెళ్తే పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది అని డాక్టర్లు చెప్పారట అలాగే మూడు రోజులు గడిస్తే గాని ఇతని గూర్చి ఇతని ఆరోగ్య పరిస్థితి గురించి చెప్ప లేమని నో.. చాన్స్ అని డాక్టర్లు నా తోటి జర్నలిస్టులకు, నా కుటుంబానికి చెప్పడం జరిగింది.

ఇక అంతే నా పరిస్థితి అలా ఉంచితే పది రోజులు పై బడిన తర్వాత ఆసుపత్రి నుంచి నేను డిశ్చార్జ్ అయి వచ్చాక నా తమ్ముడు అజయ్ బాబు ఇకలేడని తెలుసుకొని నేను ఎంతో బాధ పడిపోయాను తమ్ముడు అజయ్ ఉన్ననాళ్ళు ఎంతో సరదాగా ఉండేవాళ్లం. ఒక చిన్న ఉదాహరణ అది 2009-10 అనుకుంటా...! జర్నలిస్టులుగా మేము ఎన్ని బాధలు పడే వాళ్ళము ఒకే ఒక ఉదాహరణ చెబుతాను. తమ్ముడు అజయ్‌బాబుని సీనియర్ జర్నలిస్టుగా గుర్తించి మంగళగిరి ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నాం. అయితే ఇదేమి పెద్ద పెద్ద రాజ్యాలను ఏలే పదవులు కాదు గదా... మా తృప్తి కోసం మా ఐక్యత కోసం మా సమస్యల పరిష్కారం కోసం ఆనాడు అసోసి యేషన్ ఏర్పాటు చేసుకోవడం

జరిగింది. ఈ క్రమంలో ఓ ఎండాకాలం మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉత్తర గాలిగోపురం పక్కన ఒక చిన్న రూము అసోసియేషన్ కార్యాలయంగా ఉండేది. ఇక మా జర్నలిస్టులు ఎక్కడ న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన ఎవరు ఎటువెళ్ళి వచ్చిన కాస్త అలసట తీర్చుకోవడానికి ఆ కార్యాలయానికి వచ్చే వారం తమ్ముడు అజయ్ బాబు ప్రెసిడెంట్ హోదాలో ఒక కుర్చీ... ఒక టేబుల్‌పై కూర్చొని ఏం తమ్ముడు, ఏం అన్నయ్య ఏమిటి సంగతులు అని ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ఉండేవాడు అయితే మేము సరదాగా ప్రెసిడెంట్ గారు అంటూ ఆట పట్టిస్తూ రెండు రూపాయల పెట్టి ఓ ఆర లీటరు కూలింగ్  వాటరు ఇప్పించమని డిమాండ్ చేసేవాళ్ళం పాపం మా తమ్ముడు అజయ్ బాబు ఏ జేబులో ఎంత వెతికినా రూపాయి దొరికేది కాదు. ఇక తాగేందుకు గుక్కెడు నీళ్లు ఇప్పించలేకపోయానని బాధపడేవాడు. అలాగే కాసేపు రూమ్‌లో పడుకోవడానికి చాపలేదని దీంతో  నీవేమి ప్రెసిడెంట్‌వి కనీసం ఒక మంచం వేయలేకపోయావు గదిలో అని సరదాగా ఆట పట్టించేవాళ్ళం చివరికి అన్నయ్యలు, తమ్ముళ్లు, నేను మీకు ఏమీ చేయలేకపోతున్నాను అంటూ  మాకు క్షమాపణలు చెబుతూ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రెసిడెంట్ పదవికి స్వతహాగా రాజీనామా చేశాడు...చూడండి మా జర్నలిస్టుల పరిస్థితి పేరు గొప్ప ఊరుదిబ్బ అన్నట్లు ఉంటాయి చివరకు అజయ్‌బాబు మరణించాక కుటుంబ పరిస్థితులు చాలా దీన పరిస్థితిలో ఉన్నాయి.

ఇది గమనించిన మా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిగారు నా తమ్ముడు అజయ్‌బాబు కుటుంబానికి అండగానిలిచారు. నలుగురు కుమార్తెలలో ఒక కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం పట్టణపరిధిలో ఆ కుటుంబానికి ఓ ఇంటి స్థలం కుటుంబ అవసరాల నిమిత్తం ఒక లక్ష రూపాయల నగదు ఇచ్చి ఆ కుటుంబానికి నేనున్నాను అనే భరోసా కల్పించారు. అదే మా ఎమ్మెల్యేగారు ఈ చొరవ తీసుకొని సాయం చేయకపోతే జర్నలిస్టుగా అజయ్‌బాబు ఏం కోల్పోయాడు అనేది అతని కుటుంబం చెప్పే విషయాల ద్వారా ఎన్నో కన్నీటిగాథలు ఈరోజు మనకు కనిపించేవి వినిపించేవి ఏది ఏమైనా నా తమ్ముడు అజయ్ బాబుని చివరిచూపు చూసుకోలేదు నేను. చూసుకోలేని పరిస్థితుల్లో  నేనుకూడా ఉండిపోయాను. ఇటువంటి పరిస్థితులు రావడం చూస్తే జర్నలిస్టుల పరిస్థితులు చెప్పుకోలేని కన్నీటిగాథలుగా మిగిలి పోతున్నాయి మా బాధలు ఎవరికైనాచెప్పుకుందాం అంటే ఇన్నాళ్లు ఒక హోదాలో బతికాం ఏంచెప్పాలి ఏమనిచెప్పుకోవాలి మా కన్నీటిగాథలు. ఈ గాథలు ఎదుటివారికి

చెబితే మా కన్నీళ్లు చూసి ఏమనుకుంటారోనని కంటనీరు కనబడనీయకుండా జర్నలిస్ట్ అనే హోదా ప్రదర్శిస్తూ కనురెప్పల మాటున కన్నీటిని అదిమిపట్టి జర్నలిస్ట్ అనే హోదా మాటున బ్రతికేస్తున్నాం..ఏం మా కన్నీళ్లకు విలువలేదా...? ఇటువంటి వారి గురించి తెలిసాక కూడా జర్నలిస్టులపై ఉన్న అభిప్రాయాలు కొద్దిగానైనా మార్చుకోవాలి ప్రజలు.

## కష్టాలలో ఉన్న పాత్రికేయులకు అండగా MLA, ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కె)



## వేజెండ్ల రాధ (సీనియర్ కెమెరామెన్)



గుంటూరు జిల్లా, మంగళగిరి టౌన్ పరిధిలో లోకల్ టీవీ ఛానల్కి కెమెరామెన్గా వేజండ్ల రాధా పనిచేయడం జరిగింది. మంగళగిరి మీడియా రంగంలో కెమెరామెన్గా రాధాకి అపారమైనటువంటి అనుభవం ఉంది. రాధాకి మీడియారంగంలో కెమెరామెన్గా సుమారు 25సంవత్సరాలు అనుభవం ఉన్నట్లు తెలుస్తోంది ఇక రాదా విషయానికి వస్తే ఇతను కూడా సామాజికభావాలతోపాటు సున్నిత మనస్కుడిగా, స్నేహశీలిగా ఉండేవాడు ఏ విషయంలోనైనా ఎవరినైనా ప్రశ్నించాల్సిన అవసరం వస్తే ఒకటికి నాలుగుసార్లు ఆలోచించి ఎదుటి వ్యక్తిని ప్రశ్నించేవాడు. రాధా అంటే ఓ అజాతశత్రువు. రాధా ఓ మీడియా కెమెరామెన్గా ఎంతో కమిట్మెంట్తో పనిచేసేవాడు. ఉదయం కోడి కూతకు ముందులేచి అర్ధరాత్రి అందరూ పడుకునే వరకు తాను పనిచేస్తున్న

ఆఫీసు కార్యాలయంలోనే ఉండేవాడు పట్టణ పరిధిలో ఏ న్యూస్ కవరేజీ ఉన్న సమాచారం తెలిస్తే చాలు నిమిషాల వ్యవధిలో న్యూస్ కవర్ చేయాల్సిన ప్రాంతానికి చేరుకునేవాడు. దాదాపు తన సమయాన్ని అంతా న్యూస్ కార్యాలయంలోనే గడిపిచివరకు మంగళగిరి పట్టణంలో ఓ వృద్ధాశ్రమంలో న్యూస్ కవరేజ్‌కి వెళ్ళిన రాధా తీవ్రజ్వరంలో ఉండి న్యూస్ కవరేజ్ చేస్తూ చేతిలో కెమెరా ఉండగానే కళ్ళు తిరిగి పడిపోయాడు. అప్పటికప్పుడు వృద్ధాశ్రమ నిర్వాహకులు రాధాని స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు మొదట ఏమయింది అనేది ఎవరికీ తెలియనిప్పటికీ తరువాత హై బీపీతో బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయినట్లు రిపోర్టులు ద్వారా డాక్టర్స్ రాధా కుటుంబసభ్యులకు తెలియజేశారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలియజేశారు. రాధా కుటుంబీకులు స్తోమత ఉన్నంతవరకు ఆసుపత్రుల్లో ట్రీట్మెంట్ చేయించి కాస్త పర్వాలేదు అనుకున్నాక ఇంటికి తీసుకువచ్చారు. రెండు మూడు రోజులు ఉన్న రాధ ఒకరోజు మంగళగిరి మీడియా మిత్రులను వదిలేసి స్థానిక మీడియాకు శాశ్వతంగా సెలవుతీసుకున్నాడు. అయితే రాధ తన జీవితకాలంలో మీడియాతోనే మీడియా మిత్రులతోనే కాలమంతా గడిపేసాడు చివరకు మిగిలింది ఏమిటంటే వెనతిరిగి చూసుకుంటే సాధించింది ఏమీలేదు. అంతా మాయ జీవితం అన్నట్లు రాధా కథ ముగిసింది. అలా వచ్చి...ఇలా వెళ్లి పోయాడు తప్ప మీడియానే తన జీవితం అన్నట్లు బ్రతికిన రాదాకి మీడియా మిగిల్చింది ఏమీ లేదు.

## అనుముల శ్రీకాంత్



మీడియాలో బహుముఖ ప్రజ్ఞాశాలి అనుముల శ్రీకాంత్ అంటే మంగళగిరి లోకల్ కేబుల్ చానల్స్ రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా శ్రీకాంత్ అని చెబుతారు శ్రీకాంత్ లోకల్ చానల్స్ విషయంలో అన్ని విదాల ఛానల్ యాజమాన్యాలకు ఉపయోగకరంగా ఉండేవాడు ఇతను మామూలుగా అయితే లోకల్ చానల్స్ టెక్నీషియన్‌గా, యాడ్స్ డిజైనర్‌గా, అవసరమైతే ఛానల్ కెమెరామెన్‌గా, ఇంకా అవసరమైతే న్యూస్ రీడర్‌గా, వాయిస్ ఓవర్ ఇస్తూ ఇలా లోకల్ ఛానల్‌కి అవసరమైనటువంటి అన్నివిధాల ఉపయోగపడేటువంటి ఏకైక వ్యక్తిగా మంగళగిరి వరకు గుర్తింపు సాధించాడు. విజయవాడ దూరదర్శన్‌లో వీడియో ఎడిటింగ్ చేశాడు. చివరకు అనారోగ్యంతో కాలం

చేయడం జరిగింది. శ్రీకాంత్‌కి ఇద్దరు కుమార్తెలు.తాను చనిపోయేనాటికి తన భార్యకు ఇద్దరు కుమార్తెలకు ఏ విధమైనటువంటి ఆధారం లేదు. శ్రీకాంత్ దూరమయ్యాక శ్రీకాంత్ పెద్దకూతురు తన తండ్రి లాగే ఓ చానల్లో పార్ట్ టైంగా జాబ్ చేస్తుంది. ఇప్పుడు శ్రీకాంత్ కుటుంబం మొత్తం కష్టపడి పనిచేస్తేనే ఆ కుటుంబం రోజు గడుస్తుంది ఇలా పనిచేసినన్నాళు ్ల ఆయా మీడియా సంస్థలకు సర్వశక్తులు ధారపోసి చివరకు కుటుంబాలకు ఏమి మిగిల్చుకోలేక ఇలా ఎంతోమంది జర్నలిస్టులు కుటుంబాలను త్యాగం చేస్తున్నారు ఈ త్యాగాలకు ఫలితం ఏ ప్రభుత్వాలు కల్పించడం లేదు.

**ఈ చాప్టర్లో చివరిగా ఒక మాట**

ఇక్కడ నేను రాసిన ఏ అంశాలు కూడా ఎవరిని తక్కువ చేయటానికి కించపరచటానికి మాత్రం రాయలేదు. కేవలం మా జర్నలిస్టుల సంకల్పం ఎలా ఉంటుందో తెలియజేయటానికి మాత్రమే ఈ అంశాలను ఈ కథనంలో పొందుపరచడం జరిగింది. చనిపోయిన వీరందరూ ఒక లక్ష్యంతో సమాజంలో మార్పుకోసం తన పాత్రను తాను నిర్వహించి వెళ్లిపోయారు అయితే వీరి సంకల్పం ఎలా ఉంటుందో రెండు ముక్కల్లో మీకు వివరిస్తాను. చనిపోయామని మా జర్నలిస్టులకు ఏ బాధ ఉండదు. కుటుంబాలను సైతం త్యాగం చేసినా ఏనాడు బాధపడేది లేదు. తన కుటుంబాన్ని సమాజంలో ఎదుర్కోవలసిన పరిస్థితులు అన్నింటికీ అవగాహన కల్పించి ధైర్యంగా జీవించాలి పోరాడి బతకాలి అనే సిద్ధాంతాలను తాను బ్రతికున్న కాలంలోనే రక్త సంబంధాలకు ధైర్యం చేకూరుస్తూ ఈ లోకం విడిచి వెళ్ళిపోతున్నారు. పోతూ పోతూ కూడా తన సంకల్పాన్ని తెలియజేస్తున్నారు ఎలాగంటే ఏ జాలి చూపులు...మాకు వద్దు, అలాగే ఏ జాలి.... మాటలు మాకు వద్దు, ఇంకా చెప్పాలి అంటే....ఏ జాలి పలకరింపులు మాకు వద్దు. మీకు అవకాశం ఉంటే మాలా విలువలతో పనిచేసి సమాజ సంస్కరణకు మా వంతు ప్రయత్నంగా పనిచేసి లోకం విడిచి వెళ్ళిన మాలాంటి జర్నలిస్టుల విషాదగాథలు తెలుసుకునే ప్రయత్నం చేయండి. జర్నలిస్టులు అంటే ఏమిటి తెలుసుకోగలిగితే చాలు అని ప్రాణాలు ఉన్నంత వరకు సమాజ

సంస్కరణే బాధ్యతగా ఉండి, సమాజం బాగుండాలి అని కోరుకుంటూ వెళ్ళినవారు జర్నలిస్టులు. కాకపోతే ఒక జర్నలిస్టుగా ఈ సమాజంలో మా కష్టాన్ని గుర్తించండి వీలుపడితే నేను నమ్మిన సిద్ధాంతాలను నలుగురిలోకి తీసుకెళ్లి నాకోసం.. నాలా కనీస ప్రయత్నం చేయమని అందరినీ కోరుతున్నాం అంటూ మా జర్నలిస్టులు తన సంకల్పాన్ని తెలియజేస్తున్నారు. ఇంకొక మాట ఏమిటంటే మా జర్నలిస్ట్‌లు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పడి లేచిన కెరటాలుగా...."ఈ క్షణమే మరణించినా.....మరుసటి రోజే.... ఈ సమాజంకోసం నా శరీరంలోని సల...సల....కాగే... ఉడుకు నెత్తురు కలంలో సిరాగా మార్చి పుట్టేస్తాం... రక్తాక్షరాలై ప్రజాక్షేత్రంలో అక్షర పోరాటం చేస్తాం. "అనేంత సంకల్పంతో మా జర్నలిస్ట్‌ల జీవితాలు క్రొవ్వొత్తులులా కరిగిపోతున్నాయి".

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

RAJA RATNAM TRUST
HOPE FOR ALL

# 20. సమాజాన్ని సంస్కరించడమే "జర్నలిజం-జర్నలిస్టుల" భాద్యత




"ఈ దోపిడీ సమాజం లో సగటు మనుషులకు సాటి మనుషులై తోడుండటం అనేది ప్రతి మనిషి ఓ లక్ష్యంగా ముందుకు నడవాలి.ఆ విధానానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం ముందుగా జర్నలిస్ట్ అనే వాడికి ఉండాలి.అలా ఉండగలిగిన జర్నలిజం- జర్నలిస్టులే ఫోర్త్ ఎస్టేట్ గా పిలువబడతారు. అందుకే సమాజాన్ని సంస్కరించడమే జర్నలిజం-జర్నలిస్టుల విధిగా చెప్పబడుతుంది"

ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిజం రూపుమారుతూ డిజిటల్ మీడియాగా ప్రజాక్షేత్రంలో దూసుకుపోతుంది. రానున్న రోజుల్లో డిజిటల్ మీడియాదే....! అగ్రభాగం అయ్యే అవకాశం మెండుగా ఉంది. మీడియా ఏ ఫ్లాట్‌ఫామ్‌లో ఉన్న జర్నలిజం–జర్నలిస్ట్‌లకు ఉండాల్సిన విలువలతో పనిచేస్తే ఆహ్వానించదగిన విషయమే...అయితే "పెరుగుట–విరుగుట" కొరకే అన్నట్లు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రూపంలో ఏ ఫ్లాట్‌ఫామ్ నుంచి ఏ రూపంలో మీడియా పురుడుపోసుకున్నా... అది మీడియాగానే పిలువబడుతుంది. అయితే మీడియా డిజిటల్ రూపుగా మారుతున్న క్రమంలో పెరుగుట–విరుగుట కొరకే అన్న విధంగా మీడియా తయారయ్యింది. ప్రతివాడి చూపు మీడియా మీదే...! ఇప్పుడు ప్రతివాడు మీడియానే... ఇక్కడ ఒక చిన్న విషయం మెయిన్ స్ట్రీమ్ మీడియా ఫ్లాట్‌ఫామ్‌పై జర్నలిజంలో విసిగివేసారిపోయిన ఎంతోమంది సీనియర్ జర్నలిస్ట్‌లు సొంత మీడియాని ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్నారు. అలాగే అక్షర జ్ఞానం లేనివారు, కొంతమంది అవినీతి– అక్రమార్కులు కూడా ఈ డిజిటల్ మీడియా పేరిట సొంతగా ఛానల్స్, పేపర్స్, న్యూస్ వెబ్సైట్స్ పలురకాలుగా డిజిటల్ మీడియాలోకి ప్రవేశించి తమఅవినీతి–అక్రమ వ్యవహారాలకు వారు స్వతహాగా తయారు చేసుకున్న ఐడీకార్డులు అడ్డంపెట్టి జర్నలిజంలో అక్రమంగా చొరబడుతున్నారు. మీడియా ఏ రూపంలో ఉన్నా అనుమతులు ఉంటాయి. అలా అనుమతులు ఉన్న ఏ మీడియా గురించి ఇక్కడ చెప్పడం లేదనేది గ్రహించాలి.

మీడియారంగంలో పలురకాల ఫ్లాట్‌ఫామ్స్ ద్వారా కొత్త కొత్త పేపర్లు, సరి క్రొత్త న్యూస్‌ఛానల్స్ డిజిటల్ మీడియా వంటివి రావడం తప్పుకాదు... కనీసం "జర్నలిజం – జర్న లిస్ట్" అంటే ఏమిటో... అర్ధం తెలియనివారు పలు పత్రికలకు స్టేట్ బ్యూరోలట...! కొన్ని టీవీ ఛానల్స్‌కి, సీ.ఈ.ఓ....స్టాఫ్ రిపోర్టర్స్ అంట...! రీజనల్ కో–ఆర్డినెటర్స్ అంట...! ఇప్పుడు మీడియా అంటే వీరే..! ఎందుకో తెలుసా తెలుగు రాష్ట్రాలలో అడ్డు–అదుపులేకుండా అక్రమ వ్యవహారాలు అన్నీ చేస్తుంది ఈ ప్రత్యేక హోదా సృష్టించుకున్న కొన్ని శక్తులు అని చెప్పాల్సిన అవసరం లేదు. జర్నలిజం ప్రస్తుతం మసకబారిపోయింది. విలువలు కలిగిన జర్నలిజం ప్రస్తుతం ఈ సమాజంలో పెద్దగా లేదు. ఇక్కడ జర్నలిజం తప్పు అని చెప్పడం లేదు. కానీ ఈరోజు జర్నలిజంలో విలువలు సమాధి కాబడ్డాయి. విలువలు కలిగిన జర్నలిస్ట్‌ల మనుగడ ప్రశ్నార్ధకంగా మారింది. జర్నలిజం అమ్మకం–కొనుగోలు విధానంలో బజారు సరుకుగా మార్చేశాయి కొన్ని అవినీతి శక్తులు. జర్నలిజంలో దశాబ్దాల అనుభవం ఉన్నవారు, ఎంతోమంది సీనియర్స్ జర్నలిజంలో ప్రత్యేక గుర్తింపు సాధించినా... అటువంటి వారందరూ నేడు జర్నలిజానికి ఏమీ కాలేకపోయామే అనే మనోవేదనలో కొందరు జర్నలిస్ట్‌లు ఉన్నారు. అలాగే జర్నలిజంలో మాస్టర్ డిగ్రీ..., డాక్టరేట్..., ఉన్నవాళ్ళు మాత్రం స్ట్రింగర్స్‌గా, గ్రామీణ విలేకరులుగా తొక్కివేయబడుతూ, శ్రమదోపిడీకి గురవుతుంటే... కొన్ని అజ్ఞానపుశక్తులు.., స్టేట్ బ్యూరో, రీజనల్ కో–ఆర్డి నేటర్, స్టాఫ్ రిపోర్టర్స్‌అని చెప్పుకోవడానికే... తప్పు.., కొంతమంది చెప్పుకుంటున్న ఈ హోదాలు జర్నలిజానికి తూట్లు పొడవడానికి తప్ప సత్తుపైసాకి పనికిరావడం లేదు. ఇలాంటి హోదాలు చెప్పుకునేవారు ముందు జర్నలిస్ట్‌గా వారికున్న అర్హతలు చెప్పాలి. ఈ మధ్య ఏ ప్రాంతంలో ఎవరిని కదిలించినా ఆ...పత్రిక, ఈ....ఛానల్, స్టేట్, జిల్లా, రీజనల్ కో–ఆర్డి నెటర్స్ అంటూ ఏ విధమైన అర్హతలు లేని ప్రతివాడు జర్నలిజంలో

రాష్ట్ర, జిల్లాస్థాయి హోదాలు చెప్పుకుంటూ ప్రభుత్వ సంస్థలు ముందు హోదాల పరంపర కొనసాగిస్తున్నారు. ఇదే ప్రభుత్వ అధికారులకు ఐడీ కార్డ్స్, లోగోలు చూపి, హోదాలు చెప్పి మీడియా ముసుగులో అక్రమ వ్యహారాలు కొనసాగిస్తున్నారు కొందరు. ఇలాంటి వ్యవహారాలను సంబంధితశాఖలు నిర్మూలించాలి.

డిజిటల్ మీడియాలో జర్నలిస్ట్‌లు రాసే కథనాలు, విజువల్స్ వంటి విషయంలో కొన్ని కఠినమైన నిబంధనలు ఉన్నప్పుడు ఇవే అంశాలు మెయిన్ స్ట్రీమ్ మీడియాకి కూడా అమలు చేస్తే మంచిదని కొంతమంది సీనియర్ జర్నలిస్ట్‌ల అభిప్రాయం. ఏ ఫ్లాట్‌ఫామ్ పైనైనా మీడియాని స్థాపించాలి అంటే... మీడియాని స్థాపించే వ్యక్తికి కనీసం 5 ఏళ్లయినా జర్నలిస్ట్‌గా అనుభవం ఉండాలి. అలాగే కనీసం డిగ్రీ విద్యార్హతగా నిర్ణయించాలి. జర్నలిజంలో కనీస డిప్లమో...ఇంకా మాస్టర్ డిగ్రీ వంటి అర్హతలుగా నియమించాలి. లేదా సమాజం పట్ల సామాజిక స్పృహ, భాద్యత, భద్రత కల్పిస్తూ సమాజానికి సేవలు అందించే ఏ సంఘానికైనా, వాటి నిర్వాహకుల పేరున లైసెన్స్, రిజిస్ట్రేషన్ కల్పించే దిశగా ఆలోచన చేసి జర్నలిజంలోకి వచ్చే స్క్రాప్ మొత్తాన్ని ఏరి వేయాలి. లేదంటే ఇప్పటికే ప్రమాదపు అంచుల్లో ఉన్న జర్నలిజం నడివీధిలో నగ్నంగా నిలుచోని...సిగ్గు కాపాడుకునే ప్రయత్నంలో ఉంటే...జర్నలిజం సిగ్గు తీసింది కాక ఆ జర్నలిజం సిగ్గు తీసిన శక్తులే... జర్నలిజాన్ని బజారు సరుకుగా మార్చేశారు. ప్రతీ ప్రాంతంలో జర్నలిజం విలువలు కాపాడలేని కొన్నిశక్తుల ద్వారా నడి వీధిలో నగ్నంగా నిలుచోబెట్టబడి హత్యకు గురికాబడుతున్న పరిస్థితులు నుండి తనను కాపాడమని జర్నలిజం మౌనంగారోధిస్తుంది. విలువలు కలిగిన జర్నలిస్ట్‌లుగా జర్నలిజం విలువలు కాపాడే ప్రయత్నం చేయాలనే ఆశయంతో... మనం ఆలోచన చేయాలి. జర్నలిజం విలువలు పోయాయి. చాలావరకు ఇప్పుడు జర్నలిస్టులను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు.

చివరిగా ఒక విషయం గ్రహించాలి. ఇప్పటికే ఈ సమాజంలో జర్నలిస్టులను చాలామంది ప్రజలు హేయమైన భావనతో చూస్తున్నారు. మన జర్నలిస్టులు ఇకపై విలువలు కాపాడుకోలేకపోతే జర్నలిజం కూడా ఒక దోపిడీ వ్యవస్థగా పరిగణించబడుతుంది. ఇప్పటికే ఈ రంగం ఎన్నో విధాలుగా దోపిడీ వ్యవస్థగా చెప్పబడుతుంది. గతమెంతో ఘనకీర్తి కలిగిన జర్నలిజం ఇప్పుడు ఆ ఘనత కోల్పోయింది. ఇకముందు జర్నలిజం – జర్నలిస్టులు ప్రజా వ్యతిరేక విధానాలకు, సమాజ సంస్కరణకు కృషి చేయకుండా ఇలాగే స్వప్రయోజనాలకు పాల్పడితే సరికాదు. ఎందుకంటే ఇప్పటికే ఈ సమాజంలో జర్నలిజం పేరిట కొందరు చేసే అవినీతి అక్రమాలకు అడ్డూ – అదుపూ లేకుండా పోయింది. అలాగే కొందరు జర్నలిస్టుల భారినపడి మోసపోయాం అని మూగ రోదన చేసే భాదితులు ఉన్నారు. జర్నలిజం–జర్నలిస్టులు అంటే ఇప్పటికి కొంతమేరకు విలువలు ఉన్నాయి అంటే నేటికి కొందరు జర్నలిస్టులు విలువలతో ఉన్నారు కాబట్టి జర్నలిజం అనే దానికి గౌరవస్థానం ఉంది. ఈ గౌరవస్థానం కాపాడుకోవాల్సిన భాద్యత విలువలు కలిగిన ప్రతి జర్నలిస్ట్‌పై ఉంది.

# సంభందిత గ్రంథ పట్టిక


## నక్కీరన్ గోపాల్

1. లీగల్ (6 జూన్ 2002), కరస్పాండెంట్ "నక్కీరన్" గోపాల్‌ని స్వ్యాష్ సమన్లకు తరలించాడు"
2. 'రాబిన్ హుడ్'గా వీరప్పన్ ది హిందూ నక్కీరన్ గోపాల్ 20 డిసెంబర్ 2003న చెన్నైలోని సెంట్రల్ జైలు, నంబత్, సురేష్ (19 అక్టోబర్ 2004).
3. "నక్కీరన్ గోపాల్ కేసులో ఛార్జ్ షీట్ సమర్పించబడింది" ది హిందూ, 04, మూలం నుండి 4 సెప్టెంబర్ 2012 న ఆర్కైవు చేసారు. కరస్పాండెంట్, స్పెషల్ (20 సెప్టెంబర్ 2005).
4. "జైలు నుండి విడుదలైన గోపాల్", India.com, 20 డిసెంబర్ 2003.

## పింగళి దశరథరామ్ – రచనలు

ఇతను తన పత్రిక నడపటమే కాక కొన్ని రచనలు కూడా చేసినట్టు తెలుస్తుంది. అతని రచనలో కొన్ని :

1. కమ్యూనిస్టు దేశాల్లో మతమౌఢ్యం –1982
2. మతం + మనిషి = అజ్ఞాని –1982
3. విషసంస్కృతిలో స్త్రీ –1982
4. ముమ్మిడివరం బాలయోగి బండారం –1983
5. స్వేచ్ఛ అంటే ఏమిటి?–1983
6. బాబాలు–అమ్మలు –1983
7. దేశ విద్రోహక ఆరెస్సెస్
8. కృష్ణా–క్రీస్తు ఒకడేనా?

## కలేకూరి ప్రసాద్ రచనలు

1. "రచయిత, గాయకుడు కలేకూరి ప్రసాద్ ఆకస్మిక మృతి". అర్చివేడ్ ఫ్రమ్ ది ఒరిజినల్ ఆన్ 2016–12–02.
2. "ది పాషన్ ఆఫ్ కలేకూరి ప్రసాద్ (దళిత్ కెమెరా వీడియోల సమీక్ష)". patrika.kinige.com. అర్చివేడ్ ఫ్రమ్ ది ఒరిజినల్ ఆన్ 2 ఆగస్టు 2016.

3. "రచయిత, గాయకుడు కలేకూరి ప్రసాద్ ఆకస్మిక మృతి", అర్చివేడ్ ఫ్రమ్ ది ఒరిజినల్ ఆన్ 2 డిసెంబరు 2016. సాక్షి.
4. "ఎగిరే ధిక్కార పతాకం" దళిత కవి, కలేకూరి 61వ జయంతి.
5. కలేకూరు ప్రసాద్ & షార్ట్ బయోగ్రఫీ ఆఫ్ కలేకూరి ప్రసాద్, ఎ పొయెట్, రైటర్, యూట్యూబ్‌లో, ఆయన స్వీయ చరిత్ర.
6. కలేకూరు ప్రసాద్ 'ది వాయిస్ ఆఫ్ ఎ రెబల్' – అక్షరం 10 టివి
7. ప్రవహించే సాహితీ ప్రవాహం దళితధిక్కార పతాక కలేకూరి ప్రసాద్
8. దళిత దిక్కార కవి కలేకూరి ప్రసాద్ – గిన్నారపు ఆదినారాయణ పరిశోధక విద్యార్థి
9. అవిశ్రాంత అక్షర యోధుడు కలేకూరి
10. కలేకూరి పాటలు ప్రజల గుండెలు తాకాయి
11. కలేకూరు ప్రసాద్ తెలుగు రచయిత. ఆర్గ్‌లో

**తెహల్కా డాట్ కామ్**

1. ఇయాన్ బురుమా (16 జనవరి 2002), "కథలో రహస్య కెమెరాలు, విస్కీ పార్టీలు మరియు వేశ్యలు ఉన్నాయి: భారతదేశంలో పరిశోధనాత్మక జర్నలిజం ఉత్తమంగా ఉంది", ది గార్డియన్, 13 జూన్ 2014 న ఆర్కైవు చేసారు, 23 నవంబర్ 2013.
2. భారతదేశం ఆయుధాల లంచాలు 'ప్రమేయం ఉన్న సెక్స్'. BBC, 22 ఆగస్టు 2001, 3 జనవరి 2015.
3. కౌర్, నౌనిధి (సెప్టెంబర్ 2001), "ముగింపు మరియు సాధనాలు", ఫ్రంట్‌లైన్, 18 (18). 3 జనవరి 2015.
4. "మహిళా సిబ్బందిని వేశ్యలుగా ఉపయోగించడాన్ని తెహల్కా ఖండించింది'', ఇండియన్ ఎక్స్‌ప్రెస్, 25 ఆగస్టు 2001, 3 జనవరి 2015.
5. "ఆపరేషన్ వెస్ట్ ఎండ్", ది హిందూ, 20 మార్చి 2001, 21 సెప్టెంబర్ 2013 న ఆర్కైవు చేసారు, 18 ఏప్రిల్ 2013.
6. తరుణ్ తేజ్‌పాల్: ది మ్యాన్ ఇన్ ది మిర్రర్ , కోర్డెలియా జెంకిన్స్, విధి చౌదరి, షుచి బన్సల్, మింట్ (2 డిసెంబర్ 2013).



**వెలగపూడి సచివాలయంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల కోసం**

**ఆనాటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు గారితో....**



**జర్నలిస్టులపై దాడికి నిరసనగా.... మంగళగిరి జర్నలిస్టులు**



**రాజమండ్రి & అమరావతిలో జర్నలిస్టులపై దాడికి నిరసనగా....**

**మంగళగిరి జర్నలిస్టులు**



**రాజా ది గ్రేట్ మూవీ సక్సెస్ మీట్‌లో....**



అప్పటి గవర్నర్ ఇ.యస్.యల్. నరిసింహన్ గారితో ....
రచయిత ఈపూరి రాజారత్నం





ఆచార్య నాగార్జున యూనివర్సిటి స్పోర్ట్స్ మీట్‌లో పి.టి. ఉషతో....



మంగళగిరి ఐ.బి.యన్. ప్రెస్‌క్లబ్ ద్వితీయ వార్షికోత్సవ సందర్భముగా
సీనియర్ జర్నలిస్టుగా ఈపూరి రాజారత్నంకు సత్కారం.



మంగళగిరి జర్నలిస్టు అసోసియేషన్ ఏర్పడిన సందర్భముగా స్థానిక జర్నలిస్టులు



సమైక్య ఆంధ్ర ఉద్యమంలో భాగంగా గుంటూరు కలెక్టరేట్ ఎదురు తోటి జర్నలిస్టు మిత్రులతో నిరసన కార్యక్రమంలో....



అమరావతిలో విలువైన పంట భూములను సేకరించ వద్దు అంటూ సి.పి.యం. నాయకులు చేస్తున్న ఉద్యమాన్ని న్యూస్ కవర్ చేస్తున్న వేళ జర్నలిస్టు రాజారత్నం అరెస్టు. పెదకాకాని పోలీస్ స్టేషన్‌కి తరలింపు....



మాజీ డిజిపి గౌతమ్‌సవాంగ్ గారితో మంగళగిరి జర్నలిస్టులు



మంగళగిరి జర్నలిస్టులుగా స్థానిక యం.ఆర్.వో గారికి ఇళ్ళ స్థలాల కోసం వినతి పత్రం అందిస్తూ....



వెలగపూడి సచివాలయం ప్రారంభం అయ్యాక నాటి
సి.యం. నారా చంద్రబాబునాయుడు గారితో మొట్టమొదటి ప్రెస్‌మీట్ సందర్భముగా....



మాజీ క్రికెటర్ వి.వి.యస్. లక్ష్మణ్‌తో....



ఏ.పీ. సచివాలయంలో నారా లోకేష్‌తో మంగళగిరి జర్నలిస్టులు




సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మతో ....




జననం : 1919 మేజర్ ఈపూరి రాజారత్నం గారు
(1941-45) 2వ ప్రపంచ యుద్ధయోధుడు
మరణం : 28-02-1958 S.FOX.2 INFANTRY Rd. BANGALORE

కీ॥శే॥ ఈపూరి కనికరం గారు
మరణం : 04-03-1986





కీ॥శే॥ ఈపూరి ఫిలేమోన్(జార్జి)గారు
జననం 01-07-1939 రిటైర్డ్ సబ్-పోస్ట్ మాస్టర్ మరణం 29-07-2023

కీ॥శే॥ ఈపూరి సరోజినిదేవి గారు
(డాబా వజ్రం) మరణం 01-08-2018



ఉత్తమ జర్నలిస్ట్‌గా "తెలుగు జర్నలిస్ట్‌ల సంక్షేమ సంఘం" వారి సత్కారం అనంతరం ఈపూరి రాజారత్నం ఫ్యామిలీ (2023లో).



రచయిత ప్రొఫైల్ :

## ఈపూరి రాజారత్నం

M.A., (Ph.D.) in Journalism

తల్లిదండ్రులు : ఈపూరి ఫిలేమోన్ (సబ్ -పోస్టుమాస్టర్)

సరోజిని దేవి

కుటుంబం : భార్య అనూరాధ

కుమారులు రత్నశేఖర్, రాజశేఖర్

వృత్తి : ఫ్రీలాన్స్ జర్నలిస్టు, తెలుగు కంటెంట్ రైటర్

అనుభవాలు : ఫోటోగ్రఫీలో 8 సం॥రాలు.

జర్నలిజంలో 18 సం॥రాలుగా .....

అభిరుచులు : ఫోటోగ్రఫీ, సాహిత్య రచన మరియు ఆకళింపు

అవార్డులు : పద్మశ్రీ ఐ.వి సుబ్బారావు రైతునేస్తం అవార్డు.

ఉత్తమ జర్నలిస్టుగా ఉగాది పురస్కారం.

అంతర్జాతీయ సంస్థ డాన్‌బోస్కో సేవా అవార్డు.

ఐ.బి.యన్. భవన్ ప్రెస్‌క్లబ్ సత్కారం.

మంగళగిరి పుర ప్రముఖుల సత్కారం.

